# చిన్నరావూరులోని గయ్యాళులు



కన్నడ నుండి తెలుగుకు

మూలం - దివంగత పూర్ణచంద్ర తేజస్వి

తెలుగులోకి - శాఖమూరు రామగోపాల్

# చినరావురులోని గయ్యాళులు

మూలం

## దివంగత పూర్ణచంద్ర తేజస్వి



# విషయ సూచి


1. చినరావూరులోని గయ్యాళులు ........................................ 001
2. ముసల్ది చెప్పిన సర్:ఎం.వి.గారి కథ –
సర్:ఎం.వి.గారే చెప్పిన ముసల్దాని కథ ................................ 072
3. అమీన్‌పూర్ సంత ........................................................ 089
4. పాపం కల్యాణి ........................................................... 102
5. 'ప్రయత్నం' ................................................................ 114
6. కాగోడుకు బస్సు వచ్చింది ................................................. 123
7. గాంధిపురంలోని మోడల్ పాఠశాల ....................................... 132
8. ఒక చిన్న దొంగల వృత్తం (సర్కిల్) ........................................ 142
9. సమీపంలోని దేవాలయం .................................................. 150
10. నమస్తే భారత్ గ్యాస్ ..................................................... 160
11. వేలం ...................................................................... 169
12. కమ్మరి వీరభద్రాచారి జ్యోతిష్కుడిగా మారిన తదుపరి ................. 178
13. టప...టప...టప ............................................................ 190
14. డ్రామా ట్రూఫ్ లోని యువతి ................................................ 197
15. కడుపుకు చిచ్చు పెట్టిన కుమారుడు ....................................... 205
16. ముక్కంటి ................................................................. 211
17. దోషిని కాదులే నేను ..................................................... 217

# చినరావూరు లోని గయ్యాళులు

## 1



చినరావూరు మీద మూడు రాత్రులు, మూడు పగళ్ళు అప్పటికప్పుడే వీసిన సుడిగాలి దశ నుంచే ఈ కథంతా ప్రారంభమయ్యింది. ప్రతిసారి వానాకాలంలో ఒకసారైనా 'భర్రో' అంటూ గాలివచ్చేది వాడికే. అయితే, ఈ సారి గాలి మాత్రం అలాగున లేదు.

'నేను పుట్టినప్పటినుంచి ఇటువంటి గాలిని చూడనేలేదు. ఎంతెంతో గాలిని వానల్నిచూసాను. ఇటువంటి గాలిని చూసింది మాత్రం గుర్తేలేదు' అంటూ వయోవృద్ధుడైన కాళేగౌడ గారి తండ్రి అన్నాడు అలాగున.

వాన వచ్చేది ఉంటే ఆ గాలితోనే జతగా ఉండేది. అయితే గాలి మాత్రం దశావతారాల్ని చూపెడుతుంది. బహుశః గాలినుంచే కావొచ్చేమో... వానను కురిపించాల్సిన మేఘాలన్నీ సరిగా వానను కురిపించకనే నలుదిక్కులా చెల్లా చెదురైపోయినవి.

# 2 * చినరావూరులోని గయ్యాళులు

వరిమడులలో 'చినరావూరు'లోని మహిళలు నడుములను వంచి కలుపును తీస్తుండగా మెల్లగా మలయమారుతంలాగ ప్రారంభమైన ఆ గాలి ఒక గంటలోనే విశ్వరూపాన్ని పొంది చుట్టుప్రక్కల వ్యాపించుకొన్న పర్వతాల మీదున్న అడవినంతా కాళ్ళకు గజ్జెల్ని కట్టుకొని నర్తింపజేసినట్లుగా సుడులు సుడులుగా వీయసాగింది.

సహ్యాద్రి పర్వతాలలోని జటిల బంధనంలో బంధీగా చిక్కుకుపోయిన ఊరు 'చినరావూరు'. అదేమి పేట (పట్టణం) నుంచి ఎంతో దూరాన లేకున్నా, అక్కడికి వెళ్ళినోళ్ళకు మానసికంగా ఏదో దేశాంతరంకు వెళ్ళినట్లుగా అనుభవం అవుతుండేది. చినరావూరు, తగ్గినగద్దె, ఊరళ్ళి, మల్లినమడుగు, సంగాపూర్ మొదలైన ఐదారు పల్లెలలోని భౌగోళిక ప్రత్యేకత మూలాన, అక్కడుండే జనంలోని రూపం, ఆకారం, నడత, నుడికారం... వాళ్ళను మిగిలిన ప్రాంతాలోళ్ళనుంచి ప్రత్యేకంగా చేసినవి. కాంధహార్ (ఆఫ్ఘనిస్థాన్)లోని పఠాణులకు ఉన్నట్లుగా బారు ముక్కు (కోటేరు లాంటి ముక్కు), గోధుమ రంగు చర్మంతో భారీకాయంతో ఉండేటి ఈ ఐదారు ఊళ్ళలోని జనాల్ని ఏ సంతలోనైనా చూస్తే వారు చినరావూరు వాళ్ళో, సంగాపూరు వాళ్ళో, మల్లినమడుగు వాళ్ళోనని సులభంగానే గుర్తించొచ్చు. అక్కడి పురుషులు సారాయి, తంబాకులకు దాసులై ఎముకలెండియున్నా, మహిళలు మాత్రం ఏ దురలవాట్లకు బలి అవకుండా ఎంతో దేహ సౌష్టవం, సౌందర్యంతో అలరారుతూ వాళ్ళను చూసినోళ్ళు తత్తరపోయేవారు. అంత సౌందర్యంగా ఉండే ఆ మహిళలతో అనైతిక సౌఖ్యానికి ఎవరూ వెళ్ళేది లేదు. ఎందుకంటే ఆ ఊళ్ళలోని మగోళ్ళు ఎంతగా సౌమ్యులో, ఆ స్త్రీలు మాత్రం గడుగ్గాయిలే. ఆ మహిళలందరికీ తమ దేహ సౌష్టవంలోని సౌందర్యం నుంచి చెప్పలేనంతగా జంభం, అహంకారం ఉంటుండేవి వాళ్ళలో. అమరశిల్పి జక్కణాచారి చెక్కిన శిల్పాలులాగా వాళ్ళ రూపురేఖలు ఉంటుండేవి. ఆ ఐదారు ఊళ్ళలోని భిల్లవులు, దళితులు, కాపులు (ఒక్కళిగులు)... అందరూ రూపాలలోగాని, నడివడికెలలోగాని ఒకే తరహాగా ఉంటుండే వారు. ఆ ఊళ్ళలోని మహిళలను చూసిన పరాయోళ్ళు 'అందని ద్రాక్షపళ్ళు పుల్లన' అన్నట్లుగా 'మగరాయుడు ముండలు' అని వాళ్ళను చూస్తూ గొణుక్కొంటుండేవారు.

వరి మడులలో తడవకుండా ఉండేందుకు తమ తమ చీర అంచుల్ని తొడల పై భాగంకే లాక్కొని, అరటి బోదెలలాగ ఉన్న కాళ్ళను నీళ్ళలో నిలిపి కలుపు తీస్తున్న ఆ మహిళలు గాలి ఇక ఆగిపోవచ్చునో, కొంచం సేపైన మీదట ఆగిపోవచ్చేమోనని భావిస్తూ ఎలాగోలా తమ పనులను చేయసాగారు. అయితే, గాలి నిమిషానికొక దిక్కుకు అన్నట్లుగా

అడ్డదిడ్డంగా వీస్తూ పైకెత్తి కట్టుకొన్న వాళ్ళ చీరల్ని (గొడుగును ఉల్టాగా విప్పినట్లుగా) ఎత్తటాన్ని ఆరంభించినప్పుడు నడుము వంచి కలుపుల్ని తీస్తున్న వాళ్ళకు ఒక సంకటాన్ని కల్గించింది. అక్కడున్నోళ్ళంతా మహిళలే అయినందున, వాళ్ళ మాన మర్యాదలకేమీ అదెంతగానో భయపడాల్సింది లేదు. అయినా ఒకామె చీర పైకి లేచినప్పుడు వెనుక వరుసలో నిల్చినామె కిసుక్కునే నవ్వింది. ముందువరుసలో నిల్చినామెకు అందుచేత కోపం వచ్చింది. ఏమి చేస్తారు! అంతా గాలి మహిమేకదా!

'అదేమి చూసావే... పళ్ళను ఇకిలించావు? అందరికీ ఉండేదే నాకూ ఉంది' అంటూ చీరను సరిచేసుకొంటూ ముందు వరుసలో ఉన్న మహిళ రేగిపోయింది.

"మనందరమూ ఒకే వరుసలో నిల్చి కలుపు తీద్దాం... గాలికెందుకో మన చీరల మీద కోపం వచ్చినట్లుంది" అంటూ ఆ గుంపులోని పెద్దామె మర్యాదను నిలుపుకొనేందుకని ఉపాయంతో చెపుతుంటే మొదటగా నవ్విన యౌవ్వనవతి నవ్వును ఆపుకోలేక "అందరికీ ఉన్నట్లే ఉండుంటే నేనెందుకు నవ్వేదాన్ని" అంటూ కెలికింది.

ముందు వరుసలో నిల్చినామెకు ఆ మాటల మూలాన కోపం వచ్చి చేతిలో ఉన్న కలుపు మొక్కల కట్టను వెనకనే నిల్చినామె ముఖానికి 'రఫ్' మని విసిరి 'తీయవే... చూస్తాను; నీదే తరహాలో ఉందో' అంటూ నవ్వినామె నడుముకు చేతిని వేసి లాగసాగింది. ఒకరి తిట్లు మరొకరికి విన్పించనట్లుగా గాలి వీస్తుంది. ఉచ్చరించిన రమ్య పదాలు (బూతు మాటలు) ఎదురులో ఉన్నోళ్ళ చెవులకు తలుపకనే ఎండుటాకుల లాగ గాలిలో కొట్టుకుపోతున్నవి. వారిరువురి మధ్యన మిగిలిన మహిళలంతా నిలబడి వాళ్ళిద్దరి జగడాన్ని ఆపారు. అయినా ఆ ఇద్దరు మహిళలు తమ ఒక్కొక్కరి జననేంద్రియాల మీద ఎంతో మార్మికంగా తిట్టుకోసాగినందున మరలా కలుపు తీసే పనిలో మనస్సు నిమగ్నంగాక అందరూ వరి మడి నుంచి లేచి గట్టుమీద నిలిచి "గాలి ఆగిన మీదటే మరలా కలుపుతీత' అంటూ తీర్మానించుకొన్నారు.

## 2

గాలి రభసానికి ఊగి ఊగి వాలిపోయిన చెట్లు, వృక్షాలన్నీ సాష్టాంగ నమస్కారాల్ని పెట్టునట్లుగా నేలకు ముట్టి పైకి లెగుస్తున్నవి. అయితే ఈ సర్కస్‌ను ఎంత టైమ్ వరకూ చేయగలవు ఆ వృక్షాలు? అదీ గాలి ఒకే దిక్కులో వీస్తుంటే ఎలాగోలా వంగిలేస్తూ

నిభాయించుకొనేవో ఏమో! అయితే గాలి సుడులు సుడులుగా నాలుగు దిక్కులకూ వీస్తూ ఆ చెట్లను అటుఇటు వాల్చి బట్టల్ని పిండినట్లుగా త్రిప్పుతుంది మెలికలు మెలికలుగా. అందుచేత ఆ రోజు గడిచేటప్పటికి లటలట అంటూ కొమ్మల్ని విరిగించుకొని అనేక వృక్షాలు నేలకొరిగినవి. గాలిలో ఊగిఊగి ఆకులన్నీ పోగొట్టుకొని, శిరస్సు భాగంలో ఉన్న కొమ్మరెమ్మల్ని విరగగొట్టుకొని ఆ చెట్లన్నీ బోడిబోడిగా అయినవి. అరటి చెట్లైతే మూడుపాళ్ళు నేలకు ఒరిగిపోగా, అలాగో ఇలాగో నిల్చిన ఒక పాలు అరటి చెట్ల ఆకులు పీలికలైపోయి, భోజనానికి సైతం అంగిట ప్రమాణంలో ఉండే ఆకే దొరికేది లేదు కదా!

ఆకులన్నీ రాలి మోడులుగా మారిన మీదట ఆ చెట్లు ఊగేది కొంచం తక్కువైనా కొమ్మల నడుమ గాలి నూకు(దూసు)కొస్తున్న దెబ్బకు (తీవ్రతకు) 'సుయ్యో' అనే ఈలల్నే వేసినట్లుగా వస్తున్న సప్పుళ్లు, అవెక్కడి నుంచే నురారు నక్కలు పెట్టుతున్న ఊళలులాగ అడవి నుంచి వినబడుతున్నది.

ఈ గాలి ఎందుకో మహిళల మీద ఎంతో ఎక్కువగా ప్రభావాన్ని చేస్తున్నట్లుగా కనబడుతుంది. సీగేగౌడ గారి ఏకైక కుమారుడైన సుబ్బేగౌడకు క్రొత్తగా వివాహం చేసి త్రెచ్చుకొన్న కోడలు దానమ్మ సహనాన్ని కోల్పోయి ఇంటి నుంచి బయటకు వచ్చి గాలినీ, ఇంటి ప్రక్కనే పెరిగిన పనస చెట్టునూ నీచంగా తిట్టసాగింది. గాలి నుంచి వస్తున్న ఊళల శబ్దాన్ని మీరి, ఆ దానమ్మ నుంచి వస్తున్న తిట్ల వరస, ఆమెలోని కోపావేశానికి ఆ చిన్న పల్లెలోని జనమంతా ఒకచోట జమై, ఈమె ఎవర్ని తిట్టుందోనని అటుఇటు చూడసాగారు.

సీగేగౌడ గారి ఇంటి చెంతనున్న పనస చెట్టు ఎంతగానో భారీ గాత్రంలోనే ఉంది. అదెప్పుడు పుట్టిందో ఎవరికీ ఏమీ గుర్తులేదు. చినరావూరులో ఇప్పుడుండే జనం వెనకటి కాలంలో ఎక్కడి నుంచో వలసొచ్చి ఇక్కడ ఊరును కట్టుకొన్న కాలానికన్నా ఎంతో ముందే, ఆ పనస చెట్టు అక్కడ ఉంది అనేది కనబడుతుంది. ఆ చెట్టు మీద గడ్డం, మీసాలు పెరిగినట్లుగా నానా రకాల అంటు చెట్లు దాని మీద పెరగసాగావి. కొన్ని కొమ్మల సందులలో (తొర్రలలో) రావిచెట్టు, మర్రిచెట్టు పుట్టి అక్కడి నుంచి నేలవరకూ ఊడలను వేసినవి. అక్కడున్న అనేక రకాల ఆకుల్ని చూస్తే, ఇప్పుడు ఆ పెద్ద పనస చెట్టునే ఇదే జాతికి చెందిన వృక్షం అని చెప్పేందుకు కష్టంగానే ఉంటది. వానల్ని, సుడిగాలుల్ని అనేక శతమానాల నుంచి ప్రతిరోధించుకొనే పెరిగిన ఆ పనస చెట్టులోని

మొదలు పెనవేసుకొని మెలికలు మెలికలుగా స్క్రూ తరహాగా కనబడుతుండేది. అంతటి చెట్టును నరకటంగాని, కోయటంగాని ఎంతో కష్టం. అలాగున ఉన్నందుకో ఏమో ఎవరూ దాన్ని నరికేసి ఇంటి సామానులను చేయించుకొనే ఉత్సాహానికి వెళ్ళలేదు. గొడ్డలి నుంచి దాని కొట్టే ఇనుముకు తాపించినట్లుగా ఠణ్ఠణ్ అనే శబ్దాలు వస్తుండేవి.

అంతటి వృక్షం మొన్న మూడు పగుళ్ళు, మూడు రాత్రిళ్ళు వీసిన సుడిగాలికి తత్తరిల్లింది ఆశ్చర్యమేకదా!

ఆ వృక్షంలోని ఆకులు గాలి జోరుకు చిక్కి సులభంగానే రాలిపోయేది లేదు. జతగా దాని కొమ్మలపైన ఒత్తొత్తుగా పెరిగిన నానారకాల అంటు మొక్కలు, ఆ చంఢమారుతంకు గోడలాగ అడ్డుగా నిల్చినవి. ఆ వృక్షంలోని మొదలు ఎంతటి గాలికి నడుం వాల్చేది లేదు. అయితే గాలి నిధానించాలి కదా! మూడు రాత్రిళ్ళు, పగళ్ళూ నిరంతరంగా వీసినందున, ఆ గాలిలోని రౌద్రతకు ఆ వృక్షం తలొగ్గకపోయినా కొంచం కొంచంగా ఊగిసలాడింది. ఊగిసలాడుతుండగా దాని వేర్ల దగ్గర అక్కడక్కడ నేల చిన్నగా నెర్రెలు పడింది. చిటపటగా పడుతున్న వాన నీళ్ళు మెల్లగా ఆ నెర్రెలలోకి జారింది. వృక్షం మరలామరలా ఊగుతుంటే దాని వేర్లు అటుఇటు జరిగి, తొలగి నేల తేలికబడింది. ఆ వృక్షం మెల్లగా వేర్ల సమేతంగా గాలి వీస్తున్న దిక్కుకు అనుగుణంగా వాలసాగింది.

మొదట్లో ఇంట్లోని సూరు కటకటా అంటూ సప్పుడ్ని చేసినప్పుడు పెంకులేమైనా గాలికి అల్లాడుతున్నవేమోనని సీగేగౌడ భావించుకోసాగాడు. ఆ పెద్ద పనసమాను తన ఇంటి వైపుకు ఏమైనా వాలుతుందేమోనని చింతించసాగాడు. అయితే గాలి ఇంటికి విరుద్ధ దిక్కులో వీస్తున్నందున చెట్టు కూలినా ఇంటికి అపాయం ఉండేది లేదులే అని అనుకోసాగాడు.

ఇంట్లోని పరివారం సహపంక్తిగా కంచాల్ని ముందేసుకొని భోజనానికి కూర్చున్నప్పుడు పైనున్న సూరు బదులు నేల నుంచి చటచట సప్పుడు అయ్యింది. ఏదో పందికొక్కు బయటనుంచి సొరంగాన్ని చేసుకొని వంటింట్లోకి వచ్చిందేమోనని అనుకొన్నారు. అయితే అంతలోపలే కటకట సప్పుడుతో నేల నెర్రెగొట్టి, ఆ నెర్రె అలాగే ముందుకేపోతూ గోడ వరకూ గీతను గీసినట్లుగా వెళ్ళి, ఆ మీదట గోడను ఎగబ్రాకి సూరు వరకూ వెళ్ళి ముట్టింది. క్షణార్థంలో బయటనుంచి వెలుగు లోనికి కనబడేటట్లుగా గోడలో ఆ పగుళ్ళు కనిపించుకొంది.

అక్కడ భోజనానికి కూర్చున్నోళ్ళందరికీ మొదటగా అన్పించింది భూకంపమని. అన్నాన్ని తినేదాన్ని వదిలేసి అందరూ బయటకే పరిగెత్తారు.

బయటకు వచ్చి చుట్టుప్రక్కల చూసినప్పుడు వాళ్ళకు నిజం ఏమిటనేది గుర్తైంది. ఆ పనస వృక్షానికున్న అడ్డవేరు ఒకటి నేరుగా సీగేగౌడ ఇంటి పునాది క్రిందనే పరుచుకొని యుంది. ఆ వృక్షం ఆ వేరు ఉన్న విరుద్ధ దిక్కులో ఒరిగినందున, ఆ వేరు ఆ ఇంటి పునాదిని సమేతంగా ఒక పార్శ్వాన్ని తలిపి పైకి లేచింది.

సుబ్బేగౌడకు భార్యైన దానమ్మకు ఆ పనస చెట్టునుంచి కాయలు ఇంటి పెంకుల మీద అప్పుడప్పుడు పడుతూ పెంకులు పగిలిపోతున్నవని మొదటే కోపం ఉంది. అది పల్టీకొట్టే ఇల్లు పూర్తిగా పడిపోకున్నా, ఇంట్లోని ఒక పార్శ్వమైనా కచ్ఛితంగా పడిపోతదని భావించిన ఆమెలో కోపంకు అదుపే లేనట్లుగా కట్టలు త్రెంచుకొంది.

గాలిలోని సుంయ్ అనే శబ్దాన్ని మించి నోటికి వచ్చినట్లుగా తిట్ల వర్షాన్ని కురిపించసాగింది. ఆమె వాక్ ప్రవాహం లోని రౌద్రావతారాన్ని చూసిన సీగే గౌడ, సుబ్బయ్య భయంతో ముడుచుకుపోయారు. ఆ పెద్దగాలికీ వారిద్దరూ అంత గాఢంగా భయాన్ని చెందలేదు.

## 3

సీగేగౌడతో వియ్యాన్ని అందుకొనే మొదలే, దానమ్మ తండ్రి తన కూతురుకు ఉన్న కోపం గురించి ఎచ్చరికల్ని చెప్పాడు. ఎంతో రూపవతిగా ఉండే దానమ్మ సాధారణంగా మంచి మనిషే. అయితే నెలకొకసారి అమావాస్యకో పౌర్ణానికో ఆమెలో కోపం ఉగ్రంగా ఉంటుండేది. ఒక అరగంట తిట్టి తిట్టిపోసిన మీదట ఆ తర్వాత మరలా ఇంకొక నెలవరకూ సౌమ్యురాలే అని ఆ కన్నతండ్రే తెలిపాడు. మంచి కోటేరుముక్కుతో, పద్మ నయనాలతో ఉన్న దానమ్మ ముఖాన్ని చూసి ముగ్ధుడైన సుబ్బేగౌడ, ఆమె నుంచి నెలకొకసారి వస్తుండే కోపాగ్నికి బెదిరి ఆమెను వదులుకొనే స్థితిలో లేడు. ఆమె తిట్టటమే గాకుండా, కొట్టినా పర్వాలేదు అని మర్యాదకు తిలాంజలి ఇచ్చి, పెండ్లికి ముందు నలుగురెదుట నిస్సంకోచంగా నోటిని వెళ్ళబెట్టి చెప్పనే చెప్పాడు.

ఆమెకు కోపం వచ్చినప్పుడు (వంటి మీదకు దెయ్యం పూనినప్పుడు) దానమ్మ మొగుడు, మామ ఆమెను గౌరవ ఆదరాభిమానంతోనే మాట్లాడిస్తూ (సముదాయిస్తూ)

ఆమెలోని కోపావేశాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తుండేవారు. ఒకొకసారి ఆమె తిట్ల బాణాలు సహించుకోలేనట్లుగా పుంఖానుపుంఖంగా వస్తుంటే, ఆమె తిట్లు తమ మీదే పడుతున్నవని భావించి భయంతో ఆమెలో ఉన్న కోపం తగ్గే వరకూ కనుమరుగైయ్యే వారు ఆ తండ్రి కొడుకులు.

"నీ ప్రతాపం పాడుగాను. శనిముండా కొడుకా... అంతట్నీ వదిలి నా ఇంటిమీదే పొగరు చూపించేందుకు వచ్చావు కదా... ఉన్నదే మూడు గుంటల జమీను, ఇదొక చిన్న ఇల్లు. వీటి మీదే కడుపులో అసూయను, మంటను పెట్టుకొని వచ్చావు కదా! నీ కళ్ళు పాడైపోనీ"

"ఉత్తిగనే తోకను ముడ్చుకొని వచ్చిన దారినే వచ్చినట్లు వెళ్తావా లేక నీ మాన మర్యాదను ఇంకాస్త గట్టిగా దులిపేయనా... నీ వెంతగా వీస్తావో వీసు. నా రోమాలూ అల్లాడేది లేదు, నా చెరగూ ఎగిరేది లేదు"

"ఒకడు ఏడ్చి నిన్ను బెదిరించాడట... ఇంకొకడు చచ్చి దెయ్యమై నిన్ను పీడిస్తానని శపథం చేసాడట... మూడోవాడు నిన్ను పాతరేస్తానని బెదిరించాడట. నేను చూస్తున్నా... మూడు రోజుల్నుంచి అడిగేవాళ్ళు, చెప్పేవాళ్ళు ఎవరూలేరని ఇష్టం వచ్చినట్లుగా వీస్తున్నావు కదా! థూ... నీ నోటికి మన్నువేయ" ఇలాగున ఇలాగున దానమ్మ నుంచి వస్తున్న తిట్లు.

ఇకనూ పడకుండానే నిలిచిన చెట్టుకు, దాన్ని నరికించకనే ఉన్న మొగుడ్ని, దాని వేర్లమీదే ఇంటిని కట్టించిన మామను, గాలికి భయపడి ముడుచుకొని కూర్చున్న జనాన్ని ఎలాగెలాగో అందర్నీ కళాత్మకంగా, లయబద్ధంగా, భావగీతంలాగ సంయోజించి ఝాడించి ఊసింది.

చెట్టు వాలిపోతుంటే తక్షణమే సీగేగౌడగారి ఇంటి పునాది కొంచం కొంచమే పైకిలేచి మరలా కూరుకుపోతుంది. సూరు కటకటా అంటుంది. గోడకున్న ప్లాస్టర్ అక్కడక్కడ రాలుతుంది. చెట్టు వాలినప్పుడల్లా దానమ్మ నుంచి కోపమూ పైకెగబ్రాకి మరలా త్రగ్గుతుంది.

ఆమెలోని కోపం చల్లారేటప్పటికి గాలి కూడా కొంచం తగ్గినట్లనిపించింది. గాలే త్రగ్గిందో లేకపోతే అక్కడున్నోళ్ళకు అలాగున అన్పించిందో గుర్తు లేదు. అయితే మొత్తానికి మూడో రోజు చివర్న గాలి జోరుగా లేదు.

ఆ పెద్ద పనస చెట్టు పడలేదు. అప్పుడో ఇప్పుడో అనే భయజనిక భంగిమలో అది వాలిపోయే ఉంది. ఒక భాగంలో దాని వేర్లు అన్నీ పైకి వచ్చి, సాలెపురుగు కాళ్ళలాగ నిలిచియున్నవి. సీగేగౌడగారి ఇంటి గోడలో ఇటుకలు జారిపడినా చూరుమాత్రం పడకనే అంతరాళంలోనే నిలిచియుంది. ఆ సూరుకు ఆసరాగా సీగేగౌడగారి కోడలైన దానమ్మ నుంచి జాలువారిన తిట్లే ఊతకర్రలాగ సహాయపడి ఆ సూరును నిల్పినట్లుగా ఉంది. అక్కడక్కడ ఇంటి కప్పుమీదున్న పెంకులు ఎగిరిపోయినవి. కసువు, గడ్డి గాలికి కొట్టుకొచ్చి ఊరంతటా ముసుగు కప్పినట్లుంది.

❁ ❁ ❁

“ఆమె గట్టి పిండమే కదమ్మా! ఎంతెంతో మగధీరులే బెదిరి ముడుచుకుపోయి తమతమ ఇళ్ళలో కూర్చుండిపోతే, దానమ్మ ధైర్యంగానే బయటకు వచ్చి తిట్టిపోసింది కదా ఆ చంఢమారుతం మీద” అంటూ దళిత మహిళలు మరుసటి దినాన మరలా వరిమడులలోని కలుపును తీసేదాన్ని చేస్తూ మాట్లాడుకోసాగారు.

“నోటిని విప్పితే నిప్పుకణికెల్నే కక్కుతది ఆమె. ఆమె కోపాగ్నిలోని తిట్లను విన్న మొగుడు, మామ బెదిరిపోయి ఇంట్లోకి వెళ్ళి దాక్కొన్నారట”

“ఎందుకని పారిపోయారు? వాళ్ళనేమైనా తిట్టిందా?”

“ఎవర్ని తిట్టదో? ఎవర్ని వదుల్తదో? ఆ భగవంతుడికే గుర్తు. ఆమె తిట్లను వింటే కడుపులోని పేగుల్నే బయటకు లాగినట్లుగా ఉంటవి. అందుకే పారిపోయారట”

“ఆ గయ్యాళి నోటికి గాలివాన సైతం భయపడ్తదట” అంటూ ఒకరికొకరు మాటల్ని కలుపుతూ ముందుకే చెప్పుకుపోసాగారు.

“ఎంతైనా మహిళామణులకు కోపం రాకూడదమ్మా” అనే సర్వానుమతిలోని తీర్మానాన్ని చేసుకొనే పొద్దుకు ఆ కలుపుతీత పనులు సగానికి సగం ముగిసిపోయినవి.

సీగేగౌడగారి కోడలి గురించి ప్రశంస, దోషాలన్నీ కలగాపులగం అయ్యి విచిత్ర ప్రతిక్రియలు, మాటలు ఆ మహిళల నుంచి వస్తున్నవి. ఆమె తిట్లలోని భాష పదును పెట్టిన కత్తిని ఝుళిపించినట్లుగా నాలుక నుంచి ప్రవహించేదాన్ని గమనిస్తే మాటలకీ శక్తి ఉంటది అనేది ఆ పల్లెలోని తోటి మహిళలకు అన్పించింది.

# 4

“ఏమిటి మహాశయా! ఈ చెట్టు ఇంకొక అరపూటకూ అయ్యేది లేదుకదా”

“సగం బస్తా వడ్లు అన్యాయం అయ్యింది కదా! చేతికి వచ్చింది నోటికి వెళ్ళలేదు కదా”

“పడిపోతున్న ఆ పెద్ద పనసవృక్షం మీద అడ్డంగా రంఫాన్ని లాగుతూ మారడూ, సిద్దడూ అలాగున మాట్లాడుకొంటున్నారు.

గాలి ఆగిపోయిన మీదట పనస చెట్టును చూసినోళ్ళందరికీ భయం కలిగినట్లుగా సగం వాలిపోయి నిల్చియుంది. అంతేగాకుండా అది పడ్తే దానికున్న అడ్డవేర్లు పూర్తిగా పైకి లేచి సీగేగౌడ గారి ఇంటిని కూల్చేసే సాధ్యత ఉంది. ఆ చెట్టు వేర్లు ఇంకా ఎక్కడెక్కడికి వెళ్ళినవో ఎవరికి తెల్సు. ఇదంతట్ని ఆలోచించిన సుబ్బేగౌడ (సుబ్బయ్య) మారడ్ని, సిద్దడ్ని బ్రతిమాలుకొని సగం బస్తావడ్లకు దాన్ని నరికేందుకు ఒప్పించాడు.

మారడు, సిద్దడు వడ్లమీద ఆశెకు దాన్ని నరికేందుకు ఒప్పుకొని నాలుగు రోజుల వరకూ కొట్టికొట్టి సుస్తైపోయారు. అనేకసార్లు గొడ్డలికున్న అంచు మొండుగా మారినప్పుడు, దాన్ని పేట (పట్టణం) వరకూ తీసుకొని వెళ్ళి ఆచారి దగ్గర దాని కావును సరిచేయించి త్రెచ్చారు. అరగంటకొకసారి గరుకు రాతి బండ మీద నూనెను వేసి దాని పదునును సరిగా నూరి చేసి ఎంతగా ఆ చెట్టును నరికినా, కొట్టినా అదేమి ముగిసిపోయే వ్యవహారంగా కనబడలేదు. నాల్గోరోజు ముగిసే ప్రొద్దుకు వాళ్ళ రెక్కలకి (భుజాలికి) నెప్పులు కల్గి సుస్తైపోయారు. సగం బస్తావడ్లకు ఒప్పుకొన్న మారడి మీద సిద్దడికి కోపం ఉప్పొంగి ప్రవహించింది.

“సగం బస్తా వడ్లకే దీన్ని నరుకుతానని ఒప్పుకొన్నావు కదా! దీన్ని నరికే పనిని ముగించాలంటే మనిద్దరం ముసలోళ్ళమై పోతామేమో కదా” అంటూ మారడి మీద రేగాడు.

“థూత్ తేరి... మనం ఈ పెంట పనికి చేతిని వేసిందే తప్పు అయ్యింది కదా. ఇది చెట్టా... శనిదేవతా” అంటూ గొడ్డల్ని విసిరేసి నేరుగా సుబ్బేగౌడ వద్దకు వెళ్ళారు.

“సుబ్బయ్యా, నీ మాట ప్రకారం చెట్టును కొట్టి కొట్టి సుస్తైపోయాము. నువ్వు ఇంకా సగం బస్తా ఇస్తేనే ఆ చెట్టును నరుకుతాం. లేకపోతే నువ్వు ఇస్తానన్న అరబస్తా

వడ్లను ఇవ్వకున్నా పర్వాలేదు. ఈ చెట్టు సహవాసమే మాకొద్దు, ఇదేదో దెయ్యాల చెట్టు కావొచ్చు.  ఎంతగా కొట్టినా ముగియట్లేదు" అంటూ జగడాన్ని చేసారు. సుబ్బేగౌడ ఇంకాస్తగా చిక్కుల్లో పడ్డాడు. మొదలే ఒక ప్రక్కకు వాలుకొన్న చెట్టు ఇది. దాన్ని వీరిద్దరూ సగానికే కొట్టి ఇక కొట్టేది లేదని వెళ్ళిపోతే ఇంకా ఎంతో అపాయంగా ఉంటది. భయపడిపోయి ఇంకొక అరమూట వడ్లను ఎక్కువగా ఇచ్చేందుకు సంశయించకుండానే ఒప్పుకొన్నాడు. ఆ ఊరులో కాపు జనాంగం బిల్లవులు, దళితులకన్నా ఎక్కువగా ఏమి స్థితివంతులు (శ్రీమంతులు) కానందున దళితుల మీద అట్రాసిటీ (అఘాయిత్యాన్ని) చేసి పనులను చేయించుకొనేది లేదులే.

అయితే చివరికి చెట్టు కూలింది మాత్రం మారడు,సిద్దడి నుంచి నరికినందువలన కాదులే.

వాళ్ళు జగడాన్ని చేసి ఇళ్ళకు వెళ్ళిన మీదట రాత్రికి రాత్రే ఆ చెట్టు తన భారానికి తానే పఠార్ మంటూ విరిగి పడిపోయింది. "అయ్యయ్యో" అంటూ మనుషులు అరిచినట్లే ఆర్తనాదాల్ని పెట్టినట్లుగా పడిపోతున్న చెట్టు నుంచి వచ్చిన ఉరుములాంటి శబ్దాన్ని విని ఊర్లో ఉన్న ఇళ్లలోని జనం పరిగెత్తుకొని వచ్చారు. ఆ చెట్టుకున్న పనస పండ్లకు వేళాడుతున్న ఒకట్రెండు గబ్బిలాలు,  ఆ ఫలాలలోని జిడ్డుకు అంటుకుపోయి జరబర సపుళ్ళను చేసినదాన్ని విని, దాని మొదలులో ఎవరో చిక్కుకుపోయి చనిపోతున్నోడు గిలాగిలా తన్నుకులాడుతున్నాడని ఊహించి, లాంతరు వెలుగులో ఆ ఆకు అలుమును తొలగించి చూసారు. గబ్బిలాలు రపరప రెక్కల్ని కొట్టుకొంటూ చీకట్లో ఎగిరిపోయిన శబ్దాలు మాత్రం విన్పించినవి. ఆ వృక్షంలో దాగి కాపురాన్ని చేస్తున్న ఐదారు పిశాచాలు పారిపోయినవిలే అని తీర్మానించుకొన్నారు.

ఆ చెట్టు సీగేగౌడ గారి ఇంటికి ఎదురులోనున్న భైరప్ప ఇంటి ఆవరణలో పడిపోయింది. భైరప్పగారి ఇంటికి ఉన్న దర్వాజాకు అడ్డుగా ఆ చెట్టులోని పెద్ద కొమ్మ పడియుంది. ఆ చెట్టును అక్కడే అలాగే ఉంచేటట్లుగా లేదు. దాన్ని కోయించి ముక్కలుగా చేసి దారిని చేసుకోవాల్సిఉంది. అది వేరే ఏ వైపుకు పడినా ఎవరూ కచ్చితంగా దాని తంటకు (జోలికి) వెళ్ళేవారు కాదు.

భైరప్ప సుబ్బేగౌడతో చెట్టును ముక్కలు ముక్కలుగా కోయించి ఇంటికి దారిని చేయించండని పరిపరివిధాలుగా అడిగాడు. అయితే మరలా వడ్లను (ధాన్యాన్ని) ఇచ్చి

చెట్టును కోయించేందుకు ఆర్థిక బలంలేని సుబ్బేగౌడ ఆ చెట్టు తనది కానేకాదని, దాన్ని ఎవరు కావాలనుకొన్నా కోయించుకొని మోసుకెళ్ళొచ్చని చెప్పాడు.

అందుచేత భైరప్ప మరలా మారడ్ని, సిద్దడ్ని బ్రతిమాలుకొని ఒక బస్తా వడ్లకు దాన్ని కోసి ముక్కలుగా చేయించేందుకు ఒప్పించాడు. దాన్ని ముక్కలుగా చేసేందుకు ఎంతో డబ్బు పోసి పేట నుంచి మంచి రంఫాన్ని తెచ్చి ఇచ్చాడు.

## 5

మారడు, సిద్దడు చెట్టును కోస్తున్నప్పుడు "ఆ చెట్టు తనంతతనే పడిపోయి తమకు సీగేగౌడ నుంచి మరింతగా దొరకబోయే సగం బస్తా వడ్లకు పెద్దబండను వేసిందికదా" అని అనుకోసాగాడు సిద్దడు.

"పడిపోతే పోనీ.... ఇప్పుడేమైంది. భైరప్ప నుంచి ఒక బస్తావడ్లను వసూలు చేసుకొంటున్నాము కదా" అని మారడు సిద్దడికి సమాధానంగా అన్నాడు.

మార, సిద్ద ఇద్దరూ చెట్టును కోస్తుంటే గ్రామసేవకుడైన శంక్రప్పవచ్చి వాళ్ళు కోస్తున్న చెట్టు దిమ్మె మీద కూర్చొని బీడీని త్రాగుతూ మాటల్ని ప్రారంభించాడు. శంక్రప్ప ఊరునే వదిలి పారిపోయాడని తెల్సుకొనియున్న ఆ ఇద్దరూ అంత హఠాత్తుగా అతడి ఆగమనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు.

"ఏంటి శంక్రణ్ణ... మరేదైనా బోర్డ్‌గీర్డ్‌ను పట్టుకొని వచ్చావా?" అపహాస్యంలోని ధ్వనితో మారడు అడిగాడు.

మారడు అలాగుననే అడిగినదాన్కి వెనకొకసారి నడిచిన చిన్న ఉపాఖ్యానంలోని కథ ఒకటి ఉందిలే.

శంక్రప్ప గ్రామసేవకుడిగా గవర్నమెంట్ నౌకరీలో ఉన్నా, మూడు కాసుల పనిని సహితం చేయకనే ఊర్లో తంపులమారితనాన్ని చేస్తూ ఆరామంగా (హాయిగా) ఉన్నాడు. అతనూ, 'ఊరళ్ళి'లోని హెగ్డె (పటేల్)తో చేరి సహ భాగస్వామ్యంతో ఒక సారాయి అంగడ్ని తెరిచాడు. చినరావూరుకు సమీపంలో దారి రెండుగా విభజించుకోబడిన చోట చిన్న గుడిసెకు 'సారాయి అంగడి' అనే బోర్డ్‌ను తగిలించి గవర్నమెంట్ పంపే చెక్కపెట్టెల నుంచి సారాయిని, కల్లును త్రెప్పించి సారాయి అమ్ముతూ ఈ గ్రామ సేవకుడు తన కాలాన్ని గడుపుతుండేవాడు.

ఒకసారి వ్యవసాయ డిపార్ట్‌మెంటోళ్ళు శంక్రప్పతో ఆధునిక సేద్యంను రైతులకు పరిచయం చేయించేందుకు మరియు సాంద్ర (సేంద్రీయ) పద్ధతులలో వ్యవసాయంకని చినరావూరులో ఒక రైతునైనా ఒప్పించి ఒక ఎకరాన్నైనా పరివర్తించాలని టార్గెట్‌ను ఇచ్చారు. ఇప్పటిదాకా డిపార్ట్‌మెంటోళ్ళు చెప్పిన దానికంతా కానీయండి అలాగుననే అని చెప్పి ఎవరెవరో నకలి రైతులనుంచి దొంగ రుజువుల్ని సృష్టించి, గవర్నమెంట్ ఇస్తున్న సబ్సిడీని ఔషధాల్ని ఎరువుల్ని అమ్ముకొంటూ శంక్రణ్ణ కాలాన్ని నెట్టుకొస్తుండేవాడు. అయితే ఈసారి అలాగే చేసేందుకు సాధ్యం లేదు. ఎందుకంటే చినరావూరులో ఎవరూ శంక్రప్ప చెప్పే సాంద్ర వ్యవసాయక్రమంలోని ప్రయోగానికి ఒప్పుకోలేదు. దీనికి ముఖ్యకారణం చినరావూరులోని రైతులందరికీ తమ తిండికి సరిపడేంతగా సంవత్సరానికి పండించుకొనేంత మాత్రమే భూమి ఉంది. శంక్రప్పడి మాటల్ని నమ్మి ఏదో చేసేందుకు వెళ్ళి ఏమైనా వైపరీత్యం అయితే వాళ్ళకు ఉపవాసమే గతి అయ్యేదుంది.

శంక్రప్ప విపరీతంగా కష్టపడి దలితవాడకు చెందిన 'కరియ'ను ఎలాగో ఒప్పించాడు. అతనికి గవర్నమెంట్ నుంచి ఇంటికని కలపను, పెంకుల్ని శంక్రప్ప ఒకసారి ఇప్పించినందున ఆ ఋణానికని దొరికిపోయి కరియ చివరికి ఇష్టంలేని మనస్సుతో ఒప్పుకొన్నాడు. కరియకు వ్యవసాయపనులే గాకుండా దలితవాడలో గ్రామ పంచాయత్‌కు చెందిన నోటీసులను జారీ చేసేది, భూమి శిస్తు వసూలుకు శంక్రప్పకు జతగా చేరి తన అధికార దండాన్ని (కర్రను) పట్టుకొని ఇల్లిల్లూ తిరిగేది... మొదలైన జవాబ్దారీలు ఉంటుండేవి. అయితే వీటికన్నా ముఖ్యంగా అతను బెణుకులకు నాటు వైద్యాన్ని చేస్తున్నందున ఆ చుట్టుప్రక్కల ప్రసిద్ధుడైయున్నాడు.

ఎక్కడా పనులను చేయకనే అబద్దాల్నే చెప్పుకొంటూ చేతికి మట్టిని చేసుగోకనే సొంబేరిగా ఉదరాన్ని నింపుకొంటుండే శంక్రప్పకు మాత్రం సాంద్ర వ్యవసాయంగాని, మరేరకమైన సేద్యంగాని తెల్వదులే. వ్యవసాయ డిపార్ట్‌మెంటోళ్ళు సాంద్ర వ్యవసాయం గురించి ప్రకటించిన చిన్న పుస్తకాన్ని చదువుకొని దాని ప్రకారం కరియకు సలహాలను సూచనల్ని ఇచ్చాడు.

శంక్రప్పకు దుర్దైవం అన్నట్లుగా కరియడి మడులు మిగిలినోళ్ళ మడులులాగ వృద్ధి కాలేదు. మొదట్నుంచే ముడుచుకుపోయి "కుయ్యో" అంటూ క్రుంగుతూ ఆ మడులలోని పైరు నిలిచింది.

కరియకు చెందిన ఆ ప్రదర్శనలోని ఆ పైరు అలాగైంది కేవలం ఆకస్మికం అంతే. ఎందుకంటే నిజంగా మడులు పాడైపోయేంతగా అతనేమి చేయలేదు. ఎవరెవర్నో ఫీల్డ్ సైంటిస్ట్‌లను పిలుచుకొచ్చి ఆ మడులలోని పైరును చూపెట్టి వాళ్ళు చెప్పిన దాన్నంతా ఆ పొలంలో వేసి, చల్లి ఆ పైరును పెంచాడు. ఏమి చేసినా మడిలోని పైరు తల ఎత్త లేదు ధీటుగా. మిగిలినోళ్ళ మడులన్నీ దుబ్బులు దుబ్బులుగా ఒత్తొత్తుగా పెరిగి (వృద్ధిచెంది) వరి కంకుల్ని వేసి గింజలు కట్టేదాన్ని చేస్తుంటే, కరియడి మడులలోని పైరు మాత్రం వాడిపడేసిన పాత పొరక (చీపురు) కట్టలాగ నీటిలో నిల్చియుంది. క్షేత్ర దర్శనంలోని శుభదినం ఇంకా దూరంలోనే ఉంది. అప్పటిలోపు ఈ మడులలోని పైరు బాగుపడొచ్చని శంక్రప్ప సహనంతో వేచి చూడసాగాడు. 'ఫీల్డ్‌డే' లోని రోజు దగ్గరపడింది. కరియడి వరిమడులు శోచనీయమైన అవస్థలోనే ఉన్నవి. ప్రదర్శనం (Exhibition) లోని వరిమడులు చక్కగా ఉన్నవని డిపార్ట్‌మెంట్‌కు అసత్యాల్ని చెప్పియున్న శంక్రప్పకు తల వేడెక్కింది.

ఇంత సందిగ్ధ పరిస్థితిలో శంక్రప్ప తనకు ఎదురౌతున్న దారుణస్థితిని 'ఊరళ్ళి'లోని భూతవైద్యుడైన హెగ్డె (పటేల్)కు చెప్పుకొన్నాడు. హెగ్డెకు ఒక అద్భుతమైన తంత్రం మెరిసింది. "నువ్వెందుకు తలను వేడెక్కించుకొంటావు? కరియడి పొలంలో నాటిన నీ బోర్డ్‌ను పీకేసి, ఎవర్దైనా చక్కగా పండిన పొలంలో పాతిపెట్టు. సమారంభం ముగిసిన మీదట ఆ బోర్డ్‌ను తీసి విసిరేస్తే సరికదా" అంటూ శంక్రప్పకు చెప్పాడు.

హెగ్డె (పటేల్) గారి అమోఘమైన తంత్రాన్ని విన్న శంక్రప్పకు రోమాంచనమైంది.

క్షేత్ర దర్శనంలోని రోజున (ఫీల్డ్‌డే) ఉదయపు ఝాములోనే శంక్రప్ప చినరావూరుకు వెళ్ళి కరియడి పొలంలో పాతిన డిపార్ట్‌మెంట్ బోర్డ్‌ను పీకేసి, అక్కడే ప్రక్కనున్న మారడి పొలంలో నిల్పి సమారంభంలోని మిగిలిన ఏర్పాట్లను చేసేందుకని ఊరిలోపలికి వెళ్ళాడు.

ఎండ పడేవేళకు మారడు తన పొలం వద్దకు వచ్చి చూడగా పాడుబడ్డ కరియడి పొలంలో ఉండే బోర్డ్ తన మడులలో నిలిచియుంది ఒక అపశకునాన్ని చూసినట్లైంది. కరియడి తల మీద కూర్చున్న గుడ్లగూబను ఎవరో తన తల మీదకు దాటించారు. పశువుల్ని కాసే దొంగముండాకొడుకులదే ఈ పని అంటూ యోచించాడు. మరలా ఆ దరిద్రపు బోర్డ్‌ను మోసుకెళ్ళి కరియగాడి పొలంలోనే పాతిపెట్టాలని మనస్సులో కల్గినా, అంతగా సహనంలోని వ్యవధానమే (టైమే) లేక కోపంతో దాన్ని తీసుకొని వాగులోకి విసిరాడు.

శంక్రణ్ణ వాపస్సె వచ్చినప్పుడు మారడొక్కడే పొలంలో నీరు పెట్టుకుంటూ ఉన్నాడు. బోర్డ్ జాడే లేదు! బోర్డ్ ఎక్కడ అని అడిగినప్పుడు, దాన్ని ఎవరో తన పొలంలోకి త్రెచ్చి పాతారని, దాన్ని తనే పీకేసి వాగు మధ్యన పెట్టానని చెప్తూ ఆ బోర్డ్‌ను చూపించాడు. బోర్డ్ పడిపోయిన భంగిమను చూస్తే దాన్ని తీసుకొచ్చి విడిచిపెట్టినట్లుగా కానరాక, సొట్టలు, సొట్టలుగా కాళ్ళతో త్రొక్కి విసిరేసినట్లుగా బాగానే గుర్తు అవుతుంది చూసినోళ్ళకెవరికైనా!

“మహాశయా... ఈ ఒక్కరోజు నీ పొలంలో పాతి ఉంచుతా! ఈ రోజు క్షేత్ర దర్శనం రోజుగా పెట్టుకొన్నారు మిత్రమా! సుమారుగా రైతులు, తాశీల్దారు, బిడిఓ.... మరి ఇతర అధికార్లు ఇక్కడికి వస్తారు. వాస్తవంగా కరియగాడి పొలాన్ని చూపెట్టే, నా నౌకరిపోతది” అంటూ శంక్రప్ప అంగలార్చాడు.

మారడికి దిగులైంది. తాశీల్దారు, బిడిఓ మొదలైన ఆఫీసర్లంతా బోర్డ్‌ను చూసేందుకని తన పొలానికి వస్తే తన గతేంటి? ఇంకాస్త ఎక్కువగా లెవిధాన్యాన్ని నా మీద మోపుతారు. రెండు పంటల్ని (ఖరీఫ్, రబీ) పండించే భూమి అని భూమి శిస్తును ఎక్కువగా వేయొచ్చు! ఏమేమి కతలు ఉంటవో... ఈ దరిద్ర బోర్డ్‌కు నిప్పు పెట్ట అని ఆలోచిస్తూ శంక్రప్పతో మొదలు ఆ బోర్డ్‌ను ఇక్కడ్నుంచి తీసేసుకునిపో అంటూ అతనికన్నా ఎక్కువగానే అంగలార్చుకొంటూ మారడే వేడుకోసాగాడు.

వీళ్ళిద్దరి రోదనల్ని, ఆక్రందనాల్ని విని కుతూహలంతో ఆ పొలాల సమీపంలో ఉన్న పొలం పనులను చేసుకొంటున్న మహిళలు, మొగోళ్ళు అక్కడికి వచ్చారు. బోర్డ్‌ను చూసేందుకు ప్యాంటు సూట్‌లతో వచ్చే అధికారులందరి కళ్ళూ తమ ఊరిమీద పడుతవని తెల్సుకొని బెదిరారు. అధికార్ల పాలనలోని లంచాలు, బాధలు, నోటీస్‌ల నుంచి తత్తరిల్లిపోయిన ఆ ఊరి జనానికి సూటుబూటులతో సామూహికంగా (బృందంగా) వచ్చే అధికారులందరూ ఊర్లోకి వస్తారంటే ఊరిమీదకు దెయ్యాలమారి (జడల భూతం) జొరబడినట్లే అనే సర్వసమ్మతమైన అభిప్రాయం జనించింది వారి హృదయాలలో. అందరూ భీతితో గోలను పెట్తున్న మారడికి హృదయపూర్వకమైన బలాన్ని వ్యక్తపరిచారు.

శంక్రప్ప బోర్డ్‌ను మ్రోసుకొంటూ పొలం బయట మరెవరి పొలంలో దాన్ని పాతిపెట్టొచ్చు అని పరిశీలిస్తున్నదాన్ని చూసిన ఆ గుంపు మొత్తం ఒకటై అతడ్ని పారద్రోలేందుకని రాసాగరు. తనను చితకబాదేందుకే వస్తున్నారని శంక్రణ్ణ

పారిపోసాగాడు. అతను పరిగెత్తేదాన్ని చూసి ఏదో దుష్కృత్యానికే ఇతను (శంక్రణ్ణ) ప్రయత్నిస్తున్నాడని ఆ ఊరి జనానికి కచ్చితమైంది. "హో" అని అరుస్తూ శంక్రప్పను వెంటాడారు. ఈ మధ్యలో దానమ్మకు చెందిన (మూగుద్వారంకు పగ్గాన్ని కట్టి గట్ల మీద మేపించుతున్న) రెండు గిత్తలూ ఎరుపునలుపు రంగులతో ఉన్న బోర్డ్‌ను మోసుకొంటూ పరిగెడ్తున్న శంక్రప్పను చూసి, ఇదేదో అపాయకరమైన క్రొత్త ప్రాణి అని భావించుకొన్నవి. చెవులను రిక్కించుకొని తోకల్ని ఎత్తి బుస్‌బుస్ అంటూ వేడిగాలుల్ని వదుల్తూ, మూగుత్రాళ్ళే తెగిపోయేటట్లుగా ఆమె చేతి నుంచి పగ్గాల్ని త్రెంచుకొని ఒకే గెంతుతో శంక్రప్ప వైపుకు పరిగెత్తినవి.

తల వాల్చుకొని కొమ్ముల్ని ముందే పెట్టుకొని తన వైపుకు దూసుకొంటూ వస్తున్న గిత్తల్ని, వాటి వెనకే పరిగెత్తుకొంటూ వస్తున్న దానమ్మను చూసిన శంక్రప్ప, దానమ్మే తన మీదకు ఆ గిత్తల్ని ఉసిగొల్పిందని భావించి బోర్డ్‌ను విసిరేసి పడ్తూ లేస్తూ ఈత వనాల చాటున పారిపోయాడు. పరిగెడ్తూ ముందుకు పడి వంటికి, చేతులకు నానా రీతులుగా గాయాల్ని చేసుకొన్నాడు. ఆ గిత్తలు రెండూ దార్లో పడియున్న బోర్డ్‌మీద తమ కోపాన్ని తీర్చుకొంటూ నిల్చినవి.

## 6

సాయంకాలం బిడిఒ, తాశీల్దారు జీపులలో వస్తున్న సప్పుడును విన్న తక్షణమే శంక్రప్పే వెళ్ళి చాడీలను చెప్పి పోలీసుల్ని వెంటేసుకొస్తున్నాడనే భావించుకొన్న ఆ ఊరులోని మొగోళ్ళంతా ఇళ్ళను వదిలేసి అడవి లోపలికి పారిపోయారు. అధికార్లందరూ ఊర్లోకి వచ్చి చూడగా శంక్రప్పడి జాడేలేదు. ఆహ్వానానికని వేసే పందిరీ లేదు. తళిరు తోరణాలు లేవు. పూలమాలలు లేవు. ఎవరి ఇంటి తలుపుల్ని తట్టినా లోపలి నుంచి మా యజమాని లేడనేదే అందరి ఇళ్ళనుంచి వస్తున్న మహిళామణుల సంకేతాలు. ఆఫీసర్లకు ఏమేమో సంశయాలు కలిగినవి. అయితే విషయాన్ని తెల్సుకొనేందుకు ఎవరూ సహకరించడం లేదు కదా! జన సంచారమే లేదుకదా!

అక్కడ ఇక్కడ వెతికి అసహనాన్ని పొందిన అధికార్లలో చేదు అనుభవం ఎదురైనట్లుగా ఇంగ్లిపీసులో తిట్టుకొంటూ వెనుదిరిగినప్పుడు శంక్రప్ప వస్తుంది కనబడింది వారికి. తలకు, చేతులకు బ్యాండేజ్‌ను కట్టుకొని శోచనీయంగా కుంటుతూ వస్తున్న అతడ్ని చూసిన అధికార్లు భయాన్ని చెందారు.

శంక్రప్పకు అబద్దాల్నే చెప్పకనే ఏదోదాన్ని చెప్పేందుకు దారేలేదు. తను సాంద్ర వ్యవసాయాన్ని చేయించింది దలితుల పొలంలోనే. అందుచేత ఊర్లోని సవర్ణీయులంతా పంట పొలానికి నీరు ఇవ్వకనే పశువుల్ని తోలి ఆపైరును పాడు చేసారని, ఎందుకు అలాగున చేసారని అడిగేందుకు వెళ్తే చంపేందుకు వెంబడించారని చెప్పాడు.

నూరారు పుకార్లతో ఉన్న శంక్రప్పడి మాటల్ని నమ్ముకొని ఊర్లోకి ప్రవేశించి, ఆ జనం విరుద్ధంగా గలాటాను చేసేందుకు అధికార్లు సిద్దమవ్వలేదు. అయితే మొగోళ్లు లేకుండా ఖాళీగా పడియున్న ఊరును, కుంటుతున్న శంక్రప్పడి బ్యాండేజ్‌లను చూస్తే, అతని మాటలు నిజమేమో అని అన్పిస్తుంది వాళ్ళకు. గత్యంతరం లేక తోటి ఉద్యోగస్తులెదురు దర్పాన్ని నిలబెట్టుకొనేందుకుని తాశీల్దారు కరియదగ్గర ఒక పిటీషన్ చెప్పించుకొని (రాపించుకొని) "పోలీసుల్ని పిల్చి ఆ విషయం మీద విచారించండని చెప్తానులే" అంటూ ఆ ఊరు వదిలి వెళ్ళాడు.

మారడు, సిద్దడు చెట్టును కోస్తుంటే శంక్రప్ప తను వచ్చింది కరియ నుంచి వేలిముద్రను వేయించుకొని వెళ్ళేందుకని, వరి పొలంలోనిపైరుకు నష్టం అయినందుకు నష్టపరిహారాన్ని కోరేందుకే ఈ అర్జీ అని వారితో అన్నాడు. వెనక గవర్నమెంట్ నుంచి పెంకుల్ని, ఇంటి కలపను శంక్రప్పే ఇప్పించినందున, ఇప్పుడు ఈ అర్జీ కూడా నిజమేనని వారు భావించారు.

# 7

"ఏమిటి శంక్రణ్ణా... మరలా ఏదైనా బోర్డ్‌గిర్డ్‌ను తెచ్చావా?" అంటూ చెట్టును కోస్తూ మారడు అడిగిన ప్రశ్నకే మొత్తానికి ఈ ఘటనలోని నేపథ్యం ఇదిగా ఉంది కదా!

శంక్రప్పకు మారడి నుంచి గుచ్చుకొంటున్న మాటల్ని విని లోలోన నఖశిఖాంతంగా కోపం వచ్చినా పైకి దాన్ని చూపించకనే అతడి ప్రశ్నను సంపూర్ణంగా నిర్లక్షించి, వాళ్ళు కోస్తున్న ఆ పనస వృక్షం ఎవర్ది అని అడుగుతూ, దాని మొదలు మీద కూర్చుని బీడీని త్రాగసాగాడు.

"ఇదేంటయ్యా... పౌర్ణమి దినాలలో పడదొబ్బి కోస్తున్నారేంటి? కోసే చెట్టును ఏ వేళనైనా అమావాస్య దినాలలోనే కొయ్యాలనేది గుర్తులేదా?" అన్నాడు శంక్రప్ప.

"చెట్టును నరికేందుకు పంచాంగాన్ని చూస్తారేంటి? ఇప్పటి కాలంలో జాతకాన్ని, ముహూర్తాన్ని చూడకనే సమాజవాది ఉద్ధారపు సంఘపోళ్ళు పెళ్ళిళ్ళనే చేస్తున్నారు కదా" అని మారడు రంఫాన్ని పైకి లేపుతూ చెప్పాడు.

శంక్రప్పడి ప్రకారం అమావాస్య దినాలలో వృక్షాల మీద నివసిస్తుండే పిశాచాలు బయట సంచారానికి వెళ్తువట. వెన్నెల దినాలలో నరికితే ఆ పిశాచాలకు కోపం వచ్చి, ఆ వృక్షంలో చేసిన ముట్టులన్నీ రెక్కలొదిలి, ఆ వృక్షం నుంచి పడిపోయి, ఆ వృక్షాన్ని నరికినోళ్ళ కొంపలు నాశనమౌతవట. ఈ మాటల నుంచి ఆరంభమైన అతడి దెయ్యాల వృత్తాంతాలు ముగిసిపోయే ప్రొద్దుకు సరిగ్గా మారడు సిద్దడు లాగుతున్న, కోస్తున్న రంఫం ఎందుకో బిగువుగా అయ్యింది.

"ఎయ్ సిద్దా.... రంఫాన్ని లాగాలనుకొంటే ఎందుకు బిగువుగా పట్టుకొన్నావు? కొంచం తేలికగా గుంజు. ఎందుకో రెక్కలు (భుజాలు) నెప్పెట్టుతున్నవి" అంటూ సిద్దడి వైపుకు తిరిగి గదిరాడు మారడు.

"మహాశయా.... ఇదే మాటను నీకు చెప్పాలనే అనుకొంటున్నా. రంఫం ఎందుకో బిగువుగా వస్తుంది కదయ్యా. పనస చెట్టులోని మైనం (జిడ్డు) రంఫానికి అంటుకొన్నట్లుగా కనబడుతుంది" అంటూ సిద్దడు జవాబు ఇచ్చాడు.

ఇద్దరూ రంఫాన్ని బయటకు తీసి, భైరప్ప ఇంటి నుంచి కిరోసిన్ నూనె తెచ్చి రంఫానికి రుద్దారు. అంటుకొన్న పనస చెట్టులోని మైనం (జిడ్డు) అంతా పోయిన మీదట మరలా కోసేదాన్ని చేయసాగారు. అయితే నాల్గుసార్లు కోసే లోపలే రంఫం మరలా బిగువుగా అయ్యింది.

"థూత్, దీని కొంప పాడుబడనీ. భుజాలకు అలుపొస్తుంది. ఈ చెట్టు మొదలు లోపల ఏదో దెయ్యం దాక్కొన్నట్లుగా కనబడుతుంది" అంటూ గట్టిగా యోచిస్తూ రంఫాన్ని లాగేదాన్ని ఆపారు.

"శంక్రణ్ణా... నువ్వు దిగు అక్కడ్నుంచి. ఒక వైపున బరువు పడ్తుంది" అంటూ జోరు చేసి శంక్రప్పను ఆ చెట్టు కాండం పైనుంచి దించారు. అతడ్నుంచి చెరొక బీడీ తీసుకొని రెండు దమ్ములు పీల్చి, నెమ్మది పొంది మరలా రంఫాన్ని లాగేదాన్ని ఆరంభించారు. ఐదారుసార్లు లాగేటప్పటికే ఆ రంఫం ఎంతో బిగువుగా అయిపోయింది.

"అరెరె....! సిద్దా... చేతులకు ఏదో శని పట్టుకొన్నట్లుంది. తొందర తొందరగా రంఫాన్ని బయటకు తీయ్" అంటూ మారడు రంఫాన్ని ఆ మొద్దు నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుంటే ఆ రంఫం అటుఇటు జరగకనే బిగుతుగా ఒక పెద్ద రాతి బండలాగ ఆ దిమ్మెలోనే పాతుకు (కూరుకు) పోయింది.

ఆ ముగ్గురు రకరకాల ఉపాయాల్ని చేసి రంఫాన్ని బయటకు తీసేందుకు సాయంకాలం వరకూ ప్రయత్నించారు. ఒక శాణాన్ని త్రెచ్చి ఆ మొద్దుకున్న పగులులో దాన్ని ఉంచి, ఆ రంఫాన్ని విడిపించేందుకు ప్రయత్నించారు. ఆ మొద్దును కోసేది అంటుండనీ, ఆ రంఫాన్ని బయటకు తీసేది అసాధ్యమే అని వాళ్ళలో కలిగింది.

శంక్రప్ప అక్కడ్నుంచి బయటపడి కరియడ్ని వెతికేందుకు వెళ్ళిపోయాడు.

భైరప్ప పొలం పనుల్ని ముగించుకొని ఇంటికి చేరే ప్రొద్దుకు ఆ ఇద్దరూ తలల మీద చేతుల్ని పెట్టుకొని కూర్చున్నారు. జరిగిన అచాతుర్యానికి వివరణ అన్నట్లుగా దెయ్యం నుంచి వస్తున్న ఆటే ఇది అని చెప్పారు. తను ఎంతో డబ్బు పోసి ఖరీదించుకొచ్చిన క్రొత్త రంఫం ఆ పనస మొద్దు పగుళ్ళలో ఇరుక్కొని కూర్చొండి పోయిన దాన్ని చూసాడు భైరప్ప. రెండు భాగాల నడుమ చిక్కుకుపోయిన అది, అసహాయకంగా మూఢుడిలాగ నిల్చిన భైరప్పడి మనఃస్థితికి సంకేతం లాగ కనబడింది.

మారడికి భార్యైన రుద్రి, కరియడి అర్ధాంగైన కాళి మరియు ఈరి, నాగమ్మ, దానమ్మ... వీళ్ళందరూ పొలం పనులను ముగించుకొని అదే దారిలో వస్తున్నారు.

మారడు సిద్దడు చేసిన పనిని, భైరప్పడి చింతాక్రాంతమైన ముఖాన్ని చూసిన రుద్రి "మీకు పనిని అప్పగించినోడ్ని పాడుచేశారు. మీరూ పాడైయ్యారు" అంటూ ఇతర మహిళల ముందు తన భర్తైన మారడి మీద ఊసింది.

మొదలే పని ఆగిపోయి అసహనంగా ఉన్న మారడికి తన భార్య తన పరంగా నిల్చి మాట్లాడకనే అందరెదురుగా ఊసిందానికి పిచ్చి కోపం వచ్చింది. నాలుగు తన్నుల్ని తన్నాలని అన్పించినా, తనకన్నా నాలుగురెట్లు బలశాలైన భార్యమీద కాలెత్తేందుకు ధైర్యమే రాలేదు. అందుకే సిద్దడి వైపుకు తిరిగి,

"ఔనయ్యా....ఈ మూడు కాసుల ఆడదానికి ఎంత గర్వమో చూడు" అని అన్నాడు మారడు.

పరిస్థితి సూక్ష్మంగా ఉందని భావించుకొన్న సిద్దడు మారడు పలికిన మాటలకు ఏ ప్రతిక్రియనూ చూపకనే నించొనియున్నాడు.

“నేను మూడుకాసుల విలువనే పొందని దాన్నా? నేనెప్పుడైనా ఇంకొకడితో సంగమించింది చూసావా? ఇటువంటి చేతగాని పనుల్ని చేస్తూ నాకు రేటును (విలువను) కట్తున్నావా... భాడకోవ్! బయటకే గుంజు రంఫాన్ని” అంటూ రుద్రి మరలా ఊసింది భర్త ముఖాన.

సిద్దడు ఆ మొగుడు–పెళ్ళాం నడుమ ఉన్న విరసానికి భయపడి “వెళ్ళమ్మా... వెళ్ళు తల్లీ. మేము కావాలని ఏమీ చేయలేదు. ముఖ్యంగా మా గ్రహచారం సరిగా లేనందున ఏమి చేయగలం మేము” అంటూ ఆమెను శాంతపరచి, వీడ్కోలు చెప్తుంటే, ఆ మహిళల గుంపు దూరంగా అయిన దాని తర్వాత “థూత్, ఆ దానమ్మ లోని గాలి అందరికీ తాకినట్లుంది కదయ్యా. గయ్యాళి ముండల ఊరు ఇది” అంటూ ఊపించుకొన్న మారడ్ని శాంతపరుస్తూ అన్నాడు సిద్దడు.

“భలే కొవ్వు పట్టిన ముండలు. అడవిలో చిక్కుకుపోయినోళ్ళకు దారి కనబడనట్లుగా, మదంపట్టి ఈగ సైతం నిలవనట్లుగా మిలమిల మెరుస్తుంది వాళ్ళ శరీరాలు. ఒక్కొక్కరికీ పదిమందితో కూడి సంగమించే శక్తి ఉంది. పాడు ముండలు! సామూహికంగా సంగమించేటప్పుడు విశ్రాంతినే ఇవ్వకూడదు. అలాగైతేనే కదయ్యా... ఈ మదపు ముండల్ని హద్‌బస్తుకు (కంట్రోల్‌కు) తేవొచ్చు! అలాగున చేయకపోతే మన ఊర్లో ఉన్న మగోళ్ళందరి పరువును పోగొట్తారు. నిజమే కదా నా మాటలు. ఏమంటావ్?” అంటూ మారడు సిద్దడికి ప్రశ్నె వేస్తూ తన నాలుకలోని పరాక్రమాన్ని చూపించాడు.

ఏమి చెప్పగలడు సిద్దడు! మారడు చెప్పినట్లుగా ఊర్లోని మగమహారాజుల పరాక్రమాన్ని నిలబెట్టే విధానం అదెంతో పరోక్షమైనదని అన్పించింది అతనికి. నిరాసక్తితో “అలాగే చేద్దాంలే” అని అంటూ మాటల్ని నిలిపేశాడు.


## 8

భైరప్ప, సుబ్బయ్య, సీగేగౌడ, రామణ్ణ, కాళేగౌడ ఆ ఐదుమంది కానిస్టేబుల్ నారాయణతో పదిమైళ్ళు నడిచి పోలీస్ స్టేషన్‌కు చేరే ప్రొద్దుకు మధ్యాహ్నం అయ్యింది. ఐదారు ఇళ్ళు ఉండే చినరావూరులో కాళ్ళు, చేతులు గట్టిగా ఉండి అంత దూరం వరకూ నడిచేందుకు బలం ఉన్న వాళ్ళెవరంటే ఈ ఐదుగురు మాత్రమే కదా!

కానిస్టేబుల్ నారాయణ ఉదయానే వచ్చి "ఇన్స్పెక్టర్ గారు రమ్మన్నారని" చెప్పగా భయపడిపోయిన చినరావూరులోని కాపుజనం శంక్రప్పే త్రెచ్చి పాతేసిన బోర్డ్‌కు శాపనార్థాల్ని పెట్టూ "ఎందుకు మహాశయా" అని అడుగుతుంటే తనకేమి తెల్వదని అన్నాడు నారాయణ. ఐదుగురూ దార్లో నడుచుకొని పోతున్నప్పుడు బోర్డ్‌కు చెందిన సంబంధమో ఏమో.... ఏదో తకరారుగా ఉండొచ్చని ఊహిస్తూ ఇన్స్పెక్టర్ దగ్గర ఏమేమి చెప్పాలి అని నారాయణతో సమాలోచన చేసి ఇలాగున ఇలాగున చెప్పాలన్నదాన్ని మరలా మరలా జ్ఞాపకంలోకి పెట్టుకొంటూ స్టేషన్‌కు చేరారు. అయితే వాళ్ళందరికీ దిగ్భ్రమం అయినట్లుగా వాళ్ళు ఊహించినదానికి పూర్తి వ్యతిరేకమైన సన్నివేశం ఆ పోలీస్ స్టేషన్‌లో వాళ్ళకు ఎదురైంది.

రూమ్‌లోపల రికార్డులను చూస్తూ తల వాల్చుకొని కూర్చున్న ఇన్స్పెక్టర్‌కు "అందర్నీ లాక్కొచ్చానుసార్" అంటూ నారాయణ చెప్పిన తక్షణమే ఎవర్ని లాక్కొచ్చాడు ఇక్కడికి? వాళ్ళు చేసిన అపరాధమైనా ఏమిటి? అనేది సైతం ఇన్స్పెక్టర్ అడగలేదు. వంచిన తలను ఒక ఇంచ్ (అంగుళం) సైతం ఎత్తకనే "నాలుగుతన్ని, లోపల పడేయ్ ఆ దొంగలంజాకొడుకుల్ని" అంటూ ఆ ఇన్స్పెక్టర్ ఘీంకరించాడు. అప్పటివరకూ వాళ్ళకు ఎంతగానో హితైభిలాషిలాగా మాట్లాడుతూ వచ్చిన నారాయణ తక్షణమే తన ధ్వనినీ, థోరణినీ మార్చుకొని వీధికుక్కల్ని గదిరినట్లుగా గదురుతూ "ఏయ్ థూ! ఏమి చూస్తున్నారురో అటు? నడవండి లోనికే! బేవర్సీ వెధవల్లారా" అని తిట్టూ గొర్రెల్ని నింపినట్లుగా లాకప్‌లోకి నెట్టి "మీ పంచెల్ని, చొక్కాల్ని, కండువాలను ఇటు ఇవ్వండి, వీటితో ఏమైనా ఉరేసుకొనేదుంటే మా పీకల మీదకు వస్తది" అని అంటూ వాళ్ళు కట్టుకొన్న బట్టల్ని గుంజుకొని లాకప్‌కు తాళం వేసాడు. అతని నుంచి వచ్చిన నాటకీయ పరివర్తనాన్ని చూసిన ఆ ఐదు మంది బెదిరిపోయారు. వాళ్ళంతా నారాయణ చెప్పినట్లుగానే పరివర్తనం చెంది బోనులోపల పడిన మృగాలన్నట్లుగా ఉచ్చలతో, పాయఖానాతో దుర్వాసనల్ని పెట్టున్న ఆ లాకప్‌లోకి వెళ్ళి కూర్చున్నారు. వీళ్ళకన్నా ముందుగా చేరినోళ్ళు లాకప్‌లో అనేక చోట్ల విసర్జించిన మల మూత్రాల్ని త్రొక్కకనే కూర్చునేందుకు ఆ ఐదుగురికీ అక్కడ సరైన జాగానే లేదు.

బీదరైతులైనా మర్యాదతోనే కాలాన్ని గడుపుతున్న చినరావూరుకు చెందిన సద్గృహస్థులైన ఆ ఐదుమంది లంగోటాలతోనే లాకప్‌లోనో కూర్చునే స్థితికి వారి కళ్ళలో నీరు ఉబికి ఉబికి వచ్చింది. ఇంతైనా వాళ్ళకు తాము చేసిన మహాపరాధమైనా ఏమిటనేది తెల్వక తమతమ పూర్వోత్తరాల్ని పర్యావలోకనం చేసుకోసాగారు.



వాళ్ళను అటుండనీయండి... ఇన్‌స్పెక్టర్‌కు సహితం వాళ్ళు చేసిన మహాపరాధం ఏమిటనేది బిల్‌కుల్ గుర్తేలేదు కదా!

పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవాళ్ళు అపరాధులుగానైనా కానీయండి, పిర్యాదు దారులుగానైనా కానీయండి... అందరూ పక్కాగా దూర్తులే అనేది ఆ ఇన్‌స్పెక్టర్‌గారికి దృఢనమ్మకంగా ఉంటుండేది. స్టేషన్ లోపలికి అడుగును వేసిన తక్షణమే నాలుగు తన్నుల్ని తన్ని లాకప్‌లోకి నెట్టి మలాన్ని పారుకొనేటట్లుగా చేసి భయంతో వాళ్ళను కంట్రోలులో ఉంచొచ్చని ఇప్పటి వరకూ ఇన్‌స్పెక్టర్ నేర్చుకొన్న ఉద్యోగపర్వంలోని పాఠంగా ఉంది. కానిస్టేబుల్ నారాయణ చినరావూరుకు చెందిన ఐదుగుర్ని "లాక్కొచ్చాను సార్" అని చెప్పకుండా "పిల్చుకొని వచ్చాను సార్" అని చెప్పి ఉండుంటే బహుశః ఆ ఇన్‌స్పెక్టర్ తలెత్తి చూసే సౌజన్యమైనా కనబడేదో ఏమో! అయితే లాక్కొచ్చిన మీదట నాలుగు తన్నుల్ని తన్ని లోనికి వేయాల్సినోళ్ళే (ఆ బాధితులు) అని ఇన్‌స్పెక్టర్ భావించుకొన్నాడు.

కరియడి అర్జీని చూసిన తాశీల్దారు ఇన్‌స్పెక్టర్‌తో చినరావూరులోని రైతుల్ని పిల్చి, విచారించండని చెప్పారంతే. ఇన్‌స్పెక్టర్ బుద్ధికి ఎవర్ని, దేనికని విచారించే ప్రమేయమే

కనబడలేదు. అతని దృష్టిలో, బుద్ధిలో విచారణ అనేది మూర్ఖతనంలోని పరమావధిగా ఉంటుండేది. ఎవర్ని పిలిపించుకొని విచారించినా ఏమి చెపుతారు సత్యాల్ని అనేది అతనికి బాగానే గుర్తు ఉంది. ఎటువంటి ఎటువంటి ఖడాఖండితమైన కేడీగాళ్ళను విచారణ (ఎంక్వైరి) చేసి గట్టిగానే చార్జిషీట్‌తో వాళ్ళను కోర్ట్‌కు హాజరుపరిచితే, ఆ కేడీగాళ్ళు సులభంగానే జామీనుతో బయటపడి ఇన్‌స్పెక్టర్ గారి కన్నా ముందే కోర్ట్ బయటన రాజవీధిలో (మైన్‌రోడ్డులో) తిరుగుతుండేవారు. ఇటువంటి వాట్ని చూసి చూసే ఇన్‌స్పెక్టర్‌గారు విచారణ (ఎంక్వైరి)ను చేసేది, సాక్ష్యాధారాలను సంగ్రహించేది, చార్జ్‌షీట్‌ను తయారుచేసేది.... మొదలైన ప్రయాసకరమైన పనులకు చేతిని జొనిపి తన అమూల్యమైన కాలాన్ని పాడుచేసుకొనేదాన్ని నిల్పేసాడు. పోలీస్‌స్టేషన్ లోపలికి అడుగుల్ని వేసిన సకల సార్వజనికుల్ని లోపలే పడేసి నాలుగు తన్నుల్ని తన్ని సరిసరిగా ట్రీట్‌మెంట్ చేసి పంపేదాన్నే పరిపాఠంగా చేసుకొన్నాడు.

ఇన్‌స్పెక్టర్ చినరావూరులోని ఆ బక్కరైతుల్ని తన్నకుండానే లోపలికి నెట్టేసిన మీదట నారాయణను వెంటేసుకొని జీపెక్కి ఎక్కడికో వెళ్ళాడు. పోలీస్‌స్టేషన్ ఖాళీగా అయిపోయి అక్కడ మౌనం ఆవరించింది. పోలీస్‌స్టేషన్ లోపల చైనును (గొలుసును) గట్టిగా బిగించికట్టి తాళం వేసి ఉంచిన గదిలోని తుపాకులకు కాపలాగ కాసేందుకని ఒక సెంట్రీ మాత్రం ఆ స్టేషన్ లోన ఎక్కడో తచ్చాడుతున్నట్లుగా కనబడుతుంది. ఎందుకంటే అప్పుడప్పుడు ఖళ్‌ఖళ్ అంటూ దగ్గుతూ కాళ్ళు చేతుల్ని ఆడిస్తున్న సప్పుడు లాకప్‌లోపల ఉన్న ఈ రైతులకు విన్పిస్తుంది.

ఆ సెంట్రి అయినా వీళ్ళను మీరెవరు? ఎందుకు మిమ్మల్ని లోన పడేసారు? అని అడిగే కష్టాన్ని చేసుకోలేదు. పోలీస్‌స్టేషన్ లోపలికి వచ్చినోళ్ళను తన్ని లాకప్‌లోకి నెట్టేది, ఆ బాధితుల తరుపున ఎవరైనా విడిపించుకొనేందుకు అంగలార్చుకొంటూ ఉంటే వాళ్ళనుంచి కొద్దిగా లంచాన్ని వసూలు చేసుకొని ఎంతో ఔదార్యాన్ని చూపెట్టినట్లుగా నటిస్తూ లాకప్‌లోని డోర్ తీసేది అక్కడ నడుస్తున్న దైనందిన వ్యవహారంగా ఉన్నందున సెంట్రీకి లోనున్నోళ్ళ గురించిగాని, బయట ఉన్నోళ్ళ మీద గాని ఏ కుతూహలం లేదులే.

చినరావూరుకు చెందిన ఈ బక్కరైతుల్ని విడిపించుకొనేందుకు ఎవరూ రాలేదు. ఆ ఊర్లో ఉన్న ఆ కొద్ది మంది లాకప్‌లోనే ఉండగా, ఇక్కడ నుంచి విడిపించుకొనేందుకు వచ్చేవారు ఎవరు? అప్పుడప్పుడు డ్యూటీని ముగించుకొని డ్రెస్‌ను మార్చుకొని

పోయేందుకు వచ్చిన ఒకరిద్దరు కానిస్టేబుల్స్‌తో “మమ్మల్ని ఇక్కడి నుంచి విడిచిపెట్టండయ్యా. మేము ఏ తప్పును చేయలేదయ్యా” అంటూ వేడుకొన్నారు. ఆ అభ్యర్థనలకు “మీ వాళ్ళు ఎవరూ లేరా... జామీను ఇచ్చి తీసుకెళ్ళేందుకు? ఎవరైనా వచ్చే వరకూ ఉత్తిగనే నోర్మూసుకొని పడియుండేందుకు అయ్యేది లేదా? ఇప్పుడేమన్నా మేము మిమ్మల్ని కొట్టామా.... తన్నామా.... తోమేమా” అంటూ గదిరించారు.

స్టేషన్ బయట ప్రొద్దు మునిగి చీకట్లు అలుముకోసాగినవి. బంధితులైన ఆ చినరావూరు రైతులు ఆశ్చర్యంతో కూలబడిపోయి చింతించుకోసాగారు. తమకు ఎవరూ జామీను ఇచ్చి విడిపించుకొని పోయేది లేదని, ఏ అవధూత పురుడొక్కడూ వాళ్ళకు కన్పించలేదు.

అన్నిటికన్నా వాళ్ళకు ఎంతగా యోచించినా తాము ఏ అపరాధాన్ని చేసామనేది తెల్వలేదు. ప్రతిరోజు ఒకే తరహాలోని బతుకును చేస్తూ జీవిస్తున్న వాళ్ళకు అపరాధమే అని అన్పించే ఏ చర్యను చేసామో అనేది గుర్తు కాలేదు. అయినా మా ఎమ్.ఎల్.ఎ రోజు రోజుకూ ఎన్నెనో క్రొత్త క్రొత్త శాసనాల్ని చేస్తూ, బతుకులోని దినచరిలో ఉండేటి ఎక్కువ ఎక్కువ భాగాలను శాసనాల మూలంగా విరుద్ధంగా చేస్తూ పోతుంది ఆ బక్క రైతులకు లేశమాత్రంగా గుర్తేలే. ఈతకల్లును దొంగచాటుగా పర్మిట్ లేకుండా దింపుకొని త్రాగుతుండే ఆ జనానికి ఇప్పుడిప్పుడు ప్రభుత్వ సారాయిని సర్కారు కల్లును వదిలి వేరేదాన్ని త్రాగేది కానూనుకు విరుద్ధంగా అని తెల్సింది. దీపావళికి ముందు రోజున అడవిలోపలికి శికారికని (వేటకని) వెళ్తుండే వాళ్ళకు ఇప్పుడు అది కూడా శాసనానికి విరుద్ధమే అని పారెస్ట్ గార్డైన నంజప్పుడు చెప్పి బెదిరించాడు ఆ గ్రామీణుల్ని. అంతెందుకు.. వాగుకు అడ్డకట్టను వేసి నీటిని మరలించేది కానూనుకు విరుద్ధమే అని శంక్రప్ప మునుపెన్నడో ఆ గ్రామీణులను బెదిరించాడు కదా!

“ఏమి చేసామని మనల్ని ఈ ఉచ్చుల గుంతలో పడేసారు” అంటూ సుబ్బేగౌడ ఖాకి బట్టలోళ్ళను చూసి గొణుగుతూ అంటుండగా, అతనిలో ఇప్పుడు నిష్కారణంగా తామేదో అపరాధాన్ని చేసియుండొచ్చేమో అనే ప్రజ్ఞ ఉదయించసాగింది అతని మెదడులో.

“అయ్యయ్యో... నూరారు యాక్ట్‌లు (శాసనాలు) ఉన్నవి కదయ్యా. కూర్చుంటే కానూను, నించొంటే కానూను..... మల విసర్జనానికని చెంబుతో ఊరి బయటకు

పోగూడదనే నైర్మల్యంతో ఉండే కానూను” సీగేగౌడ హతాశుడై కొడుకు వైపుకు తిరిగి చెప్పాడు అలాగున.

“గవర్నమెంట్ మనస్సులో కక్ష పెట్టుకొంటే ఎవర్నైనా జైలుకు దొబ్బొచ్చు. ఏదేదో శాసనంలోని బైలా ప్రకారం ఏదో ఒక తప్పును వెతికేది కష్టమా? జైలు లోపలికి నిమిషాలలోనే నెట్టొచ్చు. ఉరికంబానికీ ఎక్కించేది కష్టమేమి కాదులే” అంటూ భైరప్ప నిరాశా పలుకులతో జతగలిపాడు.

‘‘ముఖ్యంగా జామీను ఇచ్చి విడిపించుకొని వెళ్ళేందుకు మనకు చెందిన సంబంధీకులు ఉండాలి కదా! ఇక్కడే ఉన్నోడు సచ్చినోడిలాగనే లెక్కకదా నాయనా” అంటూ సుబ్బయ్య మరలా గొణిగాడు అలాగున.

## 9

చీకటైంది. లాకప్‌లోని మలమూత్రాల వాసనకు వాళ్ళ ముక్కులు సర్దుకుపోయినవి. లాకప్‌లో ఎక్కడా దీపమే లేదు. చీకట్లు ముసురుతుంటే లాకప్ నుంచి నీరు వెళ్ళేందుకు గోడకు ఒక చిన్న కంతను పెట్టిన చోటు నుంచి గుంపులు గుంపులుగా దోమలు దూసుకొని వచ్చి వాళ్ళను కుట్టసాగినవి. కప్పుకొనేందుకు పంచెగాని, జుబ్బాగాని, తలపాగాగాని లేక ఉత్తిగనే లంగోటాలతోనే కూర్చున్న ఆ జనం అందరూ వంటి మీద, బుగ్గలమీద, వీపుల మీద, సున్నిత భాగాల మీద ఫట్‌ఫట్ అనేటట్లుగా దోమల్ని కొట్టుంటే ఆ చేష్టలు మతిభ్రమణంతో వాళ్ళు ఉన్నోళ్ళన్నట్లుగా కనబడుతుంది. వీళ్ళు ఫటఫటా కొట్టుకొంటున్నది స్టేషన్ లోపల ఏవేవో పటాకుల్ని పేల్చినట్లుగా సప్పుళ్ళు కలుగుతున్నందున ఒకట్రెండుసార్లు సెంట్రి గదిలోపలికి తల పెట్టి చూసాడు పరీక్షగా.

ఇంకాస్తగా గాఢాంధకారం అలుముకుంది. పెంటకు, మూత్రానికి ఒదిగి పోయినోళ్ళు దోమల దాడికీ ఒదిగిపోయారు. లాకప్‌లోని నిశ్శబ్దంలో అప్పటికప్పుడే గొర్‌గొర్ అనే సప్పుళ్ళు వచ్చినవి. లోనున్న ఆ ఐదుగురూ భయభీతులై అటుఇటు చూసారు. అక్కడ కాలువకని చేసిన ఆ చిన్న కంత నుంచి ఐదారు పందికొక్కులు లోనికి జొరబడినవి. మనుష్యులను చూసి గోర్ అంటూ గుర్రుగా చూసి బయటకు వెళ్ళినవి. అలాగున ఐదారు సార్లు చేసిన ఆ పందికొక్కులు చివరికి ధైర్యాన్ని చేసుకొని లాకప్ లోకి వచ్చి అక్కడ పడియున్న పాయఖానాను తినేందుకు ప్రారంభించినవి. పెద్ద పెద్ద పంది కొక్కులు!

తమను ఏ భాగంలోనైనా కరవొచ్చేమోననే భయంతో అవి ఒక మూలకు వస్తే వీళ్ళు ఇంకొక మూలకు జరుగుతున్నారు. ఐదుగురికీ విచిత్రమైన వేదన, భీతి హృదయంలో కొట్టుకోసాగింది. అందరూ ఒత్తొత్తుగా ఒకటై పోయి కూర్చుని ఒకరికొకరు మెల్లగా ధైర్యాన్ని చెప్పుకోసాగారు.

సుమారుగా మధ్యరాత్రి దాటియుండొచ్చు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జీఫ్ నిల్చిన సప్పుడు అయ్యింది. జనం అటు ఇటు జరబరగా తిరిగిన సప్పుళ్ళు. పోలీసులు ఎవర్నో ముగ్గురు నలుగుర్ని దొబ్బుకొంటూ వచ్చి ఖాకిడ్రెస్‌ను మార్చుకొనేందుకని ఉపయోగించే రూమ్‌లోకి నెట్టారు.

దుర్వాసన, దోమల కాట్లు, పంది కొక్కుల ఆర్భాటం... వీటి నడుమనే నిద్రమత్తులో ఉన్న చినరావూరులోని రైతులకు ఇప్పుడు వచ్చిన గడబిడ సప్పుళ్ళకు హఠాత్తుగా మెలకువ అయ్యింది. ఊరును వదిలి ఎన్నో సంవత్సరాలు అయినట్లుగా భార్య, ఇల్లు, పొలం, పిల్లలు.... ఇలాగున, అందర్నీ ఎంతో కాలం వెనక చూచినట్లుగా భావం కలగసాగింది వాళ్ళలో. తామందరూ శతాధిక వృద్ధులులాగ, లేచి నిల్చేందుకు, ఆవులించేందుకు సైతం ఊపిరేలేనట్లుగా అన్పించింది.

ఇద్దరు కానిస్టేబుల్స్ మొంబత్తి (క్యాండిల్) వెలుతురులోనే త్రాగి, కళ్ళను ఎరుపుగా చేసుకొని లోనికి వచ్చారు. మూలలో ఉంచిన లాఠీలను వెతికి ఒక్కొక్కదాన్ని తీసుకొని "ఎక్కడ దొబ్బారు వాళ్ళను" అని సెంట్రీని అడుగుతూ రూమ్‌లోకి వెళ్ళి డోర్ వేసుకొన్నారు.

అప్పటికప్పుడే లాకప్‌లోన కూర్చున్నోళ్ళ చెవులు చిల్లులు పడేటంతగా భయంకరమైన ఆక్రందనం ఆ గదిలోపలి నుంచి విన్పించింది. ఆ మీదట రపరఫగా కొట్టినట్లు ధిడ్‌బుడ్‌గా తన్నినట్లు సప్పుళ్ళు వస్తున్నవి. మరలా వికారమైన అరుపులు. అయ్యో, అమ్మో అనే అరుపులు, దొర్లటాలు....

చినరావూరు రైతులకు తామెప్పుడో చచ్చి నరకంలో కళ్ళను తెరిచామనే నమ్మకం వచ్చింది. చచ్చినా సరే ఇక్కడ్నుంచి బయటపడాలి అనే అదమ్యమైన కోరిక ఉంది వాళ్ళలో.

భయభీతులై గడ్డకట్టుకుపోయిన ఆ జనానికి ఎంతో ప్రొద్దు వరకూ ఆ రూమ్ నుంచి ఏడుపులు, పెడబొబ్బలు విన్పిస్తూనే ఉన్నవి. కొన్నైతే మనిషికి చెందిన చివరి ఆక్రందనే అది అన్నట్లుగా విన్పించింది. రూమ్‌లోపల ఉన్నోళ్ళ తర్వాత ఇక తమదే అని

ఊహించుకొన్న ఆ రైతులకు ఆ రూమ్‌లోని అరుపులు, కేకలు, ఏడుపులు క్షీణమౌతూ ఉన్నప్పుడు వీళ్ళలో భయం ద్విగుణీకృతం గాసాగింది. గుదాన్ని సరిగా నేలకు ఆనించకనే ఒకరినొకరు ఒత్తుకొని కూర్చున్నరైతులలో ఎంతగా మనస్సును అదుపులో పెట్టుకొంటున్నా ఆ వణుకుడును ఆపేందుకు సాధ్యమే గావట్లేదు.

ఆ రూమ్‌లోని డోర్‌ను తెరిచి ఇద్దరు కానిస్టేబిల్స్ చెమట్లను కక్కుతూ బయటకు వచ్చి ఇన్‌స్పెక్టర్ రూమ్‌కు వెళ్ళారు.

“సరిగ్గా కాళ్ళు చేతుల్ని విరిగినట్లుగానే కొట్ట్యాం సార్”

“విరిగితే విరగనీ... నేను చూసుకొంటానులే”

“పైకి లేచి నిలబడేది వాళ్ళలో లేదు సార్”

“మంచి పనే చేసారులే. ఇక వెళ్ళి సుఖనిద్రకు జారండి”

“వాళ్ళను ఏమి చేద్దాం సార్”

“చేసేదేముంటది. మరలా నాలుగు తన్నుల్ని తన్నండి. ఆ ఉచ్చగుంతల లాకప్‌లోకే నెట్టండి”

“దాంట్లో స్థళం లేదు సార్”

“ఎందుకని”

“ఉదయాన ఐదుగురు రైతుల్ని దాన్లోకే దొబ్బాం కదా సార్”

“ఏయ్... ఎవరయ్యావాళ్ళు? ఎందుకు లోనికి దొబ్బారు?”

“మీరే చెప్పారు కదా సార్”

“ఛూ! ఎవరయ్యా వాళ్ళు. తోలుకు రండి ఇక్కడికి” ఇన్‌స్పెక్టర్ హుకుంతో కేక పెట్టాడు.

కానిస్టేబిల్ లాకప్ నుంచి వాళ్ళను తోలుకొచ్చేందుకు వెళ్ళినప్పుడు చినరావూరు రైతుల ముఖాలు సాక్షాత్ శవాలకున్నట్లుగా ముఖాలు లాగ ఉన్నవి. జీవకళే ఇంకిపోయింది వారి ముఖాలలో.

"ఎవర్రా మీరు... ఇక్కడికి ఎందుకు వచ్చార్రో?" అంటూ ఘర్జించాడు ఇన్‌స్పెక్టర్.

ఆ ఐదుగురికీ ఎంతగా ప్రయత్నించినా ఆ ప్రశ్నెకు జవాబు దొరకలేదు. భూత, భవిష్యత్ కాలాల్ని పోగొట్టుకొన్న ఆ జనానికి కేవలం వర్తమానంలోని అస్థిత్వం మాత్రమే మిగిలి ఉంది. నిశాచరుల ప్రపంచం ఒకదానిలో వేలాడుతున్న ప్రేతాలు (దెయ్యాలు) అన్నట్లుగా పిలిపిలిగా కళ్ళను తెరుస్తూ ఇన్‌స్పెక్టర్ ముఖాన్నే చూడసాగారు.

"ఏంటర్రో... నా ముఖాన్నే చూస్తున్నారు? నేనేమన్నా రాష్ట్ర ముఖ్యమంత్రినా...! మొరగండిరా దొంగలంజా కొడుకుల్లారా?" అంటూ చెంతనున్న సుబ్బేగౌడడి కపాలం మీద ఇన్‌స్పెక్టర్ ఒక వేటు వేసాడు. దెబ్బపడినా మూగోళ్ళలాగానే ఉన్న వాళ్ళను చూసిన నారాయణే "ఉదయాన చినరావూరు నుంచి పిల్చుకొనిరా అని మీరే చెప్పారు కదా సార్" అంటూ జ్ఞాపకాన్ని చేసాడు.

ఇన్‌స్పెక్టర్ సార్ సైతం త్రాగియున్నాడు. ఎంతగా యోచించినా అతనికి ఒక క్షణం వీళ్ళెవరని తెల్వలేదు. చివరికి ఏదో జాతి కలహం గురించి విచారించండని తాశీల్దారు చెప్పింది అస్పష్టంగా జ్ఞాపకానికి వచ్చింది.

"ఎంట్రోయ్... జాతి జగడాన్ని చేసుకొంటున్నారా ఊర్లో? ఇంకొకసారి నిమ్న కులస్తుల తంటకు ఏమైనా వెళ్తే భూతాన్ని విడిపిస్తాను మీకు . అంటచబిలిటి కేసును పెట్టి ఒక సంవత్సరం జైలుకు పంపుతాను. హుషార్ కొడుకుల్లారా...!" అని అరుస్తూ అందరికీ ఒకొక వేటును నెత్తిమీద వేసి "పంపేయండి వీళ్ళను ఇక్కడ్నుంచి" అంటూ నారాయణకు ఆర్డర్ చేసాడు. మూగోళ్ళలాగ మరో మాటను మాట్లాడకనే, లైనుగా వెళ్తున్న ఆ రైతుల్ని పిలిచి పంచెల్ని, టవళ్ళను, జుబ్బాలను ఇస్తూ "బతికిపోయారు ఈరోజున" అన్నాడు నారాయణ.

మొత్తానికి ఆ ఐదుగురికీ లాకప్‌లో ఇక వేరే వాళ్ళకు జాగాలేనందునే ఆ అపరాత్రిలో బంధవిముక్తి కలిగింది. బయట కటిక చీకటి. కొరుకుతున్న చలి. ముందేంటనేది ఆ ఐదుగురికీ తోచకున్నా, బయటున్న ప్రపంచంలోకి, ఒక దుఃస్వప్నం నుంచి బయటపడ్డాం అన్నట్లుగా ముందుకే నడవసాగారు.

ఎవరిలోనూ పరస్పరంగా మాట్లాడుకొనేందుకు ఇష్టం కాలేదు.

# 10

పోలీసులు చినరావూరులోని మూడు నాలుగు ఇళ్ళలోని రైతులను స్టేషన్‌కు త్రోలుకెళ్ళింది చుట్టుప్రక్కలోళ్ళందరికీ గుర్తైనా ఏదో విచారణకు పిల్చుకెళ్ళి ఉండొచ్చని వారు అనుకొన్నారే తప్పితే లాకప్‌లో పడేసారనేది తెల్వలేదు. వాళ్ళకు జామీను ఇప్పించి విడిపించుకొని వచ్చే ప్రమేయం ఉంటదని తెల్సుకొని ఉండుంటే, ఆ రైతుల భార్యల తరుపునోళ్ళు తమతమ జమీన్ (పొలం) పహణీలను తీసుకొని వాళ్ళకు జామీను ఇప్పించేందుకు ముందుకు వచ్చేవారేమో. ఆ ఐదుగురికీ కపాలం మీద ఒకొక వేటును వేసి, జాగ్రత్తల్ని చెప్పి మధ్యరాత్రిలో బయటకు దొబ్బినప్పుడు (గెంటినప్పుడు) వాళ్ళకు తాము చెప్పేందుకు, వినేందుకు ఎవరూ లేని అనాథలు అన్నట్లుగా భావన ఉంది. కారణం లేకనే సంభవించిన దురంతం అయినందున ఇదొక రీతిలోని విధి. తమ నుదురులో బ్రహ్మ లిఖించిన రాత ఇది అని అనుకొన్నారు.

ఇంకొకసారి నిమ్న కులస్తుల తంటకు (జోలికి) వెళ్తే అంటచబిలిటి యాక్ట్‌లోని కేసును పెట్టి ఒక సంవత్సరం జైలుకు వేయిస్తాను అని వాళ్ళను స్టేషన్ నుంచి బయటకు దొబ్బుతూ ఇన్‌స్పెక్టర్ ఘర్జించకుండా ఉండుంటే ఆ రైతులు గ్రామసేవకుడి బోర్డ్‌ను ఎవరో పీకేసినందుకే తమకు ఈ పరాభవం అని తెల్సికొని ఉండేవారో ఏమో! ఇప్పుడు తమ ఊర్లోని దలితులే తమ మీద ఏదో పుకారును (కంప్లైంట్‌ను) ఇచ్చియుండొచ్చనే అనుమానంలోని రేఖ ఒకటి వాళ్లలో ఉంది.

పదిమైళ్లు పొలాల నడుమ మంచులో పంచెలన్నీ నానిపోయి ఆ చలిలో నడుచుకొంటూ వస్తున్న ఆ ఐదుగురు ఈ అనుమానం మీదే మాట్లాడుకోసాగారు. మడులలోని గట్లు అందాజు గుర్తుగాక ఎటెటో అడుగుల్ని వేస్తూ అనేకసార్లు వరిమడులలోని నీటిలో పడ్తూ లేస్తూ నడిచారు ఎంతో కష్టంగా.

పడ్తూ లేస్తున్నందుకో, చలికో, పంచెలన్నీ తడ్సినందుకో మొత్తానికి వాళ్ళకు దలితుల మీద కోపం పెరిగింది.

“పాడుజనం, ఆ దలితుల సహవాసం మాత్రం ఇకముందు మనకొద్దు” అంటూ కాళ్ళకంటుకొన్న బురదను మెల్లగా అటుఇటు పూస్తూ కాళేగౌడ కోపంగా అన్నాడు.

“వాళ్ళ సహవాసంకు వెళ్ళినోళ్ళెవరు? దాన్నే ముందు చెప్పు? మనపాటికి మనం ఉన్నా పోలీసోళ్ళు కేసును పెట్తాం అని అంటుంటే, మనమిక ఈ ఊరును వదిలి

వెళ్ళిపోయేదొకటే బాకీగా మిగిలియుంటది" అని సీగేగౌడ కాళేగౌడడి మాటలకు జవాబును చెప్తూ "ఎవరు కంప్లైంట్‌ను ఇచ్చింది అనేదేమైనా తెలిస్తే వారి వద్దకు వెళ్ళి అడగొచ్చు. మేము ఏమి తప్పు చేసాం అని అడగొచ్చు. లేకపోతే ఈ పనిని (కంప్లైంట్‌ను) చేసిందాన్లో ఎవరుండొచ్చు అని శోధించేది ఉంటది" అంటూ గట్టిగానే స్వగతంలోని ధాటిలో యోచించారు సీగేగౌడ.

"దీన్ని మనం కచ్చితంగా ఇక్కడికే వదిలేయకూడదు. పంచాయితి పెట్టి ఎవరు కంప్లైంట్ ఇచ్చారు? ఎందుకని ఇచ్చారు? నలుగురు పెద్ద మనుషులను పిలిపించుకొని విచారణ చేయాల్సిందే" అంటూ కాళేగౌడ దృఢ నిశ్చయంతో అన్నాడు.

"మన ఊర్లో ఇక పశువులు సస్తే, వచ్చి ఎత్తుకొని వెళ్ళండని వాళ్ళకు చెప్పగూడదు" కోపంతో అన్నాడు సుబ్బేగౌడ.

"ఇది పల్లెలోని కరియడి పనే అని నాకు అనుమానం వస్తుంది. వరి పొలం పాడైనందుకు నష్టాన్ని భర్తీ చేస్తారని గవర్నమెంట్‌కు అప్లికేషన్ ఇవ్వాలని అన్నాడు. ఏమి అప్లికేషన్ ఇచ్చాడో? ఏమేమి రాయించాడో? రాసినోడు శంక్రప్ప. వేలిముద్ర ఒత్తినోడు కరియ. పంచాయితి పెట్టి విచారణ చేపిస్తే అంతా బయటపడుతది" అంటూ భైరప్ప ఆ విషయాన్ని బలపర్చాడు.

సీగేగౌడ వారి అభిప్రాయాలకు తన అసమ్మతి సూచించుతూ "చూడండి, పంచాయితి వద్దు, మరి ఇక ఏమి వద్దు. అక్కడ మాటలకు ప్రతిమాటలు పుట్టి ఇంకేదైనా వేరే కంప్లైంట్‌లు ఎదురైతే? పంచాయితీకి వచ్చినోళ్ళలో ఎవడైనా ఒకడు నాటు (విప్ప) సారా త్రాగి విచారణ చేస్తూ ఒక వేటు ఆ దలితుల మీద వేసాడు అని అనుకో. మరలా కంప్లైంట్ మీద బడేది ఎవరి తలలకు? మనకే కదా...! అందుకే మనపాటికి ఆ వెధవ కొడుకులు చచ్చారనే భావించుకొని, వాళ్ళకు దూరంగానే (ఎడంగానే) ఉండేది మంచిదంటూ" సలహా ఇచ్చాడు.

తెల్లారుతుంది. గాలి నిశ్చలంగా ఉంది. చెట్లలోని ఒక ఆకూ కదలాడటం లేదు. పొలాల నుంచి అడవిలోపలికి, అడవిలోపలి నుంచి మరలా పొలాల మధ్యకు ఎక్కుతూ దిగుతూ అంకుడొంకులతో ఉన్న ఆ కాలిబాటలో నడుస్తున్న ఆ జనానికి మంచు ముసుగులోనే తమ తమ పొలాలు, అడవి నుంచి బుర్‌మంటూ ఎగిరిన లక్షలలోని పక్షులు అక్షింతల్ని చల్లినట్లుగా ఆకాశంలోకి చిమ్ముకొని కీకీ అంటూ కలరవం చేస్తూ

కనుమరుగౌతున్నవి చూచాయిగా కనబడసాగావి. రాత్రంతా పండ్ల చెట్లలో వేలాడుకొని, ఆ ఫలాల రసాల్ని గ్రోలి తమ పొట్టల్ని నింపుకొన్న గబ్బిలాలు తమ రెక్కల్ని విదిలించుకొంటూ ఎక్కడికో తమకు పరిచితమైన స్థలాలకు వెళ్తున్నవి. దూరంలో పెంకుల నుంచి బయటకు వస్తున్న కట్టె పొయ్యిలలోని పొగల నుంచి చినరావూరులోని ఆ కొద్ది ఇళ్ళన్నీ వాళ్ళకు కనబడే ప్రొద్దుకు పొగమంచును చీల్చుకొని సూర్యుడి ఉషోదయ కిరణాలు ఊరును తట్టి ముట్టినవి. ఆ ఐదుగురికీ అప్పటికప్పుడే ఊరిమీద మమత ఉక్కి ఉప్పొంగింది. అందరిలోనూ తమకెదురైన సంఘటనలు క్షమార్హమైనవిగా కనబడినవి. ఊరు వదిలి ఎన్నో రోజులైనట్లుగా ఎంతో దూరానికి వెళ్ళినోళ్ళలాగ సరసరా ఊరు వైపుకు అడుగుల్ని వేసారు.

అయితే ఊరు ఎంతో దగ్గర పడినప్పుడు సూర్యోదయం నుంచి వాళ్ళలో కల్గిన ఉన్మేషం ఇంకిపోసాగింది. కొట్టాల నుంచి బయటకు విడిచిపెట్టిన పశువులు, దూడలు ఇకనూ నిద్ర మంపరులోనే కళ్ళను మూసుకొని, నెమరేస్తూ నిర్లిప్తంగానే నడుచుకొని వెళ్తున్నవి. వాటి వెనకే చేతిలో పంగాల కర్రను, వేణువును పెట్టుకొని పశువుల్ని కాసే పిల్లలు ఈలల్ని వేస్తూ వస్తున్నారు. ఇళ్లలోని రోళ్ళనుంచి వడ్లను దంచే సప్పుళ్ళు వినిపిస్తున్నవి. రోకళ్ళ శబ్దాలు... తమపాటికి తాము అన్నట్లుగా యథాప్రకారంగా నడుస్తున్నవి. తాము పుట్టినప్పుడూ ఇలాగే ఉంది. తాము సచ్చిన మీదటా ఇలాగే ముందుకే నడుస్తది కాలం. తాము ఉంటే ఎంత! సస్తే ఎంత! తమకైన ఘోర అవమానం, దౌర్జన్యం తమకు మాత్రమే పరిమితం అని అన్పించింది వాళ్ళకు.

వాళ్ళ ముఖాల మీద, తలల మీదున్న ఒత్తొత్తు కేశాల మీద మంచు తెల్లగా వెండిలాగ కూర్చునిపోయి, విచిత్రంగా కనబడుతున్న వీళ్ళను ఎవరో కొత్తోళ్ళనట్లుగా ఆ పశువులను కాసే పిల్లలు చూడసాగారు. ఇళ్ళ నుంచి బయటకు చిమ్ముతున్న పొగ, దగ్గుతున్న శబ్దాలు, ముడుచుకొని వెచ్చగా పడుకొన్న గ్రామ సింహాల (కుక్కల) నిద్ర.... ఇవన్నీ ఒక విధమైన అసాధారణ స్తబ్ధతకు ప్రతిమలు అన్నట్లుగా ఉన్నవి.

## 11

మారడు సిద్దడు, భైరప్ప ఇంటికి ఎదురుగాపడిన పనస చెట్టులో ఇరుక్కుపోయిన రంఫాన్ని తీసేందుకు ఏవేవో ప్రయత్నాల్ని చేస్తున్నారు. వాళ్ళను చూసిన తక్షణమే అసహనంతో ఉన్న భైరప్పకు ఎందుకో కోపం వచ్చింది.

“మహాశయులారా... ఆ పనిని అక్కడికే ఆపేయండి. నా రంఫాన్ని ఎలాగెలాగో తీయించుకొంటానులే. మీరు నన్ను ఉద్ధారం (ఉద్ధరించింది) చేసింది చాలు” అని ముఖం మాడ్చుకొని పెడసరంగా వాళ్ళతో అన్నాడు. ఉదయాన లేచిన తక్షణమే ఈ రోజున ఎలాగైనా చేసి చెట్టు దిమ్మె నుంచి రంఫాన్ని బయటకు తీయాలనే దృఢ నిశ్చయంతో వచ్చిన మారడికి సిద్ధప్పకూ భైరప్ప కట్టె విరిచినట్లుగా అనిన మాటల నుంచి ఎంతగానో అవమానమైంది. పనిని ఆపి ఒక క్షణం ఆ ఇద్దరూ భైరప్పను గుడ్లప్పగించి చూసారు.

మొన్న తనే “ఆ వృక్షాన్ని కోసి ముక్కలుగా నరికి పుణ్యం చేసుకొండ్రో” అంటూ కాళ్ళా వేళ్ళాపడిన భైరప్ప ఇప్పటికిప్పుడు తన ధోరిణిని మార్పు చేసుకొని “మీరు ఉద్ధరించింది చాలు” అని అంటుంది వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు. మరో మాటను పలకకనే తమ పనిని నిల్పేసి వీధి వైపుకు నడిచారు.

“ఏంటో, ఈ గౌడకు బుద్ధి నియంత్రణలో ఉన్నట్లుగా కనబడుట లేదు కదయ్యా. రోజుకొక తరహాగా మాట్లాడేది చేస్తున్నాడు. తిక్కలోడు మన గౌడ” అంటూ కొంచం దూరం వరకూ నడిచి వచ్చిన మీదట సిద్దడు మారడితో అలాగున అన్నాడు.

“పోలీసోళ్ళ దగ్గరకు వెళ్ళి ఏమేమి అగచాట్లు పడ్డారో ఏమో కదయ్యా. రాత్రంతా అక్కడే కూర్చోబెట్టుకొని ఇప్పుడు వదిలేసారు. ఆ కోపం నుంచే మనమీద రేగినట్లుంది కదా! ఆ గౌడడి నోరు కొంచం దురుసు కదయ్యా! ఈ ఊర్లో మరిక ఎవరున్నారు అతనికి చెట్టును తునకలు తునకలుగా చేసి ఇచ్చేందుకు? అదీ మనం సగం కోసి వదిలేసిన మీదట వేరేవాళ్ళు ఎవరు ఆ చెట్టుమీద చేతిని వేస్తారు? మరలా దండాలే పెట్టుకొంటూ మన వద్దకు వస్తాడులే” అంటూ సిద్దడికి నెమ్మదిని చెపుతున్నట్లుగా దయాగుణంతో మాట్లాడిన దాన్ని చూసిన సిద్దడికి కోపం ఇప్పుడు మారడి మీద తిరిగింది.

“పోలీసోళ్ళ మీద కోపం ఉంటే ఆ స్టేషన్‌లోనే చూపించనీ. అక్కడ దురుసుగా మాట్లాడితే గుదం మీద తన్నులు పడ్తవని భావించుకొని ఇక్కడ మన మీద ఎగిరేది ఉంటదా? నడుం వంచి మూడు రోజులు కోసాము కదా మహాశయా. ఇతడి తాత ఇస్తాడా మన కూలిని? మరొకసారి చెట్టును కోయి (నరుకు) అంటూ వస్తే అతడు, నువ్వు ఒకటైపోండి. నా తంటకు (జోలికి) మాత్రం రాబోకు” అంటూ సిద్దడు రేగాడు.

ఇందుమూలంగా చిన్న ఊరైన చినరావూరు లోన ఉన్న ఐదారు ఇళ్ళతో ఉండే ఒక్కళిగులకు (కాపులకు), నాల్గైదు ఇళ్ళతో అలరారుతుండే దలితులకు సంబంధాలు

బిగుసుకు పోవసాగినవి. అయితే అందరూ బీదోళ్ళే అయినందున ఆ ఊర్లో ఆర్థిక అవలంబనం పరస్పరం ఎక్కువగా లేనందువలన మిగిలిన ఊళ్ళలోలాగ తక్షణమే వికోపానికి వెళ్ళే అస్ఫోటక (ఉద్రిక్త) పరిస్థితి ఉండేది లేదులే అక్కడ. జతగా దీనికి దానమ్మలోని గాలికూడా ఒక కారణంగా ఉంది. గయ్యాళి దానమ్మ వెనకాముందూ చూడకనే అన్పించిందంతా అంటూ మహిళలలోని సుషుప్త భావనలకు నోటిని ఆసరాగా ఇవ్వటాన్ని ప్రారంభించితే, చినరావూరులోని మహిళలందరూ కేవలం తమతమ మగోళ్ళను సంతృప్తి పరిచేందుకే ఆమెను గయ్యాళి అని దూషిస్తున్నా, లోలోపల ఆమె ద్వారా తమలో దాగిన ఆకాంక్షలను చూసుకోసాగారు. మొగుళ్ళ ఇష్టాలకు తగినట్లుగా తైతెక్కలాడేందుకు వాళ్ళెవరూ ఇప్పుడు తయారైలేరు కదా! అందుచేత వీళ్ళ జాతి మనస్తాపాలకు మహిళల నుంచి సరైన ప్రోత్సాహం దొరకక అది కేవలం మనస్సులలోనే నిక్షిప్తమై పోయింది.

చెట్టును కోస్తున్న మారడ్ని, సిద్దడ్ని పని నుంచి ఆపి పంపేసిన తర్వాత ఆ పెద్ద పనస చెట్టు మొదలు భాగం అలాగే పడియుంది. దాన్ని ఎలాగైనా చేసి ముక్కలుగా చేయించి దానిలోపల ఇరుక్కుపోయిన తన రంఫాన్ని బయటకు తీయించాలని భైరప్ప పేట (పట్టణం)లో కలియతిరిగి "సోన్స్" అనే క్రిస్టియన్ మతస్తుడ్ని వెంటేసుకొని వచ్చాడు. చెట్లను కోసేదాన్లో నిష్ణాతుడైన అతను చెట్టును ముట్టుకొంటే చాలు అతను చెప్పినట్లే వింటదని కలప మిల్లుకు షావుకారైన కృష్ణేగౌడ రాత్రికి రాత్రే దొంగతనంగా చెట్లను నరికించి, కోయించి స్మగ్లింగ్ పనులను చేసేందుకు ఎల్లప్పుడూ ఇతడ్నే (సోన్స్‌నే) పిలిపించుకొంటాడని, సోన్స్‌కు సహాయకుడిగా పనులను చేస్తున్న మళయాళి వ్యక్తి భైరప్పడి వద్ద సిఫారస్‌ను చేసాడు. చెట్లను కోయటంలో అతనికున్న మంత్రశక్తిని విన్నమీదట భైరప్ప అతనికి ఒక బస్తా వడ్లను ఇస్తానని ఒప్పుకొని అతడ్ని వెంటేసుకొని వచ్చాడు.

చూస్తే నువ్వు వచ్చేటట్లుగా ఉండేటి ఆ ఇద్దరు బక్కపీనుగులైన నరనారాయణులు పెద్దమ్రానులను పడద్రోసి ముక్కలుగా కోసి వాటిని రవాణాగా చేస్తారంటే ఎవరూ నమ్మేది సాధ్యం కాదులే. మళయాళపోడు వివరించినట్లుగా సోన్స్‌కేమైనా మంత్రశక్తి ఉంటేనే మాత్రం అతనికి సాధ్యం ఉంటదేగాని వినః అతని స్వశక్తి మీద భైరప్పకు ఏమి నమ్మకం లేదు. తన ఇంటి ఎదురులో పడిన ఆ భీమాకారపు చెట్టును సోన్స్ మరియు మళయాళి... ఆ ఇద్దరి ఎదురు పోల్చి సరిచూసుకొని భైరప్ప ధైర్యం చేసుకొని వాళ్ళను పిల్చుకొచ్చింది

అతనిలో మహత్యాల మీద నమ్మకం ఉన్నందుచేతనే త్రప్పితే మినహా ఆ ఇద్దరిలోని పనితనాన్ని నమ్మి ఖండితంగానైతే కాదులే.

వాళ్ళిద్దరూ ఊర్లోకి వచ్చింది మొర, సిద్దడికి తీవ్రమైన అసంతోషానికి కారణమైంది. తమకు దొరకాల్సిన వడ్లు (ధాన్యం) వాళ్ళకు పోతవి కదా అనే దాని కన్నా తాము ఊరికి అనవసరం అని అన్పించి అసహ్యం అయ్యింది.

సోన్స్ మరియు మళయాళి ఆ ఇద్దరూ తమ పనితనం మీద ఎంతెంతో బడాయిని చేసారు. ఎంతెంతటి చెట్లను ఏఏ దిక్కులకు ఎలాగెలాగున పడేసాము... తమ పనితనాన్ని చూసిన సామిల్‌లోని షావుకార్లు ఎంతెంతగా బహుమానాల్ని ఇచ్చారు అని భైరప్పతో నిరంతరంగా కోతల్ని కోసారు. వాళ్ళ బడాయిలోని పరమావధి ఎంతగా ఉందంటే కృష్ణారెడ్డి గారి ఏనుగు సైతం దొబ్బలేక అలిసిపోయిన మీదట, ఆ మొద్దుల్ని (దుంగల్ని) సోన్స్ చెంగ్‌నే లారీ మీదకు ఎగిరించి కూర్చున్నట్లుగా చేసింది చెప్పగా, చెట్టును కోసి పడేసేదాంట్లో ఇంతగా ఒక సూక్ష్మ కళాత్మకం ఉంటదని భైరప్ప ఊహించియుండలేదు ఇప్పటి వరకూ.

ఎంతో మట్టంలో బడాయి మాటలన్నిటినీ ఠీంకారంగా చేసుకొంటూ వచ్చిన ఆ ఇద్దరూ భైరప్పడి ఇంటి ఎదురులో పడియున్న పర్వతంలాగ ఉన్న చెట్టును చూసినప్పుడు మాత్రం కొద్దిగా అధీరులైయ్యారు. చెట్టు ఎంతగానో పెద్దదిగానేఉందని భైరప్ప మొదటే మున్సూచన చేసాడు. అయినా వాళ్ళు ఆ వృక్షం ఇంత పెద్దదిగా ఉంటదని ఊహించలేదు. జతగా అది గంజి పెట్టిన ముతక ఖద్దరు బట్టలాగ మెలికలు తిరిగిన చెట్టు కదా!

“అరెరె! ఇదెంతో చేవతో ఉన్న చెట్టు. దీన్ని మీరు మాతో చెప్పనేలేదు. ఈ చెట్టును ముక్కలుగా చేసేందుకు డబుల్‌గా పనిపడుతది” అంటూ సోన్స్ మెల్లగా తకరారు (ఆక్షేపణాన్ని) చేసాడు.

“మాకు అదంతా ఏమి గుర్తుగా అవుతది మేస్త్రి. చెట్టు అంటే చెట్టే కదా! దానికి చేవ ఉంటది అనేదంతా ఆ కట్టెల్ని కొట్టే మీలాంటోళ్ళకే తెలుస్తది” అంటూ భైరప్ప గీసిగీసి బేరాన్ని చేసేందుకు రెడి అయ్యాడు. డబుల్‌గా పని అన్న మీదట రెండు బస్తాల ధాన్యానికి ఇతను ఉపాయాన్ని చేస్తున్నాడని తెల్సుకొన్నాడు.

"ఇది భారీగా ఉన్న పురాతన చెట్టు. దీనికి లోన చేవతో ఉన్న గర్భం ఉంటదో ఏమో" అంటూ మళయాళి సోన్స్ నుంచి వస్తున్న ఆక్షేపణాలకు ఇంకాస్తగా కొంకు మాటల్ని జతగలిపాడు.

"మేమైతే కోస్తామయ్యా. మేము ముట్టుకొన్న మీదట పనిని ఆపేది లేదు. మాకు దీన్లో ఒక పైసా ప్రాఫిట్ (లాభం) వద్దు. మీకు ఒక ఉపకారం చేద్దామని భావించి మేము వచ్చాం. అయితే పని ఎంతగానో బిగువుగా ఉంటే, మీరు మా కష్టాన్ని చూసి ధాన్యాన్ని ఇచ్చేది ఉంటది. మరలా మేము చెప్పిన చివరి మాట అని అంటూ మమ్మల్ని నిరాసపెట్టకండి" అంటూ తనలోని అధైర్యాన్ని చూపించుకోకనే సోన్స్ ఆ చెట్టు కాండంలో సగంలోనే ఇరుక్కుపోయిన రంఫాన్ని చూసి "చేతగాని వెధవుల చేతికి రంఫాన్ని ఇచ్చింది మీ నుంచి మొదటి తప్పుగా ఉంది. మొద్దు క్రిందన అద్దుడు పీఠను పెట్టకనే ఇటువంటి చెట్టును కోసేందుకు పనినే బాగా తెల్సి చేస్తున్నోడెవడైనా చేతిని నిలుపుతాడా? ఇప్పుడు మాకు ఒకదానికి ఇంకొకటి చేరి పని డబుల్‌గా అయ్యింది కదా! ఈ రంఫాన్ని ఇరికించినోడు ఎవడో వాడ్ని పిల్చుకొని రండి... అడుగుతాను, రంఫాన్ని బయటకు తీసేందుకు కూలి ఇస్తావా అని" అంటూ నూరారు రకాలుగా క్రితంలో పనిని పట్టుకొన్నోళ్ళను విమర్శించాడు. రంఫాన్ని ఇరికించినోళ్ళు దలితులని తెల్సుకొన్న మీదట "చూడండి, దేవుడు ఒకొక పనికి ఒకొక జాతిని చేసాడు. అది వదిలి వేరేదానికి చేతిని వేయగూడదు మనం. ఇప్పుడు మీరు బంగారం పనిని చేస్తానని మీ అర్ధాంగి మెడలోని తాళిబొట్టును తీసుకొని బంగారాన్ని కాల్పించితే ఏమౌతదో చెప్పండి మీరే" అంటూ తన వాదనలను సమర్థించేందుకని భైరప్పకూ, ప్రక్కనే నిలబడియున్న సుబ్బేగౌడకూ తిక్కలాజిక్‌తో ప్రశ్నను వేసాడు.

భైరప్పడు, సుబ్బేగౌడ సోన్స్ ప్రశ్నెకు ఆలోచనతో యోచించి జవాబును చెప్పే స్థితిలో లేరు. వారికి మూడు పగళ్ళు మూడు రాత్రులుగా సుడిగాలి వీసిన తర్వాత ఒక్కొక్కటిగా లైనుగా నడిచిన ప్రకటనల దశ నుంచి తల రోసిపోయింది. ఎందుకు ఏమిటి అని చెప్పకనే పోలీసోళ్ళు స్టేషన్‌కు పట్టుకెళ్ళింది, అక్కడ అప్పటికప్పుడే పేర్లను, కులగోత్రాల్ని పోగొట్టుకొని పశువులన్నట్లుగా లాకప్‌లోకి నెట్టబడింది, ప్రక్క రూమ్ నుంచి వినబడిన భీకర అరుపులు, ఏడ్పులు, ఆర్తనాదాలు, కొట్టాలని (చితకబాదాలని) త్రాగివచ్చిన పోలీసులు, మరలా అప్పటికప్పుడే లోపలికి వెళ్ళినట్లుగానే నిష్కారణంగానే అక్కడ్నుంచి బయటకు దొరికిన విడుదల......ఇవన్నీ వాళ్ళకు ఒక ఆధ్యాత్మిక అనుభూతి లాగ తమ

జీవం మరియు జీవనం కేవలం ఆకస్మికమే (క్షణభంగురమే) అని అన్పించసాగింది. అందుచేత సోన్స్ ప్రశ్నెకు ఏమి జవాబును చెప్పకనే తలలను ఆడిస్తూ నిరాసక్తితో నిలబడియున్నారు.

సోన్స్ మరియు మళయాళి తమ యోగ్యతకు మీరి బడాయిని చెప్పుకొంటున్నా వాళ్ళలో పనితనమూ సరైనంతగానే ఉంది. వృక్షానికి అడుగున పీఠల్ని, కట్టెల్ని మొదలైన వాట్ని పెట్టి, ఏమేమో మీటుతూ,కొట్టూ, ఆ మ్రొద్దుకు సగంగానే కోసిన ఆ భాగంలోని నోటిని కొద్దిగా సడలించి సఫలులైయ్యారు. దాని నోటికి మైనం జిగురు కారి రంఫాన్ని అటుఇటు కదిలినట్లుగా చేసి చుట్టూ నిల్చిన మార, కరియ, సిద్ధ, కాళేగౌడ.... అందరూ నోరెళ్ళబెట్టినట్లుగా రంఫాన్ని బయటకు తీసారు. ఆ తర్వాత ఒక గంటలో అక్కడ నిల్చినోళ్ళంతా సోన్స్ బడాయిని ఒప్పుకోవాల్సి వచ్చింది.

చినరావూరులోని దలితులకు ఒక్కళిగులు (కాపుకులస్తులు) తమను దూరంగా ఉంచుతున్నది గమనంలోకి వచ్చింది. వాళ్ళను త్రప్పించి వేరే వాడొకడు వచ్చి రంఫాన్ని తీసింది వాళ్ళ ఆత్మగౌరవానికి భంగం కలిగింది. వారు కూడా ఒక్కళిగుల నుంచి దూరం కాసాగారు.

## 12

"ఎక్కడుంది నీ బలం"
"ఐస్సా"
"ఇదేమి గొప్ప"
"ఐస్సా"
"ఇంకొకసారి"
"ఐస్సా"
"పడేపడ్తుది"
"ఐస్సా"
"ఏ శభాస్ బిడ్డా"
"ఐస్సా"

సోన్స్, మళయాళి, సుబ్బేగౌడ, కాళేగౌడ, భైరప్ప.... ఆ ఐదుమంది సోన్స్ కోసేసిన చెట్టు మొదలు భాగాన్ని ఇంటి ఎదురు నుంచి ఆ ప్రక్కకు దొర్లించేందుకని ప్రయత్నిస్తున్నారు. ఆ చెట్టుకున్న కొమ్మ రెమ్మలన్నిట్నీ అంతకు మునుపే కొట్టి ఊరోళ్ళందరూ వంటకని కట్టెలుగా చేసుకొని ఇళ్ళకు సాగనంపారు. ఇక మిగిలింది మాత్రం ఆ వృక్షాన్నికున్న మొదలు మాత్రమే. పెనవేసుకొన్న చెట్టైనందున రంఫంతో రెండు చోట్ల ముక్కలుగా (భాగాలుగా) చేసేందుకు సోన్స్‌కు రెండు రోజులు పట్టింది. పది నిమిషాల కొకసారి రంఫాన్ని బయటకు తీసి, దాన్ని పళ్ళను సానబెట్టేది, సుత్తితో తట్టేది, మైనం జిగురు పట్టకుండా ఉండేందుకు నూనెను పూసేది జరిగింది. పని ఎంతో కష్టంగా ఉందని చూపించేందుకే ఇదంతట్నీ నాటకంగా ఆడుతున్నాడని భైరప్ప శంకించినా, ఎలాగోలా ఆ చెట్టు దిమ్మెను ఇక్కడ్నుంచి అటువైపుకు దాటించితే సరి అని మాట్లాడకనే నిధానంగా ఉన్నాడు. చివరికి వాళ్ళు ఆ చెట్టును ముక్కలుగా చేసారు.

సోన్స్, మళయాళి ఇద్దరూ ఆ చెట్టు దిమ్మెకు రెండు చివర్లలో కట్టెను వేసి నెట్టున్నారు. భైరప్ప, సుబ్బేగౌడ ఆ మొద్దుకు వీపును ఆన్చి దొబ్బుతున్నారు. సోన్స్ "ఎక్కడుంది నీ బలం" అనే స్లోగన్ చేస్తుంటే తక్షణమే అందరూ తాళంకు తగినట్లుగా "ఐస్సా" అంటూ అరుస్తూ నెట్టున్నారు. చెట్టు మ్రొద్దును నెట్టే మొదలే అందరూ ఒకటిగానే అరుస్తూ నెట్టాలనేది ఎలాగున అని సోన్స్ ఒక పావు గంట పాఠాన్ని చెప్పాడు. అయినా వాళ్ళకందరికీ కవాతును (డ్రిల్‌ను) చేసినట్లుగా ఒకటిగానే బలాన్ని ఇచ్చి నెట్టేందుకు కొంచం టైమే పట్టింది. చెట్టు దిమ్మె ఎక్కడుందో అక్కడే, ఎలాగుందో అలాగే పడియుంది. అందరూ ఒకటిగానే అరిచేదాన్ని అభ్యాసం చేసుకొన్నారే త్రప్పితే బలాన్ని ఇచ్చి నెట్టలేదు సామూహికంగా.

కొంచంసేపు నెట్టి ఆ తర్వాత దమ్ము (అలుపు) తీసుకొనేందుకు నిలిచారు.

భైరప్ప మళయాళ పోడితో "ఏమిటి మహాశయా.... మీ మేస్త్రీ చెట్టును ముట్టుకొంటే చాలు, చెట్టు అతను చెప్పినట్లు వింటదని అన్నావు కదా! ఇప్పుడు కట్టెను ఆసరాగా పెట్టుకొని నెట్టున్నా వినటం లేదు కదా ఆ చెట్టు" అని అన్నాడు.

"మీరు ఒక్కొక్కరుగా తలా ఒక విధంగా నెట్టుంటే ఎలాగున ఆ మ్రొద్దు దొర్లుతది?" అన్నాడు సోన్స్.

నెట్టేటందుకు జనం సరిపోరని యోచించిన సుబ్బేగౌడ తనే వెళ్ళి దళితుల వాడ నుంచి జనాన్ని పిల్చుకొస్తానని అన్నాడు. భైరప్ప కుపితుడై “ఇప్పటిదాకా ఇదంతట్నీ మనమే చేసి, ఇప్పుడు మాత్రం ఎందుకు వాళ్ళకు సలామ్ కొట్టాలి. మనంత మనమే పిలిస్తే వాళ్ళలో ఉండే అహం ఆకాశానికి తలుపుతది. వారికేమి గుర్తు లేదా మనం చేస్తున్నది ఊరు మొత్తానికి చెందిన పనే అని వచ్చి చేతికి చేతిని చేర్చకనే పల్లెలోపలే కూర్చుండిపోయారు కదా” అంటూ రేగిపోయాడు. అందువలన కొంచంగా విశ్రాంతిని చేసుకొని మరలా ఆ ఐదుగురే చెట్టుదిమ్మెను నెట్టేందుకు సిద్ధమైయ్యారు.

“ఎక్కడుంది నీ బలం”

“ఐస్సా”

“ఇంకొకసారి”

‘ఐస్సా”

“పడనేపడ్తుది”

“ఐస్సా”

కదలని మ్రొద్దును పడనే పడుతుందని అరుస్తూ నెట్తుంది అపహాస్యం అన్నట్లుగా కనబడుతుంది. అంతలోనే ఆకస్మికంగా వాళ్ళందరి బలమూ ఒక్కటైనట్లుగా సంయోజనమైందో ఏమో! అప్పటికప్పుడే దిమ్మె కొద్దిగా ముందుకు కదిలింది. అందరూ ఒక్కటిగా అది వెనక్కి జరగనట్లుగా కట్టెను పెట్టూ అంటూ కాళేగౌడకు చెప్పారు. అతను కట్టెను పెట్టిన మీదట మరలా అందరూ కొంచం అలుపు తీర్చుకొనేందుకు నెట్టేదాన్ని ఆపి నిలిచారు.

చెట్టుదిమ్మె కదిలిందాన్నిచూసి కొంచం ఆత్మ విశ్వాసం వచ్చిన సోన్స్ “సరైన పట్టుదల ఉండుంటే ఈ మ్రొద్దును దొర్లించేందుకు ఐదుగురు కావాలా! నేనొక్కడ్నే దీన్ని ఇక్కడ్నుంచి ఊరి బయటకు దొర్లించేస్తాను కదా! ఏమి చేస్తాం ముఖ్యంగా ఈ ఆసరాకని పట్టుకొన్న కట్టే సరిలేదుకదా” అంటూ మ్రొద్దుకు తాపించుతున్న కట్టెను నిందించి, తను ఇంతకు మునుపు దొర్లించిన బృహదాకారంలోని చెట్లను, అందుకోసం తను చేసుకొన్న కట్టెల్ని వర్ణించుతూ బడాయిని ఆరంభించాడు.

అతని కతంతా ముగిసిన మీదట “ఆ పాతకథలన్నీ ఉండనీ. ఈ సారి మాత్రం ఈ మ్రొద్దును ఇక్కడ్నుంచి దొర్లించకనే మనం పనిని వదలరాదు” అని భైరప్ప అనగా, ధృఢనిశ్చయాన్ని చేసి దిమ్మెను నెట్టసాగారు వాళ్ళు. ఈసారి ఆ దిమ్మె ఇంకాస్తగా ముందుకు

జరిగింది. అప్పుడు సోన్స్ నుంచి కట్టె కొద్దిగా జారి మ్రొద్దుకు ఒకింతగా వీపును ఆన్చి నెట్టున్న సుబ్బేగౌడ మరియు భైరప్ప వీపుల మీద బరువును మోపింది. అది వెనక్కేమి దొర్లలేదు. కొద్దిగా వెనక్కి వాలింది అంతే. వెనక్కే దొర్లితే ఆ ఐదుగురూ అప్పడం లాగ అయ్యేవాళ్ళు.

"అయ్యయ్యో.... ఇప్పుడు నెట్టేదాన్ని ఆపకండ్రో. మా వీపులు విరుగుతవి" అంటూ భైరప్ప తక్షణమే అరిచాడు. మిగిలినోళ్ళ గుండెలు ధసక్‌మన్నవి. మ్రొద్దువెనక్కే దొర్లితే తమ అంత్యకాలం (చావు) సన్నిహితమైనట్లేనని ఊహించిన ఆ నలుగురూ 'ఐస్సా' అనే మాటను అరవకనే బలమంతా త్రెచ్చుకొని ఆ మ్రొద్దును ముందుకే నెట్టారు. మ్రొద్దు తక్షణమే తనంతతానుగానే ముందుకే దొర్లింది. వీపు ఆన్చి నెట్టున్న భైరప్ప, సుబ్బేగౌడ ముందుకే పడిపోయినట్లుగా తడబడిపోయి నిల్చారు నిధానంగా.

అందరూ చూస్తుండగా దిమ్మె ఒక చుట్టు దొర్లింది. అనంతరం మరొక చుట్టు దొర్లింది. ఇక అక్కడ్నుంచి ముందున్న నేల కళ్ళకు అందాజుగా కనబడనట్లుగా కొద్దిగా పల్లంగా ఉన్నట్లుంది. ఇది నెట్టున్నోళ్ళ గమనంకు రానేలేదు. వాళ్ళంతా చూస్తుండగానే రథానికున్న చక్రంలాగ గుండ్రంగా ఆ అగాధమైన దిమ్మె (మొద్దు) దొర్లుతూ దొర్లుతూ నిధానంగా భైరప్పడి ఇంటిని దాటిపోయింది.

## 13

ఉత్తిగనే నిల్చి దొర్లిపడుతున్న మ్రొద్దును ఖుషీతో చూస్తున్న ఐదుగురి చూపులూ భైరప్పడి ఇంటిని దాటిన మీదట అది దొర్లిపడుతున్న దిక్కు వైపుకు వెళ్ళినవి. అది నేరుగా సుబ్బేగౌడ ఇంటి వైపుకు దిక్కును పెట్టింది. సుబ్బేగౌడ భయపడ్డాడు. ఈ రాక్షసి పనసచెట్టు చివరికి తన ఇంటిని నాశనం చేసేందుకు నిశ్చయించుకొన్నట్లుగా కనబడింది. పరిగెత్తి దాని ఎదురు అది దొర్లకుండా ఉండేందుకని చేతిలో ఉన్న కట్టెను అడ్డుగా పెట్టాలనుకొంటూ నాలుగు అడుగుల్ని చేసాడు. నడుం చుళ్ చుళ్ అన్నట్లుగా నెప్పి కలిగింది. నడుం బెణికిందని ఊహించిన అతను ఆ మ్రొద్దుకు వీపును ఆనించినందుకే తప్పుగా అయ్యిందని తనను తనే శపించుకొంటూ నడుం పట్టుకొని నిల్చాడు. భైరప్పడూ అదే స్థితిలో ఉన్నందున నిల్చున చోటు నుంచే అరుస్తూ సుబ్బేగౌడ ఇంట్లో ఉన్నోళ్ళకు ఎచ్చరికల్ని చేసాడు. సోన్స్ దొర్లిపడుతున్న దిమ్మెకు అడ్డును పెట్టేందుకని కట్టె పట్టుకొని పరిగెడుతున్నాడు.

ఇటువైపుకు దొర్లుతూ దిమ్మె సుబ్బేగౌడడి ఇంటికి దగ్గరైంది. "ఇంట్లో ఉన్నోళ్ళు బహుపరాక్! జాగ్రత్త" అంటూ సోన్స్ మరొకసారి అరిచాడు. అతను అరిచిన వేళకు సరిగ్గా తలుపు తెరిచి ఏమిటి గొడవ అనేదాన్ని చూసేందుకని దానమ్మ బయటకు వచ్చింది. దొర్లిపడుతూ వస్తున్న దిమ్మె ఆమె కంటిలో పడింది. సోన్సే దాన్ని దొర్లిస్తున్నాడని ఆమె భావించుకొంది. మొదలే ఈ వృక్షం దశ నుంచి అయిన కష్టాల మీద ఆమెకు కోపం ఉంది. ఇప్పుడు చలించుతూ కొండలాగ ఇంటివైపుకు దూసుకొస్తున్న మ్రొద్దును చూసి భయానికన్నా కోపమే ఆమెలో ఎక్కువైంది. తలుపు తెరిచి బయటకు వచ్చిన ఈ గోధుమ వర్ణపు సుందరిలోని రూపం, ఆకారం మీదకు సోన్స్ చూపులు వెళ్ళే మునుపే, కోపంతో విశాలమైన నేత్రాల్ని రౌద్రంగా చేసికొని చూసిన ఆమె కళ్ళనుంచి అక్షరశః రెండు ఈటెలు వచ్చి సోన్స్‌కు పొడిచినట్లుగా అయ్యింది. సుబ్బేగౌడడి ఇంటి ముందున్న తులసి కోటకు ఎదురులో ఉన్న నేలలో పాతిన రోలు ఆ దిమ్మెలోని ఒక పార్శ్వాన్ని (భాగాన్ని) అడ్డుకొన్నందునో లేక దానమ్మలోని కోపానికి ఉగ్రనేత్రాలకు బెదిరో మరలా ఎడంవైపులో ఉన్న దారికి తిరిగింది. దిమ్మె భయపడిందో లేదో! సోన్స్ మాత్రం భయపడి ముఖాన్ని చూపించకనే దిమ్మె దానమ్మ ఇంటినుంచి దాటేవరకూ దాని వెనుకేసాగాడు.

మ్రొద్దు దొర్లిపడేదాన్ని నిల్పనే లేదు. అలాగే అది వేగాన్ని వృద్ధి చేసుకొని జోరుగా దొర్లింది లేదు. సుబ్బేగౌడ ఇంటి వద్ద దిక్కును మార్చుకొని రోడ్‌లోకి తిరిగిన మీదట ఆ మ్రొద్దును నెట్టిన ఎవర్లోనూ అదంతగా భయం, ఆందోళన కలగలేదు. ఇప్పుడు గాకపోయినా ఇంకొక నిమిషానికి దేనికైనా ఢీగొట్టుకొని అది నిలిచేపోతదని వాళ్ళు భావించారు. సుబ్బయ్యకూ, భైరప్పకూ నడుం నెప్పి బాధపెడ్తున్నందున కాళేగౌడ, సోన్స్, మళయాళి... ఆ ముగ్గురూ మ్రొద్దు జతగా పరిగెడ్తూ దానికి అడ్డుగా కట్టెను, రాళ్ళను పెట్టి నిల్పేందుకని ప్రయత్నిస్తున్నారు. అయితే మ్రొద్దు రోడ్‌రోలర్ లాగ వాటన్నిట్నీ ఎక్కిదిగి ఆ రాళ్ళను నేలలోకి ఒత్తేస్తూ ముందుకే సాగిపోతుంది.

ఆ దారి నేరుగా కొంచం దూరం వరకు ఉండి, ఆ తర్వాత కుడి ప్రక్కకు దలితులుండే పల్లె వైపుకు మలుపుగా తిరిగి ఉంది. ఆ మలుపు వద్ద ఒక పాత దేవాలయం ఉంది. దాని ప్రక్కన దారికి అంటుకొనే ఒక అశ్వత్థ వృక్షం ఉంది. ఆ చెట్టుకు ఢీ గొట్టుకొని నిల్చిపోతదనే లెక్కలను చేసుకొంటూ ఆ ముగ్గురూ సమాధానంతో నిట్టూర్పుల్ని వదిలారు. సుమారుగా ఒకటిన్నర గజం ఎత్తులో అనేక టన్నుల తూకంతో ఉన్న ఆ మ్రొద్దు చుట్టు ప్రక్కల ఉన్న చిన్నచిన్న చెట్లను, ఇళ్ళ ప్రహరీలగా వేసుకొన్న కంచెల్ని, ఎన్నో పుట్టల్ని

అవి అక్కడ లేనే లేవు అన్నట్లుగా నేలకు సరిసమంగా చేసి ముందుకే వెళ్తుంది. నడుం పట్టుకొని వెనకనే నిల్చి చూస్తున్న సుబ్బేగౌడకు, భైరప్పకూ కొండగుట్టలాగ ఉన్న ఆ మ్రొద్దును నెట్టి దాన్ని చలించేందుకు సహాయపడినోళ్ళు తామేనా అనేది ఆశ్చర్యమైంది.

కాళేగౌడ దారి మలుపు నుంచి ఎవరైనా తెలియకనే ముందుకు వచ్చి ఆ మ్రొద్దుకు అడ్డంగా పడి నలుగుతారేమోనని ఎచ్చరికల్ని చెప్పేందుకు, మ్రొద్దుకన్నా ముందే దారికున్న మలుపు దగ్గరకు పరిగెత్తాడు.

మ్రొద్దు నిధానంగానే అదే గతితో దొర్లుతూ వస్తుంది. అది రావిచెట్టు నడు మధ్య భాగంకు ఢీగొట్టే కచ్చితంగా నిల్చిపోతది. అయితే రావిచెట్టుకు ఒక ప్రక్కగా అది ఢీగొట్టినందున ఒక పార్శ్వం తట్టినట్లై మరలా కుడివైపుకు తిరిగి దలితవాడలోని దారిని పట్టుకొంది.

రోడ్‌లో నిల్చి దొర్లుతున్న మ్రొద్దును చూస్తున్న దానమ్మ అది రావిచెట్టుకు ఢీగొట్టు కొని దలితుల ఇళ్ళవైపుకు తిరిగిన తక్షణమే బెదిరిపోయింది. ఆ మ్రొద్దు ఎక్కువగా సప్పుళ్ళను చేయకనే మెల్లగా దొర్లుతున్నందున దలితుల బస్తీలో బావిగట్టున ఆడుకొంటున్న పిల్లలూ, నీళ్ళను తోడుతున్న మహిళలు ఫక్కాగా (కచ్చితంగా) దాన్ని చూడలేదు. ఎవరైనా కచ్చితంగా బలైపోతారని దానమ్మ ఊహించింది. ఇక ఆలశ్యాన్ని చేసేందుకు సాధ్యమేలేదు. తన ఇంటి వెనక భాగం నుంచి దలితులుండే పల్లెవద్దకు కాలిబాటలోనే పరిగెడ్తూ "రుద్రి, కాళి.... చెట్టు మ్రొద్దు దొర్లుతూ మీ వైపుకే వస్తుంది జాగ్రత్త" అంటూ అరిచింది.

రుద్రి, కాళి దూరానున్న మడులలో పనులను చేసుకొంటూ ఉన్నందున దానమ్మ నుంచి వస్తున్న కేకల్ని వినే సంభవమే లేదక్కడ. ఆట్లాడుకొంటున్న నలుగురు పిల్లలతో ఈరి ఒక్కతే బావిలోంచి నీటిని తోడుతుంది. ఈరి ఎవరు కేకను పెట్టున్నారో అని తలెత్తి చూసింది. పరిగెత్తుకొని వచ్చిన దానమ్మ "పనసచెట్టు మ్రొద్దు దొర్లుకొంటూ వస్తుందే... ఏ దిక్కువైపుకు మరలుతదో అనేది చెప్పేందుకు లేదు. జాగ్రత్త సుమీ! పల్లెలోపల ఎవరైనా ఉంటే కేకేసి చెప్పు" అని అంది. ఆమె ఆ మాటల్ని చెప్పి ముగించే లోపలే చటచట సప్పుడైంది. తలెత్తి చూసిన ఆ ఇద్దరికీ దారి ప్రక్కన అటు ఇటు ఉన్న ఇంగ్లీష్ తుమ్మచెట్లను చటపట అంటూ నుగ్గునుగ్గుగా చేసి ముందుకే దూసుకొస్తున్న మ్రొద్దు కనబడింది.

"అయ్యయ్యో.... పిల్లలూ పరిగెత్తండి. దిమ్మె వస్తుంది. ఎవరైనా అడ్డుగా చిక్కితే నలిగిపోగలరు" అంటూ అరిచిన ఈరి బావిగట్టు మీదున్న కడవను అక్కడే వదిలేసి

దానమ్మతో కల్సి పరిగెత్తింది. పిల్లలందరూ కిటారునే కీచుగొంతులతో అరుచుకొంటూ చెల్లాచెదురైయ్యారు. దొర్లుతున్న మ్రొద్దును ఏదో ప్రాణి అనే తెల్సుకొన్న ఆ వాడలోని కుక్కలు గొంతులు బొంగురు పోయేటట్లుగా అరవటాన్ని చేస్తున్నవి. దూరాన పొలాలలో పనులను చేస్తున్నోళ్ళందరూ కేకల్ని, కుక్కల అరుపుల్ని (మొదలైన వాట్ని) విని తమ పల్లెలో ఏదో నడించిందని శంకించారు.

పరిగెత్తుతున్న దానమ్మ వెనక్కి తిరిగి చూడగా "అయ్యో...ముదుకమ్మ మ్రొద్దుకు అడ్డుగా దొరికిపోయి, అప్పచ్చిగా అవుతది" అని అరిచింది. కరియడి తల్లి మ్రొద్దు దొర్లుకొని వస్తున్న దారిలోనే ఎండ వేడిమిని కాపుకొంటూ కూర్చొనియుంది. ఆమెకు వయోభారం వలన కళ్ళు కనబడవు. కరియడే తల్లిని మోసుకొచ్చి ఎండ వేడిని కాపుచేసుకొంటదని ఆ దార్లోనే కూర్చోబెట్టి పొలం వైపుకు వెళ్ళాడు. ఆ వృద్ధురాలికి దొర్లుకొని వస్తున్న మ్రొద్దు కనబడేది ఎలాగున?

దానమ్మ మరలా వెనక్కి తిరిగి దిమ్మెకు విరుద్ధంగా పరిగెత్తింది. దానమ్మ ముసల్దాని దగ్గరికి వచ్చేలోపే మ్రొద్దు ఆమెను దాటిపోయేంతగా దగ్గర కొచ్చింది. దానమ్మ ఆ మ్రొద్దు వేగాన్ని గమనించి "ఆ ముసలి తల్లి వంటిని తాకావో నా తాళిమీద ఒట్టే.... నీ మూతికి వాతల్ని పెట్తా. నరబలిని చేసేందుకు వచ్చావా" అంటూ మ్రొద్దును ఒక వ్యక్తి అన్నట్లుగా తిట్తూ, ముసల్దాని చేతులమీద చేతిని వేసింది. "మ్రొద్దు దొర్లుతుంది... ఎవరూ అడ్డురాకండ్రో" అని అరుస్తూ వెనక నుంచి పరిగెత్తికొని వస్తున్న కాళేగౌడ, దానమ్మ మరియు ముసల్ది ఆ దిమ్మెకు ఎదురులోనే ఉన్న దాన్ని చూసి బెదిరిపోయాడు. దానమ్మ ముసల్దాన్ని ఎత్తుకొంటుండగా, మ్రొద్దు వాళ్ళను రాసుకొంటూ (త్రాకుకొంటూ) ముందుకే పోయింది. కాళేగౌడ వారి చెంతకు వచ్చేటప్పటికి మ్రొద్దు ముందుకే సాగిపోయింది. మ్రొద్దు వాళ్ళను దాటుకొని దలితుల వాడ ప్రక్కనే ఉండే చిట్టడవిలోపలికి చటపట సప్పుళ్ళను చేస్తూ వెళ్ళింది. కుక్కలు అరుస్తూ ఆ మ్రొద్దును వెంటాడుతూ ఆ అడవిలోపలికి అవీ వెళ్ళినవి.

దిమ్మె ముందుకే వెళ్ళిపోయిన మీదట అఘాతం నుంచి తేరుకొన్నదానిలాగ దానమ్మ తేరుకొంది. కరియడి తల్లికి ఏమి జరిగిందనేది గుర్తుగాక పిలిపిలిగా గుడ్డి (కబోది) కళ్ళను మిటకరిస్తూ ముగ్దురాలిగా అటుఇటు చూస్తుంది. భావోద్వేగంతో గుండెకొట్టు కొంటున్న దానమ్మ కళ్ళలో తామిలా బతికున్న దానికి కృతజ్ఞత నుంచి నీరు ఉబికి వచ్చింది.

కాళేగౌడ, సోన్స్ ఇద్దరూ మసకేసిన ఆమె కళ్ళలో కనబడ్డారు. మరలా వాళ్ళ మీద కోపం వచ్చింది. చీరచెంగును నడుంకు చుట్టుకొంటూ, "పాడు సచ్చినోళ్ళారా... చేతగాని వాళ్ళుగా మారి, ఊరులోని జనాన్ని చంపేందుకు మూడు రోజుల్నుంచి ప్రణాళికల్ని చేస్తున్నారు కదా... థూ మీ బతుకులకు నిప్పును పెట్టాలి?" అంటూ బిగ్గరగా అరిచింది.

కాళేగౌడ సోన్స్ ఆ ఇద్దరూ, ఆమెలోని కోపానికి బెదిరి మ్రొద్దు ఎక్కడకు జారు కొందనేది సైతం చూడకనే వెనక్కి మరలి వచ్చిన దిక్కువైపుకే పారిపోయారు.

# 14

రుద్రి, కాళి, సిద్ద ..... అందరూ పొలం నుంచి పరిగెత్తుకొంటూ వచ్చినప్పుడు దానమ్మ కాళేగౌడడు పారిపోయిన దిక్కు వైపుకు కోపంగా చూస్తూ నిలబడి ఉంది. ఈరి నోటి నుంచి జరిగినదంతా విని నెమ్మదితో ఊపిరిని వదుల్తూ "దానమ్మ తల్లి కళ్ళలో నీరు తొణికిసలాడినదాన్ని చూసి ఎవరో ఖతం అయ్యారనే భావించుకొన్నాం" అని అన్నారు. ఈరి కరియడి తల్లి కూర్చున్న జాగ, మ్రొద్దు వచ్చిన దారి, అది పుడిపుడిగా చేసిన ఇంగ్లీష్ తుమ్మ చెట్ల పొదలు..... మొదలైన వాట్ని చూపెట్టింది. చాపను నేలమీద పరచినట్లుగా ఆ ముళ్ళపొదలు పడిపోయియున్నవి. ఆ పొదల మాటున ఉండే గుంట నక్కలు ఆ పల్లెలోని కోళ్ళను దొంగిలిస్తున్నందున ఆ పొదలు నేల మట్టమైంది మంచిదే అయ్యిందని వాళ్ళకు అన్పించింది.

అందరూ చేరి ఆ మహాకాయంగా ఉన్న ఆ దిమ్మె ఎటు వెళ్ళిందని వెతికారు. ధూమకేతులాగ వచ్చిన ఆ మ్రొద్దు ఎవరికళ్ళకూ కనబడలేదు. అది పుడిపుడిగా చేసిపోయిన పొదలు పుట్టలు లేకున్నట్లైతే ఈరికి, దానమ్మకు భ్రాంతి అయ్యిందని అందరూ అనుకొనే వారో ఏమో! అడవిలోని ఏ సందుగొందులలోనూ, మూలలలోనూ వెతికినా వాళ్ళకు దాని అవశేషాలు సైతం కనబడలేదు. అడవిలోపలికి దూరిన మ్రొద్దు కనుమరుగైంది. కొంచం దూరం తర్వాత ఈత వనాలు ఉన్నందున మ్రొద్దు దొర్లుతుంటే దాని భారానికి తలను వాల్చుకొన్న ఈత పొదల మట్టలు అనంతరం నేరుగా పైకే తలెత్తినందున, ఆ మ్రొద్దు సాగిపోయిన మార్గం తెలుస్తనేలేదు. దెయ్యాలు, భూతాల మీద దేవుళ్ళలాగనే శ్రద్ధను, నమ్మకాన్ని కలిగిన ఆ పల్లెవాసులు మ్రొద్దు అంతర్ధానమైనందుకు సరైన వివరణను కనుగొనేందుకు ఎక్కువగా ఏ ప్రయత్నాల్ని చేయలేదు. సోన్స్ దాన్ని కోసిన తక్షణమే

అది దొర్లుకొంటూ ప్రదక్షణను చేస్తూ అడవిలోపలికి ఎవరూ లేని జాగాకు వెళ్ళి మాయమై పోయిందని తమకు తామే చెప్పుకొంటూ వెనుదిరిగారు.

మ్రొద్దు మాయమైంది. దెయ్యాలు, భూతాలు ఉండేది అబద్ధమే అని అంటే ఆ మ్రొద్దు దొర్లుకొంటూ అక్కడికి అరమైలు దూరాన ప్రవహిస్తుండే 'ఎణ్ణెవాగు' లో పడి, తేలుకొంటూ కొట్టుకుపోయింది అంతే! లేకపోతే పచ్చి చెట్టుగా అయినందున మునిగి ఉండేది ఉంటదేమో కదా! ఎణ్ణెవాగులో ఎంతో లోతైన సుడిగుండాలతో మడుగులు ఉన్నవట. ఇప్పటి వరకూ ఎవరూ మునకేసి దాని అడుగు భాగాన్ని చూసింది లేదట! కొంతమంది కాశీకి, ఈ గుండాల మడుగులకు లోన్లోన ఏదో కనెక్షన్ ఉందని, ఇక్కడ మునిగి నోళ్ళు అక్కడ తేలుతారని అనుకొంటుండేవారు. ఇక్కడ మునిగినోళ్ళు కాశీలో తేలినా, కైలాసంలో తేలినా వెళ్ళి చూసినోళ్ళు ఎవరు? అటువంటి ఒక మడుగులో ఈ దిమ్మె వెళ్ళి మునిగిపోయి ఉండొచ్చు. దానమ్మ తిట్టినప్పుడు ఆమె ఇంటి వద్ద దిక్కును మార్చుకొని దేవస్థానం చెంత ఆ దారికి ఎడం ప్రక్కలో తిరిగి అడ్డంగా కూర్చున్న కరియడి తల్లిని చంపకనే వెంట్రుకవాసి అంతరంలో తప్పించి, ఆ మీదట అది వెళ్ళి ఎణ్ణెవాగులో పడి అంతర్ధానం అవ్వటం దానికి కష్టమా?

## 15

మూడు పగళ్ళు, మూడు రాత్రులు వీసిన గాలి గురించి చుట్టు ప్రక్కల జనం చెప్పుకొంటుంది అదొక పెద్ద సమాచారంగా మారగా, చినరావూరులోని ఐదుగుర్ని పోలీస్ స్టేషన్‌కు పట్టుకెళ్ళి రాత్రంతా అక్కడే ఉంచారనేది చుట్టుప్రక్కల ఊరోళ్ళు అనుకొనేదాన్కి రెండో సమాచారంగా ఉంది. ఈ సమాచారాల్ని అనుకొంటూ వాట్ని ముగించే ప్రొద్దుకు సుబ్బేగౌడ ఇంటికి ఎదురులో పడియున్న ఆ పెద్ద పనస మ్రానును నరికి, కోసి, ముక్కలుగా చేసిన తక్షణమే ఆ మొదలు భాగంలోని మొద్దు దొర్లుకొంటూ దేవస్థానం చెంత ప్రదక్షిణ చేసి అడవిలో మాయమైందనే సమాచారం మూడో సుద్దిలాగ దావానలంలా వ్యాపించింది. జనం సంతలో, అంగళ్ళలో, బస్ కని ఎదురు చూస్తున్నప్పుడు, కూర్చునప్పుడు, నిల్చినప్పుడు ఎక్కడంటే అక్కడ ఈ వార్తలకు తలను, కాళ్ళను, తోకను చేర్చి మాట్లాడుకోసాగారు. ఆ మూడు సుద్దులు జనం నుంచి ముగిసిపోయిన మీదట, ఇప్పుడు దూసుకొచ్చి పడిన పిడుగులాంటి వార్త ఏమిటంటే చినరావూరులోని కాళేగౌడడికి బంగారంలాంటి ధర్మపత్ని అయిన నాగమ్మ కాళేగౌడడికి చికిత్స చేసేందుకు వచ్చియున్న

మళయాళి నంబూద్రి పండితుడితో జతగా కల్సి లేచిపోయిందనేది ఇప్పుడొక కొత్త వార్తగా ప్రసారమైంది.

పిల్లలు కాలేదని రెండో పెండ్లి చేసుకోవాలని అనుకొంటున్న కాళేగౌడకు నాగమ్మ లేచిపోయినప్పుడు అతను బయటకు చూపిస్తున్నట్లుగా దుఃఖంగానే ఉన్నాడనేది కొంచం అనుమానమే సుమా! అయితే అనుమానం మాత్రం అతనికి సహించుకొనేంతగా ఉంది. కాళేగౌడ బావిలోకి దూకుతానని పరిగెత్తినప్పుడు ఊర్లోవాళ్ళంతా చేరి సాంప్రదాయ మన్నట్లుగా సమాధానాన్ని చెప్పి నాగమ్మను పట్టుకొచ్చేందుకు ఆ పండితుడి జాడను వెతికేందుకు వెళ్ళారు. సమయ సందర్భాల్ని చూసి వీలైతే ఆ పండితుడి కాలునో, చేతినో కత్తిరించే రావాలని తీర్మానాన్ని చేసుకొన్నా, పోలీసుల భయానికి ఆ తీర్మానాన్ని ఎవరూ నోటిని తెరిచి చెప్పటం లేదు కదా!

చినరావూరులోని ఘటనావళిలో ఇది సంభవించిన రీతి మాత్రం విచిత్రంగానే ఉందిలే.

సోన్స్‌తో చెట్టుకున్న మ్రొద్దును నెట్టుండగా అది వీపుకున్న వెన్నుమీద హఠాత్తుగా వాలి దాని తూకం పడినప్పుడు భైరప్పకూ సుబ్బేగౌడకూ వెన్నులో 'కళక్' అని పట్టుకుపోయి కూర్చునేందుకు, వంగేందుకూ కష్టం గాసాగింది. ఇద్దరూ మొదట మొదట్లో "పర్వాలేదు... కొద్దిగా నూనెతో మర్ధించుకొని వేడినీళ్ళ కాపటంను చేసుకొంటే అంతా సరిపడిపోతది" అని చెప్తూ అలాగే చేసుకొన్నారు కూడా. అయితే ఆ విధానం నుంచి ఏ విధమైన పరిణామకారి ప్రయోజనం వాళ్ళకు కలగలేదు.

ఈ మధ్యన ఆ ఇద్దరూ ఎటెన్షన్ (Attention) భంగిమతో గొంతును కదల్చకనే తిరుగుతున్నదాన్ని చూసినోళ్ళంతా ఏమిటి? ఏమైంది అని అడిగి, తమకు తోచిన రకరకాల ఔషధులను మరియు చికిత్సా సూత్రాల్ని సూచించేది జరుగుతూనే ఉంది. ఒకరేమో చెప్పారు ఇలాగున: బియ్యం మూట మీద తల పెట్టుకొని పడుకొంటే ఉదయం ప్రొద్దుకు బెణుకు పారిపోతదని చెప్పారు. ఇంకొందరు బియ్యం మూటను నడుంమీద పెట్టుకొని పవళించండని చెప్పారు. ఆ విధానమూ అయ్యింది. ఇంకెవరో కొంతమంది తమకూ ఇలాగే అయ్యింది. అప్పుడు ఎవరో ఇలాగిలాగుననే చేసి తమకు బెణుకును పోగొట్టారు, చూద్దాం రండి... అలాగుననే మీకూ చేసి బెణుకుల్ని తీసేద్దాం అంటూ రోడ్ ప్రక్కకు పిల్చుకొని వెళ్ళి గొంతుకు టవెల్ చుట్టి గుంజారు. కొంతమంది గొంతుకు చేతిని వేసి

వీపు వెన్నుకు మోకాలును పెట్టి నడుం క్రిందకు నొక్కారు. ఈ చికిత్సలన్నిటి పుణ్యాన వాళ్ళ నడుం నెప్పి కొంచం పెరిగిందే తప్పితే రిపేరవ్వలేదు. కరియడు బెణుకులను పారద్రోలుతాడని వాళ్ళకు తెల్సియున్నా "ఆ దలితుల సహవాసమే వద్దు" అని వాళ్ళు ఇంతకు ముందే తీర్మానించుకొన్నందున వాడి దగ్గరకు వెళ్ళలేదు.

బదులుగా దూరానున్న పేటలోని అణ్ణప్ప డాక్టర్ గారి నర్సింగ్ హోమ్ కమ్ లాడ్జింగ్‌కు వెళ్ళారు.

వాళ్ళు నర్సింగ్ హోమ్‌కు వెళ్ళి జాయిన్ అవ్వాలని వెళ్ళలేదు అక్కడికి. బండి చక్రానికి క్రొత్త ఇనపపట్టాను వేసేందుకు చినరావూరుకు వచ్చిన వాసాచారి వీళ్ళకు వీపులు బెణికినదాన్ని విని "అణ్ణప్ప డాక్టర్ వద్ద కరెంట్‌తో చికిత్సను చేయించుకొంటే ఒక క్షణంలోనే బెణుకు మాయమౌతదని" చెప్పినందున క్షణంలోనే గుణాన్ని చేసి పంపించేస్తే ఎందుకు ప్రయత్నించగూడదని అణ్ణప్ప డాక్టర్‌గారి చక్రవ్యూహంలోకి జొరబడ్డారు వీళ్ళిద్దరు. అణ్ణప్ప డాక్టరు ఇంజెక్షన్  అని చల్లటి నీళ్ళతో సూదిని పొడిచేది, సరిగా ఉన్నోళ్ళకు పనికిరాని కాలం చెల్లిన ఔషధాల్ని ఇచ్చి ఒకటికి రెండైన మీదట అర్జెంట్‌గా మణిపాల్‌కు వెళ్ళండి, బెంగళూరుకు వెళ్ళండి అని రోగులను రవాణా చేసేది అందరికీ గుర్తే. ఇతని అవివేకంలోని పరమావధి ఏమిటంటే 'హొసళ్ళి' లో చచ్చిన శవానికి ఇంజెక్షన్ ఇచ్చింది అదొక పెద్ద మోసంగా బయటపడి 'హొసళ్ళి' ఊరోళ్ళు కట్టెల్ని పట్టుకొని వచ్చినందునే అణ్ణప్పగారి ఔషధోపచారంలోని వైఖిరి సార్వజనికులకు గుర్తైంది. రోగి చచ్చింది గుర్తైనా అణ్ణప్పగారు స్టెతస్కోప్‌ను పట్టుకొని, నాడి చూస్తూ "పర్వాలేదు. ఉదయం ప్రొద్దుకు సరిగా అవుతది" అని చెప్పి ఇంజెక్షన్ గుచ్చి డబ్బు తీసుకొని, ఆ జాగాను ఖాళి చేసాడు. ఉదయం ప్రొద్దుకు వళ్ళు, చేతులు ఇంకాస్తగా చల్లబడిపోయి, ఆ రోగి నీలుక్కొని పోయిందాన్ని చూసి, అణ్ణప్ప నుంచి గ్రుచ్చిన ఇంజెక్షన్ నుంచే ఆ రోగి చచ్చాడని తీర్మానించుకొని రేగిపోయిన ఆ పల్లె జనం కట్టెల్ని పట్టుకొని పేటకు వచ్చారు. దెబ్బలకు బెదిరిన అణ్ణప్ప డాక్టరు తను పరీక్షించే మునుపే రోగి పరంధామంకు వెళ్ళాడని నిజాన్ని చెప్పాడు. అయితే చచ్చిన పీనుగకు ఎందుకని ఇంజెక్షను గుచ్చావు అంటూ అతని మీద నాల్గైదు వేట్లును వేసారు. ఇంతగా నీచుడని, పెంటోడని గుర్తున్నా అనేక పల్లెల్లోని మూర్ఖులు "ఆ మనిషి (అణ్ణప్ప) చెడ్డోడనేది నిజమే. అయితే ఆ ముండాకొడుకు హస్తవాసి ఉంది కదా... అదెంతగానో బంగారంలాంటిది" అని అనుకొంటూ అతడి వద్దకే వెళ్తుండేవారు. అణ్ణప్పడాక్టరంతటి ఖూనీకోరుకూ గిరాకీలు దొరుకుతుండేది మన సంస్కృతిలోని విశిష్ట

లక్షణంగా అది ఉంది కదా! భైరప్పనూ సుబ్బేగౌడనూ అక్కడికే పొమ్మని సిఫారస్ చేసిన వాసాచారి ఆ గుడ్డి నమ్మకాల గుంపులో ఒక సదస్యుడేకదా!

భైరప్ప సుబ్బేగౌడ ఇద్దరూ అణ్ణప్ప చెంతకు వెళ్ళిన తక్షణమే, వాళ్ళతో ఎక్స్‌రే తీయించుకొని రమ్మంటూ చెప్పాడు. ఆ మీదట దాన్ని చూస్తూ ఇప్పటిదాకా వీరు బతికున్నదే గొప్ప అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడు. ఎక్స్‌రే ఫోటోను చూపిస్తూ "చూడండి! ఇక్కడే మీ ఇద్దరికీ వెన్నుపూసలోని ఒక లింక్ తప్పింది" అంటూ చూపించి రోజుకు నాలుగుసార్లు కరెంట్‌తో చికిత్సను చేయించుకొంటేనే మాత్రం మీరు బ్రతకగలరని భయపెట్టాడు. రోజుకు మూడు నాలుగుసార్లు చికిత్స అంటే ఊరికెళ్ళి వచ్చి చికిత్సను పొందేది అసాధ్యమని అతని నర్సింగ్ హోమ్‌లోని గలీజుతో ఉన్న రెండు రూమ్‌లలో వీళ్ళు ఇన్‌పేషెంట్లుగా చేరుకొన్నారు. ఆ రూమ్‌లను అణ్ణప్ప వాస్తవంగా లాడ్జింగ్‌లాగ ఉపయోగానికి పెట్టుండేవాడు. రోగులెవరైనా వాటిలోకి చేరినప్పుడు మాత్రం అవి వార్డ్‌ల లాగ అవుతుండేవి.

అక్కడ వారు అడ్మిట్ అయిన తక్షణమే అటుఇటు తిరిగేదానికి వదలకనే మల, మూత్ర, రక్త పరీక్ష అంటూ మల మూత్రాల్ని సంగ్రహించి, బొటనవ్రేలుకు సూది గుచ్చి రక్తాన్ని తీసి లేని రోగాలన్నిటినీ చెప్పి దిగులును పెంచుతూ వాళ్ళ ప్రాణాల్ని తిన్నాడు. అన్నిటికన్నా ఈ రోగులేమైనా డబ్బును ఇవ్వకనే పరారౌతారేమోనని వాళ్ళను బయటకు పోయేందుకు వదలకనే నిర్బంధించగా సుబ్బేగౌడకు, భైరప్పకు తాము పోలీస్ స్టేషన్‌లోని లాకప్‌లో ఉన్నట్లుగానే భావనమైంది. తాము సచ్చినా పర్వాలేదు, బంధు బలగం సహాయ సానుభూతులతో ఉండేవాళ్ళ కళ్ళెదురులోనైనా చద్దాంలే అని తీర్మానించుకొని అణ్ణప్ప డాక్టర్‌గారి బిల్లును పూర్తిగా చెల్లించి అక్కడ్నుంచి పరారైయ్యారు.

వీపు వెన్నుకు రుద్దే అడవి ఆముదం నూనెను, మందార తైలాన్ని, నారాయణ తైలాన్ని, అయోడెక్స్, అమృతాంజనం... ఒకటా రెండా! అల్లోపతి, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్దవైద్యం..... అన్ని పద్ధతులలోని ఔషధాలు, లేపనాలు వీళ్ళిద్దరి ఇంటి కిటికీల వద్ద క్యూకట్టి, నిల్చినవి. వచ్చినోళ్ళంతా ఆశ్చర్యంతో ఇదేంటిది అంటూ వీళ్ళ యోగక్షేమాల్ని విచారిస్తుండేవారు.

సుబ్బేగౌడడి తండ్రైన సిగేగౌడ "పిచ్చిముండాకొడుకుల్లారా... వీపు (వెన్ను) బెణుకుకు ఇటువంటి ఔషధాల్ని వాడుతారట్రా! ఒకపాలు నిర్లక్ష్యాన్ని చేసి ఉత్తిగనే ఉండండి. దానిపాటికదే పోతది. దాన్ని మరిచి ప్రతిదినం మర్థించేది, ఒత్తేది, పూసేది, గుంజేది

చేస్తుంటే ఒక బాధపోయి రెండు బాధలు కొత్తగా వస్తవి (సైడ్ ఎఫెక్ట్‌లు)" అంటూ ఎచ్చరికల్ని చేసి ఊసాడు అటు. చివరికి "పాత మనస్తాపాల్ని పెట్టుకొని కూర్చుండేది వద్దు. వెళ్ళి కరియడి హస్తవాసి నుంచి బెణుకును నివారించుకోండి. బెణుకుల్ని పోగొట్టుకొనేందుకు చుట్టుప్రక్కల ఊరోళ్ళందరూ అతడ్ని పిలుచుకొని వెళ్తున్నారుకదా! అట్లాగున్నప్పుడు మీకేమి వచ్చింది భేషజంలోని రోగం? ఇంటి వెనక (పెరట్లో) డాక్టర్ ఉండగా పేటకు వెళ్ళి ఆస్పత్రిలో చేరారు కదా.... వెధవల్లారా! అంతా మీ కర్మ" అన్నాడు.

# 16

అంతవరకూ ఈ రాద్ధాంతాలకు కాళేగౌడ లెక్కపెట్టలేదు. అయితే వీళ్ళిద్దరి ఇంటి కిటికీల దగ్గర ఔషధి బాటిళ్ళు లైనుగట్టి నిలిచియున్నదాన్ని చూసి బేజారై అతనే కరియడి వద్దకు వెళ్ళి వీళ్ళిద్దరి రోగాల్ని ప్రస్తాపించాడు. కరియడు ఉత్సాహంగా ఏమి ప్రతిక్రియను చూపించలేదు. వెనకెప్పుడైనా ఎవరికైనా బెణుకు అయ్యి కష్టం కలిగిందని చెప్పిన తక్షణమే పదండి అంటూ బయల్దేరుతుండేవాడు. పంచముల్ని ముట్టించుకొనేందుకు వెనుకాముందు చూస్తున్నోళ్ళంతా బెణుకు నొప్పి నుంచి జాతిగీతి అంతట్ని మరచి "నీకు దండాలు మహాశయా. జాతి వ్యవస్థ నాశనంగాను. ఒకసారి నీ నుంచి బెణుకును మాయం చేయి" అంటూ అంగలార్చేదాన్ని వినేది అతనికి ఇష్టంగా ఉంటుండేది. మెడను పట్టుకొని అటుఇటు తేలికగా తిరిగేది అసాధ్యమై మొత్తం శరీరాన్నే తిరిగించి మాట్లాడుతున్నోళ్ళ గొంతును పట్టుకొని, "కొంచం అక్కడ అటుప్రక్కకు చూడండని" అంటూ చేతి నుంచి తలమీదకు అటుఇటు ఆడిస్తూ అది ఇది మాట్లాడి వాళ్ళు అన్యమనస్కులౌతుంటే దఢాల్నే వాళ్ళ గొంతును ఎదో దిక్కుకు త్రిప్పించి లటక్‌మంటూ సప్పుడ్ను బయటకు తెప్పించి, ఒక నిమిషంలోనే ఆ బెణుకుల్ని సరిజేస్తుండేవాడు. అయితే కాళేగౌడ సుబ్బయ్యకూ భైరప్పకు నడుంపట్టుకొన్న దాన్ని చెప్పినప్పుడు ఎందుకో కరియడు ఎప్పట్లాగ వృత్తిలోని ఉత్సాహాన్ని చూపించనే లేదు.

"వాళ్ళిద్దరికీ నడుంపట్టి ఎన్నో రోజులైంది కదా కాళయ్యా! దార్లో పోతున్న అందరూ బెణుకును తీసేందుకు ప్రయత్నించి భంగపడ్డారు కదయ్యా. అకస్మాత్‌గా మూళెగీళె విరిగియుంటే నేనెందుకు వెళ్ళి అక్కడ నిష్ఠూరానికి దొరికిపోయేది. అదేగాకుండా నాకూ గ్రహచారం సరిగాలేదు. ఆ రోజు శంక్రప్పడి మాటల్ని విని పొలం పాడైనదానికి అర్జీ ఇస్తే ఇన్‌స్పెక్టర్ నా మూలానే మిమ్మల్ని పిలిచారని అన్నారు కదా! ఒకదాన్ని చేసేందుకు

వెళ్తే ఇంకొకటి అవుతూ ఉంది. పొలం పూర్తిగా పాడైపోయింది. ఔషధాన్ని వేసినా సరిగాలేదు. ఎరువును వేసినా సరిపడలేదు. ఈ సంవత్సరం తిండికి ఏమి చేయాలనే చింతనను చేస్తున్నాను. ఇటువంటి సంకష్టంలో ఉండగా మరొక నిష్ఠూరంను నేనెందుకు వంటి మీదకు వేసుకొంటాను. చెప్పండి మీరే" అని అన్నాడు.

"చిన్న చిన్న వాటన్నిట్నీ పెద్దగా చేసి మాట్లాడుతున్నావుకదా కరియా. బెణుకు తప్పించేందుకు నీకేమి డబ్బును ఇస్తారో లేదో అనే అనుమానం ఉండొచ్చు నీలో. ఉత్తిగనే నెప్పుల నివారణకని నూరారు రూపాయల్ని ఖర్చు చేసినోళ్ళు నీకు మోసాన్ని చేస్తారా" అన్నాడు కాళేగౌడ.

కాళేగౌడడి మాటల నుంచి తన వృత్తి గౌరవానికి భంగం కలిగిందని అన్పించిన కరియడిలో కోపం వచ్చింది. "ఏమి మాట్లాడుతున్నావు నువ్వు? ఇంతవరకూ బెణుకు నొప్పుల్ని తీయించుకొన్నోళ్ళ దగ్గర నేను ఒక దమ్మిడీ తీసుకొన్నానని ఎవర్నుంచైనా చెప్పిస్తే నేను ఇక్కడే నా కులగోత్రాల్ని వదిలేసుకొంటా. మా తాత బెణుకు మంత్రాల్ని (వైద్యాన్ని) చెప్తూ నా నుంచి ప్రమాణాన్ని తీసుకొన్నాడని తెల్సుకో. అందుకే ఇప్పటిదాకా మర్యాద ఇస్తూ నా ఇంటికొచ్చి పిల్చుకొని వెళ్తారు రోగులు. అలాగునే డబ్బు తీసుకొంటుంటే నేనెందుకు ఇలాగున ఉంటాను. మంగళూరు పెంకులతో ఇల్లు కట్టించుకొని పేటలోనే సుఖంగా ఉంటుండేవాడినని గుర్తైందా? నేనేమి డబ్బు కొరకే పుట్టియున్నోడ్నని అనుకొంటున్నావా?" అంటూ రభసగానే ప్రత్యుత్తరం ఇచ్చాడు.

అయినా కాళేగౌడకు కరియ చెప్తున్న వివరణలు ఏవీ సమంజసంగా ఉన్నవని అన్పించలేదు. చినరావూరులోని దలితులకు, ఒక్కళిగులకూ నడుస్తున్న శీతల సమరంలోని అంగంగానే కరియడు బెణుకును నివారించేందుకు తిరస్కరిస్తున్నాడని అన్పించింది.

"కరియ.... నువ్వేమి చెప్పినా నీ మాటల్ని నేను ఒప్పుకోను. నీ వద్ద వైద్యాన్ని పెట్టుకొని నువ్వు దాన్ని చేయకుండానే వెళ్తే, రేపేదైనా ఒక సమయంలో వారికేమైనా ఎక్కువ తక్కువగా అయ్యిందని అనుకో... దాని పాపం అంతా ఎవరితలకు చుట్టుకొంటదో గుర్తేనా?"

"ఎవరి తలకు; నా తలకేనా?"

"మరింకేమిటి; నీ తలకే......"

"అదెందుకు నా తల మీదకు వస్తది? వాళ్ళ వాళ్ళ నుదుటన రాసింది వాళ్ళకు అవుతది. నేను మందును ఇచ్చే వారి రోగం గుణంగావాలని ఏమైనా యాక్ట్ ఉందా? ఒక్కొక్కరి వీపు ఎలాగున పట్టుకు పోతదో గుర్తా? నేనేకాదు ఏనుగు వచ్చి గుంజినా ఆ బెణుకు పోయేది లేదు. బెణుకుల్ని నివారించేది నేర్చుకొందే తప్పు అన్నట్లుగా మాట్లాడావు కదా! నాకేమి బెణుకుల్ని పోగొట్టేందుకు ప్రభుత్వం జీతాన్నేమైనా ఇస్తుందా?"

"ఆ మాటలన్నీ ఎందుకు కరియా. మొత్తానికి నీ మాటలలోని మర్మం ఏమిటనేది నాకు గుర్తే. మన ఊర్లోని దలితులు నీకు చెప్పియుండొచ్చు వాళ్ళకు బెణుకు నొప్పుల్ని తీయబోకు అని, సరిగా బుద్ధిని నేర్పు అని. ఇటువంటి సంకష్ట సమయంలో రోగుల మీద ద్వేషాన్ని తీర్చుకొనేందుకు వెళ్ళకూడదు కదయ్యా."

"నీకెందుకో ఈ రోజు బుద్ధి సరిగా లేదన్నట్లుగా కనబడుతుంది కదా కాళయ్యా. ఇలాగెందుకు మాట్లాడుతున్నావో చెప్పు? చూడు నడుంకు పట్టిన బెణుకును తీయాలంటే ఎంతో కష్టం. చేతివేళ్ళతో చిటికెల్ని వేసినట్లుగా తేలికగా అని అనుకొంటున్నావా? రెండుచేతుల్ని చేర్చి గొంతు చుట్టూ బిగువుగా బిగించి పట్టుకోవాలి. తల రెండు చేతుల మీదకు వచ్చిన తదుపరి రోగిని క్రింద పడుకోబెట్టి నడుంను కాలితో త్రొక్కించాలి. అప్పుడు వెన్నుపూసకు బిగువు వచ్చి తలనుంచి కాలు వరకూ నరాన్ని లాగుతది. నా కాళ్ళ నుంచి త్రొక్కించుకొని, చుట్టూ నాలుగు దిక్కుల జనమూ పంచముడి కాళ్ళతో త్రొక్కించుకొన్నాడు అని అంటే ఏమి చేస్తావు? నా నుంచి జాతి చెడింది అని అంటారో లేదో?"

కరియ ఆ నడుం నెప్పిలోని బెణకును తీసేందుకు, తాను వెనుకంజ వేస్తున్న దాన్లో దాని వెనుకన దాగిన ధర్మ సూక్ష్మాన్ని చెప్పాడు అలాగున.

కాళేగౌడ మరో మాటను మాట్లాడేందుకు కొంచం సమయాన్ని తీసుకొన్నాడు. దలితులను ముట్టుకోగూడదని చెప్పేది తప్పు అనే దానికి అతనూ పరివర్తనం చెందినోడి లాగ మారాడు. అయితే కరియ కాలి నుంచి త్రొక్కుతానని చెప్తుంటే అతనిలోని (కాళేగౌడలోని) సమసమాజ సిద్ధాంతం అతని ప్రజ్ఞకు మీరినట్లైంది. దలితుల నుంచి త్రొక్కించుకొనేది అటుండనీయండి. ఎవరు ఎవర్నీ కాళ్ళతో త్రొక్కేది తప్పేకదా! ఇది మాత్రం కరియ కావాలనే తమ మర్యాదను తీసేందుకే చేసే కుయుక్తి అని అన్పించింది అతనికి.

"దానికెందుకు (బెణుకుకు) కాలుతోనే త్రొక్కేదుంది?"

"దానికెందుకంటే! అన్నిటికీ ఒకొక క్రమం ఉంటదికదయ్యా. ఒకొకరకమైన బెణుకుకు ఒకొక క్రమం"

"ఉత్తిగనే నా దగ్గర నీ మాయల వరసను చేయబోకు. ఇప్పటివరకూ ఒక రోజునైనా నువ్వు కాలితో త్రొక్కే బెణుకును తీసినదాన్ని చూడలేదు. వేరే వాళ్ళకు తీసినట్లుగానే అదెందుకు చేతితో ఒత్తగూడదు"

"పోవయ్యా... పోయి, చేతితో ఒత్తిచూడు. బెణుకుపోతే సంతోషం. నా దగ్గర బెణుకుల్ని తీయించేందుకు వస్తారు కదా.... వారిని నీ దగ్గరకే పంపిస్తాను"

"చూడు కరియా... అర్జీని ఇచ్చి మమ్మల్ని లాకప్‌లో వేయించి రాత్రంతా పాడుచేసిందే గాకుండా ఇప్పుడు దలితుడి కాలి నుంచి త్రొక్కించుకొన్నారని మా మర్యాదను తీసేయాలనే అనుకొంటున్నావు కదయ్యా!"

"చూడు కాళయ్యా.... ఇందుకే చెప్తుంది నాకు ఎందుకో గ్రహచారం సరిగాలేదని. చేతిని పెట్టిన చోటెల్లా ఉల్టాగా అయ్యి వంటి మీదకు వస్తుంది. ఉన్నదాన్ని ఉన్నట్లుగా చెపుతుంటే నీకు కోపం నెత్తికి ఎక్కుతుంది. పొలం అంతా పాడైపోయి రెండు పూటల గంజికీ ఏమి చేయాలి దేవుడా అనేదే నా చింత. అటువంటి స్థితిలో ఉన్న నన్ను జాతిని చెడిపేందుకు గూడు పుఠాని చేస్తున్నానని నువ్వు అంటున్నావు. ఇక ముందు నేను ఎవరికీ బెణుకును తీసేది లేదు. దీన్నుంచి పనిని చేస్తూ భార్యా బిడ్డల్ని సాకేదుందా? ఈ పెంటపనే నా నుంచి వద్దు" అంటూ కరియ ముఖాన్ని త్రిప్పుకొని వెళ్ళిపోయాడు.

కాళేగౌడకు కరియడి మీద ఒక వేటు వేయాలనేంతగా కోపం వచ్చింది. మరలా వెదవలు అర్జీని పెట్టి లాకప్‌లో వేయించగలరని భావిస్తూ ఉత్తిగనే వెళ్ళి వచ్చానని జరిగిన దాన్నంతట్నీ భైరప్పకు చెప్పాడు.

# 17

అదంతట్నీ చెప్పి మెల్లగా మూసుకొని వెళ్ళియుంటే కాళేగౌడకు ముందు జరగబోయే కష్టాలు త్రప్పిపోయి ఉండేవి. అయితే కరియ నడుం బెణుకును తీసే రీతిని కాళేగౌడకు సూక్ష్మంగా వివరించియున్నందున అదే ప్రకారంగా తనెందుకు ఒక ప్రయత్నాన్ని చేసి చూడకూడదు అని అన్పించింది.

"భైరప్పా.... నీ మెడ వెనుక నుంచి నా చేతిని చేర్చి బిగువుగా పట్టుకొని చూద్దాం. నా చేతి గుణం మంచిదే. నీకు గడియ శుభంగా ఉంటే ఎందుకు నేనే ఆ బెణుకును పారద్రోలకూడదు. అదేమి ఆ కరియడి కాలినుంచే త్రొక్కించుకొనే పోవాలని దేముడు నిఘంటువులో రాసాడా?" అని అన్నాడు.

"వద్దు మహాశయా... ఇప్పుడేమి అంతగా నొప్పి కనబడటలేదు. ముఖ్యంగా నడుంను వంచగూడదు అంతే. ఇలాగనే ఉంటే ఇక నాల్గైదు రోజులకి తనంత తానుగానే సరిపడిపోవచ్చు" అని అన్నాడు భైరప్ప. రోజూ ఒకరొకరు ఒకొక తరహాలో చెప్పి ఒకొక నమూనాతో పట్టును పట్టి లాగి గుంజి నుగ్గునుగ్గుగా దేహాన్ని వంగిస్తున్నందున అతనికీ అసహనం వచ్చింది.

అయితే కాళేగౌడలోని చెడు కుతూహలం త్రగ్గలేదు. కొంతమందిలో నడుం బెణుకు అలాగే నిల్చి చివరికి జీవమాన పర్యంతం నడుంమీద చేతుల్ని పెట్టుకొనే కాలాన్ని గడిపారని బెణుకులోని భయానకమైన భంగిమలన్నిట్ని వివరించి బెదరగొట్టాడు.

అతని వాదంకు లొంగి చివరికి భైరప్ప అతను చెప్పిన భంగిమలో కాళేగౌడకు ఎదురుగా నేలమీద పడుకొన్నాడు.

అతని వెన్నుమీద తన భారాన్ని నిల్పి కాళేగౌడ చేతితో ఒత్తాడు. భైరప్పకు వెన్ను పూస మెడ నుంచి కాలువరకూ లాగినట్లై "అయ్యయ్యో... కొంచం మెల్లగా మహానుభావా" అంటూ అరిచాడు. కాళేగౌడ ఎన్నిసార్లు లాగి ఒత్తినా భైరప్పడి వెన్నుపూస నుంచి ఏమి 'లటక్' అనే శబ్దం రాలేదు. ప్రతిసారి ఒత్తి ప్రయత్నించిన తర్వాత భైరప్పను లేపి అటు ఇటు వంచి బెణుకుపోయిందా అంటూ కాళేగౌడ అడుగుతున్నాడు. ఇలాగున ఐదారు సార్లు చేసి ఏమి ప్రయోజనం రానిదాన్ని గమనించి కరియడు చెప్పినట్లుగానే ఇది కాళ్ళ నుంచే తొక్కాల్సిన పనే అని అనుకొంటూ చివరి ప్రయత్నం అన్నట్లుగా భైరప్పడి వెన్ను మీద కాళ్ళను బలంగా వేసి నొక్కాడు. భైరప్పడి వెన్నులో సప్పుడయ్యే బదులు కాళేగౌడడి వెన్నులోనే 'కళక్' అంటూ సప్పుడైంది. తన నడుంలోని సప్పుడే అది అని భావించుకొన్న భైరప్ప "ఓహో... వదిలినట్లుగా కనబడుతుంది కదయ్యా" అని అన్నాడు. అయితే కాళయ్యకు అది తన నడుం నుంచే వచ్చిన సౌండ్ అని తెల్సుకొనేదానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఎందుకంటే భైరప్పడి వెన్నును తన కాళ్ళని వంచి ఒత్తుతున్న అతను నేరుగా నిలవాలనుకొన్నప్పుడు ఒకసారి అతని వెన్నుపూస 'కళక్' అంటూ సప్పుడ్ని చేసింది.

ఇంతవరకూ వీరి బెణుకు ప్రహసనంలో ప్రేక్షకుడిగా ఉన్న కాళేగౌడ ఇప్పుడు పాత్రధారిగా రంగస్థళంకు కాలును పెట్టాడు. భైరప్పకు పట్టుకొన్న బెణుకు అంటురోగం రీతిలాగ కాళేగౌడడి నడుంకు ఎక్కి కూర్చుంది.

ఈ ప్రకరణం తర్వాత భైరప్పడి బెణుకు గుణం చెందకపోయినా, ఎక్కడ చూద్దాం అని బెణుకును విడిపించేందుకు ముందుకొస్తున్న జనంలోని దాడిమాత్రం త్రగ్గిపోయింది. వీళ్ళకున్న బెణుకుల్ని విడిపించేందుకు వెళ్ళేవాళ్ళకు అది అంటుకొంటదని భావించుకొని బెదిరిన ఇతరులు వాళ్ళకు ఎప్పటిలాగనే పట్టులను వేసి గుంజేదాన్ని నిల్పేసారు.

కాళేగౌడ మరుదినాన లేచినప్పుడు ఏ అనుమానంకు గురికానట్లుగా నడుం పట్టుకొంది కచ్చితమైంది. మొదలే చినరావూరులోని మగోళ్ళంటే త్రాగుబోతోళ్ళు, సోమార్లు అనే ప్రసిద్ధి ఉంది. ఇప్పుడు ముగ్గురు జనంకు నడుం పట్టేసి వంగుంటే లేచేందుకు, లేస్తే కూర్చునేందుకు కష్టాలన్నట్లుగా ఉన్నదాన్ని విన్న చుట్టు ప్రక్కల జనం "రోగి కోరుకొంది పాలునే, వైద్యుడిచ్చింది పాలునే అని అంటారు కదా... ముండా కొడుకులకు చెప్పి చేసిన భలే రోగం ఇది. అటు చూస్తే రోగం కాదు, ఇటు చూస్తే హుషారు లేక పనులకు రోగం. తింటానికేమో హుషారు. ఇక వీళ్ళు వరిని కోసేది, నూర్పిళ్ళను చేసేది అంతా మహిళల తలలకు కట్టి, ధాన్యం ఇంటికొచ్చే వరకూ పరుపుల మీదే పడుకొని ఉంటారులే" అని అనుకొంటూ నవ్వుకోసాగారు.

కాళేగౌడ, సుబ్బయ్య ఇంట్లోని కిటికీలో లైనుగా ఉంచబడిన నెప్పుల నివారణ నూనెలలో కొన్నిట్ని అప్పుగా తీసుకొని ప్రతిరోజు నాగమ్మ చేతినుంచి తోమించుకొని (మర్థించుకొని) వేడినీటి కాపటంను చేయించుకోసాగాడు.

నీటితో కాపటం చేస్తూ లెక్క బెట్టినట్లుగా స్పష్టంగా కనబడుతున్న పక్కటెముకల్ని, చర్మమంతా ముడుతలుపడి ముడుచుకుబోయిన పృష్ఠాన్ని (పిరుదులను) చూసిన నాగమ్మకు ఇదెంతటి శరీరమోనని జుగుప్స అయ్యింది. "ఈయనెందుకు భైరప్పగారి బెణుకును నివారించే సాహసానికి వెళ్ళాల్సి వచ్చింది. పాడుముండాకొడుకైన ఆ శంక్రప్పడి కాంపౌండ్‌లో సారాయిని, కల్లును త్రాగి త్రాగి ఒళ్ళంతా శుష్కించిపోయిందికదా" అని మనుస్సులోనే శంక్రప్పకు శాపనార్థాల్ని పెట్టినా ఏ విషయాన్ని నోరు తెరిచి బయటకు పలకదుకదా! ఆ ఒక్క విషయంలో నాగమ్మ మాత్రం దానమ్మకు పూర్తిగా విరుద్ధమనే చెప్పొచ్చు. మొత్తం చినరావూరులోని మహిళలలో మౌని ఎవరంటే నాగమ్మే కదా! మొగుడు

ఆమె నుంచి పిల్లలు కలగట్లేదని తిడుతున్నా ఆ సహనపరురాలి నుంచి ఎదురు మాటలే లేవు కదా! రెండో పెండ్లిని చేసుకొంటానని భయపెట్టినా ఉలుకుపలుకు లేదు ఆమె నుంచి. వివాహమైనప్పటి నుంచి  నాగమ్మ మూగప్రాణి తరహాగానే పొలం పనులను చేసుకొంటూ వస్తుంది.

మొగుడి వీపును తోమితోమి నాగమ్మకు చేతులు నొప్పెట్టసాగినవి. కాళేగౌడడి నడుం నెప్పులు నాగమ్మ చేతులకూ దాటినవని (చేరినవని) చూస్తున్న జనం అనుకోసాగారు. ఆ వేళకు కాళేగౌడడికీ నూనె (తైలం)తో రుద్దించుకోవటం నుంచి ఏ ప్రయోజనమూ రాలేదని (కలగలేదని) అన్పించింది.

“ఔను.... ఎంతెంతటి రోగాలన్నింటికీ మందుల్ని కనిపెట్టారు. అయితే ఈ బెణుకుకు మాత్రం ఒక మంచి ఔషధం లేదుకదా!” అంటూ శంక్రప్పడి కల్లు దుకాణంలో కల్లును త్రాగుతూ కాళేగౌడ తన కష్టాన్ని చెప్పుకోసాగాడు. అప్పుడు శంక్రప్ప పేటలో (పట్టణంలో) మళయాళ పద్ధతిలో వైద్యాన్ని చేస్తున్న కొటేక్కల్ నంబూద్రి పండితుడి గురించి చెప్పాడు. అతని హస్తవాసి నుంచి ఈ నడుంనెప్పి గుణంకాగలదనే నమ్మకాన్ని వ్యక్తపరిచాడు. సుబ్బేగౌడ, భైరప్ప ఆ పట్టణంలో ప్రయత్నించకుండా వదిలేసిన వైద్యుడెవరంటే ఈ నంబూద్రి పండితుడొకడే కదా! కాళేగౌడడి వెన్నుకు చికిత్సను చేయించేందుకని మరుసటి రోజే ఇతడ్ని పిలుచుకొని వచ్చాడు శంక్రప్ప.

నంబూద్రి పండితుడు కాళేగౌడడి ఇంట్లో ఠికాణం (మకాం) చేసి ఏమేమో ఔషధాల్ని కలగాపులగం  చేసి త్రాపించాడు.నంబూద్రి పండితుడి ప్రకారం ముఖ్యంగా రోగికి తను తీసుకొంటున్న ఔషధాలమీద నమ్మకాన్ని పెట్టుకోవాలట. ఒకరికి రోగాన్ని గుణపరచిన ఔషధం ఇంకొకరికి తగ్గించకనే ఉండేదాన్కి ఆ నమ్మకమే లేనందువలనే కారణం అని పండితుడి నుంచి వచ్చిన వాదనగా ఉంది. కాళేగౌడకు అతని మాటలు అర్థంకాలేదు. రోగం నుంచి విముక్తి అవ్వటం వలనే ఔషధాల మీద మనుష్యులకు నమ్మకం వస్తదో! నమ్మకం ఉన్నందుచేతనే ఔషధం రోగాన్ని గుణపరచుతదో అని కాళేగౌడ ఆలోచిస్తూ పండితుడు ఏవేవో ఆకుఅలుముల్ని నూరి ఇచ్చిన పదైదు రకాల నానా పసరులతో ఉన్న ఔషధాన్ని త్రాగాడు. నిషామీదకే ఎక్కకున్నా వాసనలో మాత్రం శంక్రప్పడి సర్కారు సారాయి, కల్లు లాగే దుర్వాసనతో అన్ని విధాలలోనూ అది పోలికగా ఉంది. కీచుగొంతుతో బలపాన్ని పలక మీద గీసినట్లుగా “నాకమ్మా.....అది తీసుకురా.. నాకమ్మా ఇది తీసుకురా” అని

మళయాళ మిశ్రితమైన కన్నడాన్ని పలుకుతూ ఆ పండితుడు ఐదారు రోజులు కాళేగౌడ ఇంట్లోనే దర్బారును పెట్టాడు.

రాత్రంతా ఖంగ్ఖంగునే దగ్గుతుండే ఆ మళయాళ పండితుడు అదేమి మాయ చేసాడో! అదెక్కడ గుప్తాంగాల మీద చేతిని ఆనించి, రుద్ది, చక్కిలిగింతలు పెట్టి ఏమేమి మన్మథ తాపాల్ని నాగమ్మలో ఎగద్రోసాడో లేకపోతే నాగమ్మే తన ఏకాంతంలోని మౌనంలో అదేమి నిర్ణయానికి వచ్చిందో తెల్వదు. మరుసటి రోజున పేటకు వెళ్ళి ఔషధాల్ని తెస్తానని బయటపడిన ఆ పండితుడి వెనకే నాగమ్మ ఎవరికీ ఏమీ చెప్పకనే లేచిపోయినప్పుడు, అందరూ ఆ సమాచారాన్ని నమ్మేందుకు ఒప్పక పరమాశ్చర్యంలో పడ్డారు. ఈ విషయాన్ని చుట్టుప్రక్కలోళ్ళు గంభీరంగా పరిగణించి నిజమేనని నమ్మేందుకు కాళేగౌడ బావిలోకి దూకి సస్తాననే వరకూ ఆ విషయం వెళ్ళాల్సి వచ్చింది. నాగమ్మ ఒకరోజైనా ఎదురుతిరిగి మాట్లాడింది లేదు. తలెత్తి పరపురుషులను చూసిందీ లేదు. అటువంటి నాగమ్మ కంత్రి కుక్కలాంటి ఆ నంబూద్రి పండితుడి జతగా లేచిపోవటమే! కాదుకాదు పండితుడే ఏదో వశీకరణ విద్య ప్రయోగించి నాగమ్మను వశపరచుకొని యుండొచ్చు! లేకపోతే నాగమ్మకు ఏదో పిశాచం తగులుకొని ఉండొచ్చేమో! అది తప్పితే ఇది నాగమ్మలోని స్వంత బుద్ధి నుంచి జరిగిన పనైతే కానేకాదని అందరూ సర్వానుమతితో తీర్మానాన్ని చేసారు.

కాళేగౌడడి ఆక్రందనల్ని వినలేక చినరావూరులోని అందరూ ఒకటై నంబూద్రి పండితుడ్ని చావచితకగొట్టి నాగమ్మను పట్టుకొచ్చేందుకు పేటకు వెళ్ళారు. తమ భార్యలతో జగడాన్ని చేస్తున్నప్పుడల్లా నాగమ్మను మంచితనానికి ఒక ఉదాహరణంగా ఉపయోగిస్తుండే ఆ మగోళ్ళకు ఇప్పుడు నాగమ్మ ఇలాగున చేసింది అనేది కక్కలేక మ్రింగలేక ఉండే స్థితికి వచ్చింది. అయితే వీళ్ళిద్దరూ లేచిపోయిన రోజుకు మరుదినాన పండితుడికి తాను చేసిన అపరాధంలోని గురుత్వం తెల్సినందునో ఏమో.... నీకు పిల్లలు కలిగేందుకు ఔషధాన్ని ఇస్తానని చెప్పి నాగమ్మ నుంచి మంగళ సూత్రాన్ని, గాజుల్ని, మెట్టెల్ని తీసుకొని, ఆ పేటను వదిలి వేరెక్కడికో పారిపోయాడు. ఆ జంటకు రూమ్ ఇచ్చిన శీనప్పశెట్టి నాగమ్మ నుంచి జరిగిన వృత్తాంతాన్నంతా విని కనికరంతో నాగమ్మకు ముప్పొద్దులా అన్నాన్నిపెట్టి తన ఇంట్లోనే భద్రంగా వసతిని కల్పించాడు. ఊర్లోవాళ్ళు వెళ్ళి "ఏమిటి నాగమ్మా... మమ్మల్నందర్నీ తలెత్తుకోలేనట్లుగా చేసావు కదా" అని అంటున్నప్పుడు మరో మాటను పలుకకనే సాక్కొన్న మూగప్రాణిలాగ త్రోలుకెళ్ళేందుకు వచ్చినోళ్ళతో వెనుదిరిగింది.

# 18

నాగమ్మను ఊరికి తీసుకొచ్చిన మీదట, "నా భార్య ఇలాగున నా గొంతును కోసింది కదా! వెన్నుకు పొడిచింది కదా! నడునీట్లో చేతిని వదిలింది కదా!" అంటూ ఊర్లోవాళ్ళను నిద్రకు పోనీయకుండా ఏడుస్తున్న కాళేగౌడ, దఢాల్నే తన ధోరణిని బదలాయించుకొని తన కఠోర న్యాయ నిష్టను చూపించుకొనేందుకు చుట్టు ప్రక్కల ఊళ్ళలోని జనం వచ్చి పంచాయితిని చేయాలని, లేకుంటే నాగమ్మను ఇంట్లోకి ఆహ్వానించేందుకు సాధ్యంగాదని చెప్పాడు.

మొదటి భార్య మొగుడ్ని వదిలి లేచిపోయిందని అంటే మరలా రెండో పెండ్లికి ఎవరు కన్యను ఇచ్చేందుకు సిద్ధమౌతారు? ఇప్పుడు బహిరంగంగా విచారణ జరగకనే భార్యను ఇంట్లోకి త్రోలుకెళ్ళితే (అనుమతిస్తే) తనలోనే ఏదో లోపం (నపుంసకత్వం) ఉందని శంకిస్తారు. బహిరంగంగా విచారణ నడ్చి ఆమె నంబూద్రితో లేచిపోయిన దాన్కి అతడి మాయో లేక నాగమ్మను పెనవేసుకొన్న పిశాచినో కారణం అనేది సార్వజనికంగా తీర్మానం అయితేనే మాత్రం తను అపవాదం నుంచి విముక్తి గావచ్చనేది కాళేగౌడలోని ప్లాన్‌గా ఉంది. అతడి న్యాయ నిష్ఠ వెనుకన ఉన్న ఆలోచనా లహిరి ఇదే.

పంచాయ్తి అనిన మీదట కేసును శంక్రప్ప తన చేతులలోకి తీసుకొన్నాడు. అతను గ్రామసేవకుడైనందున చుట్టు ప్రక్కల ఉండేటి 'తగ్గినగద్దె', 'మక్కి', 'ఊరళ్ళి', 'మల్లినమడుగు', 'సంగాపూర'.. మొదలైన ఊళ్ళకు వెళ్ళి నూరారు జనంకు పంచాయితికని ఆహ్వానాన్ని ఇవ్వాల్సినోడు ఇతనే. అర్ధాంగి మొగుడ్ని వదిలి లేచిపోయిందని, దానిమీద పంచాయితి అని అంటే పేటలో క్యాబెరా డ్యాన్స్‌కు జనం చేరుకొన్నట్లుగా ఆయా పల్లెలలోని జనం జమగూడుతారు. అలాగనే ఊహించి చినరావూరులోని సంగతిని శంక్రప్ప ఒకటికి రెండు రంగుల్ని పులిమి నాగమ్మ ఆ నంబూద్రి పండితుడ్నించి గర్భవతి అయ్యిందనేదాన్ని చేర్చి చెపుతూ జనాన్ని పంచాయితికి రండర్రో అని ఆహ్వానించాడు. తన మీద ఇంతకు మునుపు కోడెగిత్తల్ని దూకించి పొలాల నడమ కాళ్ళకు గాయాల్ని చేసుకొనేంతగా పరిగెత్తించిన చినరావూరులోని గయ్యాళుల మీద సరిగానే ప్రతీకారాన్ని తీర్చుకొనే సువర్ణావకాశం దొరికిందేలే అని ఉప్పొంగాడు.

అయితే ఎంతోమంది చినరావూరులోని పంచాయితి... అది కూడా మహిళ ఒకామె మీదే అని తెల్సుకొన్న తక్షణమే చినరావూరులోని గయ్యాళుల నోళ్ళు గుర్తుగా ఉన్నందున

వేరే పనులు ఉన్నవనో, ఒంట్లో బాగా లేదనో...ఏవేవో నెపాల్ని చెప్పి, పంచాయితికి హాజరౌటం లేదని అన్నారు. ఇక కొంతమంది శంక్రప్పడి ఒత్తిడికి ఇరుక్కొన్నోళ్ళు మాత్రం ఇష్టంగాని మనస్సు నుంచి హాజరు అయ్యేందుకు సమ్మతించారు.

శంక్రప్ప తనకు జిగ్రిదోస్త్ అయిన 'ఊరళ్ళి'లో భూతవైద్యుడిగా ఉండేటి హెగ్డేను స్వతహాగా వెళ్ళి ఆహ్వానించాడు. "ఆ దొంగలంజలకు విపరీతమైన జంభం ఉంది హెగ్డెసాబ్. మీ దగ్గర ఐదారు దెబ్బలు పడితేనే వాళ్ళు లొంగేది. ఎంతో మంది ఆ గయ్యాళి మహిళలకు భయపడి పంచాయితికి వచ్చేది లేదని అంటున్నారు!" అని హెగ్డె పౌరుషాన్ని సూక్ష్మంగా పొగిడి హెగ్డెను ఒప్పించాడు. హెగ్డె నాలుగు గళాసుల (గ్లాసుల) విప్ప సారాయిని త్రాగి, ఒకనాటుకోడి మాంసాన్ని తిని, నిషా పొంది, పేమ్ బెత్తాన్ని పట్టుకొని వస్తే చినరావూరులోని గయ్యాళులకు ముచ్చెమటలు పట్టే సన్నివేశం ఎలాగైన సృష్టించబడుతుందనే అతనిలో ప్రగాఢమైన నమ్మకంగా ఉందికదా!

చివరావూరులోని మహిళ మీద పంచాయితి చేసినందున ఇకముందు అక్కడ ఎవడైనా ఏ ఆటను ఆడినా మగోళ్ళ ప్రతాపమే చిరస్థాయిగా వెలుగొందుతదని శంక్రప్ప ఊహించాడు.

"నాయనలారా... నన్ను అడిగితే అయ్యిందేదో అయ్యింది ఏదో గడియలో... నాగమ్మ ఆ తరహాలోని మహిళే కాదు అనేది మీకూ అంతా గుర్తే! నేను చూచినట్లుగా కాళేగౌడడు అంటున్న సూటిపోటి మాటల్ని సహించుకొంటూ ఓర్పుతో తల వంచుకొని బతుకును సాగిస్తుంది కదా! అంతట్ని మన్నించి, ఆమె బతుకును ముమ్ముందుకే కాళేగౌడతో సాగించేది మంచిది" అని భైరప్పకు తల్లైన సుబ్బమ్మ అక్కడ జమైనోళ్ళకు, కాళేగౌడకు చెప్పింది సమచిత్తంతో.

ఈ ముసల్ది ఈ పంచాయితిని ఎంతో తేలికగా పరిగణించుకొంటుందేమో అని శంక్రప్ప అనుకొన్నాడు. ఈ కేసు ఇంత మట్టంలో (లెవల్‌లో) తేలికగా పరిష్కారం అయ్యేటట్లుగా ఉంటే నేనెందుకు ఊరూరు తిరిగి జనాన్ని జమచేసింది వృథానే అని అనుకొంటూ "అయ్యిందేదో అయ్యిందని అనుకొంటూ ఇంకొకరి ఇంట్లోని స్త్రీ లేచిపోయిందానికి చెప్పేది సులభమేనా సుబ్బమ్మా? మీ ఇంట్లోనే ఇటువంటి పని అయ్యుంటే అయ్యిందేదో అయ్యింది అంటూ ఊరుకొనేది ఉంటదా.... చెప్పండి మీరే? కాళేగౌడ బాగా లేకనే నడుంమీద చేతుల్ని వేసుకొని కాలాన్ని గడపాల్సిరాగా ఈ అకార్యం వలన గోదాట్లో చేతిని విడిచేసినట్లుగానే ఉంటది కదా?" అని కాళేగౌడ నుంచి

సానుభూతిని గిట్టించుకొనేటట్లుగా మాట్లాడాడు శంక్రప్ప. కొంతమంది మగోళ్ళు తలలను ఆడించారు.

## 19

చినరావూరులోని మర్రిమాను నీడలో పంచాయితికి జనం చేరినప్పుడు ఆ చినరావూరుకే చెందిన నాగరికుల పరిస్థితి కరుణాజనకంగానే కనబడుతుంది. నడుం నొప్పితో పీడితులైన ఆ ముగ్గురూ నేరుగా నడుచుకొని వచ్చినా, కూర్చునేందుకు మాత్రం ఒక పావు గంట తీసుకొన్నారు. ఒకరు చెట్టు ఊడల్ని పట్టుకొని నిధానంగా కూలబడగా, ఇంకొకడు వేరొకడి శరీరాన్ని ఆసరాగా చేసుకొని కూర్చున్నాడు. మరొకడ్ని ప్రక్కనున్నోళ్ళు పట్టుకొని కూర్చోబెట్టారు. మిగిలిన వాళ్ళు ఎవరంటే సుబ్బేగౌడకుతండ్రైన సీగేగౌడ, భైరప్పకు తల్లైన సుబ్బమ్మ, మల్లినమడుగు రామయ్యరెడ్డి మొదలైనోళ్ళు మాత్రమే పెద్దోళ్ళు కదా! భైరప్పడి భార్యతో జతగూడి వచ్చిన దలిత మహిళలంతా గుంపుగా కంచె ప్రక్కన నిలబడ్డారు. వారి వెనుక నుంచి మారడు, సిద్దడు, కరియడు... ఆ మహిళల నడుమ దార్ని చేసుకొంటూ ముందుకొచ్చి కూర్చున్నారు. వీరేగాకుండా, చుట్టుప్రక్కల ఊర్లలోని జనం కుతూహలంకని ఆ సభలో సభాసదస్యులుగా మారి కూర్చొండిపోయారు. సుమారుగా కొంతమంది బాగానే సారాయిని త్రాగినోళ్ళుగా అక్కడున్నారని సర్వాంతర్యామియైన సారాయిలోని వాసన నుంచి చెప్పొచ్చు మనం. శంక్రప్ప సుబ్బమ్మకు చెప్పిన జవాబుకు తలలను ఆడించినోళ్ళలో ఆ జవాబు మంచిదే అని తలలను ఆడించినోళ్ళు ఎంతమంది? నిషాను ఆపుకోలేక తలలను ఆడిస్తుంది ఎంతమంది అని చెప్పేందుకు కష్టమే అవుతది కదా!

'ఊరళ్ళి' హెగ్డెకూడా శంక్రప్పడి మాటలకు సరి అనేటట్లుగా తలను ఆడిస్తూ "అయ్యిందేదో అయ్యింది సరేలే. ఇక ముందు ఇటువంటిది జరగకూడదు కదా! అందుకే ఇది ఎందుకైంది? ఏమిటి కారణం? విచారణను చేసేందుకనే కదా మేము ఇక్కడిదాకా వచ్చింది. ఇప్పుడు కాళేగౌడడిలో లేనిదాన్ని ఏమి చూసింది నాగమ్మ ఆ మళయాళ పండితుడి వద్ద. మీరూ ఎన్నో దశాబ్దాలుగా సంసారాన్ని ఈదినోళ్ళే కదా" అని సుబ్బమ్మకు వివరించి అనంతరం సార్వజనికుల వైపుకు తిరిగి "ఈ విషయాన్ని చూస్తుంటే, ఆమె స్వంత బుద్ధిలోని పనే అనేటట్లుగా కనబడుటలేదు. ఆ పండితుడు ఏమైనా మాయను చేసి వశీకరణం చేసికొని యుండొచ్చు. లేకపోతే ఏదైనా గాలి తగిలి నాగమ్మ ఇలాగున

ఆడియుండొచ్చు. ఆ రెండు విధాలుగా అయ్యుంటే దానికేమైనా తిరుగుమంత్రం చేయ(వేయ) కుండా ఉంటే మరలా రేపో ఎల్లుండో మనమంతా నాగమ్మను వెతుక్కొనేందుకు బయల్దేరాల్సి ఉంటది?" అలాగిలాగున అంటూ తనమీద గురుతరమైన బాధ్యత ఉందనే దాన్ని ఇతరులలో చూపెట్టేందుకు ప్రయత్నించాడు హెగ్డె.

అక్కడికి అధ్యక్షుడేలేని వాళ్ళ పార్లమెంట్ మొదలైంది. అనేకులు ఆ సభలో తమలో తామే మాట్లాడుకొనేది చేయసాగారు. "ఔనుసుమీ... అంతట్ని మరిచి బతుకును సాగించేది అంటే ఎలాగున? కనబడినోడి వెనకే లేచిపోయిన మీదట అక్కడికే ముగుస్తది కదా బతుకు" అంటూ త్రాగిన మత్తులో ఒకడు చెప్పాడు. ఆ ప్రక్కనే అతని మాటల్ని విన్పించుకొన్న మరొకడు త్రాగిన మత్తునుంచే ఊగుతూ "ఈ కేసు ఎంతో సంక్లిష్టంగా ఉంది కదయ్యా. ఇప్పుడేమైనా గర్భిణిగా నాగమ్మ అయ్యుంటే పుట్టే శిశువును ఎవరి తలకు కట్టారు"? అంటూ గొణిగాడు. ఆ మాటలకు ప్రతిగా మొదటోడు "అయ్యయ్యో... నాగమ్మ నుంచి పిల్లలు కాలేదని కాళేగౌడ మరొక పెండ్లిని చేసుకొనేందుకు ఎదురుచూస్తున్నాడు. నాగమ్మ ఒక రోజు పండితుడి జతగా లేచిపోయి సంగమించితే గర్భిణిగా అయ్యేది ఉంటదా!" అని ప్రశ్నించాడు. "ఇప్పుడు ఆమె ఏమైనా నెల త్రప్పిందని అనుకో. అప్పుడు పిల్లలు కలగకనే ఉన్నదాన్కి కాళేగౌడడిదే ఇంతకాలం మిస్టేక్ (తప్పు) అనేది రుజువౌతది కదా" అంటూ మొదటగా మాట్లాడిన త్రాగుబోతోడు తన కల్పనలకు ముగుత్రాడును వేయకుండానే మాట్లాడాడు. అయితే అందరూ మాట్లాడుతున్నందునే ఎవరూ ఈ త్రాగుబోతోళ్ళ మాటల్ని పరిగణించుకోలేదు.

ఇలాగున ఒకరితో మరొకరు మాట్లాడుకొంటూ నాగమ్మ మీద కోపం ఎక్కువైయ్యేటట్లుగా సన్నివేశాలు నిర్మాణమైనవి. చివరికి "ఎక్కడ నాగమ్మ? ఇక్కడకు రమ్మనండి" అంటూ హెగ్డె మహిళలు నిలిచిన గుంపు మీదకు చూస్తూ ఆర్డర్ చేసాడు. ఆ గుంపులోనే నాగమ్మ నిలిచిందని హెగ్డె ఊహించాడు. అయితే రుద్రి "నాగమ్మ ఇక్కడ లేదు" అని అంది. హెగ్డె ప్రశ్నిస్తున్నట్లుగా కాళేగౌడ వైపుకు చూచాడు.

"పంచాయితి అయ్యి తీర్మానం పాస్ అయ్యే వరకూ ఆమె ఇంట్లోకి అడుగు వేసేందుకు అయ్యేది లేదని చెప్పాను. దానమ్మ చెంతే ఉందట" అన్నాడు కాళేగౌడ.

నాగమ్మ ఇప్పుడు దానమ్మతో జతగా ఉందని విన్న తక్షణమే శంక్రప్పడిలో అధైర్యం అయ్యింది. ఇప్పటికిప్పుడే ఆ గయ్యాళి దానమ్మ కోపంతో రేగిందంటే సభ ముందుకేసాగేది కష్టమౌతదని అన్పించింది అతనికి. అయితే తనేమైనా వెనకడుగువేస్తే సభలోని వారందరూ

తోకముడుస్తారని భావిస్తూ తన అధైర్యాన్ని చూపించకనే “ఇక్కడకు వచ్చేందుకని వెళ్ళి చెప్పండర్రో” అంటూ దళితుల వైపుకు తిరిగి కేక పెట్టాడు.

“నా పేమ్ బెత్తాన్ని ఇక్కడెక్కడో పెట్టాను కదా” అంటూ హెగ్డె తను పట్టుకొని త్రెచ్చిన బెత్తాన్ని వెతుకుతున్న దాన్ని చూసిన సుబ్బమ్మ “మహాశయా.... నువ్వు నాగమ్మను కొట్టేది, బాదేది ఉంటే ఇప్పుడే చెప్పు. నేను ఇక్కడి నుంచి లేచి వెళ్తాను. ఆ తర్వాత ఎవరు ఏమైనా చేసుకోండి. నా నుంచి మాత్రం మహిళా లోకంకు కొట్టేది, బాదేది చూసేందుకు అయ్యేది లేదు” అని అంది.

“లేదు లేదులే ఆ విధంగా. నా చేతిలో బెత్తం ఉంటేనే దెయ్యం పిశాచం నాకు లొంగుతది. అంతే మరిక తెల్సుకో! మరలా నేనెందుకు కనబడినోళ్ళ అర్థాంగుల మీద బెత్తంతో బాదించేది ఉంటది? నాకేమి పిచ్చా! తెల్సుకో సుబ్బమ్మా!” అని సంజాయిషిని ఇస్తూ హెగ్డె బెత్తాన్ని వెతికి చేతిలోకి తీసుకొనే వేళకు నాగమ్మ దానమ్మతో కల్సి పంచాయితి జాగా వద్దకు వచ్చింది. పంచాయితిలో ఉన్న గుంపంతా సంపంగి పూవులాగ కోటేరు ముక్కుతో ఎంతో సౌష్టవంతో ఉన్న ఆ సౌందర్యరాశి వైపుకు తిరిగింది. ఆ ఇద్దరు మహిళలు పంచాయితి రచ్చబండ నుంచి కొంచం దూరానే నిలబడ్డారు. వాళ్ళిద్దరి ముఖాలలో ఏ భయమూ ఉద్వేగమూ కనబడలేదు.

శంక్రప్పకు ఇంతగానున్న జనం ఎదురు దానమ్మ ఆట ఏమీ నడవదు అని అన్పించింది. ఎక్కువంటే ఒకింతగా గట్టిగానే ఆమె అరిచి, అందరిమీద ఉమ్మించు కొంటాము. అంతేకదా మరి అని అనుకొన్నాడు. హెగ్డె తన పీఠానికి తగినట్లుగా మర్యాదను ఇవ్వకనే నాగమ్మ మౌనంగా దూరంలోనే నిల్చింది చూసి “నాగమ్మ... ఇక్కడికిరా. తప్పునీది కాదు. ఎవడి చేతికి చిక్కుకొని అలాగున చేసావో అనేది నాకు గుర్తే. ఇక్కడ నా ముందు నిలబడి జరిగినదాన్నే పదిమంది సమక్షంలో ఔనో కాదో చెప్పు” అంటూ మరలా పిల్చాడు.

నాగమ్మ ఎక్కడ నిలబడి ఉందో అక్కడే నిలిచియుంది. కాళేగౌడ భార్యను పిల్చు కొచ్చేందుకని లెగిచేందుకు ఆసరాగా ప్రక్కన దేన్నైనా పట్టుకొని నిలిచేందుకు ఏదైనా ఉందేమోనని భావిస్తూ చూడసాగాడు. మిగిలినోళ్ళందరూ మూగోళ్ళలాగ నాగమ్మ హెగ్డెగారి ఆజ్ఞను పాటిస్తదోలేదో అని ఉద్వేగం నుంచి చూడసాగారు. నాగమ్మ మాట్లాడలేదు. తల ఎత్తలేదు. హెగ్డె రేగిపోసాగాడు. వీళ్ళ ఊర్లోని పంచాయితికి మేము అదెంతో దూరం

నుంచి వచ్చియున్నా, ఈ మహిళ తన మాటకు విలువ ఇస్తున్నట్లుగా లేదుకదా అని అనుకొన్నాడు. "వెళ్ళి తోలుకొని రారో బేగనే... శంక్రప్పా. ఆమె వంటిమీద అదెంత దెయ్యం ఉందో దాన్ని వదలగొట్టాను. మంచి మాటకు మర్యాద ఇచ్చిన దెయ్యాన్ని నేనింతవరకూ చూడ్లేదు" అంటూ గదిరాడు. హెగ్డె శంక్రప్పకు ఆర్డర్‌ను చేసిందాన్ని చూసి లెగవాల్సి ఉంటది కదా అని వెనకాముందూ చూస్తున్న కాళేగౌడ అలాగుననే కూర్చుండిపోయాడు. హెగ్డె నుంచి బయటకు వచ్చిన ధ్వనిలోని హఠాత్ మార్పులు అక్కడున్నోళ్ళందరి గమనానికి వచ్చింది.

మరలా కూలబడిన కాళేగౌడను, మౌనంగా కూర్చున్న మగోళ్ళ నీరస ముఖాల్ని చూసిన శంక్రప్ప ఆ సంకేతాల్ని సమ్మతిగానే భావించుకొంటూ నాగమ్మ భుజాన్ని పట్టుకొని దబదభా నెట్టుకొంటూ వచ్చి హెగ్డె దగ్గరకు ఆమెను త్రోసాడు. హెగ్డె తన పైచేయిని సాధించు కొనేందుకు ఇదే సుసమయమని తలపోస్తూ చేతిలో ఉన్న బెత్తం నుంచి నాగమ్మ నడుం మీద రఫ్ అంటూ ఒక వేటు వేసి "ఎవరునువ్వు? నోరును విప్పుతావా? కావాలా ఇంకా నాల్గు వేట్లు. పిలిస్తే మర్యాదలేదా నీకు" అంటూ అరిచాడు.

ఎరుపెక్కిన అతని ముఖం, ఎగశ్వాసల్ని పెట్టున్న అతని రొమ్ము ఇత్యాది వాట్ని చూసిన జనంకు హెగ్డెగారి వంటిమీదకు దేవుడు పూనినట్లుగా భావించుకోసాగారు. సందర్భానికి తగినట్లుగానే హెగ్డెకు సూచనల్ని ఇస్తున్నట్లుగా శంక్రప్ప "ఈ మహిళామణి చేసింది తప్పో ఒప్పో అని అణ్ణప్ప దేవుడే హెగ్డెగారి ముఖాంతరంగా చెప్పి ఊరును కాపాడాలి" అంటూ రెండు చేతులతో నమస్కారాల్ని చేసాడు. అప్పటికి అణ్ణప్పస్వామే హెగ్డె ముఖాంతరంగా నాగమ్మ దేహం లోపల చేరుకొన్న దెయ్యాన్ని దండించుతున్నది మంచిదే అని యోచిస్తూ మగోళ్ళంతా యక్షగానంను చూస్తున్న ప్రేక్షకులు లాగ ఉత్తిగనే కూలబడియున్నారు.

## 20

అప్పుడు దూరాన నిలబడియున్న దానమ్మ తగ్గించిన తలను ఎత్తింది. ఆమె ముఖాన్ని చూసిన సభ మొత్తం ఏదో దుఃస్వప్నాన్ని చూసినట్లుగా ఎగిరిపడింది. సాక్షాత్ దుర్గామాతే వంటిమీదకు వచ్చినట్లుగా ఉన్న ఆమె ముఖాన్ని చూసిన తక్షణమే హెగ్డేకు తను నాగమ్మను బెత్తం నుంచి కొట్టింది పెద్ద త్రప్పుగా అయ్యిందని తీవ్రంగా అన్పించింది. అంత భీషణమైన ముఖాన్ని అతను సినిమాలో సైతం చూసియుండలేదు. ఇప్పుడు నాగమ్మతో జతగా ఇంటి నుంచి వచ్చిన సురసుందరి ఈమేనా అని ఆశ్చర్యపడ్డాడు హెగ్డె.

హెగ్డె దానమ్మ ముఖాన్ని చూడకుంటే, ఎదురురొప్పుల్ని పెట్టూ 'హోహో' అని హుంకరించి వంటిమీదకు దేవుడు పూనినట్లుగా నాట్యాన్ని చేస్తుండేవాడో ఏమో! అయితే ఇప్పుడు దిగులుతో ఉన్న అతనికి ఏమేమి చేసినా అణ్ణప్ప దేవుడ్ని వంటిమీదకు రప్పించుకొనేందుకు స్ఫూర్తే రావట్లేదు. ఒకసారి హుంకరించేందుకు ప్రయత్నించినా గొంతు నుంచి పందిపిల్ల కీచుమన్నట్లుగా వికారమైన సప్పుళ్ళు వచ్చి తబ్బిబ్బైయ్యాడు. శంక్రప్ప మరొకసారి హెగ్డెను అణ్ణప్పస్వామేనని సంభోదిస్తూ ఎచ్చరించినా ఏమి ప్రయోజనం కలగలేదు. చివరికి ఇదేమి కారణమని దానమ్మ వైపుకు తిరిగిన మీదటే హెగ్డె వంటిమీదకు దేవుడి పూనకం వచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తుంది అనేది తెల్సిందతనికి.

వీళ్ళ జాతులు, వీళ్ళ ఆచారాలు, వీళ్ళ వివాహాలు, వీళ్ళ పంచాయితీలు.... ప్రతియొకటి మహిళలకు హింసను ఇచ్చే మగోళ్ళలోని నీచమైన తంత్రాలుగా దానమ్మకు కనబడింది. వీళ్ళే ఏదేదో చేసుకొని, ఆ తర్వాత అంతట్నీ త్రెచ్చి ఏదో ఒక స్త్రీ తలకు చుట్టే మగోళ్ళందరి మీద రేగిపోయింది. ఇందంతట్ని గుర్తుకు త్రెచ్చుకొంటూ పళ్ళను పటపటా కొరుకుతూ ఆమె తలెత్తింది.

"ఏమిటే... నోటిని నీ నుంచి విప్పేనా?" అంటూ ఇకనూ వంటి మీదకు పూనకం త్రెప్పించుకొనేందుకు ప్రయత్నాన్ని చేసిన హెగ్డె దగ్గరకు వచ్చి కర్కశంగా నిలిచింది దానమ్మ. సాక్షాత్ చండీదేవినే చూచినట్లుగా భయపడిన హెగ్డె మిగిలిపోయిన అంతో ఇంతో ధైర్యాన్ని కూడగట్టుకొని "ఏమి కనబడిందే నీకు. ఆ పండితుడి వెనకే లేచిపోయినదానికి వివరణ చెప్పవే" అంటూ నాగమ్మను అడిగాడు.

"అదెందుకు చెప్పాల్రో నీకు? మహిళలు మగోళ్ళ జతగా ఎందుకు వెళ్తారని ఆడదాని నోటినుంచే చెప్పాల్సి ఉందా నీకు? ఇక్కడెందుకు బెత్తాన్ని అటుఇటు త్రిప్పుతూ నిలబడ్డావు. వెళ్ళి నీ భార్య దగ్గర తెల్సుకొనిరా" అంది కటువుగా దానమ్మ.

"చేతిని పట్టుకొన్న మొగుడుండగా మిండడి (ప్రియుడి) వెనకే లేచిపోయినదానికి ఊరు పరువేమిగాను...." అనేదాన్నేదో వెనక నుంచి శంక్రప్ప మెల్లగా గొణిగాడు.

"అనేదాన్ని గట్టిగానే అన్రో! అదెందుకు లోన్లోనే మ్రింగుకుంటావు మాటల్ని. ఏమంటావో దాన్నంతట్నీ వినేందుకే ఇక్కడికి వచ్చాను. చేతిని పట్టుకొన్న మొగుడని అంటున్నావా? పిల్లలు కాలేదని మరొకామెను కట్టుకోవచ్చా ఈ మగమహారాజు" అంటూ

కాళేగౌడ మీద ఊసింది. "ఈ రోజు నోటిని గట్టిగానే విప్పే అడుగుతాను. నడుంను బెణికించుకొన్న భర్త వద్ద సంసారాన్ని ఎట్లాగున చేస్తది? జవాబును చెబుతావా... లేదా?" అంటూ శంక్రప్పడి మీదకు పడగవిప్పిన కోడెత్రాచులాగ బుసగొడ్తూ అడిగింది దానమ్మ.

మగోళ్ళంతా త్రుళ్ళి పడ్డారు. వారి నుంచి వారి భార్యలకు పిల్లలు కలగనిదానికి, నడుం బెణుకుకూ ఉండే సంబంధాన్ని సశాస్త్రీయంగా చూపెట్టి, ఆ బెణుకు నొప్పికి ఒక క్రొత్త నిర్వచనాన్ని ఇచ్చింది దానమ్మ.

కాళేగౌడకు సార్వజనికంగా మర్యాదపోయింది సహించుకోలేక "పిల్లలు కలగనందుకు మరిక ఏమి చేయాలి" అని క్షీణస్వరంలో అడిగాడు.

"బంజరు మహిళను (గొడ్రాల్ని) కట్టుకొని కాలాన్ని గడపాలా" అంటూ శంక్రప్ప కాళేగౌడడి ప్రత్యుత్తరం నుంచి స్ఫూర్తిని పొంది అరిచాడు.

దానమ్మ శంక్రప్పవైపుకు తిరిగింది. ఆమె కళ్ళలో మండుతున్న తిరస్కారం ఉంది.

"నీ కల్లు కాంపౌండ్‌లో కల్లు, సారాయిని త్రాగి ఎముకుల గూడులాగ అయ్యారు కదా ఈ మగసచ్చినోళ్ళు. కోస్తే మూడు తులాల మాంసం లేదు. త్రాగి రాత్రంతా రోడ్లలోనో, మురుగు కాల్వలలోనో పడ్తూ లేస్తూ ఇళ్ళకు చేరితే సంతానం ఎలాగున కలుగుతది? పిల్లలు కలగట్లేదట వెధవ ముండాకొడుకులికి! అమావాస్యకు ఒకసారి, పౌర్ణమికొకసారి భార్య గుర్తుకొచ్చి మైథునాన్ని చేస్తే పిల్లలు కలుగుతారా? థూ బేవార్సీకొడకా. నువ్వు నిజంగా మీ నాయనకు పుట్టియుంటే వెళ్ళి అడిగికొనిరా... ఎలాగున పుట్టించావని" అంది దానమ్మ.

అక్కడున్న మహిళాలోకానికంతా నిధానంగా జ్ఞానం రాసాగింది. దానమ్మలోని కోపం కేవలం కోపంలోని సన్నివేశం కాదు. దానికీ ఓ తర్కం, తెల్సుకొనే జ్ఞానం, ఆలోచనా లహిరిలోని పూర్వగాథ ఉందని అన్పించింది ఆ మహిళలకు. మగోళ్ళంతా ఎలాగున నిష్కారణంగా తమను అపరాధులుగా పరివర్తించుకొన్నారో తెల్సి వచ్చింది వాళ్ళకు.

నాగమ్మకు దెయ్యాన్ని విడిపిస్తానని కీళ్ళు విరిగేటట్లుగా హెగ్డె కొట్టేదాన్ని చూడాలి కదా అని కలవరంతో ఉన్న మహిళలందరికీ, దానమ్మను దేవుడే పంపిన దుర్గలాగ కనబడింది. వాళ్ళు గుంపుగా ఉన్న మొగోళ్ళ వైపుకు ఒకసారి చూసారు. నడుంను బెణికించుకొని నిట్టూర్పుల్ని చేస్తున్నోళ్ళు,సారాయిని త్రాగి వంటినే మరిచినోళ్ళు, జాతి

జగడాన్నిచేస్తూ యౌవ్వనాన్ని వృథాగా చేసుకొంటున్నోళ్ళు... ఈ పిచ్చి ముండాకొడుకులతో వేగేది ఎలాగున? సరైనోడెవడైనా దొరికి అతని జతగా ఎక్కడ బాగుంటదో (ఈ అనిష్టపు పీడలు ఉండవో) అక్కడి వైపుకు లేచిపోవాల్సిందే అని అన్పించింది వాళ్ళకు.

ఆ భావనలో నాగమ్మ పండితుడితో లేచిపోయింది అపరాధంగా కనబడలేదు. పై పెచ్చు అదొక సాహసంగా వాళ్ళకు (ఆ మహిళలకు) అన్పించింది.

“మంచి మాటలతో కరియడి వద్ద బెణుకులను తీయించుకొంటారో లేక మీ భార్యలు సంతలో చీరల్ని విప్పి దారిన వెళ్ళి వచ్చే వారినుంచి కడుపును చేయించుకోవాలో... మీరే యోచనను చేయండి” అనే కఠోరమైన నిర్ణయంలోని ధ్వనితో చెప్పి “పిల్లలు కలగాలనే మీకు ఉన్నట్లే మాకు ఉంటది” అంది దానమ్మ.

దానమ్మలోని అంతర్వాణిని వినిన అక్కడున్నోళ్ళంతా అదిరిపోయారు. చినరావూరులోని గయ్యాళులందరూ దానమ్మలోని రౌరవరూపంలోని మాటలకు తలలు ఆడిస్తున్న దాన్ని చూసిన హెగ్డె కంగారైయ్యాడు. కొద్దిగా నోటితో రేగే బజారు ముండలని అనుకొన్నాడేగాని ఇంతగా బరితెగించినోళ్ళని తెల్సుకోలేదు. ఇక ఈమె తిట్లను ముందుకే సాగేందుకు అవకాశాన్ని ఇస్తే అక్షరాల నాలుక నుంచి తమను చీల్చి చెండాడుతదని యోచించాడు.

శంక్రప్పడి ఒత్తిడికి లొంగి పంచాయితికి వచ్చిన కొంతమంది “దీనికంతా పంచాయితి ఎందుకని అడిగితే మా మాటల్ని విన్నారా?” అంటూ వెనుకన ఉన్నోళ్ళు గొణిగారు.

“ఇదేంటిది... ఆడకూతురు అనే మాటలేనా? ఏయ్! ఇక్కడ కూర్చున్నోళ్ళకు మర్యాద ఇచ్చి మాట్లాడు” అంటూ హెగ్డె అరిచాడు. ఇప్పుడైనా ఇక్కడ కూర్చున్న మగోళ్ళ మగటిమి (మగతనం) రేగి ఈ గయ్యాళులను చావ చితగ్గొట్టొచ్చని ఆలోచించి కొట్టే వాడిలాగ బెత్తాన్ని దానమ్మ మీదకు ఎత్తాడు.

ఈ మధ్యలో కరియడి భార్యైన కాళి “బెణుకుల్ని తీసేందుకు పొలం పనుల్ని ఆపేసి వారాలు వారాలు ఎక్కడెక్కడికో వెళ్ళి వస్తుంటావు. ఇక్కడ ఇంటి ప్రక్కన ముగ్గురు నడుం పట్టుకొని బాధపడుతుంది నీ కళ్ళకు కనబడలేదా? ఇదంతా అయ్యింది నీ నుంచే. మంచి మాటలతో వాళ్ళ బెణుకుల్ని తీసేస్తావా లేదా?” అంటూ కరియడి మీద రౌద్రావతారాన్ని చేసి మీద బడింది.

"అలాగున కాదే మహారాణి. నేను కాలుతో త్రొక్కి…." ఏమేమో చెప్పాడు కరియడు. అయితే కాళికి ఎంతగా కోపం వచ్చిందంటే కరియడి నుంచి మాటలు వినేందుకు ఒప్పుకోక "అవన్ని మాటలు వద్దు. ఆ రోజు చెట్టు మ్రొద్దు దొర్లుకొస్తూ వచ్చినప్పుడు 'నా తాళి మీద ఆన' అంటూ దానమ్మ శపథం చేసింది. ఆమే లేకపోతే ఈ రోజున మీ అమ్మకు తిలోకాదల్ని వదిలాల్సి యుండేది" అంటూ అరిచిన ఆమెను సమాధాన పరిచేందుకు దగ్గరకు వస్తున్న కరియడ్ని అందరెదురు కపాలం మీద నాల్గు వేట్లను వేసి ఆ ప్రక్కకు నెట్టేసింది. మిగిలిన మహిళలందరూ ఆమెను గట్టిగా పట్టుకొని యుండకపోతే కాళి సరిగానే అతడ్ని చావచితగొట్టేందుకు తీర్మానించుకొంది.

వంటిమీదకు ఏ దేవుణ్ణి ఆవాహనం చేసుకొనేందుకు అసమర్థుడైన హెగ్డె ఇప్పుడు దానమ్మను కొట్టేందుకు చేతిని లేపింది కేవలం ద్వేషం నుంచి మాత్రమే! మిగిలిన పురుషులందరూ దాన్ని చూసి అతను తమ ప్రతినిధి అన్నట్లుగా భావించి ఉత్తిగనే కూలబడినదాన్ని చూసిన ఆ మహిళలందరికీ, ఈ మొగోళ్ళను నమ్ముకొంటే సుఖం లేదు, తమపరంగా తామే పోరాడాలని అందరిలోనూ స్పష్టంగా తెల్సివచ్చింది. కాళిలోని ప్రవర్తన దీనికి మున్నుడిగా అయ్యింది.



హెగ్డె తననీ కొట్టేందుకని బెత్తాన్ని ఎత్తినదాన్ని, మగోళ్ళంతా పెదాల్ని కదపకనే చూస్తూ కూర్చున్నదాన్ని చూసిన దానమ్మ చింతనిప్పుకణికలాగ అయ్యింది. ఇంటి నుంచి నాగమ్మతో బయటకు వస్తున్నప్పుడే ఆమె అంతటికీ తయారై గడప దాటింది. హెగ్డె చేతినుంచి బెత్తాన్ని గుంజుకొని దాన్ని విరిచి అటు ప్రక్కకు విసిరింది. తన మంత్ర దండానికి అయిన దుర్గతిని చూసిన హెగ్డేకు పిచ్చికోపం వచ్చింది. "మొగోడి చేతిలో ఉన్న కర్రను గుంజుకొంటావా... దెయ్యంముండా" అంటూ కొట్టేందుకు చేతిని ఎత్తాడు. "కొట్టండ్రా ఆమెను. ఎంతటి మగరాయుడు ఈమె..." మొదలైన కేకలు మగోళ్ళ గుంపునుంచి వస్తున్నవి. హెగ్డేకు కొంచం ఖుషీ అయ్యింది ఇప్పుడు. ఆమెను కొట్టాలని ఒక వ్రేటు వేసేందుకు ఎత్తినచేతి నుంచి ఒక అడుగు ముందుకేవేసాడు. తన చేతికి సరిదూరంలోనే ఉన్న దానమ్మ పతాలునే అతడి మూతికి ఒక పిడి గుద్దును గుద్దింది. హెగ్డెగారి మూతి ఒకే క్షణంలో హనుమంతుడి మూతిలాగ వాసుకొని పళ్ళ నడుమ పెదాలు ఇరుక్కుపోయి ఆ పిడిగుద్దుకు నోటినుంచి రక్తం కారసాగింది. తన జిగ్రీదోస్త్‌కు తన నుంచి అయిన గతిని చూసి శంక్రప్ప ముందుకే దూసుకొచ్చి, ఆమె విరిచి విసిరేసిన బెత్తం కర్రలోని తుంపు భాగాన్ని తీసుకొని రపరఫ ఆమె ముఖాన్ని చూడకనే కొట్టసాగాడు. దానమ్మ పెదాలను బిగుతుగా పెట్టుకొని కమక్‌కిమక్ అని అనకనే అతడి దెబ్బల్ని సహించుకొంది.

దూరంలో నిల్చిన రుద్రికి రాతి విగ్రహంలాగ నిలబడిన దానమ్మ మీద శంక్రప్ప చేస్తున్న దాడిని చూసి, ఆమెలోని సహనం ఎగిరిపోయింది. అయ్యేదంతా ఈ వేళనే తీర్మానించబడనీ అంటూ "మొగోళ్ళకు సారాయిని, కల్లును త్రాపించి ఊరూరునూ నిర్వంశం చేస్తుందే గాకుండా మహిళల మీద చేతిని వేస్తావట్రోయ్" అంటూ పెడబొబ్బల్ని పెట్టూ తాను వాలుకొన్న కంచెకు వేసిన రెండు లావుపాటి సరుగుడు గుంజల్ని పీకి చేతిలో పట్టుకొంది మారడు చూసాడు. ఆమె చేతిలో ఉన్నవి సరివిగుంజలు. ఆ గుంజలతో సులభంగానే ఎవడ్ని కావాలనుకొన్నా ఆమె ఖూనీ చేయొచ్చని అతనిలో ఆ భావన కల్గింది.

"ఇంటిని పాడు చేసే ముండా... ఎవర్ని ఖూని చేయాలని అనుకొంటున్నావే" అని అరుస్తూ సరివి గుంజను గుంజుకొనేందుకు ఆమె చెంతకు దూకాడు. రుద్రి అతని మీదకు వీసిన సరివిగుంజ అతని మ్రోచేతికి తగిలిన తక్షణమే ప్రాణం పోయినట్లే "అయ్యో... చచ్చాన్రో" అంటూ అరుస్తూ చేతిని పట్టుకొని అక్కడే కూలిపోయాడు. "మొగుడ్నే కొట్టినామె తమనూ వదుల్తదా" అనుకొంటూ యోచించిన సిద్దడు, కరియడు, మిగిలిన

వాళ్ళు అక్కడ్నుంచి దూరంగానే పరిగెత్తారేగాని మారడికి సహాయపడేందుకు రాలేదు.

ఈ కొట్లాటలో చినరావూరులోని గయ్యాళులందరూ కంచెకు నాటిని ఒకొక సరివిగుంజ మీద చేతిని వేసి వాట్ని గుంజారు నేలలోంచి.

రుద్రి దానమ్మ చేతికి ఒక సరివి గుంజ ఇస్తూ బెత్తం కర్ర నుంచి కొట్టున్న శంక్రప్పడి కుడిచేతి మీద బలంగా ఒక ద్రేటును వేసింది. ఆ వేళకు ఆమెకూ శంక్రప్పడి నుంచి నాల్గైదు బెత్తం దెబ్బలు పడినవి. శంక్రప్పకు సరివిగుంజ నుంచి వేటుపడిన తక్షణమే అతడి చేతికి పిడుగు త్రాకినట్లైంది. అతను పట్టుకొన్న కర్ర అనేక గజాల అవతల పడింది. విరిగినట్లుగా భావం కలుగుతున్న చేతిని పట్టుకొని కూలబడిపోయిన శంక్రప్పడ్ని "ప్రభుత్వ సారాయిని కల్లును త్రాపించి ఎంతమంది ఇళ్ళను నాశనం చేస్తావురో? నాగమ్మను బంజరు స్త్రీ (గొడ్రాలు) అని అంటావా... ఇళ్ళను కూల్చే సచ్చినోడా... నీ రక్తాన్ని త్రాగుతాను ఈ రోజు... ఊర్లో మహిళ మీద పంచాయితి చేసేందుకు వస్తావా" అంటూ దానమ్మ సరివిగుంజ నుంచి అతడ్ని కుళ్ళబొడిచింది.

మహిళలంతా వెర్రివెర్రిగా ఆ సరుగుడు గుంజల్ని అటుఇటు ఊపుతూ పంచాయితిలో ఉన్న గుంపు వైపుకు ఉరికారు. వాళ్ళకు తను శక్తి గురించిగాని తమ చేతిలో ఉన్న సరివి గుంజ నుంచి జరగబోయే అపాయకరంలోని సాధ్యత మీద గాని సరైన అందాజు లేనేలేదు. అడ్డంగా వచ్చిన కొంతమంది త్రాగుబోతోళ్ళకు ఆ సరివిగుంజల దెబ్బ తగిలిందే తడవుగా ప్రాణంపోయినట్లై ఆ మహిళలు విసురుతున్న శక్తిశాలి ద్రేట్లుకు శవాలై పడిపోతామని తెల్సుకొని అందరూ అక్కడ్నుంచి చెల్లాచెదురైయ్యారు.

కాళి బెత్తం కర్రలోని తుంపు భాగాన్ని చూపిస్తూ కరియడ్ని బెదిరిస్తుంది. కరియడు దండాల్నిపెట్తూ కొట్టకే అంటూ ఆమెకు ఏదో దాన్ని చెపుతున్నాడు. బహుశః "ఊర్లోవాళ్ళ బెణుకులను నివారిస్తాను... నీకు దండమే తల్లి" అంటూ అంగలార్చుతున్నాడో ఏమో! మహిళల నుంచి సరివిగుంజల ద్రేట్లు తమ మొగుళ్ళకు, పరాయి ఊళ్ళ నుంచి వచ్చి నోళ్ళకు, తమాషను చూసేందుకని వచ్చి కూర్చున్నోళ్ళకు.... ఇలాగున అందరి మీద దెబ్బలు పడినవి.

మర్రి మానుకు వాలుకొని కూర్చున్న సీగేగౌడగారు తమ కోడలి నాయకత్వం నుంచి ఊర్లోని మహిళలంతా పెద్ద పులులులాగా ప్రవర్తించినదాన్ని చూసి, ఆ పడిపోయిన పనస చెట్టులో దాగియున్న దెయ్యాలన్నీ వీళ్ళలో పరకాయ ప్రవేశంగా చేరినవని తీర్మానించుకొన్నాడు.

మూతి వాసిపోయి, ఉబ్బు మూతితోయున్న హెగ్డెకు ఏమి జరుగుతుందనేది గ్రహించలేనంతగా తల ఝుమ్ అంటున్నది. విప్పసారాయిలోని నిషా మూతిమీద పడిన పిడిగ్రుద్దు మూలాన క్రిందకు పడిపోయిన తక్షణమే తలకు ఎక్కింది. రుద్రి విసిరిన సరివిగుంజ అతని తలకు ఒకే ఒక జానెడు దూరంలో త్రప్పిపోగా, కొద్దిలోనే తన సావు తప్పిపోయిందని కచ్చితమైంది హెగ్డేకు. ఎంతో అవమానం కల్గినా సరే, ఇక్కడ్నుంచి మొదట పారిపోయి ప్రాణాన్ని నిలుపుకోవాలని హెగ్డెకు అన్పించింది. అందరూ చూస్తుండగానే ధోవతిని సరిచేసుకొంటూ పారిపోసాగాడు.

దానమ్మ శంక్రప్పడితో "నీ రక్తాన్ని త్రాగుతాను" అంటూ పలికింది కోపంలో మహిళలు చెప్పే పిచ్చి మాటలు లాగ కనబడలేదు. ఆమె పలుకులు అతడికి విధించిన మరణదండన లాగ కనబడింది. అంతలోపే అతని కళ్ళెదురే హెగ్డె పంచెను దోపుకొని పారిపోతున్న దాన్ని చూసిన మీదట ఇంకా ఈ మహిళలు సరివిగుంజల్నుంచి తన కాళ్ళు విరిగేంత వరకూ వేచియుండేది అవివేకమని తీర్మానించుకొని, విరిగినట్లుగా బాధ పెట్టున్న చేతిని ఇంకొక చేతిలో పెట్టుకొని పారిపోగాసాడు శంక్రప్ప.

ఎవరో తూలుకొంటూ అడ్డంగా వచ్చిన త్రాగుబోతోడి మెడను పట్టుకొని అటు ప్రక్కకు నెట్టేసిన దానమ్మ పారిపోతున్న శంక్రప్పడి వైపుకు చూసి "పట్టుకోండి... ఆ భాడకోవ్‌ను. వదలకండి ఆ బద్మాష్‌ను. వాడ్ని ఈ రోజు జీవ సమేతంగా విడిచేది లేదు" అంటూ కేకల్ని పెట్టింది.

మగోళ్ళు ఎదురైతే చాలు, తలుపుల చాటున నిలబడుతుండే ఆ మహిళలు ఇంత సులభంగా మగోళ్ళంతా దిక్కుపాలై పలాయనం చేసినదాన్ని చూసి, ఇన్నిసంవత్సరాలు ఎందుకు వీరికి  బెదిరాము? వీరు పెట్టున్న హింసను అనుభవిస్తూ ఇప్పటి వరకూ కాలాన్ని గడిపినదాన్కి ఆశ్చర్యపడ్డారు. అయితే ఇప్పుడు ఆ పాతదాన్నంతా యోచించి ఆశ్చర్యపడుతూ కూర్చునిపోయేందుకు వాళ్ళలో సమయంలేదు. దానమ్మ, రుద్రి శంక్రప్పడ్ని పట్టుకొని చంపుదామని పరుగెత్తుతున్నారు. వారిని అనుసరిస్తూ మిగిలిన మహిళలూ పరిగెడుతున్నారు.

శంక్రప్పకు ఈ రౌద్ర మహిళలు (కల్కత్తా కాళీలు) తన వెన్నంటే వస్తున్నదాన్ని చూసిన మీదట తనను చంపేందుకే ముందస్తు ప్రణాళికలతోనే గూడుపురాణీ చేసి నాగమ్మ నుంచే నాటకాన్ని ఆడారనే అనుమానం అయ్యింది. ప్రాణం మీద ఆశెకు ఒకడు ఎంత జోరుగా పారిపోగలడో అంతమట్టంలో (లెవల్‌లో) జోరుగా పరిగెత్తి ఈత వనాల నడుమ కనుమరుగైయ్యాడు.

మహిళలు ఇక శంక్రప్పుడు దొరికేది లేదని కచ్చితమైన మీదట ఊరి అంచున దారులు కలిసే చోట అతను నడుపుతున్న కల్లు కాంపౌండ్‌కు దూసుకొచ్చారు. ఆ దుకాణంలో క్రేటర్‌లలో ఉంచిన కల్లు, సారాయి బాటిళ్ళను పగలగొట్టి, అతడి దుకాణంలో ఉంచిన కొలపాత్రల్ని, గ్లాసుల్ని పొడిపొడి చేసి, శంక్రప్పడి మీదున్న కోపాన్నంతా ఆ కల్లు అంగడిమీద తీర్చుకొన్నారు. కపాలాన్ని చేతబట్టిన కాళికాదేవి లాగ తల శిరోజాల్ని చెదరగొట్టుకొని సరివిగుంజల్ని విసురుతూ అక్కడికి దూసుకొచ్చిన ఈ ఆజానుబాహురాళ్ళైన మహిళలను చూసి, ఆ కల్లుకాంపౌండ్‌లో ఉన్న ఒకే ఒక పొరుగు ఊరికి చెందిన గిరాకిదారుడు ఆ కాంపౌండ్‌లోని సప్లైయర్‌కు చెప్పకనే వినకనే చేతిలో దాబెట్టుకొన్న బాటిల్ సమేతంగా పలాయనం చేసాడు.

అప్పటికి శంక్రప్పడి నుంచి ఏర్పాటుగావించబడిన పంచాయితి ఈ రీతిలో బరఖాస్తు (ముగించటం)ను చేసిన చినరావూరు లోని గయ్యాళులు ఎంతో ప్రొద్దు అయిన మీదట ఊర్లోకి తిరిగి వచ్చారు. వాళ్ళ కోపం కొంచమూ దిగిపోలేదు. అందుచేత ఏ మగోడు వాళ్ళను మాట్లాడించేందుకు సాహసాన్ని చేయలేదు. పంచాయితిలో దెబ్బలు పడి కుయ్యో మొర్రో అంటున్న మగోళ్ళతో " మీ ఉపద్రవాల్ని సహించి సహించి విసుగేసి పోయింది మాకు. మీరుంటే ఎంత? సస్తే ఎంత?" అంటూ "ఇప్పుడేమైనా మీ ప్రాణాలుపోయినవా? ఇన్ని సంవత్సరాలు మీ నుంచి దెబ్బల్ని, ప్రేట్లను, చివాట్లను తిన్నాం కదా! మేముకొట్టిన దెబ్బల రుచినీ చూడండి ఇప్పుడు" అని అంటూ దుమ్మెతి పోసారు.

# 22

శంక్రప్పడిది పర్మిట్ లేకుండానే పెట్టుకొన్న దొంగ దుకాణం. అందుచేత కంప్లైంట్ ఇస్తే తన తలకే చుట్టుకొంటదని గుర్తై అతనూ, ఊరళ్ళి హెగ్డె ఇద్దరూ ఆ దొమ్మి విషయాన్ని ఎక్కడా ఎత్తలేదు. దీనికి తోడుగా వీళ్ళే పంచాయితిని చేసి మహిళలను మొదటగా కొట్టినందున పోలీసులకు దొమ్మికేసుగా పిర్యాదు ఇచ్చినా విచారణలో తమ పీకల మీదకే కేసు ఉల్టాగా వస్తదని మిన్నకుండిపోయారు. శంక్రప్పడైతే ముఖాన్ని చూపించ లేక కొన్ని వారాలు ఊరును వదిలి పారిపోయాడు ఎక్కడికో.

కరియ ఆ ముగ్గురు బాధితుల్ని పడుకోబెట్టి మోచేతిని బలంగా వెన్నుకు రాపించుతూ కాలితో మర్ధించుతూ ఆ నడుం నొప్పిని పోగొట్టాడు సాంప్రదాయబద్ధమైన నాటు వైద్యంతో. పంచాయితిలో మహిళల నుంచి ప్రేట్లును పొంది మగోళ్ళు పారిపోయిన భారీ సమాచారం మూలాన, నిమ్మకులస్తుడి కాలి నుంచి మర్ధించుకొని బెణుకును నివారించుకొన్న సుద్ధి

గౌప్యంగా నిక్షిప్తమైపోయింది. ఐదారు రోజులకే వాళ్ళకు (ఆ రైతులకు) నడుములు సరిగా అయ్యి, తమ తమ దైనందిన సంసారంను తమ తమ పత్నుల జతగా సరాగంగా సాగించసాగారు. ఎందుకంటే వారివారి అర్థాంగులు మరిక ఎవరూ వేరే ఎవడి సఖ్యంతో లేచిపోయిన సుద్ది బయడపడలేదు.

❀ ❀ ❀

ఇక్కడికే ఈ కథ ముగిసిందని అనుకోకండి. కత అంటే నిరంతరంగా ప్రవహిస్తుండే జీవితానికి ఒక చౌకట్టును వేస్తదంతే. చినరావూరులోని గయ్యాళులు కల్లుకాంపౌండ్‌ను నాశనం చేసిన సుద్ది అదెట్లాగో రైతు పోరాటంకు స్ఫూర్తిని కలుగజేసింది. గవర్నమెంట్ సారాయి మరియు క్లోరల్ హైడ్రేట్‌ను కలిపిన కల్లు త్రాగి జీవ చైతన్యాన్నే పోగొట్టుకొన్న ఊరువాడల లోని పురుషుల సహభాగస్వాములు (మహిళలు) తిరుగుబాటును చేయసాగారు. అన్ని సారాయి, కల్లు దుకాణాల ఎదురు పోరాటాలు ప్రారంభమైనవి.

వేలంలో వెర్రివెర్రిగా రేటు పెట్టి కాంట్ర్యాక్ట్‌ను పొందిన 'మోటేగౌడ'కు ప్రతిదినం లక్షలలోనే నష్టం రాసాగింది. అతను సైతం ఎక్సైజ్ వాళ్ళను,స్వంత గూండాగాళ్ళను వెంటేసుకొని ఊళ్ళ మీద దాడిని చేయసాగాడు. జీపుల, వ్యానులనిండా ఆయుధాల్ని నింపుకొని రోజుకొక దిక్కుకు దాడి చేసేందుకు వెళ్తుంటే అది పరాయి దేశస్తుల విరుద్ధంగా నడిచే మిలటరి ఆపరేషన్ లాగ కనబడసాగింది.

పెనవేసుకొన్న భయంకరమైన అడవిలో 'కంచగేరి' అనేఊరు ఒకటుంది. అక్కడికి వీళ్ళు దాడిని చేసేందుకు వెళ్ళగా రైతులు వీళ్ళకు వెనుదిరిగి వెళ్ళిపోయేది లేనట్లుగా ఆ దారికి అడ్డుగా చెట్లను కొట్టిపడేసి, కాంట్ర్యాక్టర్‌కు చెందిన గుండాగాళ్ళను, ఎక్సైజ్ వాళ్ళను క్రూరమృగాల్ని కొట్టినట్లుగా కొట్టి బట్టల్ని ఊడదీసి దిగంబరులుగానే తమ కాంట్ర్యాక్ట్ డిపోను తలుపేటట్లుగా చేసారు. జీపును, వ్యానును తగలబెట్టగా ఏదో విధంగా ప్రాణాల్ని అరచేతిలో  పెట్టుకునే ఆ ఊరు నుంచి బయటపడ్డారు ఆ దుష్టపటాలం.

ఆ మీదట "లా అండ్ ఆర్డర్" అని పోలీసులు ఈ సారాయి కాంట్ర్యాక్టర్‌తో మమేకమై కార్యాచరణను ఆరంభించారు. సాలిగ్రామంలో రైడింగ్‌కని వచ్చినోళ్ళు మహిళ స్తనాలమీద చేతిని వేసారు. వేటకు శికారికని వెళ్తున్న మంజప్ప తన నాటు తుపాకి నుంచి రెండు తూటాల్ని ప్రయోగించాడు. అతని తూటాలకు అక్కడే ఆ ఊర్లోనే ఇద్దరు పోలీసులు చనిపోయారు.

గవర్నమెంట్ శక్తియుతమైన స్పెషల్ పోలీసుల్ని ఆ కాంట్ర్యాక్టర్‌కు అనుకూలంగా పంపించింది. వరుసగా ఊళ్ళనుంచి ప్రతీకారాలు, పోలీసుల దమనకాండ... వీటి మూలాన మొత్తం ఆ ప్రాంతంలో ఒక అంతర్ యుద్ధంలోని పరిస్థితి నిర్మించబడింది.

'హుల్లహళ్ళి' లో దొంగసారా కాస్తున్నదాన్నిచూసి ఎవరో ఆ సారాయి మట్టి బానలో నుంచి దిన నిత్యం ఆ సారాయిని దొంగిలించి త్రాగుతున్నందున, ఒక రోజు ఆ నాటు సారాయిని కాసే పద్మణ్ణ ఆ బానలో పాలిడాల్ పౌడర్‌ను కలిపాడు. అదేరోజు రైడింగ్‌కని వచ్చిన ఎక్సైజ్‌వాళ్ళు అతడి దొంగసారా మట్టిబానను సీజ్ చేసి, దాన్ని మోసుకెళ్ళి గవర్నమెంట్ సారాయి ట్యాంక్‌లో పడేసారు. ముందు నడిచిన దురంతాన్ని మీరందరూ పత్రికలలో చదివియుండొచ్చు కదా! సాయంకాలంలోపే సారాయిని త్రాగి చచ్చిన వాళ్ళ సంఖ్య వందలలో ఉంది. తిరగబడిన జనాన్ని శాంతపరిచేది ఎవర్నుంచి సాధ్యంగాక పోలీసులు లా అండ్ ఆర్డర్‌ను వదిలేసి కేవలం తమ ఆత్మ రక్షణ ఒక్కదానికే గమనాన్ని పెట్టుకోవాల్సి వచ్చింది. నష్టాన్ని తట్టుకోలేక 'మోటేగౌడ' ఆత్మహత్యను చేసుకొన్నాడు.

దీన్నంతా వ్రాసేందుకు ఉపక్రమిస్తే చినరావూరులోని గయ్యాళులకు సంబంధించిన ఇంకొక పెద్ద కథ బయటకు వస్తది. మూడురాత్రిళ్ళు, మూడు పగళ్ళు చినరావూరు మీద వీసిన సుడిగాలి నుంచే ఇదంతా ప్రారంభమైనదని చెప్తే బాదరాయణ సంబంధాన్ని చూపినట్లుగా ఉంటది. అందుచేతనే కరియ ఆ ముగ్గురురైతుల బెణుకుల్ని నివారించినప్పుడే ఈ కథ అధికృతంగా ముగించబడింది కదా!

అవునో కాదో?

మీరే చెప్పండి? (పాఠకులారా)

❀ ❀ ❀

(బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఏ రంగంలో అడుగిడినా దాన్లో పరిపూర్ణతను సాధించిన దివంగత పూర్ణచంద్ర తేజస్వి ఈ కతను కన్నడంలో ముప్పై సంవత్సరాల క్రితం రచించారు. తేజస్వీగారు మరణించి నేటికి మూడు సంవత్సరాలు మీరినవి (05-04-2007). పర్యావరణంలో, సేంద్రీయ వ్యవసాయంలో, సాహితి వనంలో అపరిష్కృతమైన చర్చలు జరిగినప్పుడు తేజస్వీగారి అనుభవాన్ని పొందేందుకు కన్నడ సమాజం ఎంతగానో ఎదురు చూస్తుండేది. సభలన్నా, సన్మానాలన్నా గిట్టని తేజస్వీగారు గ్రామీణ భారతంలో రైతుగా నిలద్రొక్కుకుంటూ తనకు సేద్యంలో ఎదురైన సంఘటనలను ముఖ్యంగా అట్టడుగున

ఉన్న జనుల మనో వైజ్ఞానికను బహు విపులంగా తన రచనల ద్వారా వెల్లడించారు. తండ్రి జ్ఞానపీఠ పురస్కారాన్ని, తోడబుట్టినోళ్ళు మరియు వారి పరివారం సమాజంలో ఎంతో ఉన్నత స్థానాలలో ఉన్నా, తనకు ప్రీతి పాత్రమైన గ్రామీణ జీవనాన్నే ఎంచుకొని, ఎన్నో రచనలతో అలరారిన పూర్ణచంద్ర తేజస్విగారి రచనలు ప్రతి గ్రామంలోని ఇళ్ళలో (కర్ణాటకలో) పూజనీయస్థానంలో ఉంచబడినదాన్ని అనువాదకుడ్నైన నేను గమనించటం జరిగింది.

తను చతుర్వేదినని (నాలుగు వేదాలను చదివినోడినని), తను రాసిందంతా పంచమవేదమేనని, తన తండ్రి జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందినోడని జనానికి చెప్పుగోకనే, తన పాటికి తను అన్నట్లుగా తను పుట్టి పెరిగిన స్థళం నుంచి ఎంతో దూరానున్న అడవి చెంతకు వెళ్ళి ఆ వనసిరిలో వ్యవసాయం చేసుకొంటూ, తనకు తోచినప్పుడు తను ఎదురించిన (అనుభవించిన) గ్రామీణ జనుల జీవితాల్నే, తన రచనలకు ప్రేరణగా తీసుకొని మనముందు ఆ రచనలను పంచారు. వీరు 08-09-1938న శివమొగ్గ జిల్లాలోని కుప్పళ్ళిలో జన్మించారు.

తెలుగు అనువాదం: శాఖమూరు రామగోపాల్. 27-01-2009.

# ముసల్ది చెప్పిన సర్:ఎం.వి.గారి కథ -
# సర్:ఎం.వి.గారే చెప్పిన ముసల్దాని కథ

## 1

కొన్ని సంవత్సరాల క్రితం స్వగ్రామంకు వెళ్ళినప్పుడు తెలుసుకొన్న కథ ఇది. మా సీమలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారు ఎంతగానో ప్రశిద్ధులు అంటే అదేమి ఉత్ప్రేక్షమాట కానేకాదు. భరీరథుడు-గంగ కతను గురించి భాగవతులు ఊళ్ళలో చెప్పేటప్పుడు, సర్:ఎం.వి.గారి కథను మున్నుడిగా (పీఠికగా) చెప్పి భగీరథుడి కఠోర తపస్సును వివరించితేనే మా పల్లెలలోని జనానికి సరిగా అర్థమవుతది. దీనిచేత ఎం.వి.గారి ప్రభావం మా సీమలో ఎంత గాఢంగా ఉందనేది పాఠకులైన మీ మదిలోకి రావచ్చుకదా!

కన్నంబాడి ఆనెకట్టను కట్టి అందులో సేకరించిన నీరును మాండ్య జిల్లా మొత్తానికి కాలువను తోడించే పనులకని ఎం.వి.గారు ఒకసారి మా ఊరికి వచ్చినదాన్ని ఇప్పటికీ జనం గుర్తుచేసుకొంటారు. సర్: ఎం.వి.గారు మా ఊరికి వచ్చినప్పుడు ఉదయమో - మధ్యాహ్నమో అనేది కూడా మా ఊరోళ్ళకు జ్ఞాపకంలో ఉందిలే. ప్రతిగ్రామంలోని మట్టిని ఎం.వి.గారు ముట్టిముట్టి పరీక్షగా చూసి, ముష్ఠిలో ఆ మట్టిని పట్టుకొని పరీక్ష చేసి ఈ మట్టి ఇటువంటి పంటలకు, తోటలకు శ్రేష్టం అని గ్రామస్తులకు చెప్పేవారట.

గాంధి, సుభాష్, నెహ్రూ, వివేకానంద, శివాజి, విశ్వేశ్వరయ్య...మొదలైన వారి ఫోటోలు మా సీమలోని అందరి ఇళ్ళలోనూ ఉండేవి. ఒకొకసారి గాంధి ఫోటో ఉన్న ఇంట్లో వివేకానందుడి పటం ఉండకపోవొచ్చేమోగాని అందరి ఇళ్ళలో మాత్రం సర్: ఎం.వి.గారి ఫోటో మాత్రం గ్యారెంటీగా ఉండేది. అంతెందుకు, రైతుల ఇళ్ళలో పంటల లక్ష్మి పూజకని పదిహేను రోజుల వ్రతాచరణలో లక్ష్మిదేవి పటంకు ప్రమిదను పెట్టినట్లే సర్: ఎం.వి.గారి పటం ముందుకూడా ప్రమిదను పెట్టారు. కోమట్ల ఇళ్ళలో దీపావళి పండుగ రోజున లక్ష్మిపూజకని లావాదేవిల క్రొత్త పుస్తకాల జతగా సర్: ఎం.వి.గారి ఫోటోను పెడ్తారు. బ్రాహ్మణుల ఇళ్ళలో దేవుడి పటాలకు పెట్టినట్లుగానే సర్: ఎం.వి.గారి పటంకు గంధపు -కుంకుమల బొట్టులను పెట్టేదాన్ని మీరు చూడొచ్చు.

తమ సంతానం సర్: ఎం.వి.గారంత బుద్ధిమంతుడు అయ్యే ఆశతో ఎంతోమంది తల్లి-దండ్రులు వీరి పేరును తమ వారసులకు పెట్టుకొనేవారు. అన్న-తమ్ముడు ఇద్దరికీ వారి పేరునే పెట్టి పెద్ద విశ్వేశ్వరయ్య, చిన్న విశ్వేశ్వరయ్యగా పిలుచుకొనేది వాడికగా ఉందిలే. ఇంతగా వారి ప్రఖ్యాతి ఉండటంతో, వారి జన్మదినాచరణ పండుగను ప్రతిగ్రామంలోని యువక సంఘాలు ఎంతో విజృంభణంతో ఆచరించేదానిలో ఆశ్చర్యం ఏముంది? ఆ రోజున స్కూళ్ళకు సెలవు. పశువులకూ వ్యవసాయ పనులేవీ ఉండేవి కావు. ఎం.ఎల్.ఎ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, హెడ్‌మాష్టార్... ఇలాగున అందరూ సభలో మాట్లాడుతారు. ఆ వక్తలలో ఎంతోమంది సర్: ఎం.వి.గారిని చూడకపోయినా, తామే వారిని కండ్లారా చూసినోళ్ళలాగ, మాట్లాడినాము అన్నట్లుగా ఆ మీటింగ్‌లో ఉపన్యాసాల్ని చేస్తారు. వాళ్ళు చెప్పే ఉపన్యాసంలో అబద్దాలు, అతిశయోక్తులు ఉన్నా, దీన్నంతా కృతజ్ఞత, ప్రీతి-వాంఛలతో చెప్పే మాటలు గనుక ఎంతగానో ఇష్టంగా ఉండేవి చెప్పేవాళ్ళకు, వినేవాళ్ళకు.

ఈ సంవత్సరం సర్:ఎం.వి.గారి జయంతి పండుగకు నన్ను ప్రధాన వక్తగా ఆహ్వానించారు. నేను నా దగ్గరున్న పుస్తకాల్ని, పాతపత్రికలను తిరగేసి సర్: ఎం.వి.గారు గాంధి, నెహ్రూ, కెంగల్ హనుమంతయ్య; బ్రిటిష్ వైస్రాయి, రాజమహారాజులను కల్సినప్పుడు వారి వారి మధ్యన దేశ నిర్మాణం కని ఏమేమి చర్చలు నడిచినవి అనే వాటన్నిట్ని ఒక పట్టీగా చేసుకొని ఆకర్షణీయంగా చెప్పాలనే లెక్కల్ని వేసుకొన్నా. సభలో మొదటగా స్కూలు హెడ్ మాష్టార్, తర్వాత ఎం.ఎల్.సి. సంభాషణ; ఆ పిమ్మట నేను... ఇలాగున ఉంది ఉపన్యాసకుల పట్టీ.

ఎం.ఎల్.సి.గారు ఉపన్యాసాన్ని ముగిస్తున్నా.... ముగిస్తున్నా అని రెండుసార్లు చెప్పినా ఇంకా మాట్లాడుతూనే ఉన్నారు. ఆ వేళలో ఒక ముసల్ది మీటింగ్ నడుస్తున్న వేదిక వద్దకు వచ్చింది. "పోవమ్మా...పో బయటకు..., నీకేమి పనియుంది ఇక్కడ" అని జనం కేకల్ని పెడ్తూ గదిరించి, మాటలతోనే ఆమెను భయపెట్టేందుకు ప్రయత్నించినా ఆ ముసల్ది వేదిక వద్దకు రానేవచ్చింది. వెన్నెముక ధనస్సులాగ వంగిపోయి ఉంది. ఆమె దేహం గూనిది లాగ ఉంది. తలను పైకెత్తే స్థితి లేనందున ఆమె ముఖారవిందం ఎలాగుందోనని చెప్పేందుకు కుదరటంలేదు. ఆ ముసల్దాని ఆకృతి మూడు – మూడున్నర అడుగుల కొలతలోనే ఉందిలే. "ఈ ముసల్ది ఎవరు? ఇక్కడికి ఎందుకొచ్చింది?" అని నేను అనుకొనేలోపలే ఈ ముసల్ది బొంగురు స్వరంతో మాటలను ప్రారంభించింది.

“మీకేమి గుర్తు? అతని కథ! నాకు గుర్తే.... నేనే చెప్తా! నాకు ఎంత, ఎంతగానో ఉపకారం దొరికింది ఆయన నుంచి! వెనకొకసారి అతను మన ఊరికి వచ్చి, పంచాయితి ఆఫీసులో–” ముసల్ది వటవటా చెప్పేందుకు ప్రారంభించింది. ఇప్పుడు ఆమె తన రెండు చేతుల్ని కుర్చీమీద ఆనించింది. జుట్టు రాలిపోయి గుండుతో ఉన్న తల ముఖం అంతా నేలనే చూస్తున్నట్లుగా ఉంది. ఎంత ఉండొచ్చు ఈమె వయస్సు? 75 లేక 80 సంవత్సరాల్ని మీరొచ్చు. బోడిగుండును చూస్తే ఈమె బ్రాహ్మణ విధవరాలేమో అని అన్పించింది. అయితే, ఆమె ఎర్రచీరను ధరించలేదు. నలుపు రంగుతో ఉన్న చీరను కట్టింది. సరిగా చూస్తే చీరను ఎలాగెలాగో చుట్టుకొని ఉంది.

ఎం.ఎల్.సి.గారు కూడా అరిచారు. “ఏయ్ భాగ్యమ్మా.. నువ్వు ఇంటికి వెళ్ళు.... ఇక్కడేమి పని నీకు?” జనం కూడా “వెళ్ళు,వెళ్ళు, బయటకే పో” అని గదిరిస్తున్నా ఆ ముసల్ది ఇసుమంతైనా కదలలేదు. కొన్ని క్షణాలు గడిచిన మీదట జనమే ‘ఉత్తిగనే నించో, ఏమి మాట్లాడగాకు’ అని చెప్పి తమలో తామే శాంతించారు. ముసల్ది అలాగునే, నిలిచియుంది. అయితే ఎవరైనా ఉపన్యసించేదానికని మొదలుపెట్టే మధ్యలో ఆమె కూడా అప్పటికప్పుడే మాట్లాడేందుకు ప్రయత్నాల్ని చేయసాగింది. జనం గోలను చేస్తూ ముసల్దాని నోటికి తాళాన్ని వేసారు. ఇలాగున సమారంభం ముగిసింది. ముసల్దిమాత్రం వేదికను దిగలేదు.

నా ఉపన్యాసంలో నాకు ఆసక్తి మిగలలేదు. మనసంతా ముసల్దాని మీదే. అయినా నా ఉపన్యాసం బాగుందని గాంధీ, నెహ్రూలతో సర్: ఎం.వి.జరిపిన చర్చలు, వాళ్లముందు ఉంచిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ Power point presentation ఎంతగానో తమందరినీ ఆకట్టుకొన్నవని సభికులు అన్నారు నాతో. నాకు ఉపన్యసించేది సరిగా రాదని, మాటల్ని మింగి మింగి మాట్లాడుతానని రేగించే నా అర్థాంగి కూడా ఈ రోజున ఎంతో చక్కగా, స్పష్టంగా ఉపన్యసించానని పొగిడింది. ఆ ప్రశంసా పూరక మాటలలో నాకేమి మనస్సు నిలవటంలేదు ఆ ముసల్దాని పలుకులు విన్నమీదట.

నేనే, నా అర్థాంగి జతతో వెళ్ళి పరిచయాన్ని చేసుకొని ముసల్దాన్ని మాట్లాడించా. తన కతను ఆమె ఎంత గొప్పగానో చెప్పుకొంది. ఏదో కాలంలోని పురాణ కతలాగ మాకు చెప్పుకొంది. ముసల్ది చెప్పిన కతకు జతగా నమ్మేటందుకు ఇంకా నేను నలుగురైదుగుర్ని విచారించాను. ఇప్పుడు ఇక ఆ కథనే నేను మీకు చెపుతాను సవివరంగా.

❀ ❀ ❀

విశ్వేశ్వరయ్య గార్ని చూసినప్పుడు భాగ్యమ్మ విధవరాలు. నాలుగైదు ఇళ్ళలో ఇంటి పనులను చేస్తూ ఆ ఇళ్ళలోని బాలింతపనులను, కాన్పులను, అభ్యంజన స్నానాలను ఇలా అన్ని పనులను ఆమె చేస్తుండేది. అట్లాగే ఐతే భాగ్యమ్మ లాంటోళ్ళు ఆ ఊరిలో ఎందరో ఉన్నారులే. అయితే, వాళ్ళందరి లాగ భాగ్యమ్మ విశ్వేశ్వరయ్యగారిని ప్రత్యేకంగా చూసే అవసరమే లేదు.

అయితే భాగ్యమ్మది సింహాసనం మీద కూర్చుని అధఃపాతాళంలోకి నెట్టబడిన అదృష్టం ఆమెది. భాగ్యమ్మకు పెళ్ళైనప్పుడు ఆమె భర్త తిప్పయ్య మంచి స్థితిమంతుడే. ఊళ్ళోనే గాకుండా చుట్టుప్రక్కల నాల్గైదు పల్లెలలో కూడా పొలాల్ని, తోటల్ని కలిగి యున్నోడు. వాట్నే చూచుకొనియుంటే అతను, భాగ్యమ్మ మరియు ఇద్దరు మగసంతానం ఉదయంనుంచి సాయంత్రం వరకూ నేతిని రొట్టెముక్కలకు రాసుకొంటూ బతకొచ్చు ఆరామంగా. అయితే తిప్పయ్యకు ఊరూరా నూరారు విషయాలలో ఆసక్తి యుండేది. తన ఆస్తికి జతగా, తన ఆస్తులు ఉన్నటువంటి పల్లెలలోని పొలాలు, తోటలు, ఇళ్ళ తంట – తకరాలు తిప్పయ్యకు కావాల్సిందే. ఎవరి ఆస్తిని ఎవరి దగ్గర తనఖాపెట్టాలి, ఏఏ దస్తావేజుల్ని మైసూరులో, మద్దూరులో రిజిస్ట్రేషన్ చేపించాలి, ఎవరి ఇంటికి ఎద్దుల ఖరీదుకని వాట్ని కొనేందుకు వారితో 'ఎడయూరు' జాత్రకు తనూ వెళ్ళేది, క్రొత్తగా కట్టించిన మైసూరు రాజభవనం కాంట్ర్యాక్ట్ పనులలో ఎవరెవరికి ఎంతెంత డబ్బులు ముట్టినవి.... ఇలా అన్ని విషయాలు తిప్పయ్యకు కావాల్సిందే.

వీళ్ళ ఆస్తి వాళ్ళ దగ్గర, వాళ్ళ ఆస్తి వీళ్ళ దగ్గర తనఖాలు పెట్టించే ఊపులో, ఇతని ఆస్తికూడా జామీను కోసం వాళ్ళ వీళ్ళ వద్దకు బదలాయించబడేది. ఆస్థిని తాకట్టుపెట్టి అప్పును తెచ్చేదాన్ని అధిక వడ్డీకి మార్చేది, అప్పును ఇతని మూలకంగా పొందినోళ్ళు ఋణాన్ని సరిగా చెల్లించనప్పుడు జామీనుగా పెట్టిన తన భూమిని విడిపించుకొనేది కుదరక దానితో భాగ్యమ్మ మీద కొట్లాటను చేసి, ఆమె నగల్ని మరలా తాకట్టులో ఉంచి... ఇలాగున ఒకటా రెండా ఎన్నో ఉంటుండేవి. అంతైనా వేరేవాళ్ళ వ్యవహారాలలో జామీనుగా ఉండే పిచ్చి ఇతనిలో ఏమాత్రం తగ్గలేదు. అవసరం ఉన్నా, లేకున్నా చుట్టుప్రక్కలలో ఏఏ ఆస్తుల అమ్మకాలు, తనఖాలు, రిజిస్ట్రేషన్లు ఉంటే ఇతను కూడా వాళ్ళతో కల్సి వెళ్ళేటోడు. భాగ్యమ్మ అణ్ణ తరుపున సంబంధాన్ని చేసికొన్నోళ్ళు ఎంతో స్థితిమంతులు. వదిన తన భర్త తనకు మాత్రమే వశీకరణమైయ్యేదాన్ని మొదట్నుంచి ఆ ఇంట్లో కాలును పెట్టినప్పట్నుంచీ చేసింది. తన చీర కొంగుముడికే భర్తను కట్టేసుకొని, తన భర్తనుంచి

ప్రీతి, వాత్సల్యాలు భాగ్యమ్మకు జారకుండా కట్టుదిట్టంను చేసింది ఆమె. ఇందుచేత తిప్పయ్య తన బావైన శ్రీనివాసయ్య పెళ్ళాంకు లోకువ అనేది వేలెత్తి చూపుతూ భాగ్యమ్మ పుట్టింటి స్థితిని గుర్తుచేస్తూ తన మగతనంమీద, తన వ్యవహారాల మీద భార్య నుంచి ఏ ఆక్షేపణా మాటల్ని పొందకుండా ఇష్టారాజ్యంగా వ్యవహారాన్ని నడుపుకొనేవాడు.

ఊళ్ళో వాళ్ళ వ్యవహారాలన్నీ తిప్పయ్యకు ఎంత ఎత్తులో ఇష్టంగా ఉండేవంటే, తను చేస్తున్న ప్రైమరి స్కూల్ మేష్టారు నౌకర్ని సరిగా చేస్తుండేవాడు కాదు. తన వ్యవహారాల పిచ్చితనం, తిరుగాట వీటన్నిటి ముందు నాలుగు అక్షరాల్ని రోజంతా దిద్దించేది, పుణ్యకోటిగోవు (ఆవు–పులి) కథను చెప్పేది గొప్పా అని అన్పించి ఎవరైనా దీనిని చెప్తారులే అని చిత్రదుర్గం నుంచి ఒక పేద బ్రాహ్మణుడ్ని తెచ్చి తన పరంగా మాష్టారు డ్యూటీని చేసేందుకు నియమించుకొన్నాడు. ఊర్లో ఉన్నప్పుడు అదీ మనసైనప్పుడు ఆరుగంటలకో మూడు గంటలకో ఒకసారి తిప్పయ్య స్కూలుకు వెళ్ళివస్తుండేవాడు. మొత్తంగా చెప్పుకోవాలంటే తిప్పయ్య టైమేలేనోడిలాగ యమబిజీగా ఉన్నట్లు తిరుగుతూ కన్పించేవాడు. భాగ్యమ్మకు మొగుడి కార్యక్రమాలు ఈ విధంగానే ఉన్నందున ఆమె అతడ్ని పీడించేందుకు గాని, బాదించేందుకు గాని ప్రయత్నాన్ని చేసేదికాదు. ఒకసారి ఎవరి జతగానో మైసూరుకు ఏదో అమ్మకానికని రిజిస్ట్రేషన్ కోసం ఇతరుల పనికని వెళ్ళిన తిప్పయ్య అక్కడే టైపాయిడ్ జ్వరానికి గురై, ఊరికి తిరిగొచ్చి మూడేమూడు రోజులకు స్వర్గస్థుడైయ్యాడు.

తిప్పయ్య చనిపోయిన తర్వాతే భాగ్యమ్మకు తన మొగుడి వ్యవహారాలలోని లోటుపాట్లు అన్నీ తెలిసేందుకు ప్రారంభమైనవి. ఎవర్ని అడిగినా, విచారించినా “ఇక్కడ తిప్పయ్య ఇంత అప్పును చేసాడు... ఈ అప్పుకు జామీనుగా నిలిచాడు... అప్పును తీసుకొన్నోళ్ళ హామీ తీర్చలేదు... జామీనుకు హామీగా నిలిచిన తిప్పయ్య చెల్లించినదంతా వడ్డీకే సరిపోయింది... అసలుకు ఏమీ కట్టలేదు...”! భాగ్యమ్మకు సత్యాసత్యాలు తెలిసేలోపే ఊర్లోని పటేల్, కరణం, షాహుకారు... ఇలా మొదలైనోళ్ళు అందరూ చేరి తిప్పయ్య భాగ్యమ్మకు గాని, ఇద్దరి పిల్లలకు గాని ఏమీ చిల్లిగవ్వను కూడా మిగల్చలేదని లెక్కలతో తీర్మానం చేసి ఆమెను వీధిపాలు చేసారు.

ఇటువంటి సమయంలో భాగ్యమ్మ లాంటి ఆడకూతురు ఏమిచేస్తది? అణ్ణైన శ్రీనివాసయ్య ఇదే ఊర్లో ఉన్నా వదిన వైయ్యారానికి, కుతంత్ర్యానికి లోబడిన మనిషికదా!

వదిన ఊళ్ళో వాళ్ళందరికీ భాగ్యమ్మ కతను గోరంతలు కొండంతలుగా చేసి చెపుతుంది ఇప్పుడు. ఆలనాపాలనా తప్పినందున భాగ్యమ్మ ఇద్దరి పిల్లలూ వీధిలోకి నెట్టబడ్డారు. దేవస్థానంలోని ప్రసాదంనో, సమారాధనలో చివరి పంక్తిలోని తిండినో తింటూ పెరిగారు. భాగ్యమ్మ మొదటగా ఒక ఇంట్లో పనిమనిషిగా, తర్వాత ఇంకొక ఇంట్లో పనిని పొంది తన భర్త బాకీ పడిన ఇళ్ళలో ఇలాగున .... అన్ని ఇళ్ళలో పనులను చేసేందుకు సిద్ధమైంది. తిప్పయ్య ఒక తీటకు అందర్ని అలుముకొంటే, భాగ్యమ్మ ఇంకొక రీతిలో ఋణ బంధానికి అందర్నీ ఆశ్రయించాల్సి వచ్చింది కదా!

ఆరు సంవత్సరాలో, ఎనిమిది సంవత్సరాలో ఇలాగున నడుస్తుంది భాగ్యమ్మ జీవనం. భాగ్యమ్మ బతుకు బండి ఉండేది ఇలాగునే అని ఊరోళ్ళు భావించుకొంటుండగా, ఒకరోజున మధ్యాహ్నపు వేళలో నల్లటి కోటు, తెల్లటి అంగవస్త్రం, సాదా పంచెను కట్టుకొన్న కోర్టు అమీను భాగ్యమ్మ ఉండే బాడుగ ఇంటికి వచ్చి, ఆ ఇంటి ముందున్న అరుగుమీద కూర్చున్నపుడు కత ఇంకొక రీతిలో మార్పును చెందింది.

అమీను తిప్పయ్యకు చేబదులుగా (హ్యాండ్‌లోన్‌గా) 75 రూపాయల్ని ఇచ్చాడట. తిప్పయ్య చచ్చేప్రొద్దుకు అతనికి చిత్రదుర్గం వైపుకు ట్రాన్స్‌ఫర్ అయ్యిందట. అక్కడ్నుంచే ఎన్నో ఉత్తరాల్ని రాసినా తిప్పయ్య నుంచి జవాబే రాలేదట. పరిచయస్తులతో చెప్పి పంపినా జవాబే లేదట. చివరికి అతనికి శ్రీరంగపట్నంలోని కోర్టుకు మరలా ట్రాన్స్‌ఫర్ అయినందున, ఊరిని వెతుక్కొంటూ వచ్చాడట. తిప్పయ్య చనిపోయింది గుర్తైనా, వారి వారసుల నుంచి ఆ అప్పును ఏమైనాగాని వసూలు చేయాలనే సంకల్పంతో మొదలు భాగ్యమ్మకు అణ్ణైన శ్రీనివాసయ్య ఇంటికి వెళ్ళి, అతడి భార్య నుంచి ముఖానికి మంగళారతిని చేయించుకొని, అక్కడ్నుంచి తిప్పయ్యకు చెందిన సంసారం నుంచే ఏమైనా గాని బాకీని వసూలు చేసుకోవాలనే గట్టినిర్ణయానికి వచ్చాడట అమీను.

భాగ్యమ్మ అమీను వచ్చినప్పుడు ఇంట్లోలేదు. అమీను వేషభూషణ, ముఖ భంగిమ, గాంభీర్యం వీటినన్నిట్నీ చూసినోళ్ళు సరసరా పరిగెత్తి భాగ్యమ్మను పిలుచుకొచ్చారు. అమీను ఇంటి అరుగుమీద చిన్న దొరలాగ కూర్చుని యున్నాడు. ఇంటి సమీపంకు వచ్చిన భాగ్యమ్మ అమీనును చూసినా చూడనట్లే లోనికి వెళ్ళింది. అమీను నుంచి మాటలు. ఇంతలో చుట్టూ పదిమంది పోగైయ్యారు. కొంతమంది అమీనును బహువచనంలో మాట్లాడించుతూ, గౌరవాన్ని చూపెడ్తూ అరుగుమీద అమీనుకు ఎదురుగా కూర్చుండి పోయారు.

అమీను చెప్పిందంతా భాగ్యమ్మ బాగనే విన్పించుకొంది. అతను అబద్దాలు చెప్తున్నాడని ఏమీ అన్పించలేదు ఆమెకు. ఎంతెంతో వ్యవహారాలను చేసి, ఇల్లును గుల్లచేసుకొన్న తన భర్త ఈ చేబదులును ఎందుకు చేసుండరాదు అనే అనుమానం వచ్చింది ఆమెకు. అయితే ఇప్పుడు, ఎన్నడో చనిపోయిన తన భర్త చేసిన అప్పును తీర్చు, ఇప్పటికిప్పుడే తీర్చేయి అంటూ గొంతు మీద నొక్కితే... భాగ్యమ్మ ఏమీ మాట్లాడలేదు. వీధిలో చివరిల్లుగా ఉన్న శాస్త్రిగారి ఇంట్లో కారంపొడి ఖాళీ అయ్యింది. కారాన్ని కొట్టాలనే తలంపుతో మిరపకాయల తొడాలను తీయాలని ఆ ఇంటి నుంచి తెచ్చుకొంది. వాటి తొడాలను తీస్తూ, ఎదురుగా ఉన్న మిరపకాయల గుట్టనే చూస్తూ కూర్చుంది.

బయట అరుగుమీద కూర్చున్నోళ్ళంతా అమీను దర్పాన్ని మాటలను విని, అతని తరుపునే మాట్లాడాలనే ఆశ ఉన్నా, భాగ్యమ్మను చంపి పాతరేసినా రెండు చిలుము పట్టిన దమ్మిడీలు పుట్టవని గుర్తైనందుచేత అమీను ముఖాన్నే చూస్తూ కూర్చున్నారు. ఎంత సమయం గడిచినా ఎవరూ గొంతును పెగల్చనందున అమీనే అరుగు దిగి ద్వారం వద్దకు వచ్చి లోనికి తలను దూర్చి "ఈ రోజే తీర్చమని అనటం లేదు. వచ్చే అమావాస్య వెళ్ళిన తర్వాత వస్తాను... డబ్బే కావాలని అనటంలేదు.. డబ్బుకు బదులుగా ఏదైనా వస్తువు ఇచ్చినా చాలు" అని అనటంతో అరుగును ఎక్కి కూర్చున్న జనంకు ఈ మాటలు మంచిగానే అన్పించి, వాళ్ళు కూడా అమీను వెనకే వెళ్ళి దుర్గనుంచి మండ్య మూలంగా శ్రీరంగపట్నంకు వెళ్ళే రాయల్ మోటార్ సర్వీస్‌బస్ నిలిచే సంతస్థళం వరకూ ఆయనతోనే వెళ్ళి బస్‌ను ఎక్కించి వీడ్కోలును చెప్పారు.

అమీను కదండీ ..... చెప్పినట్లే వచ్చాడు. ఆ వేళలో భాగ్యమ్మ ఇంట్లో లేదు. అమీన్ ఏమి చెప్పేందుకు కుదర్లేదు. ఊళ్ళో వాళ్ళే అతని ముఖాన్ని చూసిన తక్షణమే పరిగెత్తికెళ్ళి, భాగ్యమ్మను పిలుచుకొని వచ్చారు. రెండు అమావాస్యల నడుమ ఎంత డబ్బు పోగు అవుతది అదీ భాగ్యమ్మ నంతటి అదృష్టహీనురాలుకు. అమీను "ఇంట్లో ఉన్న వస్తువుల్ని తీసుకొని వెళ్తాను...నెలకొకసారి ఐదారు రూపాయల్ని ఖర్చు చేసుకొని పశ్చిమదిక్కునుంచి ఈమె ముఖాన్ని చూసేందుకు రావాలా నేను" అంటూ న్యాయాన్ని ఒప్పించాడు. ఒక చిన్న రోకలిబండ, వంటకని ఇంట్లో ఉన్న ఇత్తడి పాత్ర, ఒక మంచి విసురురాయి (తిరుగలి) వీటిని నలుగురైదుగురితో మోయించుకొని వెళ్ళాడు. "బరువు జాస్తిగా ఉంది. విసిరేరాయిని (తిరగలిని) ఇక్కడే ఎవరికైనా అమ్మేయండి" అని ఊళ్ళోవాళ్ళు చెప్పారు. "కాదు...కాదులే... ఇలాగే మునివేళ్ళమీద నిలిచి అమ్మేందుకు వెళ్తే ఏమి ధర గిట్టుబాటు

కాదు... బస్ కండక్టర్‌కు నేను అమీనే అని గుర్తు ఉందిలే" అని అమీను గట్టిగా చెప్తూ, నడుస్తున్నదంతా నోరెళ్ళబెట్టి చూస్తున్న గోవిందప్ప నుంచే అన్ని వస్తువులు మోయించుకొని సంతప్రదేశంలో బస్ నిలిచే చోటకు వెళ్ళాడు బస్‌ను ఎక్కేందుకని.

అమీను అలాగున విసిరే రాయితో అన్నిటినీ మోయించుకొని వెళ్ళిన మీదట భాగ్యమ్మకు అనారోగ్యం అయ్యింది. పిచ్చి ఏమైనా పట్టిందేమోనని ఊరోళ్ళంతా అనుకొన్నారు. విసురురాయిని అమీను తీసుకెళ్ళకుముందు బాగ్యమ్మ ఇంట్లో బియ్యాన్ని, రాగులను పిండికని విసురుకొనేటప్పుడు ఏడుస్తూ మాట్లాడుకొనేది, తిప్పయ్యను మనసారా తిట్టుకొనేది, అన్న-వదినను తిట్టిపోసేది మొదలైనవన్నీ ఆ విసిరే రాయి శబ్దాల వలన ఎవరికీ విన్పించేవికావు. అంతేకాదు, ఒక ఇంటి కార్యాన్ని ముగించిన మీదట ఇంకొక ఇంటి వాళ్ళు నానబెట్టి, ఎండబెట్టిన బియ్యాన్ని, రాగులను ఆ విసిరే రాయినుంచే పిండికని, నూకలకని తీరుబడే లేనట్లుగా విసురుతుండేది భాగ్యమ్మ. విసిరే రాయికున్న పిడిని పట్టుకొని చమత్కారంగా రాయికున్న బొడ్డులో గింజల్ని వేసేందుకు అదెంతగా నేర్పరితనం ఉండాలో కదా! వీటిలో భాగ్యమ్మ ఎంతగానో నేర్పరురాలే కదా!

ఆరోజు అమీను వచ్చివెళ్ళిన తర్వాత విసిరేరాయి ఆమె దగ్గర లేదుకదా! అరుగుమీద కూర్చుని మాట్లాడేందుకు ప్రయత్నించేది. ఎవరైనా తన ఇంటి ఎదురుగా వెళ్తుంటే వాళ్ళ వెనకే వెళ్తూ వాళ్ళు తమ తమ ఇళ్ళను తలుపే వరకూ ఈమె లొడలొడా వదరుతూ వెళ్ళేది. ఎవరూ ఎదురు పడనప్పుడు, పనేమి లేనప్పుడు ఇంట్లో తిరుగుతూ తనలో తనే మాట్లాడుకొనేది.

అమీను భాగ్యమ్మనుంచి విసురురాయిని తీసుకొని వెళ్ళిన లగాయితు ఊళ్ళో వాళ్ళకు కష్టాలు మొదలైనవి. "ఏ భాగి.... ఏయ్ భాగ్యమ్మా... ఏమైనా చేసి ఒక తిరగలిని పెట్టుకోవే" అనే సుఖనాతి రాగంలో అమ్మలక్కలు చెప్తూ ఉన్నా భాగీకి (భాగ్యమ్మకు) తిరుగలి ఎలాగున దొరుకుతది? ఆమె దానికని డబ్బును ఏవిధంగా ఇవ్వగలదు? అని తెల్సుకొనేందుకు ఆ అమ్మలక్కలకు పురుసొత్తే లేదు. ఉదారంగా తిరుగలిని ఇప్పించేందుకు వారు ముందుకే రాలేదు. భాగ్యమ్మకు తిరుగలి శబ్దాన్ని వినివిని చేతినిండా అదే రూఢిగా అయినందున దాన్నే వినాలనే ఆశె కలుగుతున్నా, ఆ తిరుగలి కోసం ఎలాగున అడిగేది, అది అడిగే ఆశేనా అనేది ఆమెకు సరిగా గుర్తుకాలేదు. అమ్మలక్కల సుఖనాతి రాగం మాత్రం ముందుకే నడుస్తుంది. "తిరుగలిని కొనవే...తిరుగలిని ఇంట్లో పెట్టుకోవే" ఈ పలుకులే పదే పదే అమ్మలక్కల నుంచి వస్తుండేవి ధారాళంగా.

భాగ్యమ్మకు కూడా విశ్వేశ్వరయ్యగారి కథ, ప్రఖ్యాతి తెలిసిపోయింది. వారు కాలువ నిర్మాణంకని మోటారు బండిలో వచ్చేది, అమల్దార్, శిరస్తాదార్...ఇలాగున ఆయన వెనకే వచ్చేది ఉందని తెల్సింది ఆమెకు. దివానుగా అయిన మీదట విశ్వేశ్వరయ్య మంచాన బడిన తల్లిని బంగళాలోనే పెట్టుకొని శుశ్రూషను చేసింది, అంత దొడ్డ మనిషి జతగా బతికే అదృష్టాన్ని పోగొట్టుకొని వేరే ఒకడితో వారి ధర్మపత్ని లేచిపోయింది (గాలికతను) భాగ్యమ్మ విన్నది. ఊళ్ళోని అమ్మలక్కలంతా తిరగలిని కొనవే, తిరగలిని పొందవే అని కోరుతుండటంతో దాన్నే మనసులో నింపుకొన్న భాగ్యమ్మకు ఒక క్షణంలో ఆమెకు దివాన్ విశ్వేశ్వరయ్యగారి దగ్గరకు వెళ్ళి తన కోరికను చెప్పుకొని ఒక తిరుగలిని పొందాలనే ఆశె ఆమెలో కలుగసాగింది. ఆ పిమ్మట ఆమె తనలో తనే విశ్వేశ్వరయ్య గారి ఎదురులో నిలిచి కోరికను వెల్లడించేది, వారు ఆ కోరికను వినేది మొదలైన వాట్ని ఆమె అభినయించసాగింది. ఊళ్ళోవాళ్ళకు ఎవరికీ తెల్వదు భాగ్యమ్మలోని మహాత్వాకాంక్ష. అంతేకాదు భాగ్యమ్మ కూడా తను దివాను గారిని తిరుగలికోసమని అడిగే సంగతి ఎవరికీ గుర్తుకాగూడదని అనుకొంది.

తన పాటికి తనకు తనే దివాను గారిని చూసే ఆశెను నూరుసార్లో, వేలసార్లో అనుకొన్నా వేరే ఎవరికీ చెప్పేందుకు వెళ్ళలేదు భాగ్యమ్మ. అన్ని ఇళ్ళలో ఇంటిపనులను ముగించిన పిమ్మట మధ్యాహ్నం, సాయంత్రం అని అనుకోకుండా ఊరిబయటన సంత ప్రదేశం దగ్గరకు వచ్చి తుదికాలుమీద నిలిచి కంటికి కనబడేవరకూ దార్ని చూస్తూ నిలుచుండేది. దివానుగారి ప్రోగ్రాం ఈమెకు గుర్తైంది. అందుకే ఊరి మొదట్లో కాచుకొని నిలిచింది. రోజులు గడిచాయి. వారాలు దొర్లాయి...ఐనా దివానుగారి మోటారు బండి రాలేదు. భాగ్యమ్మ ఎదురు చూసేదాన్ని వదలలేదు.

చివరికొకసారి వేసవి ఇంకేంటి వెళ్ళేందుకు మొదలౌతది అని అనుకొనే ఒక రోజున దివానుగారు రానే వచ్చారు. మోటారు బండి దుమ్మును రేపుతూ వస్తుంటే...ఆ మోటారు బండిని చూసిందే తడవుగా ఆమెకు అది దివానుగారి మోటార్ బండి అని ఎలాగున తెల్సిందో... సంతోషంతో ఊళ్ళోకి పరిగెత్తికెళ్ళి తన ఇంట్లోకి చేరింది. ఆరోజు రాత్రి నిద్రపట్టలేదు ఆమెకు. నిద్రపోకుండానే అమీను తీసుకెళ్ళిన తిరుగలి ఉన్న ఖాళీ జాగానే చూస్తూ పడుకొనియుంది.

దివాను గారు వచ్చిన తర్వాత ఊళ్ళో వాళ్ళకు ఆయనదే సుద్ధి. వారి జతగా ఎవరెవరు వచ్చారు, ఎన్ని రోజులు ఉంటారు, కాలువ నిర్మాణం ఎక్కడిదాకా వస్తది, కాలువ నీళ్ళు

ఎవరెవరి పొలాలను సశ్యశ్యామలం చేస్తవి? అనేవి అందరి నోళ్ళలో ఇవే మాటలు. ఈసారి దివానుగారు మూడు నాలుగు రోజులు ఇక్కడే మకాం చేస్తారని అందరూ అనుకోసాగారు. శుక్రవారం సాయంత్రం చుట్టుప్రక్కల ఊళ్ళలోని జనం అందరూ చేరి దివానుగారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈశ్వరుడికి గుడిలో పంచామృతంతో అభిషేకాన్ని చేయించే ఏర్పాట్లలో మునిగారు. ప్రోగ్రాం ముగిసిన మీదట దివానుగారు బయల్దేరి మద్దూరు వరకూ మోటారు బండిలో వెళ్ళి అక్కడ్నుంచి రైలులో బెంగళూరుకు వెళ్తారట. ఈ వార్తలన్నీ భాగ్యమ్మ చెవిలో పడినవి.

మరుదినం భాగ్యమ్మ కోడికూసే పొద్దుకు లేచి దివానుగారు మకాంచేసిన పంచాయితి ఆఫీసులోని ముందు భాగంలో కూర్చుంది. దివాను గారి మోటారు బండి ఆపియుంది. దివానుగారి పరివారంలోని క్రింద తరగతి ఉద్యోగులు కొంతమంది అరుగుమీదే పడుకొని యున్నారు. గూర్ఖామాత్రం ఆ వైపు నుంచి ఈ వైపుకు, ఈ వైపునుంచి ఆ వైపుకు తిరుగుతూ ఉన్నాడు. అతని కళ్ళలో పడ్తే ఏమైనా అడుగుతాడు, గదిరించి బెదిరించి వెళ్ళగొడ్తాడు అని భాగ్యమ్మ పంచాయితి ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఒక పెద్దదైన రావిచెట్టు (అశ్వత్థవృక్షం) వెనుక దాగుకొని నించొంది.

వెల్తురు కొంచం కొంచంగా రాగా గూర్ఖా, అరుగుమీద పడుకొన్న పరివారం అందరూ లేచి అటు ఇటు కొద్దిగా తిరిగి, ఒక్కసారిగా అందరూ కాలకృత్యాలకని చెఱువు చెంతకు వెళ్ళారు. భాగ్యమ్మ ఇప్పుడు ధైర్యంగా అరుగు వద్దకు వచ్చింది. ఆమె వచ్చే సమయంకు ఒక బట్టతలతో ఉన్న పెద్దాయన బనియన్, పంచెతో వరండా వెనుక కుడి ప్రక్కనున్న గదినుంచి బయటకు వచ్చి చేతిలో పెట్టుకొన్న పుస్తకాన్ని, పేపర్నూ వరండాలో ఒక మూలలో ఉన్న టేబిల్మీద ఉంచి, రెండు చేతుల్ని వెనక్కే కట్టుకొని అటు ఇటు తిరిగేది చేయసాగాడు. “సేవకులు, దిగువ తరగతి అధికారులు లేచిన పిమ్మట దివానుగారు మేల్కొంటారేమో.. ఇంకా పడుకొనే ఉండొచ్చేమో...” అని తనకు తనే సర్దిచెప్పుకొంటూ అటు ఇటూ తిరుగుతున్న ముసలోడ్ని భాగ్యమ్మ చూస్తూ నించొంది.

అటు ఇటూ తిరుగుతున్న ఆ వృద్ధుడు ఒకసారి ఈమె వైపుకు తిరిగి “ఎవరమ్మా నువ్వు, ఇంత ప్రొద్దునే, ఈవేళకు...” అప్పటికప్పుడే మాట్లాడినందున మాట కొంచం బిరుసుగానే ఉంది. “దివానుగారు ఇంకా లేవలేదా?” భాగ్యమ్మ తనకు మాత్రమే విన్పించినట్లుగా అడిగింది. వృద్ధుడికి సరిగా విన్పించనేలేదు. మొదలు అడిగిన దానికన్నా

జోరుగా "ఎవరమ్మా" అని ఇంకొకసారి అడిగాడు. భాగ్యమ్మ వరండా పైనున్న గదివైపుకు వేళ్ళను చూపెట్టూ గొంతును పెద్దదిగా చేసుకొని 'దివానుగారు ఇంకా మేల్కోలేదా...?" అని అడిగింది. వృద్ధుడికి ఏవరీమె ఇంత ప్రొద్దున్నే అని అన్పించి "ఎవరమ్మా నువ్వు, ఏమి కావాలి?" అని అడుగుతూ వరండా నుంచి క్రిందకు దిగేది చేయగా, భాగ్యమ్మ బెదిరిపోయి పరిగెత్తింది అక్కడ్నుంచి.

కొంచం దూరం పారిపోయి వీధి చివరన మాయమైనదానిలాగ నిల్చి, వృద్ధుడ్ని చూసేందుకు ప్రయత్నించసాగింది. వృద్ధుడు ఇపుడు చేతుల్ని కట్టుకొని తనే వెళ్ళి ఆమెను విచారించేదాన్ని నిలిపేసి వరండా మెట్లమీద చతికిలబడి పేపర్ను, పుస్తకాన్ని చూసేది చేయసాగాడు. "దివానుగారు లెగవనీ, లేచిన తక్షణమే పరిగెత్తికెళ్ళి అంతా (సోది) చెప్పి, తిరగలిని అడుగుతాను" అని భాగ్యమ్మ తనకు తనే సమాధానంను చెప్పుకొంటూ ఆ సుసమయంకోసమని నిల్చొని ఉంది.

భాగ్యమ్మ ఇలాగున వీధి చివర్న నించొన్నప్పుడు, చెఱువువైపుకు వెళ్ళిన దివానుగారి పరివారం గుంపుగా మాట్లాడుకొంటూ వస్తున్నది కనబడింది. ఆ గుంపును చూసిన భాగ్యమ్మ పడ్తూ, లేస్తూ పరిగెత్తుకొచ్చి పంచాయితి వరండా ముందు నిలబడి రొప్పుతూ, "ఏమి స్వామి, దివానుగారు ఇంకా లేవలేదా? పడుకోనీ...మా ఊర్లోనైనా ప్రభువుగా..." ఇంట్లో అంటూ సుఖమే లేదట... సంసారం అంతట్నీ ఇక్కడకు తీసుకురాలేదుకదా" అంటూ నోరును కొట్టుకొనేందుకు ప్రారంభించింది. ఈమె ఇలాగున పలికిన తక్షణమే వృద్ధుడు మెట్లను దిగుతూ ఈమె వైపుకు వస్తూ "ఏంటమ్మా ....నువ్వెవరు? ఎవరుకావాలి? ఏమి కావాలి" అని అడుగుతుంటే భాగ్యమ్మ వెనక్కి వెనక్కి పరిగెత్తేందుకని చూడసాగింది. వచ్చినామె ఇక పరిగెత్తి వెనక్కేపోతదని భావించిన ఆ వృద్ధుడు నించొన్న చోటే నిలబడిన తక్షణమే, భాగ్యమ్మ లొడాలొడా అమీను వచ్చింది, తనకు చెందిన తిరుగలిని తీసుకెళ్ళింది, తనకు ఇప్పుడు దాని అవసరం ఎంతగానో ఉండేదాన్ని...అంతట్నీ చెప్పుకొంది. మాట్లాడుకొంటూ చెఱువునుంచి గుంపుగా వస్తున్న దివాను గారి పరివారం ఇంకేంటి పంచాయితి వరండాకు చేరుకొంటున్న దాన్ని గమనించి భాగ్యమ్మ అక్కడి నుంచి పారిపోయింది.

"దివానుగార్కి చెప్పకపోతే ఏమి? వారి పరివారంలోని ఒకరికి చెప్పుకొన్నాను కదా.. ఆ మనిషి పట్టుకొన్న పేపర్ పుస్తకం అన్నిట్నీ చూస్తే అతనూ అధికారి అయ్యుండొచ్చు...ఏమైనా సహాయం దొరకొచ్చు. తిరుగలిని పొందొచ్చు. " అని భాగ్యమ్మ

ఆశతో గంటల్ని లెక్కబెట్టుకొంటూ ఎదురు చూడసాగింది. దివాను గార్ని చూసేందుకు ఎవరెవరు వచ్చారు... ఎవరెవరి పొలాల వద్దకు దివానుగారు వెళ్ళారు... ఎవరి జమీనులో దివానుగారి దప్పికకు పానకంను త్రాగింది... ఎవరి ఇంట్లో వారికి భోజన ఏర్పాట్లు జరిగినవి.... ఈ వార్తలన్నీ భాగ్యమ్మ చెవిలో పడినవి. దివాను గారి నుంచి తిరగలి విషయంగాని, భాగ్యమ్మ కోరికను గురించిగాని ఎవరూ అనుకోలేదు. తన సుద్ధిగురించి జనం నోళ్లనుంచి ఏమి సమాచారమూ రానందుకు బీదరాలైన భాగ్యమ్మ ఏమి చేయగలదు? నేను దివాను గార్ని నేరుగానే చూడాల్సింది. ఆ అధికారి ఆ వేళలో నేను చెప్పిందంతా విన్పించుకొన్నాడు కదా! అతనే నా గురించి దివాను గార్కి చెప్పియుండాల్సింది. దివానుగారి మనస్సుకు నా విషయం ముట్టితే, నా కోరిక ఆయనకు ఏమంత పెద్ద విషయమా? ఉన్న స్థలంలోనే నించొన్న చోటు నుంచే తిరగలిని పంపేందుకు హుకుంను చేయవచ్చు. మరొకసారి వెళ్ళి నేరుగానే వార్ని కల్సి నా కోరికను సఫలం చేసుకొంటా... ఐతే దివాను గార్ని చూసేందుకు వెళ్ళాలంటే ఆయన చుట్టూ అదెంతగా జనం ఉంటారో కదా! వాళ్ళందరికీ ఎందుకు నా ఘోష గుర్తుకావాలి? అనే తర్జన భర్జనలతో ఆలోచనలను చేసి భాగ్యమ్మ మరుదినం ఉదయాన సరిప్రొద్దులోనే సరిగ్గా పంచాయతి ఆఫీస్ దగ్గరకు వచ్చి కూర్చొంది. ఏమైనా గానీ, ఈ రోజు దివాను గారిని చూడాల్సిందే అనే మొండితనం భాగ్యమ్మలో ఒక విధమైన ధైర్యాన్ని నింపింది. వరండా కుడివైపునున్న గదిద్వారం వైపుకు ఆమె వళ్ళంతా కళ్ళుగా చేసుకొని చూడసాగింది.

కొంత సమయం గడిచినమీదట సూటు, బూటు, మైసూరు తలపాగాను వేసుకొన్న భద్రావతి దాసప్పగారు బయటకు వచ్చిన తక్షణం భాగ్యమ్మ పరిగెత్తికెళ్ళి ఆయన కాళ్ళకు అడ్డంపడి ఉదారమనోభావంను చూపెట్టాలి.... మొత్తం సీమకు నీరును పారించే మీకు ఒక తిరుగలిని ఇప్పించేది కష్టమైన పనా... నిన్న వచ్చి మీ క్రింద నున్నోళ్ళకు చెప్పుకొన్నా... మీకు (దివానుగార్కి) వారు (వృద్ధుడు) ఏమి చెప్పినట్లుగా కనబడుటలేదు... మీరు మనస్సును చేసుకొంటే...పట్టుకొన్న కాళ్ళను వదిలి లేచి తిరిగి వారి పాదాలను స్పర్శించి కళ్ళకు తన చేతుల్ని వత్తుకొంటూ "సీమ మొత్తానికి అన్నాన్ని కలిగించారు. పశుపక్ష్యాదులకూ జలాన్ని కరుణించారు... దేవుడు మీకు మంచే చేస్తాడు... మంచి సంసారాన్ని ఇప్పిస్తాడు... విడిచిపెట్టి వెళ్ళిన ఆమె పోతేపోనీ... వచ్చే ఆమె తప్పకుండా సుఖపడ్తది...నాలాంటోళ్ళనూ కొంచం సానుభూతితో, నా క్లిష్ట సమస్యను పరిష్కరించు తండ్రీ" అంటూ చెప్తూ నించొన్న చోటికి మరొక సూటు, బూటు, మైసూరు తలపాగాను ధరించుకొని మొదటి వ్యక్తి అంత ఎత్తులోనే ఉన్న ఇంకొక మనిషి వచ్చి భాగ్యమ్మ దగ్గర

నిలబడ్డాడు. భాగ్యమ్మకు ఒకే తరహాలోని ఇద్దరు వ్యక్తుల్ని చూడగా, ఆమెలో భయంకలిగి, "బాబోయ్...చచ్చాన్రో దేవుడో" అని అరుస్తూ పారిపోయింది అక్కడ్నుంచి.

భాగ్యమ్మ మొదటిరోజు బనీన్, బట్టతల, పంచె, పుస్తకాలు, పేపర్ల జతతో చూసింది సర్: ఎం.వి.గారినే...దివాను గారినే. దివాను గార్కి ఆ రోజున ఎప్పటిలా గాకుండా ఎంతో ముందుగానే మెలకువ వచ్చి మేల్కొన్నారు. ఎలాగూ మెలకువ వచ్చింది గదా అని అనుకొంటూ ఒక ఫైలును చూసి కాలాన్ని గడిపితే పోలే అని భావించి ముఖాన్ని కడుక్కొని ఇంత ప్రొద్దునే తనను చూసేందుకు, చర్చించేందుకు సందర్శకులు (విజిటర్స్) వచ్చేది లేదని అనుకొంటూ రాత్రి తొడుక్కొన్న బట్టలుతోనే వరండా దగ్గరకు వచ్చారు. భాగ్యమ్మ ఆ వేళలోనే వచ్చి తన కష్టాన్నంతట్నీ చెప్పుకొంది. శుక్రవారం ఉదయాన మళ్ళీ వచ్చి ఆమే సూటు, బూటు, టోపి సమేతంగా మొదలు చూచిన మనిషి భద్రావతి దాసప్పగారు. దివాను గారికి దాసప్ప ప్రైవేట్ కార్యదర్శి (పి.ఎ). దివానుగారు తన దగ్గర, తన ఆఫీసులో పనులను చేస్తున్న ఉద్యోగస్తులందరూ తన లాగానే టిప్‌టాప్‌గా ఉండాల్సిందేనని వారికి తనదే ఐనరీతిలో బట్టల్ని, భూషణాల్ని తొడిగించి ఉన్నందున ఫోటోగాని, పేపర్లు (దినపత్రికలు) అంతగా లేనటువంటి ఆ కాలంలో ఎంతోమంది భద్రావతి దాసప్ప గారినే సర్: ఎం.వి.గా(దివానుగారిగా) భావించుకొని తమ కష్టసుఖాలన్నింట్నీ చెప్పుకొంటుండేవారట. కొంతమంది ఒక అధికారస్తుడైన మనిషితో చెప్పుకొనే బదులు సర్: ఎం.వి.గారే ఈ విధంగా తనూ, దాసప్ప ఒకటిగా జనంలో భ్రమను కలిగించి ఎంతగానో సందర్శకులను కలుసుకొనే వైనంగా, తనకు ప్రత్యామ్నాయంగా వేరొకరిని తన లాగే సూటు, బూటుతో నియమించుకొన్న విధంను ఈనాటికీ జనం కొనియాడబడుతుండేవారు. దాసప్పగారితో చెప్పుకొన్న కష్టసుఖాలన్నింట్నీ, దాసప్పగారే ఖుద్దు ఒక ఫైల్‌గా నోట్సు రాయించుకొని దివానుగారికి తెలియజేసి సర్కారు వైపు నుంచి ఏమేమి పనులు జరగాలో ఆ పనులు జరిగిపోతుండేవట. భాగ్యమ్మ విషయంలో ఈ వ్యవస్థ తలక్రిందులైంది. దివానుగారికే కష్టసుఖాల్ని చెప్పుకొన్నా, దివానుగారి పి.ఏనే దివానుగారుగా భావించుకొని ఆయన కాళ్ళమీద బడి, విన్నపాన్ని మాత్రం మొదటగా నేరుగా దివాను గారికే సరిగానే తెల్పుకొంది.

భాగ్యమ్మ తమ నుంచి పారిపోయిన మీదట దివానుగారు-దాసప్పగారు ఒకరి ముఖాల్ని ఒకరు చూసుకొన్నారు. దివానుగారు 'ఈమె నన్ను నిన్నే కల్సింది' అని చెప్తూ మెట్లను దిగి వాయువిహారానికని వెళ్ళారు. దాసప్పకూడా ఆయన వెనుకనే నడవసాగారు.

విసురురాయిని తీసుకెళ్ళేందుకు అమీను రెండు అమావాస్యల వాయిదాను ఇచ్చినట్లుగా అలాగునే వాయిదాను ఇవ్వకనే సర్: ఎం.విగారు ఆ ఊరునుంచి వెళ్ళిపోయినా, ఎంతో తొందరగానే పదిరూపాయల మనియార్డర్‌ను భాగ్యమ్మ పేరుకు పంపించారు వ్యక్తిగత జీతం నుంచి. భాగ్యమ్మ కొంచం అబద్ధాలతో చెప్పేది ప్రారంభించింది. దివానుగారు ఊరికి కొంతకాలం క్రితం వచ్చినందున, దివానుగారే స్వతహాగా పంపారని చెప్తే, తనే వెళ్ళి దివానుగార్ని దీనురాలిగా వేడుకొంది అందరికీ గుర్తు అవుతదేమోనని ఆలోచనను పెట్టుకొని, మైసూరు మహారాజుగారి గూఢచారులు చిత్రగుప్తుడి మూలకంగా తన కష్టాల్ని తెల్సుకొని తనకి స్వయంగా పంపించారని ఊరులో ప్రచారాన్ని చేసింది.

కెస్తూరులోని సంతకు గోవింద చెట్టిని తోడు బెట్టుకొని విసిరే రాయిని (తిరుగలిని) తెచ్చుకొన్నమీదట ఊళ్ళోవాళ్ళ ప్రకారం భాగ్యమ్మలో పిచ్చి, తనలో తనే మాట్లాడుకొనేది. అంతా మాయమైందని అనుకోసాగారు. ఐతే, ఆమె మాత్రం మొదట్లో లాగనే తిరుగలి నుంచే వచ్చే శబ్దాల జతగానే తన తిట్లను, బాధలను ఆ శబ్దాల చప్పుడుతో జమ చేయసాగింది. విసురుతున్నప్పుడు ఆ తిరుగలినుంచి శబ్దాలు జోరును పెడ్తున్నప్పుడు ఎవరికీ వినబడవులే అన్నట్లుగా తను దివానుగార్ని చూసింది, ఆయన కాళ్ళమీద పడి తన కష్టాన్ని చెప్పుకొంది.... అంతేకాదు, విశ్వేశ్వరయ్యగారు మొత్తం ఈ విశ్వానికే దివానుగా అవ్వాలి...అవుతారు కూడా... జబ్బుతో ఉన్నవారి తల్లి చనిపోతే స్వర్గసుఖం ఖచ్చితంగా దొరుకుతది... విశ్వేశ్వరయ్య గారికి క్రొత్త సంసారం వస్తది...వారి ఇంటినిండా సంతానం పరిభ్రమిస్తది అనే మాటల్ని ఆ విసురురాయిని విసిరేటప్పుడు అనుకొంటుండేది.

దివానుగారు ఊరిలో తన పేరుమీద జరిగిన పంచామృత అభిషేకాన్ని, క్యాంప్‌ను అంతట్నీ ముగించుకొని బెంగుళూరుకు వచ్చి ఇంటిని ముట్టినప్పుడు సాయంత్రం ఆరు అయ్యింది. ఆయన దత్తపుత్రుడు తండ్రిలాగనే సూటుబూటు, మైసూరు తలపాగాను, టైను ధరించి వాకింగ్‌కు వెళ్ళేందుకు సిద్ధమైయున్నాడు. ఏయే వేళలో వాకింగ్‌కు వెళ్ళాలి, ఎంత సమయం వాయు విహారాన్ని చేయాలి అనేవాట్ని దివానుగారు కట్టునిట్టుగా చెప్పినందున దివానుగారి ఆగమనాన్ని చూసిన తక్షణం అతను కోటు, షర్ట్‌ను వెనక్కి జరిపి నడుం బెల్టుకు ఉన్న గడియారంను చూసుకొన్నాడు. దివానుగారు ఖరారు చేసిన సమయానికి సరిగానే బయల్దేరినందున అతనిలో ఖుషీనే అయ్యింది.

దివాను గారే సాకే పుత్రుడికి వేళ్ళతో సైగల్ని చేసి ఇంటిలోపలికి పిలిపించుకొన్నారు. కోడలు ఎక్కడ అని అడిగారు. అదేమి ఆజ్ఞలు నడిచినవో అదైన పది నిమిషాల తర్వాత దత్తపుత్రుడు–కోడలు ఇద్దరూ వాకింగ్‌కు వెళ్ళేందుకు నిలిచారు. కోడలిలో ఆత్రం ఆత్రంగా బయల్దేరేది కనబడుతూ అడుగుఅడుగుకూ తలముడిలో ఉన్న పూవును సరిచేసుకొంటూ ఉంది.

ఆ రోజే కాదు, అదైన తర్వాత ప్రతి దినమూ అదే సమయంలో దివానుగారి పెంపుడు కొడుకు కోడలు వాకింగ్‌కు వెళ్ళేది, అది ముగిసినమీదట ఇంటికి చేరి కొడుకు కారులో క్లబ్‌కు వెళ్ళేది చేర్చబడింది. క్లబ్‌లో దివాను గారు కొడుకు ఆగమనాన్ని సూక్ష్మంతోనే గమనించి కేరంబోర్డ్‌లో మిగిలిన పానులను కొట్టేందుకు రెడి అయ్యేవాడు.

ఈ కథ ఈ విధంగా తెల్సిన మీదట నేను నా అర్ధాంగితో ఎప్పుడు ఊరికి వెళ్ళినా ఒక గంటను ఖాళీగా చేసుకొని భాగ్యమ్మ ఇంటికి వెళ్తుండేవాడ్ని. మేము ఎవరు అని ఆమెకు తెల్వదు. దివానుగార్నే చూసిన ఆమెకు మేము ఎవరం అనేది ఎందుకు గుర్తు అవ్వాలి. నా కుతూహలంకు, ఆశకు సర్: ఎం.వి.గారి ఫోటో ఆమె ఇంట్లో ఉందేమో అనే ఆశతో వెతికాను. ఫోటోలేదు అక్కడ. దశావతారాల ఫోటో, ద్రౌపది వస్త్రాపహరణం లోని శ్రీకృష్ణుడి ఫోటో మొదలైనవి ఉన్నవి. సర్: ఎం.వి.గారి ఫోటో మాత్రం లేదు. మొదలు ఒకట్రెండుసార్లు ఆమె వద్దకు వెళ్లినప్పుడు ఈ విధంకు మనస్సు బాధపడింది. ఆ తర్వాత అదే రూఢిగా అయ్యింది. భాగ్యమ్మ ఇంటికి వెళ్ళేది తగ్గింది నానుంచి. అప్పుడో ఇప్పుడో గూని మనిషిగా తిరిగాడే భాగ్యమ్మను ఊరివీధులలో చూసేది అంతంత మాత్రమే.

రెండు మూడు సంవత్సరాల క్రితం భాగ్యమ్మ చనిపోయింది. బెంగుళూరుకు వచ్చిన నా సంబంధీకులు ఎవరో ఈ విషయాన్ని చెప్పారు. అప్పుడు మూడు రోజులంతా భాగ్యమ్మ విసిరే రాయి, సర్:ఎం.వి.గారి జ్ఞాపకాల్నే నేను, నా భార్య అవే విషయాలను పదేపదే చెప్పుకొన్నాము. “చూడండి… భాగ్యమ్మ, సర్: ఎం.వి.గారి పటంను తన ఇంట్లో పెట్టుకోకపోయినా ఏంటంట? ఎం.వి.గారి ఇల్లు ‘ముద్దేనహళ్ళి’లో స్మారకంగా ఉందికదా! అక్కడ వారు ఇప్పించిన తిరుగలిని ఉండనీయండి. వచ్చేసారి మనం ఊరికి వెళ్ళినప్పుడు ఆ విసిరేరాయిని తీసుకొచ్చి ముద్దేనహళ్ళిలోని స్మారక గృహంలో పెడ్తాము.” అంది నా శ్రీమతి.

భార్య చెప్పింది నాకు సబబుగానే అన్పించింది. వచ్చేసారి ఊరికి వెళ్ళినప్పుడు భాగ్యమ్మ ఇంటికి వెళ్ళాము. ఆమె ఇంటికి తాళం వేసియుంది. బాడుగకని క్రొత్తగా

ఎవరూ రాలేదట. భాగ్యమ్మ కొడుకొకడు షోలాపురంకు, ఇంకొక కొడుకు గోవాకు వలస వెళ్ళారట. ఎవరో కాగితాన్ని రాసినందున భాగ్యమ్మ చచ్చిన ఐదోరోజున ఒకడు, ఏడోరోజున ఒకడు వచ్చి ఊర్లో తిథి, సమారాధనను చేసి వెళ్ళారట. ఇద్దరు కొడుకులు సంతస్థళం దగ్గరున్న సత్రంలో ఉండి కర్మకాండ, సమారాధనను ముగించారట.

ఇంటి యజమానైన శేషగిరిని కల్సి భాగ్యమ్మ అద్దెకుండే ఇంటి తలుపుల్ని తెరిపించి విసిరేరాయి బొడ్డులో ఉన్న బొద్దింకల్ని పారద్రోలి, ఆ తిరగలిని శుభ్రం చేయించి బెంగళూరుకు తీసుకొచ్చి, ఆ తర్వాత ఒక ఆదివారం ఉదయాన ముద్దేనహళ్ళికి వెళ్ళి మాకు తెల్సిన సర్: ఎం.వి.గారి కతకు అనుగుణంగా ఒక స్మారకం ఇది అని ఆ విసిరేరాయిని అక్కడే ఇచ్చి తిరిగి బెంగళూరుకు వచ్చాం. మ్యూసియం మేనేజర్ సర్: ఎం.వి.గారి స్వహస్తాక్షరాలతో ఉన్న ఒక ఫోటోను మాకు ఇచ్చాడు.

పాఠకులారా...భావి భారత నిర్మాణులారా (చదువుకొంటున్న ఇంజనీరింగ్ విద్యార్థులారా) మీరు ముద్దేనహళ్ళికి పోతే భాగ్యమ్మగారి తిరగలిని... కాదు కాదు దివానుగారు స్వంత సొమ్ముతో భాగ్యమ్మకు ఇప్పించిన విసురు రాయిని తప్పకుండా చూచిరండి.

ఇప్పుడు మా ఇంటి హాలులో ఉన్న సర్:ఎం.వి.గారి ఫోటో మేము మ్యూసియంకు తిరగలిని ఇచ్చేందుకు వెళ్ళినప్పుడు మ్యానేజర్ ఇచ్చింది కదా! నేను ఆ పటంను చూసినప్పుడల్లా నా పిల్లలు ఎవర్దీ ఫోటో అని అడుగుతున్నారు. సర్: ఎం.వి.బీదవాడిగా పుట్టి, దయామయుల ఇళ్ళలో వారాలు చేసి, కష్టపడి చదివి, దివానుగా మైసూరు దేశంలోని బతుకుకు నవచైతన్యాన్ని, దిక్కును కలిగించింది.... అఖండ భారతంలోని సింధునదిపైన ఆనకట్టల్ని, నైజాం స్టేట్‌లోని హైదరాబాద్ నడుమున మూసీ వరద నివారణకని డ్రైనేజ్ సిస్టంను ఏర్పరిచింది మొదలైన విషయాలను నా పిల్లలకు అర్థమయ్యేటట్లుగా చెప్పేందుకు ప్రయత్నాల్ని చేసాను. భాగ్యమ్మ కథ, ఆ తిరగలికథ, ఇంత చిన్నోళ్ళకు ఎందుకు? వారు పెరిగిన మీదట చెప్పొచ్చులే అంతా అని నేను భావించుకొన్నాను.

అరెరే...ఎక్కడ ఆ తిరగలి? వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళైనప్పుడు ఆ తిరగలి కథను చెప్పాలనుకొంటే , ఆ తిరగలిని ప్రత్యక్షంగా చూడాలనుకొంటే ఈ మాయదారి బెంగుళూరు మహానగరాన్ని వదిలి ముద్దేనహళ్ళికి తీసుకెళ్ళాల్సిందేనా?

(కన్నడ భాషలో ఈ కథను రచించినవారు: కె. సత్యనారాయణగారు

1954లో మండ్యజిల్లాలోని కొప్పలో జన్మించి, ఎం.ఎ (అర్థశాస్త్రం)ను చదివి, ఐ.ఎఫ్.ఎస్.కు ప్రమోట్ గాబడిన వీరు కొంతకాలం భారతీయ రిసర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగం జేసి, ప్రస్తుతం మద్రాస్‌లో అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో సేవ చేస్తున్నారట.

ఈ భాగ్యనగరంలోని ఖైరతాబాద్ కూడలిలో భారతరత్న సర్: ఎం.వి.గారి విగ్రహాన్ని 1978 నుంచి నేను చూస్తూ ఉండటం, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం ఒక లక్షన్నర విద్యార్థులు ఇంజనీర్లుగా  చదివి బయటకు వస్తుండటం, మరియు నా కుటుంబంలో నా ముగ్గురు పాపలు ఇంజనీర్లుగా, ఆర్కిటెక్ట్‌గా చదువుతుండటంతో, లెక్కలకు నాకు ఒక ఆమడ దూరం ఉన్నా ప్రీతితో ఈ కథను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఒక పెద్ద పుస్తక భాండాగారంలోని 'శతమానంలోని అత్యుత్తమ కన్నడ కథల పుస్తకంలో' ఈ కథను చూచి, దానిని తెలుగులోకి అనువదించాను.)

**శాఖమూరు రామగోపాల్**
**20-02-2008**

# అమీన్‌పూర్ సంత

అమీన్‌పూర్ అనే ఊరు హున్నూరు మరియు నాగనూరు నడుమ ఉంటది. ఈ అమీన్‌పూర్‌లో రైతులు లేకపోయినా నేతను నేసేటోళ్ళు మరియు వ్యాపారస్తులతో నిండి ఉంటది. వారంలో శనివారం నాడు ఈ అమీన్‌పూరు రైతులతో నిండిపోతది. ఆ రోజు ఎంతో గొప్పగా పశువుల సంత నడుస్తుది. అమీన్‌పూర్‌లో మైన్ బజార్‌కు ఆనుకొని యుండే ఒక విశాలమైన మైదానంలో సంత నడుస్తది. సంతరోజున మాత్రమే గుడిసె హోటళ్లు, మిఠాయి అంగళ్ళు అప్పటికప్పుడే తలెత్తేవి. సంత జరిగే రోజున అమీన్‌పూర్ గిరాకిదారుల చేరికతో విర్రవీగేది.

జనం పశువుల్ని, గొర్రెల్ని, మేకల్ని తోలుకొచ్చి ఉదయాన్నే సంతమైదానంలో జమ అవుతారు. దూరపు ఊరోళ్ళు ఒకట్రెండు రోజుల ముందే తమ తమ ఊళ్ళను వదిలి శనివారం రాకమునుపే అమీన్‌పూరుకు చేరుకొంటారు. ఏమైనా తేడా ప్రయాణంలో కలుగవచ్చేమోనని సమీపంలోని ఊళ్ళలో రాత్రి మఖాం చేసి సంత జరిగే శనివారంకు ముంజాములోనే చేరుకొనేవాళ్ళు. మైదానంలోని విశాలమైన కాంపౌండ్ గోడను ఆసరాగా చేసుకొని తలెత్తిన హోటెళ్ళలో చాయ్ త్రాగి బీడీలు, చుట్టల్ని అంటించుకొని తమ పశువులతో నిధానంగా ఆవరణ లోపలికి వచ్చి నిలబడతారు. అయితే బేరసారాలు మొదలైయ్యేది సామాన్యంగా పదిగంటల తర్వాతనే జరుగుతవి.

ఎంతగానో జనం, పశువుల మందలు విపరీతంగా ఉన్నా సంతకు కళే లేదు. కరువు రక్కసికి చిక్కిన రైతులు తమ ప్రాణాల్ని, పశువుల ప్రాణాల్నినిలుపుకొనే ఉపాయంలోనే నిమగ్నమైయ్యారు. తమ ఉదర పోషణకన్నా, తమ పశువుల కష్టాల్ని (బాధలను) చూడలేకనే, వాట్ని (పశువుల్ని) అమ్ముకోవాలనే నిర్ణయంతో వచ్చినోళ్ళే, ఎక్కువ సంఖ్యలో ఉన్నారిక్కడ. మైదానం లోపల బయట ఎక్కడ చూసినా తలపాగాలు, పశువులు. అపురూపంగా పట్టణాల నుంచి వచ్చినోళ్ళూ ఉన్నారిక్కడ. ప్యాంటులను వేసుకొన్న బట్టతలల వాళ్ళు, మరియు లుంగీలను పైకి కట్టుకొని భుజాల మీద టర్కీ టవెళ్ళను వేసుకొని జబర్దస్తీగా తిరిగేటోళ్ళు ఇక్కడ ఈ రోజున కనబడసాగారు.రైతుల ముఖాలు మాత్రం జానెడు, మూరెడు బారుపెరిగి పసుపు వర్ణంకు మారిన పైరు పంటలు లాగ, బీడుబారిన భూములులాగ వాడిపోయి యున్నవి.

బసప్ప అనేరైతు తన ఎద్దును అమ్మేందుకని ఈ రోజు అమీన్‌పూర్ సంతకు వచ్చాడు. శుక్రవారం ఉదయాన్నే ఊరును వదిలి, ఆ రాత్రి 'బేవూరు'లో నిద్రను చేసి ముంజాములోనే అమీన్‌పూర్‌కు దారిని పట్టి చెన్నప్ప అనే ఒక రైతుకు జమ అయ్యాడు. ఇతను గరువు భూములున్న (ఎరుపుభూములున్న) ఊరికి చెందినోడు. చెన్నప్పను కలవక ముందు ఒంటరిగా వెళ్తుంటే దారిని ముగించేదే కష్టంగాయుంది బసప్పడిలో. దారి బారుకూ ఇంత ఉదయాన్నే భగభగలాడుతున్న (నిప్పుల్ని చెరుగుతున్న) సూర్యుడు, మొండుగా ఉన్న చెట్లు, జానడో మూరో పెరిగి వాడిపోయిన పైర్లు, డొక్కలు చిక్కిన పశువులు.... నడిచినంత బారుకూ దారి ఇలాగే ఉంది. నెర్రెల్ని గొట్టిన భూమి నోటిని తెరిచి తనను, తన ఎద్దును మింగేసేటట్లుగా కనబడుతుంది. అలా మింగేయబడ్తే ఒకే విధంగా జడలాగ ఉన్న దార్ని తొక్కేది తప్పుతది అని అన్పించింది అతనిలో. ఐనా ఏదో అవ్యక్తమైన ఆశ ఒకటి ఈ మోడు బారిన జీవంలోకి చొరబడి కాళ్ళలో ఉన్న కీళ్ళకు చలనాన్ని తెప్పించి ఇచ్చింది.

చెన్నప్ప సంతకు బర్రెను, దూడను తోలుకొని బయల్దేరాడు. ఇతను వెనక్కి మరలి, నిలిచి దార్లో తనలాగే సంతకు వస్తున్న బసప్పను జతగా చేసుకొన్నాడు. ఒకకాలంలో చెన్నప్ప బాగానే బతికినోడు. ఇప్పుడు నిసర్గంలోని ప్రకోపానికి గుర్రై చితికినోడిలాగ కనబడుతున్నాడు. బసప్ప తరుణ వయస్కుడిగా ఉన్నా అలాగున కనబడుటలేదు. పెరిగిన గడ్డం, గుంటలు పడిన కళ్ళు, తలకు చిన్న తలపాగా, చిరుగులు పడిన ధోవతి, ముడతలు పడిన వెలిసిన చొక్కా, భుజంమీద గోనెపట్టా వీటితో (నవమన్మథుడిలాగ) ఉన్నాడు. బసప్పను మొదటిసారిగా చూస్తే సరళమైన బీదరైతుగా ఎవరైనా అనుకోగలరు. బసప్పడి పేరును, దశను (స్థితిని) విచారిస్తూ చెన్నప్ప ఆత్మీయతతో మాటలను కలిపాడు. మీది గరువు భూములున్న ఊరుగా అర్థమవుతుంది. ఈసారి మాకు లభించినంతగా కుగ్రాసమూ (మేత) దొరకలేదు మీకు... ఒక చూరు (పాలు) పంటన్నా, చేతికి దొరికియుండాల్సింది కదా....!

"ఎక్కడ పడినవి (కురిసినవి) వానలు? ఇప్పటికే వానలు పడక నాలుగు సంవత్సరాలు గడిచినవి. మా బతుకు బాట సరిగాలేదు. మీరు రేగడి మట్టి ఊరోళ్ళు... మీకు రెండు వానలు పడినా చాలు... పీకటానికి కొంచంలో కొంచమైనా దొరుకుతది..." అన్నాడు బసప్ప.

“ఔను నిజమే... అయితే ఆ రెండు మంచి వానలూ పడలేదు కదా! పోయిన సంవత్సరం అంతంత మాత్రంగానే కురిసింది... ఈ సంవత్సరం పోయిన ఏడాదిలాగ పొలంలో గుంటకనూ కొట్టలేదు...”

“మేమేమో విత్తాములే... విత్తిన గింజలు దండగైపోయినవి....ఒకపాలో అరపాలో మొలకెత్తినా ఆ దరిద్రపు హైబ్రీడ్ విత్తనాల వలన వానలు లేక మాడి మసైపోయినవి.”

ఇలాగున మాట్లాడుకొంటూ వస్తుండగా అమీన్‌పూర్ రానే వచ్చింది. సంత మైదానంకు చేరుకొని తమ పశువులను చెట్లకు కట్టేసి గుడిసె హోటెల్‌లో చాయ్ త్రాగి బీడీలను వెలిగించుకొన్నారు. చెన్నప్ప తను బయటకు వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళాడు. బసప్ప హోటెల్‌లోని రేడియోలో వస్తున్న చిత్రగీతాల్ని వింటూ కూర్చున్నాడు. హోటెల్ నిండా జనం ఉన్నారు. హోటెల్ యజమాని నవోత్సాహంతో లోపలికి, బయటకీ, గల్లాపెట్టెకు అప్పుడప్పుడూ చేతిని అల్లాడిస్తూ బాధ్యతతో వ్యవహరిస్తున్నాడు. బనియన్ లోపలి నుంచి అతడి బాన కడుపు గుండ్రంగా ఉబ్బియుంది. తన బాల్యంలోని స్నేహితుడైన నింగప్పడి పొట్ట కూడా ఇప్పుడు ఇలాగున అయ్యుండొచ్చు అని అనుకోసాగాడు. నింగప్ప చదువు కొంటున్నప్పుడు తనకన్నా ముందేమి నిలిచేటోడుకాదు. అయితే ఏమి అద్భుతం, మాయ నడిచిందో ఏమో... ఏడో తరగతిలోని పరీక్షలో తనకన్నా ఎక్కువ మార్కుల్ని సంపాదించాడు. కారణం ఏమిటంటే నింగప్పడి తండ్రి వ్యవహారాలలోని లోతుపాతులను తెల్సికొన్నోడైనందున అతని కొడుకు ఎస్.ఎస్.ఎల్.సి. ముగించగానే పోలీస్ కానిస్టేబిల్‌గా ఉద్యోగాన్ని ఇప్పించుకోగలిగాడు.

బసప్ప హైస్కూల్‌లో చదివింది నిజమే. అయితే రెక్కల కష్టాన్ని, శక్తిని ఆధారం చేసుకొని బతుకుతుండే తండ్రి జబ్బుపడి చనిపోయిన మీదట చదువును ముందుకే సాగించలేకపోయాడు. ఏదో కష్టకాలంలో తండ్రి మూడు ఎకరాల్ని పటేల్‌కు తాకట్టుపెట్టాడు. కూలినాలి చేసి దాన్ని వదిలించుకొని స్వతంత్రంగా రైతు తనాన్ని చేయాలనే మహత్వాకాంక్ష బసప్పడిలో ఉండేది. పటేల్ తోటలో, కోమటయ్య పొలంలో పనిచేస్తూ అంతింతో ప్రోగు జేసుకొని తల్లికి తన ఆలోచనలను తెలిపాడు. తల్లి ఎంతో ప్రీతితో చూసుకొని పెంచబడిన ఆవు ఒక మగదూడను ఈనింది. ఆ పిమ్మట ఆ దూడ కోడెదూడగా పెరిగి నందీశ్వరుడిలాగ కనబడింది. ఈ కోడెగిత్తకు జతగా ఒక ఎద్దును కొనుగోలు చేసే ఆలోచనతో ఇంట్లో ఉన్న ఆవును అమ్మేసే మాటను బసప్పుడు తల్లిముందు ప్రస్తాపించగా, ఆ తల్లి ఒక క్షణం తబ్బిబ్బైంది. పటేల్ నుంచి పొలాన్ని విడిపించుకొని,

ఇంట్లో రైతుతనాన్ని చేసి, చెల్లెల్ని సరైన ఇంటికి ఇచ్చి వివాహాన్ని చేసే ఆలోచనను ముందుంచిన కొడుకు మనసును నొప్పించేది చేయక బసప్పడి ఆలోచనకు సమ్మతిని ఇచ్చింది.

ఇంట్లో పుట్టి, వృద్ధి చెందిన కోడెగిత్తకు సరైన జోడి తక్కువ రేటులో దొరకలేదు. ఎంతో ప్రయత్నం చేయగా కొంచం వయస్సైన ఎద్దు దొరికింది. కోడెగిత్తకు సమంగా గాకపోయినా ఆ కొన్న ఎద్దు దాని శక్త్యానుసారం గిత్తతో సరిసమంగా లాగేందుకు ప్రయత్నిస్తుండేది. కొడుకు ఇలాగున వ్యవసాయంలో లీనమైనందుకు తల్లికి సంతోషంగానే యుంది. రెండు సంవత్సరాలు తినేందుకు కొరత ఏమీ కాలేదు. అయితే గడిచిన మూడు నాలుగు సంవత్సరాల నుంచి ఒకే రీతిలో కరువు ఉండనే ఉంది. ఆ మీదట ఆ కరువు పుణ్యాన నిలుపుకొన్న ఆశెలన్నీ భగ్నమై కూలిపోయినవి. సకాలంలో వానలుపడక, అరకొరగా వానలు వచ్చి పంట వచ్చినా, క్రిమికీటకాలకు లోనై కంకులలో గింజలు కట్టక అంతకంతగా బసప్ప క్రిందకే నెట్టబడ్డాడు. ఈ సంవత్సరమైనా కొంచంగానైనా వానే పడనందున తత్తరిల్లి పోయాడు. వరణదేవుడు సరిగా వానల్ని కురిపించియుండినట్లైతే, వయస్సైన ఎద్దు చనిపోయి ఉండకపోతే, తన ఇంటి ఎద్దుకు (గిత్తకు) జతగా ఇంకొకదాన్ని అతను కొనే ఉండేవాడు. అయితే ఇప్పుడు మిగిలియున్న ఇంటి ఎద్దును వదిలించుకొనే దుర్బల అగత్యం వచ్చి నిలిచింది అతని మనసులో. మిగిలియున్న ఎద్దును అమ్మి దీనులుగా ఎక్కడికైనా....గోవాకో, మంగళూరుకో కూలినాలి దొరికే చోటుకు తల్లి – చెల్లెలితో సహా వలస వెళ్ళాలని నిశ్చయాన్ని చేసుకొన్నాడు. అంతేగాకుండా ఎద్దు (గిత్త) ఇంటిముందు డొక్కలెండి ఎముకలు బయటపడి నిలబడిన దాన్ని చూసేది తప్పిపోతదనే భావన బసప్పడిలో ఉంది. ఈ ఆలోచనలతో వచ్చిన అతను చెన్నప్పడి మాటలను విని ఇక్కడా తన ఊరిలో లాగనే కరువు కాటకం ఉన్నందున తన ఎద్దుకు రేటు పలుకుతదా అని ఆలోచించాడు. చేతిలో నాలుగు కాసులుంటే తామంతా ఊరును వదిలి వెళ్ళేది అవుతదని, డబ్బే లేకపోతే ఎలాగు అని కంపించాడు.

బీడీని వెలిగించుకొని పొగను వదుల్తూ కూర్చున్న బసప్పకు చెన్నప్ప వాపస్సై రావటంతోనే "చిన్నగా పశువులను అదిలించుకొంటూ సంత ముందు భాగంలోకే వెళ్దాం" అని సూచించాడు. మైదానంలో జనం, పశువులూ, నిండియున్నట్లుగానే దాని బయటనూ అంటే బజారు అంచున కూడా దూడలు, గొర్రెలు, మేకలు పెద్ద సంఖ్యలోనే నిలబడి యున్నవి. బజారుకు ఇంకొక అంచున రెండు లారీలు తాడపత్ర (టర్పాలిన్)లతో

నిల్చియున్నవి. బసప్ప పరీక్షగా చూస్తే ఆ తాడపత్రలతో గదులుగా భాగాలుగా చేసిందాన్ని చూసి నిలిచాడు. బసప్పడి కుతూహలం అర్థం అయినట్లుగా "ఇవి దూడల్ని, మేకల్ని, గొర్రెల్ని కసాయిఖానాకు నింపుకొని పోయేందుకు వచ్చినవి" అంటూ చెప్పాడు చెన్నప్ప. బసప్పకు ప్రాణం చుర్‌మంది. "మేకలకు, గొర్రెలకు రేటుంది. మన పశువుల కిమ్మత్తు కారుచౌకగా ఉంది. కటికోళ్ళు మన స్థితిని చూసి ఎంతగానో చౌకగా అడుగుతున్నారు. ఏది ఏమైనాగాని, నేనంటూ రైతులకు మాత్రమే అమ్ముకొంటా గాని కటికోళ్ళకు ఇచ్చేదిలేదు? పశువుకు ధర గిట్టకపోతే అమ్మేందుకు మనస్సు అవ్వటంలేదు. మేత (పశుగ్రాసం) లేనందున అట్టి పెట్టుకొనేందుకు మనస్సు ఒప్పటం లేదు. ఐనకాడికి రైతులకైనా తక్కువ ధరకైనా ఇస్తానుగాని చూస్తూ చూస్తూ కటికోళ్ళ పరంజేసి ఆ పశువుల పాపాన్ని నేను కట్టుకోలేను" అనే తన నిలువును ప్రకటించుకొన్నాడు చెన్నప్ప.

మైదానంలో (సంతలో) బర్రెల, దున్నల వరసలే మొదటిగా ఉన్నవి. చెన్నప్ప తన బర్రెను, దూడను ఒక గూటానికి కట్టి, బసప్పడిని ముందుకు పంపేందుకు తోడుకని బయల్దేరాడు. కోలాహలంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూసి ఆ ఎద్దు మొరాయించసాగింది. బసప్ప ముగుతాడును చేతిలో పట్టుకొంటే, చెన్నప్ప ఒక జొన్నదంటును చేతికి తీసుకొని వెనకనుంచి 'హల్‌చల్' అంటూ ఉషారు పెట్టాడు. ఇద్దరూ మర్రి చెట్టు నీడలో ఉన్న ఎద్దుల లైన్ల వద్దకు వచ్చారు. చెన్నప్ప ఒక సూక్ష్మాన్ని బసప్పకు చెప్పాడు. "మర్రిచెట్టు అంచులోని పశువులను అడిగేందుకు కటికోళ్ళు అంతగా రారు. తక్కువగా వాళ్ళ జోరు ఈ వైపున ఉంటది. అందుకనే నువ్వు ఈ వైపునే ఉండు" అని చెప్పాడు. "మీరు నాకు కల్సింది మంచిదే అయ్యింది... ఇక మీరు వెళ్ళిరండి" అని బసప్ప కృతజ్ఞతతో చెన్నప్పకు వీడ్కోలు చెప్పాడు.

ప్రొద్దు ఎక్కువగా సాగుతుంటే మైదానం లోపల-బయటా జనం, పశువుల గోల అధికం గాసాగింది. వివిధ రకాల గిత్తలు, ఎద్దులు, ఆవులు వచ్చినవి. అయితే ఎక్కువ శాతంగా ఆ పశువులన్నీ బక్కచిక్కియున్నవి. ఎక్కడో అపురూపంకు ఒకట్రెండు జోడీలు మిరమిరా మెరుస్తున్నవి. ఎన్నో పశువులు కసాయిఖానాకు వెళ్ళేందుకు యోగ్యం అన్నట్లుగా ఉన్నవి. బసప్ప చుట్టూ చూస్తూ తననీ, ఆ పశువుల్ని పోల్చుకొంటూ తనూ చొక్కావిప్పి నిలడితే తన ప్రక్కటెముకల్ని ఎవరైనా లెక్కించవచ్చు అని అనుకొన్నాడు.

కొనేవాళ్ళకన్నా అమ్మేటోళ్ళే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు కనబడింది. ఇందుచేత బసప్పడి ఎద్దును ఎవరూ అడగలేదు. కొంతమంది గిరాకిదారులు ఎద్దును పిలిపిలిగా

చూస్తూ వెళ్తున్నారేగాని ఇతడ్నేమి పలకరించలేదు. ఈ జనారణ్యంలో ఏకాకిగా అన్పించి తలపై చేతుల్ని ఆనించుకొని ఒక పెద్దరాయి మీద చతికిలబడ్డాడు. అంతలో వద్దనుకొన్నా ఆ పాత జ్ఞాపకాల పీకలాటం, ఆలోచనల దొంతరలు అతడి మెదడు నుంచి బయటకు రాసాగావి.

తన ఎద్దులో ఉన్న జోలు ముఖం, డొక్కలెండి నకనకలాడే దాని కడుపును చూసేందుకు సహించక, "ఒక మోపు మేతను ఇవ్వండి పటేలా..." అని అడగగా పటేల్ లౌక్యంగా "చూడు బిడ్డా... మాకు పశువులు ఎన్నో ఉన్నవి.... ఇంకా ఒక సంవత్సరాన్ని నిభాయించు కొచ్చేదే ఎంతో కష్టం... నీ ఎద్దును అమ్మేయ్... మా అంతోళ్ళే పశువుల్ని సాకేందుకు నలిగిపోతున్నాం..." అంటూ సలహాలను కురిపించాడు. ఇదే పటేల్ తహశీల్దారును ఆహ్వానించి గడ్డివాము నుంచి మేతను దానంగా ఇచ్చి ప్రభుత్వం నుంచి శెహబాస్ గిరిని పొందాడు. తను ఎద్దును అమ్మేందుకు మనస్సు రాక, దాని భాదనుచూడలేక ఒక రాత్రి పటేల్‌గారి గడ్డివాం నుంచి ఒక పెద్ద గడ్డిమోపును ఎవరికీ తెల్వనట్లుగా తెచ్చిపడేయాలని ధైర్యాన్ని చేసాడు. ఒకపెద్ద మోపును కట్టి, తల మీదకు పెట్టుకొనేటప్పుడు పటేల్‌గారి జీతగాడు అడ్డుపడి, దాన్ని క్రిందకు త్రోసాడు. అంతలో పటేల్‌గారి కొడుకు తనగడ్డివాము నుంచి అప్పుడప్పుడు మేత దొంగిలించబడుతుంది అనే దానికి తనే కారణము అవ్వొచ్చని, ఇప్పుడు ప్రత్యక్షంగా గడ్డిమోపునుంచి దొరికిపోయిందానికి తనను వదలకు చెట్టుకు కట్టేయమని జీతగాడికి ఆజ్ఞాపించాడు. ఆ రాత్రి మొత్తం హింసతో గడిపినదాన్ని గుర్తు చేసుకొన్నాడు బసప్ప. తను బతికుండేదానికి అనర్హుడని అన్పించింది అప్పుడు. తెల్లారిన మీదట ఊరికి ఊరే తనను చూసేందుకు (దోషినని) వచ్చింది. అమ్మ పటేల్ కాళ్ళమీదపడి తనను విడిపించుకొంది. ఊర్లోని జనం కళ్ళలో తను హీనుడిగా నిలిచాడు. తనను ప్రేమిస్తుండే ఆ యువతి కళ్ళకు కనిష్ట వ్యక్తిగా కనబడగా.... మౌనంగానే ఆ హింసను, అవమానాన్ని సహించుకొంది గుర్తుకు తెచ్చుకొన్నాడు.

గంగి తనకు దూరపు సంబంధీకురాలు కదా! ఆమె అన్న పని నుంచి సంపాదించిందంతా తాగటానికే తగలేస్తాడని, చెల్లెలు మీద అన్నకు ఏ మాత్రం జవాబ్దారి తనం లేదని తన తల్లి చెప్తూ, కష్టాలలో యున్న ఆ యువతిని కోడలిగా చేసుకొనే ఆశను పెట్టుకొంది. పొలంలో పైరు నవ నవోన్మేషంగా ఉన్నప్పుడు, ఎళ్ళె అమావాస్య పండుగకు తను పొలంకు బండిని కట్టి వెళ్తున్నప్పుడు అమ్మ చెల్లెలుతో గంగికూడా ఉంది. పటేల్

కొడుకు తోలే బండిని వెనక్కి నెట్టి, తన బండినే ముందుకు పరిగెత్తించింది ఆ యువతి హృదయంలో తన మీద అభిమానం ఉప్పొంగనీ అని చేసాను ఆ ధీరకృత్యాన్ని. మంచిగా ఎద్దుల్ని కడిగి, మెడలో గంటల పట్టీని కట్టి, పసుపు కుంకుమతో అలంకరించిన తన ఎద్దులు ఘల్ ఘల్ అంటూ పరిగెత్తిన దృశ్యంను గుర్తుకు త్రెచ్చుకొని రోమాంచనాన్ని పొందాడు. ఆ రోజు ఎక్కడ, ఈ రోజు ఎక్కడ అనుకొంటూ ఉసూరుమన్నాడు. ఉన్మాదంతో తేలిపోతున్న సమయం అది. వాగులోని చలమలో కడవలో నీటిని నింపి గంగి తలమీద ఆ కడవను పెట్టూ ఆమె కళ్ళలో కళ్ళను పెట్టి చూసినప్పుడు పొందిన అమరసుఖం... పటేల్ కొడుకు నుంచి జరిగిన పరాభవంకు కొన్ని రోజుల తర్వాత ఇంకొక విషయం తెల్సింది. “నీకు చెప్పాలో వద్దో అనుకొంటున్నా బసప్పా... నువ్వు గంగిని పెళ్ళాడుతావనే సుద్ధి ఉంది కదా... మొన్నటి నుంచి గంగిని తన తోట్లోని ఇంట్లోకి తెచ్చుకొని ఉంచుకొన్నాడు పటేల్ కొడుకు... ఆమె అన్నకూ తోట్లోనే పనిని ఇప్పించాడు... ఇక నువ్వేమి గంగిని మనస్సులో నిలుపుగోకు” అని చెప్తుంటే మనస్సులో పెద్ద గాలి దుమారం ప్రవేశించి అల్లకల్లోలాన్ని రేపింది. స్తిమితంలోకి వచ్చి మరలా ఆలోచించాడు. తనను చెట్టుకు కట్టిపడేసిన వ్యవహారంలో అతడి మదం, మాత్సర్యం ఇప్పుడు తెలిసివచ్చింది. తనొక దొంగ అని ఆమెకు అన్పించియుండొచ్చు. తను ఆమెను వివాహం చేసుకొని మంచిగా సాకుకోలేని అయోగ్యుడిగా ఆమె భావించియుండొచ్చు. మస్తుగా (పనిపాటా లేకుండా) తిని గుండ్రాయి లాగ బొద్దుగా ఉండే పటేల్‌కొడుకుకు పెళ్ళైనా, ఆకర్షణీయంగానే ఆ యువతికి కన్పించియుండొచ్చు... తనను కన్న (వృద్ధాప్యంలోయున్న) తల్లి–తండ్రులకు ఆసరాకని ఆమె ఆ పటేల్ కొడుకుకు ఉంపుడుగత్తెగా మారియుండొచ్చేమో... రాగా రాగా శాంతచిత్తుడైనా మనస్సులోపల పెద్ద బిలమే తోడినట్లుగా ఉంది.

ఎంతో ప్రొద్దైన మీదట పసుపు తలపాగాతో, తెల్లటి పెద్దవిగా యున్నమీసాల యజమాని ఒకడు నోట్లోని జర్దాను ఊస్తూ బసప్ప చెంతకు వచ్చాడు. నీరావరి జమీను ఉన్నోడిగా కనబడుతున్నాడు. ఎద్దును దిట్టంగా చూస్తూ “ఎంతగానో డొక్కలెండి పోయింది” అని అంటూ “ఎప్పుడు కొన్నావు ఈ ఎద్దును” అంటూ ముగుతాడును లాగి ఎద్దు నోటిని తెరచి దంతాల్ని లెక్కించాడు. బసప్పేమో ఇది ఇంట్లోనే పుట్టి పెరిగిన ఎద్దు అని చెప్పాడు. ఇతను గనుక కొంటే తన ఎద్దు సుఖపడగలదు రేటూ రావొచ్చు అని భావించుకోసాగాడు. ఆ వచ్చిన యజమాని ఎద్దుకున్న ముగుతాడును పట్టుకొని అటూఇటూ కొంత దూరం నడిపించాడు. గిత్త నుదురును, నడుంను, తోకను పరీక్షిస్తూ

“ఎద్దు బాగానే ఉంది.. బాగా మేపితే భలేగా తయారౌతది. అయితే తోకలో కసువును చిమ్మే చీపిరి సుడి, నడుంకు కాకిసుడి ఉంది. ఈ సుడులతో ఈ ఎద్దు ఇంట్లో ఉంటే ఎంతో చెడుపు కలుగుతది ఆ రైతుకు... వద్దయ్యా నీ ఎద్దు... నాకు అక్కర్లేదు” అంటూ వెళ్ళి పోయాడు. ఆ యజమానికి సరిగా జవాబును చెప్పాలనుకొన్నా బసప్పకు నోరే పెగల్లేదు.

ఇతనికేమి చెప్పేది? ఎద్దు నుంచి తనకే కష్టమూ కలగలేదు. అతను కొనకుండా ఉత్తిగనేపోయి ఉంటే తనకు ఏమి చెడు అన్పించేది కాదు. ఎద్దుకు ఏమేమో వంకలు పెట్టి వెళ్ళాడు... తెలుపు నలుపుతో ఉన్న ఈ నాటుగిత్త (ఎద్దు) ఇంట్లోనే పుట్టి, లేగదూడగా చెంగుచెంగున ఎగురుతూ తల్లి దగ్గర గిరికీలను కొట్టున్నప్పటి నుంచి దీనితో సహవాసాన్ని చేసాను. మేసేందుకని ఒకసారి వదలగా దారితప్పి ఎక్కడెక్కడో తిరుగుతున్నప్పుడు ఒకరోజంతా తను ఉపవాసంతో వెతుకులాడి ఇంటికి తోలుకొని వచ్చింది.... ఇప్పుడేమో ఈ ఎద్దును తన చేతి నుంచి వదిలేసే అభిప్రాయం రాగా మనస్సులో బాధపడ్డాడు.

తన రెండు ఎద్దులకు ఆ కాలంలో తానెప్పుడూ కొరతను చేయలేదు. అమ్మేమో ఎండుగడ్డిని తీసుకొని వచ్చి వాటికి వేస్తే, తను పచ్చిమేతను కోసుకొని వేసేది; పూట పూటకూ పత్తిగింజలు, తవుడును తినిపించేది... సోమవారం నాడు వాటి వళ్ళును కడిగేది... ఎల్లప్పుడూ ఊపు, ఉత్సాహంతో నిండిపోయిన ఆ రోజులు... ఇలాగున గుర్తుకు తెచ్చుకొన్నాడు బసప్ప.

ఎద్దు తలను నిమురుతూ, వాటి గంగడోలును సవరిస్తూ నిలుచున్నప్పుడు అవి మెడను చాపి చూపిస్తుండే స్నేహంలోని మధురిమ ఎంతగానో తన మనస్సుకు హితాన్ని కలిగించినవి కదా! తను చూపిస్తుండే ప్రేమకు ఎన్నో రెట్లుగా ఈ మూగ ఎద్దులు స్నేహాన్ని చూపించేవి. మెడలను చాపి తన సమీపంకు వచ్చి గిరికీలను చేస్తుండేవి.

మిగిలిన ఈ ఎద్దు మీద బేజారు పెట్టుకొంటే అది మంచిది కాదు. అనివార్యమై అసహాయకుడై... ఒకసారి మాత్రం దీనిని బాగా కొట్టినట్లు గుర్తు. ఆ రోజు అది ఊరికినే మొండికేసింది. వయస్సైన ఎద్దు ప్రామాణికంగా నాగలిని లాగుతుంటే ఇది అడుగుల్ని తప్పుతప్పుగా వేస్తుంది. కోపం వచ్చి బాగా కొట్టాను. అప్పుడు మెడమీద ఉన్న కాడి నుంచి త్రాడును తెంపుకొని పారిపోసాగింది. ముగుతాడు నుంచి గట్టిగా లాగి ఆపినప్పుడు, దాని నోటి నుంచి బురుగురాసాగింది. అమ్మ సాయంత్రాన గడ్డిని వేసేందుకు పాక

వద్దకు పోయినప్పుడు దాని బాధను చూసి తనతో జగడాన్ని పెట్టుకొంది. "అవి తమ శక్త్యానుసారం పనులను చేస్తవి... ఇంకొకసారి కొట్టే నేను సహించుకోను.... మంచిగా వాట్ని చూసుకో... మూగప్రాణులు (బసవదేవుళ్ళు) అవి" అంది అమ్మ. తనకు కూడా ఆ రోజు మొత్తం ప్రాణానికి నెమ్మదే రాలేదు.

తను పిల్లోడిగా ఉన్నప్పుడు అమ్మ ఏదో ఒక ప్రసంగం వచ్చినప్పుడు భూమి భారాన్ని మోసే బసవదేవుడి కథను చెప్పింది. "ఒకసారి దేవలోకంలో (కైలాసంలో) అన్ని గణాలు వార్షిక సభకు అని ఒకచోట చేరినవట. అప్పుడు శివుడు భూలోకంకు వెళ్ళి అక్కడ రైతులకు తోడుగా సేవలను చేస్తూ భూమాతను సశ్యశ్యామలం చేసేందుకు మీలో ఎవరు తయారుగా ఉన్నారు అని అడగగా అప్పుడు అక్కడ గుంపుగూడిన అన్ని గణాలు వెనుకా ముందుచూస్తూ కూర్చున్నప్పుడు, భోళా బసవడు తను వెళ్తానని చెప్పాడట. బసవేశ్వరుడు ఇచ్చిన మాటకని ఎద్దులాగ భూమిలో అవతరించి భూమిని దున్నుతూ రైతులను కాపాడడట. దురాశాపరుడైన ఈ మనిషి బసవడి నుంచి ఎక్కువ ఎక్కువగా పనులను చేయించుకొనేందుకని ముగుతాడును కట్టి పైనుంచి పైపైనే కొట్టేది చేయసాగాడట. అప్పుడు బసవడు శివుడి దగ్గరకు వెళ్ళి నన్ను మూగోడిగా చేయి తండ్రీ... మూగోడిగా ఉండి భూమిని దున్నుతాను అని కోరగా శివుడు తథాస్తు అని అన్నాడట. అందుచేతనే బసవ మూగోడిగా అయ్యాడు. అందుచేత ఇంతగా కరుణామయుడైన బసవడి కష్టాన్ని మనం కట్టుకోగూడదు... దాని ఉసురు కట్టుకోగూడదు..." అని అమ్మ ఆ కథను చెప్పింది.

దానికి వేదన కలగగూడదు... దాని బతుకును సరిగానే చూసుకొనేందుకనే పటేల్ గడ్డివాము నుంచి మేతను దొంగిలించింది... దానిని సరిగా చూసుకొనేందుకు సాధ్యపడక అమ్మేందుకనే ఇక్కడికి వచ్చింది అతనికి గుర్తుకు రాసాగింది ఇప్పుడు.

పుణ్యకోటి కథలో పులి ఆవును తినకుండా వదిలేయగా, కరువురక్కసైన ఇప్పటి ఈ పులి కూడా తనను, తన ఎద్దును వదిలిపెట్టొచ్చుగదా! ఈ కరువు పులి కూడా ఆ పుణ్యకోటి కథలోని పులిలాగ పరివర్తనం చెందొచ్చుగదా! కరువు పులి దయార్ద్ర హృదయుడిగా మారొచ్చు కదా! శ్రమించే తన చేతుల్ని, నాగలిని దున్నేటి ఈ ఎద్దును ఆ కరువు వ్యాఘ్రం వదిలేయవచ్చుగదా! ఇటువంటి ఆలోచనలు, భావనలలో బసప్పడి తల గిరగిరా తిరగసాగింది. నెత్తిమీద సూర్యుడు మంట పెట్టున్నాడు. ఎద్దునోటి నుంచి బురుగు, కళ్ళ నుంచి నీరు వస్తున్న దాన్ని చూసి బురుగును తీసేసి, దాని తలను నిమురుతూ తన

ధోవతి చెంగునుంచి కన్నీళ్లను తుడిచాడు. చెట్టుకు కట్టిన త్రాడును విప్పి ఎద్దుకు (గాబులో) తొట్టిలో ఉన్న నీరు త్రాపించి హోటెల్‌లో తనూ ఒక గ్లాసు మంచి నీళ్ళను త్రాగి మరలా తన జాగా వద్దకు ఎద్దుతో సహా వచ్చాడు.

కొంత సమయం గడిచిన మీదట ఫ్యాంటును వేసుకొని, తలకు టవెల్‌ను చుట్టుకొన్న ఒకడు వచ్చాడు. వచ్చినోడు ఎద్దు కడుపుకు బలంగా చేతిని నొక్కి దాని అందాజును లెక్కించసాగాడు. వచ్చినోడు కటికోడో లేక అతడి ఏజెంటో అయ్యుండొచ్చు అనేది తెల్వటం బసప్పకు అదెంతో సమయం పట్టలేదు. "బాగా దొక్కలెండింది... ఎంత చెప్తున్నావు రేటు" అని అడిగితే "నేను అమ్మేది లేదు" అని బసప్ప అన్నాడు "సరె... నీ ఇష్టం" అంటూ ఆ వచ్చినోడు  వెళ్ళిపోయాడు. కటికోడికి అమ్మేది లేదు అనేది బసప్పడిలో ఉంది.

తన ఎద్దును కటిగోడికి అమ్మేది అటుండనీ... అసలు గిరాకీదారులతో మాట్లాడేది కూడ కాలేదు ఈ రోజున. తన పొలాన్ని పైరు పచ్చదనంకని దున్ని సిద్ధం చేసి తన మనస్సును సంతోషపరచిన ఈ ఎద్దును కటికోడికి ఏ విధంగా అమ్మేది? ఈ మటమటలాడే మధ్యాహ్నంలో, ఆ శిశిర ఋతువులోని చల్లటి పౌర్ణమి రాత్రి తీపి గుర్తులు బయటపడసాగావి. అతని మది నుంచి జొన్న పంటను గూడుగా ఒక చోటకు చేర్చి, వాటి కంకులను విరిచి, బంతికని గుండును కట్టినప్పుడు ఎద్దులు సమంగా గుండ్రంగా తిరుగుతున్నప్పుడు, వాటి మెడలలోని మువ్వల పట్టీనుంచి ఘల్‌ఘల్‌మనే చప్పుళ్ళు... అప్పుడు పాడిన పాటను గుర్తుకు త్రెచ్చుకొన్నాడు బసప్ప.

పాటకు ముందు కృతజ్ఞతకని ఎవర్ని గుర్తుకు చేసుకొనేది రో...

నోరు లేని  మూగ బసవన్నను.... గుర్తుకు చేసుకొంటే...

రాని పదాలు కూడ వస్తవిరో సరాగంగా....

అప్పుడు తను ఆరోహణా రాగంలో స్వరాన్ని నింపి పాటను పాడుతుంటే జతగా ఉన్నోళ్ళు "పొలిగా... పొలిగో" అంటూ కేకలను పెట్టున్నారు. ఇప్పుడు అదేపాట పెదాల లోపలే నిల్చి బయటకే రాలేకపోతున్నది. వెనుకటి కాలంలో రైతునైన నేను ఈ సంతలోని మాయదారి కష్టాల సుడిగుండంలో హతాశుడై నించొన్నది... వద్దు వద్దు.. ఆ పౌర్ణమి నాటి గుర్తులు ఈ మటమటలాడే ఈ మధ్యాహ్నంలో... దిక్కుల పాలైన శవాన్ని కుక్కలు, నక్కలు, రాబందులు పీక్కొని తింటున్నట్లుగా ఆకలి, అవమానం, నిరాశె... నా ప్రాణాన్ని పీక్కొని తింటున్నవి కదా! దేవుడా... నువ్వెందుకు పుట్టించావు నన్ను ఈ భూమికి భారంగా?

బసప్ప తలను గోక్కుంటూ బీడీని నోట్లో పెట్టుకొని అగ్గిపుల్లకని వెతికాడు. అగ్గిపుల్లకని ఆ వైపునున్న రైతు దగ్గరకు వెళ్తుంటే, కొంచం దూరంలో ఫ్యాంటు, బుశ్‌షర్ట్‌ను తొడుక్కొని బొద్దుగా బాన కడుపుతో ఉన్న వ్యక్తి అడ్డదిడ్డంగా నడుచుకొంటూ వచ్చేదాన్ని చూసి “అరెరే నింగప్ప కానిస్టేబిల్” అంటూ ఆశ్చర్యాన్ని పొందాడు. ఈ కష్ట సమయంలో కూడా ఏదో ఆశె. అయితే బసప్పను చూసిందే తక్షణం అతను అక్కడ నుంచి దాటిపోయేందుకు ప్రయత్నించేవాడిగా కనబడింది. బసప్ప ఇంకాస్తగా ముందుకే వెళ్ళి అతడ్ని ఆపాడు. “ఏందిక్కడ”? అంటూ ఒకర్ని ఒకరు అడుగుకొన్నారు. బసప్ప సంశయపడ్తూనే తన పరిస్థితిని గురించి చెప్పుకొన్నాడు. నింగప్పేమో తనపై అధికారి తను పనిచేసే ఊరుకు ఇన్‌స్పెక్షన్ కని వస్తున్నందుచేత అతడ్ని ( ఆ అధికారిని) సంతృప్తి పరిచేందుకని మంచి నాటుకోడి పుంజును కొని విందు చేసేందుకు, అలాగే ఈ ఊర్లో (అమీనుపూర్‌లో) ఫ్లోరింగ్ బండలు చౌక అని వినియుండటంతో నాగనూరులో ఇప్పుడు కట్టిస్తున్న కొత్త ఇంటికని విచారించేందుకు ఇక్కడకు వచ్చానని చెప్పాడతను. కరువు కాటకం మూలాన ఇప్పుడు అధికారులు నుంచి ఇన్‌స్పెక్షన్ కని వాళ్ళు వచ్చేది పోయేది ఎక్కువగా ఉందని చెప్పాడు. అదంతా బసప్పకు అర్థం కాలేదు. అడుగుదామా, వద్దా అనుకొంటూ రెండొందల అప్పును ఇస్తే కష్టబడి శ్రమించి మళ్ళా ముట్టచెప్తానని అడిగాడు.

నింగప్ప ఊర్లో బసప్పడి ఇతిహాసాన్ని ముందే తెల్సుకొన్నోడైనందున “లేదు బసప్పా... ఇంటిని కట్టించుకొన్నందున నేనూ ఎంతగానో కష్టాలలో మునిగి ఫ్లోరింగ్ కని నాపరాళ్ళనే వేయించుకొంటున్నా... అది కూడా అప్పుగానే ఆ రాళ్ళను కొనుక్కోవాల్సి ఉంది నా గతి” అంటూ విషాదరాగాన్ని జోడించి చెప్పాడు. తను ఎందుకు  అడిగాను ఈ నిర్దయుడ్ని అన్పించి బసప్ప భూమిలోపలి పాతాళంకు చేరినట్లుగా అన్పించింది అతని మనసుకు.

కొంచం సమయం గడిచిన మీదట చెన్నప్ప ఇతని వద్దకు వస్తూ బర్రె–దూడను ఏభై రూపాయలకే కారు చౌకగా అమ్మాను అని చెప్పాడు. బసప్పడి వాడిన ముఖాన్ని చూసి “రా... రా... ఏదైనా తిని వద్దాం” అంటూ పిలిచాడు. హోటెల్‌లో చేరిన రైతులు తమలో తామే మాట్లాడుకొంటున్నారు. ఒకరైతు రెండుపళ్ళ గిత్తను వెనకకాలంలో మూడు వేల రూపాయలకు కొని ఇప్పుడు దాన్ని మూడొందలకే అమ్మేసిన విధంను చెప్పాడు. ఇంకొకరైతు “పశువులకు తినబెట్టేందుకు తన వద్ద ఏమీ లేనందుచేత వేపాకును, సర్కారి తుమ్మ ఆకును తినిపించేందుకు ప్రయత్నిస్తే, ఆ ఆకుల్ని తిన్న ఆ పశువులు వాట్ని పొట్టలో ఇముడ్చుకోలేక, అరగించుకోలేక కక్కిన విధంను చెప్పాడు. బసప్పకూడా

కటికోడొకడు తన వద్దకు వచ్చింది, అతనితో వ్యాపారం మాటలు కూడా ఆడకుండానే అతడ్ని వెళ్ళగొట్టింది చెప్పాడు. “బాగానే చేసావ్... దుక్కులు దున్ని మనల్ని కాపాడిన బసవన్నలను కటికోళ్ళపాలుకు చేర్చితే శివుడు మెచ్చుకొనేది లేదు” అని చెన్నప్ప సమ్మతిని సూచించాడు. చెన్నప్ప ఊరుకు వెళ్ళేందుకు సిద్ధమవ్వగా తను ఇంకొంచెం సేపు సంతలోనే ఉండి గిరాకీలను చూసి మరియూ ప్రొద్దుపోతే ఈ రాత్రి ఇక్కడే బిచాణాను వేసి తెల్లారేముందుజాములో బయల్దేరతానని బసప్ప చెప్పాడు. చెన్నప్పకు వీడ్కోలును చెప్పేందుకని కొంచం దూరం వరకూ వచ్చాడు బసప్ప. లారీలు కసాయి ఖానకు వెళ్ళే తయారీలో ఉన్నవి. లారీలలో ఒత్తుగా కిక్కిరిసి విసరబడిన గొర్రెలు, మేకలు బ్యాం బ్యాం అని అరిచే అరుపులు అసహనీయంగా ఉన్నవి.

సాయంత్రంలోని వెలుగులు జారుతుంటే మైదానం ఖాళి అయ్యింది. బసప్ప మాత్రం ఎంతో సేపు అలాగే వ్యర్థంగా నిలబడ్డాడు. ఈ ముఖాన్ని పెట్టుకొని ఊరికంటూ వెళ్ళేది లేదని నిశ్చయించుకొన్నాడు. ఎద్దును రావిచెట్టు అరుగు దగ్గరకు పట్టుకొని వచ్చి కూర్చున్నాడు. ఇదే ప్రశస్తమైన స్థలం అని నిర్ణయించుకొన్నాడు. రోజంతా దహించిన ఆలోచనలు, భావనలు, పీకులాట ఇప్పుడు గడ్డకట్టుకొని మనస్సుకు ఒక దృఢ నిశ్చయాన్ని చేసుకొనేందుకు సహాయపడినవి.

మైదానం నిర్జనమవుతుంటే కొన్ని పక్షులు ఆ చెట్టు వద్దకు అప్పటికే చేరుకొని తమ గూళ్ళను తలుపినవి. ఇతను పైకి క్రిందకూ చూస్తూ కూర్చున్నట్లుగానే ఒక రాబందు నిగూఢ భావంతో వచ్చి ఒక కొమ్మ మీద కూర్చుని దేన్నో కుళ్ళబొడుస్తుంది. మరొక చోట జరిగే సంతలో శ్రీకృష్ణ పారిజాత యక్షగానం ప్రదర్శన ఉన్నందుచేత టెంట్ హోటెల్ వాళ్ళు తమడేరాను ఊడదీసుకొని ప్రొద్దుగుంకెలోపే వెళ్ళిపోయారు. మైదానంలో అక్కడొకడు, ఇక్కడొకరుగా ఉన్నోళ్ళు ఆ యక్షగానంను చూసేందుకని వెళ్ళిపోయారు. చుట్టూ నిశ్శబ్దం ఆవరించింది. బసప్ప ఎద్దు మెడకు బిగించిన ముడిని విప్పి చేతిలో పగ్గాన్ని పట్టుకొన్నాడు. దాని గంగడోలును సవరిస్తూ వీపును నిమురుతూ మరలా భావ విహ్వాలుడైయ్యాడు. “నాకు నీకూ ఋణానుబంధం ముగిసింది తండ్రీ బసవన్నా.. నన్ను క్షమించు... నేను ఒట్టి అసమర్థుడ్ని” అంటూ ఏడ్వసాగాడు. అరుగుమీద ఎంతో సేపు తలపై చేతుల్ని పెట్టుకొని కూర్చున్నాడు. “ఇక ఈ లోకంలోని నా ఆటకు సెలవను ఇప్పించుతండ్రీ” అంటూ చివరిసారిగా ఊపిర్ని పీల్చుకొన్నాడు. గట్టిగా నిలబడ్డాడు. దృఢ మనస్కుడైయ్యాడు. ఈ కరువు యాతన నుంచి విముక్తిని పొందేందుకు ఒకే ఒక

దారి అని నిశ్చయించుకొన్నాడు.

మరుసటిరోజు మున్సిపాలిటిలోని కసువును చిమ్మే కార్మిక మహిళ ఒకామె మఱ్ఱి చెట్టుకు శవం వేళాడుతున్న దాన్ని చూసి భయాన్ని చెంది చీపురు కట్టను అక్కడే విసిరేసి ఆఫీసోళ్ళకు విషయాన్ని తెలిపింది. ఇతనికి చచ్చేందుకు వేరే జాగానే దొరకలేదా? అంటూ ఆఫీసోళ్ళు పోలీసోళ్ళకు కబురును పెట్టారు. ఇప్పుడో అప్పుడో ప్రాణాన్ని వదిలేందుకని పడిపోయిన ఆ డొక్క లెండిన ఎద్దు, మరియూ ఈ అజ్ఞాత శవం గురించి పోలీసులు పంచనామాను తయారు చేసుకొన్నారు.

❀ ❀ ❀

(రాయచూరు నుంచి వేరు పడి కొత్త జిల్లాగా మారిన కొప్పళకు చెందిన మల్లికార్జున హిరేమఠ ఇంగ్లీషులో ఎం.ఎ.ను చేసారు. ప్రస్తుతం బాగల్‌కోట జిల్లాలోని హునగుంద పట్టణంలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కన్నడంలో ఈ కథ 'అమీనుపుర సంత' అనే పేరుతో ప్రచురించబడింది. ఒక శతమానంలోని అత్యుత్తమ ఎనభైనాలుగు కన్నడ కథలలో ఈ కథ చేర్చబడింది)

27-02-08

**- శాఖమూరు రామగోపాల్**

# పాపం కల్యాణి

కల్యాణి పదిమంది నుంచి ఉమ్మించు కొన్నా, తొంభై మందికి ఆమె అవసరమే అవుతది కుంటూరు గ్రామంలో. మెజార్టీ జనం ఆపేక్ష మూలకంగా ఆమె ఊరిలోనే ఉండిపోయింది. ఊర్లోని జనంలో ఒకడైన రాంఫ అనే అడ్డపేరుతో పిలవబడే 'రామప్ప నాయ్క' నికి 55వ ప్రాయంలో భార్య సీతు వలన పుట్టిన ఆమె ఈమె. వయస్సులో 30 సంవత్సరాల పైనో క్రిందో ఉండే కల్యాణి తల్లితండ్రులకు ఏకైక ఆధారస్తంభమై నిలిచి పోయింది. నూనె జిడ్డుతో బిగించి కట్టిన తల ముడిలో ఎర్రటి మందారాన్నిపెట్టుకొని, పనికి వెళ్ళేటప్పుడు తలకు అద్దుడు కోసం ఆకుల చుట్టను పెట్టుకొని పనికి వెళ్ళేది. చీరను మోకాళ్ళ పైకి కట్టి, చేతిలో కొడవలి పట్టుకొని ఉందంటే, కల్యాణి ఎవరో ఇంటి పొలం పనికి పోతుంది అనే అర్థం కలిగేది. ఎక్కువ రోజులు షెట్టి ఇంటికే కూలిపనులకు వెళ్ళేది. వరినాట్లుకు, కలుపు తీయటానికి, కోతకు, తోటలో ఎరువు వేయటానికి, సీసన్‌లో ఎవరు పిలిచినా వెళ్తది. వినాయక చవితి, నవరాత్రి, సంక్రాంతి, తిథి మొదలైన వాటికి శాస్త్రిగారింటి నుంచి కచ్చితంగా పిలుపు వస్తుండేది కల్యాణికి. మగాళ్ళతో సరిసమానంగా ఎరువు మూటల్నిమోసే ఆడది ఆ చుట్టు పక్కల ఊళ్ళలో కల్యాణి ఒక్కతే అవ్వటం వలన ఆమెను పిలవనోళ్ళు ఎవరూ లేరు ఆ ఊర్లో. కల్యాణి శ్రమ–కష్టం–అందరికీ అవసరమే.

నేత్రావతి నదికి దాని ప్రవాహ శబ్దాల్ని వినేంత దూరంలోనే ఉన్న ఊరు కుంటూరు. ఇరవై–ఇరవై ఐదు ఇళ్ళగడపలతో నానాజాతుల (కులాల)తో ఊరు సమంగా పంచుకొనే ఉండేది. కల్యాణి జాతోళ్ళే మెజారిటి ఇళ్ళతో ఉండేవారు. మరాఠి నాయక్‌ల ఇళ్ళు నాలుగైదు, రెండు తురకల (బ్యారి) ఇళ్ళు, రెండు షెట్టి జాతోళ్ళ ఇళ్ళు, ఎరుకుల జాతికి చెందిన ఒక కుటుంబం తమ ఇద్దరు పిల్లలతో ఊరి చివర్న అంటే నేత్రావతినే టాయలెట్ బాత్రూమ్ చేసికొంటూ నది అంచునే ఉండేవారు. సుశీలమ్మ భర్త ఐన వెంకట రమణ శాస్త్రి తిథికి బ్రాహ్మణుడైనా కావాలి, ఉండాలి గదా అనుకొని, తన భార్యకు తమ్ముడైన విఘ్నేశ శాస్త్రిని భార్యాపిల్లలతో పిలుచుకొని తనకున్న ఎనిమిది ఎకరాల పొలంలో రెండెకరాల తోటను ఇచ్చి, ఈ ఊర్లోనే స్థాపనం చేయడం వలన రెండిళ్ళు బ్రాహ్మలవి అయ్యాయి. ఇక మిగిలినవి ఈడిగ కులం వాళ్ళవి, మరియు కొంకణి భాషను మాట్లాడేవారివి. ఒకటిన్నర కిలోమీటర్ పొడవుతో ఉన్న ఆ ఊరిలో అందరికీ పొలం,

పుట్రా ఉంటే, కల్యాణి అమ్మా–నాన్నకు ఉన్న ఇల్లు, నాలుగు కొబ్బరిచెట్లు, రెండు అరటి చెట్లు, ఒక తులసి, మరొక గులాబి చెట్టుతో ఒక హరిదాసుడి నివాసం అనేటట్లుగా తప్పితే అంతకు మించి ఇంకేమి లేదు. ఇంటిలో ఒక చోట కోళ్ళగూడు. దాన్లో ఒక కోడికి ఎక్కువ ఇంకొక కోడికి జాగలేనట్లుగా ఉండే గూడు అది.

కుంటూరు సరిహద్దులో ఒక మూల నుంచి కురుదూరు ప్రారంభమవుతది. అక్కడ్నించి అబ్బబ్బా అంటే ఒక మైలు దూరాన చిన్న ప్రాథమిక బడి ఉంది. కుంటూరులోని పెద్ద జాతి పిల్లలు మినహా మిగతావాళ్ళ పిల్లలెవరూ దాని ముఖం చూడ్లేదు. ఎందుకంటే వానాకాలంలో నది దాటాలి కదా అనే కారణం, పిల్లలు చదివి కలక్టర్ అవ్వాలా అనే కారణం ఊర్లోని జనంకు ఉండేది. కల్యాణికి ఐతే బడి ఏ దిక్కులో ఉన్నది అనేది చూడలేదు. ఏడో, ఎనిమిదో ప్రాయంలో ఊర్లోని అక్కలైన చంద్ర, పద్మ మొదలైన వాళ్ళతో బీడీలు చుట్టటానికి వెళ్ళేది. రోజుకు సరాసరి వేయి బీడీలను చుట్టేది. తోటి అక్కలకు పెళ్ళిళ్ళు జరిగిన కాలంలో కల్యాణి ఋతుమతి (పెద్దపిల్ల) అయ్యింది. తల్లైన సీతు (సీతమ్మ) రెక్కల కష్టం చేసి కూతుర్ని బాగానే పెంచి పోషించింది. ఉన్న ఒక్క కొడుకు గోపాలం ఇంట్లోంచి పారిపోయి బెంగళూరుకు చేరి అక్కడే తన లాంటి దాన్నే పెళ్ళి చేసుకొని పిల్లలైన తర్వాత తనొక బడిలో జవానుగా పనిచేసుకొంటున్నాను అని అడ్రసుతో ఒకసారి ఇంటికి ఉత్తరం రాసాడు. ఇప్పుడు కల్యాణే తల్లి–తండ్రికి కొడుకు లాగ అయిపోయింది.

కల్యాణి ముక్కులో మెరుస్తున్న ముక్కు పుడకను తెచ్చి ఇచ్చినోడు ఆమె జాతోడే అయిన కుక్క నాయ్క పెద్ద కొడుకైన జగ్గడు. జగ్గా అని ఊరోళ్ళు పిలుస్తుండే ఇతనికి అతని జన్మ నక్షత్రంకు అనుగుణంగా జగదీశ్ అనే పేరుండేదట. కల్యాణి మనసులో మొట్టమొదటిగా ప్రీతిజ్వాలకు అగ్నిని పెట్టి వెనుకా ముందుచేరి నాగవేణికి (నాగుపాము లాంటి జడకు) ఇంటి ఆవరణలో పెరిగిన గులాబిని పెట్టినోడు జగ్గానే. జగ్గానే మంగళూరు పేటలో చెప్పి చేయించిన ముక్కుపుడకను కల్యాణికి కానుకగా ఇచ్చాడు.

ఆద్రాంబ్యారి అంగడికి కల్యాణి బిగుతుగా ఉన్న రవికె, ముక్కాలు లంగాతో పొడవాటి జడకు రిబ్బన్ కట్టుకొని బీడీలు చుట్టటానికి తంబాకు ఎండు పొడుం కోసం వెళ్ళితే ఆమె వెనుకే రక్షణ ఇచ్చేవాడు జగ్గా. 'కల్యాణి నా సొత్తే' అని ఊరంతా చాటుకొంటూ తిరిగేవాడు జగ్గా. వానాకాలంలో ఇంటికి మరామత్తు చేపించేది మొదలు కల్యాణికి అవసరమయ్యే రిబ్బన్లు, కుచ్చులు, పిన్నులు, గాజులు, రాంఫకు అవసరమయ్యే బీడి

కట్టలు, ఆకు వక్కలు అప్పుడప్పుడు సారాయి పాకెట్లను సరఫరా చేసేవాడు. ఈ పనుల గుట్టు, మర్మం సీతుకు సరిగ్గా తెలిసే లోపలే కల్యాణి జగ్గతో నాలుగుసార్లు మంగళూరికి సినిమా షికార్లు కొట్టటం అయ్యింది. రెండుసార్లు రెండ్రెండు నెలల గర్భాన్ని తీయించటం అయ్యింది. రాంఫకు ఆకు వక్కలు, బీడీలకు మరియు సారాయికి డబ్బులిస్తే ఇంటిలో ఉండక పోవటం వలన సీతుకు కూతుర్ని కనిపెట్టుకొని గమనించే వాళ్ళు ఇంట్లో లేరని తెలిసి పోయింది. ఆమెకేమో కూలికి వెళ్ళకపోతే గడవదు కదా!

ఒకరోజు పొద్దున్నే వచ్చిన జగ్గను అడిగేసింది సీతు. "కల్యాణిని పెండ్లి చేసుకొంటావు గదా? ఎప్పుడు మీ ఇంటోళ్లు వస్తారు. మాటలు కుదిరితే మంచిది కదా" అన్నది ఆమె. "లేదత్తా మొదట చెల్లెలి పెళ్ళి చేయాలి కదా! నాకొక ఇల్లు నిర్మాణం అవ్వాలి! అప్పటిదాక పెండ్లి కుదరదు". అని అన్నాడు జగ్గ. "ఐతే నువ్వు ఇట్లా వస్తే ఊరి జనం ఆడిపోసుకోటానికి కారణమవుతది. అది మనమే అవకాశం కల్పించినట్లవుతది. నేను పనికి పోకపోతే జరుగుతదా?" అని మరొకసారి సీతమ్మ ప్రశ్నించింది. ఇప్పటి దాకా ఊరుకొన్న కల్యాణి లోన్నించి "అమ్మా, నీకు నోర్మూసుకొని ఉండటం కుదరదా" అని అరిచింది.సీతు బిడ్డ మాటలకు మూగి అయ్యింది. అక్కడ్నించి వెళ్ళిన జగ్గా నెలదాక రాకపోవటం వలన తల్లి-కూతురు నడుమ పెద్ద జగడం నడిచింది. "నేనెక్కడికైనా పోతా, నువ్వొక్కతే ఇక్కడ మట్టి తిను" అని కల్యాణి కాళ్ళను నేలమీద గుద్దుతూ చెపుతుండగా, రాంఫ వచ్చి "బిడ్డా.... నువ్వు మాట్లాడగాకు" అని కూతురికి, సీతమ్మతో 'నీకు బుద్ధిందా, ఊరుకోరాదు' అని గదమాయించాడు. ఇంకొక రోజు సాయంత్రంలో 'కల్యాణి, మీ అమ్మకు నేను వచ్చేది ఇష్టం గాక పోతే నేను నీ దగ్గరకు వచ్చేదే కల్ల' అంటూ వెనక్కి చూడకుండానే జగ్గా వెళ్ళిపోయాడు. వారంలోపే బొంబాయిలోని ఒక హోటల్లో ప్లేట్లు గ్లాసులు కడిగే పనికి కుదిరాడు. జగ్గడు బొంబాయి వెళ్ళాడనే సుద్ధి తెలిసి సీతు నిటూర్పులు వదిల్తే, కల్యాణి మండిపోసాగింది.

ఇంట్లోనే బీడీలను చుట్టి కల్యాణి ఇంటి నుంచి బయటికి వెళ్ళేది బీడీ కంట్రాక్టర్ ఆద్రాంబ్యారి అంగడికి మాత్రమే. రోజు మార్చి రోజు రెండ్రెండు వేల బీడీల లెక్క కల్యాణి నుంచి వచ్చేది. కల్యాణికి లంగా-రవికె పోయి ఇప్పుడు చీర, జాకెట్ వచ్చినవి. గజంబారు చీర సెరగు ఒడినుంచి, చేతి బారూ బీడి కట్టలతో ఎంతో ముందు వచ్చినా, ఆమె బీడీల లెక్కను చివర్లోనే లెక్కించేవాడు ఆద్రాంబ్యారి. అంతసేపూ మెరుస్తున్న ముక్కు పుడకను పొందిన ఆమె ముఖం ఉబ్బిపోయేది. ఒక చిరు నవ్వైనా లేని ఆమె ముఖాన్ని

ఊళ్ళో వాళ్ళు చిటపట లాడే ముఖం అని అన్నా ఆమెకు తెలిసేదిగాదు. రోజులు నడిచే కొద్దీ అ(ద్రాంబ్యారి అంగడి నుంచి ఫేర్ అండ్ లవ్లీ, పాండ్స్ పౌండర్, కాజోల్ కాటుక, ఐశ్వర్యారాయ్ లాగ మెరుస్తుండే రబ్బర్ బ్యాండ్ వస్తుండేవి. బీడీలు తీసుకొని అంగడికి వస్తుంటే, భోగం స్త్రీ అని ఊరోళ్ళు పిసుపిసు మాటల్ని అనుకొనేవారు.

ఆషాడ మాసం ఉక్కపోతకు ఇంట్లో కూర్చోటం రాంఫకు విసుగనిపించి, అద్రాంబ్యారి అంగడికి చేరాడు. ఊర్లోని జనం కలిసేది మరియు ఊసుబోక కబుర్లకు అంగడికి దగ్గర్లోని రాధేశ్యాం హోటల్ కార్యస్థళం అయ్యేది. ఒక రోజున అంగడికి వచ్చిన రాంఫకు ఒక చాయ్ ఇవ్వండి అని హోటలోడికి చెప్పి బోనస్‌గా ఒక ప్లేట్ మిరపబజ్జీలను తినిపించాడు అద్రాంబ్యారి. ఒక ట్రెండు రోజులు టిఫిన్, చాయ్ రాంఫ తీసుకొంటుంటే ఆ టైమ్‌లో అద్రాంబ్యారి కూతవేటు దూరంలో ఉండే రాంఫ ఇంటికి వెళ్ళి వస్తుండేవాడు. కొంచం ఆలశ్యం అయినా అద్రాంబ్యారి వచ్చేదాక లేచేవాడు కాదు రాంఫ. ఎందుకంటే వెళ్ళేటప్పుడు “రాంపణ్ణా…నేను వచ్చేదాక నువ్వుంటావు గదా? ఎవరైనా వస్తే ఇప్పుడే వస్తాడు అని చెప్పు” అని జాగ్రత్తలు చెప్పి వెళ్ళేవాడు అద్రాంబ్యారి. హోటల్ వాడి మూలంగా ఊరంతా ఈ సుద్ధి రవాణా అవ్వటం చేత సీతమ్మకూ తెలిసేటప్పటికి కల్యాణికి నాలుగు నెలలు నిండి ఐదో నెల అవటం గర్భంలో పిండం ఎదుగుతుండటం కన్పించసాగింది. విఘ్నేశ్ శాస్త్రి భార్య శైలజ ‘కాసరగోడు’ పట్టణంలో సర్కారి బడిలో ఎస్.ఎస్.ఎల్.సి. చదవటం ఒక ప్రయోజనం అయినట్లు సీతు తనకొడుకు గోపాలకు విషయం ఇది…. ఇది…. అని ఉత్తరం రాయండి అక్కా అని గుట్టుగా అడగటం మూలాన పెద్ద శాస్త్రి గారి భార్యకూ నిజం తెలిసి “పోయే కాలం పిల్లదానికి, పిల్లకూ బాధ్యత లేదా” అని ఉద్గరించింది. విషయం తెలిసిన వెమ్మటే వచ్చిన గోపాల బెంగళూరుకు చెల్లెల్ని తీసుకొని వెళ్ళి బాగు చేపించి (కడుపు తీయించి), వారం లోపలే ఊరికి పంపించాడు. వెళ్ళేటప్పుడు అడవి మల్లె లాగ కళకళలాడిన కల్యాణి, తిరిగి వచ్చినప్పుడు ఎండిన ఆకులాగ అయ్యింది. ఐనా ఆమెకు ఏమీకాలేదు అని రుజువు చెయ్యటానికి సీతు ఫలవంతమైన వరిపొలంకు పనికొరకు తనతో తీసుకొని వెళ్ళి వరినాటు వేయించింది.

కార్తీకమాసంలో అందరితో పొలం పనులకు వెళ్ళింది కల్యాణి. బీడీలు చుట్టటం ఆపేసింది. తలమీద ఆకుల చుట్ట, వీపుకు ఒక గోనె పట్టా, నడుంకు ఆకు వక్కల సంచి ఆమెలో కలిసిపోయాయి. షెట్టిగారి పొలంలో ఎదురుగా ఎవరూ మాట్లాడక పోయినా తల్లి–కూతురు ఆ పక్కకో–ఈపక్కకో పోతే, కిసుక్కున నవ్వి, కళ్లతోనో, చేతులతోనో

సంజ్ఞలు చేస్తూ వాటినే మాటల రూపాలుగ మార్చేవారు తోటికూలీలు. సీతుకు ఇది తెలిసినా ఏమి అనలేకపోయేది. ఒకసారి “మా కల్యాణి ఉంది కదా... ఈ రోజు సాంబారు చేసింది. శాస్త్రిగారు ఆమె చేసిందానికి ఆకర్షించబడ్డారు. సాంబారుకు పోపుపెడ్తే దాని పరిమళం ఊరంతా వ్యాపించింది” అని అంది. తన జాతి ఆమే అయిన చోము అవకాశానికి కాచుకొన్నదిలాగ “అంగడీకి పోయుండొచ్చు. నేను వచ్చేటప్పుడు వాసన వస్తుంది అక్కడ్నించి” అన్నది. అంతలో పగ్గాల్ని వదుల్తూ అక్కు పుజార్తి “ఎందుకే చోము? మీ ఇంటి నుంచి వాసన రాలేదా”? అంటూ ఓరగా నవ్వింది. కల్యాణి చేతిలో ఉన్న పొలం పనిముట్లను విసిరేసి దబదబా వెళ్ళి పోయింది. దాన్తో అందరి నోళ్ళు మూతబడినవి. సీతు తగ్గించిన తలను ఎత్తకుండానే నాట్లు వేస్తూ సాగిపోయింది. కల్యాణి షెట్టిగారి పొలం పనులకు రాకపోవటం వలన పనస పొట్టుకూర ఎవరూ తినలేదు. పొలంలో జానపద పాటలు, కవిత్వాలు వినబడలేదు.

మార్గశిరం ముగుస్తుంటే మొదటి పంట కోతకు వచ్చింది. కోతకు మళ్ళీ సిద్ధమైంది కల్యాణి. మగాళ్ళంతే వరి మోపుల్ని మోయటం కల్యాణికి ఎప్పుడూ ఇష్టమే. మోకాళ్ళపైకి చీరను ఎత్తి కట్టి, పెద్ద వరి మోపును తల మీద పెట్టారంటే, అడుక్కుతినే జాతోడైన శుక్ర లాగ ఆమె బరువుల్ని మోస్తుండేది. ఈ సారి శుక్రతో నడిచిన బరువు పోటీ మిగతా పనోళ్ళకు హుషారు పుట్టించింది. కల్యాణి ఆనెపడి (వరి కంకుల కట్టల్ని కొట్టే బల్ల) మీద వరి పనల్ని ఎత్తి ఎత్తి కొట్టటం, వరిగింజలు ఆ పనల్నించి రాలిన తరువాత గడ్డిని ఒక కుప్పగా పడేసేటప్పుడు, ఆ గడ్డి శుక్ర ముఖం మీదో లేదా వీపు మీదో పడుతుండేది. శాస్త్రిగారి ఇంటి నుంచి తోటకు ఎరువు మూటల్ని మోసేటప్పుడు శుక్ర పంచముడు అవ్వటం వలన శాస్త్రిగారి ఇంటికి ప్రవేశం లేకపోవటం చేత, తోట వరకూ కల్యాణి ఎరువు మూటల్ని అంత దూరం మోయటం సాధ్యం కాదు గనుక, శుక్రకూ దారి మధ్యలో బరువు మూటల్ని బదలాయించేది. ఆ నోటినుంచి ఈ నోటికి అన్నట్లుగా కొత్త సుద్ది ప్రసారం జరిగినా సీతమ్మకు శుక్ర మీద పూర్తి విశ్వాసం ఉండేది. అంతను ఎంతైనా పంచముడేకదా! తన బిడ్డ జతకు ఇంటికి రాలేడు అని అనుకొనేది. ఐతే ఇంటిలో ప్రత్యేక వ్యవస్థ లేనందు వలన చీకటి మొదలైతే దేహబాధను నివారించుకోటానికి కల్యాణి బయలకు వెళ్ళి వస్తుండేది. కూతురు మళ్ళా గర్భిణి అయ్యింది ఎవరి మూలాన అనేది తెలుసుకొనే సమయానికి శుక్ర భయంతో ఊరు విడిచి వేరే గ్రామంలోని ఏలకుల తోటలో పనికి కుదిరాడు. ఈసారి వచ్చిన గోపాల చెల్లెల్ని బెంగళూరుకు తీసుకెళ్ళి,

మళ్ళీ ఊరికి వచ్చి, ఇంట్లో మంచి నీరు కూడా త్రాగకుండా తను బాల్యంలో తల్లి నుంచి తిన్న తిట్లను చెల్లెలి మీద కురిపించి "ఈ పని కోసం ఉత్తరం రాసారంటే నేనొచ్చేదిలేదు. ఈమె చస్తే దినానికి పిలవండి. మీరు చస్తే కొరివి పెట్టటానికి వస్తా" అని తల్లి-తండ్రికి చెప్పి వెళ్ళిపోయాడు. ఇంత కోపం అతనికి ఎందుకంటే కల్యాణిని చూసిన మేనల్లుడు "ఈ అత్త వచ్చేటప్పుడు పెద్ద పొట్టతో వస్తది. పోయేటప్పుడు చిన్న పొట్టతో వెళ్తది? ఎందుకిట్లా" అని ప్రశ్నించాడట అమాయకంగా.

సీతకు ఇప్పుడు వేరేదారి కనబడక ఇద్దరాడోళ్ళతో కల్యాణికి మొగుడ్ని వెతకమని ప్రార్థించింది. కల్యాణిని చూసినోళ్ళు అంతా ఇప్పుడామెను ఊరి పశువులు మేతకెళ్ళే ఫలవంతమైన లంక (నదిగర్భంలో ఉండే భూమి) లాంటిదే అని అనుకోసాగారు. ఎవరైనా దొరికితే వాళ్ళకు కట్టుదాము ఈమెను అని మధ్యవర్తి స్త్రీలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మెడకు కట్టిన గుదిబండ ఈమె అని ఈసడించుకొన్నారు కొంతమంది. జతకు ఎవరైనా దొరికితే చెప్తాములే అని ఆ స్త్రీలు (మధ్యవర్తులు) సీతమ్మ నుంచి జారుకొన్నారు.

ఇప్పుడు రాంఫ  పనిచేయటానికి ఎక్కడకూ వెళ్ళటం లేదు. ఎక్కడికైనా వెళ్ళి, ఎవరినుంచైనా ఒక బీడీ లేదంటే పొగాకు పొడినో అడుక్కుని సంతృప్తి చెందేవాడు. పనికి పోతేనే పూటగడుస్తది అనేది సీతకు బాగా తెలుసు. పనులు మందగించినప్పుడు వానాకాలంలో బీడీలు చుట్టటం తప్పనిసరై సీతే ఆద్రాంబ్యారి అంగడికి వెళ్ళి, బీడి ఆకులు,పొగాకు పొడి తెచ్చేది. ఆద్రాంబ్యారి నవ్వుతూనే "ఈ వయస్సులో సీతక్కా నీకెందుకు ఇంత కష్టం" అని అనేటప్పుడు ఆమె విచలితం అయ్యేది కాదు. ఇంటిలో మళ్ళీ బీడీల ఆకుల్ని కత్తిరించేటప్పుడు వినబడే కరక్, కరక్ శబ్దాలు ప్రారంభమైనవి. బీడి ఆకులు, పొడుం తీసుకురావటానికి జగ్గడి తమ్ముడైన ఈసర (ఈశ్వర్)ను బతిమాలు కొనేది సీతమ్మ. ఈసర ఐదో తరగతి రెండు సార్లు ఫెయిల్ అయ్యి జీవితంలో ఇంక చస్తే బడి ముఖం చూడనని హఠం చేసాడు వాళ్ళ అమ్మా నాయన దగ్గర.

రెండు తొడల మీద బీడీల కోసం చాటను పెట్టుకొని రోజంతా ఇంటిలోనే బీడీలను చుట్టటం, ప్రక్కనే ఈసరతో వైకుంఠపాళి ఆడుతూ, అప్పుడప్పుడు చెండుమల్లి, తోటకూర చెట్లమీద ఉన్న గింజల దంటును తింటున్న కోళ్ళను పారద్రోలుతూ "భామా... సత్యభామా... కోపమెందుకే నీకు కృష్ణుని మీద" అని పాడుతూనే సరసరా వేయి బీడీలను చుట్టేది కల్యాణి. ఆమె తొడల్ని, ఆమె నుంచి బయటపడటానికి ఎగిసిపడుతున్న పెద్ద

వక్షోజ సంపదని చూస్తూ 12 సంవత్సరాలోడైన ఈసర (ఈశ్వర) ఆమె దగ్గర వదలకుండా వదిన, వదినా అంటూ అక్కడ్నుంచి కదిలేవాడుకాదు.

రాంఫకు చూపు మందగించింది. ఊతకర్రతో, అందాజుతో కూతుర్నించి తీసుకొన్న డబ్బుతో సారాయి అంగడికి పోయి వస్తుండేవాడు. గట్టిగా చెప్పినా బదులివ్వకుండా, చెప్పినోడి ముఖాన్ని అమాయకంగా చూస్తుండటం వలన పుట్టెడు చెముడు వచ్చింది రాంఫకు అని ఊరోళ్ళు అనుకోసాగారు. ఇది ఇట్లా ఉంటే పంచాయత్ ఎలక్షన్లు కుంటూరుకు వచ్చింది. రిసర్వేషన్ మూలాన కుంటూరు బి.సి.లకు రిసర్వు అవటం చేత జగ్గడి తండ్రైన కుక్క నాయ్క ఏకైక అభ్యర్థి అవ్వటం, ఎలక్షన్ లేకుండానే పంచాయత్ సర్పంచ్ అయ్యాడు.

కుక్కనాయ్క నేతృత్వంలో కుంటూరు–కురుడూరు మధ్య ప్రవహించి, నేత్రావతిలో కలిసే పెద్ద వాగుకు బ్రిడ్జ్ నిర్మాణం అవుతది అనే సంతోష మాటలు కొంతకాలానికి వాటంతట అవే ఆవిరి అయిపోయాయి. వానాకాలంలో రెండూళ్ళు వేరే వేరే అయి సంపర్కం లేకుండా ఉండేవి. కుంటూరులో లోయర్ ప్రైమరి స్కూల్‌కు పునాది వేసేందుకు ఎమ్.ఎల్.ఎ.గారు రాకపోవటంతో అది అట్లాగునే కాగితాలలో నిలిచి పోయింది. మీరు పునాది రాయి వేయటానికి ఎందుకు రావటం లేదు? అని ఎమ్.ఎల్.ఎ. గారిని అడిగితే విద్యామంత్రి దొరకట్లేదు అని చెప్పటం, విద్యామంత్రిని కుంటూరులో స్కూల్ నిర్మాణ పునాదికి హాజరవ్వండి అని అభ్యర్థిస్తే ఇప్పటికే మీ ఊరోళ్ళు కట్టకట్టుకొని కమలానికి ఓట్లేసారు. ఇక స్కూల్ గనుక ప్రారంభమైతే శాశ్వతంగా హస్తాన్ని మరచి పోతారు. మాపార్టీకి అక్కడ ఆదరణ స్కూల్ మూలంగా దొరకదేమో అనే సందేహాన్ని తనని కలిసిన కుంటూరు–కురుడూరు జనంతో నిష్కర్షగా అన్నాడు ఆ మంత్రి. జనం చదువుకొంటే మితిమీరి పోతారేమోననే భయం ఆయనది.

కుంటూరులో కాలం గడిచేకొద్ది అనేక మార్పులు రాసాగాయి. ఆద్రాంబ్యారి పూరిల్లును తీసేసి మంగళూరు పెంకులతో ఊర్లోనే పెద్దదైన ఇల్లును కట్టించాడు. ఆ ఇంట్లో ఒక గదిని తన భార్య నిత్యసంతాన వృద్ధి బాలింతతనానికి కేటాయించాడు. ఇప్పుడామెకు ఎనిమిదో కాన్పు. షెట్టిగారి ఇద్దరాడ పిల్లలకు పెళ్ళిళ్ళు అయి, చిన్నామె మొదటి కాన్పు పురుడుకు పుట్టింటికి వచ్చింది. బొంబాయిలో బార్, రెస్టారెంట్ నడుపుతున్న షెట్టిగారి ఏకైక కొడుకు ఊరికి తిరిగి వచ్చి, తాలూకు మొత్తం ఆబ్కారి కాంట్రాక్ట్‌ను

పొంది అన్ని ఊళ్ళలో సారాయి అంగడులను తెరిచినట్లే, సొంతూరైన కుంటూరులో కూడ కుప్పీగారి హోటల్ పక్కన సారాయి అంగడ్ని తెరిపించి దాని బాగోగులు చూడటానికి ఒక గుమస్తాను నియమించాడు. ఊర్లో పనిచేసుకొనే మగాళ్ళు, ఆడోళ్ళ డబ్బులు ఇప్పుడు అంగడి మార్గానికి దారి పట్టాయి. విఘ్నేశ శాస్త్రి పత్ని శైలు ఇద్దరు పిల్లల తల్లైంది. వెంకట రమణ శాస్త్రిగారి ఏకైక పుత్రుడు లాయర్ అయ్యి, ప్రాక్టీసుకోసం మంగళూరు చేరాడు. ఈడిగ అక్కుపూజార్తెమ్మ భర్త నోణు పూజారి తాగితాగి లివర్ చెడటం వలన చచ్చి స్వర్గాన్ని అధిరోహించాడు. అయితే బతికున్న అక్కు పుజార్తెమ్మ చిన్నకూతురి పంచెన చేరి పాసిపోయిన అన్నాన్ని తింటూ నరకం అనుభవించసాగింది. ఎరుకుల జాతోళ్ళు నేత్రావతి నది మధ్య భూమిలో పెరిగిన రెల్లుగడ్డిని తెచ్చి బుట్టలుగా, చాపలుగా చేసి ఊరిలో అమ్ముకోసాగారు. ఊరు అంచునే ఉండే నేత్రావతి అరణ్యం నాశనమవుటం చేత వానాకాలంలో రభసగా ప్రవహించేది. వేసవి కాలంలో క్షయరోగి లాగ తయారైయ్యేది. తన గర్భం నుంచి నూరారు లారీలకు ఇసుకనూ ఇస్తూ తాను ఇంకా లోతుకు దిగజారిపోయేది కల్యాణిలాగ!

వచ్చేవారమే మాఘపౌర్ణమి. చంద్ర వరుసకు సవతి తల్లి బిడ్డైన కల్యాణిని 'మూడిబిదిరె'కు తీసుకెళ్ళింది. పౌర్ణానికి దేవరగుట్టలో నడిచే జాత్రకు అక్క చంద్రతో హాజరైంది కల్యాణి. తలనిండా మల్లెలు, తెల్లటి చీర రవికె, రాత్రి అంతా లింగదర్శనం, అక్క చంద్రకూ అంతే దర్శన అనుభవం. రెండ్రోజుల లింగపూజ సిరిదర్శనం తరువాత కల్యాణి కుంటూరుకు వాపసైంది.

ఒక సాయంత్రం కల్యాణి బీడీల మీద అప్పును ఆద్రాంబ్యారి చేతి నుంచి అంగడిలోనే అడిగి పొందిన రాంఫ అటునుంచి అటే సారాయి అంగడికి వెళ్ళి పూటుగా తాగి ఇంటికొచ్చాడు. షెట్టిగారి పొలంకు ఎరువు మూటల్ని మోసి ఆయాసంతో ఇంటికొచ్చి స్నానం చేసి ఇక కూర్చోవాలి అని కల్యాణి అనుకోటం, విఘ్నేశ్ శాస్త్రి తోటలో గడ్డి మోసి మోసి నడుంను బెణక్కొట్టుకొని ఉన్న సీతు నీళ్ళ కాపడం పెట్టుకొందాము అని అనుకొనే లోపు, ఎప్పుడూ వంగి నడుస్తుండే రాంఫ నేరుగా, నిటారుగా నడచుకొని వస్తుండటం ఇద్దరి కళ్ళకూ (తల్లి-కూతురు) ఒకేసారి కనబడింది. ఇంట్లోకి వస్తూనే సీతు, కల్యాణి, ఆద్రాంబ్యారి, శాస్త్రి, షెట్టి అనేదే తేడా లేకుండా ఊర్లోని గణ్య, నగణ్య వ్యక్తుల అత్యంత రహస్యమైన విషయాల్ని బిగ్గరగా బహిరంగ పరచసాగాడు. "ముసలోడా... మంచిగా కూర్చోటానికి ఇవ్వాళేమైంది? తలచెడిందా?" అని కల్యాణి అడుగుతుంటే

రాంఫ తాగిన నిషాలో “నీ మిండెగాడు ఆఁద్రాంబ్యారి డబ్బిచ్చాడు” అని నిజం చెప్పాడు. “నీ దృష్టి నా పొదుపు డబ్బు మీద పడిందా” అని అరిచింది కల్యాణి. ఎప్పుడైనా సారాయిని ఇంటికి తెస్తే ముగ్గురూ చేరి తాగేవాళ్ళు. అయితే రాంఫ ఒక్కడే కంఠపూర్తితాగటం సీతుకు కోపం తెప్పిచ్చింది. “పని చేయటానికి సాధ్యంగాక పోయినా, తాగటానికి మాత్రం సిద్ధమే ముదనష్టపోడు? అప్పులు ఇచ్చే శనిగాళ్ళు ఊర్లో కావాల్సినంతమంది ఉన్నారు. తాగి చావనీయి దరిద్ర పోడ్ని” అసహనంతో అరిచింది సీతు. రాంఫ చేతిలో ఉన్న ఊతకఁర్ర పైకి లేవటం అంతలో వాళ్ళిద్దరి మధ్య ప్రవేశించిన కల్యాణి కాలిమడమ మీద బలంగా దెబ్బపడింది. అమ్మో, అయ్యో... అంటూ బాధతో విలవిల లాడింది కల్యాణి. “నువ్వు చస్తే నదిలో ఉదకాన్ని (నీళ్ళను) వదులతాము. మమ్మల్నేచంపుతున్నావు కదా ముసలి సచ్చినోడా” అంటూ సీతు తిట్ల దండకం విప్పింది.

రాత్రి అహిష్టంగానే తిని పడుకొని ఉంటే మధ్య రాత్రిలో మొత్తం కుంటూరు మౌనాన్ని చీల్చేంతగా హుంకారం వినబడసాగింది. తాగి ఒదుర్తున్న రాంఫ వెమ్మటే ఎగిరి పడ్డాడు. సీతుకు నిద్ర వదిలింది. బయట అరుగుమీద ఉన్న వీరిద్దరికి ఇంటిలో నడు మధ్య భాగంలో పడుకొని ఉన్న కల్యాణి నుంచే హుంకారాలు రావటం చూసి ఇద్దరూ ఒకరి ముఖాన్ని ఒకరు చూసుకొన్నారు. ఒక అరగంట హో... హూ... అనే ఘోషణలు, ఆ తర్వాత ఒకేసారి జోరుగా కాళ్ళు చేతుల సప్పుళ్ళు వినబడినవి. కూర్చొన్నచోటనే మగత నిద్రని వదిలి కూలపడ్డారు ఆ దంపతులు. పొద్దుపొడిచిన తర్వాత కల్యాణి ఎప్పటి లాగే ఉదయాన్నే లేచి స్నానం చేసి, తులసి చెట్టుకు నీరుపోసి, ప్రదక్షిణం చేసి, తల జుట్టు దువ్వుకొని బిగుతుగా ముడివేసుకొని పొయ్యిలో ఉన్న బూడిదను తొలగించింది.

రాత్రి నడించినదాన్ని అడిగేందుకు సీతుకు ధైర్యం చాల్లేదు. ఆరోజే ‘మూడిబిదిరె’కు పోయి సవతి కూతురైన చంద్రాన్ని తీసుకొచ్చింది. ఒక వారం తర్వాత మరొకసారి ఇట్లాగే అవ్వటం వలన ఇది లింగదర్శన ప్రభావం అన్నది ఆమె. కల్యాణికి దేముడి దర్శనం వంటి మీదకు రావటం మామూలైంది. ఇది సామాన్యంగా చీకటిపడిన తర్వాతే అవ్వటం చేత ఊర్లో ఎవరికి తొందరగా గుర్తు కాలేదు. ఊర్లో కల్యాణికి లింగదర్శనం (సిరిదర్శనం) వంటి మీదకు వస్తుంది అనే సుద్ధి ప్రసారం అయ్యేటప్పటికి ఆమె ముట్టు నిలిచి నాలుగు నెలలైంది.

ఇప్పుడు ఊరి జనానికి కల్యాణి గర్భవతి ఐతే పెద్దగా సుద్ధి అవలేదు. బదులుగా గర్భానికి కారణకర్తల్ని, ఆ పట్టీని పెంచే సమయమే వాళ్ళకు తెల్వటం లేదు.

పాతకాలంలోని పట్టీలో ఆ(ద్రాంబ్యారి ఒకడు. అతనిప్పుడు పెద్ద మంగళూరు పెంకుల కప్పు ఉన్న ఇంటి యజమాని. ఇంకొక సంశయ వ్యక్తి ఎవడంటే, అప్పుడప్పుడు భర్త మీద కోపించుకొని, పిల్లల్ని తోలుకొని పుట్టింటికి వెళ్తుండే శైలు భర్త విఘ్నేశ శాస్త్రి కూడా ఆ పట్టీలో కనిపించసాగాడు. పంచాయితిలో ప్రముఖుడైన బి.సి. జనాంగంకు నాయకుడైన కుక్క నాయ్క తక్షణం ఈ ఇద్దరి మీద పోలీస్ కంప్లైంట్ ఇచ్చాడు. పోలీసోళ్ళు ఇద్దర్ని పిలిచి గుట్టుగా విచారించి ఆద్రాంబ్యారిని అదేరాత్రి వదలటం, విఘ్నేశ్ శాస్త్రిని మరుదిన ఉదయాన వదిలిపెట్టారు. విఘ్నేశ్ శాస్త్రి వెమ్మటే పుటపర్తికి వెళ్ళి అక్కడ్నుంచే ఉత్తరం రాసి, తను అక్కడే రెండు నెలలు ఉండి, ఆధ్యాత్మిక సంపత్తుతో ఊరికి తిరిగి వచ్చే విషయం తెలియజేయటం వలన శైలజ పుట్టింట్లోనే వానాకాలంలో ఉపయోగించే అప్పడాలు, వడియాల్ని ఎండబెట్టసాగింది.

కుక్క నాయ్కనే స్వతః వచ్చి, కల్యాణి ఇంటి అరుగుమీద, కాలుమీద కాలు వేసుకొని ఠీవిగా కూర్చొని "ఎవడు వాడు..... చెప్పు..... టెంకాయ చిప్ప పగలుగొట్టినట్లు కొట్టిస్తా వాడ్ని" అని తన వర్చస్సును పెంచుకొనే ప్రయత్నం చేస్తే, కల్యాణి నోరు విప్పలేదు. ఇక సీతు–రాంఫ ఎట్లా నోరు విప్పుతారు? ఇదంతా అయి కల్యాణి నవ మాసాలు నింపుకొని ఎవరికీ తెల్వదన్నట్లుగానే ప్రసవించటం, పుట్టిన శిశువు ఏమైంది అని అడగటానికి ఎవరూ రాలేదు.

ఒక రోజున సాయంత్ర వేళలో విఘ్నేశ శాస్త్రి పిల్లలిద్దరూ దేముడి గదిలో కూర్చొని బొమ్మలాట ఆడుతుండగా, అన్న చెల్లెలి మీద వేళ్ళను ఉంచి "బొమ్మల దేవి నీ భర్త ఎక్కడికి పోయాడు? 'పట్టణానికి పోయాడు. ఏమి తెచ్చాడు?' చీరను తెచ్చాడు. ఎవరికి ఇచ్చాడు? కల్యాణికి ఇచ్చాడు. చంద్రకూ ఇచ్చేవాడే! అప్పుడే అటుగా వస్తూ ఉన్న శైలుకు తన పిల్లల మాటలు వినబడటం, తక్షణం మదిలో ఏదో మెరిసి వాళ్ళ వీపుల మీద గుద్ధి "మీకు ఎవరు ఈ మాటల్ని చెప్పారు" అని ప్రశ్నించింది. పిల్లోడు బెదుర్తు ఆద్రాంబ్యారి చిన్నకొడుకు షఫి, రాంఫన చెల్లెలు మిణ్ణుదేవి కొడుకైన 'పుళ్ళీఅప్పు'తో బడికి వెళ్తుంటే కలిసి చెప్పారు అన్నాడు వాడు. రాత్రి స్నానానికి స్నానాలగదిలోని పొయ్యికి కట్టెల్ని ఎగదోస్తున్న విఘ్నేశశాస్త్రికి ఎదురుగా భైరవకోన లోని కాళికాదేవి లాగ ఎదురు నిలిచింది శైలు. "కల్యాణికి చీర ఇచ్చారా" గట్టిగా అడిగింది. విఘ్నేశ సమాధానం చెప్పనేలేదు. అప్పట్నించి విఘ్నేశ శైలజతో ఏ విషయంలోనైనా ఎదురు జవాబు ఇచ్చేవాడు గాదు. వాదించేవాడు గాదు. ఐతే అప్పటిదాకా ఆద్రాంబ్యారి అంగడికి వెళ్తున్న పోకవక్కలు

ఈసారి మంగళూరు మార్కెట్‌కు వెళ్ళి, ఇప్పటిదాకా చేరకుండా ఉన్న నల్లపూసల గొలుసు, చెవులకు రత్నాల్ని పొదిగిన పోగులు, చేతులకు నాలుగు జతల బంగారు గాజులు శైలజ దగ్గరకు వచ్చినవి.

అప్పుడప్పుడు వచ్చే వంటి మీద పూనకం వలన ప్రతి సంవత్సరం కల్యాణి సిరిజాత్రకు వెళ్ళి వచ్చేది. లింగదర్శనం పలుమార్లు కలిగేది అక్కడే. పంచాయితి ఎన్నికలు ఐదు సంవత్సరాలు గడువు ముగియటం వలన మళ్ళీ వచ్చినవి. ఈసారి కూడా బి.సి.లకే రిసర్వు అయ్యింది కుంటూరు. ఇంకేంటి కుక్కనాయ్కే నిలబడతాడు అని అనుకొంటంటే బొంబాయిలో ఉండే జగ్గా వచ్చాడు. అయ్యను వెనక్కి నెట్టి, తనే నిలబడ్డాడు. ఎలక్షన్ రెండు మూడు దినాల ముందు, ఇంటి వెనకాలే ఉన్న చెఱువులో కుక్కనాయ్కని శవం తేలి చోముదేవి విధవరాలైంది. నిత్యం సాయంత్రం షెట్టిగారి సారాయి కొట్లో హాజరు వేయించుకొనే అభ్యాసం ఉన్న కుక్కనాయ్క పూటుగా తాగే చెఱువు నీట్లో పడొండచ్చు అని ఊరు తర్కించసాగింది. ఎలెక్షన్‌లో గెల్వటం, ఆ క్షణమే జగ్గనాయ్క బూడిదను ఇంట్లోంచి తీయించి నేత్రావతిలో నిమజ్జనం చేసాడు.

కుక్కనాయ్క కర్మ 11వ రోజున నేత్రావతిలో పిండం వేసి, నీటి స్నానాలు చేయాలి జగ్గ. ఐతే పంచాయత్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ వచనం అదే రోజు స్వీకరించాల్సి నందున మరుదినం దేవస్థాన సత్రంలో తమ వాళ్ళందరికి భోజనాలు పెట్టించాడు. కర్మకాండకు పక్ష ముఖండుల్ని, ఎమ్.ఎల్.ఎలను పిలవటం, బొంబాయి నుంచి తెచ్చిన డబ్బు కరిగిపోయింది జగ్గ నుంచి.

కొన్ని నెలలు గడిచేటప్పటికి, రాత్రికి రాత్రే ఆద్రాంబ్యారి అంగడికి అగ్నిస్పర్శ జరగటం వలన దుకాణం సర్వ నాశనమైంది. తన పిల్లల కడుపుల మీద తడిబట్టే గతి అయ్యింది కదా అని తలమీద బట్టేసుకొని ఏడ్వటం చేయసాగాడు బ్యారి. ఇదైన ఒక నెలకు సర్కారు నుంచి పంచాయత్ మూలకంగా నష్ట పరిహారం ఎక్కువగా దొరికి, ఆ నగదుతో మరొక కాంక్రీటు ఇల్లును కట్టి, అంగడ్ని మళ్ళీ తెరిచి, డబ్బు లెక్కించుకోటానికి, కూర్చోటానికి అందమైన బల్ల, కుర్చీ వేపించుకొన్నాడు.

తండ్రి తద్దినం ఒక సంవత్సరం గడవక ముందే, బాత్రూమ్, టాయిలెట్ గదుల్ని ఇంటిలో నిర్మించి, మామ కూతుర్ని మనువాడి, సంతానోత్పత్తికి ఆరాటపడ్డాడు జగ్గ. డబుల్‌బ్యాండ్ రేడియోను కొని, తనకు నచ్చిన గీత మాలికల్ని వినసాగాడు జగానాయ్క.

సీతుకు వయోభారం వలన శాస్త్రి, షెట్టిగారి ఇళ్ళకు పనికోసం పోలేకపోయింది. చూపు, వినికిడి శక్తిని కోల్పోయిన రాంఫ ఇంట్లో కొత్తగా చేరిన కుక్కపిల్లను ఒడిలో వేసుకొని అరుగుమీద ఒక మూలన హరిదాసుల కీర్తనలను పాడుకొంటూ వైకుంఠ ద్వార దర్శనానికి ఎదురుచూడసాగాడు. మాఘపౌర్ణమికి, సిరిజాత్రకు వెళ్ళి లింగ దర్శనం చేయటం తప్పితే మూడు కాలాలైన వేసవి, వాన, చలికాలం అనేవి తెలవకుండా (పురాణాలలో శ్రావణకుమారలాగ) కల్యాణి తల్లి-తండ్రుల జీవనం కోసం కూలిపనికి విరామం లేకుండా వెళ్ళేది. పనులు లేనప్పుడు బీడీలు చుట్టేది. వేరే వ్యవస్థ లేనందువలన చీకటి పడగానే చెంబట్టకు (చెంబులో నీరు నింపుకొని) బయలకు వెళ్ళి వచ్చేది. దేహ బాధను నివారించుకొనేది. ఎంతైనా ఆమె మహిళ కదా(మహా+ఇళ) భూదేవి లాంటిది. ఆమె నుంచి సేవల కోసం సమాజం నిరీక్షించేది. కాయకవే (పనే) కైలాసం అనే శరణ మూలతత్వానికి కల్యాణి దాసోహమైంది.

-: సమాప్తం :-

(మూలకథ నిర్మాణం చేసిన వారు

నాగవేణి మంచి.

బంట్వాళలోని కాలేజిలో కన్నడ భాష లెక్చరర్‌గా పనిచేస్తున్నారు

వయస్సు 38 సం॥రాలు

రాసిన కథలు : రెండే రెండు ఇప్పటి వరకు

ఎ) మా అమ్మ చచ్చిన కథ (నన్నమ్మ సత్తకథ)

బి) ఇప్పటి పాత (పాపం కల్యాణి)

మంగళూరు విశ్వ విద్యాలయంలో యక్షగాన మరియు మహిళ మీద రీసర్చ్ చేస్తున్నారట)

29-01-2006.

**శాఖమూరు రామగోపాల్**

# 'ప్రయత్నం'

## 1

బహిష్టై మూలన కూర్చున్న కూతురికి శుచి స్నానం చేయించటానికి గుండిగెలో నీరుపోసి, పొయ్యిమీద పెట్టి వేడి చేద్దామనుకొనే లోపే, ఆ గుండిగెలోని నీరు ఖాళి అవ్వటం చూచిన ఫాతిమాకు తలకు నిప్పు అంటుకొన్నట్లైంది. ఒంటిమీద దుప్పట్టా లేకుండానే బయటకి వచ్చి చూస్తే, ఇంటి ఎదురు ఖాళీ జాగాలో తన ముసలిగుర్రం మీద నీటిని వేగంగా చిమ్ముతూ, మర్ధనతో నిశ్చలంగా స్నానం చేపించుతున్న మరది ముత్తలీబను చూడంగానే హతాశురాలై ఏడుపుతో "మాదర్‌ఛోద్ నేను తోడుకొన్న నీటినుంచి నీ బులపాటం తీర్చుకొంటున్నావు గదా.... బహిష్టైన బిడ్డకు శుచి స్నానానికని తోడిన నీటిని పాడు గుర్రానికి స్నానం కోసం ఉపయోగిస్తున్నావు కదా... దరిద్రపోడా...శనిలాగ మా నసీబ్ మీద అంటుకొని ఉన్నావు?" అంటూ ఏడుస్తూ అతని మీద థూ అని ఉమ్మింది ఆమె.

ఈ రాద్ధాంతానికి చుట్టుప్రక్కల ఆడోళ్ళు జమ అయ్యారు. ముత్తలీబకు 'తనేదో తప్పుచేశాను... ఆడోళ్ళెదురు తన వ్యక్తిత్వం చిన్నబోయింది కదా...' అనేది తలలో మెదలటం ప్రారంభం అవ్వగానే తన గుర్రమైన బాద్షా కాళ్ళ దగ్గర తల వంచుకొని కూర్చున్నాడు.

సరిగ్గా అదే వేళలో ముత్తలీబకు అన్న అయిన సైయద్ సైకిల్ నుంచి ఇంటికి జేరుకోటం, తెచ్చిన చేపల సంచిని భార్య ఫాతిమాకు ఇవ్వటానికి చేతిని చాపుతూ ఏమిటే అందామని అనుకొనే లోపే ఆమె థూ అని ఉమ్మటం చూచి, ఎవర్నించి జరిగిన సన్నివేశం గురించి తెలవక బాద్షా కాళ్ళ దగ్గర కూర్చున్న ముత్తలీబను చూస్తూ, ఎంతగానో ఆవేశంతో కంపించసాగాడు. "ఏమైంది నీటిని నేను తోడి పెడతాను లే... చిన్నవాటికే తమాష చేయమాకు" అంటూ భార్యను ఇంట్లోకి నెట్టి, ప్రాంగణం లోని బావినుంచి నీటిని తోడసాగాడు.

గొంతులోంచి పెగలటానికి వచ్చే ఏమో మాటల్ని దిగమింగుకొనే ముత్తలీబ గుర్రానికి స్నానం చేయించడంను ఆపేసి బయట ఉన్న గూటానికి దాన్ని కట్టి లోనికి

వచ్చాడు. అన్న చేతిలోంచి కడవను తీసుకొని నీటిని చేదసాగాడు నిధానంగా. ముత్తలీబ చేదుతున్న నీటిని, లోన ఉన్న అండిగె, గంగాళం, గుండిగలకు నింపటానికి తమ్ముడైన అరీఫ్‌డి కొడుకైన తాహీర్ ఉత్సాహంతో పనిని అందుకొన్నాడు. వేగం, వేగంగా నీటిని తోడుతున్న ముత్తలీబతో తాహీర్ 'చిన్నగా, నిధానంగా తోడు పెద్దనాయనా' అనే కనుసైగల్ని చేస్తూ స్నేహభావంతో చిరునవ్వులను కురిపించటం, వాటిని చూసిన ముత్తలీబకు కళ్ళల్లో నీరు ఉబికి వచ్చింది. ఈ ఇంటి వారసులు తనను చూసుకొనే విధానంకు మనస్సు ఆర్ద్రమయ్యింది అతనిలో.

తాహీర్, ఇమ్రాన్, సమీరా, సైఫా... ముత్తలీబ కళ్ళముందే పుట్టి ఆటపాటలతో పెరిగి పెద్ద అయ్యారు. పిల్లలంతా ముత్తలీబ నిర్వికారాన్ని సహజం అన్నట్టుగానే స్వీకరించారు. ముత్తలీబనుంచి అతనికి భారమైన దాన్ని ఏమీ ఆశించేవారు కాదు. అప్పుడప్పుడు దూరానున్న 'కుందరిగి' పట్టణానికి బాడిగ దొరికితే , రాత్రి తిరిగి వచ్చేటప్పుడు తినుబండారాల పొట్లాలను పిల్లల చేతులలో పెట్టినప్పుడు, ఆపిల్లలలో కలిగే ఆనందాన్ని చూడకుండానే తన మానాన తనుండేవాడు. అన్నదమ్ముల పిల్లలు తమ రక్తానికే, పేగుబంధానికే పెనవేసుకొని, స్నేహ ప్రతిరూపమన్నట్లుగా కనబడేవాళ్ళు. పిల్లల నగువు, కేకలు, సంభాషణలు అగోచరంగా స్వాంతనం ఇస్తున్నవి అని అనుకొనేటప్పటికే, ముత్తలీబ తన దినచరి మూలంగా అలిసి, సొలిసి నిద్రకు జారిపోయేవాడు. చీకటిలో ప్రార్థన కోసమని చేతుల్ని పైకెత్తి, పిల్లల ముఖాల్ని గుర్తు చేసుకొంటూ పెదాలతో 'సలామత్, సలామత్' అని లోలోపలే అనుకొంటుండేవాడు.

నీటిని తోడిన తర్వాత, తన చేతికి వచ్చిన పళ్ళెంలో ముక్కలు లేని మాంసం పులుసు, మరియు అన్నాన్ని మింగి, ముత్తలీబ తన పళ్ళాన్ని కడుగుతుంటే, లోన్నుంచి మాంసం మూలిగలను కటాకటా కొరుకుతూ, భోజనాన్ని చేస్తున్న సహోదరుల మాటలు, నగువు, పెద్ద పింగాణి పళ్ళెంలో పాయసం లోటాల్ని పెట్టుకొని పిల్లల్ని పిలిచి ఇస్తున్న తమ్ముడి భార్య కాళ్ళ గజ్జెల సప్పుడు, అన్నీ ముత్తలీబ మెదడులో చేరిపోయి, ఆ వెనుకే జుట్టునుంచి జారుకోటం, ఒక్కతే చాప మీద కూర్చుని పాయసాన్ని తాగుతూ తన వేపు ప్రీతితో, నవ్వు ముఖంతో చూస్తున్న సమీరా ముద్దు చిత్రం అతని మెదడులో తక్షణమే చేరిపోయింది. చంద్రబింబం లాగ కనబడుతుంది సమీరా. ఏదో విషాదం గుండెలో నిండింది అతనికి. అరుగు అంచుకు చాపను పరచుకొంటున్న ముత్తలీబ చేతులకు సమీరా తన చిన్ని చేతులనుంచి పాయసం లోటాన్ని ఇచ్చింది. బయట బాద్షా నిద్రకు

జారకుండా మూలుగు పెట్టుతున్నాడు. కొంచం ముందే తనను తిట్టిన వదిన ఫాతిమా మీద కోపం అన్పించి పాయసం గొంతులోకి జారుతుంటే వేడిని కలుగజేసింది.

రాత్రి వేగంగా జారిపోతున్నా నిద్ర పట్టక బయటకి వచ్చి, పడుకొని ఉన్న బాద్షా (గుర్రం) ముది కాళ్ళను, వెన్నును నొక్కుతూ కూర్చున్నాడు. ఇటువంటి ఎన్నో రాత్రుల్ని ఇదే బయలులో బాద్షాతో గడిపాడు ముత్తలీబ. ఇంట్లోని ఆడోళ్ళిద్దరి నడుమ (తోడికోడళ్ళ) జగడం ఎక్కువైనప్పుడు, సంసార తాపత్రయాలు బహిరంగంగా రంప – రాద్ధాంతమైనప్పుడు, వీటన్నిటిని తన మానాన తనుండే నిర్వికార విధానం మిగిలిన వాళ్ళకు అవమానంగా అన్పించినప్పుడు తను బయటికే నడిచి వచ్చేది, గొడవలు సద్దుమణిగి రాత్రి ముగిసిపోయేంతవరకూ బాద్షా ముందే కలవరిస్తూ పడుకొనేది, ఎప్పుడో తెల్లారే జాములో లోనికి లేచి వచ్చేది అతనికి మామూలే అయ్యింది.

ఇప్పుడు పాతరోజుల్లాగ లేదు. పొద్దస్తమానం ఎదురుచూస్తూ నిలబడితే ఒకటో, రెండో గిరాకీలు దొరికేవి. అయితే ప్రాణం పోయేంత వరకూ ఈ జట్కా బండిని తోలే వృత్తిని వదులుకోకూడదు అని అనుకొనేవాడు. ఇది పొట్టను నింపటానికే కాదు తన పాటికి, బతుకుకి అగత్యమైన వృత్తే ఇది. దీనిని మధ్యలోనే ఆపేయకూడదు అని అనుకొనేవాడు.

ముత్తలీబ లాగానే కొంతమంది ఇంకా జట్కా బండినే నడుపుతూనే ఉన్నారు. కొత్తోళ్ళు ఈ వృత్తికి దిగే సూచనే లేదు. కొంతమంది పాతోళ్ళు చిన్నమొత్తాలకే గుర్రాల్ని అమ్మేసారు. ఇప్పుడు జట్కాబండి ప్రయాణం జనానికి అనివార్యంగా, తప్పనిసరైన ప్రయాణ సాధనం అని అన్పించడం లేదు. ఇప్పుడు కాలం వేగంతో ముందుకు దూసుకెళ్తుంది. అయినా పిల్లల మోజు, ఆశ్చర్య భావనలు, వృద్ధులు నిధానంగా పయనించటానికి ఇంకా జట్కాబండినే కోరుకోవటం చేత ఈ వృత్తిని ఈ కాస్తైనా నడిపిస్తుంది అని అనుకొనేవాడు ముతలీబ. ఇంకా చెప్పాలంటే ప్రేమికులు కూడా జట్కాబండినే నమ్ముతున్నారు. ఎవరైనా యువజంట గిరాకీగా దొరికితే ముత్తలీబ మరిచిపోకుండా బండికి రెండు వైపులా పరదాని వేసేవాడు. ప్రేమ జంటనుంచి గిరాకి దొరికితే, వారి ప్రయాణానికి ఇంతదే నిశ్చితమైన గమ్యం, గురి ఉండేవికావు. పొడవాటి దారిలో బాద్షాను నిధానంగా అదిలించేవాడు.

బండిలో పరదాల చాటులో గాజుల సప్పుడు. నవ్వులతో గుసగుసలు. వారి విరహం, వేడి నిట్టూర్పులు వద్దనుకొన్నా ముత్తలీబను తాకి విషాదంలోకి నెట్టేవి. అత్తరు పరిమళం

బండిలో వ్యాపించి, కొత్త ప్రపంచంలో మునిగిపోవాలి అని అనుకొనే తన గిరాకీదారుల్ని, తన బండి వారికి చేదోడు లాగ తయారైయ్యేది అనే ఉత్సాహం ఇతనిలో అమితంగా కలిగేది. ఆ జంటకు ఇంత ఇవ్వండి అని ముత్తలీబ అడిగేదే లేదు. ఇచ్చినంత పుచ్చుకొనేవాడు.

ముత్తలీబ ఇంటికి ఒక రోజున తిరిగి వచ్చేటప్పుడు చిన్నపాటి వాన మొదలైంది. ఫాతిమా తన మీద ఉమ్మేసింది అనేదాన్నే గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆకాశంలో బూడిద వర్ణంతో ఉన్న మబ్బులు కరిగే రమ్య దృశ్యాన్ని తదేక చిత్తంతో చూడసాగాడు. దారిప్రక్కన చెట్లమీద వాన చినుకులు పడుతున్న శబ్దాలు, మట్టివాసన వీటి నుంచి బాద్షా నడుస్తుంటే, దారి ప్రక్కన మయూరి ఒకటి తన రంగుల రెక్కల్ని పురివిప్పి నాట్యం చేస్తుంది. ఆ రెక్కల వర్ణాల్ని (రంగుల్ని) చూస్తూ, తన మదిలో దుష్టరూపమై నిలిచిపోయిన వదిన ఫాతిమా రూపం మాయమై, 'క్యాఖూబ్ ...' అంటూ సంతోషంతో అరిచాడు.

కలలలోకి జారాడు ముత్తలీబ. కలలో పైరుపచ్చని మైదానం ప్రత్యక్షమైంది, మైదానంలో వరసలలో కూర్చున్న పిల్లలతో 'ఏమి అసాధ్యం కాదు...' అంటూ పిల్లలకు భవిష్యత్ భద్రతను నింపుతున్నాడు గురువు. ప్రకృతి కన్నా మించిన గొప్ప సౌందర్యం లేనే లేదు అన్నాడు గురువు పిల్లలతో. పిల్లలు గురువు చెప్పినట్లే 'కోశిశ్' అనే ఒకటే నినాదంతో అరిచేటప్పుడు, వారికి ముందిన జీవనంలో అనేక మంచిదారులు కనబడసాగాయి. గురువు ఫకీరలాగ కనబడుతున్నాడు. ఫకీర చెప్పేదాన్ని, ఆ రోమాంచనాన్ని తను ఎప్పుడైనా మరచిపోగలడా?

నెమలి పరిగెత్తి అడవిలో మాయమైంది. బాద్షా ఒళ్ళును నిమిరుతూ ఇంకొన్ని రోజులే బాద్షా..... ఆ తర్వాత నీకు విశ్రాంతే అని అన్నాడు. ముత్తలీబ మాటలు, మౌనాల భాషను గ్రహించుకొనే బాద్షా సకలింపుతో ఖుషిగా బదులు చెప్పింది. సంవత్సరాల నుంచి ఇంటి ఖర్చుకని కొంత ఇవ్వటం, మిగిలినదాన్ని తనే భద్రంగా కొంచం వెనకేసుకొనేవాడు. బాద్షా ఇప్పుడు అలిసినోడు. గిరాకీలకు తగినట్లుగా పరిగెత్తటం అవ్వటం లేదు అతనికి. రాత్రంతా అలుపుతో మూలుగుతుంటాడు. (రొప్పుఎక్కువైంది) అతడ్ని ముమ్ముందు దండించకూడదు. కొత్త గుర్రాన్ని కొన్న తరువాత బాద్షాకు మంచిగా విశ్రాంతిని ఇవ్వాలి. బయట ఆరామంగా తిరగనీయాలి. బతికినంత కాలం అతడ్ని తను మంచిగా చూసుకోవాలి అని నిర్ణయించుకొన్నాడు. అయితే.... బాద్షా తోటి మొదలైన తన జీవనం అతను లేకుండా సాగగలదా అనే బాధ కలుగుతుంది, పుట్టుతుంది కదా.

వాన పెద్దదైంది. బాద్షా అడుగులు చురుకవ్వసాగాయి. అంగడి, వీధుల ప్రక్కన పుస్తకాల బ్యాగులను తల – ముఖాలకు అడ్డంగా పెట్టుకొని నిలబడిన పిల్లలు బాద్షా మెడలో వున్న గంట చప్పుడు దగ్గర పడుతుంటే గుసగుసలతో కదలికలను చేయసాగారు. ముత్తలీబ నుంచి తేలిక మొట్టికాయకు ఎదురుచూస్తున్న దానిలాగ బాద్షా నిలబడటం, పిల్లలు చెంగు చెంగునే బండిలో నిండిపోయారు. పిల్లలు కేకలతో జట్కాబండినుంచి దిగటం, తమతమ ఇళ్ళకు పరుగులు పెట్టడం, ఇవన్నీ తనకు సంబంధించినట్లుగా నిర్వికారంతో బాద్షాన మెడభారాన్ని తగ్గించుతున్న ముత్తలీబను చూచిన ఇంట్లోని వదిన –మరదలు 'నాటకాలోడు, ఊరి ఉపకారానికి సర్వాన్ని అర్పించుకొనేవాడు' అని వ్యంగ్యంగా మాట్లాడుతుంటే సహోదరులు లోలోపలే అసహానానికి గురైయ్యేవాళ్ళు.

గిరాకిదారుడ్ని దించి ముత్తలీబ మైదాన రస్తాలో వస్తుండగా అకస్మాత్తుగా సమీరను చూచాడు. నల్లటి లావుపాటి యువకుడితో ఒత్తుకొంటూ ఫుట్‌పాత్‌లో తల తగ్గించి నవ్వులతో నడుచుకొంటూ వెళ్తుంది. యువకుడ్ని ఎక్కడో చూచినట్లుంది.. అనే గందరగోళంతో ముత్తలీబ ఆలోచించసాగాడు. ఖచ్చితంగా ఇంకా నాలుగైదుసార్లు ఎక్కడెక్కడో మరుగు ప్రదేశాలలో ఇద్దర్ని చూచిన తర్వాత ముత్తలీబకు గుర్తైంది....తన జట్కాబండిలో ఇతను గిరాకీదారుడిగా వచ్చిన రెండు సందర్భాలలో వేరు వేరు యువతులతో వచ్చాడు. జట్కాలో ఎక్కిన మరుక్షణమే ముత్తలీబ కన్నా ముందే అతను బండి పరదాలను వేసేసుకొన్నాడు. ప్రయాణానికి మించిన రెండు రెట్ల మొత్తం నగదును పెద్దనోటుతో ఇచ్చి, చిల్లర తీసుకోకుండానే యువతితో వేగంగా వెళ్ళిపోవటం, రెండోసారి జతైన యువతి బిక్కుబిక్కుమంటూ తన బండిలో ప్రయాణించేటప్పుడు ఏడ్వటం ఇవన్నీ గుర్తుకు రాసాగాయి.

ఎందుకో ముత్తలీబకు ఈ ఘటనల తర్వాత ఊపిరి ఆగినంతగా సంధిగ్ధం కలగసాగింది. అయినా తమాయించుకొని నిర్వికారంగానే ఉన్నాడు. ఇంటిలో అప్పుడప్పుడు సమీరా ముఖం కనబడినప్పుడు అస్వస్థుడైయ్యేవాడు. కలలలో సమీరా అపరిచిత వ్యక్తుల నడుమ నాట్యం చేస్తూ ఏడుస్తున్నట్లుగా కలగన్నాడు. దానివలన భయపడేవాడు. ఉదయాన్నే జట్కాబండి తీసుకొని వెళ్ళేముందు, ఇంటిముందు తీగలకు ఉతికి ఆరేసిన రంగు రంగుల ఓణీలు గాలికి ఎగురుతుండటం చూచి ఒక విధమైన విభ్రాంతితో నిలబడిపోయేవాడు. తననుంచి పొంగి పొర్లిన దుఃఖాన్ని ఆపుకోలేక ఎవరూ లేనిదాన్ని ఖచితం చేసుకొని అయ్యో.... అయ్యో.... అని గొణుక్కునేవాడు.

తీగలమీద వేళ్ళాడే తన ఓణీల ముందు నిలబడి చిన్నాన్న పిచ్చోడిలాగ అయ్యో... అయ్యో.. అని అంటుంటే ఆ వేళలో సమీరా అతనికి ఎదురైంది. ఏమిటి? ఏమైంది చిన్నాన్నా అంటూ చిన్నగా అడిగింది సమీరా. ముత్తలీబ ధైర్యంతో గొంతు పెగల్చుకొని... “ఆ యువకుడు గలత్, ఛోకరా....నువ్వు అతడ్ని ఇప్పటికిప్పుడే మరిచిపో” అని అన్నాడు.

ముత్తలీబ కాకుండా వేరెవరైనా ఈ విషయాన్ని చెప్పితే నమ్మేది కాదేమో. నిధానంగా సమీరా చిన్నాన్న మాటలలోని అంతరార్థాన్ని గ్రహించుకొని లోనికి వెళ్ళింది. ముత్తలీబ బాద్షా కాళ్ళకు నూనెను రాయసాగాడు.

ముత్తలీబ మీద రోమాంచక కథలు ఉండేవి. అయితే ఎవరికీ అతను అటువంటి ఆసక్తికరమైన కథలకు మూలపురుషుడు అనే ఆధారాలు ఇప్పుడు ఎవరిదగ్గరా లేవు కదా! ఎవరైనా గత స్మృతులను అడిగితే ముత్తలీబ నుంచి జవాబే దొరికేది కాదు. అన్నదమ్ములైన సయ్యద్ మరియు అరీఫ్‌లకు ఈ కథలలో సత్యాంశాలు తెలుసు. అయితే కాలక్రమేణ ఈ సంగతులు నిజంగా జరిగినవే అని నమ్మటానికి వాళ్ళు సిద్ధంగాకపోవటం వలన మాసిపోయినవి ఆ కథలు. అవునే... అతనిది ఎంతో ఇష్క్ అంట. యువతేమో చంద్రబింబం లాంటిదట. ... ఆమెకేమయ్యిందో. అవునా... అవునా.. అంటూ ప్రశ్నెలను తమ భార్యలనుంచి విని మబ్బు పట్టినోళ్ళలాగ మౌనం దాల్చేవారు ముత్తలీబ సహోదరులు.

విధి ముత్తలీబకు అనుకూలించక ప్రేమించిన అమ్మాయికి వేరే యువకునితో పెళ్ళైపోయింది. ప్రేయసి నుంచి జరిగిన బాధను మరిచేలోపే ఎవరో కనబడి ఆ అమ్మాయి కొల్హాపురంలో మెహింది నాట్యానికి దిగిందని, తర్వాత వేశ్యావృత్తి లోకి జారిందని మేనత్త నసీమా బూబమ్మ ఏడుపుతో, బాధతో చిన్నాన్నతో చెప్పినదాన్ని సమీరా వినటం అయ్యింది. ఇప్పుడూ చిన్నాన్న ఆమెను మరచిపోలేదా? ఆమెకు జరిగిన విధిరాతకు ఇతను ఇప్పటికీ విలవిలాడుతున్నాడు కదా. అయితే ఎప్పుడూ నిర్వికారంతో ఉండే చిన్నాన్ననుంచి ఆమె విషయ ప్రస్తాపనం చేయటానికి (సమీరాకు) ధైర్యమే రాలేదు.

సెలవుల్లో ఎవరెవరో ఇళ్ళకు పంప్‌ల రిపేరు, మోటారు రిపేర్లకు వెళ్ళి వస్తుండే కొడుకు ఇమ్రాన్‌తో ‘నువ్వు ఇకనుంచి ఖాయంగా పనివెతుక్కో. ఇంకా చదువుకొని చేసేదేముంది’ అని సైయ్యద్ చెప్పినదాన్ని విన్న ఇమ్రాన్ చల్లబడి పోయాడు. ఇంటిలో రోజూ గొడవలు మొదలైనవి. ఒకరోజు ముత్తలీబతో ఎదురుగా భోజనానికి కూర్చున్న సైయ్యద్ ‘హడబి ముండాకొడకా... నీ ఫీసుకు ఎక్కడినుంచి డబ్బు తెచ్చేది’ అంటూ

ఎంగిలిచేతితోనే ఇమ్రాన్‌ను కొట్టాడు. ఫాతిమా లబోదిబోమని మొగుడిమీద తిట్ల వర్షం కురిపించింది. ముత్తలీబ మరుసటిరోజు, "కొత్త గుర్రాన్ని ఖరీదించాలి అని దాచిన డబ్బు ఇది. నువ్వు ఫీసు కట్టు. బాగా చదువుకో' అని భరోసాతో డబ్బుల్ని ఇచ్చాడు. ఖుషీతో ఇమ్రాన్ ఆ డబ్బుల్ని తీసుకొని చిన్నాన్న రెండు చేతుల్ని తన తలమీద పెట్టుకొని 'ఆశీర్వదించు, ఆశీర్వదించు' అని ప్రార్థనతో అంటుంటే ముత్తలీబ క్షణం మాత్రం విచలితమై, ఎంతో అనుకంపంతో కోశిశ్ అని పలికాడు. ఇమ్రాన్ ఆ మాటల్నే ఆశీర్వాదాలు అని అనుకొని చిన్నాన్న చేతుల్ని పెదాలకు తాపించుకొని కాలేజికి వెళ్ళాడు. ఇదంతా చూస్తూ నిలబడ్డ ఫాతిమాకు ఏమి అర్థంగాక ఇమ్రాన్ నుంచి వివరాల్ని రాబట్టాలి అని అనుకొంటే,. కొడుకు నుంచి ఏమి బదులురాక 'పాడైపోండి... అందరూ మతి పోగొట్టుకున్న వాళ్ళే' అంటూ తిట్ల పురాణాన్ని విప్పింది.

సమాజ ఉద్ధారక సంఘం వాళ్ళు ప్రతి సంవత్సరం జరుపుకొనే రక్తదాన శిబిరానికని ప్రచార బ్యానర్లు, పోస్టర్లను వెనుకటి లాగానే రాత్రంతా పట్టణంలో అక్కడక్కడ కట్టి అంటించి ముత్తలీబ వస్తుంటే పోకిరి కుర్రోళ్ళు 'ఎట్లా ఉంది నీ ప్రేయసి? ఆమె మీద ఇంకా ప్రేమే ఉందా నీకు' అంటూ హాస్యం పట్టించేవారు. ముత్తలీబ వాటినేమీ పట్టించుకోకుండానే 'తనపాటికి తాను' అనే విధంగా తనకి అప్పగించిన పనిని శ్రద్ధతో చేసేవాడు. పెద్దోళ్ళు 'వదలండి అతడ్ని. ఎందుకలా బాధిస్తారు" అని గదరించేవాళ్ళు పోకిరీలను. ప్రతి సంవత్సరం రక్తాన్ని ఆ శిబిరంలో దానం చేసి వచ్చేవాడు. సైయ్యద్, అరీఫ్‌లు రక్తదానానికి వ్యతిరేకంగా ముత్తలీబను ఆపాలని ప్రయత్నించేవాళ్ళు. "రక్తాన్ని దానంగా ఇస్తే ఏమి కాదులే. ఐచ్ఛికంగా నేను ఇస్తుంటే దాన్ని మీరు ఆపాలని ప్రయత్నం చేస్తే నేను ఊరుకొనేది లేదు ఖబడ్దార్" అని అరిచేవాడు.

రక్తాన్ని దానం చేసి ఇంటికి తిరిగొచ్చి బాద్షాను బయటన ఉన్న గూటానికి కట్టి బండిని శుభ్రం చేయసాగాడు. పాత పరదాలను తీసేసి, గజ్జెలు కట్టిన పారదర్శకమైన పరదాలను తొడిగాడు. బండికి రంగులు వేసాడు. రంగులు ఆరిన తర్వాత చెక్కలమీద కొత్త బూరగదూది పరుపు , దానిమీద సంతలో కొన్న జంపఖానను పరుస్తుంటే, అన్న సైయ్యద్ అతని దగ్గరకు వచ్చి చూడసాగాడు.

బాద్షా మెడను నిమిరుతూ 'రేపొక్కదినమే, ఆ తర్వాత నీకు విశ్రాంతి. గుల్బర్గ నుంచి కొత్త గుర్రం వస్తుదిలే. నువ్వు అలిసిపోయావు కదా. అందుకే నీకు విశ్రాంతిని ఇచ్చేది' అని చిన్నగా చెప్పాడు బాద్షాతో.

కేశవాపురంకు అని ఎక్కిన యువతి 'చిన్నగా తోలు నాయనా.. బిడ్డ ఉంది' అనే ఎచ్చరికను చెప్పింది. బాద్షా వెన్నును తట్టి చక్కగా నడువు అన్నాడు. రేపే గుర్రాన్ని కొనటానికి గుల్బర్గాకు పోవాలి అనే యోచనలో మునిగాడు. బండిలో యువతి బిడ్డను ఒత్తుకొని విచిత్రంగా ముద్దుల్ని పెడుతున్న శబ్దాలు వస్తున్నవి. అప్పుడప్పుడు చిన్నగా ఏడుస్తున్నట్లు శబ్దాలు ఆమెనుంచి వస్తున్నవి. వెనుదిరిగి చూచాడు. పారదర్శకమైన (ట్రాన్స్‌ఫరెంట్) పరదాల వెనుక కళ్ళు.. ముక్కు తుడుచుకొంటున్న ఆ యువతి మళ్ళా మళ్ళా తన తొడలమీద ఉన్న శిశువు నుదుటికి పెదాలు అనించి, 'మాఫి బచ్చా.. మాఫి.. (క్షమించు బిడ్డా... క్షమించు)' అంటుంది.

ఆమెనుంచి వస్తున్న అత్తరు పరిమళం ముత్తలీబ పుక్కుపుటాలకు చేరసాగింది. బండి కొంచం అటుగా, ఇటుగా ఊగినా ఆమె పరదాను నెట్టి 'నిధానంగా తోలు నాయనా' అని కంపించే స్వరంతో దీనంగా అడిగింది. గతంలోకి జారాడు ముత్తలీబ. తన ప్రేయసి.... ఆమె నుంచి వచ్చిన గుసగుసలు; వసంత ఋతువులోని సూర్యుడి ప్రతాపం. గంధ లేపనంతో ప్రేయసి నుంచి వస్తున్న మదాన్ని పుట్టించే పరిమళం, మత్తు పుట్టించే చెమట, యౌవ్వనం ఇవన్నీ ఆమెనుంచి రతికేళికి తెరుచుకొన్న ఆహ్వానం. రూపంలో చంద్రబింబం. పట్టుదారాలతో నేసిన ఆమె ధరించిన లంగా, ఓణి పౌర్ణమికి ప్రతిరూపమే. అన్నిటికి తోడు రుజువుగా నిలిచిన బాద్షా పాత స్మృతులు అలలు, అలలుగా రాసాగాయి ముత్తలీబకు.

తన బండిలోని పరదాల వెనుక ఉన్న ఆమె అసమాన్య రూపం బండి అద్దాల నుంచి కనబడింది ముత్తలీబకు. మనోహరమైన ఆమె రూపానికి ఆశ్చర్యం చెందాడు.

"చాంద్ ఆయా ఆజ్ మేరే సవారి

దేఖ్ అసమా ఖాలి ఖాలి" ముత్తలీబ నుంచి శాయిరి తనంతట తానే పెదాల్నించి బయటకు వచ్చింది. తలెత్తి పైనున్న చంద్రుడ్ని చూసాడు. ఇక్కడ తన బండిలో కూడా చంద్రబింబమే ఉంది కదా!

ఊరుకో... బచ్చా మాఫిదే.. మాఫి... ఆర్తనాదంతో కంఠంలోనే ఉండి బయటకి రాని ఏడుపు. బండిలోని చంద్రబింబం ఏడుస్తుంది కదా!

కేశావాపురంలోని ఒక గల్లీలో బండిని ఆపించిన ఆమె ముత్తలీబను ఏమీ అడగకుండానే చేతిలో డబ్బుల్ని పెట్టి జింకలా పరిగెత్తి మాయమైంది. తన ప్రేయసి, ఆ

కాలంలోని తన ప్రణయాల దొంతరలలో ఉన్న ముత్తలీబ నోట్లకట్టల్ని బెదురుతో చూసి తన పెట్టెలో వేసుకొన్నాడు. ఏదో ఆందోళన. ఆమె విడిచి పెట్టిన  తన బండిలో ఇంకా పరిమళం గుభాళిస్తుంది.

'దేఖ్ అసమా ఖాలి ఖాలి' ముత్తలీబ నుంచి గొంతు పెగల్చుకొని వచ్చిన చీత్కారానికి బాద్షా అర క్షణం  ఆగి మళ్ళీ నడవసాగాడు. చీకటిని చేధించినోడిలాగ చల్లగా  కూర్చున్న ముత్తలీబ డబ్బుల్ని ఉంచే పెట్టెను తెరిచాడు. కట్టల కట్టల నోట్లు కళ్ళకు కనబడినవి. జంపఖానా  సందులలో పట్టు శాలువాను అట్లాగే వదిలేసి పోయింది ఆమె.  పాలవెన్నెల లాంటి ఆ పట్టు శాలువాను గుండెకు హత్తుకున్నాడు. దానికి అంటిన అత్తరును ఒక్కసారిగా గట్టిగా పీల్చాడు. దఢాల్నే ఎచ్చరికను పొందినోడిలాగ బాద్షాను నిలిపి కిందకు దూకాడు. పరదాను నెట్టి, వెనుక ఉన్న తలుపు చెక్కను పక్కకు జరిపి పిచ్చోడిలాగ వెతకసాగాడు. కొత్త జంపఖాన ఎడం ప్రక్కన పూల గుత్తిలాగ పడుకొని నిద్రపోతున్న శిశువును చూచి ఆశ్చర్యంతో శిలలాగ అయ్యాడు. పరదాల చాటున దుఃఖించిన ఆ చంద్రబింబం అరణ్యంలోని హరిణి (జింక) లాగ నవజాత శిశువును  తనబండిలో వదిలేసి వెళ్ళిపోయింది కదా!

పట్టు శాలువాలో పూలను ముడిచినట్లుగా శిశువును చుట్టి గుండెకు అదుముకున్నాడు. "బాద్షా నువ్వు విశ్రాంతిని తీసుకొనేదాన్ని వదిలేయాలి సుమా.. చూడు.. కర్ణుడు వచ్చాడు. దొరికాడు. కోశిశ్...." అంటూ ముత్తలీబ తేలిక స్వరంతో పలుకుతుంటే, ఆకాశంలో మబ్బుల చాటున కనుమరుగైన చంద్రుడు ధడాల్నే కన్పించసాగాడు.

❀ ❀ ❀

(మూలకథను రచించినవారు  అనుజయా ఎస్.కమటాకర్. కథపేరు  "కోశిశ్" గా మూలంలో చెప్పబడింది.)

26-03-06.

**శాఖమూరు రామగోపాల్**

# కాగోడుకు బస్సు వచ్చింది

కాగోడు గ్రామంలోని కిట్టప్ప హోటల్‌లో వేడి చాయ్‌ను ఆర్చుకొంటూ తాగుతున్న హొంకేరి తిమప్ప హోటల్ ముందుకొచ్చి నిలిచాడు. గజానన సర్వీస్ బస్సు పొగల్ని వదుల్తూ హుంకరించి పోయిందాన్ని చూసి నవ్వాడు.

తన పాటికి తను చాయ్‌ను త్రాగుతున్న కాగోడు ఈరభద్ర, తిమ్మప్ప తాతనుంచి పెద్దగా వచ్చిన నవ్వును చూసి 'అంత నవ్వుకు కారణం ఏమిటి?' అని అడిగాడు.

"పాత కత జ్ఞాపకంకు వచ్చిందిలే..... మాకిదంతా ఇంతేలే.... పాతదాన్ని నెమరేసుకోటం... నవ్వేది లేకపోతే రోదించేదే కదా...." అంటూ మళ్ళీనవ్వాడు తిమ్మప్ప.

"సంతోషాన్ని పంచుకోవాల్సిందే... అదేమి సంతోషమో చెప్పు.. వింటానులే" అని ఉబ్బించాడు ఈరభద్ర.

"ఇప్పుడు కాగోడుకు ఎన్నో సర్వీసు బస్సులు వస్తున్నవి కదా... (గజానన, లక్ష్మి, మంజునాథ, దుర్గాంబ మొదలైనవి). ఇప్పటికి ఏభై సంవత్సరాల క్రితం ఈ ఊరికి ఒక బస్సు వచ్చేది కాదులే" తిమ్మప్ప సుర్‌మంటూ చాయ్‌ను త్రాగుతూ తన మాటల్ని ముందుకే నడిపించసాగాడు.

'మొదటి దఫా బస్సొచ్చింది జ్ఞాపకానికి వచ్చి నవ్వానులే' అన్నాడు తిమ్మప్ప తాత మరలా.

"మొదటిదఫా బస్సొచ్చింది అనే దానికన్నా, ఫస్ట్‌టైమ్ బస్సు వచ్చింది అనే అనాలి" అంటూ తిమ్మప్ప తాత మదిలో హుషారును ప్రేరేపించాడు ఈరభద్ర.

"సరేలే.... మొదటిదఫాను ఫస్ట్‌టమ్ అని అంటానులే" అంటూ తిమ్మప్ప మళ్ళీ కిసుక్కునే నవ్వాడు.

"కాగోడికి బస్సొచ్చింది... నేను దెబ్బల్ని తిన్నది ఒకేసారి జరిగిందిలే" అంటూ ముసలోడు ఎప్పుడో జరిగినదాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

"నిజంగానే నువ్వు దెబ్బల్ని తిన్నావా" ఆశ్చర్యంతో అడిగాడు ఈరభద్ర.

ఖాళీ అయిన చాయ్ లోటాను పక్కనబెట్టి ముసలోడు (తిమ్మప్ప) జ్ఞాపకాల దొంతరలో చేతుల్ని తడుముకోసాగాడు.

మొదట సాగరంకు బస్సొచ్చి కొన్ని సంవత్సరాలు అయ్యిందట. కట్టె బొగ్గుతో నడిచే బస్సు అదట. బస్సు వెనకాల పెద్దదైన పీపాయి ఒకటి ఉండేదట. దానిక్రింద ఒక పొయ్యి. కణకణలాడే నిప్పుకణాలు. అప్పుడప్పుడు కండక్టరు గాలితిత్తిని ఊదేవాడు. దానికని ఒక తోలుతిత్తి. వెనుక సీట్లలో కూర్చొన్నోళ్ళ వెన్నుకు వేడి తగిలేదట.

బస్సు రావటమే ఒక అద్భుతం. ఎద్దులు లేవు, దున్నలు లేవు. గుర్రాల్లేవు. రబ్బరున్న నాలుగు చక్రాల మీద పరిగెత్తే గొప్ప యంత్రం అది. ముందుకు చొచ్చుకొచ్చిన పెద్దమూతి. పొం... పొం అంటూ దారిలో ఉన్నోళ్ళను అటు ఇటూ బెదురుతో నెట్టేసే హారన్. మూడు మైళ్ళ వరకూ వినిపించే డబడబ శబ్దాలు.

ముందు చక్రాన్ని పట్టుకొని కూర్చుండేటోడు ఒకడు. ఇతనే కృష్ణపరమాత్ముడు. ఇతని కాలిక్రింద, చేతిక్రింద మరేంటో పెట్టుకొనే సాధనాలు. చక్రాన్ని తిప్పుతూనే వాటి జతకు వీటిని ఎత్తి, నొక్కి, గుంజడం, మెలిపెట్టటం... ఏంటేంటో చేస్తుంటే బస్సు శివమెత్తిన నందిలాగ పరిగెడ్తుండేదట. దారి మీదున్న మన్నంతా ఆకాశానికి లేచేది.

బస్సు లేస్తూ, పడ్తూ, లోనుండోళ్ళను ఎత్తి, కుదేసి, కుక్కుతూ నవరస నాట్యాల్ని చేపిస్తూ, కాళ్ళూ చేతుల కీళ్ళను తేలికజేస్తుండేదట. వెనకాల కండక్టర్. అతను రైట్.... రైట్ అంటేనే బస్సు పరిగెత్తేది. హోల్డాన్ అంటే నిలిచేది. బస్‌కున్న పీపాలో నీటిని నింపటం, పొయ్యిని ఆరకుండా చూడటం, టాపులో సామానును వేయడం, దించటం ఈ కండక్టరు కార్యక్రమంలో భాగమై ఉండేది.

డ్రైవర్ ప్రక్కన ఒక సీటు. అది ప్రభుత్వ అధికారులకు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు, పెద్ద ఖామందుకు, కరణానికి. ఎక్కినోళ్ళంతా అక్కడ ఆ సీటులో కూర్చునేది లేదులే.

దీనివెనకాల ఒక బారు సీటు. అది మహిళలకు. మూడో వరస విద్యావంతులకు,. ఉత్తములకు, మర్యాదస్తులకు.

వెనకాల ఒక తొట్టి. అక్కడ రైతులు, కూలిజనం, గొర్రెలకు, కోళ్ళకు, మేతగడ్డికి, మరిక దేనికైనా అక్కడ ప్రవేశం ఉండేది.

బస్సులోని వెనకాల తొట్టి అని అంటే భూకామందు ఇంటిదారిలో సైడ్ కాలువ లాగ అనుకోవాలి. కామందు పశువులు, కుక్కలు, కౌలుదార్లు, జీతగాళ్ళు... వాళ్ళ పరివారం

ఇత్యాది.... ఇత్యాది అనే అంతటికీ ఆ వెనక సీట్లో ప్రవేశం ఉండోది. అక్కడే వాళ్ళ మర్యాదకు తగిన జాగ అది.

ఇట్లా ఉండేది ఆకాలంలోని బస్సు.

చుట్టూ ఇనప చువ్వలు. చువ్వల్ని పట్టుకొనే కూర్చోవాలి. గాలి, ఎండ, వర్షంనీరు నేరుగా బస్సులోకి వచ్చేవి. వానాకాలంలో బస్సు లోని జనంను కాపాడుకొనేందుకు టార్పాలిన్ పరదాలు. ఇవి బస్సు పరుగెడ్తుంటే ఆ రభసానికి తటపట కొట్టుకొంటూ పరిగెత్తుకొని వస్తున్న అడవి మదపటేనుగును గుర్తుకు తెస్తుండేటట్లుగా ఆ బస్సు చలనం మూలకంగా కలిగేది ఈ అభిప్రాయం.

ఇటువంటి బస్సులు సాగరం నుంచి శివమొగ్గ, శిరసి, హొసనగరంకు తిరిగేందుకు ప్రారంభమైనప్పుడు జనం వీటిలో ప్రయాణం చేసేది ఒక ప్రతిష్ఠకు, మోజుకు, సంతోషానికి, సుఖానికి, శ్రీమంతతనానికి సంకేతంగా భావించుకోసాగారు. పేదోళ్ళలో ఎక్కువమంది కాలినడకనుంచో, ఎద్దులబళ్ళ నుంచో ఆలంబనం చేసుకొని ప్రయాణించేవారు. కొంతమంది పేదోళ్ళు బస్సు సమీపంకు పోనేలేదు. కొంతమందికి ఎప్పటి మాదిరిగా పాతకాలం నాటి ప్రయాణమే శ్రేష్ఠం అనే భావన ఉండేదిలే.

అయినా బస్సులు జనప్రియం కాసాగినవి. వాటి ఉపయోగం, అనుకూలం నిధానంగా జనం మెదళ్ళలో చొచ్చుకుపోసాగింది.

ఒకరోజు కాగోడు దొర సాగరంలోని ఒక బస్సు సర్వీసు కంపెని ఆఫీసుకు వెళ్ళాడు. ఈ కంపెని పూర్వం సాగర నుంచి శివమొగ్గకు శివమొగ్గనుంచి సాగరంకు వారానికొకసారి తపాలుగాడిని తిప్పుతుండేది. ఎద్దుల బండి, దానిలో తపాలామూటలు (పోస్ట్) జతగా నలుగురైదుగురు ప్రయాణించేవారు. అది కూడా ముందే నమోదు చేయించుకొని ప్రయాణించాలి. రెండు రోజుల ప్రయాణం. ఈ ఎద్దులబండి కంపెనివాళ్ళు బస్సులు భారతదేశంకు దిగుమతి అయినప్పుడు మొదటిగా చేసిన పనేంటంటే ఒక బస్సును తెచ్చుకొన్నారు. కొన్ని నెలలు గడిచేటప్పటికి ఒకటి రెండై, మూడై బస్సుల సంఖ్య పెరగసాగింది.

సాగరం అభివృద్ధికి ఈ కంపెని కారణమైంది. ఊరిలోని శ్రీమంతులు తమకొక వాహన సౌలభ్యం దొరికిందని సంతోషపడ్డారు. శరావతి, భట్కళ, శిరసి, హొసనగర, జోగ మొదలైన ప్రాంతాలకు బస్సులు పోయిరావడం చేయసాగాయి.

కాగోడు జమీందారు దర్పంతోనే కంపెని ఆఫీసులోకి కాలిట్టారు. కంపెని మేనేజర్ లేచి నిలబడి... "రండి.. రండి" అంటూ స్వాగతించాడు.

దొర ఆ ప్రాంతంలోని అందరికీ పరిచితుడే.

దొర తూకంకు కూర్చున్న కుర్చీ కిర్ మంటుంది.

"నేనొక పనికోసం వచ్చా" అన్నారు దొర.

"ఏమి పనో చెప్పండి స్వామి..."

"మీరిప్పుడు సొరబ, శిరాళకొప్ప, అనవట్టి మొదలైన ఊళ్ళకు బస్సుల్ని వేశారు కదా! కాగోడికి ఎందుకు బస్సును తిప్పరాదు?" దొర నేరుగా ఈ మాటల్ని మేనేజర్ ముందుంచాడు.

"సొరబ, శిరాళకొప్ప, అనవట్టి మంచి ఊళ్ళే. వెనుకటి కాలంలో వాహన సౌకర్యం లేనందుచేత జనం ఎక్కువగా తిరిగేటోళ్ళు కాదు. ఇప్పుడు బస్సుంది అనే కారణంతో ప్రయాణించేది ఎక్కువైంది. అనవట్టికి పోయే బస్సును కాగోడు మార్గం మూలకంగా తిప్పాలి అని భావించుకొంటే ఆ రస్తా బాగుగా లేదు. మార్గంలోని చివర్నున్న ఈ ఊరినుంచి నిత్యం ఎంతమంది సాగరంకు వస్తారు? బస్సుకయ్యే మైంటెనెన్స్ ఖర్చు గిట్టాలి కదా!" అని కంపెని మేనేజర్ ఆలోచనలలో మునిగినా, నోరు విప్పి దొరతో ఏమీ అనలేదు.

అయితే కుశాగ్రమతి అయిన దొర మేనేజర్ మనస్సులో ఏముందో అని గ్రహించుకొన్నాడు.

"ప్రయాణికులు అంతగా లేరు అని అనకండి... బస్సు వచ్చిందంటే జనం వచ్చేది ఖాయం.... గుర్రంను చూస్తే స్వారి చేయాలి అనే సామెత ఉందికదా! నేనంటూ ప్రతిదినం ప్రయాణిస్తాను.. మా వారసులు.. కోడళ్ళు... కరణపోడు.... పటేల్ జనం.... ఇంకా మధ్యలో పది పల్లెలు ఉన్నవి కదా! అక్కడి జనం ఆస్పత్రికని వచ్చేటోళ్ళు.. కోర్టుకు హాజరైయ్యేటోళ్ళు.. పోలీస్ స్టేషన్‌కు తిరిగేటోళ్ళు.... జనం వస్తారయ్యా... ఉదయం వేళ ఒకసారి, సాయంకాలం ఒకసారి బస్సును తిప్పండి. మీరు బస్సును త్రిప్పి చూడండి. ఒకవేళ నష్టం వస్తే, ఆ తర్వాత పునఃసమీక్షను చేసుకోవచ్చు. ... " అంతటిని ఉగ్గబట్టి చెప్పి ముగించారు దొర.

"చూద్దాం... దొరగారు" అన్నాడు మ్యానేజర్.

"పర్మిషన్‌కు అర్జీని పెట్టాలి. దారి ఎట్లా ఉందో చూడాలి. కొత్త మార్గం అంటే కొత్త బస్సునే నడిపించాలి... వేరే సర్వీసోళ్ళు ముమ్మందు పై పోటీకి వస్తారు. ట్రై చేద్దాం"

"చూద్దాం... చేద్దాం... అనొద్దు. మనసు పడి – కావాలంటే సర్కారుకు నేనూ చెపుతానులే..." అన్నారు దొర.

మేనేజర్ ఆఫీసు ద్వారం వరకూ వచ్చి దొరకు వీడ్కోలు చెప్పాడు.

దొరకు దానిని ఆపాటికే వదిలేందుకు మనసొప్పలేదు.

సాగరంకు వచ్చిన ఆయన వకీలైన జోయిసగార్ని, హోటల్ కిట్టప్పను, బెల్లం అంగడి శేషప్పను, బట్టల అంగడి దుర్గోజిని, రైస్‌మిల్ గోవిందప్పను కలిసి ఈ విషయం మీద చర్చించసాగాడు. అందరికీ తగిన సూచనలను ఇచ్చి దారిని బాగు చేయించేదానికని గ్రామ పంచాయితీకి మార్గ సూచనల్ని ఇవ్వసాగారు.

'మీరు ముందు బస్సును వేయండి' అని చెప్పిరావడం చేయసాగారు దొర.

బస్సంటే దాని అనుకూలతలు ఎన్ని విధాలుగా లాభమో ఆయనకు బాగా తెలుసు. కోడళ్ళు తాలూకా కేంద్రం నుంచి ఈ ఇంటికి రావటం జరిగింది. వాళ్ళకు అప్పుడప్పుడు పేటకు వెళ్ళి వచ్చేది సర్వ సామాన్యమే. సర్కారి ఆసుపత్రికి వైద్యానికని వెళ్ళేది, మనమ సంతానం చదువులకని పట్టణానికని పోయే జరూరత్ ఉందిలే. తనకూ తాలూకాఫీసు, కోర్టు, వకీలుతో పనులు చాలా ఉంటవిలే. అందుకని బస్సు సౌలభ్యం ఉంటే బాగుంటది అనేది ఆయనగారి ఆలోచన.

ఈ వయస్సులో ఎద్దులబండి ప్రయాణం ఇప్పుడు నప్పేది లేదు. వళ్ళంతా నెప్పులు, దఢేల్ దడేల్ అనే సద్దులతో చక్రాల ఘోష,. ఎత్తు పల్లాలలో ప్రయాణిస్తుంటే ఒళ్ళంతా నుజ్జు, గుజ్జై ఒకరోజు ప్రయాణం చేస్తే మూడురోజులు అలుపుతో విశ్రాంతికి కారణమైయ్యేది.

ఒక బస్సు వస్తే అరగంటో లేక గంటో అట్లా వెళ్ళి ఇట్లారావచ్చు. సుఖమే కదా మరి.

దొర ప్రయత్నం ఫలించింది.

ఒకరోజు దొర కంపెనీకి వెళ్ళినప్పుడు "దొరగారు... వచ్చే సోమవారం కాగోడుకు బస్సును నడుపుతాము" అన్నాడు మేనేజర్.

"ఓ.... ! నాకంటూ సంతోషం భలే అవుతుందిలే" అంటూ దొర మళ్ళా అడిగాడు.

"వచ్చే సోమవారమే కదా"

"అవునండి.. రేపు కొత్త బస్సు వస్తుంది మా సర్వీసుకు. సోమవారం మీ ఊరికి...మీరు అక్కడ చుట్టుపక్కల ఉండే పల్లెలకు విషయాన్ని తెలపండి" అన్నాడు మ్యానేజర్.

"బస్సు మా ఊరికి వచ్చేది మొదటిసారికదా.. దానికి భారీగా స్వాగతం దొరుకుతది మా ఊరిలో.. నేనే మొదటిరోజు దానిలో కూర్చుని కాగోడుకు వెళ్తాను.... " అంటూ సంబరపడ్తూ దొర బయల్దేరారు.

కాగోడుకు బస్సు వస్తదనే సమాచారం కల్‌మనె, గిళిగారు, ఈచలకొప్ప, సణ్ణమనె, మలకుంఠ్లి, చౌడిబీడు, రోసవంతె, కోర్లికొప్ప, మాసూరు, హింభాగిలు మొదలైన పల్లెలకూ ముట్టి జనం సంతోషంతో కుప్పిగెంతుల్ని వేసారు. సాగరంకు బస్సు వచ్చినా పల్లెల్లోని జనం సాగరంకు వెళ్లేది లేనందువలన, ఈ పల్లెలోళ్లు తమ ఊరి చెంతకే వచ్చే బస్సు గురించి ఆరా తీయసాగారు. అయితే ఇంతవరకూ బస్సును చూసిన భాగ్యం ఈ పల్లెజనంకు లేదు కదా!

బస్సు అనే అద్భుతం తమ పల్లెల అంచుకు వస్తది అనేది ఒక రోమాంచనంగా మారింది. దీన్ని ఎక్కేదానికన్నా, దాన్ని చూచేదే ఒక సంభ్రమం అనేటట్లుగా జనం పల్లెల్నుంచి బయటకు రాసాగారు.

దొర ఇంటి ముందున్న దారికి మామిడాకుల తోరణాల్ని కట్టారు. అరటిపిలకల్ని తెచ్చి నిలిపారు. బస్సులో వచ్చే డ్రైవర్, కండక్టరు గార్లకు దొర ఇంటిలో జీడిపప్పుల ఉప్మా, గసగసాల పాయసం మరియు చాయ్‌ను ఇప్పించే వ్యవస్థను ఏర్పాటుచేసారు. దొరగారి కొడుకులు, కోడళ్ళు, మనుమ సంతానం, పాలేర్లు తమకు కేటాయించిన సరైన జాగాలో కూర్చున్నారు.

పల్లెల జనం కంబళి, చాప, గడ్డి, ఆకుల్ని పరచుకొని అక్కడక్కడ కూర్చున్నారు. తామే అందరికన్నా ముందే బస్సును చూసేందుకని కొంతమంది చెట్లను ఎక్కారు.

ఇంతకు మునుపే వేరెక్కడో బస్సును చూసినోళ్ళు, బస్సును ఇంతవరకూ చూడనోళ్ళకు బస్సును గురించి చెప్పే అవకాశాల్ని సద్వినియోగం చేసుకోసాగారు.

వెనకాల బొగ్గుల పొయ్యి
గాలి రావటానికని ఒక ఫంకా

రబ్బరు మరియు గాలితో నింపిన చక్రాలు
చక్రదారి లాగ ఉండే డ్రైవర్
రైట్.. రైట్ అని అరిచే కండక్టర్
ఆసన వ్యవస్థ.
ఎద్దుల బండికన్నా నూరు రెట్లు వేగంగా చలించే దాని జోరు.
అంతటినీ వర్ణించి చెప్పసాగారు.

ఎంతో దూరం నుంచి బస్సు నుంచి వచ్చే శబ్దం వినబడుతుంటే సాగరం దిక్కుకు ముఖాన్ని త్రిప్పుకొని కొంతమంది కూర్చున్నారు.

'వచ్చింది వచ్చింది' అని సంభ్రమాన్ని పుట్టించారు.

ఏదో సుడిగాలి దూరంగా మట్టి గోపురంను నిర్మించితే బస్సు వచ్చిందేమోనని కొంతమంది లేచి నిలబడి గడబిడను సృష్టించారు.

మూడు గంటలైంది.. నాలుగు గంటలూ అయ్యింది.
పిల్లలు చాపల మీద, కంబళ్ళమీద నిద్రకు జారారు.

"పడుకో.. బస్సు వస్తే ఎమ్మటే లేపుతాను..." అని తల్లులు జోలపాడారు తమ తమ పిల్లలకు.

యువకులు అసహనంతో ఉన్న తమ భాగస్వాములకు సమాధానం చెపుతున్నారు.

"వస్తదో... రాదో.. " అనటం చేయసాగారు ఇంకొందరు.
"వచ్చేది ఖాయమేలె... దొరగారే వెళ్ళారు గదా!"

దొర కోడళ్ళు బస్సుకు ఆరతిని ఇవ్వటానికని ఆరతి పళ్లెంతో సిద్ధమై నిలబడియున్నారు.

'కాగోడుకు బస్సు వచ్చిందంటే కాగోడూ పేట లాగానే ఉంటది కదా!' అనే మాటలు ఎవర్నుంచో వినబడసాగాయి.

"ఔనయ్యా.. ఇంకా హోటలూ వస్తది. సిలిమా హాలు వస్తది.. పేటలో ఏమేమి ఉంటవో అవన్నీ మన కాగోడుకూ వస్తవిలే" అన్నారు ఇంకెవరో.

"రానీ.... రానీ.. బస్సు పేటలోని జనంకు మాత్రమేనా" ఎవడో అనసాగాడు.

"మొదలు రానీయండి.. బస్సును ఎక్కటానికి జేబులో కాసలున్నవేమో చూడు తమ్ముడూ .... మేమూ ఉత్తిగనే బస్సును చూసేటోళ్ళమే సుమా... ఎక్కేందుకు అర్హత లేనోళ్ళము" అనే మాటా వినబడింది.

ఇట్లా నానారకాల మాటల నడుమ దఢేల్ దఢేల్ అంటూ గుంటలలో దిగి, ఎక్కుతూ, ఘోం ఘోం హారన్ చేస్తూ, యమ ధూళును రేపుతూ బస్సు రానే వచ్చింది.

జనం గడబిడతో లేచి నిలబడ్డారు.

ముసలోళ్లు భయపడి కంగారుతో చెట్ల, పొదల వెనుకకు జేరారు. ఆడోళ్ళు పిల్లల్ని తమ చంకలలోకి తీసుకొని భద్రంగా అదుముకున్నారు. పత్నులు తమ మొగుళ్ళ వెనుకకు చేరుకొన్నారు. యువతి యువకులు ధైర్యంతో ముందుకు చొచ్చుకొచ్చారు.

కిర్‌మంటూ కీచునాదాన్ని చేసి బస్సు రథవీధిలో నిలిచింది.

మొదటి సీటులో కూర్చున్న దొర డోర్‌ను తెరుచుకొని క్రిందకు దిగి, కుస్తీలో గెలిచిన మల్లయోధుడులాగ, తన గుబురు మీసాల మీద చేతిని పెట్టి అక్కడ నిలబడినోళ్ళ ముఖాల్ని చూసారు.

జనం 'హో.. హో...' అనే జయఘోషను పెట్టారు.

వెనక సీటు నుంచి మొదటిగా సర్కారి నర్సమ్మ అలివేలు దిగి తన తెల్లటి చీరను సవరించుకొంటూ కిసుక్కున నవ్వింది. ఆమె వెనుకే ఫారెస్ట్‌గార్డ్ మొహిద్దీన్ మూడో భార్య అయిన ఫాతిమాబి దిగింది. వారికీ జనం ఒ ఓ అంటూ చప్పట్లతో స్వాగతాన్ని చెప్పారు.

రెండో సీటునుంచి కరణంగారు భూకాగితల కట్టల మూటతో దిగారు. వారికి జతగా వారి కుమారుడు మరియూ కాగోడుకే చెందిన రామాభట్టరు, దుర్గాభట్టరు క్రిందకు దిగారు. అప్పుడూ జనం నుంచి కేకలు, నవ్వులూ, ఈలలు, చప్పట్లు కురిసాయి.

కండక్టరు దిగి నిలబడ్డాడు. ధూళు, దుమ్ముతో నిండిన తన సమవస్త్రాన్ని దులుపుకోసాగాడు.

మళ్ళా ఎవరు దిగుతారో బస్సు నుంచి?

బస్సు వెనుకనున్న డోర్ వైపుకు దృష్టిని పెట్టారు ఊరిజనం.

లోనెవరో ఉన్నారని అన్పించింది జనానికి.

ఎవరు? ఎవరు?

మొదలు ఒక కంబళి బయటకి వచ్చింది. కంబళి వెనుక నుంచి హోంకేరి తిమ్మప్ప దేహాన్ని ముడుచుకొని చెట్ల పొదల వెనుక దాగేందుకని అతను అటు ఇటు చూసాడు.

దొర చూడనే చూసాడు.

"ఎవఢ్రా అది భాంచోథ్ నా కొడుకు.. పట్టుకోండి ఆ లంజా కొడుకును" అని గర్జించాడు.

బస్సును చూద్దామనే ఆత్రంతో  తిమ్మప్ప బస్సు అక్కడికి  వచ్చినప్పుడు దారి అంచున నిలబడ్డాడు.

"వస్తావా... వస్తే ఎక్కు" అన్నాడు కండక్టర్ తిమ్మతో.

తిమ్మ మరొక ఉపాయం లేక బస్సును ఆ వైపు నుంచి ఎక్కాడు.

దొరకున్న జీతగాళ్ళలో తిమ్మడూ ఒకడిగా ఉన్నాడు. దొర ముందు ఇట్లాగున ఇట్లాగున నడుచుకోవాలి అనే నియమనిబంధనలు ఉండేవి. చెప్పులు వేసుకోకూడదు.  బారు పంచె కట్టుకోకూడదు. బండి మీద కూర్చోకూడదు మొదలైన నియమాలు ఉండేవి. అయితే తిమ్మడు దొర ఎక్కిన బస్సును ఎక్కాడు కదా! ఈ భయంతో  తిమ్మ ఒక్క గెంతుతో బస్సు నుంచి దూకి పారిపోయేటందుకు ప్రయత్నించాడు.

అయితే దొరకు పెద్ద పాలేరైన సిద్దయ్య గబక్కనే పరిగెత్తికెళ్ళి తిమ్మను పట్టుకున్నాడు.

"వేయండి నాలుగు ఏట్లు... లంజాకొడుక్కి" అన్నాడు దొర.

దొరగారి కోడళ్ళు బస్సుకు ఆరతిని ఇస్తుంటే, తిమ్మ దెబ్బల్ని తింటూ విలవిలలాడాడు.

మరొకసారి నవ్వాడు తిమ్మప్పతాత.

"ఇప్పుడు కాలం మారిందిలే.. బస్సులో ఎవరైనా ప్రయాణించొచ్చులే..."

"అవునవును" అన్నాడు ఈరభద్ర.

కిట్టప్ప హోటల్ ముందు దుర్గాంబ సర్వీస్ బస్సు వచ్చి నిలబడి హారన్‌ను కొడ్తుంది.

❀ ❀ ❀

(కన్నడభాషలో సుప్రసిద్ధ కథారచయిత అయిన నా.డి'సోజగారు 'కాగోడిగె బస్సు బంతు' అనే పేరుతో రచించిన ఈ కథను కన్నడప్రభ నుంచి తెలుగు అనువాదంకు స్వీకరించడమైనది.) 12-11-06.

శాఖమూరు రామగోపాల్

# గాంధిపురంలోని మోడల్ పాఠశాల

"అందరూ లేవండి.. ఒకట్రెండుసార్లు నమస్తె చెప్పండి... ఆ తర్వాత కూర్చోండి...."

గాంధిపురం సర్కారి మోడల్ స్కూల్‌లో ఐదోక్లాసులోని 'ఏ' సెక్షన్‌లో 56 మంది విద్యార్థులు 56 విధాలుగా దఢాల్నే లేచి, నిలబడి కూర్చొన్నారు. అప్పటికప్పుడే ఆ తరగతిలో 'సునామి' అలపుట్టి ఎగిసి పడినట్లుగా అన్పించింది. హెడ్‌మాష్టర్ అయిన శాంత మాష్టారు స్వామి వివేకానందుడి శైలిలాగ రెండు చేతుల్ని కట్టుకొని చెప్పసాగాడు. "ప్రియమైన విద్యార్థులారా, మన స్కూల్‌కు కొత్త మాష్టారు వచ్చారు. ఈయన పేరు సుధాకర్ మాష్టారు. ఇకముందు మీ క్లాస్ టీచర్ వీరే. కొత్తసారుకు నమస్కారం చెయ్యండి...."

దళపతి ఆజ్ఞకు ఎదురు చూస్తున్న సిపాయిలాగ క్లాస్ లీడర్, హెడ్‌మాష్టారు కనుసంజ్ఞలను గమనించి, సహపాఠి విద్యార్థులకు ఆదేశాన్ని ఇవ్వసాగాడు. 'తమామ్ ఉర్‌జావ్... సుధాకర్ సారుకు వందనాలు'. పైకప్పు ఎగిరిపోయేటట్లుగా తరగతి మొత్తం సుధాకర్ సారుకు వందనాలు చెప్పారు. చివరి వరుసలో కూర్చున్న విద్యార్థి మాత్రం, గుంపులో గోవిందయ్య లాగ కాకుండా సుధాకర మాష్టారికి అని ప్రత్యేకంగా పలకటం, ఆ అపస్వరం చెవికి సోకిందే తడవుగా శాంత మాష్టారుకు పైత్యం నెత్తికెక్కింది. అప్పటికప్పుడే నాగుపాము బుస గొట్టినట్లుగా పేమ్ బెత్తంతో ఆ విద్యార్థిని చావబాదుతుంటే ఆ పిల్లోడు అమ్మో... అయ్యో.... అయ్యయ్యో అనే బాధతో కూడిన రాగం అద్నాన్ సమి ఇండిపాప్ గీతంలోని రాగంగా ఆ ఆర్తనాదం వినబడసాగింది.

హెడ్‌మాష్టారును శాంత పరచడానికి సుధాకర సారు ప్రయాస పడాల్సి వచ్చింది. పెద్దసారు బుసపెడ్తూనె క్లాసు నుంచి బయటకు వెళ్ళాడు. సుధాకర్‌సారు బెత్తం దెబ్బల్నుంచి చితక గొట్టించుకొన్న విద్యార్థి వీపును ప్రేమతో నిమిరి స్వాంతనం కలిగించాడు. "సుధారక, సుధారణ, సత్యవంత" మొదలైన 'స' కారాత్మక పదాలు ఈ కాలంలో గ్రామసీమలలోని పాఠశాలలో కనుమరుగవుతున్నవి కదా అని తనలో తనే అనుకోసాగాడు.

పెద్దసారు ఆ తరగతిలో తుఫానును పుట్టించి వెళ్ళారు. విద్యార్థులంతా శాపగ్రస్తులైన వారిలాగ స్తబ్దుగా ఉండిపోయారు. అక్కడి వాతావరణాన్ని తేలిక చేయటానికి సుధాకర్ సారు చాక్‌పీసును తీసుకొని బోర్డ్‌మీద తోకను గీసారు. నాలుగు కాళ్ళను చిత్రించి,

దేహాన్ని జోడించాడు. చివరిగా తలను సృష్టించాడు. ఈ చిత్రాన్ని గీస్తుంటే విద్యార్థుల ముఖభంగిమలలో మార్పులు కలగసాగాయి. "ఇదేమి బొమ్మ.... చెప్పండి?" అని సుధాకర్ సారు పిల్లల్ని అడిగాడు. కోతి... కోతి అనే ఒకే గొంతుతో వచ్చిన ఘోష బయటపడింది ఆ పిల్లల నోళ్ళనుంచి. అందరి ముఖాలలో తుంటరి నవ్వులతో కోతి చేష్టకు ప్రతిరూపం తామే అనేది కన్పించసాగింది. "ఎవరు కోతి.... కోతిగాడు ఎవడు?" అనే ప్రశ్నను సుధాకర మాష్టారు పిల్లల ముందు ఉంచాడు. మొత్తం క్లాసంతా కితకితలతో హుషారైంది. కొన్ని క్షణాలలోనే మొత్తం తరగతిని సుధాకరసారు కైవశం చేసుకొన్నాడు. వాతావరణం తేలికబడింది అనేది ఖచితం చేసికొని తమ పరిచయాల్ని ఆ పిల్లలతో కలుగజేసుకొన్నారు. విద్యార్థులనుంచి వాళ్ళ పూర్వాపరాల్ని తెలుసుకొన్నారు. గడియారం మీద కంటిని నిలిపి "ఈ కోతి కథను సోమవారం చెపుతానులే" అనే మూలకంగా లాంగ్‌బెల్ మ్రోగేదాన్ని వినే నిరీక్షణలో ఉన్న పిల్లల మెదళ్ళలో కుతూహలం అనే వలను విసిరారు సుధాకరసారు.

లాంగ్‌బెల్ మ్రోగింది. ఇతర సెక్షన్‌ల నుంచి ఇంటికి వెళ్ళే పరుగుల చప్పుళ్ళు. అయితే ఈ తరగతిలో మాత్రం ఇంకొక గంట ఇక్కడే కూర్చుని కోతి కథను వినాలి అనే కోరిక. సుధాకరసారు అందరెదురు ఆత్మీయ నవ్వును కురిపించి ఇంటికి వెళ్ళే ఊపులో ఉంటే పిల్లలంతా ఖిన్న మనస్సుతో గోనె పట్టాను ఎత్తుకొని బయటకు రాసాగారు. సోమవారం క్లాసుకు ఆబ్సెంట్ అవ్వాలి అనే ప్లానును రూపొందించుకున్న రంగ మరియు సిద్ద ఆ క్షణంలోనే తమ నిర్ధారాన్ని మార్చుకొన్నారు. కొత్తసారు పొద్దున్నే వచ్చి ఉండాల్సింది అని కొంతమంది అనుకోసాగారు. రేపెందుకు ఆదివారం అయి చచ్చింది అని కొంతమంది పిల్లలు నిట్టూర్చారు.

క్లాస్‌రూమ్ ఖాళి అయ్యింది. కిటికి నుంచి బయటకి చూస్తుంటే ముఖ్యోపాధ్యాయ శాంత మాష్టారుతో జతైన మోడల్ స్కూల్‌లోని సమస్త శిక్షక బృందం తమ ఇళ్ళకు చేరటానికి పిల్లలతో పోటీకి దిగినట్లుగా అనిపించింది సుధాకరసారుకు. కిటికీల రెక్కల్ని మూసి మళ్ళా తెరిచి ఇంకా గట్టిగానే ఉన్నవి అనేదాన్ని ఖచితం చేసుకొన్నారు. గోడలమీద సూక్ష్మంగా చూసి, ఒకే ఒక సన్నటి పగుళ్ళను (క్రాక్స్) కనుగొనలేక సారు ముఖంలో సంతృప్తికరమైన నవ్వు మెరుపులా పుట్టి మాయమైంది. డోర్‌ఫ్రేమ్, కిటికీలను, గోడలమీద చేతితో నెమ్మదిగా తడిమాడు. కొడుకు తలను తల్లి నిమిరినట్లుగా సుధాకరసారు భావుకడైయ్యాడు. ఆయన కండ్ల కొనల నుంచి ఆనంద బాష్పాలు బయటకి రాసాగినవి.

ఉక్కిరి బిక్కిరి భావనతో తరగతి గదినుంచి వరండాకు చేరాడు సారు. అప్పటికే అక్కడ ఏడో తరగతి విద్యార్థులు ఇద్దరు ఉన్నారు. సారు గదినుంచి బయటకు వచ్చేదాన్నే నిరీక్షిస్తూ, సారు బయటికి రావడం చేత, ఆ ఇద్దరు పిల్లలు క్లాసు గదికి తాళం వేసి పెద్ద పనే ముగిసిందిలే అనే నవ్వు ముఖాలతో ఆ తాళాల్ని హెడ్‌మాస్టారు ఇంటిలో ఇవ్వటానికి పరుగులు పెట్టారు.

సుధాకరసారు ఆటల మైదానంలో చివర్నున్న గాంధి విగ్రహం అరుగుమీద చతికిలబడి 16 గదులతో నిండిన ఆ పాఠశాలను తదేక చిత్తంతో చూడసాగారు. మిగిలిన గదులకన్నా భిన్నంగా కనబడుతున్న ఆ రెండుగదుల మీద ఆయన దృష్టి కేంద్రీకృతమైంది. ఆ రెండుగదులు ఎర్రటి గ్రానైట్ రాళ్ళతో, రూఫ్, నేల మీద ఫ్లోరింగ్, సిమెంట్ ప్లాస్టరింగ్ మొదలైనవి ఆయన మనస్సులోని తెరమీద రీళ్ళులాగ వచ్చి పోయినవి. మరుక్షణం పి.డబ్ల్యు.డి ఛీఫ్ ఇంజనీరుడి కోలముఖం మరియు పదివేల రూపాయల నోట్ల కట్ట కళ్ళముందు కనపడసాగినవి. ఇంతలోనే ఆ రెండు ఆకృతులు భూతాకారంగా గహ గహ నవ్వుతూ తమను అణిచివేసింది గుర్తుకు రాసాగింది. ఆ అరుగు మీదనుంచి సర్రనే లేచి సుధాకరసారు ఇంటివైపుకు బిరబిరా అడుగుల్ని వేయసాగాడు.

❁ ❁ ❁

ఉదయం ప్రార్థనను ముగించి పిల్లలంతా తమదే అయిన లోకంలో విహరించసాగారు. సుధాకర సారు కిటికీ నుంచి క్లాసులోకి చూపుల్ని పెట్టారు. ఒకరిద్దరు విద్యార్థులు మరొక విద్యార్థి చొక్కాకు ఉన్న కంతల్ని లెక్కపెట్టటానికి నేముందు కాదు నేనే ముందు అంటూ పోటీ పడసాగారు. మరొక పక్క కొత్త ఫ్రాక్‌ను వేసుకొచ్చిన పాపనే ఆశ్చర్యంతో చూస్తున్నారు మరికొంతమంది విద్యార్థినిలు. సుధాకరసారు కలలు గంటున్న సుందర స్వప్నాన్ని ఈ రెండు దృశ్యాలు చేరి క్షణంలోనే ఆయన స్వప్న గోపురాన్ని కూల్చివేసినవి. సారు తరగతి గదిలో కాలు పెట్టుతుంటే సమస్త విద్యార్థి విద్యార్థినిలు రివ్వునే లేచి నమస్తే చెప్పారు. అందరిమీద ఆత్మీయతా నవ్వును విసిరిన మాష్టారు కోతి కథను వినటానికి పిల్లలు ఉద్యుక్తులైయ్యారు అనేదాన్ని గమనించి "కోతికథను మధ్యాహ్నం చెపుతాను" అంటూ చాక్‌పీసును తీసుకొన్నాడు. బోర్డ్‌మీద దేశ నాయకులు అని రాసి, దాని క్రింద ఆకుపచ్చ చాక్‌పీస్‌తో పెద్ద గీతను గీసి, మన జాతీయ నాయకుల పేర్లను చెప్పండి అని అడిగారు పిల్లలతో.

ఏడెనిమిది మంది నేనే ముందు అనేటట్లుగా చేతుల్ని ఎత్తారు. ఒకడేమో మహాత్మాగాంధీ అన్నాడు. మరొకడేమో నెహ్రూ అనే పేరును చెప్పాడు. ఇంకొకడేమో ఇందిరాగాంధి అని అన్నాడు. మూడో వరుసలో ఉన్న ఒక విద్యార్థిణి లేచి నిలబడి 'లాలా జలపతిరాయ్' అంటూ పలికింది. మొత్తం తరగతి గొళ్ళున నవ్వింది. సుధాకరసారు 'లాలా లజపత్‌రాయ్' అంటూ బోర్డు మీద రాసి తప్పుగా పలికిన విధానాన్ని సరిచేసారు. చివరి వరుసలోని విద్యార్థి ఒకడు చేతిని ఎత్తి 'ప్రియాంకగాంధి' అని అన్నాడు. కొంతమంది పిల్లలు గుర్రుగా వాడివైపు చూసి, మాష్టారెదురు ప్రశ్నార్థకమైన దృష్టిని కురిపించారు. సుధాకరసారు బోర్డ్‌మీద విద్యార్థులు చెప్పిన అందరి నాయకుల పేర్లను రాసారు ఒక్క ప్రియాంక గాంధీని మాత్రమే వదిలిపెట్టి.

దేశపిత మహాత్మాగాంధీజి గురించి ఎవరైనా మాట్లాడతారా అని అడిగారు పిల్లలతో. ఒక విద్యార్థి లేచి నిలబడి రాగయుక్తంగా చెప్పసాగాడు.... మహాత్మాగాంధి పూర్తిపేరు మోహనదాస్ కరంచంద్ గాంధి. అహింస అనే బాణాన్ని పట్టుకొన్న గాంధి తాత, సత్యాగ్రహం మీద జనంలో అపారవిశ్వాసాన్ని కలిగించాడు. న్యాయం కోసం పోరాడేది ప్రతి ఒక్కడి కర్తవ్యం. అన్యాయానికి దాసోహ మయ్యేది పిరికితన లక్షణం అనేది ఆయన ప్రతిపాదించిన సూత్రం.

విద్యార్థి నుంచి వచ్చిన ఈ పలుకులు చెవులకు తగలగానే ఎవరో కపాళంకు వేగంగా కొట్టినట్లైంది మాష్టారుకు. పి.డబ్ల్యు.డి. చీఫ్ ఇంజనీరుడి కోలముఖం మరియు పదివేల రూపాయల కట్ట మళ్ళా కళ్ళ ముందు కనబడసాగింది. అసహనానికి గురైన మాష్టారు టేబిల్ మీదున్న జగ్‌ను ఎత్తుకొని నీరును గటగటా తాగారు. కన్నడ సబ్జక్ట్‌లోని 4వ పాఠాన్ని చదవండి అంటూ వరండాలోకి వచ్చారు.

❀ ❀ ❀

సుధాకరసారులో జ్ఞాపకాల దొంతర 14 సంవత్సరాల క్రితంకు జారింది. గాంధిపురంకు మునసబ్, పటేల్, పట్వారీల దర్పం నశించి పంచాయత్ రాజ్యం మొదలైంది. రాష్ట్రం నలుమూలలా వికేంద్రీకరణ గాలి వీయసాగింది. అన్నిచోట్ల 'జనంకే అధికారం' అనే ఘోషణ. 'ఇంక ఎవడికి ఛాంచన్ అనేది లేదులే. మనకి మనమే దొరలము' అనే భ్రమలలో జనం ఓలలాడారు. ఆశ్రయ ఇళ్ళు, రేషన్‌కార్డులు, రోజగార్, పనికి ఆహార

పథకం మొదలైన యోజనలు. 'రామరాజ్యమే ఇది... మనది రామరాజ్యమే' అని జనం మూడు ప్రాంతాలలో అనుకోసాగారు.

పాఠశాలలు, ఇళ్ళు, తుఫాన్ ప్రకృతి బీభత్సానికి ఆశ్రయం ఇచ్చే షెల్టర్స్, సిమెంట్ పైపులతో మురికి కాలువ (డ్రైనేజి)నిర్మాణం, సంపర్క రహదారులు ఇత్యాది పనులకు సర్కారి ఖజానానుంచి కోట్లరూపాయలు గ్రామ పంచాయితీలకు రాసాగినవి. పంచాయత్ ప్రతినిధులు బ్రోకర్లను దళారీలను అడ్డం పెట్టుకొని ఆయా అభివృద్ధి కాంట్రాక్ట్ పనులకు తామే టెండర్లను వేయటం మొదలుపెట్టారు. గ్రామోద్ధారానికి కేటాయించబడిన లక్షల రూపాయలను గౌరవాన్విత జనప్రతినిధుల ఉదరోద్ధారానికి సహాయపడసాగాయి. పంచాయత్ ఎలక్షన్‌లలో తమకు ఇష్టులైన వారి పరంగా డబ్బును, సారాయిని పంపిణీ చేసి, తమ వాళ్ళు గెలిచిన తర్వాత కాంట్ర్యాక్ట్ పనులను తమ పరం చేసుకొనేదాన్ని అన్నిగ్రామాలలో సత్ – సాంప్రదాయం అన్నట్లుగా మార్పు చేసుకొన్నారు. ఇటువంటి సన్నివేశం నడుమ గాంధిపురం ప్రౌఢ సరకారి మాదిరి (మోడల్) స్కూల్‌కు కొత్తగది నిర్మాణానికి 90వేల రూపాయలు సాంక్షన్ అవ్వటం జరిగింది.

పంచాయత్ అధ్యక్షుడైన అణ్ణప్పనాయక్ ఈ కాంట్రాక్ట్‌ను తన ముఖ్య అనుచరుడైన తమ్మణ్ణగౌడకు అని ఖరారు చేసాడు. 40వేలలో గదిని నిర్మించి మిగిలిన 50వేలను పంచుకొనేది ఒక లెక్కాచారంగా వాళ్ళిద్దరిలో ఒప్పందం కుదిరింది.

సుధాకర సారు అప్పుడు పియుసి చదువుతున్న యువకుడు. లోకనాయక జయప్రకాశ్ నారాయణ సిద్ధాంతాలకు మారు హోగి సమాన భావాల యువకుల గుంపులో చేరి "మా ఊరి యువక సంఘం" అనే దాన్ని స్థాపించాడు. కాంట్రాక్టరు మరియు రాజకీయనాయకుల అపవిత్రమైత్రి మూలకంగా ఊరి అభివృద్ధి వాగులో కొట్టుకుపోయేదాన్ని కనుగొన్న సంఘంలోని యువకులు ఎలాగైన చేసి స్కూల్‌గదిని సుభద్రంగా కట్టాలి అనే ప్రతిజ్ఞను సామూహింకగా చేసుకొన్నారు. ఆరోజు సంఘం మీటింగ్ సభలో సుధాకర వీరావేశంతో భాషణం చేశాడు... ఈరోజు స్కూల్ గది నిర్మాణం, రేపు రహదారి, ఎల్లొండు ఆసుపత్రి, ఆ తర్వాత తుఫాన్ షెల్టర్... మన ఊరిలోని ఏ కాంట్రాక్ట్ అయినా సరే, మన ఊరోళ్ళందరం చేరి ఆ పనులను చేసి ముగించాలి. అభివృద్ధి పనుల నుంచి వాళ్ళందర్ని దూరంగా ఉంచాలి. స్కూల్ కాంట్రాక్ట్‌ను మనమే చేద్దాం. మనమే శ్రమదానం చేసి 90 వేలలో ఒకటి కాదు రెండుగదుల్ని నిర్మిద్దాము. ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో గాంధితాత

సందర్శించిన గ్రామం మనది. ఈ గాంధిపురాన్ని గాంధీజి కలలుగన్న రామరాజ్యంగా చేసి చూపిద్దాం...!

యువకసంఘ సదస్యులంతా మరుదినమే పి.డబ్ల్యు.డి. ఛీఫ్ ఇంజనీర్‌ను కలిసి విన్నపాన్ని ఇచ్చారు. ఒక గదికి 90వేలు సాంక్షన్ అయ్యింది కదా. మేము అంత మొత్తంలోనే రెండు గదుల్ని నిర్మించి ఇస్తాము అని కోరటం చేత ఇంజనీర్‌సారు రెండో మాటే ఎత్తకుండా శ్రమదానానికి ముందుకు వచ్చిన ఆ సంఘం వారికే ఆ కాంట్రాక్ట్‌ను ఇచ్చారు.

ఆ రోజు కాలేజివేళ అయిపోగానే సాయంత్రం అందరూ మోడల్ స్కూల్ ప్రాంగణంలో జమ అయ్యారు. కొబ్బరికాయను కొట్టి పునాదులను తవ్వసాగారు. అర్థరాత్రికి పునాదుల నుంచి రెండు గదులకు మట్టిని త్రవ్వి బయటపోసారు. అలవాటు లేకపోవడం చేత చెమటదారలు వంటినుంచి ప్రవహించినవి. ఎక్కువమంది యువకులకు ఇదే మొదటిసారి గడ్డ పలుగు, చేతిపారలను పట్టటంచేత చేతులనుంచి చర్మం చిట్లి రక్తం కారసాగింది. “ఇది పునాది మాత్రమే కాదు, మన ఊరి అభివృద్ధి ఆందోళనలోని మొదటి పునాది ఇదే” అని సంఘం అధ్యక్షుడైన విష్ణు వ్యాఖ్యానించాడు. “యువశక్తి అంటే ఏమిటనే దాన్ని మన ఊరి పెద్దలకు చూపించే ప్రయత్నమే ఇది” అని మంజుహరికార ఉత్సాహాన్ని నింపాడు. ఆరోజున లగాయితు సంఘ సదస్యులంతా సాయంత్రం నుంచి అర్థరాత్రి వరకు వారి సమయాన్ని గ్రామ స్కూల్ కోసం ఆ రెండు గదుల నిర్మాణానికి వినియోగించారు.

కొన్ని రోజులలోనే ఆ రెండు గదుల గోడలు ఎత్తుగా కన్పించగానే గాంధిపురానికి గాంధీపురమే విస్మయానికి గురైంది. “ఇన్నిరోజులూ స్కూల్ కట్టారంట. పిచ్చి వెధవలు. పుట్టి రెండు పదులు నిండలేదు. కాంత్రి కలుగజేస్తారంట... క్రాంతి! స్కూల్ గదుల్ని కట్టటం అంటే అదేదో బిళ్లంగోడు కోతి కొమ్మచ్చి ఆటే అనుకొంటారేమో.... వెధవలు , నాలుగు రోజులు పనిచేసారంటే ఐదోరోజు కాలేజికి వెళ్ళేది లేదులే” అంటూ వెటకారం జేసిన గ్రామంలోని భ్రష్టనాయకులు ఇప్పుడు తమ కళ్ళెదురు నడచిన ప్రగతిని చూసి నివ్వెరపోయారు. తమ అంచనాలకు, ఊహలకు అడ్డుగా నిలిచిన యువక సంఘ సదస్యులకు బుద్ధిని కలిగించే సమయానికి వేచి చూడసాగారు.

యువకుల శ్రమ సాహసం ముందుకే సాగిపోసాగింది. గదుల సూరుకు కావాల్సిన కలప కోసం అడితిలో కొనే బదులు పారెస్ట్ డిపో వేలం పాట నుంచి తెస్తే చీప్ అండ్

బెస్ట్ అని అనుకోవటమే ఆలశ్యం అన్నట్టుగా డిపోలో వేలంకు హాజరయ్యారు. ప్రతి లాట్ పాటలో పాల్గొన్నారు. అయితే కలప కోసం ముఠాగా నిలిచే మాఫియా వర్తకుల గుంపుతో పోటీపడేది అసాధ్యమని గ్రహించుకొన్న యువకుల సంఘం, ఆ వర్తకుల మనసును తమ శ్రమశక్తి పాఠశాల ఉన్నతికి అని తెలియజేసి, వాళ్ళను ప్రసన్నం చేసుకొని గదులకు కావాల్సినంత కలపను తక్కువ ధరకే పొందారు. ఆ కలప దుంగల్ని అంత దూరం నుంచి తమ గ్రామానికి చేరవేసేటప్పటికి 'తల ప్రాణం తోకకు వచ్చింది' ఆ యువ శక్తికి.

ఇట్లా ఆ కాలంలోని రోజులను గుర్తుకు తెచ్చుకొంటున్న సుధాకర సారుకు ఆ క్షణంలో మంజు హరికార ముఖం జ్ఞాపకానికి వచ్చింది. ఆ రోజు రాత్రివేళలో అతను బంగారం చైను మరియు నాలుగు జతల చేతిగాజుల్ని ఖాకి రంగులో ఉన్న చిన్న సంచిలో నింపి తన చేతిలో దాన్నుంచి, తామిద్దరం దాన్ని మార్వాడి అంగట్లో తనఖా పెట్టి 40వేలు తెచ్చిన సన్నివేశం కళ్ళకు కట్టినట్లుగా కనబడసాగింది.

మొదటి లెవల్ పని ముగిసినప్పుడు 50వేలు విడుదల అయినవి పి.డబ్ల్యు.డి. నుంచి. మిగతా మొత్తాన్ని పొందాలంటే పనిని పూర్తిగా ముగించాలి. దాన్ని నెరవేర్చాలంటే డబ్బుల అవసరం ఉంది. ముందు దారి కనబడక సంఘ సదస్యులంతా నిస్సహాయులై కూర్చొంటే మంజుహరికార చేపల అమ్మకంతోనే జీవనాన్ని నెట్టుకొస్తున్న తల్లి మనస్సును తమ సంఘ ఉద్దేశాలకు రెండోసారి మరల్చి, ఆమె వంటికి ఉన్న బంగార ఆభరణాల్ని మళ్ళీ రెండోసారి తాకట్టు పెట్టి, డబ్బుల్ని సమకూర్చాడు.

తను వరండాకు వచ్చి చాలా సేపు అయ్యింది అని మళ్ళా క్లాసులోనికి అడుగుపెట్టాడు సుధాకరసారు. వేదపారాయణం లాగ పాఠాల్ని చదువుతున్నారు పిల్లలు. పుస్తకాన్ని పక్కకు జరిపి మర్కట బుద్ధిని ప్రదర్శిస్తున్న కొంతమంది తాము బాగా చదువుతున్నట్లుగా నటిస్తూ సారును చూసి నించొని నమస్తె అంటూ మళ్ళీ పుస్తకపఠనంలో నిమగ్నమయ్యారు. సుధాకరసారు కొత్త పాఠాన్ని చెప్పటానికి పుస్తకాన్ని తెరిచారు. పక్క సెక్షన్‌లోంచి పిల్లల కంఠాల రాగాలు జోరుగా వినిపిస్తున్నవి. వ – వన, శ – శంకు, స – సత్యాగ్రహ.. సత్యాగ్రహ శబ్దం చెవికి సోకగానే సుధాకర సారు మళ్ళీ విచలితమయ్యారు. ఆ కాలంలో తాము చేసిన సత్యాగ్రహ సన్నివేశం మళ్ళా గుర్తుకు రాసాగింది.

గదుల నిర్మాణం పని మూడొంతులు పూర్తైంది. సంఘ యువకులు అంతా ఆరోజు రాత్రి గోడల ప్లాస్టర్‌కు నీళ్ళను చిమ్ముతున్నారు. పంచాయితి ప్రెసిడెంట్ అణ్ణప్పనాయక, కాంట్రాక్టర్ తమ్మణ్ణ గౌడ మరికొందరు స్కూల్ దగ్గర జమ అయ్యారు."సంఘంలోని అందరికి తలా రెండువేలు ఇస్తాను. ఈ కాంట్రాక్టును మాకు వదిలేయండి అని అడగడం, ఆ తర్వాత ఇది మా ప్రతిష్ఠకు సంబంధించింది మమ్మల్ని ఎదిరిస్తే మీకు పుట్టగతులుండవు జాగ్రత్త" అంటూ బెదిరించసాగారు. దీనికి లొంగకపోయేటప్పటికి, సంఘ సదస్యులమీద దాడి చేయించి వెళ్ళారు. ఈ దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికి మరుసటిరోజు ఉదయాన్నే పోలీస్ స్టేషన్ ఎదురు ధర్నా నడపాలి అని సంఘ సదస్యులంతా తీర్మానించుకున్నారు. అయితే, తెల్లారేటప్పటికి ధర్నాలో కూర్చొన్న వాళ్లు ముగ్గురు మాత్రమే. వాళ్ళెవరంటే సుధాకర, విష్ణు, మంజుహరికార. రౌడీలను ఎదుర్కొనేది ఎట్లాగబ్బా అంటూ మిగిలిన సదస్యులను వాళ్ళ వాళ్ళ కుటుంబీకులే అడ్డుకొన్నారు. పోలీసులు కంప్లైంట్‌ను తీసుకొనే బదులు వీళ్ళనే లాకప్పులోకి నెట్టుతాం అని బెదిరించి వెళ్ళగొట్టారు.

ఈ గొడవల తర్వాత గదుల నిర్మాణ బాధ్యతకు నిలిచినవారు నలుగురు మాత్రమే. ఉదయం, సాయంత్రం ఒక అరకిలోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చి సిమెంటు ప్లాస్టర్‌కు చిమ్మేవాళ్ళు. ఇంటిలో ప్రతిదినం తల్లితండ్రులు 'ఇంటికి కొరివి – ఊరికి ఉపకారి' అని శాపనార్థాల్ని పెట్టేవాళ్ళు. అంతో ఇంతో రెండుగదుల కట్టడం పని పూర్తి అయ్యి సున్నం రంగులతో కళకళలాడింది ఆ నిర్మాణం. ఆ రెండుగదులు మోడల్ స్కూల్‌కు కొత్త కళను ఇవ్వసాగింది.

ఆరోజు గదుల నిర్మాణ పనుల చెకెప్పుకు వచ్చిన ఛీఫ్ ఇంజనీర్ ఆ పనితనం, గుణమట్టాన్ని చూచి ఆశ్చర్యపడ్డాడు. ఒక గదిని నిర్మించే డబ్బుతో రెండుగదులు అదీ ఇంత సొగసుగా కట్టించారు గదా! అబ్బో పరమాద్భుతం అంటూ పొగిడారు. "పంచాయితీ పనులలో ఇంత ఉన్నత గుణమట్టం పనిని నా సర్వీసులో ఇదే మొదటిసారి చూస్తున్నాను. మీ అంత ఆదర్శ యువకుల్నుంచి మాత్రమే ఈ దేశం ముందుకు నడిచేది సాధ్యం అవుతది" అంటూ యువక సదస్యుల వెన్నును తట్టాడు."రేపేరండి బిల్‌ను పాస్ చేస్తాను" అని చెప్పి వెళ్ళారు ఆ ఛీఫ్ ఇంజనీరు.

ఆ రోజు సాయంత్రమే సంఘం సభను నడిపి లెక్కల మొత్తాన్ని పరిగణించసాగింది. 86 వేలకు పని ముగించబడింది. మిగతా నాలుగు వేలను విద్యార్థుల క్రీడాసామగ్రి

కోసం ఖర్చు అయ్యేదాన్ని కలిపి 90 వేలకు లెక్కలను సమర్పించాలి అనేది సంఘ తీర్మాన సారాంశం. అయితే మరుసటి రోజు ఇంజనీర్ ఆఫీసుకు పోయినప్పుడు అయ్యింది వేరొకటి.

ఛీఫ్ ఇంజనీర్ “చూడండి... బాబులూ.. కాంట్రాక్టర్లు అయితే మేము 20వేలను తీసుకొంటాము. మీరు సంఘం మూలకంగా గదుల్ని కట్టినందువలన 10వేలను మాత్రమే పర్సెంటేజ్ అడుగుతున్నాము. మీది నయాపైసా మాకెవ్వరికీ వద్దులే. పైవాళ్ళకు వాళ్ళ పాలిన మొత్తం 10వేలు ఇస్తే అదే చాలు. పైవాళ్ళకు డబ్బుల్ని ముట్టించక మునుపే నేను బిల్‌ను పాసు చేసేది లేదు” అని చెప్పారు వీరితో.

ప్రవాహంకు విరుద్దంగా ఈతగొట్టి వళ్ళు – మనస్సు అలిసిపోయినవి. గదుల విచారంలో లంచంకు వ్యతిరేకంగా గుద్దాడే శక్తి ఎవరిలోనూ లేకుండా పోయింది. తాకట్టు వలన వడ్డీ చేరి అసలుకే మొత్తం ఏడువేలు నష్టం ఉంటది. సంఘం ఖాతాలో కూడ డబ్బులేదు. గ్రామ బడి కోసం పట్టుసడలని విక్రమార్కులులాగ బడి గదుల్ని నిర్మించిన తప్పుకు సంఘంలో చివరివరకూ నిలిచిన నలుగురు తలలమీద ఈ నష్ట భారం మోపబడింది. ఆ భారాన్ని తగ్గించుకోటానికి ఆ నలుగురూ కేబిల్ నెట్‌వర్క్ సంస్థలో ఆరు నెలలు చాకిరీని చేయాల్సి వచ్చింది.

భ్రష్టాచారం, లంచగొండితనానికి విరుద్ధంగా ద్వనిని ఎత్తి బడి గదుల నిర్మాణానికి దిగిన తామే 10వేలును లంచంగా ఇచ్చింది ‘ఆత్మద్రోహం గాక మరేంటి’ అని సుధాకర సారు ఆకాలంలో తమ నుంచి జరిగిన దాన్ని నెమరేసుకుంటూ తనలో తనే ప్రశ్నించుకోసాగాడు. ఎదురించవచ్చు. లోకాయుక్తకూ కంప్లైంట్ ఇచ్చి ఆ లంచగొండ్లుకు ఒక పాఠం నేర్పించవచ్చు అని అనుకొంటూ అసహనం చెందసాగారు సారు.

మరుక్షణమే అడిగినంత డొనేషన్ ఇవ్వటానికి ఒప్పుకోకపోవటంచేత ఇంజనీరింగ్ సీటు తప్పిపోవటం, టీచర్ ట్రైనింగ్‌ను ముగించి ఉపాధ్యాయ నౌకరీకి సెలెక్ట్ అయినప్పుడు, లంచంను ఇవ్వటానికి ఒప్పుకోకపోవడం వలన ఎక్కడో రాష్ట్రంలోని చివరి జిల్లా లోని పాఠశాలలో పోస్టింగ్ రావడం, పి.జి.ని పొందినా జాతిలెక్కలకు బలై ప్రమోషన్ దొరకకుండా ఉండటం, టీచర్‌గా 10సంవత్సరాలు గడిపినా ఎవరికీ నయాపైసా ఇవ్వకుండా లోహియా, జె.పి. ఆదర్శాలను పాటించినా, అనారోగ్యంతో మంచాన పడిన అమ్మతో ఉండాల్సిన అగత్యం ఏర్పడడం వలన ఎమ్.ఎల్.ఏ.కు 8వేలు ఇచ్చి స్వగ్రామమైన

గాంధీపురానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడం ఇవన్నీ గుర్తుకు వచ్చి మనసులో ఏదో తెలియని అశాంతి పుట్టింది సారుకు.

అలాగైతే ఈ భ్రష్ట వ్యవస్థలోని గొలుసును ముక్కలు ముక్కలుగా తెంచటం సాధ్యమే కాదా అని తనని తనే ప్రశ్నించుకొన్నాడు. ఆయన ముఖంలో విషాద భావం మడుగుకట్టింది. ఊరికి ఆనుకొని ఉన్న సముద్రపు అలల జోరునాదం చెవులకు తాకసాగింది. గాలి జోరుకు ఎండిన ఆకులు, కసువు కొట్టుకు పోసాగాయి. ఎక్కడ్నుంచో ఎగిరి వచ్చి తన కాళ్ళ దగ్గర పడిన ఆంగ్ల దినపత్రిక (Hindu) లోని ఒక చూరు కాగితాన్ని కుతూహలంతో ఎత్తుకొని దాని మీద దృష్టిని పెట్టాడు. ఆ కాగితంలోని శీర్షికలో వున్న ఒక పుస్తక సమీక్ష మీద వ్రాసిన రివ్యూను చూస్తుంటే మోహకమైన చుంబకంను ఇచ్చినట్లైంది సారుకు. ఆ శీర్షికను మెల్లగా చదివాడు. ఇంకొకసారి, మరొకసారి చదివాడు. పెద్ద ధ్వనితో చదివాడు. "A man can change the system! J.P's crusade against Indira's tyranny".

❀ ❀ ❀

('గాంధిపురద మాదరి శాలె' అనే పేరుతో ఈ కథను కన్నడంలో రచించినవారు రమేశ్‌కుమార్ నాయక్‌గారు.)

30-04-2006

**శాఖమూరు రామగోపాల్**

# ఒక చిన్న దొంగల వృత్తం (సర్కిల్)

ఆటో డ్రైవర్ నుంచి బాడుగ మొత్తం వినగానే, ఆటోనుంచి దిగిన హరీశ్ మండిపడ్డాడు.

'ఏంటి? సిటీకి నేనేమైనా కొత్తోడ్ని అని అనుకొంటున్నావా? బస్టాండ్ నుంచి ఇక్కడికి అబ్బాబ్బా అనుకొంటే నాలుగున్నర కిలోమీటర్ల దూరమే గదా! నీ ఆటో మీటరు 45 రూపాయలు చూపిస్తుంది. నువ్వేమో 65 రూపాయలు అడుగుతున్నావు. గుంజటానికి, నా నుంచి వలవటానికి ఒక లెక్కైనా ఉండాలి కదా!'

'సారూ... మీరేమైనా అరటిపండా? లేక పనసపండా? వలుచుకొని నోట్లో వేసుకోటానికి? మీరు ఆటో ఎక్కినప్పుడే చెప్పాను కదా... ఒన్నండాఫ్ మీటరు బాడుగ అని. ఇది పాతకాలం లోని బెంగుళూర్ కాదులే. పదిచోట్ల ఫ్లైఓవర్‌ల కోసమని రోడ్డును తవ్వేసారు కదా... ఇరవైచోట్ల వన్‌వే. ఒక కిలోమీటరును నడిపే లోపే నాలుగువైపులా ట్రాఫిక్ జామ్ అవుతది. ఒక కిట్ సిలెండర్ గ్యాస్ వేయించుకొని సరిగ్గా ఇరవై కిలోమీటర్లు నడిపేటప్పటికే మా ప్రాణం పోతది. ఇటువంటి అవాంతరాల్ని దాటుకొంటూ మీరు చెప్పిన స్థలానికి ముట్టి మిమ్మల్ని దించాలి అంటే ఏమన్నా తమాషానా.. ఏ కాలంలో ఉన్నారండి. దిస్ ఈజ్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ బెంగళూర్.. పిచ్చిపిచ్చిగా నా తల తినకుండా 60 రూపాయలు ఇచ్చి వెళ్ళండి...'

ఆటో డ్రైవర్‌లోని మాటల తర్కానికి డకౌట్ అయిన హరీశ్ 'ఇదేంటయ్యా చదువుకొన్నోడి లాగ కనబడుతున్నావు. మరీ అంత జబర్దస్తీగా డబ్బు అడుగుతున్నావు కదా' అని అన్నాడు.

'సారూ... చదివింది తక్కువేమి కాదులే... పోస్ట్ గ్రాడ్యుయేట్‌ను. మీరు ఇలాగే ముందుకు చూసుకొంటూ దారిలో పోతుంటే తాపి పని చేసేటోళ్ళు, నాలుగు చక్రాల బండిని నెట్టుకొంటూ వ్యాపారం చేసేటోళ్ళు వీళ్ళంతా డబల్ గ్రాడ్యుయేట్స్ కనబడతారు. నన్ను విసిగించకుండా డబ్బులు ఇచ్చి వెళ్ళండి.'

హరీశ్ మౌనంగానే వంద రూపాయల నోటు తీసాడు. ఆటో డ్రైవర్ ఆ నోటు పట్టుకొని ఫట్, ఫట్‌నే చేతివేళ్ళతో ఆ నోటు మీద కొట్టి, జేబులో దాన్నుంచి, మిగిలిన

చిల్లర 40 రూపాయలను హరీశ్‌కు ఇచ్చి, సినిమా పాట పాడుకొంటూ భర్రుమంటూ ఆటోను నడిపించసాగాడు. ప్రొద్దున్నే మంచి ముఖాన్నే చూసానులే. ఎక్కువుగా అంటే 25 రూపాయలు కావొచ్చు. అయినా ఊరంతా తిప్పి ఎక్కడో దింపలేదు కదా... దొంగ రీడింగ్. ఒన్నండాఫ్ రేటు... గొర్రల్లాంటి పాసెంజర్లు. ఇవన్నీ లేకపోతే మా జీవనం ఎట్లా నడుస్తుది? ఇట్లా తన భావనా లహరిలో ఆటో డ్రైవర్ సురేశ్ కొట్టుకొని పోతున్నాడులే.

'అబ్బబ్బా! ఉదయం నుంచి నాలుగు నోట్లను మాత్రమే చలామణిలో పెట్టగలిగాను. తళతళలాడే లేటెస్ట్ నోటునుంచే (భారీగా) వాడ్ని బురుడీ కొట్టించాను గదా. సగానికి సగం ఎగరగొట్టానులే. యావరేజ్‌గా తీసుకొంటే నాదే పైచేయి. పిచ్చోడు ఆ ఆటోడ్రైవర్...'అని అనుకొంటూ హరీశ్ తన కురుచ గడ్డాన్ని చిన్నగా నిమురుకోసాగాడు.

ఆటోడ్రైవర్ సురేశ్ మేన్‌రోడ్డులో దూసుకు పోతున్నాడు. సిగ్నల్ పాయింట్ దగ్గరికి చేరుతుంటే ముందున్న వాహనాలన్నీ గ్రీన్‌సిగ్నల్ ఉండటం చేత సిగ్నల్ పాయింట్‌ను దాటుకొని వెళ్ళిపోతున్నవి. తన ఆటో పదిపదిహేను అడుగుల దూరంలో ఉండగానే ఎల్లో సిగ్నల్ లైటు పడింది. తన ముందున్న స్కూటర్‌లో గేర్లు పడక పోవటం, దానిని నడిపేటాయన వయస్సు మీద బడటం వలన గాబరాతో ఆ బండి ఇంజిన్ ఆపేసి రోడ్ పక్కకు నెట్టుకుంటూ నడిపించసాగాడు ఆ స్కూటర్‌ను. ఇది జరుగుతుండగా ఎల్లో లైట్ పోయి రెడ్‌లైట్ పడింది ఆ సిగ్నల్ స్తంభం నుంచి.

స్కూటరోడ్ని తిట్టుకొంటూ, సురేశ్ అటు – ఇటు చూసాడు. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పోలీసోడు లేడులే. ఎదురులో వున్న వాహనాలు భర్రు, భర్రు అనే ఇంజిన్‌ల మోతలతో దూసుకురావటానికి సిద్ధమైనవి. సాహసం చేస్తే అవి వచ్చేలోపే తాను సిగ్నల్స్ దాటి బయట పడొచ్చు. లేకపోతే రెండు నిమిషాలు ఈ ఎండలో రెడ్‌లైట్ మూలాన ఆగాల్సిందే. ఏమైనా పోలీసోడు లేడు కదా? ఆటోను విపరీత వేగంతో అటువైపునుంచి వచ్చే వాహనాల కన్నా ముందే సిగ్నల్‌ను దాటి బయటపడ్డాడు. కేవలం కొన్ని గజాల దూరంలోనే, తను వలలో పడ్డ కుందేలు అయ్యిందాన్ని తెలుసుకొన్న సురేశ్ 'ఇంగువను తిన్న మంగపతి' లాగ ముఖ భంగిమను బయటపెట్టాడు.

సాధారణంగా ఒక కానిస్టేబుల్ సిగ్నల్ దగ్గరుండి ట్రాఫిక్‌ను నిభాయిస్తాడు. ఎవరూ సిగ్నల్‌ను దాటి ముందుకు పోయే సాహసం చేయరు. ఎందుకంటే పోలీస్ యూనిఫార్మ్‌కు

నగరంలోని వాహనదారులు భలే గౌరవం ఇస్తారు. అయితే ఒక్కొక్కసారి ఈ పోలీసులే దొంగ – పోలీస్ ఆటను నడిపిస్తారు పట్టపగలే అందరెదురు.

ఒక యస్.ఐ ఇద్దరు కానిస్టేబుల్స్‌తో జత్తై సిగ్నల్ పాయింట్ నుంచి కొన్ని గజాల దూరంలో ఫుట్‌పాత్ చెట్ల చాటున నిలబడి (దాక్కొని) ఇట్లాగే సిగ్నల్‌లో జంఫ్ అయ్యేవాళ్ళను పట్టుకొంటారు. అపరాధం చేయకూడదు అనే మనోభావాన్ని వదిలి, అపరాధం చేస్తే ఏమైందిలే అనే మనోభావాన్ని వాహన యజమానులలో స్వల్పంగా పెంచి తమ వలలో వేసుకొనే తంత్రం అనేది ట్రాఫిక్ పోలీసోళ్ళకు లీలాజాలంగా అబ్బిన విద్య ఇది.

ఆటో ముందు చేతిని అడ్డంగా పెట్టి నిలబడిన కానిస్టేబిల్‌ను చూడగానే పంక్చరైన ట్యూబ్‌లాగ సప్ప ముఖం పెట్టుకొన్న సురేశ్ విధిలేక మెల్లగా ఆటో నిలిపి, తల వేలాడేసుకొని, ఆటోనుంచి క్రిందకు దిగి, తలను గీరుకోసాగాడు (గోక్కుంటున్నాడు).

యస్.ఐ. దగ్గర అప్పటికే నాలుగు గొర్రెలు నిలబడి ఉన్నవి. స్కూటర్‌వాలా, ఇంకొకడేమో మోటారు సైకిల్ తోలే కంప్యూటర్ పోరడు, మరొకతను కార్‌ను తోలే ఓనర్, ఇంకొకడేమో మినిలారి ట్రాన్స్‌పోర్టోడు.'ఒక అరగంట పట్టుతది ఇక్కడ్నుంచి బయట పడటానికి' అని సురేశ్ అనుకొంటూ యస్.ఐ.కు తనకూ సుమారు దూరం (అంతరం) ఉన్నదాన్ని గమనించాడు. అరగంట వెయిట్ చేసినా నూట ఏభై రూపాయలకు తక్కువ గాకుండా గుంజటం మానడు ఆ యస్.ఐ.సాబ్. రసీదు తీసుకొని జరిమానా కట్టితే ఏమి ప్రయోజనం అవుతది తనకు?

ఇట్లా ఆలోచించి సురేశ్ కానిస్టేబుల్ చేతిలో 50 రూపాయల నోటును ఎవరికీ తెల్వనట్లుగా కుక్కాడు. నోటును ఒకసారి, యస్.ఐ.సారును ఒకసారి చూసుకొని కానిస్టేబిల్ సురేశ్‌ను జారుకో అని కన్నుగొట్టి వదిలేసాడు. క్షణంలో ఆటోతో సురేశ్ అక్కడ్నుంచి పరార్.

'హమ్మయ్య... ఇప్పటికి మూడొందలు జమ అయినవి' అని అనుకొన్న కానిస్టేబుల్ రమేశ్ 'ఫీసును కట్టలేదు' అనే కారణంతో నిన్న కొడుకును కాన్వెంటోళ్ళు ఇంటికి పంపించింది, భార్యనుంచి వాచామగోచర అర్చనం తనకు దొరికింది, జీతం వచ్చేది ఇంకా పదిహేను రోజుల తర్వాతే అనే వాటిని గుర్తుకు తెచ్చుకొన్నాడు. 'ఏదో దేముడు

ఈ రకంగా తన సమస్యకు దారి చూపించాడు' అని మనస్సులోనే వెంకటరమణ దేముడికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు.

యస్.ఐ. గడియారాన్ని చూసుకొన్నాడు. ఈ రోజుకు ఇక్కడ డ్యూటీ ముగిసిందిలే. భోజనం చేసి ఇంకొక సిగ్నల్ పాయింట్ దగ్గర వల విసరాలి. ఎంత పోగైనవి? తన ముందు నించొన్న కానిస్టేబుల్స్‌ను ప్రశ్నించాడు యస్.ఐ. సారు. పళ్ళను ఇకిలించి తన ముందు స్యాల్యూట్‌తో నించొన్న వాళ్ళను చూస్తూ 'ఈ యస్.ఐ మహేశ్ ముందే దొంగబుద్ధిని చూపెట్టకండి. నువ్వెన్ని బండ్లను పట్టుకొంది, అతనెన్ని బండ్లను ఆపింది నా కంప్యూటర్ బ్రైన్‌లో ప్రింట్ అయ్యే ఉందిలే' అని అధికార దర్పంతో గదరించాడు.

కానిస్టేబుల్స్ ఇద్దరూ తాము సంపాదించిన ఐదొందలు మరియూ ఎనిమిది వందలను యస్.ఐ.ముందు కుమ్మరించారు. యస్.ఐ ఇద్దరికీ మూడొందలు చొప్పున ఇచ్చి మిగిలిన ఏడు వందల్ని తన జేబులోని పర్స్‌లో దాగియున్న నోట్ల ప్రక్కన ఈ రోజు కొత్త సంపాదనను జమచేసాడు.

'సార్.... ఇంకొక వంద' చేయి చాచిన కానిస్టేబిల్ రమేశ్ మెలికలు తిరుగుతూ తన తోటి కానిస్టేబుల్‌తో స్వరం కలిపాడు.

ఎందుకు వంద? పై వాళ్లకు నేనేమి పంచాలి? టైమ్, టైమ్‌కు ఇంక్రిమెంట్, ప్రమోషన్ వద్దా మీకు? నీళ్ళు, నీడ ఉండే జాగ వద్దా? అంటూ ముఖాన్ని మాడ్చుకొని 'తీసుకొని చావండి' అంటూ ఇద్దరికీ చెరొక ఏభైను పంచాడు యస్.ఐ. అయిన మహేశ్.

కానిస్టేబుల్స్ ఇద్దరూ దానికే తృప్తిపడినోళ్ళలాగ నవ్వినా, మనస్సులో 'అక్కడ డైరెక్ట్‌గా డబ్బును పొందుతాడు.. జతగా మా సంపాదనలో కూడా పీకుతాడు. పైవాళ్ళు, పైవాళ్ళు అంటూ అంతా తనే బొక్కుతాడు' అని అనుకొన్నారు.

ప్రస్తుతానికి ఈ సంపాదన నుంచే ఆ పైవాళ్ళకు వాళ్ళ వాటాను పంపి, మిగిలినదాన్ని ఆమె ముందు ఉంచాలి. అన్నీ ఇన్‌స్టాల్‌మెంట్ వ్యవహారం చేసుకొని వస్తది. చివరికి నా ప్రాణం పిండుతది అనుకొన్నాడు యస్.ఐ. మహేశ్.

"రేపే ఆ బంగారపు షాపోడికి ఈ నెల వాయిదా మొత్తం రెండువేలు కట్టాలి. లేకపోతే ఈ నెక్లెస్‌ను వాపస్సై పోగొట్టుకోవాల్సిందే. ఈ నెక్లెస్ వాపస్సు అయ్యిందంటే

నా ప్రాణం పోవటం కూడా దానితోనే ముడిపడి ఉంది. ఈ రోజు సాయంత్రానికి రెండువేలు తీసుకురాకుండా వస్తే మీ ముఖాన్ని చూసేది లేదులే?" అని గట్టిగా హుకుంను జారి చేసింది మహేశ్‌తో అతని భార్య మరియు ఎమ్.ఎల్.ఎ.కు కూతురైన చారుశీల.

'దేముడు గొప్పోడు! భార్యముందు పోయే మానాన్ని ఎట్లాగో కాపాడాడు' అని అనుకొంటూ మహేశ్ యూనిఫార్మ్‌ను మార్చుకొని మోటారు సైకిల్ స్టార్టు చేసి సాయంత్రానికి ఇంటిముఖం పట్టాడు. మల్లేశ్వరంకు చేరుతుండగా పిల్లలు గుర్తుకు వచ్చి వాళ్ళకు స్వీట్స్‌ను తీసుకెళ్ళాలి అని బండిని రోడ్‌పక్కన పార్క్‌చేసి షాపులోనికి వెళ్ళాడు. స్వీట్‌షాప్‌లో అవసరమైన రకాల్ని ఖరీదించి డబ్బులు కట్టడానికి జేబులో చెయ్యి పెట్టాడు. డబ్బులుంచిన నిండు పర్స్ చేతికి దొరకక మాయమైంది. దగ్గర దగ్గర నాలుగువేలు దానిలో ఉన్నవి. పొద్దుటినుంచి సాయంత్రం వరకూ ఎండలో ఎండి, వాళ్ళను వీళ్ళను దభాయించి, టోపీవేసి, చెమటోడ్చి సంపాదించిన పెద్ద మూట అతని దేహం నుంచి విడిపించుకొని మాయమైంది కదా!

రోడ్డు అంచుల్లో, విపరీత జనసందడిలో జేబుల్ని కత్తిరించే వృత్తికి కొత్తగా దిగిన కల్లేశన్నకు యస్.ఐ. మహేశ్ జేబులో ఉన్న లక్ష్మి కటాక్షించింది. నిర్జన స్తలానికి చేరి పర్స్ నుంచి డబ్బు తీసి పర్స్‌ను పూర్తిగా దులిపి, దాన్ని విసిరేసి, డబ్బును మరొకసారి లెక్కపెట్టుకొని, ఖుషీతో జేబుకు చేర్చుకొన్నాడు భద్రంగా. కడుపు నిండా తిని మూడురోజులైంది. ఎవరి జేబును కత్తిరించినా వట్టిగా చిల్లరే దొరికింది. ఈ రోజు పొద్దున్నే నక్కముఖాన్నేమన్నా చూచానేమో.... జాక్‌పాటే దొరికిందిలే అని అనుకోసాగాడు మన కల్లేశన్న.

మొదలు నా రాణికి బంగారపు ఉంగరాన్ని తొడిగించాలి. 'ఉంగరం లేకుండా ఊరికే నా ముందు డప్పు గొట్టమాకు' అని చీదరించింది కదా! ఈ జేబులు కత్తిరించే వృత్తి పొట్టకు మూడు ముద్దల్ని నింపేదానికే చేత గాకుండా ఉంది. ఇంకా నా రాణి కలలుగనే బంగారపు ఉంగరాన్ని తేవడం సాధ్యమవుతదా తనకి? చివరికి నా రాణి ఆశెను తీర్చే అవకాశాన్ని ఆ దేముడే కల్పించాడులే? ఆయనెంత దయామయుడు అని మనస్సులోనే దేముడికి వందనాలు చెప్పుకొంటూ కల్లేశన్న హీరోలాగ ఠీవిగా అడుగులు వేయసాగాడు. ఎవరెవరినో తన వలలో గొఱ్రెలు లాగ (చేపలు లాగ) చేసుకొన్న యస్.ఐ. సాబ్ కల్లేశన్న పాలికి తనే వలలో చిక్కి చేపలాగ అయ్యాడు కదా. ప్రస్తుతానికి దేముడు ఎప్పుడూ గొప్పోడే.

దారి అంచున ఫుట్‌పాత్ బండిలో అప్పుడే తయారైన వేడివేడి బిరియాని, జతగా చికెన్ కబాబ్‌లను కొరుకుతూ తిని, త్రేపుతో లేచేటప్పటికి కల్లేశన్నకు రాత్రి తొమ్మిది గంటలైంది. జేబును ఒకసారి తడుముకొని, భద్రంగా డబ్బు ఉందిలే అనేదాన్ని మరొకసారి రుజువుచేసికొని తన రాణి ముందు తను హీరో అయ్యేదాన్ని గుర్తుకు తెచ్చుకొంటూ ఇంటికి అడుగులు వేయసాగాడు.

సరిగ్గా మేన్‌రోడ్‌లో వెళ్తే అరగంట పడుతది. అడ్డదారిలో ఎడం పక్కనున్న లేఔట్ జాగా కాంపౌండ్ గోడను ఎక్కి దూకి కాలుదారిలో వెళ్తే  పది నిమిషాలలో ఇంటికి చేరుకోవచ్చు. డబ్బేమో భారీగా దొరకటం వలన అతని పొట్టకు సుష్టుగా తిండి చేరింది. ఎక్కువగా నడవటానికి మనస్సు ఒప్పుకోకపోవటంచేత, అడ్డదారినుంచే బస్తీకి (ఇంటికి) చేరాలి అని  రాతి గోడను ఎక్కి దూకాడు కల్లేశన్న. అక్కడేమో దారిదోపిడిగాడైన తిమ్మేశ్ విసిరిన వలలో పెద్ద చేపలాగ పడ్డాడు మన కల్లేశన్న.

నిర్జనమైన ఆ లేఔట్ దారిలో తిమ్మేశ్ పదునైన చాకు పట్టుకొని చెట్లచాటున దాక్కొని, ఆ రాత్రి వేళలో  కాచుకొని ఉన్నాడు. రాతిగోడను దూకి క్రిందపడ్డ కల్లేశన్న గొంతుకు చాకును అడ్డంగా పెట్టాడు. అరవటానికి నోరు తెరిచిన కల్లేశన్న నెత్తిమీద పిడిగుద్దులు కురిపించి, కపాల మోక్షం గావించాడు తిమ్మేశ్. తల తిరిగి, కళ్లు బైర్లు కమ్మి ఇంకా లేవటానికి ప్రయత్నిస్తున్న కల్లేశన్న పొట్టకు మోచేతితో బ్రూస్‌లీ లాగ గుద్ది జాకీచాన్ స్టైలుతో మొణకాలును వంచి రభసంగా గాడిద తన్నినట్లుగా తన్నాడు తిమ్మేశ్!

'అమ్మా....' అంటూ కల్లేశన్న స్పృహతప్పి నేలలో భాగమయ్యాడు. ఇక ప్రతి రోధం లేదులే అని రుజువు పరచుకొని తిమ్మేశ్ కల్లేశన్న జేబులోని డబ్బు, చేతివాచు, మరియు కూలింగ్ గ్లాసుతో అన్నిటిని అతడినుంచి దోచుకున్నాడు.

సామ్రాజ్యాన్ని గెలిచిన క్షత్రియ యోధుడిలాగ దర్పంతో అడుగులు వేస్తూ తిమ్మేశ్ సారాయి అంగడిలోకి ప్రవేశించాడు. కళ్ళకు దోచుకొన్న కూలింగ్ గ్లాస్‌ను పెట్టుకోవటం (అర్ధరాత్రిలో సిరిని చూచిన భిక్షకుడు తన భిక్షాపాత్రనే గొడుగులాగ తల రక్షణకు పెట్టుకొన్నట్లుగా) ఆ రాత్రి 11-30 గంటల ఆ వేళలో తన గొప్పదనాన్ని తనే చాటు కొంటున్నాడు మన తిమ్మేశ్.

సారాయి అంగడి యజమాని తిమ్మేశ్‌ను కుతూహలం మరియు ఆశ్చర్యంతో చూసాడు. నిన్న తిమ్మేశ్‌తో సారాయి బాకి మొత్తం అధికం అయ్యిందని సారాయి ప్యాకెట్లను

ఇవ్వకుండా అంగడినుంచి బయటికి నెట్టించాడు. ఇప్పుడు ఇట్లా దర్పంతో వస్తున్నాడు తిమ్మేశ్ అంటే ఏదో మతలబు ఉండొచ్చేమో అని అనుకొన్నాడు ఆ అంగడి యజమాని.

సారాయి దుకాణం యజమాని ముందే ఒకట్రెండు క్షణాలు నిలిచి తిమ్మేశ్ అతడ్ని కోపంతో చూసి, జేబులోంచి నోట్లను తీసి, అతని ముఖం మీద విసిరి “నాకు పుణ్యానికి తిని తాగడం అలవాటు లేదులే. పాత లెక్కను పూర్తిగా చుక్తా చేసుకొని, మిగిలిన దాన్ని బక్షీసుగా ఉంచేసుకో” అంటూ మొరటు మాటల్ని ప్రయోగిస్తూ ఒక మూలకు చేరి గటగటనే సారా త్రాగాడు.

నిషా పైకెక్కి సారాయిఅంగడినుంచి తూలుకుంటూ బయటపడిన తిమ్మేశ్ అడ్డదిడ్డంగా అడుగులు వేస్తూ ఎక్కడో ఒకచోట కుప్పకూలాడు.

ముంజాములో మలవిసర్జనానికని బయలుకు సరైన జాగాన్ని వెతుక్కొంటూ బయల్దేరిన హరీశ్ తలలో ఆలోచనల పురుగులు గుంయ్ మని శబ్దం చేయసాగాయి. నూరు దొంగనోట్లకు ఏభై అసలు నోట్లను ఇవ్వాల్సిందే. ఇప్పుడు జేబులో 42 అసలు నోట్లు, ఎనిమిది దొంగనోట్లు ఉన్నవి. ఒక పైసా ఖర్చుగాకుండా ఎనిమిది దొంగనోట్లు, ఎనిమిది అసలు నోట్లుగా మారాలి. ఏభై అసలు నోట్లకు ఒక్కటి తగ్గినా అతను ఒప్పుకోడు. ఈ రోజు ఉదయం పదిగంటలకు సరిగ్గా డబ్బును జమచేసి ఇవ్వాలి. టైమ్ తప్పిపోతే వచ్చేనెల ఈ రోజు ఉదయం పదిగంటల వరకు ఎదురు చూడాల్సిందే. ఆగాల్సిందే. అప్పటిదాకా జీవనం? దేముడా నువ్వే కాపాడాలి అంటూ ఆలోచనలలో మునిగిపోయాడు హరీశ్.

తెల్లవారే జాము చీకటిలో, కాలికి ఏదో తగిలి పట్టుతప్పి పడేదాన్ని నిభాయించుకొని, హరీశ్ గట్టిగా నేలమీద చూస్తే భారీ శరీరంతో ఉన్న ఒకడు స్పృహ లేకుండా శవంలాగ పడియుండటం కన్పించింది. అతను వేరే ఎవడో కాదు. నిన్నరాత్రి భారీగా దోపిడీ చేసి, కంఠపూర్తి సారాయిని తాగిన తిమ్మేశే అతను.

“థూత్... దరిద్రపోడు? ఎక్కడో ఒకచోట గుట్టుగా కూర్చొని మల విసర్జనంను ముగించుకొందామంటే, దానికీ సహకరించేది లేదు ఈ త్రాగుబోతు నా కొడుకులు” అంటూ మలవిసర్జన బాధను ఆపుకోలేక వేరొక దిక్కుకు తిరగాలి అని అనుకొనే లోపు హరీశ్ కళ్ళకు తిమ్మేశ్ జేబులోని పర్స్ సగభాగం బయటికి కనబడింది.

ఆలశ్యం చేయకుండా ఆ పర్స్‌ను తెరిచి  చూచిన హరీశ్‌కు సరిగ్గా వందరూపాయలనోట్లు ఎనిమిది కనబడినవి. క్షణాలలోనే తన దగ్గరున్న ఎనిమిది నకిలీనోట్లు తిమ్మేశ్‌కు, తిమ్మేశ్‌డి అసలీ ఎనిమిది నోట్లు అతని దగ్గరకు అదలు బదలు అయినవి. పర్స్‌ను జాగ్రత్తగా తిమ్మేశ్ జేబులోనే భద్రపరచటమైంది. తిమ్మేశ్  లేచే లోపే హరీశ్ తన మలవిసర్జన మహత్ కార్యాన్ని  ముగించుకొని  అక్కడినుంచి జారుకొన్నాడు. సమయానికి సరిగ్గా 50 అసలు నోట్లను ఒదిగించిన భగవంతుడ్ని మనసా స్మరించుకొంటూ నూరు నకిలీనోట్లను పొందటానికి గుర్తైన స్థలానికి చేరే సిద్ధతలలో మునిగిపోయాడు హరీశ్.

❀ ❀ ❀

('ఒందు సణ్ణ కళ్ళర వర్తుల' అనే పేరుతో కన్నడంలో ఈ కథను రచించిన వారు వెంకటేశ్ ప్రభు టి.కె. దీన్ని తెలుగులోకి అనువాదం చేసాను. కన్నడప్రభ 09/04/06న ఈ కథను తన పాఠకులకని ప్రచురించినది.)

1) హరీశ్ : దొంగనోట్లను మార్చేవాడు.

2) సురేశ్ : ఆటోడ్రైవర్

3) రమేశ్ : పోలీస్ కానిస్టేబుల్

4) మహేశ్ : ఎస్.ఐ

5)  కల్లేశ్ : జేబులు కొట్టేవాడు

6)  తిమ్మేశ్ : దారిదోపిడిగాడు

7) చారుశీల : ఐస్.ఐ. భార్య

08-08-2008

శాఖమూరు రామగోపాల్

# సమీపంలోని దేవాలయం

దారిలో పోతున్న వాళ్ళకు ఆ చిన్న పెంకుటిల్లును చూస్తే కరుణా భావం పొంగి పొర్లుతుండేది. ఆ ఇంటిలో 22 సంవత్సరాల శంకరం ఉంటాడు. పోయిన రెండు నెలల్నించి శంకరాన్ని బిగి ముష్టిలో బిగించుకొన్న ఆ మాయరోగాన్ని చూసిన 50 సంవత్సరాల మీదబడిన ఆదెమ్మ అందరికంటే ఎక్కువగా దిగ్భ్రమం చెందింది. శంకరం అనారోగ్యం గురించి ఊరంతా తెలిసి, వీరు ఉండే ఇల్లు భయాన్ని కలిగించే గుహలాగ అందరూ భావించసాగారు.

నగరంలోని ప్రైవేట్ కంపెనీలో ఏదో ఉద్యోగం చేస్తున్న శంకరంకు అక్క అయిన శైలజ పొద్దు పొద్దున్నే ఇంటికి రావటం, చిన్న బోయిన ఆమె ముఖంను చూచిన తల్లైన ఆదెమ్మకు ఆశ్చర్యం ఏమీ కాలేదు. ఇంటికి వచ్చిన ప్రతిసారి గోరంత సమస్యను కొండంతగా చేసుకొని రాలేదు అంటే ఆమె శైలజే కాదు అనేది ఆదెమ్మ అభిప్రాయం. ఇంటి ముందు ఖాళి స్థలానికి తీగైనా వేయించటానికి డబ్బులు లేని తండ్రితో ఏదో విషయంలో తగాదాపడి, స్నేహితురాలి సహాయంతో డిగ్రీ ముగించేలోపలే పార్ట్ టైమ్ జాబ్ చేసి తన కాళ్ళ మీద తనే నిలిచిన స్వభావం ఆమెది.

రెండు నెలలనుంచి ఈ ఇంటికి వచ్చేవారి ముఖాలలో ఖుషీతో ఉన్నదాన్ని చూడని ఆదెమ్మకు అదే రూఢిగా అయ్యింది. తనలో ఇటువంటి రోగాన్ని విధి వికారచాయతో ఎత్తుకొని కూర్చుండటం, అదెంత దురదృష్ట గడియలో అనేది స్వతహాగా శంకరానికి సరిగా తెల్వదు. అతని జ్ఞాపకం ప్రకారం కాలేజిలో మొదటి సంవత్సరంలో ఎన్.సి.సి క్యాంప్‌కని తమిళునాడుకు వెళ్ళినప్పుడు, అక్కడ గడిపిన ఒక నెలలో అక్కడి వాతావరణం అతనికి పడకపోవటం వలన, ఎనిమిది రోజులు జ్వరంతో బెడ్‌మీదే ఉండిపోయాడు. ఆసుపత్రిలో చూపించటం, పర స్థలంలో ఉపాయం లేకుండా పొందిన చికిత్స, ప్రవాసి స్థలం అవ్వటం చేత అక్కడున్న నకిలీ వైద్యులు రోగులందరికి ఒకే ఒక సిరెంజితో చికిత్స, ఇట్లా ఎవరో చేసిన పాపానికి తనకి సంక్రమించిన ఈ ఘోర రోగం రాత్రి గడిచి సూర్యోదయమైతే అంత అబద్దమే తనకీరోగం అని శంకరం నూరారు సార్లు దేముడికి మొత్తుకునేవాడు.

డాక్టరు కళ్ళు చిన్నవిగా చేసుకొని సహజంగా అడిగిన మొదటి ప్రశ్నే "డ్రగ్స్ గిగ్స్ అభ్యాసం ఉందా? ఉంటే తెలుస్తదిలే మాకు! ఛీ.... ఈ ఒక్క మాయా జాలానికి మాత్రమే నిరపరాధులకు శిక్ష అనేది ఇదెక్కడి న్యాయం? సదా! మన జాగ్రత్తలలో మనం ఉండాలి" అన్నాడు డాక్టరు. బాధ; దుఃఖం; సంకటం, నుంచొన్న నేలే మింగుతున్నట్లుగా అన్పించింది శంకరానికి. ఈ రోగం గురించి చెప్పాలా? మంటలకు గాలి తోడైనట్లు అందరి నోళ్ళలో శంకరంకు వచ్చిన రోగమే సుద్ది అయ్యింది. ముందొక మాట, వెనకాల మరొక వెక్కిరింపు.

కరెంట్ ఆఫీసులో సర్వీస్‌లో ఉండగానే ఆకస్మికంగా మూడు సంవత్సరాల క్రితం చనిపోయిన తండ్రి నౌకరి బి.ఎ. చదివిన శంకరంకు ఇంకేంటి వెళ్ళి జాయిన్ అవ్వటంమే బాకి అనుకొనేటప్పుడు ఈ మాయరోగం ఒక గ్రహణంలా ద్వారానికి అడ్డు నిలిచి, శంకరాన్ని నిలపటం, దానిచేత ఆదెమ్మ ఎంతో కుంగిపోసాగింది.

అప్పుడే వచ్చిన శైలజ తేలిక అడుగులతో శంకరం మంచం దగ్గరికి వెళ్ళి ఒక క్షణం గడిపి, బ్యాగును విసిరేసి, ఓణి సరిచేసుకొంటూ అక్కడున్న ప్లాస్టిక్ కుర్చీలో 'ఉస్' అంటూ కూర్చొంది. శైలు వెనుకే వచ్చిన ఆదెమ్మ "పడుకొనే ఉన్నాడేమో, ఇంతకు ముందే బాత్రూమ్‌కు వెళ్ళాడు" అంటున్న తల్లి చిన్న ధ్వనికి మేల్కొన్న శంకరం తలను పైకెత్తి చూస్తూ "అరెరె! అక్క!" అంటూ చిన్న నవ్వుతో నిధానంగా మంచం నుంచి లేచాడు. బాత్రూమ్‌లో కాళ్ళు తడవటం చేత కొంచెం ఎక్కువ చలి అన్పించటంతో రగ్గు కప్పుకోవటం, దాన్ని తీసి, మడిచి, కూర్చొని మరొకసారి అక్కను చూచి కొద్దిగా నవ్వాడు. అక్కనుంచి నవ్వు రాకపోయినా అతను చిన్న బుచ్చుకోలేదు. తన ఈ స్థితికి తన కన్నా ఎక్కువ బాధను దిగమింగుకొన్నవారు అక్క మరియు అమ్మే కదా! శైలజ తలదించుకొనే ఎంతోసేపు అలాగే ఆ కుర్చీలోనే ఉండిపోయింది. ఇవాళో, రేపో అంటూ రోజులు లెక్కపెడ్తున్న అతను "బయట నేను పెంచిన మొక్కల్ని చూసావా? నువ్వు పోయినసారి వచ్చినపుడు ఎట్లా ఉన్నవి, ఇప్పుడు ఎట్లా ఉన్నవి. ఎటువంటి పూల మొక్కల్ని పెంచానో చూడు" అంటూ గర్వంగా చెప్పసాగాడు. "ఆ.... సరేలే" అంతే అని కూర్చుంది శైలజ.

"అక్కకు ఏదో ఒక ముఖ్యమైన విషయాన్ని నాతో చెప్పాలి. అందుకే ఈ రకమైన గాంభీర్యం"అని అన్పించింది శంకరానికి. "దేముడా ఇది ఈమె వివాహానికి సంబంధించింది అనేది కాకపోతే బాగుండు" అని మనస్సులో అనుకొన్నాడు. ఐతే శైలూ నిగూఢ మౌనం ఇంకా ఎక్కువ సమయం తీసుకోవటం శంకరానికి ఒక రీతిగా హింసే అని అన్పించసాగింది. అట్లా సమయం జారుతుంటే కషాయం (ఆయుర్వేదం) చేసి

బయటికి వచ్చిన ఆదెమ్మ అక్క – తమ్ముడి చేతులలో చెరొక కప్పు ఇస్తూ "ఏమ్మా... సెలవుపెట్టి వచ్చావా" అంటూనే మళ్ళీలోనికి వెళ్ళింది. ఆమె అడిగినా శైలు మరు మాట్లాడలేదు. తాగుతున్న శంకర్ మంచం మీద ఇంకొక పక్కకు వచ్చి కూర్చుంటుంటే చేతిలో ఉన్న కప్పు ఒలికి గుండెల మీద కొన్ని చుక్కలు పడటం వలన "అమ్మా"... అని అనటం, ఆ బాధతో కూడిన మాటలకు ఆదెమ్మ గాబరాతో "అదేంటి చిన్న పిల్లోడిలాగ, నిధానంగా తాగు వేడిగా ఉంది" అని చిరుకోపంతో శంకరాన్ని గదిరింది. ఆదెమ్మ నుంచి ఇటువంటి ప్రేమ శంకరానికి తృప్తిని ఇచ్చేది. ఇంకా శిలలాగానే కూర్చున్న శైలును చూసి ఆదెమ్మ గంభీరమైన విషయం ఏదో నడిచే ఉంటది అని భయపడసాగింది. ఆదెమ్మ ఇచ్చిన కషాయాన్ని గటగటా ఒకేసారి తాగి ఖాళి గ్లాసును టీపాయి మీద ఉంచి లోనికి వెళ్ళింది శైలజ. కషాయం తాగినా హుషారు కాలేదు అన్న కొడుకును, కళ్ళు చిన్నవి చేసుకొని ప్రేమతో చూస్తూ ఖాళీ గ్లాసును తీసుకొని కూతురు వెనకాలే వెళ్ళింది ఆదెమ్మ.

ఒకే తల్లి బిడ్డలమైన మేము నిజంగా చెప్పాలి అంటే ఆమె రాక నాకు హితాన్ని ధైర్యాన్ని నింపాలి. తనకున్న ఇంత పరిస్థితిలో, కొద్దిగానైనా ప్రేమను, ప్రీతిని, వాత్సల్యాన్ని చూపని అక్క స్వభావం శంకరానికి ఒక క్షణం అసహనాన్ని కలిగించింది. 'ఆకాశం నుంచి జాలువారి తన తల మీద పడుతవేమో' అని అక్కడున్న నక్షత్రాల్ని లెక్కేసుకొంటూ కూర్చోవాలి నేను అంతేకదా... తనలో తనే గొణుక్కుంటూ "ఆదెమ్మా నేనిప్పుడు ఆసుపత్రికి వెళ్తున్నాను" అని పెద్ద స్వరంతో అక్కకూ విన్పించేటట్లుగా చెప్పాడు.

"చాయ్‌ని చేయటం మరిచిపోయినట్లైంది. శంకరం కోసం కషాయం చేయటం నాకు దాని మీద ఇష్టం అవ్వటం చేత, నీకేమైనా చాయ్ కావాలా శైలూ?" అని అడిగిన ఆదెమ్మకు కూతురు బ్యాగునుంచి బట్టలుతీసి వద్దులే అని తలాడించింది గర్తైంది ఆదెమ్మకు. శంకరం కాలి చెప్పుల సవ్వడికి ఆదెమ్మ బయటికి వచ్చి, 'నిధానంగా పోయిరా.... ఆలశ్యం చెయ్యొద్దు' అని చెప్పి మరలా కూతురి దగ్గరకు వచ్చింది. పెరిగిన మొక్కల ఆకుల్ని నిమురుతూ శంకరం గేటు తీసి బయటికి వెళ్ళాడు.

ఇంతకు ముందు బయటికి వెళ్తుంటే దారిలో కనిపించిన వాళ్ళు ఏదో ఒక రకంగా చూసినట్లు, ఏదో ఒక తరహాలో మాట్లాడించినట్లుగా, ఏమిటేమిటో అడిగినట్లుగా రగలిపోతుండేది అతని మనస్సు. ఇప్పుడు స్నేహితులతో మనస్సు విప్పి మాటల కబుర్లతో

నెమ్మది పొందే స్వభావాన్ని అలవర్చుకొన్నాడు. ఆసుపత్రిలో డాక్టరు పరీక్ష చేస్తూ "చిన్న చిన్న సమస్యలు రాకుండా చూసుకో. మందుల్లేని రోగం ఇది. నీకు రావటం ఒక దురదృష్టం. నీవేమి పెద్దగా ఆలోచించుకోకు, నీకేమి కాదు" అంటూ పోయినసారి చెప్పిన దాన్నే మళ్ళీ చెప్పి ఇంజెక్షన్ ఇచ్చి "కొంత సమయం కూర్చొని వెళ్ళు" అని వైద్యం చేసాడు డాక్టర్. ఆ గవర్నమెంట్ హాస్పిటల్ పక్కనే ఉన్న ఎస్.టి.డి బూత్ ఓనరైన సమీర తనకు బాల్య స్నేహితుడు అవటం వలన కొంచం సేపు అక్కడే గడిపాడు.

"ఆదెమ్మ ఆరామంగా ఉన్నారా.... నీకన్నా ఆమెకే ఎక్కువ కష్టం మహారాజా" అన్న సమీరకు "నీ లాంటి స్నేహితులు ఉండగా నాకేంటి కష్టం" అని అన్నాడు శంకరం. శంకరం తలని నిమిరుతూ సమీర మాటలు లేకుండానే కొంతసేపు స్టూల్ వేయించి కూర్చోబెట్టుకొన్నాడు. ఏమైనా మాట్లాడాలి అని కలిగిన శంకరం మా అమ్మకు "ఆదెమ్మ అని పేరు పెట్టింది నేనే. ఈ సంగతి నీ దగ్గర ఇంతకు మునుపు చెప్పానో లేదో" అని అడిగాడు. "నా మూడో సంవత్సరం వయసులో మాటలు వచ్చేటప్పుడు రాధమ్మ అనే పేరును నాయన పిలిచినట్లే రాధా అనే పలికే విధానాన్ని ఆదా అని పలకటం చేత ఆదెమ్మ అప్పుడు అయ్యిందట. నాకైతే ఆదా... ఆదెమ్మ అని పిలిస్తేనే భలే ఇష్టంగా ఉంటది" అని అంటుంటే సమీర "నేను పేరును గురించి అడుగుదాము అనే అనుకొనేవాడ్ని" అంటూ భోళాగా నవ్వాడు. "ఇంటిలో భలే టైంపాస్ ఇప్పుడు నాకు. ఇంటిలో గ్యారేజ్‌కని వదిలిన జాగాలో మొక్కల్ని నాటాను. ఎట్లా ఉన్నవి అని అడిగితే, నువ్వే చూడాలి వాటి సొగసుల్ని" అంటూ పోవటానికి నించొన్న శంకరంను "ఆ... ఆ.. సాయంత్రం వస్తాను" అని ఇంకొకసారి వీపు తట్టి పంపించాడు సమీర.

ఇంటిలో ఇంకా బిగుసుకొనే ఉన్న కూతుర్ని ఉద్దేశించి "శంకరంలోని రోగం నాకు రావాల్సింది. నేను ఏదో ఒక రోజు ఈ లోకం విడవాల్సిందే కదా. ఏమి చూడని, అనుభవించని కొడుకుకు దేముడు ఇంత అన్యాయం ఎందులకు చేసాడో" అని చిన్నగా మాట్లాడుతుంటే నోరు తెరిచిన శైలజ "పని వదిలేసా... ఇంకేమి లేదు" అంటూ హాస్టల్ నుంచి తెచ్చిన మూడు నాలుగు జతల విడిచిన బట్టల్ని బకెట్‌లో పడేసింది. "ఓహో! దానికా ఇట్లా ఉన్నావు. పని వదిలేసింది దేనికి?" అంటూ భయంతో అడిగిన ఆదెమ్మ మీద రేగిపోతూ "ఎందుకు? ఏమిటి? ఎక్కడ? అంటూ చెప్పితే నన్నే తినేసేటట్లుగా చూస్తావు నువ్వు. మా ఆఫీసులో ఎట్లాగో శంకరం విషయం తెలిసి వివరాల్ని నా దగ్గర

నుంచి పొందటం, నానా రకాల మాటలతో నన్ను గుచ్చటం, ఓహో! అబ్బబ్బా! ఆ మాటల్ని విని వినీ అల్లాడిపోయాను"

కూతురి నోటినుంచి వచ్చిన ఈ మాటల తూటాలకు ఆదెమ్మ హృదయమే చీలినంతగా ముక్కలు ముక్కలైపోయింది. నడుం వంచి ఏమో పనిలో ఉన్నామె దడాల్నే నిలబడి "ఏమిటీ మాటలు శైలజా... శంకరానికి తెలిస్తే నొచ్చుకోడా! నువ్వే వాళ్ళకు నచ్చ చెప్పాల్సింది. నా తమ్ముడు మంచోడు... నీ మూటేం పోయేది" ఆదెమ్మ ఏడుస్తూ అంటే శైలజ ఇంకాస్త ఆవేశంతో "నీ కొడుక్కి ఏమీ తెల్వదు. నోటిలో వేళ్ళు పెట్టినా చీకటం కూడా రాదు" అంటూ మండిపడింది. "అయ్యో నోరు మూసుకో అంతా ముగిసిపోయింది. నీ తమ్ముడి మీద నీకు నమ్మకమే లేదు" అని ఆదెమ్మ పెద్ద గొంతుతో అనటం "నేనెందుకు అలాగ అంటున్నాను? వాళ్ళంతా అట్లా అంటూ అంటూ నాప్రాణాల్ని తోడేసారు అనే అన్నాను కదా! ఐతే నీ కొడుకుకు అది ఎట్లా వచ్చింది? ఎక్కడ్నుంచి అంటింది? అని ఒక్కసారైనా విచారించావా నువ్వు? నోరు తెరిస్తే బిడ్డడు, బిడ్డడు అని తలమీద పెట్టుకొని తిరుగుతావు" అంటున్న కూతురి మాటల్ని విన్న ఆదెమ్మ దేహంలో శక్తే ఉడిగిపోయింది అన్నట్లుగా బట్టతో రూమ్ శుభ్రం చేస్తున్న ఆమె అక్కడే చతికిలబడింది. "నువ్వు అడిగే ప్రశ్నేనా ఇది? ఎవరో పరాయి వాళ్ళలాగ కాకుండా రక్తం పంచుకొని పుట్టినోళ్ళు మీరు. తమ్ముడు అనే మమకారాన్ని వదిలేసింది నువ్వు ఎప్పట్నించి? ఇంత విపత్కర పరిస్థితిలో తమ్ముడి మీద మమకారం లేదంటే, ఎందుకే అందరినుంచి దూరం చేసి వాడ్ని ఒంటరోడ్ని చేస్తారు మీరందరూ....జరగకూడనిది జరిగింది కదా! ఎట్లా అంటింది, ఎందుకంటింది, చెప్పు... చెప్పు... అంటూ అతని జీవం పిండితే, ఎంత రాక్షసగుణం అబ్బింది అమ్మా నీకు" అంటూ ఆదెమ్మ కొడుకును దూరం చేసుకోటం మనస్సు ఒప్పుకోక దుఃఖించసాగింది.

కూతురికి ఇష్టం అని మసాలాతో అన్నానికి పోపుపెట్టి, ఎంతో కోపాన్ని అదిమి పెట్టుకొని వేరే ఏదో పని చేయసాగింది ఆదెమ్మ. శైలూ ముఖం ఇంకా కఠినంగా ఉండటం వలన ఆదెమ్మకు ఏమేమో అయ్యింది. "అయ్యో భగవంతుడా.... ఎవరు ఏమన్నా అనుకోనీ ఈమె (కూతురు) మాత్రం ఈ రకంగా మాట్లాడకూడదు. నేను అతని తల్లిని. ఏ రోజూ ఎవ్వర్ని నొప్పించని మనస్సు వాడిది. ఛీ... ఛీ... ఎంత నసీబు అతనిది. అతనిదేమి తప్పుంది దీంట్లో. ఆ పాడు సిరంజి నుంచి వచ్చిందట. అబ్బా! ఈ మాటల్ని ఎన్ని వందలసార్లు ఎవరెవరితోనో చెప్పాను గదా... వాడ్ని నా ఒడిలో నుంచి దించిన దాన్ని

కాదాయె. హుం... హుం. ఎవరికో చెప్పినట్లుగా కొడుకు రోగం గురించి స్వంత కూతురు దగ్గరే సరైన సాక్ష్యంతో చెప్పాలా? హుం... ఈమెకు ఎప్పుడూ తనదే స్వార్థం. "అయ్యో... నవమాసాలు మోసి, పెంచి, సాకిన కొడుకు ఇట్లా కళ్ళముందే లేత జీవం విలవిలలాడుతుంటే, తల్లి – కూతురు అయిన మే మిద్దరం ఇక్కడ జీవంతో ఉన్నాం కదా! నేను, శంకరం... పోయిన తర్వాత శైలూ దుఖించనీ" ఇంకేమైన అందాము అని ఆదెమ్మ అనుకోటం, కూతురు మూర్ఖత్వాన్ని తెలుసుకొన్న తల్లి శైలు ఉన్న వైపుకు తిరగకే గొంతులో ఉబ్బికొని వస్తున్న మాటల్ని మెల్లగా మింగసాగింది. ఈ రోజు ఏమిటో ఇంటి పనిని సరిగ్గా చేసుకోలేక పోతున్నా అని అనుకొంది ఆదెమ్మ.

శంకరం తిరిగి వచ్చిన తర్వాత తల్లి – కూతురు ముఖాలు ముడుచుకొని ఉన్న దాన్ని చూసి, ఏదో సరళ విషయంలోనే ఇద్దరికి పొరపొచ్చాలు కలిగినవేమో అనే అనుమానం అతనిలో కలిగింది. వాళ్ళిద్దరి మధ్య విరసం అదెంతో కాలం నిలవదులే. శంకరంకు చిన్నప్పటినుంచి అమ్మ – అక్కల నడుమ ఉన్న సరస–విరసాలు గుర్తే. ఆదెమ్మ కూతురు మూలకంగా ఆసుపత్రి వివరాల్ని తన నుంచి అడగటం మరచిపోయిందిలే. ఈ రోజు వంటగదిలోనే నిమగ్నమైన తల్లి బిందెలలో నీళ్ళు నింపలేదు కదా! శైలూ రావటం చేత ఆదెమ్మ దినచరి అదలాబదలా అయిన వైనం శంకరానికి కొద్దిగా కష్టం కలిగించింది.

స్నానానికి వెళ్ళటానికి లేచిన శంకరం, కొత్త సోపు తీసుకొని దాన్నుంచి కవర్ని తీసి అక్కడే పడేసాడు. ఆదెమ్మ కవర్ తీసుకొని, కసువుబుట్టలో వేయటానికి వెళ్ళినప్పుడు, ఎందుకో చేయి వణికినట్లు భావనవచ్చి ఒక సొరుగులో వేసింది ఆ కవర్ని. శంకరం వాడే ఏ వస్తువునైనా అట్లాగే బయటికి విసిరేయటం ఆమె మనస్సుకు ఒప్పుకోదు. స్నానం ముగించి బయటకు వచ్చిన శంకరం, అద్దం ముందు నిలబడి తలను తుడుచుకొంటున్నాడు. గదిలో ఉన్న పాత బడిన క్యాలెండర్‌ను వెనక్కి ముందుకూ పేజీలను తిరగేస్తూ, ఎంతో సేపు అక్కడ గడిపిన కొడుకును గమనించిన ఆదెమ్మ ఏదైనా ఉపాయంతో ఆ క్యాలెండర్‌ను రేపు తీసేసి ఎక్కడైనా దాచేయాలి అని అనుకొంది.

శంకరంతో మాట్లాడని శైలూని చూసి "ఆమె ఎప్పుడూ అంతే, తనదే సరి అనే హఠం. పని వదిలేసి వచ్చిందట. ఏమిటి అని అడగొద్దు. ఇక్కడే ఉండి రోజుకో రగడం చేయకుండా ఉంటే అదే పదివేలు" అని దగ్గరగా వెళ్ళి శంకరంతో చిన్నగా ఆదెమ్మ

చెపుతుంటే ఆమెకు స్వాతనం చెపుతున్నట్లుగా "బేజారు గీజారు ఎందుకు? దాన్నుంచి ఏమన్నా ఫలితం ఉంటదా. చేయినుంచి దాటిన దాన్ని అట్లాగే ఒప్పుకొని వదిలేయ్యాలి." అని తల్లితో అన్నాడు. శంకరం ఎంతో అనుభవం ఉన్నోడి లాగ మాట్లాడుతుంటే తల్లైన ఆదెమ్మకు నోరు పెగల్లేదు.

అక్క – తమ్ముడు ఇద్దరూ ఎదురెదురుగా భోజనానికి కూర్చొన్నారు. "నిన్న తిన్నది జాస్తైంది. ఎందుకో సరిగ్గా అరగలేదు. కొద్దిగానే వడ్డించు" అంటూ శైలజ అనటం, తిండి సరిగా తినకపోతే ఎట్లాగే అని ఆదెమ్మ అంటుంటే "ఆహారం ఎంత మితంగా తీసుకుంటే అది ఒకందుకు మంచిదే అని వైద్యం చెపుతుంది ఆదెమ్మా" అని శంకరం అంటుంటే కొక్కిరించి చూసింది తమ్ముడ్ని శైలజ.

భోజనం ముగించి శంకరం గదినుంచి బయటికి వస్తుంటే సమీర ఇంటి ముందు నిలబడి ఉన్నాడు. "ఆదెమ్మా ఎట్లా ఉన్నారు" అని అడిగాడు. ఆదెమ్మ ఆ... హా... అంటూ పలకరించింది. శంకరం అతడ్ని తను ఇప్పుడు పెంచుతున్న మొక్కల దగ్గరకు తీసుకెళ్ళి వాటి వివరాల్ని చెప్పసాగాడు. ఆదెమ్మ దేముడి కోసం నందివర్ధన చెట్లను పెట్టటం వాటికి క్రమం తప్పకుండా నీళ్ళను పోస్తుండటం వలన అవి పూలతో పరిమళించసాగాయి. మొదలు ఈ తోటున్న జాగాలో ఆటో రిక్షాను కొని దాని కొక చిన్న గ్యారేజ్‌లాగ ఈ జాగాన్ని వాడుకొందా అని అనుకోవటం, మాయరోగం మూలకంగా ఆ ఐడియాను వదిలేసి ఆ మొక్క ఈ మొక్క అంటూ జాగాన్నంతా తోటగా మార్చేసాము. ఆయా చెట్లను ఎక్కడ్నుంచి తెచ్చింది, పోయిన వారం ఎట్లా ఉన్నవి, ఈ వారం వాటి వృద్ధి, మొన్న సంకష్ట చతుర్థి దినాన ఎన్నిపూలు ఆ మొక్క నుంచి దొరికింది, ఎవరెవరి ఇళ్ళలో పూజకు మా పూలే బట్వాడ అయ్యింది, తోట సంరక్షణ చేసేటప్పుడు ఆదెమ్మ ఎంత ఖుషీ పడేది, నీటిని నిదానంగా ఎట్లా మొక్కల పాదులకు పోయాలి మొదలైన అనేక మాటల్ని సమీర ఒడిలో కురిపించాడు శంకరం. సమీరకూడా మొక్కల గురించి పెద్ద విజ్ఞానిలాగ గంభీరమైన సలహాలు ఇచ్చి, తమ దేముడి పూజకోసం మల్లెపూలను రెండు దోసిళ్ళకు సరిపోయినంతగా తెంపుకొని వెళ్ళాడు.

శైలు ముఖం ముడుచుకొనే ఆరోజుకు వాడిన వంట పాత్రలను శుభ్రం చేసింది. "పని చేస్తే మాత్రం భలే నీటుగా చేస్తది. ఐతే పెంకి స్వభావం ఉండేది. ఆమెలో" అని ఆదెమ్మకు మనస్సులో కూతురి మీద ప్రీతి ఉప్పొంగి రాసాగింది. పాడైపోయిన రేడియోను

బాగుచేయాలి అని శంకరం స్క్రూడ్రైవర్ కోసం వెతకసాగాడు. తలనొప్పి, కళ్ళ మంటలు అని అంటుంటే ఇప్పుడేమి బాగు చెయొద్దులే, కొంచం సేపు పడుకో అని అంది ఆదెమ్మ. చిత్ర గీతాల్ని వినాలి అనేది శంకరంలోని ఆరాటం.

బయట వసారాలో నడుం వాల్చిన ఆదెమ్మకు కలలు వచ్చినవి. చిన్న పిల్లోడిగా ఉన్నప్పుడు శంకరం వాళ్ళ నాయనతో వెళ్ళటం, ఏమేమో కొనండి అని హఠం చేయటం, నాయన జేబు ఖాళీ అయ్యేదట. అట్లా ఆ కలలో ఏదో పెద్ద జాతరలో శంకరం తప్పిపోవటం, ధడాల్నే ఆదెమ్మ నిద్రనుంచి బయటపడి, శంకరం ఉన్న గదివైపు ఒకసారి చూచింది.

స్క్రూడ్రైవర్‌ను ఎక్కడ్నుంచో వెతికి తమ్ముడి చేతిలో పెట్టింది శైలజ. టీపాయి మీద ఉన్న పేపర్‌లోని ఒక ఉద్యోగ వార్తల మీద పెన్నుతో అండర్ లైన్ చేసుకొని రెండ్రెండు సార్లు చదివింది శైలజ. చాపమీద కూర్చొని రేడియోను విప్పుతూ “వదిలేసిన నౌకరి గురించి ఎందుకు చింతిస్తావు? నాయన నౌకరీకి నువ్వు అప్లికేషన్ పెట్టు. నాకు ఇలాగున మాయరోగం ఉంది... అనుకంపం మూలాన ఉద్యోగం తప్పకుండా వస్తుంది. నేనుండగానే ఆ ఉద్యోగం నీకు వస్తే భలే మంచిది...”అంటూ అక్కతో చెప్పాడు శంకరం. ఈ మాటలు వినగానే శైలజకు కష్టం కలిగింది. తానెప్పుడూ నాయన అకాల మరణం వలన వచ్చే కుటుంబ వారసత్వ ఉద్యోగం గురించి ఈ తరహాగా ఆలోచించలేదు. తమ్ముడి నుంచి ఆ మాటలు విన్న శైలుకు దుఃఖం పొంగిపొర్లింది. తమ్ముడి కళ్ళలో కళ్ళు పెట్టి చూసింది. నాయన నౌకరి అనే అనుబంధం అక్కతమ్ముడ్ని పెనవేసిన ముడిలాగ మార్చటం చేత, చిన్న చిన్న కోప తాపాలు పోట్లాట పెంకితనం ఇవన్నీ దూదిపింజెల్లాగ శైలూ నుంచి వీడిపోయినవి. తను పొద్దుటి నుంచి ఆదెమ్మతో ప్రవర్తించినదాన్ని తలచుకొని శైలజ ఇప్పుడు క్షమాభావంతో కుంగిపోసాగింది.

రేడియో పూర్తిగా బాగుగాక, దాని గుర్ గుర్ చప్పుళ్ళు మనస్సుకు నచ్చక శంకరం రూంనుంచి తోటలోకి వచ్చాడు. బొప్పాయి గింజల నుంచి వచ్చిన మొలకను చూసి పెద్ద గొంతుతో ఆదెమ్మను పిలిచాడు. ఆదెమ్మ కొడుకు నుంచి వచ్చిన విచిత్రమైన కేకకు బెదిరి లోన్నుంచి బయటకు పరిగెత్తుకొని వచ్చింది. తనూ శంకరం జతతో అపారమైన ఆశ్చర్యం పట్టినట్లు నటించింది. ఇప్పుడు ఆ చిన్న మొలకలోనుంచి శంకరానికి మొత్తం జగత్తులోని ప్రీతి తనదే అనే విధంగా ఆ బొప్పాయి మొలకను చూచి ఆనందించసాగాడు.

చెట్టు మీద కాకి వాలి కావ్, కావ్ మని అరుస్తుంటే ఆదెమ్మ రాయి విసిరేటట్లుగా అభినయం చేస్తూ 'దరిద్రకాకి' అని పారదోలింది. "పక్షులు కూయకూడదు అంటే ఎట్లా ఆదెమ్మా" అంటూ నవ్వాడు శంకరం.

శంకరం ఇంటినుంచి బయటపడేది చూస్తే చాలు శాపవిమోచనం కలిగినట్లుగా పక్కింటి వాళ్ళు బయటికి వచ్చి, ఆదెమ్మతో లోకాభిరామాయణం మొదలు పెట్టటం, ఆదెమ్మ బావి నుంచి నీరు తోడటానికి సిద్ధమైతే, శైలజ అమ్మ చేతి నుంచి కడవ, చేదతాడు తీసుకొని బావినుంచి నీరు తోడటం చేసింది. కొత్తగా నాటిన అరటి పిలకకు ఆదెమ్మ నీరు పోస్తుంటే తొందరగా పెరిగి గెల వేస్తే దాన్ని తినే పోతాను అని తమాషతో శంకరం అంటుంటే 'సాయంత్రం వేళలో అపశకునం మాట్లాడకూడదు. నీకేమో ఆట, నాకేమో ప్రాణ సంకటం' అని చిరుకోపం ప్రదర్శించింది ఆదెమ్మ. శైలు తోడిన నిండైన కడవను శంకరంకు ఇవ్వకనే తనే మొక్కలపాదులలో నీరును పోయసాగింది. ఆదెమ్మ ముఖాన్ని , మొక్కల ఆకుల్ని సరిపోల్చుకుంటూ చూడసాగాడు శంకరం.

చిగురు నుంచి ఆకులు రూపుదాల్చటం చూసిన శంకరానికి ఇంకేమి తట్టటం లేదు. కనబడుటం లేదు. లౌకిక రోగాన్ని మరచిపోయి, ఆ మొక్కల పెరుగుదలలో అలౌకిక ఆనందాన్ని చూడసాగాడు.

రాత్రి పడుకోబోయే ముందు ఈ దుప్పటి చలికి సరిపోటంలేదు. చిన్నప్పుడు ఆదెమ్మ చిరుగులు పడిన చీరలతో కుట్టించిన బొంత కావాలి అని అక్కతో హఠం చేయటం, ఆ బొంతను వెతికి తీసుకొచ్చి కప్పు అని అడగటం, దేముడా ఆ అరటిపిలకకు తొందరగా గెలవేయకుండా చూడు తండ్రీ అని ప్రార్థిస్తూ నిద్రలోకి జారింది ఆదెమ్మ.

ఎప్పుడూ కలలే కనని శైలజ ఈ వేళ కలగంటూ "పెద్ద తుప్పుపట్టిన గడ్డ పలుగు లాంటి సిరంజిని ఎక్కడో ప్రదర్శనకు పెట్టారు ఆరోగ్యశాఖ అధికారులు. ఎవరూ దాని సమీపంకు పోకూడదు అని బోర్డ్ వేళ్ళాడదీసారు. అందరూ దూరం నుంచే చూస్తున్నారు. శంకరం మాత్రం దగ్గరికి పోయి చూస్తున్నాడు. దాని పదునైన చివరి మొన శంకరం వేళ్ళకు తగిలి గాయమైంది. ఆ గాయానికి ఆదెమ్మ ఔషధాన్ని రాస్తుంది. శైలజ పక్కకు తిరిగింది.

భూత, భవిష్యత్ కాలాల్నించి ఏమి కలలు ఆశించని శుద్ధ మనసున్న శంకరం ఉషోదయానికి ముందే మేల్కొని ఆ చలిలోనే స్వెటర్ వేసుకొని బయటికి వచ్చాడు.

మొక్కలనుంచి అప్పుడే మొగ్గలు పూలుగా మారుతున్న వైనం, రంగు రంగుల పూలు, ఆ పూలనుంచి వస్తున్న సువాసనలు కోవిలలో జమైన పూల దండల సువాసనలుగా ఆ వాసనలు ఉండటం, వీటిని చూస్తూ శంకరం మైమరచి పుళకితం చెందాడు. కొన్ని తులసీ ఆకుల్ని చెట్టుకు బాధ కలగనట్లుగా తెంపుకొని, నోట్లో వేసుకొని నమల సాగాడు. గోవర్థనం, నంది వర్థనం, చామంతి, మందార, బంతి, మల్లె, కనకాంబరాలు మొదలైన పూలే అతని తోటలో పరిమళిస్తున్నవి.

అతని కళ్ళలో పైరు పచ్చదనం, మనస్సులో పచ్చదనం, దేహంలోని నెత్తురులో పచ్చదనం, పచ్చదనానికి శంకరం అవసరమో, శంకరానికి పచ్చదనం కావాలో? కొంచం, కొంచంగా పెరుగుతున్న పరిసరాల పచ్చదనానికి శంకరుడి అవసరమే ఎక్కువ. జడత్వం లోని మన్నుకు పచ్చదనం నిండుకోవాలి అని వృక్షదేవతలు అతని ఆయుష్యును వృద్ధి చేస్తూ తాముకూడా చిగురులు తొడగుతున్నవి ప్రతిరోజూ.

ఆదెమ్మ, శైలూ వికసించిన పూలను దేముడి కోసం ఖుషితో తెంపసాగారు.

❀ ❀ ❀

(కన్నడ భాషలో సునందా ప్రకాష్ కడమె అనేవారు ఈ కథకు మూల రచయిత్రిగా ఉండి 'నెరెయ దేగుల' అనే పేరుతో రచించారు. 19/02/06న ఈ కథను తెలుగులోకి అనువదించటమైనది.)

**శాఖమూరు రామగోపాల్**

# నమస్తే భారత్ గ్యాస్

పొద్దవుతున్నా వీరేశ్‌కు ఇంకా సుఖనిద్రే. అలారం సప్పుడుకు కళ్ళు తెరిచి తన ఇంటిలో అలారం ఎప్పుడో చెడిపోయింది గదా అనేది ఆ నిద్ర కళ్ళలో కూడ స్పష్టంగా గుర్తుకొచ్చింది. ఓహో... ఇది మొబైల్ చప్పుడు... ఇంత పొద్దున్నే అంటే శంకర్ నుంచే... అప్పుడు గలబిలి అయ్యి మొబైల్‌ను టేబుల్ మీద ఉంచింది గుర్తుకు తెచ్చుకొని దాన్ని అందుకొన్నాడు.

"ఇప్పుడే బయల్దేరదాము అని అనుకొన్నా. అయితే నే నొచ్చేది మధ్యాహ్ననికి. నువ్వు త్వరగా ఆఫీసుకు వెళ్ళి డోర్లు తెరువు. అట్లాగే నా సిస్టంలో ఆఫీసుకు సంబంధించి బాంబే నుంచి మేల్ వస్తది" అని అన్నాడు.

వీరేశ్ ఉత్తగనే హుంగుట్టే దాన్ని విని రేగిపోయాడు. "ఇంకా నిద్ర కళ్ళతోనే ఉన్నావా... ఆ రోజు చూపించి పెట్టానుగా. మేల్ బాక్స్ ఓపెన్ చేసి, బాంబే నుంచి లెటర్స్ వచ్చినవేమో చూడు. అదే గ్యాస్ బుకింగ్ ఆర్డర్ చేసాము గదా! దాన్ని చెక్ చేసుకో. వాళ్ళు కొన్ని వివరాలు అడుగుతారు. నువ్వు జవాబును టైప్ చేస్తే చాలు. నేను తర్వాత ఫోన్ చేస్తా" అన్నాడు శంకర్.

ఈ కొడుకు మొబైల్ ఇచ్చింది గ్యాస్ ఏజెన్సీ వ్యవహారానికి. తనను ఇంకా గట్టిగా ఉపయోగించుకొంటానికే అనుకొని లోన్లోనే తిట్టుకోసాగాడు.

ఇంటి నుంచి బయల్దేరాక ఆ నిద్ర కళ్ళలో ఆలారం మొరుగుతుంది అనేది తనకి ఎట్లా గుర్తుకొచ్చింది అబ్బా అని ఆశ్చర్యపడ్డాడు. మొదలే రష్‌గా ఉన్న బస్సులో ఎట్లాగో ఎక్కి, అలారం గుర్తుకొచ్చిన వైనాన్ని అంతే వేగంగా మరచి పోయాడు.

ఆఫీసుకు చేరగానే మొదలు శంకర్ చెప్పిన పనిని చేయాలి అని శంకర్ సీటులో కూర్చొన్నాడు. ఆ యువతులిద్దరూ రాక మునుపే శంకర్ చెప్పిన పనిని చేయాలి అని మనస్సులో పుట్టింది. శంకర్ చెప్పిన విధంగానే కంప్యూటర్‌ని ఓపెన్ చేస్తే జంక్ మేల్ రాసాగింది. జంక్ మేల్‌ను తీసేయాలా వద్దా అనే సందేహంలో పడ్డాడు. శంకర్ అయితే ఏమి చేస్తాడో? తనకి గుర్తు లేదు... దొంగ కొడుకు? ఇదంతా తనే చేసుకొంటాడు.

డిటైల్స్ నేర్పడు. పోనీలే మొదట బాంబే నుంచి గ్యాస్ సమాచారం కోసం చూద్దాం అని వెతికాడు. ఆ సమాచారం చదివి, ఆ పని పూర్తైన తర్వాత ముందేమి చెయ్యాలి అనేది తెల్వక ఒక్కొక్క జంక్‌మేల్ మీద గుర్తు, గురి లేనట్లుగా కంప్యూటర్ మానిటర్ మీద కీ బోర్డ్‌ను ఒత్తసాగాడు. అతను అట్లా చేస్తుంటే, ఏదో ఒక మేల్‌లో ఉన్న లింక్ మీద మౌస్‌ను క్లిక్ చేసాడు. ఫట్ అని సగం దుస్తుల అమ్మాయి చిత్రం ప్రత్యక్షమైంది. రెప్పకొట్టే లోపలే మానిటర్ నిండా యువతి తొడలు, నడుం, వక్షోజాలు ఆవరించుకోటం, వాటిని చూడగానే అతను ఎంతో గలిబిలి అయ్యాడు. ఆఫీసులోని అమ్మాయిలిద్దరూ ఊడిపడ్డారేమోనని మెయిన్ డోర్ వేపు చూసాడు. కంప్యూటర్‌లోని ఒక చిత్రం చూసిందే తడవుగా ఇంకొన్ని చూడాలి అనే ఆశ అతనిలో పుట్టింది. చిత్ర విచిత్ర భంగిమలతో ఉన్న సుందరీమణుల నించొన్న, కూర్చొన్న, పొజిషన్‌లో ఉన్న వాటిని చూసిందే తడవుగా, అది మానిటర్ అనేది మరచి ఆ చిత్రాల్ని ముట్టుకొని ముద్దించాడు.

మరొక మేల్ చూసాడు... మొదలు ఏమీ అర్థంగాలేదు. ఛీ.... అందరిలాగ కాన్వెంట్‌లో చదివుంటే ఇటువంటిది ఒక పాలైనా అర్థమైయ్యేదేమో! సర్కారి బడికే వెళ్ళటమే కష్టమనుకొంటే ఎక్కడిది కాన్వెంట్ చదువు అని అనుకొన్నా కొంతలో కొంత ఇంటర్ అయినా చదివాను కదా! అదే పెద్ద ఘనం తమలాంటోళ్ళకు. అట్లా ఆలోచిస్తూ ఆ ఇద్దరూ వచ్చేలోపే ఈ కంప్యూటర్‌ను ఆఫ్ చేయాలి అని అన్పించినపుడు కొంత నవ్వొ వచ్చింది. మళ్ళీ ఆ మేల్‌ను చూసా. నిదానంగా చదివా. ఆ తర్వాత అర్థమైంది. అది శిశ్నానికి తొడుక్కునే ఎక్స్‌టెండర్ అనే వస్తువట. దాన్ని తొడుక్కున్న తర్వాత శిశ్నం ఎంత పర్సంటేజ్ జాస్తి అయ్యింది, జతగా ఉన్నామె ఎంత సుఖమూ అనుభవించేది అనే వివరాల్ని (సగం సగం) అర్థం చేసుకొంటూ అరే నేనేంటి ఇంత ఉద్రేకం చెందుతున్నాను... అనుకొంటూ డోర్ వేపు చూస్తానే మెల్లగా జిప్ లాగి ముట్టుకొని చూసుకొన్నా. తనకి ఇంతహా ప్రొడెక్టుల అవసరం లేదులే అని సమాధానించుకొన్నా. చూసేటప్పుడు తీవ్రమైన రోమాంచనం ఏమిటో విచిత్రమైన ఉద్రేకానికి పక్కాగా అయ్యింది నిజమే. అదంతా చూసి ముగించిన తర్వాత "ఏమిటో ఇంతేనా" పిచ్చి అని అన్పించసాగింది. శంకర్ అప్పుడప్పుడు మా అందర్ని లోనికి పిలవకుండానే పెద్ద పని చేసేవాడిలాగ ఫోజు పెడ్తూ ఇటువంటి మేల్‌ను తెరిచి చూచి ఉండొచ్చేమో అని నాకు ఇప్పుడు తెలుస్తుంది అతని పని గుట్టు విధానం. ఫోన్ సప్పుడు చేస్తుంది. తక్షణం మేల్ బాక్స్‌ను మూసేసా.

అభ్యాస బలం వలన "నమస్తే భారత్ గ్యాస్" అన్నాను.

గ్యాస్ అయిపోయి బాగా కష్టంగా ఉందండి. వారం ముందే బుక్ చేసినా రాలేదు. ఇంటి నిండా చుట్టాలు. రెండో సిలిండర్ కూడ అయిపోయేటట్లుంది. అటునుంచి ఈ రకమైన అభ్యర్థనం. స్టాక్ లేదండి. అక్కడ్నుంచి వచ్చేది ఆలశ్యమైంది. కొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే తప్పదు. సప్లై వస్తే మీ ఇంటికి పంపిస్తాము. అప్పటి దాకా ఓపిక పట్టండి అని వీరేశ్ చెపుతున్నది సహించుకోలేని అవతలి స్వరం 'ఏమిటీ' అనే ధబాయింపు. మొదలు ఇటువంటి ధబాయింపుల స్వరాన్ని వినే వీరేశ్ వాళ్ళ వంటగది ఎట్లా ఉంటది అనే ఒక ఊహలోకి వెళ్ళేవాడు. నూనె జిడ్డుతో ఉన్న పొయ్యి, ప్లాట్‌ఫాం, బర్నర్ మీద ఎప్పుడో పడిపోయిన వంటా – వార్పుల మరకలు, సింక్ క్రింద ఉన్న డస్ట్ బిన్ నుంచి అది నిండిపోతే అక్కడే చెల్లా చెదరైన కసువు, వీటిని ఊహించుకొంటూ వాళ్ళెంత శుచి శుభ్రమైనోళ్ళు అనే వాటిని కల్పనాలోకం నుంచే అందాజు కట్టేవాడు. అటువంటోళ్ళందరకి తన అమ్మ నుంచే వంట గది శుభ్రం గురించి కౌన్సిలింగ్ ఇప్పిస్తే అనే ఆలోచన అతనిలో కలుగుతుండేది. దభాయించే వాళ్ళ పేర్లను వెయిటింగ్ లిస్ట్‌లో ఇంకాస్త వెనక్కి నెట్టితే పోలే అనే చెడ్డ తలంపు మనస్సులో వస్తుంటే, అంతలోనే ఆ వైపు నుంచి ఫోన్ డిస్ కనెక్ట్.

శంకర్ గదిని మూసి, తాము ముగ్గురూ కూర్చొనే ప్రాంతంలోకి వచ్చి తన నిగధిత జాగాలో కూర్చొన్నాడు. అప్పుడే వచ్చి పని మొదలు పెట్టిన ఆ ఇద్దర్ని ఓర చూపుతో గమనించాడు. కొంచెం తెలుపు చాయ ఉన్న ఆ యువతితో ఎందుకో స్నేహం సరిగ్గా అవ్వటం లేదు. శంకరే ఈ ఇద్దరి తగువుల్ని కొన్ని కొన్ని సార్లు మధ్యవర్తిగా ఉండి విడిపించేవాడు. సన్నగా కోలముఖంతో, నల్లటి చాయ ఉన్న ఆ యువతి మాత్రం వీరేశంకు ఎంతో ఆప్తురాలు. అప్పుడప్పుడు కలలలో కూడ కనబడుతుండేది. ప్రతిసారి అటువంటి కలలు మాత్రం తాము ఉండే ఈ పరిసరాలకు దూరంగా ఆమెతో ఉండేవి. ఊరిలో ఉన్న తాత, ఇల్లు, పొలం గట్లు, చెఱువు ఎక్కి బనశంకరి దగ్గర ఉన్నప్పుడు, పేపర్‌ను ఇంటింటా వేస్తున్నప్పుడు తామిద్దరూ వెళ్తుండే దారులు, దృశ్యాలు.... కలలలో ఇట్లా ఈ ఆఫీసు, తనుండే ఇల్లు, వాటి పక్కన ఉండే దారులు మీరి పూర్తిగా బయటి పరిసరాలలో ఆమె గురించి మమేకం అయిన కలలు వస్తుండేవి. ఆమె గురించి తనకు భావాలు పుట్టటం ఇదొక కారణమవ్వచ్చేమో. ఆమె వైపు మళ్ళీ చూసా. ఆమె తనెదురున్న మానిటర్‌లో కూరుకుపోయింది. కొంచం పొడుగాటి వేళ్ళు కీ బోర్డ్ మీద ఉన్నవి. ఆ వేళ్ళ చర్మంలోని మెరుపు, వేళ్ళకు అంటుకొని ఉన్నరేఖలు, గోళ్ళు అన్నీ పరిచయమే అన్పించింది.

మధ్యాహ్నం దాకా స్టాకు లేదు అనేదాన్ని విభిన్న ధ్వనులతో చెప్పి చెప్పి ముగ్గురూ సుస్తైయ్యారు. కొత్తగా గ్యాస్ కనెక్షన్ చేయించుకోటానికి వచ్చిన వాళ్ళు, స్టవ్ కొనాలని, గ్యాస్ ఏజెన్సీని చూడాలి అనేవారు... ఇట్లా వీళ్ళతో ఆఫీసు గజిబిజి. మధ్యలో ఇతని మొబైల్‌కు శంకర్ "తాను ఊర్నించి వచ్చేది లేటు అవుతది అని (ఇతను గది బయటికి వచ్చి రెస్పాన్స్ ఇస్తుంది తెలుసుకొని) ఆ ఇద్దరి మీద తను లేకపోతే కబుర్లలో మునుగుతారు, ఇప్పుడే అని వెళ్ళి గంటైనా తిరిగి రారు, నువ్వు ఒక కణ్ణు వాళ్ళ మీద పెట్టు. వాళ్ళిద్దరూ సాయంత్రం లోపు తను చెప్పిన దంతా ఎంట్రీ చేయమను" అని చెప్పటం, తనకి చెప్పినట్లే ఆ ఇద్దరికి తన మీద ఒక కణ్ణు ఉంచమని వాళ్ళతో చెప్పి, డబుల్ డిప్లమసి ఆడే తత్త్వం లంగా కొడుకు శంకర్‌ది అనేది వీరేశ్‌కు బాగా తెలుసు. కొంచం కంప్యూటర్ వర్క్ బాగా వచ్చిన ఆ తెల్లటి యువతి భలే దర్పంతో ప్రవర్తిస్తది తన ఎదురు. పైగా శంకర్ స్నేహితుడి చెల్లెలు ఆమె.

మధ్నాహ్నం లంచ్ టైమ్ అవ్వటం వలన జనం గోల కొద్దిగా తగ్గింది.

కొత్తగా పెళ్ళై సంసారం పెట్టినోళ్ళేమో.... గ్యాస్ తీసుకోవాలి అని వచ్చారు. ఈ క్షణమే తీసుకొని వెళ్ళి పాలు పొంగించాలి అనే భ్రమలో ఉన్నారేమో... అడ్రస్ ప్రూఫ్ అవసరం, అట్లా ఇట్లా అని వీళ్ళు వివరించి చెప్పిన తర్వాత వాటిని తెచ్చి ఇస్తే తక్షణమే దొరుకుతుందా అని బెదురు బెదురుతో అడగటం, అన్ని పార్మాలిటీస్ చేసినా గ్యాస్ సిలిండర్ సప్లై అయ్యేది ఒక వారం తర్వాతే అని చెప్పిన దాన్ని విన్న భర్త ముఖంలో నిరాశ, భార్యకు మాత్రం వారం రోజులు ఇంకా వంటచేసే గొడవే లేదు అనే నెమ్మది భావం ఆమెలో కనబడసాగింది.

వారం క్రితమే కనెక్షన్ బుక్ చేసి రెగ్యులేటర్ స్టవ్ (పొయ్యి) తీసుకెళ్ళిన ఒకామె మాత్రం ఈ రోజు సిలిండర్ తీసుకొనే వెళ్దాం అనేట్లుగా స్నేహితురాలితో వచ్చి పట్టుదలగా కూర్చొంది. ఇప్పుడే వచ్చి బుక్ చేసిన ఎవరికైనా తక్షణం సిలిండర్ ఇస్తారేమో అనేదాన్ని పసిగట్టాలి అనే వీళ్ళ మీద ఆ ఇద్దరూ కళ్ళలో వత్తులేసుకొని నిఘా పెట్టారు. లారి లోడ్ రాలేదు. వస్తే తక్షణమే ఇస్తాము అనే మాటను నమ్మినా మళ్ళీ మళ్ళీ ఎంత టైమ్‌కు వస్తది, దీని కోసమే సెలవు పెట్టి వచ్చాము. మా బాధ మీకెట్లా తెలుస్తదిలే అంటూ మా ముగ్గురి మీద విరుచుకుపడ్డారు. విసిగిన ఈ ముగ్గురూ కను సంజ్ఞల తోనే ఆ ఇద్దరికి తెలవనట్లుగా, వారున్నా లేనట్లుగానే పని చేసుకోసాగారు.

జనం గోల తగ్గుతుంటే ఆ యువతులు ఇద్దరూ భోజనానికి సిద్ధమయ్యారు. ఆ ఇద్దరూ ఒక పక్క చేరి భోజనం చేయసాగారు. కౌంటర్ ఎదురు సోఫాలో కూర్చొని సిలిండెర్‌కోసం నిరీక్షిస్తున్న ఆ ఇద్దరూ కూడా మెల్లగా తమ నుంచి ఒక బాక్స్ తీసి ఒకామె మూతలో, మరొకామె బాక్స్‌లో పెట్టుకొని తినటం మొదలుపెట్టారు. వాళ్ళ బాక్స్ నుంచి దోసల వాసన వస్తుంటే అతనికి (వీరేశ) ఈ వాసన అన్ని దోశల వాసనలాగలేదు. కొంచం వేరేగా అన్పించింది. ఎందుకు ఇట్లా అన్పిస్తుంది అని అనుకొనేటప్పుడు తక్షణమే గతంలోకి జారిపోసాగాడు.... ఆ రోజు ఇటువంటి దోసల వాసనే వచ్చింది. ఆ ఆంటీ ఇంటి నుంచి గాదు. ఆమె ఇంటికి అంటుకొన్న పక్కింటి వంటగది నుంచి ఘుమ్మైన వాసన.... తను పదో తరగతిలో ఉన్నప్పుడు ముక్కుపుటాలకు తగిలిన ఆ ఘుమ ఘుమల దోసల వాసన, వాటిని తను తినకపోయినా ఆనాటి వాసన ఎట్లా ఇంకా అంతే తీవ్రంగా గుర్తుకొస్తుంది అనేది అప్పుడప్పుడు దోసల్ని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుండేది. సోఫాలో కూర్చొన్న ఆ ఇద్దర్ని నిశితంగా చూసా. గుంగురు జుట్టున్న ఆమె, దోసను నోట్లోకి నెట్టుతున్న ఆమె వేళ్ళు.....!

అరె... ఆ ఆంటీ చేతులు ఇట్లాగే ఉండేవి కదా.... ఇప్పుడు మాత్రం అప్పటి (ఆ కాలం) ఆ దృశ్యం మళ్ళీ మళ్ళీ కళ్ళకు కట్టినట్లుగా.... కొంచమే తెరిచిన తలుపు లోపలికి పేపర్ విసిరి ఇంకేంటి వెళ్ళాలి. అంతలో ఆ ఆంటీ బయటికి వచ్చింది.... ఒక నిమిషం నిలబడు.... తలుపు దగ్గర నిలిచా. లోనికెళ్ళి మళ్ళీ వచ్చి, లోనికి రా అని పిలిచింది. తనికి సంకోచం, కొంచం భయం కూడా. ఎప్పుడైనా పేపర్ వేయటం మరిచానా.... లేక పోయిన వారం ఆమె ఊరుకెళ్ళింది తెలవక రెండు రోజులు డోర్ ముందే పేపర్ని విసిరినందుకు తిట్టదేమో... ఆమె ముఖంలో ఏమీ గుర్తవ్వటం లేదు.

ఎప్పుడు పరీక్ష? తన జవాబుకు నిలవకుండానే “చూడు ఈ వాచిని పరీక్షకు చేతికి పెట్టుకొని వెళ్ళు. సరేనా....బాగా రాయి” అని చెప్తూ దగ్గరకు వచ్చి వాచిని చేతికి తొడిగింది. ఏమనాలో తెలియక, వాచి మీద ఆశ కలిగి వద్దులే అని అనకుండా మూగ అయ్యాను. మొదలు సాదా వాచియే అనుకొన్నా. మణికట్టు మీదున్న ముద్దైన అంకెలతో వున్న వాచిని అర క్షణం ధిట్టించి చూడగా, అది కొత్త వాచే, ఖరీదైనదే అనేది తెల్వగానే కొంచం గాబిరి చెందాను. మార్పులు చెందుతున్న నా ముఖ కవళికలను చూస్తున్న ఆంటీ నా ఎడం చెయ్యిని పట్టుకొని మరొక చేతితో నా భుజం మీద నొక్కసాగింది. “ఫర్వాలేదు. తీసుకో.. నా దగ్గర ఉపయోగం లేకుండా ఉంది... నీకేమైనా ఉపయోగం

అవుతది కదా” అంటూ కొంటె నవ్వుల్ని విసిరింది. లోన మరొక రూం నుంచి ఫ్యాన్ తిరుగుతున్నప్పుడు, పక్కనున్న ఇంటి వంటగది నుంచి వస్తున్న దోసల వాసన. అ క్షణం నుంచే వాచి ఇచ్చిన ఉపయోగం పొందాలి ఈ పోరడితో అనే భావంతో నించొని ఉన్న ఆమె... తీవ్రమైన ప్రేమతో తన భుజాన్ని ఒత్తి పట్టిన ఆమె చేతివేళ్ళు.. ఎంతటి వ్యవహారాన్నైనా దాచి ఉంచే ప్రయత్నంలో పటపటనే కొట్టుకొంటున్న ఆమె కనురెప్పలు.. ‘హుం... ఆంటీ’ అని తలను అడ్డంగా ఊపి, తలుపు నుంచి బయటపడి, వేగంగా సైకిల్ దగ్గరకు వచ్చా.

ఇంటిలో ఒకట్రెండు రోజులు అమ్మకు కనబడకుండా పుస్తకాల నడుమ స్కూల్ బ్యాగులో దాచిపెట్టా. స్కూల్‌కు చేరిం తర్వాత వాచిని పెట్టుకొని స్నేహితులకు చూపించా. అయితే ఇల్లు ఎంత చిన్నదంటే అమ్మకు తెల్వకుండా దాచి ఉంచటం సాధ్యమే కాదు అని అన్పించసాగింది. తను ఉపయోగించే అన్ని వస్తువులకు అమ్మచీరల వాసన అంటుకొని ఉండటం చేత, ఇప్పటివరకూ చీరవాసన లేకుండా వున్న ఈ వాచీని ఎందుకో నాది కాదు అనే భావం కలిగి, చివరకు అమ్మకు చూపించా. ఎక్కడ దొరికింది చెప్పు అని గట్టిగా అడిగిన ప్రశ్నెలో ఎక్కడ్నుంచైనా దొంగిలించాడా అనే అనుమానమే ఆ ప్రశ్నెలో దాగి వుంది. తను చెప్పినదాన్ని అమ్మ సులభంగా నమ్మలేదు. అయితే కొడుకు దొంగిలించేవాడు గాదు అనే విశ్వాసాని కన్నా దొంగిలించటానికి తనకు అవకాశాలే లేవు అనే నమ్మకాల్ని అమ్మకు తను చెప్పే విధానం మూలంగా అమ్మ నమ్మింది. పరీక్షల తర్వాత తను బాగా రాసాను అనో లేకపోతే రిసల్టు వచ్చిన తర్వాత ఫస్ట్ క్లాసులో పాసైయ్యాను అనో తెలుగు సినిమాలలో చెప్పినట్లుగా ఆమె దగ్గరకి వెళ్ళి చెప్పాలి అని అనుకొన్నది నిజమే. అయితే ఈ నడుమే ఆ పేపర్ ఏజెన్సీ అంగడి వానితో మొదలే డబ్బు తీసుకొన్నందున, నాయన మళ్ళీ వెళ్ళి డబ్బు అడగటం అందువలన అతనికి కష్టం కలిగి తనని పనిలోంచి తీసేసాడు. పని వదిలే ముందు ఆ ఏరియాలో పేపర్ను పంచుతున్న ఇళ్ళన్నిటిని అప్పుడే చేరిన కొత్త కుర్రోడ్ని తీసుకొని వెళ్ళి చూపించి, “రేపట్నించి నేను రాను.... ఇతను వస్తాడు” అని ఆమెకు మరొక బక్కపీచు పిల్లోడ్ని చూపించా. ‘అవునా’ అన్న ఆమె అర క్షణం తర్వాత తను వాచిని కట్టిన చేతిని చూస్తూ ‘స్కూలికి సరిగ్గా పోతున్నావా’ అని అడిగింది. హుం గొట్టి ‘ఎక్సామ్స్ వస్తున్నవి గదా. అందుకే రావటం లేదు’ అని అన్నాను. ఆమె మాట్లాడలేదు. గేట్ దగ్గరకు వచ్చినప్పుడు ఆమె ధ్వని మృదువుగా వీపుకు తగిలింది. ‘పరీక్ష బాగా రాయి’ ధ్వనిలో కొంచెం నిరాశ ఉందేమో?

తర్వాత వేరే పేపర్ ఏజెన్సీ.. వేరే ఏరియా... వేరే దారులు.. ఇళ్ళూ వేరే. ఆంటీని మర్చిపోయా. వాచ్ మాత్రం జతగా ఉంది. ఎట్లాగో సెకెండ్ క్లాసులో పాసైయ్యా. సర్కారి కాలేజ్‌లో ఇంటర్ జాయిన్ అయ్యా. ఒకట్రెండుసార్లు అన్పించింది. ఆ ఆంటీ వాచ్ ఇచ్చే బదులు ఒక మంచి సైకిల్ ఇప్పించి వుంటే...

ఇప్పుడు సోఫాలో కూర్చొన్న ఆమె చేతులు, ఆ వేళ్ళను చూస్తుంటే భుజాల్ని ఒత్తిన ఆంటీ చేతులే గుర్తుకొస్తున్నవి... ఆమె ఎంతో ప్రీతితో ఇచ్చిన ఆ వాచిని తీసుకొనకుండా ఉంటే, ఆమె తన భుజాల్ని ఆ విధంగా నొక్కి ఉండేది కాదేమో. తను ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంటే తండ్రి అకారణంగా తన దురభ్యాసాల కోసం అమ్మేసాడు గదా. అమ్మ చెప్పినప్పుడు ఎందుకో ఆపుకోలేని కోపం అసహాయకత ఆవరించి ఆ చిన్న అలారంను బయటకు విసిరేసా. అప్పుడు చెడిపోయిన అలారంను ఇంకా రిపేరే చేపించలేదు... తర్వాత కాలేజీలో అడుగుపెట్టలేదు. పని చేయాలి అనే పిచ్చి తలకెక్కటం, ఏదో ఒకట్రెండు పనులు చేసిం తర్వాత, శంకర్‌డి గ్యాస్ ఏజెన్సీలో చేరా. మొదలు తక్కువ డబ్బుకు జీతగాడి లాగ పనిచేపించుకొంటాడు అని రేగినా, సరిపోయేదన్నంతగా పనిని నేర్పటం, కంప్యూటర్ నేర్పించటం, క్రమేణ జీతం పెంచటం ఇటువంటి వాటి మూలాన శంకర్‌మీద తనకే గాకుండా, అమ్మకూ ఒక ధన్యతా భావం కలిగింది.

చెల్లెలు మొన్న తన పుట్టిన రోజు కోసం సల్వార్‌కమీజ్ అడిగితే కొనలేక పోయా. నాన్న మొదలు కార్పొరేటర్ దగ్గర పనిచేయటం, అతనేమో ఎమ్.ఎల్.ఏ. అవ్వటం, అదైన కొన్ని రోజులకు ఈ పేటలో సర్కారి ఇల్లు తెల్లకార్డ్ ఉండటం చేత ఉచితంగా ఇప్పించాడు. ఎమ్.ఎల్.ఏ. ఇంత సులువుగా మనకి ఎట్లా ఇల్లు ఇప్పించాడు అనే అనుమానంతో అమ్మతో జగడం పడ్డా. అతనేదో కంత్రీపని చేసుండొచ్చు. అది నాయనకు తెలుసుగాబట్టే, నాయన నోరు నొక్కటం కోసం ఈ ఇల్లు కేటాయింపు చేసుండొచ్చేమో. అవినీతి కంపుగొట్టే ఈ ఇంట్లో నేనుండేది లేదు అని తగదా పడ్డాను.

'వీడేంటి నన్నడిగేది. వీడేమన్నా పెద్ద గొప్పోడా.. పోతానంటే పోనీయి' అని అరిచిన నాయన ఒక వారం తర్వాత ఏమనిపించిందో ఆ ఎమ్.ఎల్.ఏ. పనినే వదిలి వేరే దగ్గర పనిలో చేరాడు. నాయన ఆ దుష్ట ఎమ్.ఎల్.ఏ. నుంచి దూరంగా జరగటం వలన స్పష్టమైన మార్పులు ఆయనలో పుట్టినవి. చెల్లెలు ఇప్పుడు ఈ ఇంటికి వచ్చిన తర్వాత కళకళలాడసాగింది. అమ్మచీరల వాసన అంటనట్లుగా వీరేశ్ కొంచెం తన సామానులను సుభద్రంగా ఈ కొత్త ఇంటిలో ఉంచుకోవచ్చు. అయితే తనకున్న పర్సనల్ సామాన్లలో వాచి లేకపోవటం ఒక కొరతగానే ఉండిపోయింది.

వాచి స్మృతుల నుంచి బయటపడుతుంటే లారి వచ్చిన నప్పుడు అయ్యింది. అమ్మయ్య లారి వచ్చింది గదా! వీరేశ్‌కు, ఆ ఇద్దరి యువతులకు ఇప్పుడు చేతి నిండా పనే.

ఐదు గంటలకు సుమారుగా ఒకతను సైకిల్ మీద ఖాళి సిలిండర్ పెట్టుకొని వచ్చాడు. స్టాకు లేదు... పేరు, నెంబరు బుక్ చేపించుకోండి అని ఆ యువతులు చెప్పటం, ఎవరిదైనా అడ్జెస్ట్‌చేసి నాకు నిండు సిలిండర్ ఇవ్వండి అని ప్రాధేయపడసాగాడు. రెండు సిలిండెర్లు పెట్టుకొంటే ఈ సమస్య ఉండేది కాదు కదా అని ఊతపదాలు పలికే ఆ తెల్లటి అమ్మాయి 'ఎందుకండీ అంత అర్జెంట్' అని భారంగా అడిగింది. 'ఇంట్లో బాలింతరాలు ఉంది' అతను కొంచం సంకోచంతో చేతులు పిసుక్కుంటూ చెప్పాడు. వీరేశ్‌కు ధడాల్నే ఒకటి గుర్తొచ్చింది. సిలిండర్ ఇచ్చేపనికి చేరినప్పుడు "చేసే పనిని నువ్వు సరిగ్గా చేస్తుంటే, ఏదో ఇంట్లోనైనా ఒక పొయ్యి సరిగ్గా జ్వలిస్తుంది. అన్నం ఉడుకుతది" అని అమ్మ చెప్పిన సుభాషిత మాట ఇప్పుడు గుర్తుకొచ్చింది.

ముగ్గురూ కళ్ళతోనే పరస్పరం మాట్లాడుకొన్నారు. తెల్ల అమ్మాయి బిల్ చించింది. వీరేశ్ అతడ్ని బయటకు తీసుకొని వెళ్ళి, 'ఎవ్వరికీ చెప్పకండి.. స్టాకు టైట్‌గా ఉంది. ఎవరికైనా నాల్గైదు రోజుల తర్వాతే ఇచ్చేది' అని చెప్పి ఖాళీ సిలిండర్ తీసుకొని నిండు సిలిండెర్‌ను ఇచ్చాడు ప్రతిఫలాపేక్ష లేకుండా.

ఆ యువతులు ఇద్దర్నీ ఆరు గంటలకు పంపించి, తర్వాత మిగిలిపోయిన సనులను ముగించి, ఇంటికి పోదాం అనుకొంటుంటే ధడాల్నే గుర్తుకొచ్చింది. ... తను మేల్ చెక్ చేసేటప్పుడు ఆ జంక్ మేల్‌ను ఓపెన్ చేసింది శంకర్‌కు తెలుస్తది గదా... డిలీట్ చేయాలి దాన్ని అని శంకర్ రూంకు వెళ్ళాడు. మరొకసారి చూడాలి. చూస్తే తప్పేంటి? పొద్దున్నే లాగ... చూచేటప్పుడు వళ్ళంతా వేడెక్కింది. రోమాంచనం, మానిటర్ మీద ఉన్న ఆ సుందరి చిత్రం. వాటినే నాలుగైదు నీలిచిత్రాల్ని చూడగా వాంతి వచ్చినట్లైంది. అంతటిని పూర్తిగా డిలీట్ చేసా. రూం నుంచి బయటికి వచ్చా. ఆఫీసులోని నల్లటి అమ్మాయి గుర్తుకొచ్చింది. ఇప్పుడే చూసిన ఆ సుందరీమణుల దృశ్యాలతో ఆమెను కల్పించుకొన్నా, ఆ నీలిచిత్రాలు రోత పుట్టించినై.

ఆఫీసులోని ఆ నల్లటి ఛాయ ఉన్న అమ్మాయి అంటే అంగాంగాన్ని చూపించే నీలి చిత్ర సుందరి కాదు. మానిటర్‌ను ఉపయోగించేటప్పుడు ఆమె చూపులు, కీ బోర్డ్‌ను ఒత్తుతుంటే వేళ్ళ కొసలు, చేతుల కోమలత్వం, అప్పుడప్పుడు ఆప్తభావంను ప్రతిబింబించే

పెదాల అంచుల నవ్వుల రేఖలు, ఆమె తల ముడినుంచి టేబిల్ మీద పడిన మల్లెమొగ్గ,. ఆమె చెప్పుల సప్పుడు... తనని తాకుతూ వెళ్ళే ఆమె ఓణి, ఆమె మృదుపలుకులు, ప్రవర్తనం, వ్యక్తిత్వము... ఒక వెచ్చని చిరు జీవం... అన్ని సుగుణాలు ఆమెలో కలగాపులగం అయ్యివున్నవి. ఆమెను ఇంటికి ఆహ్వానిద్దాం. అమ్మతో పరిచయం చేద్దామంటే, ఆ తెల్లటి యువతి సదా ఆమె పక్కనే ఉండేది. ఫోన్ చేస్తే. ఎట్లాగబ్బా! ఔను చెస్తే సరి అన్పించగా ఆమె నెంబరు ఎట్లాగూ తెలుసుగదా. ఇప్పటికి ఇంటికి చేరుకొనే ఉంటది అనుకొని కూర్చున్నా. నంబర్ నొక్కా. తను రిసీవర్ పట్టుకొనే ఉండగా, పక్కనున్న మరొక ఫోను, ట్రింగ్.. ట్రింగ్.. ఎవరో గ్యాస్ బుక్ చేసుకోటానికి అవ్వచ్చు అనుకొంటూ ఎడంచేత్తో ఆ ఫోన్ ఎత్తి తను ఎప్పటిలాగానే 'నమస్తే భారత్ గ్యాస్' అనే తన ధ్వనే వినబడుతుంది గదా అని అనుకునేటప్పుడు తక్షణమే ఒకటి గుర్తుకొచ్చింది. తను ఆమె నెంబరు బదులుగా తన ఆఫీసుదే ఇంకొక నెంబర్ నొక్కటం తన ధ్వనే ప్రతిధ్వనిస్తుంది అన్పించి నవ్వు వచ్చింది. ఆమె రేపు ఎట్లాగూ దొరుకుతది అనుకొంటూ తేలిక నవ్వుతో ఆఫీసును క్లోస్ చేసా.

వేసవి అవ్వటం చేత సాయంత్రం ఏడు గంటలైనా ఇంకా వెలుతురే. ఆటోలు, బస్‌లు, కార్లు, ఫుట్‌పాత్ మీద నడుచుకు పోయే జనం, పానిపురి అమ్మే బండివాడు, కూరగాయల బండివాడు... ఇట్లా చూస్తూ అర క్షణం నిలిచిపోయా. కొంచం ఎగుడు దిగుడుగా ఉండే రోడ్డులో అన్ని సుయ్ అని పోతున్నవి. తను ఆగి చూస్తుండగా పళ్ళబండిని నెట్టుకొంటూ వెళ్తున్న ఆ బండి ఆమె, రోడ్డు డౌనులో ఉన్నప్పుడు తన భారాన్ని దానిమీదే వేసి పోసాగింది. ఆమె నేలమీద లేకుండా చీకుచింతా లేకుండా ఆ బండిమీద పోతుంటే నాకు భలే ఆనందం కలిగింది. ఆమె వెంబడే నేను కూడా చిన్నపిల్లవాడిగా, ఆమె కొడుకు లాగ రూపాంతరం చెంది, దర్జాగా బెంజ్‌కారులో కూర్చొని పోతున్నట్లుగా ఆమె మనోభావాన్ని, ఆ పల్లపు దారి, ఆ బండి... ఇట్లా వీరేశ్ అక్కడే నిలబడి, ఆమె కనుమరుగైయ్యేదాక చూస్తుండే నిలబడిపోయాడు.

❀ ❀ ❀

('నమస్తే భారత్ గ్యాసు' అనే ఈ కథను కన్నడంలో రచించిన వారు సుమంగళాగారు. కన్నడప్రభ నుంచి ప్రచురించబడిన ఈ కథను తెలుగులోకి అనువదించాను. 12/02/06)

**శాఖమూరు రామగోపాల్**

# వేలం

దేముడు ముందు ప్రోగైన ఆకుఅలంను తీసుకొని పశువుల కొట్టానికి వెంకటాచల భట్టు మునపటికన్నా ఎక్కువ హుషారుతో వెళ్ళాడు. "జననీ రేపట్నించి నీకు ఆకు – అలం ఉండదు. దుగ్గడి గొడ్లచావిడిలో రుచికరమైన పిల్లిపెసర, జనప ఆకు, పచ్చిగడ్డి, గంజితో ఉన్న ఎసరు నీకు దొరుకుతవి. నీ యజమానురాలికి మరేమి ఆలోచనలేకుండా చెంబునిండా పాలను ఇచ్చి, చావిడి నిండా పెయ్యదూడల్నే ఈనమ్మా.... తెలిసిందా?"

భట్టు ఇంకా మాట్లాడుతాడేమో, అంతలో కలావతమ్మ అక్కడకు వచ్చింది. "ఎంతపనిని చేస్తున్నారు మీరు? ఎదెకొచ్చిన, మైలతో ఉన్న ఆవుకు దేముడి ముందున్న ఆకు– అలము వేయటమే? ఇదెంత వైదికుల పద్ధతి? చూసేవారు ఏమనుకొంటారు?"

ఇదేమి వెంకటాచలభట్టుకు తెలవని సంగతా! అయితే గోమాతకు ఎటువంటి మైల ఉంటది?

భట్టు కలావతమ్మ వెనుకే లోనికి వచ్చి, ఆమె కొసరి కొసరి వడ్డించినదాన్ని సుష్టుగా భుజించి లేచాడు. ఆ పిమ్మట అరుగుమీదకొచ్చి వక్క – తాంబూలం వేసుకొని కాలుపీఠమీద కూర్చొని ఏదో దేముడి పాటను తాళం, మద్దెలతో రాగాలాపన చేయసాగాడు.

భట్టు తమ కొట్టంలోని ఆవుల్ని అమ్మేది ఇదే మొదటిసారికాదు. కలావతికి కడుపులో ఏదో గడ్డ పెరగటం, ఆమెను షిమోగాలోని పెద్ద ఆసుపత్రికి తీసుకొని వెళ్ళినప్పుడు, ఇంటిముందున్న చిన్నమడిలో వక్కతోటను వేసినప్పుడు, ఇంటికి మంగళూరు పెంకులు వేయించినప్పుడు... ఇట్లా వృద్ధి చెందిన ఒకటో రెండో ఆవుల్ని ఆయన అమ్ముతూనే వచ్చారు. అయితే ఎంత నరికినా, చిగురులతో మళ్ళీ పెరిగే ఇరికెచెట్టు లాగ ఆయన చావిడిలో ఆవులు వృద్ధి చెందుతూనే ఉండేవి. అయితే 'ఇప్పటి దాకా కానరాని సంతోషం – సమాధానం ఇప్పుడాయనలో కలుగుతుంది' అంటే దాన్లో ఏదో విశేషం ఉండాల్సిందే!

చావిడ్లో ఆ నెలలోనే దూడల్ని వేసిన శారద మరియు గౌరి ఉన్నవి. ఇప్పుడు దేవి కూడ ఈనింది. పొద్దు పొడిచింది అంటే కలావతికి ఒక ఝుంజాటం. "ఇంట్లో ఉండేది ఇద్దరం, మూడు నాలుగు ఆవుల పాలు ఎందుకు? స్నానం చెయ్యటానికా? ఒక దాన్నైనా అమ్మండి" ఈ మాటల్ని చావిడిలో విన్న దుగ్గ "ప్రభో! ఇట్లా చెప్తున్నాను అని అనుకోకండి. మీరు నాకు ఒక ఆవును ఇవ్వండి. ఇప్పుడు పదో పరకో తీసుకోండి. మిగిలినదాన్ని మీ

చావిడిలో, మీ వక్కల తోటలో ఊడిగం చేసి తీరుస్తాను. నా ఇంటిది బాలింతరాలు... నవజాత శిశువు ఉంది... అందుకోసం అడుగుతున్నా" అని విన్నవించుకొన్నాడు దుగ్గ.

దుగ్గ మూలాన భట్టుకు ఒక గిరాకి దొరికినట్లైంది. గిరాకీలలో కూడ స్పర్థ ఉంటది అనేది ఆయనకు తర్వాత తెలిసివచ్చింది. ఎండుగడ్డిని ఆవులకు వేసి వస్తుంటే తిమ్మనాయ్క "భట్టుగారు..... ఒకవేళ మీకు మూడు ఆవులు ఎక్కువైతే నాకు ఏదైనా ఒకదాన్ని అమ్మండి. నేను నగదు 500 ఇస్తాను. మిగిలిన బాకీని రేపు లేదా ఒక వారంలో ఇస్తా. మాకు ఎన్ని పశువులు జమ అయినా పశువుల ఎరువుకు కొరతే" అని అన్నాడు. భట్టుగారి ఆవుల డిమ్యాండ్ అక్కడితో నిలిచిపోలేదు. మొన్న ఊర్లోని గుడిలో దేవి మహాత్మ్యం గురించి చర్చించటానికి వచ్చిన ధర్మకర్త మాబ్లయ్య (మహాబలయ్య) గారూ "భట్టూ.... ఇదేంటండి. చావిడ్నిండా దూడలు, ఆవులు నిండిపోయి ఉన్నవి. వాటినన్నిటిని మెంటేన్ చేయటం అవుతదా? అవుతది అనుకొంటే ఉంచుకోండి... ఒకసారి అమ్మాలనుకొంటే నాకివ్వండి. అదెంత రేటోచెప్పండి... క్యాష్ ఇచ్చి తీసుకొని వెళ్తా" అని అన్నారు.

నిత్యం లేస్తూనే గోమాతలకు నమస్కారాలు చేసే భట్టు ఆవుల్ని వేలానికి పెట్తారా? ఛీ!

ఆరోజు మంగళవారం తెల్లవారు జామున అమ్మగుడిలో దేవీ మహాత్మ్య పూజ పారాయణం నడుస్తుంది. నవిలేసర మాబ్లయ్యగారిదే ఆధ్వర్యం. వెంకటాచలభట్టు వెండి బిందెలో గంగను నింపి దాని కంఠం చుట్టూ ఎఱ్ఱటి బంతిపూల మాలను కట్టి, బిందెమీద టెంకాయ పెట్టి,బిందె అడుగున మామిడి ఆకుల్ని సాలుసాలుగా పేర్చాడు. దేవస్థానం సమితి వాళ్ళు తెచ్చి ఇచ్చిన ఎఱ్ఱటి పట్టుచీరను మడతలు విప్పకుండా టెంకాయికి ఒత్తుకొనే విధంగా చుట్టి, దానిమీద వెండినాణాన్నిపెట్టి, శంకపుష్పాల రేకుల్నిచల్లి దేవీ కళశస్థాపనం చేస్తుంటే మాబ్లయ్య – శారదమ్మ ఇద్దరూ అగ్రపూజకు కూర్చొన్నారు. ఇంకేంటి, దేవీ ఆవాహన అయితే సరి, కుంకుమార్చన గంధచందన కల్పోక్తపూజె, సహస్రనామార్చన.... వీటన్నిటిని భక్తి శ్రద్ధలతో నించొని మొదటివరుసలో చూస్తున్న మాబ్లయ్యగారి కొడుకు వెంకటేశ మరియు కోడలు రాజలక్ష్మి, తర్వాత చిదంబరయ్య దంపతులు, వారి పక్కన అనంత పద్మనాభయాజి, బాపత్ మాష్టారు, ఆ తర్వాత 'నవిలేసర, హింగారకొడిగె, శివళ్ళి, సంపెగారు" పల్లెల జనం ఆ చిన్నగుడి ఆవరణలో చేరటం, గుడికి కొంచెం దూరంలో ఒక ప్రక్కన గుడి దిక్కుకు సదా చేతులతో దండాలు పెట్టి నిలబడినోళ్ళు... ఎవరంటే మైల, దుగ్గ,గుత్య మరియూ వాళ్ళ వాళ్ళ జనం ఇట్లా అందరూ దేవి గుడి దగ్గరే ఉన్నారు.

లోనున్న భక్తులు ఒక్కొక్కరే వెంకటాచల భట్టు దగ్గరకువచ్చి, తాము ఇంటి నుంచి తెచ్చిన పండ్లను దేవి కలశం ముందు పెట్టుంటే, భట్టు తమ పూజ మధ్య విరామం చేసుకొని, వాళ్ళ వాళ్ళ కుటుంబాల యజమానుల పేర్లను మొత్తం జనానికి వినబడేటట్లుగా మంత్రం లాగ రాగబద్ధంగా పలికేవాడు. ఇంకా తనకి పరిచయం లేని పిల్లలు తమ కుటుంబాల పరంగా పండ్లను ఇస్తే వాళ్ళ నుంచే పెద్దోళ్ళ పేర్లను అడిగి, దాన్ని తనొకసారి ఒత్తి చెప్పేవాడు. తీరా సప్పగా ఉండే పేరును కూడా వెంకటాచల భట్టు నోటినుంచి వస్తుంటే పేర్ల వికారాల్ని పోగొట్టుకొని రమ్యంగా వినబడేవి. మహాప్రాణి అక్షరాలైతే ఇంకా జీవం నింపుకొని దృఢంగా బయటకు వచ్చేవి. కొంతమంది పండ్లుతో తామే మాలలు కట్టిన పూలమాలల్ని తెచ్చేవారు. భట్టు వాటిని అంతే శ్రద్ధతో ఎత్తుకొని దేవికి చుట్టి, వాటిని తెచ్చిన భక్తులను నగుమోముతో దేవీపరంగా ఆశీర్వదించేవాడు. ఇట్లా ఆయన మూడు నాలుగు పనుల్ని ఏకకాలంలో చేస్తూ దేవీ మహాత్మ్య పారాయణకు సిద్ధమవుతూ కేసరి రంగు మడి బట్టలో చుట్టబెట్టిన పుస్తకాన్ని తెరిచారో లేదో... ఆయన చూసిందేమిటి? దేవీనే.

మధ్యపాపిటితో,మల్లెల్ని జుట్టుముడిలో నింపుకొని, నిర్మలమైన ముఖంతో, నుదుటి మీద రూపాయి బిళ్ళంత కుంకుమబొట్టుతో, సంపెంగ లాంటి ముక్కుమీద ముక్కు పుడకతో, మెడలో ఎర్రటిరాళ్ళ దండతో, చెంపలకు తేలికగా పసుపు పులుముకొని వస్తున్న ఆమె పదిహేను సంవత్సరాల క్రితం తన ధర్మపత్నిగా గడప తొక్కిన ఆమెనా?

ఆకుపచ్చగాజులతో, చేతివేళ్ళ సంధులలో చిన్న టెంకాయి పట్టుకొని భట్టు ఎదురు అమాయకంగా కూర్చొంది. అయితే....

అరె! అదెందుకో వెంకటాచలభట్టు అథోముఖం అయ్యారు. కళ్ళు ఎందుకో ఉన్నట్లుండి చిన్నవిగా, పెదాలు అదురుతూ ఉన్నవి? లేదు... పెదాల్నించి మంత్రాలు రాలటం లేదు. అవును, కలావతి తొడిగిన చీర ఖండితంగా ఆమెది కాదు. ఆమెకున్నది ఒకేఒక పట్టుచీర. వాళ్ళ నాన్న ఆమెకు పెళ్ళిలో కట్టబెట్టింది ఆ ఒక్కచీరే. సరె ఇప్పుడు కట్టుకొన్న చీరె? వెంకటాచల భట్టు అంతర్ముఖి అయిపోసాగాడు.

"వెంకటాచలభట్టూ... మీ భార్య మీకు చెప్పకనే ఎంతో డబ్బు తగలేసి కొత్త చీరను కొన్నది అని అనుకోవద్దు. అది మాబ్లయ్యగారి కోడలు రాజలక్ష్మి చీర."

"అట్లైతే అది కొత్తదేమీ గాదు... తొడిగిన చీర అది"

"నాకైతే అత్త – కోడల చీరకన్న మన కలావతమ్మ కట్టిన చీరే బాగుంది"

"కలావతమ్మ వాయిల్ చీరలోనే భలేగా ఉంటారు. ఇక పట్టుచీరలో అయితే చెప్పేదేముంది."

"ముఖము – ఒడి నింపుకొని నిండుగా ఉన్న ఆమెను చూస్తే భట్టు ఇంటిలో సిరిసంపద ఖండితంగా వృద్ధిలోనే ఉంది అనే భావన ఉంటది" అని ఆ విధంగా తనలోతనే భావించుకొంటూ వెంకటాచలభట్టు యాంత్రికంగా దేవీపారాయణ, నైవేద్యం, మహామంగళారతి, ప్రసాద వితరణం వీటన్నింటిని జటాపటీగా ముగించాడు. ముఖ్యుల పంక్తిలో భోజనానికి కూర్చొని వడ్డించేవాళ్ళు వేసిందాన్ని కాదనుకుండా, వడ్డించకుండా ఉన్నవాటిని కావాలి అనకుండా భోజనాన్ని ముగించాడు. మడివస్త్రాన్ని తొలగించి, పంచెను కట్టుకొని, అదేదో నెపంచెప్పి ఇంటికి వచ్చాడు. ఆయన ఈ నడవడికెను సూక్ష్మంగా గ్రహించిన కలావతమ్మ తమ చావిడిలో ఒక ఆవు ఈనేదుంది అని చెప్పి, సటసటగా ఇంటికి వచ్చింది.

మీరెందుకు ఇట్లా బుసగొడ్తూ ఇంటికి వచ్చింది అనేది నాకు గుర్తే. నేను రాజలక్ష్మి దగ్గర 'నాకు కట్టుకోడానికి చీరలేదు ఇవ్వు' అని అడుక్కోలేదు. అయితే ఈరోజు ఆమె చంటోడు నా చీర మీద కక్కాడు. ఇంటికొచ్చి వేరే చీరను కట్టుకొని వెళ్ళాలి అని అనుకొన్నా. దానికి రాజ్యలక్ష్మి తను దాచుకొన్న ఇంకొక చీరను కట్కోండి అని ఒత్తిడి చేసింది. వద్దు అని ఎంత చెప్పినా వినలేదు. సరె అని కట్టుకొన్నా. ఇంతకూ ఇంటికొచ్చి కట్టుకోటానికి మరొక పట్టుచీర ఉందా! మాబ్లయ్యగారి ఇంటోళ్ళు అంటే మనకేమి పరాయివాళ్ళా? మనం కష్టంలో ఉన్నప్పుడు వారు మనకు ఉపకారం చేయలేదా. మీరే చెప్పండి?

వెంకటాచల భట్టు ఇంకా బుసగొడ్తూనే ఉన్నాడు.

"సర్లే. వాళ్ళు తమ శ్రీమంతతనాన్ని చూపించుకోటానికి నీకు పట్టుచీర ఇచ్చారు. నువ్వు పళ్ళు ఇకిలించుకొని కట్టుకొన్నావు. ఎవరో ఇచ్చిన చీరను కట్టుకొని సభ ముందు రావటానికి సిగ్గు అవలేదా? పోనీయి. మగడు ఒకడున్నాడు… అతని మనస్సుకు ఏమనిపిస్తదో అనే పరిజ్ఞానం అక్కరలేదా. చూడు, నీ తలరాతకు ఒక పట్టుచీర కొంటానికి నాకు కాలేదు. మాబ్లయ్యగారు ఇచ్చారు అనేవిధంగా కట్టుకొని అందరెదురూ తైతెక్కలాడావు గదా ముదనష్టపుదానా….."

"చూడండి. మాబ్లయ్యగారు నా తండ్రి లాంటివాడు. మీరు అంత వ్యక్తి గురించి తక్కువ తనంతో మాట్లాడితే దేముడు మెచ్చుకోడు. ఇదేమైనా ఆయన చెవిలో పడిందో…."

"పడ్తే పడనీయి. ఏ వెంక్యా , నువ్వు చెప్పావు గదా, నీ భార్యకు బట్టలు కొని సాకేది నీవల్లకాదని. నేను ఇచ్చాను చూడు అంటూ మొత్తం ఊరికి చూపించే కోరిక అది. మాబ్లయ్యగారు, ఆయన కొడుకు – కోడలు అందరిదీ ఒకటే మనస్తత్వం. తాము కట్టుకొని పారేసిన దాన్ని మనం కట్టుకొని మానం ముచ్చుకొనేవాళ్ళు అంటూ వాళ్ళు భావిస్తే, నీకు అంతగా అర్థం గాలేదా?"

వెంకటాచల భట్టు కోప ప్రవాహంలో వివేకాన్ని పోగొట్టుకొంటున్నాడు అని కలావతమ్మ భావించసాగింది. ఈ రోజు పొద్దున్నే మాబ్లయ్యగార్ని దేముడనే తలమీద పెట్టుకొని తిరిగినోడు ఈయనేనా? ఇట్లా ద్వేషాసూయలతో కుతకుతలాడుతున్న భర్తను కెదికే పిచ్చితనానికి పోకుండా కలావతమ్మ ఊరుకుంది. అప్పుడు మాబ్లయ్యగారి మనమడు శేషగిరి అక్కడికి వచ్చాడు.

"భట్టుగారూ... నాన్న చెప్పమన్నాడు. రేపు తాతకు బయటకు ఎక్కడికో వెళ్ళేది ఉందట. అందుచేత ఈ రోజే దేవిని ఉద్యాపనె చేయాలంట. అదేగాకుండా, దేవికి కట్టిన చీరనూ వేలంకు ఈదినమే అయితే జాస్తిగా జనం పోగవుతారట. దానివలన మీరు తొందరగా గుడికి రావాలట " అని చెప్పాడు.

"చూడు శేషగిరి, దేవి ఉద్యాపనెను మన అనుకూలానికి తగినట్లుగా చేయరాదు. మీ తాతకు చీర వేలం వేయటానికి జనాన్ని జమచేయాలి అంటే శనివారం తాళగుప్పెలో సంత జరుగుతది కదా.... అక్కడే వేలంకు పెట్టమను. ఈ రోజు చీర వేలం అంటారు. రేపు కళశానికి ఉంచిన వెండి బిందె వేలం అంటారు. ఈ హెగ్డెగారి (ధర్మకర్త) తాళమేళకు మేము వైదికులం డ్యాన్స్ చేస్తూ కూర్చొంటే అన్నిదినాలూ నాట్యమే చేపిస్తారు. తైతెక్కలాడటానికి మేమేగాదు – మా భార్యాపిల్లలూ దాన్లోనే ఇరుక్కుపోవాల్సిందే. దేవి ఉద్యాపనె అంటే పిల్లలాటా?" అని అన్నారు.

భట్టు మాటలు అర్థంగాక శేషగిరి తికమక అయ్యాడు. చివరిగా 'అలా అయితే నేను వెళ్తా' అని వెళ్ళిపోయాడు. అతను వెళ్తుంటే వెంకటాచలభట్టు గడ్డానికి చేతులు ఆనించి సహజస్థితికి రావటానికి ప్రయత్నించాడు.

నాకు ఇవ్వాళ ఏమయింది? కలావతి చెప్పినట్లుగా ఈ మాబ్లయ్యగారు మునిగి పోతున్న నా సంసారాన్ని ఎన్నోసార్లు మీదకు నెట్టాడు కదా! అదేదో తోటలో కోతులబెడద నివారణకు రక్షణగా కాపలాకాసే నన్ను నవిలేసరకు తీసుకొచ్చి, దేవీ పూజెకు నియామకం చేసింది ఈయనే గదా. ఆ తర్వాత పెండ్లి, విందు చేయించి ఉండటానికి చిన్న ఇల్లును

నిర్మించి ఇచ్చింది ఈ మాబ్లయ్యగారేకదా! అటువంటి వారు ఈ రోజు తనకు అయిష్టమా? ఒకవేళ నేను అన్న మాటలన్నీ శేషగిరి తన తండ్రికో, తాతకో చెప్పితే వాళ్ళేమనుకుంటారు?.. దేవతా కార్యం కోసం నా భార్య కొంచెం సేపు వారి కోడలి ఒత్తిడికి లోనై చీరను కట్టుకోటం అపరాధమే? లేక ఆ చీరను నా భార్యకు ఒత్తిడిచేసి కట్టించిన వైనం ఆ ఇంటివారి తప్పేనా? ఇదెంత పెద్ద విషయం? ఈ ఊరిలో ప్రీతి – విశ్వాసాలకు ఒకరి చీర ఇంకొకరు కట్టుకోటం లేదా? సభలో కలావతి అందరెదురు ఎవరిచీర మూలానో ఆకర్షణీయంగా కనబడింది అనేది నన్ను కోపిష్టిని చేసిందిగదా? నలుభయ్యో పడిలో ఉన్నామె, మహిళలే నిండియున్న ఆ సభలో ఈర్షను కలిగించింది అంటే? ఛీ....

"ఏమోయ్, నేను గుడిదాక వెళ్ళివస్తా. ద్వారం వేసుకో"

భట్టు ఆవరణదాటి పది అంగలు నడిచాడో లేదో మాబ్లయ్యగారే ఎదురయ్యారు. "భట్టూ, ఎంతోడివయ్యా నువ్వు. భోజనం చేసి చేతులు కడుక్కొని ఇంటికి పరిగెత్తుకొని వెళ్ళావు గదా! అదేంటి అంత అర్జంట్ కార్యం ఇంటిలో? గుర్తైందిలే! రూపవతి అయిన భార్యతో ఏకాంతాన్ని కోరుకొనేది సహజమేలే? భట్టూ రేపు ఉదయం బదులు ఈరోజు రాత్రినే దేవి ఉద్యాపన చేయండి. రేపు నాకు ఉదయమే బయటకు వెళ్ళాల్సిన పనుంది. అదే గాకుండా, ఎట్లాగూ ఈ రాత్రి మంగళారతి కని జనం వస్తారు గదా. అదే సమయంలో దేవి చీరను వేలం వేద్దాం. జనం జాస్తిగా ఉంటే డబ్బు బాగా వస్తది. దానిచేత దేవస్థానంకూ నాలుగు కాసులూ ఎక్కువ దొరుకుతది. ఏమంటారు? మీరు వేలంలో ఒకట్రెండు హుషారు కేకలు వెయ్యండి. ఎందుకొదులుకుంటారు? కలావతమ్మకు పట్టుచీర అంటే బాగాఇష్టమే గదా! ఇవ్వాళ చూచారుగదా.... ఎంత లక్షణంగా దేవిలాగ కనబడ్తుంది." మాబ్లయ్యగారు నిండు మనస్సుతో అన్నమాటలు భట్టును మళ్ళీ గుచ్చసాగాయి.

"మాబ్లయ్యగారూ, దేవి ఉద్యాపనెను సాగర పట్టణంలోని బస్టాండు గణపతి లాగ మన అనుకూలంకు తోచినట్లుగా చేసేదిగాదు. ఈ రోజే చెయ్యాలి అంటే చేస్తాను సరేనా. అయితే సామాన్య పద్ధతి అంటే ఈ రోజు పూజ, రేపు ఉద్యాపనె, ఇంకా దేవీ చీర వేలం విషయం... మన ఊరి జనానికి ఈ రోజు సాయంత్రమైతేనేమి లేక రేపు సాయంత్రమయితేనేమి? ఒకరోజుకు ఆగలేరా? ఇటువంటివి మీకు చెప్పాలనే అనుకొని మీ ఇంటి దారి పట్టాను. అంతలోపే మీరొచ్చారు" మాటలు ముగుస్తుంటే వెంకటాచల భట్టుకు విచిత్రమైన సమాధానం కలిగింది. ఇదేంటి ఈ రోజు మా భట్టు ఇలా ఉల్టా

మాట్లాడుతున్నాడు? భట్టు ఎన్నోసార్లు వ్రత – నియమ – పద్ధతుల్ని సడలించలేదు? సార్వజనికంగా నడిచే ధార్మిక కార్యాలకు అరకొర రాయితీలు ఉండేవేగదా. వెనుకెప్పుడూ భట్టు ఈ రకంగా నిష్ఠురంగా కట్టె విరిచినోడు కాదు గదా! సర్లె ఉండనీయి. ఇప్పుడు ఆయన్ని గోకటం వద్దులే అని యోచించుకొని “సరే అట్లాగైతే రేపే కానీయండి. నా ఒక్కడి కోసం పద్ధతిని మార్చుకోటం వద్దులే” అని మాబ్లయ్య గారు తన తోట వైపుకు వెళ్తుంటే, వెంకటాచల భట్టు చల్లబడ్డాడు.

“లేదండి మాబ్లయ్యగారు... నాకు ఇలాగే అనే హఠం ఏమీ లేదు. ఇంకా ఒకరోజు వాయిదా అంటే పూజకు వచ్చేపోయేవారికి కష్టమే.మీరు చెప్పిన విధంగా ఈరోజే విసర్జన ముగించేద్దాం. ఇక కమిటి అధ్యక్షుడు చెప్పిన తరువాయి నాదేంటి అభ్యంతరం” అని అన్నాడు. మాబ్లయ్యగారు లోలోనే నవ్వుకొంటూ “సరే అట్టైతే నేను ఇంటికి వెళ్ళి అందర్నీ తీసుకొని గుడికి వస్తాను” అని చెప్పి వెళ్ళాడు.

వెంకటాచల భట్టు ఇంటికి వచ్చి అల్మారా రెక్కల్ని తెరిచాడు. ఈ నాలుగైదు సంవత్సరాలలో అపురూపానికి అయిన దాచి ఉంచిన సంపదను వెతకసాగాడు. పసుపు, కుంకుమల్ని పూసుకొని ఉన్న 2,5,10 రూపాయల నోట్లు కొన్ని, ఒకటి, రెండు రూపాయలు నాణాలు అవన్నీ కలిపితే మూడొందలు అయినవి. భట్టు అక్కడ్నించే కేకేసాడు.“ఏమోయ్, నీ దగ్గర పాలు,వెన్న అమ్మిన రొక్కం ఏమైనా ఉందా?” అప్పుడు అదేంటో పనిలో ఉన్న కలావతమ్మ వచ్చి మడతల మడతలలో ఉన్న కొన్ని నోట్లను భర్త చేతిలో పెట్టి “ఇక విషం తాగడానికి నాదగ్గర మూడు కాసులు లేవు” అంటూ సటసటనే లోనికి వెళ్ళింది.

భట్టు గుడికి వచ్చేటప్పటికే చాలమంది జనం పోగైయ్యారు. పూజ, నైవేద్యం, మహామంగళారతి అయిన తరువాత ఉద్యాపనం, ఆ తర్వాత ప్రసాద వితరణం ఇవన్నీ అయిన తరువాత మాబ్లయ్యగారు సభను ఉద్దేశించి ప్రసంగం మొదలుపెట్టాడు. “చూడండి ఇప్పుడు దేవికి కట్టిన చీరెకు... వేలంపాట మొదలవుతది. దీనిలో తుంటరితనంతో పాల్గొనరాదు. వ్యాపారదృష్టితోనో, స్వార్థంతోనో కేకను పెట్టరాదు. ఆ దేవీ ప్రసాదాన్ని మనం ఎవరూ అసాధ్యమైన రేటుపెట్టి ప్రతిష్ట చూపించరాదు. అట్లాగే కంజూసుతనంతో ఊరికే పొందగూడదు. ఇక డబ్బును ఇప్పటికిప్పుడే ఇవ్వాల్సిన పనిలేదు” మాబ్లయ్య గారు ఇంకా మాట్లాడాలి అనే ఉత్సాహంతో ఉన్నారు. అయితే ఆయన నమ్మకాలకు శ్రోతృలైన ముందు వరుసలోని మహిళలు ఎవరికివారే తమలోతాము అన్నట్లుగా గజిబిజిగా

రెడి అయ్యారు. అదేంటో ఇదే మొదటిసారి వేలంపాటలో పాల్గొన్నట్లుగా ఆ మహిళలో ఉంది. ఇదంతా సూక్ష్మంగా గ్రహించుకొన్న మాబ్లయ్యగారు పెద్దగా చెప్పారు."చూడండి ఇప్పుడు దేవీ ప్రసాదం అయిన చీర... వేలం... మొదటి పాట మొదలు... మొదటిగా సర్కారి సవాల్ పాట రెండొందలు."

సభలో మౌనం. రెండొందల ఏభై.... నాలుగు వందలు. తిమ్మనాయ్క తన పక్కనే నించున్న సంజూసెరెగార ముఖాన్ని చూడకుండానే కేకేసాడు.

ఇప్పుడు భట్టుకు లోనలోనే వణుకు ప్రారంభమైంది. వేలం తన గరిష్టమొత్తాన్ని దాటి ఇంకెక్కడికో ఎగురుతున్న అనుభవం ఆయనకి కలిగింది. ముష్టిని బిగుతుతో పట్టుకొని, అదురుతున్న కంఠనుంచి పలికాడు..... "నాలుగువందల ఒక రూపాయి" అని. సభ మొత్తం పకపకా నవ్వింది. నోరు తప్పి నూటొకటి అన్నానా అనే సంశయం ఆ నవ్వుల వలన ఆయనలో కలిగింది. అప్పుడు ఎవరో, "అదెంతది ఆరతి పళ్ళెంలో పడే పావలానా?" అని అన్నారు. వెంకటాచల భట్టుకు లోనెక్కడో గుచ్చినట్లుగా నెత్తికి ఝుల్లనే భావన కలిగింది. "ఓహో అట్లాగా! నేను కాసుల్లేనోడినా అని ఊరు అందాజేమో అనుకొంటూ కంపించసాగాడు. అంతలో వేలంపాట 450 దాటి 475 దగ్గర నిలబడింది.

కొంతసేపు ఎవరూ ఏమి కేకను పెట్టకపోవడం చేత తమదే ఆఖరుకేక అన్నట్లుగా మాబ్లయ్యగారు 500 అన్నాడు. మాబ్లయ్యగారి కేక ఎట్లుందంటే 'ఇకచాలు ఇది' అనేలాగ ఉంది. చీరకు ఆయన కట్టిన ధరకూ సభ కూడా సమ్మతించినట్లుగా నిశ్శబ్దం అయిపోసాగింది. అక్కడక్కడ కొంతమంది స్త్రీలు మాట్లాడుకొనేది తప్పితే....

"మా ఇంటోళ్ళు ఇంకా జాస్తి పాడొచ్చు.. అయితే ఆ చీరెకు అంతే సరి"

"అయ్యా ఇప్పటికే జాస్తి అయ్యింది. మాబ్లయ్యగారవటం వలన దానికి అంతమొత్తం"

"అది దేవీ ప్రసాదం. కొంతమందికే అచ్చి వస్తది."

"అవునయ్యా అందుచేతే నేను ఇంటినుంచి వచ్చేటప్పుడే అనుకొన్నా. ఎంతైనా వద్దులే అని"

"పూజకు ఉపయోగించింది అనుకొంటే పసుపు కుంకుమ దానిమీద ఉంటది. కడుగుదామా అంటే కుదరదు. ఉంచేసుకొందామా అంటే ఆ మరకలు శాశ్వతమే."

"నా దగ్గర అదే రంగు చీర ఉంది. ఊరికే రెండెందుకు" అని

సభలో గజిబిజి ఎక్కువవుతుంటే మాబ్లయ్యగారి కొడుకు వెంకటేశ్ "ఇంకెవరైనా జాస్తికి కొంటారా, పాడతారా" అని పెద్దగా చెప్పాడు. సభ మౌనం వహించటం చేత మాబ్లయ్యగారు ఈ జనం అందరిలో దేవి ప్రసాద అనుగ్రహం తన కొక్కడికే కలిగింది అనే కృతజ్ఞతాభావం ఆయన హృదయంలో జనించి ప్రసన్న చిత్తుడైయ్యాడు. "ఈ సంవత్సరానికి ఈ తంతు ముగిసింది" అనుకొని తమని తామే సమాధానపరచుకొంటూ ఒక్కొక్కరే సభనుంచి నిధానంగా వెళ్ళసాగారు. ఎంతగానో అనుకూలస్థుడైన చిదంబరయ్యగారు, ప్రతినెల వేల రూపాయల జీతాన్ని పొందే మాధవ మాష్టారు, ఊర్లో అనేకమందికి వడ్డీలకు డబ్బులిచ్చే సంజూసెరెగార, తిమ్మనాయ్క.... ఇటువంటోళ్ళే ఆగిపోతే ఇక తనదేంటి అనుకొంటూ భట్టు సమాధానం చేసుకోసాగాడు.

సభ ఇంకేంటి ముగుస్తది అనే సమయంలో మాబ్లయ్యగారు తేలిక నవ్వులతో అనసాగారు. "వెంకటాచల భట్టు మీదేమైనా 501 రూపాయిగా ఉందా మరి?" పోగైన జనంకు అప్పుడు ఏదో ఒక కుశాలు అవశ్యకంగా కావాలి అనే వాతావరణం అక్కడుంది. అది భట్టునుంచే అవ్వాలి అనేది గాదు. మొత్తానికి బిగువు వాతావరణం తేలికవ్వటానికి.

వెంకటాచలభట్టు మాబ్లయ్యగారికన్న కొంచెం ముందుకే వచ్చి నిలబడి పెద్దగా చెప్పారు... 1001 రూపాయలని.

భట్టు కేక ఎదురులో నిలిచిన మహిళల శిరస్సులను సవిరి వెనుకున్న మగాళ్ళ భుజాల్కి తగిలి, గుడి బయటున్న సంజూసెరెగార, తిమ్మనాయ్కను దాటి, ఇంకా బయట రోడ్డు మీద నిలబడియున్న మైల, దుగ్గ, తిప్ప మొదలైనోళ్ళకు సుస్పష్టంగా వినిపించింది. మొత్తం సభ ఇదంతా తమ పరంగా వేసిన కేక అన్నట్లుగా జోరుగా "ఓహోహో" అంది.

ఇళ్ళకు వాపస్సవుతున్న నవిలేసర, హువినకొప్ప, హింగారకొడిగె, శివళ్ళి, సంపెగార మొదలైన అనేక పల్లెల జనం నోట్నించి "వెంకటాచలభట్టు 1001" లక్షరూపాయల పాటలాగ కన్పించింది. వారందరూ తమ దారి సగం ముగించేటప్పటికి పదిలక్షలై చివరికి ఇళ్ళను చేరేటప్పటికి కోటి రూపాయిల పాటగా ఆ వేలంపాట రూపాంతరం చెంది వాళ్ళ మనసులలో భట్టు చిరస్థాయి అవ్వటం, తన ప్రీతిపాత్రమైన ఇల్లాలుకు ఈ చీర ఒక కానుకగా అని భట్టు లోలోపలే అనుకోటం భలే చిత్రంగా ఉంది కదూ!!

❀ ❀ ❀

(అలకా తీర్థహళ్ళి అనే రచయిత్రి నుంచి కన్నడభాషలో జాలువారిన 'హరాజు' అనే కథను తెలుగులోకి 05/02/06 లో అనువదించాను.'

**శాఖమూరు రామగోపాల్**

# కమ్మరి వీరభద్రాచారి జ్యోతిష్కుడిగా మారిన తదుపరి

**మా** ఊళ్ళోని కమ్మరి వీరభద్రాచారి మంచి అంగసౌష్టవంతో, ఎంతో పనిమంతుడిగా గుర్తింపును పొందియున్నాడు. అతనికి అనేక రకాలైన పనులు వస్తుండటం వలన అతడ్ని మేమంతా సర్వతంత్ర స్వతంత్రుడు అని అనేటోళ్ళం. ఇనప పనిముట్లను చేసే దానిలో అతను ఎల్లప్పుడూ నిపుణుడిగానే ఉండేవాడు. సాధారణంగా కమ్మరోళ్ళు తామే ఇనుమును కాల్చుతూ, ఆ కాలిన ఇనుమును సుత్తులనుంచి బాదేందుకని వేరే పనోళ్లను చేర్చుకొంటుంటారు. సుత్తి బరువైనందుకో లేక బలం చాలదని అనుకొన్నందునో సోమరిపోతులుగా ఉండేటి కమ్మరోళ్ళలో కొంతమంది చేసే ఉపాయం ఇది. అయితే మా ఊళ్ళోని వీరభద్రాచారి ఎత్తలేనటువంటి సుత్తి ఏదీ లేనేలేదు. బక్కచిక్కిన పనోళ్లు ఎదురురొప్పులతో సుత్తి బరువుకు తామే ఓలలాడుతుండేటప్పుడు వీరభద్రాచారే లీలాజాలంగా ఒక చిన్నకట్టెను ఎత్తుకొన్నట్లుగా సుత్తిని ఎత్తి, కాల్చిన ఇనుము మీద దెబ్బల్ని బాదుతుండేవాడు. ఆ వీరబాదుడ్ని తట్టుకోలేక ఇనుము నుంచి బయటకు కక్కబడుతున్న అగ్నిశిఖలు కత్తికి కత్తి ఎదురైనప్పుడు ఆ కత్తులకున్న తీక్షణమైన అంచులనుంచి ఎగిరిపడే రత్నపు అగ్నికణికలుగా కనబడుతుండేవి మాకు. సాయంత్రం ముసురు చీకట్లలో కమ్మరి ఇంటి ముందు కొలిమిలో గనుక పని నడుస్తుంటే, ఆ చిరు చీకట్లలో రామబాణాలు లాగ బయటపడ్తున్న ఆ నిప్పుకణికల విన్యాసాల్ని చూసేందుకని ఊర్లోని పిల్లలంతా కమ్మరి ఇంటిముందు జమఅయ్యేవారు. పిల్లలకు అక్కడ నిత్యమూ అగ్నికీలల బాణాల నుంచి వచ్చే దృశ్యాలు నయనమనోహర ప్రదర్శనంగా ఉచితంగానే దొరుకుతుండేది. ఆ మందపాటి వెలుగులో నడుం వరకు మాత్రమే ఒక ముతకపంచెను కట్టుకొని, కాల్చబడిన ఇనుమును పనిముట్టుగా మార్చుతుండేటప్పుడు ఎగిసిపడుతుండే ఆ నిప్పురవ్వలు తన వంటిమీద పుష్పవృష్టిని కురిపిస్తున్నవేమో అనేటట్లుగా ఆ కొలిమి దగ్గర సగం దేహం వరకూ నగ్నంగా కూర్చున్న వీరభద్రాచారి ఆ పిల్లలకు అల్లావుద్దీన్ – అద్భుతదీపంలోని మాంత్రికుడి లాగ కనబడుతుండేవాడు.

కమ్మరి వీరభద్రాచారి సర్వతంత్ర స్వతంత్రుడని మొదలే చెప్పానుగా. అది ఎంతో ఘనమైన బిరుదు. కర్మకుశలత్వంతో కర్మదక్షుడైనోడికి అనేకానేక కర్మలను (పనులను) నేర్చినోడికి మాత్రమే ఇచ్చే బిరుదు అది. ఎంతగా వేదాంతి ఐనా, కర్మకుశలుడిగా అవ్వాలని చూపించేదానికనే, వైరాగ్యచక్రవర్తి, కవి, తార్కిక సింహుడూ ఐన వేదాంత దేశికులకు ఆ బిరుదును ఇచ్చారట ఆ కాలంలో. వారికి ఆ బిరుదును ఇవ్వగా ఒకసారి వేదాంత దేశికులుగారు కొలతలకు సరిగా తన పాదరక్షలను తయారుచేసి వృత్తిదారులకు పాఠాన్ని నిదర్శనంగా నేర్పారట. వేదాంతదేశికులు చేసేదాంట్లో దేనికైనా ఇంకొకర్ని ఆశ్రయించరాదనే తత్వమూ నిక్షిప్తమై ఉండేది. ఇదే తత్వాన్ని అనుకరించి మహాత్మాగాంధీగారూ మన పనులకని ఇతరులను ఆపేక్షించకూడదని చెబుతుండేవారు. కమ్మరి వీరభద్రాచారిదీ అదే తత్వం. అయితే అదొక తత్వమనేది అతనికి తెల్వదు. వేదాంతదేశికుల పేరును అతనెప్పుడూ వినలేదు. అయితే ప్రతి ఒక్క పనిని తనే చేసేది అతడి స్వభావంగా ఉంది. ఇదొక మంచిగుణం, మంచి తత్వం అని ఎవరైనా అతనికి చెప్తే అది అతనికి అర్థం అయ్యేదికాదు.

బాడిసెను పట్టుకొని అతను మొద్దును చెక్కేది ప్రారంభించితే ఒక పనోడికి ఎత్తుకొనేందుకు సాధ్యంగాన్నట్లుగా పెద్ద పెద్ద చెక్కలు గరుడపక్షి (గద్ద) ఎగిరినట్లుగా దూరం దూరంకు ఎగిరిపడుతుండేవి. ఇళ్ళను కట్టేదాన్లో, వైశాల్యాన్ని నిర్ణయించేదాంట్లో, మట్టిగోడలను కట్టేదాంట్లో, అంతస్తులకు చెక్కపలకలను జోడించేదాంట్లో, తలుపుల్ని (వాకిళ్ళను) సరిగా జోడించేదాంట్లో, తలుపులకు భద్రమైన గొళ్ళాలను బిగించేదాంట్లో ... మా ప్రాంతంలో వీరభద్రాచారి ప్రసిద్ధుడైయ్యాడు. పదిమంది కమ్మరోళ్ళు, వడ్రంగపోళ్ళు, మట్టిపనుల్ని చేసే తాపీమేస్త్రీల పన్నులన్నిటినీ అతనొక్కడే చేసి మా ఊరు, చుట్టుపక్కల ఊర్లలో వందలసంఖ్యలో ఇళ్ళను కట్టాడు. మా ప్రాంతంలో ఎక్కడెక్కడా చూచినా వీరభద్రాచారి కట్టిన ఇళ్ళే కనబడుతవి. ఆ ఇళ్ళ బిగువును, పటిష్ఠాన్నీ, విస్తారాన్నీ చూస్తూ వందల సంవత్సరాల వరకూ ఆ ఇళ్ళకు ఏ అపాయం కలగదని ఎవరి కళ్ళకైనా కనబడేవి.

మా ఊరి పూజారైన నరసింహయ్యగారి ఇంటిని వీరభద్రాచారే కట్టాడు. పట్టణాలలో ఉండుంటే ఆ ఇంటికి అరవైయ్యో, డెబ్భైవేల రూపాయలో అయ్యేది. ఊరే ఐనా, మా ఊర్లో అప్పటికాలంలోనే పదివేల రూపాయలు అయిందట. ఖర్చుదృష్టిలోనూ,

ఉపయోగించిన సామాన్ల యోగ్యతనుంచో నరసింహయ్యగారి ఇల్లే వీరభద్రాచారి కట్టించిన ఇళ్ళ అన్నిట్లో శ్రేష్టమైందిగా గుర్తించబడింది. ఇప్పటివరకూ నరసింహయ్య దేవుడి పూజను గుళ్ళో చేస్తున్నా, వ్యవసాయదారుడవటం వలన ఊర్లోని జ్యోతిష్కుడికి పద్ధతి ప్రకారం నాలుగు వరికంకులున్న మోపుల్ని ఇస్తుండేవాడు. అది అనేక తరతరాల నుంచి నడుచుకొంటూ వస్తున్న ఒక పద్ధతి. అయితే ఇప్పుడు నరసింహయ్య 'తనే దేవుడి పూజారిగా ఉండటంచేత, తనూ జ్యోతిష్కుడి లాగనే మనుషుల శక్తిని మీరిన శక్తిని ఆశ్రయించుకొని యుండటం చేత, ఈ పండిన వరి గడ్డికంకుల మోపుల కానుకను జ్యోతిష్కుడికి తను ఇచ్చేది అనవసరం' అని భావించుకొన్నాడు. జ్యోతిష్కుడిది నక్షత్ర గ్రహాలపూజ, నాది వాటన్నిటికి ఎక్కువైన ఆంజనేయుడి పూజ. నాదేమి తక్కువగాదు? అని అనుకోసాగాడు. ఆ సంవత్సరం జ్యోతిష్కుడు పూజారి గారి పంటల నూర్పిళ్ళను చేసే కళ్ళెం వద్దకు పంటకంకుల మోపులకని రాగా పూజారి 'ఇకముందు నామీద గ్రహాల ఆటలు నడిచేవి లేదు. మీకు గ్రహాలు ఉంటే, నాకు ఆంజనేయుడు ఉన్నాడు. పొండి అటు' అంటూ గదిరాడు. తనకు ఇచ్చేవాళ్ళ సంఖ్యే దినదినంకూ తగ్గిపోతున్న దాన్ని గమనించుకొన్న జ్యోతిష్కుడికి ఈ కటువు మాటలు అంతగానేమి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. అతను మాట్లాడకుండానే వచ్చిన దారిని పట్టి తిరిగి బయటకే వెళ్ళిపోయాడు.

అయితే, పూజారి నరసింహయ్య కొన్ని రోజులలోనే జ్యోతిష్కుడిదగ్గరకు గృహప్రవేశం గురించి మరలా ముహూర్తాన్ని అడిగేందుకని కలవాల్సి వచ్చింది. హనుమంతరాయుడ్ని ఎంతగా స్వాధీనంలో పెట్టుకొన్నా , గ్రహాలు మరియు నక్షత్రాల గతిని జ్యోతిష్కుడి చేతినుంచి లాక్కొనేది నరసింహయ్యకు సాధ్యం కాలేదు. జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్ళేందుకు పూజారైన నరసింహయ్యకు కొంచమూ ఇష్టంలేదు. అయితే అతడి భార్య 'వెనుకటి కాలంనుంచి ఉంటున్న వారు జ్యోతిష్కుడు. ఆయన కుదిర్చిన ముహూర్తానికి గృహప్రవేశం చేయించుకొన్నోళ్ళకు అంతా శుభమే జరిగింది. వారినే మంచి ముహూర్తానికని అడిగిరండి' అంటూ హుకుం చేసింది. నరసింహయ్య 'ఆ జ్యోతిష్కుడి మాటలన్నీ గారడీనే... ఆ గ్రహాలకు, నక్షత్రాలకు వేరేగా పనులేమి లేవా.... నన్ను, నా క్రొత్త ఇంటిని వెతుక్కొని, తిరిగేందుకు?' అనుకొంటూ జ్యోతిష్కుడుండే ఇంటికి వెళ్ళాడు. 'క్రొత్త ఇంటికి ఏ రోజున వెళ్ళొచ్చు' అని నరసింహయ్య జ్యోతిష్కుడ్ని అడిగితే, జ్యోతష్కుడేమో 'దాని మూలం నీపేరు బలానికి సరిగా లేదు.. నువ్వు ఆ ఇంట్లో నివాసం ఉంటే పురోగతి ఏమి ఉండదు..

ఎంతో బలంగా శాంతి చేపించాలి.... ఖర్చు విపరీతంగా అవుతది... ఏభైరూపాయలకు తక్కువలో ఆ కార్యం నడిచేది లేదు' అని అన్నాడు. జ్యోతిష్కుడికి తనమీద అసమాధానం ఉండేది నరసింహయ్యకు తెల్సియున్నందున అతను 'నీ పురాణాన్ని వినేందుకు నేను ఇక్కడికి రాలేదు.... నీ నుంచి బాధ్యతను లేకుండానే గృహప్రవేశాన్ని చేసుకొంటాను' అంటూ అక్కడినుంచి బయటకు నడిచాడు.

పూజారి నరసింహయ్య ఇంటికి చేరుకొని భార్యతో, 'నేను మొదటేచెప్పాను కదా... నా నుంచి ఏభైరూపాయలను గుంజేందుకు జ్యోతిష్కుడు పొంచియున్నాడని... వీటన్నిటికి నేను లొంగుతానా... రేపే కొత్త ఇంట్లోకి వెళ్దాం...' అన్నాడతను. అతని భార్య 'ఎక్కడైనా ఉందా ఈ విడ్డూరం? ఇంత ఖర్చుపెట్టి కోటగా ఇల్లును కట్టుకొన్న పిమ్మట శాస్త్రం లేకుండా పశువుల్ని కొట్టంలో కట్టేసినట్లుగా క్రొత్త ఇంట్లోకి వెళ్దామా? శాస్త్రప్రకారమే జరగాలి! బతుకును పెంచేదే ఇల్లు. పిల్లా - పాపలకు మంచే జరగాలి కదా! మన కాలమేమో అయిపోయింది.... అయితే పిల్లల నెత్తిమీద బండల్ని వేయకండి...' అంది కటువుగా ఆమె. ఊళ్ళలో ఏ గుట్టు సమాచారమైనా ఎంతో తొందరగా అందరికీ చేరుతుంది. గృహప్రవేశమే లేకుండా శాంతినే చేయించకుండా, మంచి లగ్నాన్నే వెతకకుండా కొత్త ఇంట్లోకి వెళ్ళేదాన్ని తెల్సుకొన్న ఊళ్ళో వాళ్ళు 'అతడికున్న డబ్బు మదం కొవ్వుపట్టి అతడ్ని అలాగున ఆడిస్తుంది' అని అనుకోసాగారు. అది నరసింహయ్య చెవిలో పడింది. కొంతమంది ముత్తైదువులు నరసింహయ్య ఇంటికి వెళ్ళి 'ఇదేమి కీడు?' అంటూ అతని భార్యను తిట్టారు. చివరికి విధిలేక నరసింహయ్య గృహప్రవేశానికి శాంతికి ఒప్పుకొన్నాడు. అయితే, 'జ్యోతిష్కుడి నుంచి చేయించను. వీరభద్రాచారి నుంచే చేయించుతా' అని తీర్మానించాడు.

నరసింహయ్య అలాగున తీర్మానించుకొన్నదానికి ఒక కారణం ఉంది. కమ్మరి వీరభద్రాచారి అప్పుడప్పుడు 'నాకు జ్యోతిష్యం వస్తది. ఇంటిని కట్టేవాడికి దాన్లోకి పోయేదానికి మంచి ముహూర్తాన్ని చెప్పేది తెల్వదా' అని అంటుండేవాడు. వీరభద్రాచారి ఏ పనైనా చేయగలడనే నమ్మకం మా ఊర్లోని ఇతరులకు ఉన్నట్లే నరసింహయ్యకూ ఉండేది. అదేగాకుండా, జ్యోతిష్కుడ్ని అవమానించేందుకు దొరికిన ఈ అవకాశాన్ని అతను వదులుకొనేందుకు ఇష్టపడలేదు. 'ఈ జ్యోతిష్యుడు తన కోడి కూయకపోతే తెల్లారేది లేదని అనుకొంటున్నాడు' అనేది నరసింహయ్యలో ఉండేది. అదే రోజు నరసింహయ్య

వీరభద్రాచారిని కల్సి 'గృహప్రవేశముహూర్తాన్ని నువ్వే నిర్ణయించి చెప్పు' అని అడిగాడు. కొంచం తటపటాయించిన పిమ్మట వీరభద్రాచారి 'అలాగే' అన్నాడు.

వీరభద్రాచారికి అంతో ఇంతో చదివేది వచ్చులే. అతను తక్షణమే పంచాంగంను తెప్పించుకొని, గృహప్రవేశం చేసే రోజును, ముహూర్తాన్ని చెప్పాడు. అనంతరం గృహప్రవేశ సందర్భంలో జ్యోతిష్కుడు ఎలాగు ఎలాగున చేస్తాడు అనే వాటన్నిట్ని జ్ఞాపకంకు తెచ్చుకోవటమే కాకుండా, గృహప్రవేశం చేయించుకొనే వాళ్ళ పేర్లనూ, గోత్రాల్నీ, వంశావళి... మొదలైనవాట్ని సవివరంగానే సంగ్రహించుకొన్నాడు. పూలు,ఫలాలు, ఆకులు – వక్కలు, టెంకాయలు, కొత్తబట్టలు, కలశం, ఉడికించిన పాలతో ఉన్న పరమాన్నం,తనకు తన భార్యకు పంచె, చీర; చివరిగా జ్యోతిష్కుడు తప్పనిసరిగా చేయించాలని చెప్పిన శాంతిపూజను తెల్సుకొన్న మీదట దాని పూజకని వీరభద్రాచారి కనిష్టంగా నూరు రూపాయలు కావాలని అడిగాడు. నరసింహయ్య పూజారికిప్పుడు మంచి పీకలాటం కలిగింది. అయితే నరసింహయ్య ఇప్పుడు చేసేది ఏమిలేదు. ఈ చివరి గడియలో వీరభద్రాచారి తన చేతిని వదిలేస్తే చేసుకొన్న వంటలన్నీ వృథాగా అయిపోయి ఊళ్ళోవాళ్ళముందు తన మానం పోవటమే గాకుండా జ్యోతిష్కుడి తలమీద కొప్పు ఇంకాస్త నాలుగు వేళ్ళ బారుకూ పెరుగుతది అనే అసూయ మూలంగా అతను ఆచారి కోరినదాన్నంతా ఇచ్చాడు. అతని ముఖం కోపంనుంచి ఎర్రఎర్రగా అయ్యింది. వీరభద్రాచారి తన పనులన్నిట్ని ముగించి అంచున్న క్రొత్త పట్టుపంచెను కట్టుకొని, కొత్త చీరెను కట్టుకొన్న తన భార్యను జతగా చేసుకొని పూజరయ్య నుంచి ఆకు – వక్కల్ని, నగదుతో దక్షిణ పొంది తన ఇంటికి బయల్దేరాడు. నవధాన్యాలు, పండ్లు – కాయలు, రెండు పెద్ద మూటల బరువును ఆచారి క్రొత్త క్రొత్త గోనె సంచులలో నింపుకొని మోసుకొంటూ ఇంటికి నడిచాడు. నాలుగు నెలలు ఏకకాలంలో వంటిని హూనం చేసుకొని ఇంటిని కట్టేదానికన్నా ఈ ఒకరోజు కార్యంలోనే ఎక్కువగా సంపాదన దొరికిందని అతనికీ, పూజారయ్యకూ కలిగింది. గృహప్రవేశానికని మా ఊర్లోని జ్యోతిష్కుడికి ఎవరూ అంత గొప్పగా సంభావన ఇచ్చింది లేదు ఇప్పటివరకూ. వీరభద్రాచారి గంధపు అక్షతలను నెత్తిన పెట్టుకొని,నుదుటికి గుండ్రంగా పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొని, పూజారయ్య నుంచి దానంగా లభించిన కొత్త పట్టుపంచెను కట్టుకొని, బలిష్టంగా ఉన్నదేహాన్ని ఇంకాస్తగా పెంచుతూ భార్యతో తన ఇంటికి వెళ్తుంటే వాళ్ళిద్దరూ సాక్షాత్ పార్వతి –

పరమేశ్వరులులాగ కనబడ్డారు. మా ఊళ్ళో వాళ్ళు, 'భేష్, ఇతను సహజమైన జ్యోతిష్కుడు లాగనే కనబడుతున్నాడు. దేనికైనా సరిగానే అతుక్కుపోయేమనిషి' అంటూ మెప్పుమాటల్ని మాట్లాడుతూ తమతమ ఇళ్ళకు చేరారు.

అయితే పూజారయ్య గృహప్రవేశం ఆచారిమనస్సు మీద విచిత్రమైన పరిణామాన్ని కలిగించింది. అతని ముందు క్రొత్తలోకం, క్రొత్త అవకాశాలు, క్రొత్తగా పదవి తెరిచినట్లైంది. ఆ క్రొత్తపదవి ఎంతగానో సులభమే అని అతనికి అన్పించసాగింది. జ్యోతిష్కుడయ్యేది ఆచారి అయ్యేదానికన్నా ఎంతో సులభం. దాన్లో ఎంతగానో లాభం ఉంటది. గాంభీర్యం, ఘనత, గౌరవం ఉంది. పనీ తక్కువే. నేను మూడు నెలలతో ఇల్లును కట్టేది ఒకటే, మూడు గంటలు జ్యోతిష్కుడిగా మారితే పొందే ఫలమూ ఒకటే అనేది అతనికి కనబడింది. ఈ నవోత్సాహంతో అతనికి తను 'మా సీమలో కట్టిన ఆ వందల ఇళ్ళు తను లేకపోతే అయ్యేవి (నిర్మాణం) లేవని, ఆ ఇళ్ళలో ప్రతి నిత్యం తనపేరు అందరి నోళ్ళలో నానుతూ ఉంటదనే అభిప్రాయం అతనిలో ఇప్పుడు మాయమై పోయింది. 'తను ఇంటిలోని స్తంభంగా, జ్యోతిష్కుడేమో ఇంటికి కొట్టిన సున్నం' అనేది అతని నుంచి మాయమైంది. నిజంగానే జ్యోతిష్కుడైయ్యే మోహం అతడి మనస్సును ఆక్రమించుకొంది. మరుసటిరోజే అతను జ్యోతిష్య చింతామణి, ఆరూఢ ప్రశ్న చంద్రిక, విద్యాగురు...మొదలైన గ్రంథాలన్నిట్నీ తెప్పించుకొని, నక్షత్రాలన్నిట్నీ గుర్తుంచుకోసాగాడు. అతడి ఉళి, రంఫం, బాడిస.... మొదలైన పనిముట్లన్నీ ఒక్కొక్క రాజ్యాన్ని కట్టేందుకు సమర్థమైనటువంటివి. అవి ఇప్పుడు ఉపేక్షించబడి తుప్పు పట్టి ఒక మూలకు చేరి పాడుబడి పోసాగావి. ఆచారి ఉపయోగిస్తుండేటప్పుడు యౌవ్వనంలోని ఉత్సాహంతో ప్రకాశమానంగా జ్వలిస్తుండే ఆ నానారకాల ఆయుధాలు అతడి నుంచి ఇప్పుడు నిర్లక్ష్యానికి గురై ఉపయోగంలో లేని పనిముట్లుగా కనబడసాగావి. ఆచారి మాత్రం వాటి మొఖం వైపుకే చూసేదాన్ని మానుకొని నాడీకూటం, గ్రహమైత్రి కూటం, దశాభుక్తి... ఇలాంటి వాట్నే చూడసాగాడు.

కాలం గడుస్తుండగా వీరభద్రాచారి మా ఊర్లో సంపూర్ణంగా జ్యోతిష్కుడిగా మారిపోయాడు. లగ్నాన్ని నిర్ణయించేది, జాతకాల్ని రాసేది, గృహప్రవేశం, దుష్టగ్రహాలను అదుపులో పెట్టేది, అంత్రాల్ని, తాయెత్తుల్ని కట్టేది... జనం ఇలాగున అతడి వద్దకు రాసాగారు. ఆచారి ఈ పనుల వలన తన ఘనత, యోగ్యత పెరిగిందని

భావించుకోసాగాడు. పూర్వపు జ్యోతిష్కుడికి మొదలే తక్కువగా ఉండేటి ఉద్యోగం ఇంకాస్తగా తగ్గిపోయింది.

కొన్ని నెలలు గడిచేటప్పటికి వీరభద్రచారికి, తనకూ ఉద్యోగం లేదనే భావం రాసాగింది. మా ఊర్లో ఇళ్ళన్నీ ఒక ప్రక్కనుంచి పడిపోసాగావి. ఒక చిన్న చెక్కపలక ఊడినా, ఒక పెంకురాలినా సరిచేసేందుకు ఇప్పుడు ఎవరూ లేరు. పలుగు, పార, కొడవలి, గొడ్డలి..... వేటినైనా కావును పెట్టేటోళ్ళు ఎవరూ లేరు ఇప్పుడు. బళ్ళను తోలేదిగాని, నాగళ్ళను, గుంటకల్ని కట్టేదిగాని లేదిప్పుడు. ఊర్లో గడిచిన కాలంలో వడ్రంగి, కమ్మరి అన్నీ వీరభద్రాచారే అయినందున అతను చేసేటి పనులన్నీ నిలిచిపోయి ఊరు శిధిలం గాసాగింది. గ్రామంలోని వాళ్ళు ప్రతి ఒక్కపనికీ ప్రక్కనున్న గ్రామానికి పోవాల్సి వచ్చింది. గృహప్రవేశాన్ని చేయించేందుకు వీరభద్రాచారి కాచుకొని కూర్చున్నా, ఒక్కటంటే ఒక్కటైనా కొత్త ఇల్లు నిర్మించబడి పైకి వచ్చింది లేదు. వేరే ఊరునుంచి కమ్మరిని, వడ్రంగిని తెచ్చేది ఊళ్ళోవాళ్ళకు సాధ్యపడలేదు. మొదట ఒక జ్యోతిష్కుడున్న ఈ ఊళ్ళో ఇప్పుడు వీరభద్రాచారి పుణ్యాన ఇద్దరైయ్యారు. ఇద్దరికీ ఇప్పుడు పనేమి లేదు. ఇద్దరూ సోమరులుగా పరావలంబులుగా, ఉత్తిగనే ఆకాశాన్ని చూస్తుండేవాళ్ళు. వీరభద్రాచారి లాంటోడు ఒకడుంటే పదులసంఖ్యలో ప్రతి సంవత్సరం క్రొత్తగా ఇళ్ళు నిర్మించబడి ఇంకా ఇటువంటి నాలుగైదు సోమరిపోతుల జ్యోతిష్కులకు పనులు దొరికేవి. వెనక కాలంలో వీరభద్రాచారి వీరభద్రాచారిలాగనే అయి ఉన్నప్పుడు అతనికి ఒక క్షణమూ విశ్రాంతి ఉండేదికాదు. చేతినిండా పని. తెల్లారిన దగ్గరినుంచి రాత్రి వరకూ ఒకేవిధంగా పనులను చేస్తుండేటోడు. గాలికీ, చలికీ, వానకూ అర్పించుకొన్న అతడి దేహం కంచులాగ గట్టిగా ఉండేది. మనస్సూ గాలిలాగనే తేలికగా ఉండేది. అతను సృష్టికర్తైన పరమాత్ముడుకు ఒక చిన్న నకలుగా (ప్రతిరూపంగా) కనబడుతుండేవాడు. అతనికి రాని పనులంటూ ఏవీలేవు కదా! అప్పుడు మా ఊళ్ళో ఒక ఇంటికి కిటికీగాని, తలుపులుగాని పగిలిపోయింది లేదులే. ఒక చూరు చెక్క జారిపోలేదు. ఒక స్తంభమే సొట్టపడలేదు. అన్నంలో రాళ్ళుంటే ఎలాగున సహించుకోలేమో అలాగే వీరభద్రాచారి పడిపోయే ఇళ్ళను సహించుకొనేవాడు కాదు. విశ్వకర్మ అనే పేరు అతనికి సార్థకమవుతది. ఏభై సంవత్సరాలుగా పనులను చేసినా అతనికి వయస్సైనట్లుగా కనబడింది లేదు. అయితే ఇప్పుడు రెండే రెండేళ్ళలో

అతనికి బానకడుపు రాసాగింది. వళ్ళు దిక్కుపాలైనట్లుగా పెరిగింది. ముఖంలో సోమారితనపు వికారాలన్నీ కనబడుతున్నవి. వెనకెప్పుడూ ఒకటైనా తెల్లవెంట్రుకలు లేకుండానే ఉండే అతడి మీసం ఇప్పుడు పూర్తిగా తెల్లబడింది. 'ఈ గ్రహాల కాటునుంచి మా ఇళ్ళు నేలపాలైనవి. ఈ నక్షత్రాలన్నిట్నీ నాశనం చేయాలి' అంటూ జనం జ్యోతిష్యాన్నే తిట్టసాగారు. ఇంటిలోపల చిరిగిన పట్టు పంచె బట్టల మూటలో జ్యోతిష్య పుస్తకం, పంచాంగం, గవ్వలు, పలకను కట్టూ విప్పుతూ ఎవరైనా జ్యోతిష్యం అడిగేందుకు వస్తారేమోనని కిటికీ సందులనుంచి ఎదురు చూస్తున్న వీరభద్రాచారి జరుగుతున్న వాట్ని అర్థం చేసుకోలేక మీసాల్ని తిప్పుతూ, మెలిబెడ్తూ కూర్చొని పోయాడు. వెనక ఎల్లప్పుడు జాత్రలాగ జనంతో నిండిఉండేటి అతని ఇల్లు, అతను ఇలాగున నిరుపయోగిగా అయ్యుండటం చేత నిర్జనమైంది.

రెండు సంవత్సరాలు గతించేలోపే వీరభద్రాచారి ఇల్లూ ఇతరుల ఇళ్ళలాగనే క్షీణించేది ప్రారంభమైంది. సూరుకు చెదలుపట్టింది. పైన కప్పులో ఉన్న దూలాలు అటు ఇటూ తమ భద్రమైన స్థానాన్ని వదిలేసి నాల్గైదు అంగుళాలు కదిలిపోయినవి. సూరులో నేసిన బద్దలు ఒక్కొక్కటిగా నేలలోకి పడసాగావి. వీరభద్రాచారి జ్యోతిష్కుడిగా మారక మునుపు ఇల్లు కొంచం ఎక్కువ తక్కువగా ఏదైనా మార్పుల్ని చెందితే తక్షణం ఉళి, సుత్తి, బాడిసె, రంఫంను పట్టుకొని వాటిని సరిచేసేవాడు. సూరుకున్న పెంకుల్ని దించటంగాని, ఎత్తటం గాని, కూర్చటంగాని అతనికి నిమిషంలో పనిగా ఉండేది. ఊళ్ళోని ఇళ్ళన్నిట్ని బాగుచేసే అతనికి అతని ఇల్లు ఏమన్నా భారమా? గుట్టనే మింగేటోడికి అప్పడం అదొక లెక్కా అన్నట్లుగా చిన్నా చితకా పనులు అతనికి ఆ విధంగా కనబడేవి. మొగుడి ఉత్సాహాన్ని చూసి అతని పెళ్ళాం కూడా ఇంటిని గోవుపేడతో అలికి మంచి ముగ్గులతో అద్దంలాగ చూసుకొనేది ఇంటిని. అయితే ఇప్పుడు ఆచారి నక్షత్రాల్ని, గ్రహాల్ని, ఆరూఢ ప్రసన్న చంద్రిక, విద్యాగురు మొదలైనవాట్నే నమ్ముకొని తన రంపాన్ని, బాడిసెను, ఉళిని, సుత్తిని మూలలో విసిరిన మీదట అతడి స్వాభావికమైన చేతిపనిలోని కుశలశక్తే మాయమైంది. తన ఇల్లు ఒకవైపు నుంచి పడుతున్నా, బ్రాహ్మడైనోడు కొబ్బరిచెట్టుకున్న కాయల్ని చూసినట్లుగా ఆచారి ఉత్తిగనే సూరునూ, తన పూర్వపు ఆయుధాల్ని చూస్తుండేవాడు. ఒకరోజు రాత్రి ఎంతో జోరుగా వాన వచ్చినప్పుడు సూరుకు ఉన్న పెంకులన్నీ జర్రంటూ

క్రిందకు జారిపడిపోయి, ఇల్లంతా నేలకు సరిసమమైంది. దేవుడి దయవలన ఆచారికి, అతడి భార్యకు ఏవిధమైన అపాయం కలుగలేదు.

తన బతుకులో వందల సంఖ్యలో ఇళ్ళను కట్టిన ఆచారికి తనకని క్రొత్తఇల్లు ఒకదాన్ని కట్టుకొనేది అదేమంతగా కష్టమైన పనేమికాదులే. వెనుక జ్యోతిష్కుడిగా మారక ముందు, అతను ఎన్నోసార్లు తన పాతబడిన ఇంటిని పడగొట్టి క్రొత్త ఇంటినొకదాన్ని కట్టుకోవాలని యోచించేవాడు. అయితే అది అతనికి మొత్తంగా ఎనిమిది, పదిరోజుల శ్రమగానే కనబడినందున, “ఇదేంటి మహాపని? చిన్నపనేగా.... ఎప్పుడైనాచేసుకోవచ్చు” అని నిధానించాడు. అంతేగాకుండా ఇతరుల ఇళ్ళను కట్టేదాంట్లో మునిగియున్నందున అతనికి అప్పుడు ఒక గంటా విశ్రాంతి ఉండేదిలేదు. అయితే, ఇప్పుడు తన కొంప పడిపోయినందున, క్రొత్తగా ఇంటిని కట్టకుండా అతనికి ఉండేది లేనందున అతను క్రొత్త ఇంటిని కట్టేందుకు ప్రారంభాల్ని చేయసాగాడు.

వీరభద్రాచారి తనే జ్యోతిష్కుడిగా మారినందున ఇంటికి పునాదిని తవ్వేరోజున శంకుస్థాపన పూజను ఎంతో ఆర్భాటంతో చేసాడు. అగరుబత్తి, టెంకాయ, కుంకుమ, పాలతో ఉడికించిన పరమాన్నం, ప్రమిదలతో ఏర్పాట్లను చేసాడు. ఊళ్ళోవాళ్ళకు ఎంతగా భూకంపాలు వచ్చినా ఇళ్ళు కదిలిపోలేని రీతిలో భవన సామాగ్రిని చొప్పించేవాడు. తన ఇల్లు భద్రంగానే ఉండాలని మంత్రతంత్రాలతో ఏర్పాట్లు చేసాడు. శంకుస్తాపన కార్యం ముగిసిన మీదట ఇంటి పునాదులకని మట్టిని తోడించాలి కదా! వెనకటి కాలంలో ఐతే ఆచారి తనే పలుగును, పారనూ చేతపట్టి ఇద్దరు ముగ్గురు పనోళ్ళతో నడుంలోతు వరకూ పునాదులను స్వయంగా తోడుతుండేవాడు. ఇతని సహాయం ఊళ్ళోవాళ్ళకు ఎంతగానో అవసరం అయినందున పనోళ్ళు తేలికగానే వస్తుండేవాళ్ళు. అయితే ఇప్పుడు ఆచారి అన్ని పనులకు డబ్బు వెదజల్లి పనోళ్ళ మూలకంగానే జరిపించుకోవాల్సి వస్తుంది. పలుగు, పారకు కావు (పదును) పోయినా దాన్ని సరిజేసేందుకు అతనికి మనస్సు ఒప్పుకోవటం లేదు. మూడు రోజులలో అవ్వాల్సిన పని (పునాదుల తోడకం) ముప్పై రోజులైనా ముగించబడలేదు. వెనక ఇంటి గోడల్ని తనే కట్టుతుండే ఆచారి ఇప్పుడు తన ఇంటి గోడలను కట్టేందుకు గుత్తకు ఇచ్చాడు. కంచుకోటలాంటి గోడల్ని కట్టే అభ్యాసమున్న అతనికి కూలోళ్లు మట్టిని సరిగా కలపకనే సొట్టలు సొట్టలుగా కట్టేసిన గోడల్ని చూసి

వళ్లు మండిపోయింది. అలాగో ఇలాగో గోడలు పైకి లేచిన మీదట ఆచారి ఇంటికి చెందిన కలప పనిని ఒక వడ్రంగికి గుత్తకు ఇచ్చాడు. ఆ వడ్రంగి అంతగానేమీ బుద్ధిమంతుడు కాదు. ఐతే ఎంతగానో దురాశాపరుడు. అతను పనిని ప్రారంభించేమునుపే ఎలాగెలాగో తనకు రాబోయే డబ్బంతా ఆచారి నుంచి గుంజేసుకొన్నాడు. గోడలేమో సొట్టలుగా నిలిచియున్నవి. ఇంటి పనులను ప్రారంభించి నాలుగు నెలలు అయినవి. మధ్యలో ఒకసారి అకాలపు వర్షాలు వచ్చి గోడలు నాని పగుళ్ల బారిన పడినవి. వానాకాలం దగ్గర పడసాగింది. అంతలోపే వడ్రంగి వచ్చి కలపపనులను పూర్తి చేస్తాడనే నమ్మకం ఆచారితో సహా ఊరోళ్ళకు అన్పించలేదు. వీరభద్రచారి కోపంతో హిరణ్యకశిపుడిలాగ పనోళ్లందరి మీద ఉరిమి పడుతుండేవాడు. వెనుక ఇటువంటి ఇంటిని అతను ఒకే నెలలో కట్టి ముగించేవాడు. బాడిస పట్టుకొని అతను నిలబడ్తే ఒకే రోజులో ఒక ఇంటికి కావాల్సిన చెక్కలన్నిట్నీ చెక్కిపడేసేవాడు. మద్యమధ్యలో ఒకొకసారి ఆశతో అతడి దృష్టి మూలలలో పడియున్న బాడిస, రంఫం, ఉలి మొదలైన వాటివైపుకు మరలుతుండేది. వెనకటికాలంలో కొలిమి దగ్గర కమ్మరి పనిని చేసేటప్పుడు వేసుకొంటుండే చెడ్డీ... అది ఇంకా గట్టిగానే ఉన్నందుచేత వీధిలోకి విసిరేందుకు మనస్సు ఒప్పుకోలేదు. అది ఇప్పుడు బొంగుల దండెంమీద వేళ్ళాడుతుంది అతని కంట్లో పడింది. మట్టి, ఇనుము, దుంగలు... మూడు పనులను ఏకధాటిగా చేస్తుండేవాడు వెనుకటికాలంలో. ఇప్పుడు అతని దృష్టి నిధానంగా తన పట్టుపంచె, సముద్రపు గవ్వలు, జ్యోతిష్య పుస్తకాల మూట... వాటివైపుకు మళ్ళింది. గృహప్రవేశానికి యోగ్యమైన దినాన్ని గుర్తు చేసేందుకు జ్యోతిష్య సర్వవిషయామృతాన్ని, పంచాంగాన్ని విప్పుకొని పలకమీద లెక్కల్ని వేయసాగాడు. తనే జ్యోతిష్కుడవడం వలన కొంచమైనా ఎక్కువ తక్కువ గానట్లుగా సరియైన లగ్నాన్ని గుర్తించేదే అతడికి గురైై నిలిచింది మదిలో.

లెక్కల గజిబిజిలో చిక్కుకొన్న ఆచారికి సంధ్యాకాలం అయ్యిందే గమనంలోకి రాలేదు. అతని భార్య లోపలికి విసురుగా వచ్చి, 'మీరు ఇక్కడ గుణించుతూ కూర్చున్నారు. వాన వచ్చేటట్లుంది. ... నాలుగు చినుకులు పడినా చాలు.. గోడలు పడిపోతవి... ఆ పిమ్మట మనకు గడ్డితో కప్పిన ఈ గుడిసే ఎప్పటికీ' అంది కటువుగా. వాన శబ్దాన్ని విన్న తక్షణమే ఆచారికి తేలుకుట్టినట్లైంది. అతను సర్రనే లేచి వీధిలోకి వచ్చి అంతరిక్షం వైపుకు చూచాడు. నల్లటి మేఘాలు మత్తగజాల గుంపులాగ ఒకదానిమీద మరొకటి

నూకుకొంటూ వస్తున్నవి. ఉరుముల ఆర్భాటమూ, మెరుపులలోని కాంతి విశేషంగా కనబడింది ఆచారికి. అయితే మెరుపులు వాయువ్యదిక్కులో మెరుస్తుండడం చేత బహుశా వాన వచ్చేది లేదని, ఈరోజు వాన తప్పిపోతే ఇక రెండు రోజులవరకూ వాన వచ్చేది లేదని ఆచారికి తనకున్న జ్ఞానంతో తెల్సింది అలాగున.

ఇంటి నిర్మాణంకని తెచ్చిన దుంగలు (కలప), వెదురు, పాతపెంకులు వీటన్నిట్ని అతను చూచాడు. అవి దైన్యంతో 'మేమంతా ఉన్నాము, మమ్మల్ని సరిగా ఉపయోగించుకొనేవారు లేరిక్కడ' అని వేడుకొన్నట్లుగా అతనికి కనబడింది. ఆ వేళకు ఆకాశంలో మరొకసారి ఉరుము ఆర్భాటాన్ని చేసింది. ఆచారికి ఏదో ఒక విధమైన ఆవేశం వచ్చినట్లైంది. అతని ముఖంలో ఒక విధమైన క్రొత్త నిశ్చయం, చురుకుదనం జొరబడినట్లుగా కనబడసాగింది. అతనిలోని నడవడిక తేలికగా అయ్యింది. అతను కట్టుకొన్న జరీ పట్టుపంచెలోని కుచ్చిళ్ళు అతనికి సంకెళ్లలాగ కనబడింది. అతను మకరంధాన్ని త్రాగిన తుమ్మెదలాగ సరసరా తన గుడిసె లోపలికి వచ్చాడు. అతని నడకలోని వేగాన్ని, లఘుత్వాన్ని అతడి భార్య గ్రహించుకొంది అతను జ్యోతిష్కుడిగా మారకముందు మాత్రమే. భార్య ఆశ్చర్యంతో తనవైపు చూస్తున్నా ఆచారి ఆమెను గమనించకుండానే నేరుగా బొంగుల దండెం దగ్గరకు వెళ్ళి నిలబడి తన పాత చడ్డీని ధరించాడు. నడుం నుంచి క్రిందకు జారిన పట్టుపంచ అక్కడే నేలమీద పడియుంది. పంచాంగం, ఆరూఢప్రశ్నచంద్రిక, గవ్వలు,పలకను కట్టి బిగించిన పట్టు మూటను బయటకు తెచ్చి విసిరేసాడు. ముక్కాలుపీట మీద కుంకుమ – పసుపులను పూసి జ్యోతిష్యాన్ని చెప్పేందుకు దానిమీద ఉంచిన దేవుడి కలశాన్ని కుంకుమ సమేతంగా చేతికి తీసుకుని క్రిందకు విసిరికొట్టాడు. అతడి భార్య అతనికి పిచ్చి ఏమైనా పట్టిందా అని బెదురుతో చూడసాగింది. ఆచారి బాడిసెను తీసుకుని బయటకు నడిచాడు. అతని భార్య 'ఎందుకు? ఎక్కడికి?' అంటూ అతడ్నే అనుసరించింది. ఆచారి మాట్లాడకనే ఆవేశం వచ్చినోడిలాగ బాడిసెను రాతిమీద దాని పదును కోసమని కొబ్బరి నూనెను రెండుచుక్కలు వేసి నూరసాగాడు. త్రుప్పు పట్టిన బాడిస అంచులు వెండిరేఖల లాగ మెరుపుతో కనబడింది. మేఘాలు చెదిరి ఆకాశంలో ఒకమాదిరి పెద్ద నక్షత్రాలు కనబడసాగావి. పంచాంగంను చూసేదాన్ని ప్రారంభించిక మునుపు ఆచారి ఇంత వెల్తురులోనే పనులను చేస్తుండేవాడు. ఆచారి 'ఆలశ్యం అమృతం విషః' అన్నట్లుగా

అక్కడ పడియున్న మొద్దును (దుంగను) చెక్కటం చేయసాగాడు. ఠణార్, ఠణార్ అంటూ పెద్ద పెద్ద చెక్కలు బయటపడసాగావి ఆమొద్దునుంచి. సప్పుళ్ళను విని ఊళ్ళోవాళ్ళంతా ఆచారి ఇంటివద్దకు వచ్చారు. ఆచారికి వంటిమీద ప్రజ్ఞే ఉన్నట్లుగా కనబడలేదు. అతను ఆ రాత్రంతా పనిని చేస్తూనే ఉన్నాడు. తెల్లారేటప్పటికి అక్కడ పడియన్న చెక్కలన్నింటినీ చెక్కి సరిజేసాడు. నాలుగు బండ్లకుసరిపోయేంతగా ఇంటి కలప నిర్మాణమైంది. ఆ రాత్రంతా ఊళ్ళో వాళ్ళకు సంభ్రమమే సంభ్రమం. 'ఊరికి పట్టిన శని తొలిగిపోయింది' అంటూ వాళ్ళు సంతోషపడ్డారు. నిర్జనమైన ఆచారి గుడిసెముందు వెనకటి కాలంలో లాగ ఎద్దుల బండ్లు, అరకదున్నే నాగళ్ళు, గుంటకలు, కొలిమి పొయ్యి అన్నీ వచ్చి నిలిచినవి. ఆచారి నుంచి తమకు పనులు జరగాల్సి ఉన్నందున ఊళ్ళో వాళ్ళంతా చేరి నాలుగంటే నాలుగు రోజులలో ఆచారి ఇంటిని సమిష్ఠిగా కట్టారు.

ఆచారి ఇంటి ముందే కొలిమి నడిచేదాన్ని, ఆచారి చేతిలో బాడిసెను చూసి పాత జ్యోతిష్కుడు 'నాకు రెండు సంవత్సరాల నుంచి పనేలేదు. ఇళ్ళను కట్టించుకొన్నోళ్ళే లేరు... గృహప్రవేశాలూ లేవు. ఇక వీరభద్రాచారికి పట్టిన శని తొలగిపోయింది. ఇళ్ళు నిర్మించబడుతవి.. గృహప్రవేశాలు నడుస్తవి' అని అనుకొంటూ పంచాంగాన్ని శుభ్రంగా దులుపుకొని నిశ్చింతగా ఉన్నాడు.

❀ ❀ ❀

(కన్నడంలో 'కమ్మరి వీరభద్రాచారి జోయిస నాదదు' అనే కథను రచించినవారు దివంగత గొరూరు రామస్వామి అయ్యంగార్. వీరి జీవితకాలం 1904-91. 55వ అఖిల భారత కన్నడ సహిత్య సమ్మేళనానికి వీరు అధ్యక్షుడిగా కార్యభారాన్ని మోసింది అదొక గొప్ప గుర్తింపుగా కన్నడిగుల హృదయాలలో రమణీయంగా నిలిచియుంది ఇప్పటివరకూ. ఒక శతమానంలోని అత్యుత్తమ కన్నడ కథలలో ఈ కథ నమోదు గావింపబడినందున తెలుగు పాఠకులకని అనువదించడమైనది. 17/02/08.)

**శాఖమూరు రామగోపాల్**

# టప...టప...టప

**నా** కుడి కాలు చెప్పునుంచి ఉంగటం పదినెలల అవధిలో మూడు సార్లు తెగటం, నేను కుట్టించటం జరిగినా, ఈ రోజు మళ్ళీ నాలుగోసారి తెగింది. బొటన వేలును అదుపులో ఉంచుకొనే ఉంగటం తెగటం వలన ప్రొద్దునే పాలను తీసుకురావటానికి నా చెప్పులు సహకరించటం లేదు అని అంటే వినే రకం కాదాయె ఇంటిది. పాడుబడిన ఆ చెప్పుల్నే వేసుకొని పాలను తేవటానికి బయల్దేరాను.

పాలబూత్ రామకృష్ణ అడిగాడు... "ఏమిటి మాష్టారు... కుంటుతూ వస్తున్నారు కాలుకేమైంది? పురుగేమైనా కుట్టిందా?"

"ఏమీ కాలేదు బాబూ! ఉంగటం కుట్లు పాడైపోయినవి" అన్నాను నేను.

రామకృష్ణ చెప్పుల్ని చూస్తూ "మాష్టారూ వాటిని రిపేరు చేయించటానికి ఈసారి మీరు చెప్పుల్ని బాగుచేసేవాడి దగ్గరకు వెళ్ళకండి... మన సీతారామ్ టైలర్ ఉన్నాడు కదా! అతని దగ్గరకు వెళ్ళి ఒకట్రెండు సారాయి పాకెట్లను ఇస్తే, వాటిని త్రాగి మీ చెప్పుల్ని ఆడోళ్ళ రవికెను కుట్టినట్లుగా కుట్టేస్తాడు... అతని దగ్గరకు వెళ్ళి బాగు చేయించుకోండి" అని అన్నాడు.

ఎంత తమాషా ఇతనిది. 1982 లో ఇతను నా స్టూడెంటే. చదువులో బండోడు. 'న' ఉచ్చారం వచ్చేది కాదు. మొన్న అంటానికి మొణ్ణ; అన్నను అణ్ణ; చిన్నక్కను చిణ్ణక్క అని అంటుండేవాడు. గోల చేయటంలో ఫస్ట్.

"ఆ... సర్లే" అని నవ్వుతూ తలూపాను.

"మాష్టారూ... మీ చెప్పులు రెండు పుష్కరాలను చూసినట్లైనవి. కొత్త చెప్పుల్ని ఖరీదించకుండా ఇలాగే గడిపేయటం ఏం బాగుంటది" అన్నాడు అతను నాతో.

నేను ఈ చెప్పుల్ని కొన్నది రెండు సంవత్సరాలే. పాతబడిపోలేదు అవి. చెప్పుల వెనుక భాగం అరిగిపోయినవి. మొన్న నవంబరులో వాటికి సోల్ వేయించా. "చాలాకాలం మన్నికతో ఉంటవి" అని వాటిని వేసినోడు చెప్పాడు. ఐదు నెలలు గడిచేటప్పటికే ముక్కాలు భాగం పాడై, అప్పడం లాగ తేల్కైనవి. వాటికే మరొకసారి సోల్ వేయించి ఉంగటం కుట్టిస్తే కొత్తది లాగ కనబడతవి కదా! అయితే ఈ రామకృష్ణ ఆ చెప్పుల్ని పనికిరాని పాతబడినవి అని చెపుతున్నాడు కదా! ఏమి చేయాలి ఇప్పుడు?

ఒకట్రెండు నిమిషాలు గడిచిన తర్వాత “కొత్త వాటికి ఎంత డబ్బులు పెట్టాలి” అడిగాను నేను అతడ్ని.

“ఎంత పెట్టగలరు మీరు?”

నూట ఏభైయ్యో రెండొందలో ఉన్నట్లున్నవి నా దగ్గర. నేను చెప్పా “రెండొందలో రెండొందల ఏభైయ్యో అని”

“మాష్టారు మీరు ఏ కాలం వాళ్ళు? 22 క్యారెట్లు లాంటి చెప్పుల్ని కొనాలంటే మూడొందలకు తక్కువలో దొరకవు” అన్నాడతను.

“నూట ఏభై, రెండొందలు అంటే ఏమన్నా తక్కువా?” ప్రశ్నించాను నేను.

“మీకు పెన్షన్ వస్తది గదా! ఒక మంచి జత చెప్పుల్ని కొనటం కుదర్దా!” కొంటెగా అన్నాడతను.

అతను అన్నది బాగుగానే ఉందనిపించింది నాకు. అయితే ఈ విషయం ఇంటిదాని దగ్గర ప్రస్తావించాలి కదా! నాకొక జత కొత్త చెప్పులు కావాలంటే ఆమె ఖండితంగా “క్రొత్త చెప్పులా... పాతవి ఏమైనవి?” అని ప్రశ్నిస్తది కదా.

“పాత చెప్పులు ఉన్నవిలే” అని నేనంటే “మరి క్రొత్తవి ఎందుకని?” అడుగుతది. దానికి నేను “అదేంకాదు... నా పాత స్టూడెంట్ నా చెప్పులు పాడైనవి అని అంటున్నాడు” అని సంజాయిషిని ఇచ్చుకోవాలి. దానికామె “అట్లాగున అంటుంటే అతడినే కొని గురు సంభావనంగా సమర్పించుకోమని చెప్పండి... ఎట్లాగూ మీరు అతనికి పాఠాలను నేర్పారుకదా” అని అంటది. అప్పుడు నేనేమి బదులివ్వాలి? ఆమె మాటలకు!

అట్లా ఆలోచిస్తూ నేను పాలప్యాకెట్లతో ఇంటికి వచ్చా. అప్పుడు చూసుకొంటే ఎడం కాలు చెప్పుకున్న వెనుక భాగం మాయమైంది. ఎలుక కొరికినట్లుగా మొదలు ఆ భాగం నా గమనానికి రాలేదు. నడుస్తున్నప్పుడు ఎడంకాలు చెప్పు నేలకు తగులుతూ, తగులుతూ రాసాగింది. గాంధీ చౌక్‌ను దాటినప్పుడు కాలికేంటో గుచ్చుకొన్నట్లైంది. అక్కడే ఆగి చూచా. ఎడంకాలి చెప్పు వెనకభాగం మాయమైంది. ఇంటికొచ్చి చూస్తే కాలికేదో విసర్జనం అంటుకొని ఉంది. “ఛూ... ఛూ... ఇదెంత కర్మ” అని అన్పించింది. ఇంటికొచ్చి మెట్లను ఎక్కుతూ ఇంటిదాన్ని “ఏ.... ఏ... శారదా” అంటూ కేకల్ని వేసాను.

ఆమె లోన్నుంచే “ఏంటి? ఎందుకక్కడే నిలిచి గావుకేకల్ని వేస్తారు... పాలకోసం వెళ్ళి బర్రెను తోలుకొచ్చారా?” అంది శారద.

"అది కాదే... ఒక చెంబు నీరు కావాలి!"

"నీళ్ళా? దేనికోసం... పాలలో నేనే కలుపుతా... మీరొద్దు?"

"అది కాదే... ఇటుచూడు... నా కాళ్ళకు ఏదో అంటింది"

ఇంటిది చెంబుతో నీళ్ళను తీసుకొని వస్తూ "మళ్ళా పేడను అంటించుకొని వచ్చారా? ఎంత మనిషి మీరు? పాలతో పెంట... మీ నెత్తికి అంటుదామంటే అది బట్టనెత్తే కదా!"

ఆమె నీళ్ళ చెంబును ఇస్తుంటే చెప్పుల్ని చూపించా. సగం మాయమైన చెప్పుల్ని చూసి "ఆ భాగాన్ని ఎవరికి తింటానికి ఇచ్చి వచ్చారు" అని రెట్టించింది.

"ముక్కలైపోయింది... దాని వలన ఆ ముక్క ఎక్కడ పడిందో" అన్నాను నేను.

ఆమె ముఖాన్ని అదోలా పెట్టుకొని "మీకు నడవటం సరిగా వస్తేకదా?"

"అదికాదే... చెప్పులు పాతబడిపోయినవి"

వాదం చేసేదాని లాగ "పాతబడినవి అని ఎట్లా చెప్పుతున్నారు... అవతలి కాలి చెప్పుబాగానే ఉంది కదా!"

దాన్నే చూపిస్తూ "దీని ఉంగటం బయటికొచ్చింది. నువ్వే చూడు సుమీ" అంటూ ఆ చెప్పును ఎత్తుకొని చూపించా. "ఛూ... ఛూ.... క్రింద పారేయి... పెంట చెప్పులు... అందుకే అనేది మీకు నడవటం సరిగా రాదని" అంది నా అర్ధాంగి.

నాకు పిచ్చి కోపం వచ్చి అన్నా "నా నడకకు ఏమైందే..." అని

అందుకామె వెటకారంగా "మీ నడక... మీ ఒంకర చెవి ఒకటేలే... రెండూ వంకరే" నా చెవిని ఆమె అలాగ చెప్పేటప్పుడు నాకు కోపం రావాల్సిందే! నా చెవి గురించి ఆమె చెప్పేది సత్యమే. నా కుడి చెవిది ఒక విశేషం. ఆ చెవి క్రింద భాగం వెనక్కి తిరిగి పై భాగం ముందుకు పొడుచుకొని వచ్చినట్లుండేది. అందుచేత శారద "మీది వక్రచెవి" అని అంటుండేది. చెవి ప్రస్థాపనను ముందుకు తెచ్చి, శాడిస్ట్‌లాగ నన్ను బాధపెట్టి సంతోషపడేది.

అయితే నా కుడి చెవి ఇట్లా ఉండటం నా తప్పుకాదు. నేను రెండోతరగతి చదివేటప్పుడు రామచంద్రసార్ దీనికి మూలకారణం. ఆయన ప్రశ్నెలకు నేను జవాబులను సరిగ్గాచెప్పకపోతే చెవుల్ని పిండి నరకం చూపించేవాడు. ఆయన దృష్టి ఎప్పుడూ కుడి చెవిమీదే ఉండేది. రెండోతరగతి ఒకసారి ఫెయిల్ అయ్యా. నాకు సరిగ్గా చదువు అబ్బాలంటే

"దండం దశగుణప్రయోజనం" అని నమ్మే ఆయన నా చదువు కోసం నా చెవిని ఈ రకంగా మార్చేసాడు. ఇదంతా శారదకు గుర్తే. రోషం ఎక్కువైనప్పుడు "నాకు కోపం వస్తుంది" అని అరిచేవాడ్ని.

"రానీ... ఎంత వస్తదో చూస్తా" అనేది శారద.

ఆమె జగడంకు దిగింది అంటే, నేను ఇల్లు వదిలి బజారుకు వస్తా. ఊరంతా తిరుగుతా. నడిచి, నడిచి ఆయాసం చెందితే, ఇల్లు గుర్తుకొచ్చి,పిచ్చి శారద గాబరి పడుతుందేమో అని ఇంటి ముఖం పట్టుతాను.

"నేనొక జత క్రొత్త చెప్పుల్ని కొనుక్కుంటా?"

నా అదృష్టం కొద్ది ఆమె మూడ్ బాగుందేమో "సరేలే... వద్దులే" అనే రెండు భావాల్ని వ్యక్తీకరించలేదు.

పెన్షన్ వచ్చిన రోజు చెప్పుల అంగడికి వెళ్ళా. "ఒక మంచి జత చెప్పుల్ని చూపించండి"

"సార్.. మా షాప్‌లో ఎప్పుడూ ఫస్ట్‌క్లాస్ సరుకే ఉంటది. బెళ్తంగడి, కరూరు, శిరసి పట్టణాల సరుకు రోడ్డంచున అమ్ముతారే వాళ్ళదగ్గర ఉంటవి అవి" అన్నాడు అతను.

"సరేలే.. నాకు ఫస్ట్‌క్లాస్ చెప్పులు కావాలి."

"మంచి లెదర్ చెప్పులు. ఇంపోర్టెడ్ సరుకు. మీకు ఎంత రేటువి కావాలి?"

నెల మొత్తం ఇంటి సరుకుల బిల్లు, కరెంట్ బిల్ కట్టిన తర్వాత పెన్షన్ డబ్బు 720 రూ.లు మిగిలింది. "రేటు ఎంతైనా ఫర్వాలేదు. మంచి చెప్పులు కావాలి. ఏడెనిమిది సంవత్సరాలు ఉండాలి" అన్నాను నేను.

"అయితే ఇంపోర్టెడ్ లెదర్ చెప్పుల్నే తీసుకోండి. ఆస్ట్రేలియన్ లెదర్. ఏడెనిమిది ఏళ్ళు గ్యారెంటీ. బాగా మేంటైన్‌చేస్తే పది సంవత్సరాలు గ్యారెంటీ. మనదేశం సరకుకాదు. ప్యూర్ ఆస్ట్రేలియన్ లెదర్" అన్నాడు అతను.

"ఉంగటం గట్టిగా ఉంటదా!"

ఉంగటాన్ని నా ఎదురే గట్టిగా పీకి, లాగి పట్టుకొని "దీనికి ఒక నూరు కిలోల బరువును కట్టి వేలాడదీసినా ఊడిపోని స్వభావం ఉంటది. ఆస్ట్రేలియన్ లెదర్ కదా!"

అతను అట్లాగున చెప్తుంటే, నేను మంచి చెప్పుల్నే సెలెక్ట్ చేసుకొన్నా. నల్లటి స్ట్రాప్, చర్మంతో కుట్టింది, పెద్ద హీల్,. నడిచేటప్పుడు కిర్రు, కిర్రు సప్పుడు. వాటిని వేస్కుని

ఇంటికి చేరాను. శారదకు చూపెడితే "చూద్దాం... చూద్దాం ఇవెన్ని రోజులు ఉంటవో" అని అక్షింతలను చల్లింది.

"ఆరేడు సంవత్సరాలకు ఢోకాలేదు" అని గట్టిగానే అన్నాను.

"ఎవరు చెప్పారు.. మీలాంటి చెవులున్నోడే చెప్పుండొచ్చు. వాడు చెప్పిందాన్ని మీరు నమ్మారు" మళ్ళీ హీనంగా చేసే మాటలే. సర్లే... మాట్లాడుకోనీ... నేను కొత్త చెప్పుల్ని కొన్నాను కదా! ఆమె అనే మాటల్ని కేర్ చెయ్యనులే....

"ఇంపోర్టెడ్ లెదర్ అట.. ప్యూర్ ఆస్ట్రేలియన్ లెదర్ అట" గర్వంగా చెప్పాను.

"మీకు హంస – సోనా మసూరి బియ్యం తేడాలే తెల్వదు. ఇక ఇంపోర్టెడ్ – దేశీ లెదర్ వీటి మధ్య భేదం మీకెట్లా తెలుస్తది. అంతా భ్రమే. ఊరకుండండి" అని దెప్పసాగింది. దానికి మరు జవాబును చెప్పలేదు నేను. ఏమైనా చెప్పానో పోట్లాటే. ఐదారు సంవత్సరాలు గడిస్తే వీటి విలువ మన్నిక ఆమెకు తెలుస్తది అని నేను ఊరుకొన్నా.

రాత్రి మేము పడుకోబోయే ముందు నా పాతచెప్పుల ప్రక్కన కొత్త చెప్పుల్ని జతగా చావిట్లో ఉన్నబెంచి క్రింద భద్రంగా పెట్టాను.

మరుదినం యథాప్రకారం ఉదయాన్నే లేచి పాలకోసం బయల్దేరబోయాను. వంగి బెంచి క్రింద చూసా. ఒకే చెప్పు. ఎడంకాలిది. కుడికాలిది ఎక్కడకు పోయిందబ్బా? చావిట్లో అంతా వెతికా. ఎక్కడా లేదు. మెట్లు దిగి బయటకు వచ్చాను. అక్కడైనా కనబడుతది అని. ఇంటి ఎదురు వెతికా. అక్కడా లేదు. ఛీ... ఛీ.. ఏమైంది? కొత్త చెప్పు. నాకు బేజారు అయ్యింది. కొత్త చెప్పులు... ఇంపోర్టెడ్ లెదర్...ఛి... ఛీ...

బయట్నుంచే కేకేసా.... "ఏమోయ్.... ఏమోయ్..." అని

ఆమె లోన్నుంచే బదులిచ్చింది. "ఏమిటి మీ గోల ఇంత ప్రొద్దున్నే?"

"నా కొత్త చెప్పుల్లో ఒకటి కనబడటలేదే?"...

రెండు నిమిషాల తర్వాత నైటి నుంచే బయటికి వచ్చింది. ఆమె వేసుకొన్న నైటి అదొక రకమైంది. ఆమె వెళ్తుంటే నేలను ఒరసుకొంటూ వెళ్తది. "ఏం అంటున్నారు చెప్పుల గురించేనా?" అంది శారద.

"ఔనే.. ఎడం కాలిది ఉంది. కుడికాలుది మాయమైంది."

శారద ప్రశ్నను వేసింది. "పాతవా... కొత్తవా?"

నేను నిరాశతో అన్నాను. "కొత్తవే.. నిన్న కొన్నవే...."

ఆమె చుట్టూరా నిశితంగా చూస్తూ "కుక్క తీసుకొని పోయుండొచ్చు. మీ కర్మకు తగినట్లుగా ఆ గేటు. ఓపెన్ చేయడానికి రాదు.. క్లోస్ చేయటానికి కుదరదు. దాన్ని రిపేరు చేయించండి అని ఎన్నిసార్లు చెప్పాను. విన్నారా? ఇప్పుడు చూడండి..ఏదో ఊరకుక్క వచ్చి మీ కొత్త చెప్పును ఎత్తుకొని పోయుండొచ్చు." అంది ఆమె.

"ఛీ.. ఛీ... ఆ కుక్కకు ఏం బుద్ధి. నా ఇంపోర్టెడ్ చెప్పునే ఎత్తుకొని పోవాలా?" నా కిప్పుడు పూర్తిగా భేజారైంది. అక్కడే మెట్లమీద కూలబడ్డా.

"కూర్చొంటే సరిపోద్దా... వెళ్ళి పాలను పట్టుకురండి" హుకుంను జారీచేసింది ఇంటిది. ఈమెకేమో తాజా సువాసనలతో ఘుమఘుమలాడే కూర్గు కాఫీ పౌడర్‌తో బెడ్‌కాఫీని తాగే ఆలోచన. నాకేమో నా చెప్పులు పోయిన దుగ్ధ. ఇంకా కూలబడే ఉన్నానంటే ఈమె రంఫ – రాద్ధాంతం. నిధానంగా లేచి బయల్దేరా. కాళ్ళకు ముక్కలై పోయిన పాత చెప్పులు. పాలబూత్ వానికి చెప్పా కుక్కల పాలైన నా ఇంపోర్టెడ్ చెప్పుల గురించి. "మాష్టారు మన కుక్కలకు బెళ్తంగడి, కరూరు, శిరసి చెప్పులకు... ఇంపోర్టెడ్ అయిన ఆస్ట్రేలియన్ చెప్పులకు ఉండే భేదభావం ఎట్లా తెలుస్తది. మీరెంత పిచ్చోళ్ళు.. ఇంపోర్టెడ్, ఇంఫోర్టెడ్ అని మాట్లాడుతారు" అని కసురుకున్నాడు.

ఇంటికి పాలప్యాకెట్లతో తిరిగి వస్తున్నా. శంకరవిలాస్ హోటెల్ ప్రక్కన కడూరులో రైలు బండి దిగి వచ్చిన వారు టిఫిన్, కాఫీల కోసం టేబిళ్ళ ముందు కూర్చొనియున్నారు. హోటెల్ వెనుకాల ఉన్న మురుగు కాలవ ప్రక్కన రెండు కుక్కలు ఒకదాని కోసం పోరాటం చేస్తున్నవి. కొంచం దూరం నుంచి చూస్తే ఒక చెప్పుకోసం కలబడటం కన్పించింది. పరీక్షగా చూసా..కొత్త చెప్పే అది. అది నాదే. 'హై.. హై...' అంటూ వాటిని బెదరుగొడ్తూ కింద పడేసిన ఆ చెప్పును ఎత్తుకొని గబగబా ఇంటివైపుకు అడుగుల్ని వేసా..

ఇంటిదానిని (శారదకు) సర్‌ప్రైజ్ చేద్దామని సప్పుడు చేయకుండా చావిడికి వచ్చి బెంచిక్రింద చెప్పును పెట్టడానికి ముందుకు వంగాను. అరె.... అరెరే ఇదేంటి ఎడం కాలి చెప్పు ఇక్కడ లేదేంటి? ఎక్కడికి పోయిందబ్బా... అక్కడ్నుంచే కేకేసా. "శారదా... శారదా.... నా చెప్పులు ఎక్కడ ఉన్నవి. అదేనే క్రొత్త చెప్పు".

ఆమె లోన్నుంచే చెప్పింది. "పేపరోడికి దాన్ని అమ్మేసా. ఒక చెప్పు పెట్టుకొని ఏం చేస్తారు?"

"ఎంతకు అమ్మావు దాన్ని?" అని గర్జించా.

"పది రూపాయలకు .. అంతే వచ్చింది" దానికి.

నాకు కన్నీరు జలజలా రాసాగింది. బయటకు వచ్చా. కుడికాలు చెప్పు ఉంది. దీన్ని ఉంచుకొని ఏం చేసుకోవాలి? అని భావిస్తూ మైన్‌రోడ్ వైపుకు విసిరా. అయితే నా దురదృష్టం కొద్దీ అది ఎందురింట్లోని మల్లెపందిరికి తగిలి అక్కడే పూలుకోసుకొంటున్న ఆ ఇంటావిడె మీద పడింది. పొడవాటి ముఖం ఉన్న ఆమె ఇటువైపుకు తిరిగింది. నేను చేసిన పిచ్చి పనిని చూసి విపరీత కోపంతో ఏకవచన సంభోదనంతో రాయటానికి వీల్లేని భాషతో తిట్టసాగింది. ఆమె నుంచి గట్టిగా వస్తున్న తిట్లను విన్న మా ఇంటిది , నన్ను కుక్క, పంది కన్నా హీనంగా తిట్టుతుండటం చూసి "రండి లోపలికి... ఆ తిట్లను వింటూ అక్కడే ఉండి పోతారేంటి?" అంటూ నన్నుచేయిపట్టి ఇంట్లోకి గుంజుకెళ్ళింది.

నేను స్టూల్ మీద ముఖాన్ని వాలేసుకుని కూర్చున్నా. "ఎంత పని చేసారు మీరు... ఈ వయస్సులో? సిగ్గులేదా మీకు?" అంది నాముందు నించొని. నేనప్పుడు జరిగింది చెప్పా. అప్పటికి బయటనుంచి వస్తున్న తిట్ల పురాణం నిలిచిపోయింది. మా ఇంటిది ముఖంను త్రిప్పుకొంటూ, వయ్యారంగా దేహభాగాల్ని కదిలిస్తూ, "దానికే అనేది నేను? కొత్త చెప్పుల్ని వేసుకొని తిరగటానికి యోగ్యత ఉండాలి" అంటూ మాట్లాడసాగింది. ఆమె ఇంకేమి ఉపదేశం చేస్తదో అని మనస్సులో పుట్టగానే, రెండు ముక్కలైన పాత చెప్పుల్నే వేసుకొని ఊరును చుట్టి రావటానికి గమ్యం, గురి తెలియనోడిలాగా బయల్దేరా. 'టప టప టప' మంటూ చెప్పుల సప్పుడు రాసాగింది.

❀ ❀ ❀

(కన్నడభాషలో ఈ కథను రచించినవారు శాంతరామ సోమయాజి గారు. "సుధా" వారపత్రికలో 05-01-2006న ప్రచురించబడిన ఈ కథను యథాతథంగా తెలుగులోకి అనువదించాను)

**శాఖమూరు రామగోపాల్**

# డ్రామా ట్రూఫ్ లోని యువతి

**జ**తగా ప్రేయసి ఉంటే మటమటలాడే వేసవి ఎండకూడా నిండు వెన్నెలే అవుతది కదా!

జతే లేని  ఈ ఒంటి జీవనం ఈ సాయం సంజెలో శూలానికి గుచ్చినట్లు ఉంది కదా!

తనకు పరాయిదైనదీ నగరం. పెద్ద ఆఫీసర్‌గా జవాబ్దారితనం. తన ఊరి నుంచి పక్కాగా చెప్పాలంటే ఒకరోజు మొత్తం రైలు ప్రయాణం. చేతనమే లేని స్థిర జీవనం.

ఆరోజు సోమవారం. ఎండ మాడుస్తుంది నెత్తిని.

గౌడణ్ణ కాళ్ళు ఆ మహానగరంలోని పబ్లిక్‌పార్క్ వైపుకు సాగినవి. ఆకలేస్తున్న సూచన ఖాళీగా ఉన్న కడుపునుంచి వస్తుంది. పానిపురి –పావుబాజి  తినాలని ఆ బండి దగ్గరకు నడిచా. ఛీ అన్పించింది. చల్లబడిపోయా!

నా వాళ్ళెవరూ లేని ఈ మహానగరం నాకొక  నరకంకు పుట్టినూరులాగా కనబడసాగింది నా కళ్ళకు. మెల్లగా ఆ పార్క్  చెంతకు నడిచా. ఈ ఉడుకిపోతున్న సంధ్యాసమయాన్ని ఎలాగ గడపాలి అనే భావన రాగా ఇంకాస్త భయాన్ని పుట్టించింది. పరిచయస్తులు లేని ఈ నగరం, ఈ దూరపునగరం,... ఎందుకో విసుగును కలుగజేయసాగింది.

ఆశ్చర్యం... ఎవరో వెనుక నుంచి పిలుస్తున్నారు.

తమ్ముడా.. తమ్ముడా.... ఆగు తమ్ముడా...!

వెనుదిరిగి చూచా. నమ్మటానికి సాధ్యంగాని చామంతి రంగుతో వున్న బంగారం లాంటి యువతి. పాలరాతి ప్రతిమ. మంచి చనుకట్టుతో  ఉన్న జవ్వనవతి. కనుసంజ్ఞెలతో జింకలాగ ఉన్న హరిణి. ఎవరీమె? నా పేరు  ఈమెకు ఎట్లా గుర్తు?నేను భయపడ్డాను. కాళ్ళు కంపించుచున్నవి కదా!

ఆమె భర్రునే వచ్చి నడుదారిలో నా రెండు చేతుల్ని బిగుతుగా పట్టుకొని ఉంది. ఇంకేంటి వాటేసుకొంటుందేమో అనే భయంతో తల్లడిల్లసాగాను. ఆమె ప్రక్కన మధ్యవయస్సులో ఉన్న ఇంకొకామె  తోడుగా నిలిచి ఉంది. ఆ పెద్దామె ఖుషితో నవ్వుతుంది.

నా చేతుల్ని పట్టుకొని ఉన్న ఆ అపరిచిత రూపవతిని అడిగాను

"ఎవరు నువ్వు.. ఏమి కావాలి?"

ఆ యువతి నా చేతుల్ని ఇంకా బలంగా అదిమి.. నా అరచేతిని ముద్దించింది. మళ్ళీ... "తమ్ముడూ... తమ్ముడూ.... ఇక్కడ ఈ నగరంలో నాకు దర్శనం కలిగించావు కదా..." అంటూ ఏడ్వసాగింది. ఆశ్చర్యం ఏమిటంటే ఆమె కంటికొనలనుంచి జాలువారిన కన్నీటిచుక్కలు నా అరచేతిలో పడినవి. ఆ ఒక్కక్షణం ఈ వేసవి వానాకాలంగా అయ్యింది నాకు.

మరుక్షణంలో నేను జాగ్రత్త పడదల్చుకొన్నాను. ఇదేంటి ఈ మోహక యువతి ప్రవర్తన. మొదలే ఇది హడావుడి నగరం. ఈ నగరంలో ఎవర్ని నమ్మకూడదని తన ఆఫీసులోని అనుభవజ్ఞులు తనకు మొదలే వార్నింగ్ ఇచ్చారు. ఇది పట్టపగలే నిలువుదోపిడీకి పేర్గాంచిన నగరమని ముందస్తుగానే చెప్పారు కదా! ఏ పుట్టలో ఏ పాముందో అనేది తెల్వదని తన ఫ్యాక్టరీ ఛీఫ్ ఇంజనీర్ ఎచ్చరించింది గుర్తుకుతెచ్చుకొంటూ కొంచెం బిరుసైన  కంఠధ్వనితో ఆ యువతిని  అడిగా....

"ఇదేంటిది? ఎవరు నువ్వు? మొదలుచెప్పు. రోడ్డుమీద ఇలాగున చేయి పట్టుకోకు వదులు... వదులు... "అంటూ విసురుగా చేతిని లాక్కొని ఆమె నుంచి జరిగాను. ఆ యువతికి తోడుగా ఉన్న ఆ మధ్యవయస్కురాలైన మహిళ ఆ యువతితో అనసాగింది.

"ఏ రూపమ్మా.... ఆ విధంగా చేయమాకు రూపమ్మా.. పాపం ఆ యువకుడికి ఏమి తెలుసు? దూరంగా నించొని మాట్లాడు. గొప్పోళ్ళు వీళ్ళు. పైపెచ్చు ఆఫీసర్. నువ్వెవరు... ఈయన ఎవరు? గౌరవంతో, భక్తితో మాట్లాడించు."

ఆ పెద్దామె ఇంతవరకే వదలక తరుణప్రాయుడ్నైన నాతో చెప్పసాగింది. "చిన్నపటేలా... నువ్వేమి తప్పుగా అనుకోవద్దు. మేము మీకు అక్కచెల్లెళ్ళుగా అనుకోండి..."

నాలో ఇంకాస్త దిగులు ఎక్కువైంది. నా పేరు ఈ ఇద్దరికి ఎట్లా గుర్తైంది? ఈ స్త్రీలు ఎవరు? ఏ ఊరు వాళ్ళది. ఈ అపరిచిత నగరంలో మొదలే పేరు తెలుసుకొని మోసం చేసే స్త్రీలు ఉన్నారేమో? ఒక సెకెండులో నా మనస్సు ఊబిలోకి నెట్టబడింది.

ఆ తరుణి చేతుల్ని జోడించుకొని చెప్పసాగింది...

"తమ్ముడా... చిన్నపటేలా..... నేను నీ కన్నా ఒక సంవత్సరం పెద్దదాన్ని అయ్యున్నా నేను నీకు నమస్కరిస్తున్నానులే. మీరు గొప్పోళ్ళు. మీ నాయన నింగణ్ణ గౌడ్రు గొప్పోరు. మేము తక్కువోళ్ళం."

నేను అదిరిపడ్డా.... "మా నాయన పేరు ఎట్లా తెలుసు మీకు?"

అప్పుడు ఆ పెద్దామె మాట్లాడడానికి ఉద్యుక్తురాలై "చిన్న పటేలా.. నింగణ్ణ పటేలే మీ నాయనకదా.. ఊరికే పెద్ద పటేల్.. మేము ఈ భూమి మీద నిలబడి ఉన్నది ఆయన పుణ్యమే... ఆయన దేముడు...మా పాలికి దేముడు."

తండ్రి ప్రసంగం వచ్చిందే తడవుగా నేను ఒకింత కరిగిపోయి ఆ యువతిని మళ్ళా అడిగాను...

"ఒకసారి మీరు ఎవరని వివరంగా చెప్పితేనే నాకూ అర్థం అవుతది కదా!"

"ఉత్తిగనే పొగడ్తలతో మాట్లాడితే నేనేమి తెలుసుకొనేది? ఎవరు నువ్వు?"అని అడిగా మరలా కటువుగా.

నా ఈ చిన్న ప్రశ్నెకు ఆ రూపవతి దోసిలిలో తన ముఖాన్ని కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. 'అయ్యయ్యో' అని అన్పించింది నాకు.

ఆ పెద్దామె చెప్పసాగింది....

"చిన్న పటేలా.. మేము ఈ ఊరికి వచ్చి మూడు నెలలైంది. మా డ్రామా కంపెని నగరంలోకి వచ్చిందంటే ఒక తరహాలో చూసే ప్రేక్షకులు సభ్యవంతులుగా, నాటకంలో పాత్రల్ని పోషించే మేము కళావతులుగా.. అనేది ఒక అభిప్రాయంగా ఉంది కదా... ఏమి చెయ్యాలి? ఇది మా నుదుటిమీద రాసిన బ్రహ్మలిపి. ఇటువంటి జీవనం గడిపే..ఈమె మీకు చెందిన యువతి అని నేను ఎట్లా చెప్పగలను బాబూ"..

"అంటే"?

"తిట్టకండి  చిన్నపటేలా... మేము ఎవరు అని అడగకండి. నిజంగా చెప్తున్నా.. సత్యంగా చెప్తున్నా.. మేమంతా భలే రూపవతులం. మా జాతి చరిత్ర మంచిగా ఉండదులే. అయినా మేమెంత ఇదిగా ఉన్నా మేము పురుషాధిక్య సమాజంలో విలాసాల రూపంలో తొడతొక్కిళ్ళకు బలైనోళ్ళమే కదా! అయితే మాకు తల్లి – తండ్రి, అన్న– తమ్ముడు ఉంటారులే. ఈ యువతికి ఇక్కడ నువ్వు పరదేశి లాగ ఈ పరాయి నగరంలో ఈ దారిలో అనుకోకుండా దర్శనాన్ని ఇచ్చావు. మాకు పాలు – పండ్లు తిన్నట్లైంది బాబూ!"

అప్పుడు నేను ఇంకాస్త కరిగిపోయి, పెదాలమీద నవ్వులతో నర్తనం చేస్తూ అడిగాను....

"మీరు ఎవరని ఇంకాస్త ఎక్కువగా చెపితే బాగుంటది కదా! మీరు ఎవరని తెలియక ఏ రకంగా నేను సంబోధించేది. చెప్పండమ్మా వివరంగా?"

పెద్దామె బదులు చెప్పసాగింది....

"చిన్న పటేలా.. ఈ ఒక్క మాటను అడగకండి. ఇది అడిగే ప్రశ్నె కాదు కదా... మేము జవాబు చెప్పేది కాదులే ఆ మాటలు. ఈ యువతి మిమ్మల్ని జ్ఞాపకం చేసుకొంటూ మీ ధ్యాసలోనే ఉంటుండేది. ఈ పరాయి నగరంలో మీరు కనపడింది ఈమెకు కరువుకాలంలో కల్పవృక్షం కనబడినట్లు అయ్యింది బాబూ...! ఈమె నీకు అక్క. నువ్వేమో ఆమెకు తమ్ముడివి. ఇంత విషయాల్ని సూక్ష్మంగా తెలుసుకొని వదిలేయండి."

నా (చిన్నపటేల్) గుండెకు తుపాకి గుళ్ళు తగిలినట్లుగా అయ్యింది. తన ఇంటికి తనొక్కడే వారసుడు. అన్న- తమ్ముడు, అక్క-చెల్లెలు ఎవరూ లేరు. అమ్మ- నాయన ఊరిలోనే ఉంటారు. నాయన తన మంచితనం చేత ఊరిలో పటేల్ గాకపోయినా పటేల్‌గా గుర్తించబడ్డాడు. కష్టంతో తనను సాకాడు. ఇప్పుడు మళ్ళీ నోరు తెరిచి

"మీ మాటలు వింటుంటే మా ఇంటి పరిచయం అంతా మీకు ఉన్నట్లుంది కదా! ఎవరు మీరు? సవిస్తరంగా దయతో చెప్పండి" అని అడిగా.

ఆ యువతి ఉద్వేగంతో మళ్ళీ నా చేతిని పట్టుకొంది. నా కోల ముఖంమీద, చుబుకం మీద తన మృదువైన చేతిని సవరించింది. ఆమె చేతులలో కామ ప్రకోపన స్పర్శే లేదు. తన తల్లే తనని సవరించినట్లుగా, నిమిరినట్లుగా ఉంది. ఆ దారిలో అనేకులు ఆ యువతి తన చేతిని పట్టుకొన్న దాన్ని చూసి కొంటె, కొంటెగా చూసుకుంటూ వెళ్తున్నారు. నాకు భయంగాని, సిగ్గుగాని కాలేదు. మృదువుగా ఆ యువతితో అన్నా....

'ఎవరక్కా నువ్వు... ? నువ్వెవరని తెలియదే నేనేమి మాట్లాడేది. చెప్పు అక్కా నువ్వెవరివి?"

నా ఈ మాటకు ఆ యువతి భోరునే ఏడుస్తూ ఏదో చెప్పబోయి బిక్కి బిక్కి ఏడ్చింది.

ఆ పెద్ద మహిళ చెప్పింది ఇలాగున...

"చూడు తండ్రీ... నువ్వు ఈ యువతిని అక్కా అని అన్నావు. ఈ క్షణంకు ఈమె జీవం ధన్యమైంది కదా!"

ఆ యువతి పలకసాగింది.....

“నన్ను అక్కా అని సంబోధించావు గౌడణ్ణా... ఈ రోజు నా జీవనం పావనమైందిలే. ఇక నేను దేముడి పాదాన్ని చేరుకొన్నా దిగులు లేదులే! సుఖంతో విధివశం అవుతానులే”

అయ్యయ్యో! ఈ ఎదిగే ప్రాయంలోని యువతి నుంచి చావు గురించి మాటలా!

ఒక సెకనులో నా మనస్సు గగన పక్షిలాగ అయ్యి ఇతిహాసంలోని పుటలను తెరిచి, వాటిని తర్కించి దూరదూరంగా ఎగిరింది.

నా మాతృమూర్తి రోగిష్ఠి. దైవభక్తి కలిగినామె. తండ్రి బలశాలి. ఊరిలో పరాక్రమం కలిగినోడు. అయినా పేదోళ్ళంటే కరుణాశాలి. ధర్మవంతుడు. ఇటు ప్రక్కన ఇల్లాలి మీద అటు ఊరిమీద అంతర పిశాచిలాగ కాకుండా.. మెలిగినోడు మా నాయన అట.

ఆ సమయంలో మా తండ్రి తనకు మాత్రమే కనపడే, ఇతరులకు అగోచరమైన సంబంధాన్ని ఒక మహిళతో పొందియున్నదాన్ని నా జ్ఞప్తిలోకి వచ్చింది. ఒక క్షణం వణికాను. నా మనసులోని భావనలను మరల్చుకోవడానికి ప్రయత్నించా. ఎంత ప్రయత్నించినా నా తండ్రి జ్ఞాపకాలు (రాసలీలలు) మరలా మరలా జ్ఞప్తికి రాసాగాయి. నేను అసహనంతో ఉన్నదాన్ని ఆ పెద్ద మహిళ గుర్తించింది.

“చూడు చినబాబూ... అయ్యిందేదో అయిపోయింది. మీ తండ్రికి అదో చెడు సమయం. పాపం మీ తల్లి జబ్బుమనిషి. రెండుసార్లు ఆపరేషన్ అయ్యింది ఆమెకు. మేము దూరం దూరంగానే ఉన్నాము. మీ తండ్రిగారు మాకు అన్న –పానానికి దారిని కలిగించినోరు. ఆయన నీకూ తండ్రి.. ఈమెకూ తండ్రే. ఊరికే తండ్రి లాంటోడు. పాపం ఈ యువతి తల్లి చనిపోయింది. ఆ రోజునుంచి పెద్ద పటేల్ మాకు కనిపించలేదు. మా ఇల్లు దొరేలేని రాజమందిరం అయ్యింది. గురువే లేని మఠంగా అయ్యింది. అయినా ఆయన నాటిన బీజం బంగారమే అని భావించి మిమ్మల్ని దూరం నుంచే సదా జ్ఞాపకం చేసుకొంటూనే ఉంటున్నాము.. ఈ రోజు ప్రత్యక్షమై మాకు కనబడ్డారు. ఇంత పుణ్యం మాకు చాలులే.”

ఈసారి ఆ యువతి మళ్ళీ నా చేతుల్ని పట్టుకొని తన హృదయానికి ఒత్తుకుంది. ఆమె కళ్ళ నుంచి నీరు ఉబికి రాసాగింది. మెల్లగా పసిపాపలాగ అడగసాగింది.

“గౌడణ్ణా.. నేను ఎవరు అని తెలుసుకోవాలంటే ఒక వాగ్ధానాన్ని ఇవ్వాలి”.

‘ఏమిటది?’

"ఈ రోజు మా కంపెని నాటకంను చూడటానికి రా. నాపాత్రను నువ్వు కళ్ళారా చూడాలి. నువ్వు నా వేషంను చూస్తే నా వృత్తికి ముక్తి లభించినట్లే."

అక్క నోటినుంచి ముక్తి గురించి మాటలు. నేను ఆమెకు ధైర్యం చెప్పటానికని ఉద్యుక్తుడునై తడబడ్డాను.

'ఇంతే కదా... ఏ కంపెని.. ఏమి నాటకం?"

ఆమె ఆ ముఖ్య దారిలో కళ్ళకు కట్టినట్లుగా కనబడే భారీ ఎత్తులో ఉన్న భవ్యమైన రంగుల పోస్టర్ని చూపిస్తూ చెప్పింది...

"అదుగో... అదే కంపెని... అదే నాటకం... రాత్రి 9 గంటలకు రావాలి.. వస్తావా?"

రంగులతో కళకళలాడుతున్న ఆ బృహత్తరమైన బోర్డును చూసి చిన్న పటేల్ అయిన నేను గడగడా వణికాను. అది... ఇదే ఈ యువతిదే అయిన భారీగా ఉన్న పెద్ద కలర్ కటౌట్. ప్రస్తుతం ఈమె ధరించిన దుస్తులు నవీనకాలపు పోకడులతో ఉన్నా, ఆ బోర్డ్ ఉన్నది సాంప్రదాయస్త 'ఇళ్‌కల్' నేత చీరతో నుదుటిలో పెద్ద కుంకుమ బొట్టు.

తనేమో ఆ కటౌట్‌ను చూస్తుంటే, ఆ పెద్ద మహిళె ఒక మాటను విసిరింది.

"అంతా... అదే ముక్కు.. అదే చుబుకం... అదే పెదాలు.. అచ్చు గుద్దినట్లుగా తద్రూపం...."

ఈ మాటల లోతు మరింత లోతుగా నా హృదయంలో నాటుకుపోయి ఈ మండు వేసవిలో కూడా చలేసినట్లుగా వణుకు రాసాగింది.

వాగ్దానం ఇచ్చినట్లుగానే ఆ రాత్రి నేను నాటకాన్ని చూసేందుకు మంచి అందమైనసూట్ ధరించి సొగసుగానే వెళ్ళాను. టికెట్ లేకపోయినా నన్ను ఫ్రీగానే లోనికి వెళ్ళనిచ్చారు. గేట్‌కీపర్ రాచమర్యాదలతో స్వాగతాన్ని కురిపించి ముందు వరుసలో ఉన్న సీటులో కూర్చోబెట్టాడు.

ఇప్పటికే ఒక వంద ప్రదర్శనాలను దాటిందట ఈ నాటకం. అయినా జనం కిక్కిరిసి జమ అయ్యారు. పురుషులకన్నా రెండురెట్లు స్త్రీలే అధికంగా చూడటానికి జమ అయ్యారు. ఇంకా తండోపతండంగా మహిళలు వస్తూనే ఉన్నారు.

నాటకం ప్రారంభమైంది. అంకితభావంతో నాటకాన్ని చూసేదానిలో నిమగ్నమై పోయాను నేను చివరి అంకం వరకూ. ఇప్పటిదాకా చూసిన వందల కొలది సినిమాలను అవతలకునెట్టి, మీరినంతగా ప్రీతితో ఉన్న శక్తిని నింపింది ఈ కన్నడ కంపెని నాటకం.

నాటకానికి జీవమే ఈ యువతి. నాటకానికి ప్రాణస్పర్శను ఇచ్చేదే ఈమె. ఈమే వేల ప్రేక్షకుల్ని మంత్రముగ్ధం చేయించిన హృదయ మోహిని. హీరోయిణి వేషమే అనటంలో సందేహం ఏమి లేదు కదా!

ఆ పెద్దామె మాత్రం... అందర్ని పొట్టచెక్కలయ్యేటట్లు నవ్వించే హాస్యపాత్రను పోషించింది. తనేమో ఒకటే నవ్వులతో ఈ నాటకాన్ని చూసి ఎన్నో సంవత్సరాల తరువాత శిరస్సుకు అంటుకొని ఉన్న నరాలు తేలిక బడినట్లుగా ఆ హాస్యపాత్రను నిభాయించిన ఆ పెద్దామె ద్వారా మహదానందాన్ని పొందాను....

యువతి వేసిన పాత్రను చూసాక నా తల్లి పార్వతినే చూసినట్లై భక్తిభావం పొంగి ప్రవహించింది. ఈ ప్రాయపు తరుణిలో ఎంతా అద్భుత అభినయ శారద దాగికొని ఉంది కదా! ఎంథ రమణీయక రాజరాజేశ్వరి ఈమె.

అబ్బా ... బేళూరు హళెబీడు శిల్పకళా దేవతలను మీరిన ఈ విశ్వసుందరి .. దారిలో నన్ను కల్సి... తమ్ముడా... అని సంబోధించిన వైనానికి నా జీవితం ఎంథగా ధన్యమైందో కదా!

నాటకం ముగిసిన తరువాత.... స్టేజ్ పరదా ప్రక్కన నేను.. దేవతాదర్శనం కోసమని వచ్చిన భక్తుడి లాగ చేతుల్ని జోడించి నించున్నాను. ఆ యువతికి సంతోషమే సంతోషం. తమ్ముడైన నన్ను చూసి ఆమె మేకప్‌లోనే ఉండి మయూరిలాగ నర్తించింది.

నేను ఆమెతో అన్నాను...

“అక్కా రేపు సాయంత్రం పార్క్‌కు రావాలి. మరచిపోవద్దు.”

యువతి మళ్ళా నర్తించింది.

మరుసటిదినం పార్క్‌లో నేను ఆమెను మరియు ఆమెకు చేదోడుగా వున్న ఆ పెద్దామెను .. లక్ష్మి – సరస్వతిలను చూచినట్లుగా భక్తితో గౌరవించాను. ప్రక్కనున్న హోటల్‌కు పిలుచుకొని వెళ్ళి ఉపాహారాన్ని పెట్టించాను.

ఇక వెళ్దామని లేచేటప్పుడు రెండు కానుకలను వాళ్ళిద్దరి చేతులలో ఉంచాను. ఒక ఆకుపచ్చని చీర.... ఇంకొక ముత్తైదు చీరను (పట్టు జరీ అంచులున్న చీరలను) వాళ్ళకు కానుకగా ఇచ్చాను.

ఆ యువతి నేనిచ్చిన చీరను గాఢంగా అదుముకొంది తన హృదయానికి. ఆ చీరెను తన ఎదెకు (గుండెకు) అదుముకొంటుంటే, ఆమె తన తండ్రినే వాటేసుకొన్నట్లుగా భావసుఖాన్ని అనుభవించింది.

ఆ పెద్దామె తనకిచ్చిన చీరను నామీద పరచి, చెక్కిళ్ళను ప్రేమతో చుంబించింది. ఆ చుంబనం (ముద్దు)లోని అగాధమైన తీవ్రతకు నా తల్లే ప్రత్యక్షమై ప్రీతి, వాత్సల్యాన్ని కురిపించినట్లుగా అనుభవం కలిగింది.

ఇతిహాసం దరహాసాన్ని చేయసాగింది.

ఆ దేవదాసీలు నవచైతన్యంతో నవ్వు ముఖాలతో లేచి నిలబడ్డారు.

ఉద్యానవనంలోని పురాణకాలంలోని చెట్టునుంచి జీవపుష్పం వికసించింది.

❀ ❀ ❀

(కన్నడభాషలో 'కంపెని నాటకద హుడుగి' అనే పేరుతో ఈ కథను రచించినవారు ప్రొఫెసర్. జి.ఎచ్.హన్నెరడు మఠగారు. కన్నడప్రభలోని సాప్తాహికప్రభ నుంచి 06-08-06న ఈ కథను తెలుగులో అనువాదం కొరకు తీసుకోవటమైంది.)

**శాఖమూరు రామగోపాల్**

# కడుపుకు చిచ్చు పెట్టిన కుమారుడు

ఏమైనా అవ్వనీ, వీడికి ఈ పూట ఇంటి తలుపుల్ని తీసేదిలేదు అని ఎప్పటిలాగానే నిశ్చయించింది భాగ్యమ్మ. ఇంకొకసారి తలుపుల్ని తట్టిన సప్పుడు అయ్యింది. భాగ్యమ్మ కూర్చున్న చోటునుంచి లేవనే లేదు.

ఇంతోడు కడుపుకు పుట్టి ఏమి ప్రయోజనం? నా కడుపును కాల్చటానికే పుట్టినోడు వీడు.

గొళ్ళెం నుంచి తలుపుల్ని 'టకటక' అన్పించిన శబ్దం వినబడింది ఈసారి. అప్పుడు ఆమెకు తెలిసివచ్చింది వచ్చినోడు రవికాదని. రవి అయితే ఎప్పుడూ గొళ్ళెంతో సప్పుడు చేయడు. సహనంతోనే తలుపుల్ని తట్టుతాడు. అతని సహనం చుట్టుప్రక్కనోళ్ళ దగ్గర, అమ్మ దగ్గర మాత్రమే సుమా! బయటోళ్ళకు అతను పులిలాంటోడు. వాడ్ని సత్యం అనే వాక్కుతో ఉన్న పులి లాంటోడు అనేవాడు తన భర్త. అతను ఎవడి తలనైనా పగలుకొట్టానంటే, ఖండితంగా అన్నంత పనిని చేస్తాడు. కొడుకు చేసే పనులకు దండం కట్టేటోళ్ళు తల్లైన తను మరియు భర్త.

ఎవరు వచ్చారు ఈ సమయంలో అనుకొంటూ ప్రయాసపడి నిట్టూర్పులు వదుల్తూ నేలకు చేతుల్ని ఆసరాగా చేసుకొని లేచింది భాగ్యమ్మ. మోకాళ్ళ నెప్పులు అధికం అవ్వడం చేత ఈ రోజు ఆమె ఫ్యాక్టరి పనికి వెళ్ళలేదు. నెప్పి ఉందని చెప్పటంతో రవి ఉదయాన్నే డాక్టర్ ఇంటికి వెళ్ళి డాక్టరు నుంచి ఔషధం మరియు మలాము పట్టీలను తెచ్చాడు. వద్దులే నాయనా అని అన్నా కాళ్ళను వత్తుతూ చాలసేపు తన సేవే చేసాడు. ఆమెకు గుర్తే. అతను డాక్టర్‌కు డబ్బుల్ని ఇచ్చేదిలేదు. డాక్టరును ఇంటికే వచ్చి తనకు ఇంజెక్షన్ ఇమ్మని చెప్పియుంటాడు. డాక్టర్‌గారు తమ క్లినిక్‌ను తెరిచేముందే ఇక్కడికి వచ్చి ఇంజెక్షన్ ఇచ్చే వెళ్ళాడు. డాక్టరుగారు వద్దులే అని అన్నా , భాగ్యమ్మ డబ్బీనుంచి ఏభైరూపాయల నోటును సార్‌కు ఇచ్చింది. డాక్టర్‌గారికి ఈ రోజు తనదే కదా బోణి. డాక్టరు మాత్రం ముప్పై రూపాయల్ని వాపసు చేసారు. వేరే ఏ ఇంటికైనా 'విసిట్' చేస్తే కనిష్టంగా నూరు రూపాయల్ని అయినా ఫీసు మూలకంగా చార్జీ వసూలు చేస్తారు.

ఎందుకో రవి అంటే అందరూ భయపడ్డారు. డాక్టరుగారు వచ్చినప్పుడు రవి ఇంట్లో లేడు. కోపం చేసికొని బయటకు వెళ్ళాడు. లేదు నేనే కోపంతో వాడ్ని బయటకు పంపించానేమో. ఇట్లా సేవలు చేస్తే నాకు సంతోషం కలుగుతదా!

"మనుషులు పనిచేయాలి బిడ్డా.... పనిచేసి సంపాదించాలి. సంపదను వృద్ధి చేసుకోవాలి. అప్పుడే మర్యాద దొరుకుతది" అంది ఆమె కొడుకుతో. వేరొక రోజైతే అతను తల్లి మాటల్ని లక్ష్యపెట్టేటోడు కాదు. ఈ రోజు ఆమెకు వంట్లో బాగాలేదు. అందుచేత అతను తల్లితో చర్చకు నిలబడలేదు.

అయినా అతను మెల్లగా అన్నాడు.

"అమ్మా.... పని చేస్తేనే మర్యాద ఉంటదా. డబ్బును సంపాదిస్తేనే మర్యాదా.... నేను పనిచేస్తే నీకు పెద్ద కీర్తి దొరికేటంత డబ్బును కూడగట్టేంత శక్తి నాకు సాధ్యమేనా?"

"అది నా తలరాత.... నువ్వు నా పొట్టలో పుట్టకుండా ఉండాల్సింది బిడ్డా. నీ అన్న చంద్రం... " అమ్మ కళ్ళలో నీళ్ళను చూసి విచిలితుడయ్యాడు రవి.

"ఎందుకేడుస్తావు అమ్మా.... నేను ఈ పూట ఫ్యాక్టరీకి వెళ్తాను... సరే కదా... మరి చంద్రన్న ఇంజనీరింగ్ చదివి ఫారెన్‌కు వెళ్లాడు కదా. ఖుషి అవ్వలేదా నీకు?"

'అతడు నా కడుపున పుట్టే బదులు ఎవరైనా పెద్దోళ్ళ ఇంటిలో పుట్టాల్సింది. నేను కడుపుకు, వంటికి కల్పించి ఇచ్చింది వాడికెంత వరకు సరిపోయింది? అతను బుద్ధివంతుడు, హఠవాది. ముందుకే సాగిపోవాలి అనే ఒకే గురి అతనికి. అతనికి స్కాలర్‌షిప్ (ఉపకారవేతనం) దొరికింది.... బ్యాంక్‌లోనూ దొరికింది. వేరేవాళ్ళ కడుపులో పుట్టి ఉంటే అతను ఇంకా ఏమేమో అయ్యేవాడు. ఫారెన్‌కు వెళ్ళి ఇంకా అతని సంపాదన తోనే పై చదువుల్ని, పరిశోధనల్ని చేస్తున్నాడు కదా...."

"అయ్యేది వదిలి వేరేదో అయ్యేది లేదులే.... నేనూ అన్నలాగానే బుద్ధివంత అయితే ఏమి చేస్తా ఉండేదానివి. నన్ను ఎట్లా చదివించేదానివి."

'బుద్ధివంతుడివి గాకపోయినా పర్వాలేదు. శ్రమించి సంపాదించే బుద్ధి వస్తే సరిపోతది నీకు." అంది భాగ్యమ్మ కణ్ణీరును విడుస్తూ.

'నీకు ఏడిచేది అభ్యాసం అయ్యింది. కొంచం ఆపుతావా... నేను ఈ పూట ఫ్యాక్టరీకి వెళ్తాను....' అన్నాడు రవి.

నాయన రాత్రంతా జాగారంతో వాచ్‌మెన్ డ్యూటీ చేసి వచ్చి లోన పడుకొని యున్నాడు. అమ్మ ఘోషను విని లేస్తే సహించుకోలేడు. అమ్మకు బుద్ధిని చెప్పటానికని నేను సిద్ధమై, మాటకు మాట సాగితే... మొదలే అమ్మకు హుషారు లేదుకదా....

గబగబా ఇంటినుంచి బయటకు వచ్చాడు రవి. భాగ్యమ్మ వెళ్ళే ఫ్యాక్టరీలో దినకూలి పని అతనికి ఖాయంగా ఒక స్థానం ఉండనే ఉంటది. అతను మనస్సు పడితే పర్మనెంట్ పనిని గిట్టించుకోవచ్చు అనేది భాగ్యమ్మకు గుర్తే. అయితే అతను మనస్సు పడాలి కదా!

ఆమె పని చేసే ఫ్యాక్టరీలో పలురకాల షిఫ్ట్‌లు ఉంటవి. మధ్యాహ్నం మూడు గంటలప్పుడు షిఫ్ట్ ముగించుకొని వచ్చిన పక్కింటామె నుంచి ఆమెకు తెల్సిందేమిటంటే రవి సూపర్‌వైజర్‌తో జగడంకు నిలిచి సగంలోనే పనిని వదిలేసి బయటకు వచ్చాడట. అదీ ఎవరో కార్మికుడి గురించి న్యాయానికని బయటకు వచ్చాడట.

ఎంతగా కడుపును కాలుస్తాడు వీడు. రానీ ఇంటికి. అతనికని తలుపుల్ని తీసేదే లేదులే ఈరోజు. జీవనపూర్తి కష్టపడుతూనే జన్మనెత్తాను నేను. తండ్రి చనిపోతే, ఏదోవిధంగా పెండ్లి చేసి చేతుల్ని దులుపుకున్నారు పుట్టింటోళ్ళు. బీదోళ్ళని మర్యాదను చూపించనందుకు, భర్తతో బహువిధాలుగా ప్రార్థించి 'తుమకూరు'ను వదిలింది ఆమె. భర్త బీదోడైనా గుణానికి మంచోడే. ఆమె మనస్సుకు శాంతి కోసమని తెలిసినోళ్ళ సహాయంతో ముంబైకి వచ్చి వాచ్‌మెన్‌పనికి చేరాడు. ముంబైలో సంసారం పెట్టి జీవనాన్ని నడిపేటందుకు ఆరంభం చేసినా, భార్య మహత్వాకాంక్షగాని, బుద్ధివంతతనంగాని అతనిలో లేదు ఎక్కువగా.

అయినా భాగ్యమ్మ మర్యాదతోనే తన ఇద్దరు పిల్లల్ని పెంచింది.

పెద్దోడు చంద్రశేఖరుడికి చదవటం, నేర్చుకోవడం తప్పితే వేరే ఆలోచనే ఉండేదికాదు. ఇంటి సుద్దులు అతనికి గుర్తయ్యేవికావు. అతను బాగా బుద్ధిమంతుడు. అతడ్ని ఇంజనియర్ చెయ్యటం అనేది తక్కువేమి కాదు భాగ్యమ్మ శక్తికి.

అయితే చిన్నోడు రవికుమార పాసవ్వటానికి సరిపడే మార్కులకన్నా రెండు మార్కులు తక్కువ అవ్వటంచేత కాలేజికి చేరలేదు. తిని తిరిగేటోడు. అతను సంపాదించే దెప్పుడంటే

సంవత్సరానికి ఒకసారి మాత్రమే. శ్రీకృష్ణ జన్మాష్టమిలోని గోవిందా గుంపుకు లీడర్ అతను. అతని పటాలం నాలుగైదు పెరుగులతో ఉన్న ఉట్లను పగులగొట్టి కనిష్టపక్షం అరవై, డెబ్బైవేల రూపాయల్ని గెలుచుకొనే దానిలో సఫలం అయ్యేటోళ్ళు. ఆ సమయంలో మాత్రం హీరో రవినే అందరి హృదయాలను గెలిచేవాడు.

ఉట్లను పగులగొట్టి, దాన్నుంచి దొరికిన నగదును పటాలంలోని అందరితో పంచుకోగా ఒక్కొక్కళ్ళకి వచ్చేదెంత? అదీ ఈసారి చాల ఎత్తులో ఉట్లను కట్టటం చేత వాటిని పగులగొట్టే ప్రయత్నంలో ఆధారం తప్పి క్రిందపడి, ఒక కుర్రోడి వంటికి చేతులకు గాయాలు తగిలితే సమారంభానికి లక్షల రూపాయల్ని జమచేసినోళ్ళు ఆస్పత్రి ఖర్చుకు ఇవ్వనందుచేత అతను జగడంచేసి ముఖండుల విరోధం కట్టుకొన్నాడు. గాయపడినోడికి పటాలమే సాయంజేసి రిక్తహస్తాలతో ఇళ్ళకు చేరారు.

ఇదే రీతిగా కార్పొరేషన్ ఎలక్షన్‌లో క్యాండిడేట్‌ను గెలిపించటానికి ప్రాణాన్నే పణంగా పెట్టి శ్రమించాడు రవి. అభినందన సమయంలో గెలిచినోడితో 'సరిగా పనిచేయి' అంటూ బుద్ధిమాటల్ని కురిపించడం వలన ఆ కార్పొరేటర్ కూడా ఇతడ్ని దూరంగానే ఉంచాడు. కార్పొరేటర్‌కు విరుద్ధంగా ప్రచారం చేసినోళ్ళుకూడా జాణతనంతో అతనికి దగ్గరై ఉపయోగాన్ని పొందారు. రవి దేనికి ప్రయోజకుడు కాదుకదా! నా కడుపును కాల్చటానికే పుట్టినోడు అని నిట్టూర్పుల్ని వదిలింది భాగ్యమ్మ.

రవి శవాల్ని మోయటానికి మాత్రమే ఉపయోగపడుతాడు అనేవారు స్కూల్ హెడ్‌మాస్టరు. ఆమె బీదోళ్ళకని దొరికే స్కాలర్‌షిప్ కోసమని ప్రయత్నించడానికి ఆ పెద్ద సారును భేటి అయినప్పుడు, ఆ పెద్దసార్ అలాగున అనినదాన్ని తెల్సుకొన్న రోజునుంచి అతను స్కూలుకు వెళ్ళేదాన్నే నిలిపేసాడు. మళ్ళీ స్కూలుకు పంపేదానిలో ఆమె యశస్సును పొందనేలేదు.

ఇదే రవికుమార్ జలప్రవాహం కాలనీని ఆవరించినప్పుడు ఆ రిటైర్డ్ హెడ్‌మాష్టరు కుటుంబాన్ని, అనేకమందిని ఆ విపత్కాలంలో ఆదుకొన్నాడు. హెడ్‌మాష్టరు మృత కళేబరాన్ని ఆ ఇంటినుంచి బయటకు తెచ్చినోడు రవినే. హెడ్‌మాష్టరు చెప్పింది సత్యమైందిలే. ఇప్పుడూ ఎవరింట్లోనైనా సావు సంభవిస్తే రవి అక్కడ హాజరవ్వాల్సిందే. శవాన్ని రుద్రభూమికి సాగించటానికని.

మంచి పేరు సంపాదించాలంటే గొప్పోళ్ళ కడుపులో పుట్టాల్సిందే అనేది భాగ్యమ్మ విచారధార.

భాగ్యమ్మ తలుపుల్ని తెరిచింది. తలుపుల్ని తట్టినామె సమీపంలో ఉండే బహుళ అంతస్తుల భవనంలోని నివాసి.

"మీరు ఏ ట్రైన్‌లో వచ్చారు? నా కొడుకు ఇంకా రాలేదు" అని అడిగింది ఆమె.

"ఎందుకట్లా అడుగుతున్నారు?.... నేను ఈ రోజు ఫ్యాక్టరీకి వెళ్ళలేదు. ఏమైంది." అడిగింది భాగ్యమ్మ ఆమెతో.

"ట్రైన్‌లోని మొదటి తరగతి భోగిలలో బాంబ్‌లు విస్ఫోటనం చెందాయట. నా కొడుకు వచ్చేది మొదటి తరగతి భోగిలో" ఏడుస్తూ అంది ఆమె.

'నా కొడుకూ రాలేదు' గాబరాగా అంది భాగ్యమ్మ. అయితే రవి ఫస్ట్‌క్లాస్ భోగిలో ప్రయాణించేది లేదులే అనే అభిప్రాయం ఆమెకు కొంచెంగా నెమ్మదిని కలిగించింది.

సెకెండ్‌క్లాస్ భోగిలో ప్రయాణిస్తున్న రవి ఫస్ట్‌క్లాస్ భోగిలోకి ప్రవేశించి ఎంతోమందిని బయటకు లాగి ఆసుపత్రికి సాగనంపాడు. నాశనం చెందిన భోగిలో విలవిలలాడు తున్నోళ్ళను మోసుకొని బయటకు తెచ్చాడు. కొన ఊపిరితో ఉన్నవాళ్ళ కోసమని భోగీ వెతికాడు.

చాల రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్చ్ అయిన పక్కింటి బహుళ అంతస్తుల భవనంలోని ఆ మహిళ కొడుకు చెప్పిందేమిటంటే అతని జీవాన్ని రక్షించింది రవీనేనట. సీటుకున్న కలప పలకల్ని బయటకు లాగి అందులో ఇరుక్కొని గాయాలతో చిక్కి పడియున్నప్పుడు బయటకు లాగింది రవేనట.

అయితే బాంబ్ విస్ఫోటనం చేత ఘాటైన విషపూరిత వాయువులు అతని ఉచ్ఛ్వాశ – నిశ్వాశలతో గుండెకు జేరి రవి తల తిరిగి క్రిందకు పడిపోవటంతో మళ్ళీ లేవనే లేదట. ఆస్పత్రినుంచే అతని శవం ఇంటికి చేర్చబడింది.

తనకోసమని ఏమి ఆశించని, అడగని,ఏమి పొందటానికీ ప్రయత్నించని రవి శవంగామారి ఇంటికి వచ్చి భాగ్యమ్మ కడుపుకు మంటను నిజంగానే పెట్టాడు.

ఇది జరిగిన రెండు నెలలకు భాగమ్మ భర్తకు కొడుకుపోయిన దిగులుతో పక్షవాతం వచ్చి ఆసుపత్రి ఖర్చులకని వేల రూపాయలు అవసరం అయినప్పుడు రవి మరణోత్తర పరిహార మొత్తం డబ్బు రెండులక్షలు భాగ్యమ్మ చేతికి ముట్టినవి.

ఎంతగా కడుపుకు మంటపెట్టాడు ఆ యువకుడు భాగ్యమ్మకు.

❁ ❁ ❁

(కన్నడభాషలోని ఎస్.రమేశ్ నాయక్‌గారి నుంచి "హొట్టె ఉరిసిద హుడుగ" అనే పేరుతో రచించబడిన ఈ కథను కన్నడప్రభ నుంచి ఆదివారం వెలువడే సాప్తాహిక ప్రభ ద్వారా స్వీకరించి తెలుగులోకి అనువదించినాను. 10-09-06.)

**శాఖమూరు రామగోపాల్**

# ముక్కంటి

**బ**స్ నుంచి దిగి కోటవైపుకు అడుగుల్ని వేస్తుంటే, అతను సహా నన్ను వెంబడించసాగాడు. అతను ఎవరూ అని అడిగితే, నాలో దాగికొనియున్న కథా రచయితే. జనం అంతా నేనే కథల్ని రాస్తాను అని తెలుసుకొనేవారు. దేముడి మీద ఒట్టేసి చెపుతాను, కథను రాసేది నేను కాదని, నాలో దాగికొనియున్న కథా రచయితే కథలు రచిస్తాడు. ఇప్పుడు నన్ను వెంబడించే వ్యక్తి ఎవరంటే నాలో దాగికొనియున్న ఆ కథా రచయితే అనేది నా భావన. అయితే, అప్పుడప్పుడు నేనే అతడ్ని వెంబడిస్తుండేవాడ్ని.

ఈ రోజు ముఖ్యమైన ఒక తీర్మానాన్ని చేసుకొనే అవసరం నానుంచి కాదులే. అది నాలో దాక్కొన్న కథా రచయిత నుంచి మాత్రమే సుమా! ఇప్పటి తీర్మానానికి నాకు ఏ రీతిలో కూడా సంబంధం లేదులే. విషయం ఇట్లాగుంటే నేనెందుకు తల ఖరాబు చేసుకోవాలి.

ఇక ముందు కథల్ని రాసేది లేదు అనేది నా నిశ్చయం. దీనికి విరుద్ధంగా రాయాల్సిందే అనేది అతని హఠం. రాస్తే మటుకు నేను మాత్రం కథల్ని నా పేరు మీద ప్రకటనకు పంపించేది లేదు అనేది నా వాదన. కారణం ఏమిటంటే ప్రస్తుత జనానికి కథల అవసరం లేదులే అనేది నా అభిప్రాయం.

జనానికి కథల అవసరం ఉందో లేదో అనేదాన్ని యోచించకుండా నా పాటికి నేను రాయాల్సిందే అనేది అతని ఉపదేశం.

“థూ... థూ... నీ ఉపదేశం పాడుగాను. నీ ఉపదేశాన్ని విని విని నేను జీవనంలో వెనుకబడ్డాను” అంటూ అతని మీద ఉమ్మినా అతను ఊరకుండిపోలేదు.

అతను కథల్ని ఏ ఉద్దేశంతో రాపిస్తాడో అదంతా తెల్వదు. నేను మాత్రం కథల్ని ప్రకటనకు పంపించేది నలుగురూ చదవాలనే.

“కథల్ని రాసేది అందరూ చదవాలనే కాదులే”

‘మరెందులకు’ అడిగాను

‘మనస్సులోని వేదనను తగ్గించుకోవాలని’

'అంటే మన వేదనలను ఇంకొకళ్ళతో పంచుకోవటానికేనా?'

'అట్లాగేమి కాదులే. నాలాగ ఎవరైనా వేదనను పడుతుంటే కథను చదివితే తమ వేదన తగ్గింపు అవుతది అని భావించి రాయాలి నేను.'

'నాకు ఏమి వేదనా లేదులే.'

'నీకు ఏమి వేదనా లేనిది నిజమేలే. అయితే నాకు వేదనలు ఉన్నవి కదా. అందుకే నేను రాస్తుంటా. ఇంకొక మాట సమాజం కంటికి కనబడనది నాకు కనబడుతది. నేను నాకు కనిబడిందాన్ని రాసి సమాజం దృష్టి ఆవైపు మరలటానికి ప్రయత్నిస్తాను.

"నువ్వు ఏమైనా అను. నేను మాత్రం నా పేరున కథల్ని ప్రకటించటానికి పంపేది లేదు. నువ్వు కథల్ని రాసేదాన్ని నిలిపేయి. ఊరికే నాకూ –నీకూ ఎందుకు జగడం."

'ఆ రీతిగా చెప్పద్దు. కథను రాసేదాన్ని ఎంతో కష్టపడి నేర్చుకొన్నాను గదా!'

'అదంతా నాకు అవసరం లేదు. నువ్వు మాత్రం కథను రాసేదాన్ని మొదలు ఆపేయి.'

'సరే... మూడు, నాలుగు రోజుల తర్వాత దానిమీద చెపుతాను' అని అన్నాను.

ఆ తర్వాత అతనితో మాట్లాడేదాన్ని నిలిపేసా. అతను కూడా నాతో మాట్లాడకుండా ఉన్నదాన్ని గమనించి బహుశః అతను రాసేది లేదు అని నిశ్చయించుకొన్నాడేమోనని నాదే అయిన లెక్కాచారంలో ఉన్నా. అయితే కొంపలంటుకొన్నట్లు ఈ రోజు అతనే చెప్పాడు. "మైసూరుకు వెళ్దాం. కథల్ని రాయాలో వద్దో అనేది అక్కడకుచేరి యోచనచేసి చెపుతాను" అని పలుకుతూ నన్ను బలవంతంతో మైసూరుకు లాక్కొని వచ్చాడు.

అతను ఎప్పుడూ ఇంతే. అతి ముఖ్యమైన ఏదైనా నిర్ణయం తీసుకోవాలని అనుకొంటే నన్ను మైసూరుకు పిలుచుకొని వచ్చేవాడు. అతనితో వస్తే నన్ను ఎవరితోనూ కలవటానికి విడిచేవాడు కాదు. దారి తప్పించుకొన్నోడిలాగ లేక పిచ్చోడిలాగ వీధి, వీధి తిరిగేవాడు. ఈ మధ్యలో అతను నిరంతరంగా యోచిస్తూనే ఉండేవాడు. యోచించి, యోచించి పక్వం చెందినప్పుడు తను తీసుకొన్న తీర్మానాన్ని చెప్పేవాడు.

రాజమందిరం ఎదురులో ఉన్న జయచామరాజేంద్ర ఒడయార్ వృత్తంలో నించొని చుట్టూ దృష్టిని నిలిపా. ఆ తర్వాత పెద్ద గడియారం వైపు గమనాన్ని సారించా. సాయంత్రం

ఆరవుతుంది. పెద్ద గడియార స్థంభం ఎదురులో ఫుట్‌పాత్ (కాలిబాట) మీద ఒకళ్ళిద్దరు వేశ్యలు అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు తిరుగుతున్నారు.

"వేశ్యల గురించి నేనొక కథ రాయాలనే ఆశను పొంది ఉన్నాను. ఎవరైనా వేశ్యతో మాట్లాడుదామా?" అతను అడిగాడు.

"వేశ్యలు సమాజానికి ఒక కళంకం. వాళ్ళమీద ఎంత కథను రాస్తావు?"

"విటుడు, దళారీలు చేరి సహకాముకులై అప్రాప్త ఆడపిల్లల మీద అత్యాచారం చేస్తారు."

"జనం దృష్టిలో నేను 'సభ్యవ్యక్తి' అని అనిపించుకొన్నా, ఇంత ఘనస్థానాన్ని పొందిన నేను వేశ్యలతో మాట్లాడుతూ నిలబడ్డాను అని పరిచయస్తులూ చూసి చెడుగా యోచిస్తే?"

"కథను రాయాలంటే నడు వీధిలో దిగంబరంగా పరిగెత్తాల్సిందే అనేది ఒక వాడుకగా ఉందిలే" ఇంతదాన్ని చెప్పి ఒకట్రెండు క్షణాలు మౌనం దాల్చి ఆ తర్వాత –

"వేశ్యలకూ వాళ్ళవే అయిన సమస్యలు ఉంటవి కదా! వాటిని తెలుసుకొనేది అక్కరలేదా?"

"నన్ను ఇక్కడికి పిలుచుకొచ్చింది ముఖ్యమైన తీర్మానాన్ని తీసుకోవటానికనే కదా! ఇకముందు నువ్వు ఏ కారణానికైనా కథల్ని రాయకూడదు."

"దాని గురించి నేను ఇంకాస్త యోచించి చెపుతానులే.'

'మార్కెట్‌కు వెళ్దామా?'

'అక్కడికి ఎందుకు?'

'అక్కడున్న పూల దుకాణాల్ని చూచి చాల రోజులు అయినవి కదా!'

'సరే... వెళ్దాం' అంటూ అతనితో నేను ముందుకు నడిచా.

అతను నన్ను వెంబడిస్తున్నాడో లేక అతడే నేను వెంబడిస్తున్నానో అనేది అర్థం కాలేదు.

మార్కెట్‌లో వున్న పూల దుకాణాల ముందు అటూ ఇటూ రెండు మూడుసార్లు తిరిగాము. పూల పరిమళాల్ని పీలుస్తూ "ఎక్కడెక్కడో పెరిగిన పూలు ఇక్కడచూడు ఏ

విధంగా ఒకటై ఒకే పూలమాలలో పేర్చుకొని ఎంతో ఆకర్షణీయంగా కనబడుతున్నవో కదా!"

పూలకొట్ల ముందు వరసలలో వేళ్ళాడుతున్న దండల్ని చూస్తూ చెప్పాడు. "పూల దండలు నిజంగానే సుందరంగా ఉన్నవి. అయితే ఆ దండలలో కొన్నిటికి మాత్రం మంచి అదృష్టం కలుగుతుంది."

"ఆవిధంగా ఎట్లా చెప్పగలగుతావు" నేను ప్రశ్నించా.

"కొన్ని దండలు శుభకార్యాలకు వెళ్ళే అదృష్టం ఉందిలే. ఇంకొన్ని దండలు శవాలమెడలో వ్రేలాడి స్మశానానికి చేరే దురదృష్టం ఉంటదిలే" అన్నాడతను.

'అన్ని విషయాలలో నువ్వు అశుభకరంగానే ఆలోచిస్తావుకదా' మధ్యలో నోరు పారేసుకొన్నాను నేను.

"నా మాటలను పూర్తిగా విను. ఈ పూలదండలు శుభసమారంభాలకు గాని లేక శోక సన్నివేశాలకు గాని వెళ్తే అట్నుంచి అటు మొత్తంగా రేపు సాయంత్రం అవుతుందంటే ఇవన్నీ చెత్త కుండీకి చేరుకుంటవి.. చచ్చిన మనుష్యుల లాగానే."

"చనిపోయిన మనుషుల మీద ఎందుకింత కీడుగా మాట్లాడుతున్నావు?"

"చనిపోయిన మనుష్యులు చివరికి వెళ్ళేది స్మశానం అనే తిప్పగుంటకే"

"దేవుడ్ని నమ్మని నువ్వు ఆస్తికుడి లాగ మాట్లాడుతున్నావు కదా!"

"నేను దేముడ్ని నమ్మను. అయితే ఆధ్యాత్మికంగా యోచిస్తాను. ఆ దృష్టి కోణం నుంచే నీకు తెలివిని చెప్పుతున్నాను."

"నాకు ఏమిచెప్పేది అక్కరలేదు. నువ్వు కథల్ని రాసేదాని మీద ఏమి తీర్మానం తీసుకొన్నావు."

"నేను కథల్ని రాసేది లేదు. అయితే కథలే నా దగ్గరకు వచ్చి మమ్మల్ని రచించండి అని విన్నవించుకొంటవి."

"కథలు నిజంగా నీ దగ్గరకే వస్తవా!"

“అవును. కొద్ది కాలం ముందే మనం మార్కెట్‌కు ప్రవేశిస్తున్నప్పుడు కథ ఒకటి నా దారికి అడ్డం వచ్చింది. నువ్వు దాన్ని చూడలేదు. మార్కెట్ ప్రవేశద్వారంలో పండ్లను అమ్ముతున్న మహిళ ప్రక్కన ఒకటిన్నర సంవత్సరం శిశువు పడుకొని ఉంది కదా. శిశువు తల్లి ఒక వేశ్య. ఆమె వేశ్యావృత్తిని చేస్తేనే మాత్రం ఆమె మరియు శిశువు కడుపు నిండుతుంది. ఆమెకు ఎవరైనా ఉన్నారంటే ఎవరూ లేరు. ఆమె తన ప్రియకరుని జతగా ఊరినుంచి లేచివచ్చి రెండు సంవత్సరాలైంది. ఆమె ప్రియుడు ఆమెను మోసగించాడు. ఆమె శిశువును పొంది ఎలాగో జీవనాన్ని నెట్టుకొస్తుంది.

ఆమె గిరాకీల వాంచెను చల్లబరిచే సమయం వరకూ బిడ్డను పండ్లను అమ్ముతున్న ఆ మహిళ దగ్గర పడుకోబెట్టి, వృత్తికి వెళ్ళేది. ఆమె వచ్చేది ఆలశ్యమయితే బిడ్డ మేలుకొని ఏడుస్తూ కూర్చుండేవాడు.”

పండుగకు పూలు కూరగాయల్ని కొనటానికి వచ్చినోళ్ళంతా భుజాలకు భుజాల్ని తాపించుకుంటూ ఉల్లాసంతో వెళ్తున్న ప్రేమజంటలకు ఆ బిడ్డ కనబడేది లేదులే. నేను ఆ బిడ్డను గురించి కథను రాసి జనం గమనాన్ని అటువంటి దురదృష్టశిశువుల మీద ప్రవహించే ఒక చిన్న ప్రయత్నం చేస్తాను.

“బిడ్డ తల్లి నిజంగా తన శిశువును పండ్లమ్మే ఆమె దగ్గర పడుకోబెట్టి వెళ్ళిందా? నువ్వు ఆమె చర్యను నిజంగా చూసావా?”

“నిజంగా చెప్పాలంటే చలిలో బట్టలు లేకుండా పడుకొన్న శిశువు నీ కళ్ళకూ కనబడింది కదా! ఆ శిశువు నీ బిడ్డ కానందుచేత నువ్వు ఆ విషయం మీద బాధ్యతను వహించలేదు కదా!”

“రా .. బయటకు వెళ్దాం... ఆ బిడ్డను నేను చూస్తాను. ఆ శిశువు ఏమైనా మేలుకొని ఏడుపురాగం మొదలెడితే ఆ బిడ్డకు ఏదైనా తినిపిద్దాము” అని అంటుంటే అతను అడుగుల్ని ముందుకు వేసాడు. అతడ్ని అనుసరించా.

మార్కెట్ నుంచి బయటకు వచ్చి ‘బిడ్డ ఎక్కడ’ అని కుతూహలంతో అడిగా.

‘చూడు అక్కడ నిండా జనం చేరియున్నారు కదా! అక్కడ’

మేమిద్దరం ఒకటై ఆ వైపుకు అడుగుల్ని వేసాము.

గుంపు మధ్యలో అతను దూరిందాన్ని చూసి, నేనూ జతగా లోనికి దూరాను.

జనం మధ్యలో శిశువు  కళేబరం ఉంది. కళేబరం ప్రక్కన పండ్లను అమ్మే మహిళ కూలబడి రోదిస్తుంది.

ఇదంతటిని చూచి, నాలో ఉన్న కథా రచయిత నాతో అన్నాడు.

'పండ్లను అమ్మే పెద్ద మహిళ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నప్పుడు బిడ్డ మేలుకొని రోడ్డుకు చేరాడు. ఆ వైపునుంచి  నిన్నే నవదంపతులైన వాళ్ళు కారులో వస్తున్నారు. ప్రక్కనున్న భార్యామణితో సరససల్లాప భాషణలలో మునిగిన ఆకారును నడుపుతున్నోడికి బిడ్డ కనబడలేదు."

"దీనిమీద కథ రాస్తా" అంటూ మౌనాన్ని దాల్చాడు ఆ రచయిత.

❁ ❁ ❁

(కన్నడభాషలో 'మూరనె కణ్ణినవను' అనే పేరున్న ఈ కథను రచించినవారు అదీబ్ అక్తర్‌గారు. 27-08-06 న ఈ కథను తెలుగులోకి అనువదించాను.)

**శాఖమూరు రామగోపాల్**

# దోషిని కాదులే నేను

అవును – ఈ కేదారకు ఏమైంది?

జులై మాసపు చల్లగాలి పళ్ళను (దంతాల్ని) కటకట లాడిస్తూ, శరీరంలో నియంత్రణే లేనటువంటి వణుకును పుట్టిస్తుంది. ఒకేవారంలో వాతావరణంలో విపరీతం అనేటట్లుగా మార్పులు. బక్కపలుచటి దేహంను పొందిన తమ్మణ్ణ భట్టుకు ఎదురుగాలి వేగంతో దొబ్బుతుండటం చేత నడిచేది కష్టమే అయ్యింది. ఎట్లాగో నడిచి గుడిమెట్లను ఎక్కి గర్భగుడి లోకి చేరిన తర్వాత కొంచం హాయి అన్పించేటప్పటికి, కొడుకు గురించి ముగియని ఆలోచనలు రాసాగాయి. తుంగభద్రా నది ఒడ్డున అంచులలో ఉన్న కేదారనాథ దేవాలయం లోపల కూర్చొని కొద్దిసేపు తను వచ్చింది పూజకోసం అనే అంశాన్ని మరచిపోయి ఉండొచ్చు. గుర్తైన తర్వాత ఏమి తోచనట్లుగా సంతాపంతో కూలబడ్డాడు. కోపం వలన మళ్ళీ వచ్చిన బాధను నిగ్రహించుకోవటానికి గుండెమీద చేతుల్ని రుద్దుకొన్నాడు. దేముడి విగ్రహాన్నే తదేక చిత్తంతో చూచాడు. ఈ దేముడ్ని ఆరాధించటం వలనే కదా తనకు కొడుకు జన్మించింది. ఈ కారణంతో కదా కేదార అని పేరు పెట్టాడు. కొడుకును గురించి అందరి తండ్రులకు ఉండేటటువంటి ఆశాభావనలే తనకూ ఉన్నవి కదా!

తమ్మణ్ణ భట్టు ముఖాన్నే క్రిందకు దించుకొన్నాడు. ఒక దీర్ఘ నిట్టూర్పు బయటకి వచ్చినా మనస్సులోని క్షోభ తగ్గలేదు. ఒంటరిగా క్షోభ అనుభవించేది ఇంకా ఉందిలే. ఇంతకు మొదలు తన తండ్రి తనను చదివించాలి అని స్కూల్‌కు చేరిపించింది, తన భవిష్యత్ ఎలాగుంటదో అని సంశయపడుతూ ఉదర పోషణకని మంత్రాలను నేర్చుకొంటాడనేది తెలవలేదు తనకు ఆ బాల్యంలో. కొడుకు వేదవిద్య నేర్చుకొని పండితుడుగా అవ్వాలి అని తన తండ్రి భావించుకొంటే, తను కేవలం మంత్రాల్నే నేర్చుకుని భట్టుగా ఇదిగో ఈ వృత్తి చేత పొట్ట గడుస్తుంది నిజం. తను చేసిన తప్పును కొడుకు చేయకూడదు... వేదాధ్యయనం, మీమాంస శాస్త్రంను శ్రద్ధగా చదువుకొని జనమే కేదారను వెతుక్కొని రావాలి అన్నట్లుగా కొడుకుమీద ఆశె పెట్టుకున్నాడు. యజ్ఞ, యాగాలలో కేదారుడు బ్రహ్మపీఠాన్ని అలంకరించేదాన్ని తను కళ్ళారా చూడాలి. కేదారనాథుడి వరప్రసాదం అయిన తన కొడుకు తన నమ్మకాన్ని ఈడేరుస్తాడు అని తను నమ్మితే, కేదార తన సమస్త నిరీక్షలను అబద్ధం చేసి ఒక 'పాములోడు'గా తయారయ్యాడు కదా!

తమ్మణ్ణ భట్టు చెంబులో నీరు నింపి, విగ్రహం మీద చల్లాడు. పొడి బట్టతో తడిని తుడిచాడు. పసుపు, కుంకుమ, గంధంతో లేపనం చేస్తూ, తనకు తనే దుఃఖాన్ని పొందాడు. ఇదేంటిది? మనస్సు ఎంతగానో అస్వస్థ అయ్యింది. మంత్రాలే గుర్తుకు రావటం లేదుకదా అనుకొంటూ ఒక క్షణం బాధపడ్డాడు. పూలను కూడ పూజకు కోసి తీసుకురాలేదు. ఛీ.... ఎంత మతిమరుపు. దేముడికి నమస్కరించి ఊరికినే కూర్చున్నాడు. మళ్ళీ ఏమిటేమిటో జ్ఞాపకాలు.

“మహారాష్ట్రలోని పూనా, ముంబయి, రత్నగిరి మొదలైన చోట్ల తన వృత్తికి ఒక ఘనత ఉంది. అక్కడ తమ లాంటోళ్ళను ఎవరూ భట్టు అని పిలిచేది లేదు. గురూజి అని గౌరవిస్తారు. తెలివైనోడికి మంచి సంపాదనే అక్కడ దొరుకుతుంది అట. అక్కడ వృత్తిని భిక్షుకి అని పిలిచినా, పేరులోనే భిక్షుకి. దీన్నే నమ్ముకొన్న అనేకులు దీని ద్వారానే జీవనం సాగిస్తూ ఇంటిని నిర్మించుకోవటం, పొలం కొనటం, కారును పొందటం, విమానంలో తిరుగుతూ యాగం, యజ్ఞం అంటూ దేశ విదేశాలకు పోయి వస్తుండేవారట” అని బాల్య స్నేహితుడైన శ్రీపతి చెపుతుంటే తమ్మణ్ణభట్టు ఆశ్చర్యం చెందాడు.

తండ్రి తనను ఎచ్చరించినప్పుడల్లా, తను బాగుగా చదివి ఉంటే తన స్థితి బాగుండేది అని తనను ఆ భావన తొలస్తుండేది. అయితే ఇంట్లో ఎంతమంది జనమో... తన తండ్రికి 16 మంది సంతానం. ఆ తర్వాత పెదనాన్న,చిన్నాన్నలకు ఈ సంతాన భాగ్యంలో ఏమి కొరత లేదు. సంతానాన్ని పొందేదానికి విరామం, విసుగు లేదు... పేర్లు పెట్టటానికి వాళ్ళకు విసుగు పుట్టి ఉండొచ్చు. తనకు పెట్టారు కదా తమ్మణ్ణ.

తమ్మణ్ణ అంటే అర్థం ఏమిటి?

తననుంచి కానిది తన కొడుకైనా నెరవేరిస్తే అనే భరోసాను ఉంచుకొనేది సరికాదేమో? అవునూ.... పౌరోహిత్యం చేసే తమ వంశంలో ఈ పాములోడు ఎక్కడినుంచి సృష్టించబడ్డాడు? తనకు గుర్తున్నంత వరకూ తమ వంశంలో ఈ విధమైన విచిత్ర అభ్యాసం పొందినవాళ్ళు ఎవరూ లేరు కదా! ఇప్పటికీ పాములంటే అవి నాగలోకంలోనే ఉంటవి అని భావించుకొనేవాళ్ళమే కదా మేము.

మంగళారతి చేసి, మరొకసారి దేముడికి దీర్ఘ దండ నమస్కారం చేసి, గర్భగుడి తలుపులకు తాళంవేసి, మెట్లుదిగి బయటకు వస్తే చలిగాలి ఇంకా తగ్గనే లేదుకదా. తలెత్తి ఆకాశం వైపుకు ఊరికే ఒక చూపును విసిరాడు. ఒక నెలనుంచి జనం నోళ్ళు

వెళ్ళబెట్టుకొని, ఆకాశాన్నే చూస్తున్నారు. ఒక చినుకూ పడలేదు. ఇంకేంటి పోయిన సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కరువుకాటునుంచి తప్పించుకోలేమేమో అని నిట్టూర్పులు వదులుతుంటే, ఇప్పుడు అక్కడెక్కడో మలెనాడులో భారీగా వానలు పడటం మొదలైందట. ఈ చలి దాన్నుంచే కావొచ్చేమో! కానీయి.... ఎక్కడో ఒకచోట వానల్ని కురవనీయి. 'వానలు వస్తే చెరుపులేదులే... కొడుకు తింటేహాని లేదులే' అనే వాడుక ఉంది కదా! ఓహ్... మళ్ళీ కేదార గుర్తుకు వస్తున్నాడు.

పాములు గురించి కేదారకు అదెంతగా తీటో? తనకి అర్థమే కావడం లేదు. చిన్నోడిగా ఉన్నపుడే అతనికి పాముల్ని పట్టే ఉత్సాహం. మొదటిసారి తన మంచం క్రిందకు వచ్చింది త్రాచుపాము. అది పిల్లే కావొచ్చు. అయితే దాని విషాన్ని అలక్షించటం సాధ్యమేనా? తను బొబ్బరిల్లుతూ ప్రక్కకు దూకే సమయంలో అక్కడెక్కడున్నాడో కేదార వచ్చిందే కొంచం కూడా ఆలోచించకుండా, భయపడకుండా, ధడాల్నే దాని తోకను ఎత్తి పట్టుకొని తలను క్రిందకుచేసి, అంతరిక్షంలో వేలాడదీసినట్లుగా చేసాడు. అప్పుడేమో కొడుకు ప్రతాపం చూసి సంతోషం అయ్యింది నిజం. ఆ తర్వాత కేదార వాళ్ళ, వీళ్ళ ఇళ్ళలో, కొట్టాలలో పాముల్ని పట్టుకోవడం, క్రమేణ ఊరు పేటలోని జనంమధ్య హీరో అయ్యాడు. జనం అతడ్ని ఆరాధించసాగారు. తనకు మొదలు దిగ్భ్రాంతి. ఆ తర్వాత తర్వాత యోచన–చింత. బ్రాహ్మణుడి కుమారుడు ఏమి అవ్వాలో అది అయ్యేది బదులుగా వేరే ఏమో అయ్యేదాన్ని ఏ తండ్రికి తనంత తనే కష్టం అవ్వదు? ఇదేమి విద్య పొట్ట నింపేదా? ఇతని భవిష్యత్ గతి ఎట్లా ఇట్లైతే?

మంత్రాల్ని నేర్చుకోలేను అని కేదార ముఖమే తెలిపింది. ఇక కోపగించుకొని ప్రయోజనం లేదు. శ్రీపతి సలహా మూలంగా స్కూల్‌కి చేర్పించటం, ఎలాగో ప్రాథమిక విద్య ముగించి హైస్కూలికి చేరాడు. పి.యు.సి. చదివేటప్పుడు ఏవేవో పెద్ద పుస్తకాల్ని తెచ్చుకొని చదివేవాడు. చదువుతున్నాడు, చక్కగా రాస్తున్నాడులే అని తమ్మణ్ణ భట్టుకు కొంచెం సమాధానం లభించింది. ఒకసారి కేదార 'తోట్లోని ఇంటికి వెళ్ళి చదువుకొంటాను' అని తన తల్లితో చెప్పించటం వలన తను సమ్మతించటానికి వెనుకాడలేదు. పి.యు.సి. లో కూడా పాసయ్యాడు కేదార.

ఇక అతడ్ని డిగ్రీలో వేయాలి. ఒక డిగ్రీ అంటూ దొరికితే ముందే ఏదో ఒక ఉద్యోగం దొరకొచ్చు అని అనుకొన్న తమ్మణ్ణ భట్టు ఒకరోజంతా కొడుకు కోసం ఎదురుచూచాడు. తన కళ్ళనుంచి, సామీప్యం నుంచి తప్పించుకొనే అతను

తిరుగుతున్నదాన్ని గమనించి కొంచం బెదిరాడు. ఈ వయస్సే ఇట్లా పిచ్చికోతి లాంటిది. కొడుకు ఇప్పటిదాకా సురక్షితంగానే పెరిగాడు. ఇప్పుడు తన నుంచి దండించే వయస్సును దాటినా, హితోక్తులు చెప్పి సరిదిద్దాలి అని అనుకొంటూ ఒకరోజు 'ఎక్కడ కేదార' అని భార్యను అడిగాడు. 'ఇంకెక్కడుంటాడు? తోట్లోని ఇంటిలోనే' అనే జవాబు ఆమె నుంచి వచ్చింది. తమ్మణ్ణకు కొంచం అనుమానం లోన్లోనే పుట్టింది. పి.యు.సి. పాసైన తర్వాత తోట్లోని ఇంటిలో కేదారకు ఏమి పని? అనే సంశయంతో నది అంచున అవతలి ఒడ్డునున్న తోటకు వెళ్ళాడు.

తలుపులు వేసి ఉన్నవి. జోరుగా నెట్టాడు. పంటంతా అమ్మిన పిదప ఆ తోట్లోని ఇల్లు ఖాళీగా ఉండాలి. అయితే అక్కడా ఇక్కడా అన్నిచోట్లా చిన్న పెద్ద మట్టి కుండలు, బానలను తెచ్చి ఆ ఇంటి మొత్తాన్ని నింపాడు వాటితో కేదార. ఇవన్నీ ఎందుకు అనే గందరగోళంలో తమ్మణ్ణ భట్టు ఉండగా కొన్ని పుస్తకాలు కనబడినవి. పర్వాలేదులే.. అభ్యాసం చేస్తున్నాడు అని భావిస్తూ, ఒక పుస్తకాన్ని ఎత్తి పట్టుకొని ఊరికే పేజీలను తిరగేస్తూ భయం చెందాడు. పేజీల నిండా పాముల చిత్రాల్నే గీసాడు. వాటి గురించి వివరణలను ఇంగ్లీషులో విపరీతంగా వ్రాసాడు. పి.యు.సి. పాసైనా హాబిని మాత్రం వదులుకోలేదు అనే అసమాధానంతో నిశ్చేష్టుడై నించుంటే ఆ వేళలో కాళ్ళ దగ్గర చల్లగా ఏదో సవరినట్లు బెదిరి తలుపుదగ్గరకు పరిగెత్తి, తిరిగి చూసి గోలపెట్టాడు.

పెద్ద కొండ చిలువ నేలమీద ప్రాకుతుంది.

అవాక్కై నించున్న తమ్మణ్ణ భట్టు అక్కడ్నుంచి పరిగెత్తాలి అని అనుకొనే సమయంలో కేదార కన్పించాడు. కొడుకును గుడ్లప్పగించి చూసాడు. అతని చేతులలో పాము పిల్లలు.

'ఏమిటిది?' మొదటిసారిగా కొడుకు నుంచి భయం కలిగింది ఆయనకు.

'నాయనా... లోనికి రా. ఎన్ని వైవిధ్యభరితమైన పాములున్నవో చూపిస్తాను. అన్నీ మన పొలం, తోట పరిసరాలలోనే పట్టుకొన్నవి' అంటూ భయం లేకుండా చెప్పి కేదార తోట్లోని ఇంట్లోకి వెళ్ళాడు. పెద్దకుండలో పాముల పిల్లల్ని వేసి దానిమీద మూతను బోర్లించాడు. తమ్మణ్ణ భట్టుకు ఏమిమాట్లాడాలో తెలవలేదు. లోనికి వెళ్ళి చూసే కుతూహలం ఆయనలో మొదలే లేదు. ఇప్పుడు ధైర్యమూ నశించి పోయింది. కొంచంసేపు బొమ్మలాగ నుంచొని బయటినుంచే చెప్పారు. 'ప్రాణి హింస మహాపాపం వదిలేయి వాటినన్నింటిని' బాధతో పలికాడు.

'నేను హింసను చేయట్లేదు నాయనా!' తండ్రి దగ్గరకు వచ్చిన కేదార మామూలుగానే చెప్పాడు. నేను వీటిని సాకుతున్నా. వీటి స్వభావం, బతికే రీతి అంతటినీ స్టడీ చేస్తున్నా.

ఈ మాటల్ని ఒప్పుకోక ఒకరోజు మిత్రుడైన శ్రీపతి ముందు ఆ విషయ ప్రస్తాపనం చేస్తే, అతను (శ్రీపతి) చెప్పింది విన్న తమ్మణ్ణ భట్టుకు ఇంకాస్త దిగులు ఆవరించింది. పాములూ బదకాలి కదా! వాటిపొట్టకు రోజూ గుడ్లు, ఎలుకలు, కోళ్ళను ఆహారంగా వేస్తాడు కేదార. శ్రీపతికి ఏమి అన్పించలేదు. అయితే తనకు? నడిచేటప్పుడు చీమలు కనబడితే వాటికి హాని కాకూడదు అని నడిచేమనిషి తను. తన కొడుకైన కేదార ఈ విధంగా నిష్కరుణుడై ఉన్నాడు కదా! ఏదో నిరపరాధి ప్రాణుల్ని పట్టుకొని తెచ్చి ఈ పాములకు తినిపించటం అంటే... ఎంత పాపం అది? ఈ సంకటం అంతా ఎవరి దగ్గర చెప్పుకోవాలి తను.

తన లోపల ఉన్న బాధను శ్రీపతి గమనించి ఉండొచ్చు. 'నీ జాతకాన్ని తీసుకొచ్చి ఇవ్వు' అని అడిగాడు. ఇచ్చిన దాన్ని తీసుకొని లెక్కలలో మునిగి జాగ్రత్తగా పరిశీలించాడు. "నీకు తొందరగానే మరణం ఆసన్నమైంది. మహా అయితే నాలుగున్నర సంవత్సరాలే నీ ఆయుష్యు" అన్నాడు శ్రీపతి. తమ్మణ్ణ భట్టు ప్రతి క్రియను చూపలేదు. అందుకు బదులుగా మనస్సు మాత్రం 'అవ్వొచ్చు. అటువంటి కొడుకు పుట్టి, ఈ రీతిగా పెరిగాడు కదా' అంటూ లోలోపలే బాధపడసాగాడు.

ఆ రోజు తోట్లోని ఇంటిని ప్రవేశించినప్పుడు పుట్టిన దిగులు తమ్మణ్ణ భట్టును వదలనే లేదు. కొడుకు దీక్ష మూలంగా ఇప్పుడు ఎవర్నైనా భేటి అవ్వటానికి, ఏదైనా ఊరు వెళ్ళటానికి భయం వేయసాగింది. మీ కొడుకు ఇట్లాగెందుకు అయ్యాడు అని ఎవరైనా కుతూహలంతోనో లేక ఛీ గొట్టడానికో అడిగితే నా గతేంటి? నా కొడుకని గర్వంతో గుండెను తట్టుకొంటూ చెప్పటానికి కఠిణం అయ్యేటట్లుగా చేసాడు కదా కేదార – గ్రహచారం అంటే ఇదే కాబోలు.

ఇప్పుడాయన ఉద్దేశ్యపూర్వకంగా కొడుకు నుంచి దూరం కాసాగాడు. శ్రీపతి స్నేహితం తన బాధను పోగొట్టడానికి సమర్థంగా అవ్వలేదు. ఇప్పుడు ఏమైనా శ్రీపతే తనకున్న ఆత్మీయ స్నేహితుడు. అతని చెంత తన కష్టాల్ని చెప్పుకొంటే తన ప్రాణానికి అదెంత హాయో. శ్రీపతి తన బాధను గుర్తించి 'పలాయనవాది తను' అని అన్నా పర్వాలేదు. ఈ దేవస్థానం తనకు కలిగించే హితం వేరే ఎవరూ ఇవ్వలేరు... భార్యతో సహా.

భార్య ప్రస్తాపం రాగానే తమ్మణ్ణభట్టు దృఢంగా కూర్చొండి పోయాడు. ఆమె వైదికుల ఇంటినుంచి వచ్చినామె. మడి, మైలను శ్రద్ధతో ఆచరించే పరిపాఠిని పొందినామె. తన భార్య మీద సందేహ పడటం అనేది మూర్ఖత్వానికి హేతువు అవుతది. ఆమె మీద తనకు నమ్మకం ఉంది. ఆమె తప్పు చేసే మనిషే కాదు! ఆమె గర్భం దాల్చినప్పుడు, ప్రసవం అయినప్పుడు విశేషంగా ప్రవర్తించింది లేదు.

అయినా.... తమ్మణ్ణభట్టు తన ఆలోచనల ధాటికి తనే బెదిరాడు. ఊహు.... అనుమానం ఉండకూడదు. ఇంకొక విషయంలో ఆమె మీద తన నమ్మకాల మూలం అటు ఇటు ఊగుతోంది. ఆమె పరపురుషుడ్ని కన్నెత్తి చూసేది లేదులే అనే భావం సరేలే. అయితే ఇదే నమ్మకాన్ని ఆమె మనస్సు మీద ఉంచుకోవడం ఎట్లా గబ్బా! ఆమె మనస్సులో ఎవర్నైనా ఆరాధించిందా? మనస్సులోని అవ్యవస్థ ప్రభావం ఎన్నో సందర్భాలలో గర్భం మీద ప్రభావం చూపుతది... అట్లాగేమైనా అయ్యుంటే?

కేదార కాలేజి చదువుకని సిటీకి వెళ్ళాడు. అయితే అతను అక్కడ ఏమి నేర్చుకొంటున్నాడో అనేది తమ్మణ్ణ భట్టుకు భీతి కలగసాగింది. కేదారకన్నా కొంచెం పెద్దవాడైన శ్రీపతి కొడుకైన ఆనందూ సిటీలోనే చదువుతున్నాడు. ఒకే ఊరివారైనా , ప్రక్కప్రక్కన ఇళ్ళకు చేరినవారైనా, దూరపు బంధుత్వం ఉన్నా కేదారకు ఆనందకు సన్నిహితం అంతంత మాత్రమే. కేదారుడి విలక్షణ హాబియే అతడ్ని ఇతరుల నుంచి దూరం చేసుండొచ్చేమో.

అయితే శ్రీపతికి మాత్రం కేదార మీద అదెంతో విశేష ప్రీతి ఉండేది. సామాన్యంగా అందరూ తమ తమ పిల్లల్ని పొగుడుకొనేది సహజమే. అయితే కేదారుడ్ని ఒక విశేషవ్యక్తి అన్నట్లుగా శ్రీపతి గుర్తించేవాడు. అతను సామాన్యుడు కాదు. పాముల మీద సంశోధనం చేసినవాడు. 'ఉరగతజ్ఞ కేదార' అని వర్ణించేవాడు. అప్పుడప్పుడు ఏవేవో రంగురంగుల ఇంగ్లీష్ పుస్తకాల్ని తీసుకొచ్చి 'చూడు దీనిలో ... కేదార రాసిన వ్యాసాలు – ఫోటోలతో సహా ' అని పేజీలను తిప్పుతూ చూపించేవాడు. తన కంటూ వాటిమీద ఆసక్తే లేదు. బదులుగా భయంకర ఉదాసీనం. హుం.... రాసాడులే. అయితే దీన్నుంచి ఏమి ప్రయోజనం. ఈ అభ్యాసం పొట్టను నింపుతదా!

మొన్న శ్రీపతి వచ్చాడు. అతనేంటో ఎంతో ఖుషీగా ఉన్నట్లు కనబడుతున్నాడు. "చూడు తమ్మణ్ణా.. సిటీలో కేదార ఒక భారీ సాహసం చేయబోతున్నాడు" విప్పారిన

కళ్ళతో చెప్పినదాన్ని వింటుంటే... అవును భారీ సాహసమే. ఒక గాజు గదిలో మూడు వందల పాముల మధ్య ఒకవారం ఉంటాడట.

వింటున్న తమ్మణ్ణ భట్టుకు చెమటలు పట్టసాగాయి. కొడుకు మీద విపరీతంగా కోపం వచ్చింది. ఎదురుగా ఉండుంటే అతని కపాలంకు ఒక వేటు వేసేవాడేమో. ఏదోలే అని ఊరకుంటే ఇదేంటి ఇంత విపరీతానికి వచ్చాడు. ఇంతటి పిచ్చితనంను చేయటానికి ఇతనికి ఎవరు ప్రోద్బలం చేశారు. ఇన్ని సంవత్సరాల పాముల సహచర్యంలో కేదార పాము కాటుకు గురికాకపోవటం తమ అదృష్టమే. ఇప్పుడు ఒక వారం మొత్తం మూడొందల పాముల మధ్య ఒక గదిలో బతికేది అంటే ఇది ప్రదర్శనం కాదు. ఆత్మహత్యకు తయారి. ఇట్లా చేయి అంటూ కేదారను ప్రోత్సహించేది ఎవరు? తమ్మణ్ణభట్టు చూపులు స్నేహితుడి మీద పడినవి. అతనిదే కావొచ్చు. తనకు తెలియకుండా ధన సహాయం చేసేవాడు. నీకెందుకు కేదార మీద అంత అభిమానం? అని అడిగితే మన ఊరోడే కదా. అతను ప్రసిద్ధి చెందితే మన ఊరికే పేరు వస్తది అని అనేవాడు. అతని మాటలు విన్నాక ఏమి చేయాలో తెలవక అసహాయకుడై చేతుల్ని కట్టుకొని సహించుకోవాల్సిందే. గత్యంతరం లేదు.

ఇప్పుడిప్పుడు తమ్మణ్ణభట్టుకు ఎందుకో కేదారనాథస్వామి గుడి సాన్నిధ్యమే ప్రియం కాసాగింది. ఎవర్ని నమ్మరాదు. శ్రీపతి ముందూ చెప్పుకోలేని తన అంతరంగంలోని మాటల్ని చివరివరకూ చేతిని పట్టుకొని ముందుకు నడిపిస్తాడు అని నమ్మే పరమాత్మ యందు నిర్భయంగా నివేదించుకోవచ్చు. భగవంతుడైతేనే అంతటిని సావధానంగా వింటాడు.. చాల్లే... శిలైన భగవంతుడ్నుంచి పరిహారంను సూచించు అని కోరుకొనేది కొన్నిసార్లు దురాశె అవుతదేమో?

'కేదారుడి ప్రదర్శన అద్భుతంగా ఉంది' అన్నాడు శ్రీపతి. ఏమి ప్రదర్శనమో తనకంటూ ఏమి ఆసక్తి లేదు. అయితే ఈ మహాశయుడు వదిలేనా.తాళ్ళు కట్టి లాక్కెళ్ళినట్టుగా తీసుకుపోయాడు. తన ఊహల్లో కేదారుడిది అతిరేక ప్రవర్తన. బయట తన జీవం విలవిలలాడు తుంటే, లోనున్న కేదార ఆరామంగా పడుకొని, కూర్చొని వచ్చిన వాళ్ళమీద చిరునవ్వులు కురిపిస్తున్నాడు. అతని దేహం మీద బరబరా పాకుతున్న పాముల్ని చూస్తుంటే తన కడుపులో దేవినట్లైంది. ఉన్న ఒకే ఒక కొడుకు ఇలాగున అవివేకి అయ్యేదాన్ని కళ్ళారా చూసేది ఎట్లాగబ్బా! కేదారకు ఏమి హాని కాకూడదు అని

తన ఆరాధ్యదైవాన్ని మనస్సులోనే ప్రార్థించాడు. చివరికి ఏమి కాకుండానే కేదార బతికి బయటకి వచ్చినదాన్ని చూస్తే ఇదొక అద్భుతం లాగ తోచింది తమ్మణ్ణకు.

కేదార నుంచి ఇంకొక మార్పు కనబడినప్పుడు అతను అదురుకొన్నాడు. ఈసారి కేదార ఒక్కడే కాదు. అతనికి సహాయకురాలిగా ఒక యువతి ఉంది. వంటిమీద స్త్రీతత్వాన్ని ప్రదర్శించే బిగుతు దుస్తులతో, కేదారతో ఆమె మాటలు నవ్వుల్ని చూస్తుంటే ఏదో అపార్థం తన కళ్ళకు కనబడింది. ఎవరీమె? అని శ్రీపతిని గుచ్చి గుచ్చి అడిగితే 'ఈ కార్యక్రమానికి ప్రాయోజకి' అని ఆమె అంటే అంతటితో సరిపెట్టాడు. అయితే అక్కడికి వచ్చిన జనం అనుకొనే మాటల్ని వింటుంటే కేదార ఆమెను వివాహం చేసుకొంటాడట.

తర్వాత సమారంభంలో మఠాధిపతి కేదారకు శాలువా కప్పి సన్మానం చేసి, "జగత్తు దుష్టులతో నిండిపోయింది. అయినా వాళ్ళతో శాంతి, సమాధానంతో బతకొచ్చు అనేదాన్ని మన కేదార టెక్నికల్‌గా (సాంకేతికంగా) చూపించాడు" అంటూ ఆశీర్వదించితే, లోకల్ ఎమ్.ఎల్.ఏ. "పాములంటే మనకి భయం. అయితే పాముల్లో నూటికి తొంభై విషాన్ని ఇవ్వవు అనే సత్యం మనలో చాలమందికి తెల్వదు. పాముల మీద మనకున్న భీతిని పోగొట్టే ప్రయత్నమే కేదార నుంచి ఈ ప్రదర్శన జరగటం మెచ్చుకోతగినది" అంటుంటే ఆ మాటలు (ఉపన్యాసం) తన మీద ఏమీ ప్రభావంను కలిగించలేదు.

అక్కడ్నుంచి బయల్దేరేటప్పటికి అతని మనస్సు విపరీతంగా గాయపడింది. శ్రీపతి మాత్రం సంభ్రమంతో చెప్పసాగాడు. కేదార పాముల గురించి పుస్తకం రాసాడు. వాటి గురించి ఒక డాక్యుమెంటరీ తీస్తాడట. అది టి.వి.లో ప్రసారం అవుతదట. మఠాధిపతి, ఎమ్.ఎల్.ఏ. అతనికొక ప్రశస్తి (మెడల్) ఇప్పించే ప్రయత్నంలో ఉన్నారట.

ఒక పిచ్చి నవ్వు తప్పితే తననుంచి ప్రతిక్రియ శూన్యం. హుం.... మెడల్ వస్తే ఏమి ప్రయోజనం. తన ఆశెలు ఒక్కటీ నెరవేరలేదు కదా. ఒకవేళ కేదార వేద విద్యను నేర్చుకొని పండితుడని అన్పించుకొని, శృంగేరి స్వామి నుంచి ప్రశస్తి ఫలకం, శాలువాను పొందేది కలిగితే, కొడుకు పేరును గడించాడు అనే గర్వం పొందొచ్చు. అయితే ఇప్పుడు జనం అతడ్ని పొగుడుతుంటే తనకు కవచంలో కూరుకుపోయిన తాబేలు స్థితే. కేదార తన పాలుకు కార్కోటక విషం. దీన్ని జీర్ణించుకొనేది తనకు సాధ్యమేకాదు.

తమ్మణ్ణ భట్టు కోపంతో గుడివైపుకు నడిచాడు. కొడుకుచేయి దాటిపోయాడు అనే భావం మనస్సులోని అంతరంగంలోకి ప్రవేశించి రోదించాలి అని అన్పించసాగింది. చేతుల్నుంచి ముఖాన్ని కప్పుకొన్నాడు. మళ్ళా కళ్ళను తెరిచారు. ఛీ..... ఈ వాతావరణం కూడా ఎంత నిర్దయంగా ఉంది. తనను చూస్తే ఈ వాతావరణానికి కరుణే లేదు కదా. మొదలే కొడుకు మూలాన బాధపడుతున్న తనకు ఈ చలిగాలి శూలాల నుంచి గుచ్చినట్లు హింసను కలిగిస్తుంది కదా! నడుస్తూ నది వైపుకు అకస్మాత్తుగా చూసాడు. అరె బట్టల్ని ఉతికేవారు, బర్రెల్ని కడిగేవారు, ఈత కొట్టేవాళ్ళు ఎవరూ లేరేంటి ఈ రోజు? విచిత్రంగా అన్పించింది. ఈ చలిగాలికి బెదిరే జనం కానేకారు మా పల్లెలోని వాళ్ళు. ఏమైనా కానీ నదికి ఆవల – ఈవల గిజగిజ లాడే జనం ఈ ఉదయం వేళ ఎవరూ లేరుకదా అని విస్మయపడ్తూ గుడిమెట్లను ఎక్కాడు. రేపు ఏ జాతిదో అయిన ఆ యువతిని పెళ్ళిచేసుకొని వచ్చిన కేదార, మీ కోడలు ఈమె అని పరిచయం చేస్తే, తను చేసేది ఏమిటి అనేది ఆయనలో అసహనంను కలిగించసాగింది. ఆమె వస్తే, అప్పుడు ఆమె చేతిక్రింద బతికేది ఎంత శోచనీయం. తనకు జ్ఞానం వచ్చినప్పటినుంచి, తన నుంచి ఎవరికీ కష్టం, హింస అయ్యింది జరగలేదు కదా! వేరేవాళ్ళే నానారకాలుగా తనని నియంత్రించి తనమీద స్వారీ చేసినోళ్ళే అధికం కదా! తను బాల్యం నుంచి ఇటువంటి వాటినన్నింటిని సహించుకొని, ఒదిగిపోయి, దేకుతూ పోయినా దేముడు తనని ఇంకా పరీక్షిస్తున్నాడో లేక శిక్షిస్తున్నాడో?

తమ్మణ్ణ భట్టు దేహంలోని రక్తం అసహనంతో కుతకుత లాడింది. నిరపరాధి అయిన తనకు ఏ కారణంతో ఈ శిక్ష? ఇట్లా అయితే ఎవర్ని దూషించేది? కళ్ళు హఠాత్తుగా దేముడి విగ్రహం వైపుకు మళ్ళినవి. మనస్సు రోసిపోయింది. చూపు నిర్దయమైంది. పెదాలు అదేంటో పలకసాగాయి. అవును. ఈయన ఉండాడు కదా.. అన్నిటికీ బరువును మోసేవాడి లాగ!

తమ్మణ్ణ భట్టు నుంచి ముందొచ్చే ఘటనలు నియంత్రణ రేఖను దాటిపోయినవి.

“పగలురాత్రి నిష్ఠతో పూజను చేసినదానికి ఇదేనా నువ్వు నాకిచ్చే ప్రతిఫలం. భక్తుల్ని వేదించే నువ్వు ఎంతటి భగవంతుడివి? నువ్వు, నీ దేవస్థానం నీటిలో మునిగిపోని”.

ఆవేశం తగ్గిన తర్వాత తమ్మణ్ణభట్టు, భ్రాంతుడై దేముడి ముందు దిక్కుతోచనట్లుగా కూలబడిపోయాడు. తనేం చేసాడు? తనకేమైంది? అనేది తెలవటం, కొంచం సమయం

గడిచిన తర్వాత, తను చేసిన అపరాధం గుర్తుకు వస్తుంటే వణుకు మొదలైంది అతనిలో. ఎంత దుస్సాహసం తనది? లేక తనకేమైనా పిచ్చా? తనేంటి? తన యోగ్యత ఏంటి? దేముడికే తను శాపం ఇవ్వటమే. అయ్యో దేముడా నాకెందుకు ఇంత బుద్ధిని ఇచ్చావు అని వదురుతూ అడ్డం పడ్డాడు. గొంతును నొక్కుకున్నాడు. గడపకు నుదురును కొట్టుకుంటూ 'తప్పయ్యింది స్వామి' అంటూ బాధతో, పశ్చాత్తాపంతో శరణాగతిని ప్రకటించాడు.

అప్పుడు ఒకేసారి  విన్పించసాగింది. దిక్కులు పిక్కటిల్లే 'భోమ్' అనే భారీశబ్దం. ఆ క్షణం తమ్మణ్ణకు ధడాల్నే ఒకటి గుర్తైంది. ఒక వారం నుంచి మలెనాడులో వానలు పడ్తూ, డ్యామ్ నిండి, బయటకు నీరు వచ్చేది ఖాయం అనే వార్త. డ్యామ్ బద్దలైయ్యే భీతి ఉండటం చేత అన్ని గేట్లు తెరిచి నిన్నటిరాత్రి నుంచే నీరు వదిలారట. 'ఈరోజు నువ్వు నది అంచుకు వెళ్ళవద్దు. ప్రవాహం ఎకబిగిన పెరుగుతది' అంటూ నిన్నటి సాయంత్రం శ్రీపతి హెచ్చరించాడు. ఈ విషయం రేడియో నుంచి టి.వి. నుంచి పదే పదే ప్రసారమైంది. మున్సిపాలిటీ వాళ్ళు రెండు రోజుల్నుంచి ఊరులో టాంటాం వేయిస్తున్నారు. తనకి గుర్తు లేదు కదా!

తమ్మణ్ణభట్టు గలిబలితో లేచాడు. అక్కడ్నుంచి పలాయనంను చేయాలి అని అనుకొంటుంటే కాలే లెగవటం లేదు. ఎంత గింజుకున్నా గర్భగుడిని దాటేది ఆయన నుంచి కాలేదు. ప్రవాహం మాత్రం అన్ని అడ్డంకుల్ని నుచ్చునుచ్చుచేస్తూ, భీకరంగా శబ్దాలు  చేస్తూ, రెండువైపులా నది అంచుల్ని కబళిస్తూ 'హోం' అంటూ ఆపోశన చేసే రీతి రానేవచ్చింది. తమ్మణ్ణ భట్టు భీతితో మునుగుతూ, రాతిస్థంభాన్ని వాటేసుకుని నించున్నాడు. కంటిరెప్ప కొట్టే సమయంలోపే నీరు నడుం వరకు వచ్చింది. ప్రవాహం ఉరవడికి స్తంభంనుంచి పట్టు తనంతట తానే వదులై, ఇంకొక  అలకు దేవస్థానం మునిగేది ఖచ్చితమై, చివరిచూపు అన్నట్లుగా నది ఒడ్డుకు చూసాడు. అంతా మసకు మసకు. దూరంలో శ్రీపతి కన్నీరుతో నిస్సహాయకుడై నించున్న దృశ్యం.

❀ ❀ ❀

(మూలభాషలోని 'అపరాధి నానల్ల' అనే పేరుతో ఈ కథను రచించినవారు రామచంద్ర భావెగారు. కన్నడప్రభలో ప్రచురితమైన ఈ కథను తెలుగులోకి అనువాదం చేసాను. 28-05-2006.)

**శాఖమూరు రామగోపాల్**